تفهيم السنة

عقيدة التوحيد

# దేవుని ఏకత్వం

## (అఖీద-యె-తౌహీద్)

*మూలం*

**డాక్టర్ సాలెహ్ బిన్ ఫౌజాన్ అల్ ఫౌజాన్**

*అనువాదం*

**ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

**హదీస్ పబ్లికేషన్స్**

హైదరాబాద్ (ఆంధ్రప్రదేశ్)

ఇండియా

فهرسة مكتبة الملك فهد الوطنية أثناء النشر
الفوزان، صالح بن فوزان
التوحيد، / صالح بن فوزان الفوزان؛ عطاء الرحمن ضياء الله —
الرياض، ١٤٢٧هـ
٢٤٨ص؛ ١٧×٢٤سم
ردمك: ٨-٥٢٢-٥٢-٩٩٦٠
النص باللغة الأوردية
١- التوحيد ٢- العقيدة الإسلامية أ. ضياء الله،
عطاء الرحمن (مترجم) ب- العنوان
ديوي ٢٤٠ ١٤٢٧/١٦٣٧

**AQEEDATUT-TAUHEED** عقيدة التوحيد
**Devuni Ekatvam** (Telugu)

Author : Dr. Saleh Bin Fouzan Al Fouzan
Edited by : Hafiz Md. Abdur Rawoof Umari
*All Rights Reserved with Publishers*
First Edition : July 2013 Copies : 3000
**Price : Rs.120/-**

*Published by:*
**HADITH PUBLICATIONS**
**S. Abdul Wahid**
H.No. 8-4-549/314, Netaji Nagar, Erragadda, Hyderabad-18 (A.P.) India
Phone : 23700081 Website : www.hadithpublications.com
هذا الكتاب طبع على نفقة اوقاف علي بن عيسى الهقص ﷺ

**Copies can be had from :** పుస్తకాలు లభించు చిరునామాలు

**Abdur Rahman Anas**
S/o H.Md. Abdur Rawoof Umari
80-11-129E-5-1, Abbas Nagar,
KURNOOL - 518 002 A.P.
Cell : 9849492445, 8121217938

**Zam Zam Traders**
NANDIKOTKUR, Kurnool Dist.
Cell. 9347299977, 9440291447

**G. Mansoor Basha**
NANDIKOTKUR, Kurnool Dist.
Cell. 9885955981

**Hafiz Md. Farooq Madani**
Islamic Guidance Centre
P.O. Box No.2843, HAIL K.S.A.
Tel. No. 00966-502985504

**Farooq Basha Khan**
H.No. 11-1-25, B.R.P. Road
Islampet, Vijayawada-520 001
Cell : 9849596683

**Md. Abdul Kalam**
# 16-415/29, Gangula Thota,
MACHILIPATNAM - 521 002
Cell : 9247234211, 9848067611

**Syed Noor**
Al-Ahasaa-Al Afoo, K.S.A.
Cell : 00966507947212

**Mohd. Ali & Sons**
Moter Parts, R.S. Road,
NANDYAL - Kurnool Dist.
Cell : 9949787587



# విషయ సూచిక

పాఠకులకు మనవి 07
తొలి పలుకులు 11
**మొదటి అధ్యాయం :** దేవుని ఏకత్వపు విశ్వాసం గురించి 12
మొదటి ప్రకరణం : అఖీదా (విశ్వాసం, నమ్మకం) షరీయత్ దృష్టిలో 'అఖీదా' ... 12
రెండవ ప్రకరణం : విశ్వాసం (అఖీదా) మూలాధారాలు, వాటిని సజ్జనులు ... 15
మూడవ ప్రకరణం:నిజ విశ్వాసం పట్ల వైముఖ్య ధోరణి తీసుకోవలసిన జాగ్రత్తలు 17
దేవుని సూచనలపై యోచించకపోవటం 20
ఈ వైముఖ్య దశ నుండి కాపాడుకునే మార్గమేది? 22
**రెండవ అధ్యాయం :** తౌహీద్ (దేవుని ఏకత్వం) భావార్థం,దాని రకాలు, తౌహీద్ ... 24
**1. తౌహీదె రుబూబియత్** : ఇందులో 10 ప్రకరణలున్నాయి 24
మొదటి ప్రకరణం : తౌహీదె రుబూబియత్ భావం బహుదైవారాధకులు 25
సహితం దీనిని అంగీకరించారు తౌహీద్, తౌహీదె రుబూబియత్ నిర్వచనం
రెండవ ప్రకరణం : ఖుర్ఆన్ హదీసులలో 'రబ్' అనే పరిభాషకు గల భావార్థం. 30
ఈ విషయంలో మార్గభ్రష్టతకు లోనైన జాతుల భావాలు, భావనలు.
1. ఖుర్ఆన్ సున్నతులలో 'రబ్' భావం 30
2. మార్గవిహీన జాతుల దృష్టిలో 'రబ్' 32
3. ఈ మిథ్యా భావాల ఖండన 35
మూడవ ప్రకరణం : లోకమంతా దైవాజ్ఞకు కట్టుబడి ఉంది 37
నాల్గవ ప్రకరణం : సృష్టికర్త ఉనికి, ఆయన ఏకత్వ నిరూపణలో దివ్య ఖుర్ఆన్ విధానం 40
1. ప్రతి నూతన ఆవిష్కరణ వెనుక ఒక ఆవిష్కర్త ఉంటాడనేది సుస్పష్టమే 40
2. విశ్వ వ్యవహారాల నిర్వహణ, పటిష్ఠత 41
3. సృష్టితాలను వారి బాధ్యతల నెరవేర్పుకై కట్టుబడి ఉండేలా చేయటం 42
ఐదవ ప్రకరణం : తౌహీదె రుబూబియత్ – తౌహీదె ఉలూహియత్ పరస్పరం ... 45
**2. తౌహీదె ఉలూహియత్** (దైవత్వంలో ఏకత్వం) ఇందులో ఆరు ప్రకరణలున్నాయి 49
మొదటి ప్రకరణం:తౌహీదె ఉలూహియత్ అంటే ఏమిటి?ఇది ఆరాధనకు మరో పేరు 50
తౌహీదె ఉలూహియత్ దైవప్రవక్తల సందేశంలోని ప్రధానాంశం ఇదే 50
రెండవ ప్రకరణం : షహాదతైన్ అర్థం : వాటికి సంబంధించిన మౌలికాంశాలు, 54
షరతులు, దోషాలు
మొదటిది : షహాదతైన్ అర్థం 54
రెండవది : సాక్ష్యవచనాలలోని మౌలికాంశాలు 55
మూడవది : షహాదతైన్ షరతులు, సాక్ష్యం ఏడు షరతులతో ముడిపడి ఉంది 57
మొదటి షరతు – జ్ఞానం రెండవ షరతు – నమ్మకం 58
నాల్గవది : షహాదతైన్ కోరేదేమిటి? 61
ఐదవది : షహాదతైన్‌ను వృథా చేసే విషయాలు 62

| | |
|---|---|
| మూడవ ప్రకరణం : షరీయత్ రూపకల్పన గురించి | 66 |
| నాల్గవ ప్రకరణం : ఇబాదత్ అంటే ఏమిటి? (1) ఇబాదత్ అర్థం | 69 |
| (2) ఇబాదత్ (ఆరాధన) పలు రకాలు. అందులో చేరి ఉన్న అంశాలు | 70 |
| ఐదవ ప్రకరణం : ఇబాదత్ నిర్ధారణలో ఉన్న అపోహలు, అపార్థాలు | 71 |
| ఆరవ ప్రకరణం : సిసలయిన ఆరాధనకు మూలసూత్రాలు | 73 |
| **3. తౌహీదె అస్మా వ సిఫాత్** (దైవ నామాలు, దైవగుణాలలో ఏకత్వం) ఇందులో 3... | 75 |
| (అ) ఖుర్ఆన్ హదీసుల ఆధారాలు :(1) దివ్య ఖుర్ఆన్ ద్వారా కొన్ని ఆధారాలు | 75 |
| మొదటిది :దైవ నామాలు, గుణాలు ఖుర్ఆన్, హదీసుల వెలుగులో ఆధారాలు... | |
| (2) మహాప్రవక్త (ﷺ) మహితోక్తుల వెలుగులో దైవ నామాలకు సంబంధించిన ... | 76 |
| (ఆ) అల్లాహ్ నామాలను, లక్షణాలను నిరూపించే బౌద్ధిక ఆధారాలు | 79 |
| రెండవది:దైవనామాలు, దైవగుణాల విషయంలో అహ్లె సున్నత్ వల్ జమాఅత్... | 80 |
| మూడవది : మొత్తం పేర్లను, గుణగణాలను లేదా వాటిలో కొన్నింటిని ... | 81 |
| **మూడవ అధ్యాయం :** షిర్క్, చెడు విశ్వాసాలు సత్య తిరస్కారం, నాస్తికత్వం,షిర్క్.. | 88 |
| మొదటి ప్రకరణం : మానవ జీవితంలో వైముఖ్య దశ, చెడు విశ్వాసాలు | 89 |
| రెండవ ప్రకరణం : షిర్క్ నిర్వచనం, దాని రకాలు (అ) షిర్క్ నిర్వచనం | 93 |
| (ఆ) షిర్క్ రకాలు : షిర్క్ రెండు రకాలు | 96 |
| మొదటి రకం : షిర్కె అక్బర్ (పెద్ద షిర్క్) | 96 |
| రెండవ రకం : షిర్కె అస్గర్ : (చిన్నతరహా షిర్క్) 1. కన్పించే షిర్క్ | 97 |
| షిర్క్‌తో కూడిన పనులు (2) కన్పించని షిర్క్ | 98 |
| షిర్కె అస్గర్ – షిర్కె అక్బర్‌కి మధ్యగల వ్యత్యాసాలు | 100 |
| మూడవ ప్రకరణం : కుఫ్ర్ (అవిశ్వాసం, తిరస్కార వైఖరి) | 101 |
| నిర్వచనం, దాని రకాలు (అ) కుఫ్ర్ నిర్వచనం (ఆ) కుఫ్ర్ రకాలు, కుఫ్రె అక్బర్ | |
| రెండవ రకం : కుఫ్రె అస్గర్ (చిన్నతరహా కుఫ్ర్) | 103 |
| కుఫ్రె అక్బర్ – కుఫ్రె అస్గర్ మధ్య గల తేడాలు | 105 |
| నాల్గవ ప్రకరణం : నిఫాఖ్ (కపటత్వం) నిర్వచనం, దాని రకాలు | 106 |
| (అ) నిఫాఖ్ (కపటత్వం, వంచన) నిర్వచనం షరీయత్ ప్రకారం 'నిఫాఖ్' అంటే .... | 106 |
| (ఆ) నిఫాఖ్ (కాపట్యం) రకాలు: 1. విశ్వాసపరమైన కపటత్వం ... | 107 |
| నిఫాఖె అక్బర్ – నిఫాఖె అస్గర్‌కి మధ్య గల తేడాలు | 109 |
| ఐదవ ప్రకరణం:అజ్ఞానం, పాపం, మార్గభ్రష్టత, ధర్మభ్రష్టతల వాస్తవికత 1.అజ్ఞానం | 112 |
| 1. సర్వ సాధారణ అజ్ఞానం 2. ప్రత్యేకమైన అజ్ఞానం, పాపం (ఫిస్ఖ్) | 113 |
| ఫిస్ఖ్ రెండు రకాలు | 114 |
| 3. మార్గభ్రష్టత | 115 |
| 4. ఇర్తిదాద్ (ధర్మభ్రష్టత) దాని రకాలు, ఆదేశాలు | 116 |
| **నాల్గవ అధ్యాయం :** తౌహీద్‌కు వ్యతిరేకమైన పనులు .. సృష్టించే మాటలు, చేతలు | 119 |
| మొదటి ప్రకరణం : హస్తాన్ని పరిశీలించి ...అగోచర జ్ఞానం ఉందని చెప్పటం | 120 |
| అగోచరం అంటే .... | |
| రెండవ ప్రకరణం : చేతబడి, సోదె, జ్యోతిష్యం 1. చేతబడి (బాణామతి, క్షుద్రవిద్య) | 122 |





| | |
|---|---|
| 2. సోదె, జ్యోతిష్యం | 123 |
| మూడవ ప్రకరణం : దర్గాల వద్ద జంతుబలి ఇవ్వటం | 126 |
| కానుకలు, నజరానాలు సమర్పించుకోవటం, శ్రద్ధాంజలి ఘటించటం | |
| నాల్గవ ప్రకరణం : విగ్రహాల, స్మారక చిహ్నాల పట్ల భక్తి ప్రపత్తులు | 131 |
| ఐదవ ప్రకరణం : ధర్మాన్ని పరిహసించటం, ధార్మిక చిహ్నాలను కించపరచటం | 133 |
| ఎగతాళి రెండు రకాలుగా ఉంటుంది | 135 |
| ఆరవ ప్రకరణం : దేవుని షరీయత్‌ను వదలి ఇతరత్రా చట్టాలను ఆశ్రయించటం | 136 |
| దైవసమ్మతమైన షరీయత్‌ను కాదని ఇతరత్రా చట్టాల ప్రకారం తీర్పులు కోరటం | 141 |
| ఏడవ ప్రకరణం : షరీయత్ నిర్మాణం – ధర్మాధర్మాల నిర్ధారణ దేవుని హక్కు | 144 |
| ఎనిమిదవ ప్రకరణం : అధర్మ శక్తులతో, మూర్ఖులతో చేరటం | 148 |
| తొమ్మిదవ ప్రకరణం : జీవితం యొక్క భౌతిక దృక్పథం, దాని చెడుగులు | 154 |
| 1. భౌతిక దృక్పథం, దాని భావం | 154 |
| (2) జీవితానికి సంబంధించిన సరైన దృక్పథం | 158 |
| పదవ ప్రకరణం : మంత్రించి ఊదటం, తావీజులు కట్టటం | 159 |
| (1) మంత్రించి ఊదటం (రుఖయ) : దాని రకాలు, మొదటి రకం | 159 |
| (2) తావీజులు : తాయెత్తులు రెండు రకాలు, మొదటి రకం | 160 |
| రెండవ రకం | 161 |
| పదకొండవ ప్రకరణం : దైవేతరుల పేర ప్రమాణం చేయటం, సృష్టితాల | 163 |
| ఆశ్రయం పొందటం, వారిని మొరపెట్టుకోవటం, సహాయమర్థించటం | |
| (అ) దైవేతరులపై ప్రమాణం చేయటం | 163 |
| (ఆ) దైవ సామీప్యం కొరకు సృష్టితాలను 'సాధనం' గా చేసుకోవటం: | 165 |
| **తవస్సుల్ రెండు రకాలు** 1.అల్లాహ్ నామాలు, గుణాలను సాధనంగా చేసుకోవటం | 165 |
| రెండవ రకం : అధర్మమైన వసీలా 1. మృతులను దుఆ చేయమని కోరటం | 167 |
| (ఇ) సహాయం చేయమని, కష్టం తొలగించమని సృష్టితాలను అర్థించటం1.ఇస్తెఆనత్ | 169 |
| **ఐదవ అధ్యాయం :** దైవప్రవక్త (ﷺ) యెడల, ఆయన కుటుంబీకుల యెడల, | 171 |
| ప్రియ సహచరుల (رضي الله عنهم) యెడల తప్పనిసరిగా ఉండవలసిన విశ్వాసం | |
| మొదటి ప్రకరణం : మహనీయ ముహమ్మద్ (ﷺ) యెడల ప్రేమాభిమానాలు, | 172 |
| గౌరవ ప్రపత్తులు తప్పనిసరి.అయితే అతివాదం అవాంఛనీయం. | |
| ఆయన (ﷺ) స్థాయి అత్యున్నతం | |
| (1) ఆయన (ﷺ) యెడల ప్రేమాభిమానాలు, గౌరవ ప్రపత్తులు అవశ్యం | 172 |
| (2) ఆయన (ﷺ)ను కొనియాడటంలో అతిశయిల్లకూడదు | 175 |
| (3) ఆయన (ﷺ) స్థానం అత్యున్నతం | 177 |
| రెండవ ప్రకరణం : దైవప్రవక్త (ﷺ)కు విధేయత చూపటం అనివార్యం | 181 |
| మూడవ ప్రకరణం దైవప్రవక్త (ﷺ) పై దురూద్, సలాం పంపే ఆదేశం ... | 185 |
| నాల్గవ ప్రకరణం : ప్రవక్త (ﷺ)ఇంటివారి ప్రాశస్త్యం, వారి హక్కులు | 187 |
| ఐదవ ప్రకరణం : ప్రవక్త సహచరుల (رضي الله عنهم)ఔన్నత్యం, వారి యెడల | 191 |
| సద్భావన తప్పనిసరి. వారి మధ్యగల పరస్పర భేదాభిప్రాయాల విషయంలో | |

అహ్లెసున్నత్ వల్ జమాఅత్ వైఖరి 191
(1) సహాబా అంటే ఎవరు? వారి గురించి ఎటువంటి నమ్మకం కలిగి ఉండాలి? 191
(2) ప్రవక్త సహచరుల ( رضي الله عنهم ) మధ్య విభేదాలు, అంతఃకలహాల విషయంలో అహ్లె సున్నత్ వల్ జమాఅత్ వైఖరి, ఉపద్రవానికి మూలం 194
సహాబాల మధ్య విభేదాలపై, అహ్లె సున్నత్ వల్ జమాఅత్ వైఖరి రెండు విషయాలపై.. 196
ఆరవ ప్రకరణం : మహాప్రవక్త (ﷺ) సహచరుల( رضي الله عنهم ) ను, మార్గదర్శక నాయకులను తూలనాడరాదు (1) సహాబాలను తూలనాడటం పట్ల వారింపు : 201
(2) ముస్లిం సమాజంలోని మార్గదర్శకులను దూషించటం పట్ల వారింపు 203
**ఆరవ అధ్యాయం :** బిద్అతులు (నవీన పోకడలు) 206
మొదటి ప్రకరణం : బిద్అత్ నిర్వచనం : దాని రకాలు, ఆదేశాలు 207
(1) నిఘంటువు ప్రకారం బిద్అత్ అంటే
2. ధర్మం (దీన్)లో బిద్అత్‌ల రకాలు : ధర్మంలో బిద్అత్‌లు రెండు రకాలు 208
3. ధర్మంలో బిద్అత్‌ల రకాలు, వాటి ఆదేశం 209
హెచ్చరిక 210
రెండవ ప్రకరణం : ముస్లింలలో పొడసూపిన బిద్అతులు, కారణాలు, ప్రేరకాలు 212
1. మొదటిది : బిద్అత్‌లు పుట్టిన సమయం 213
రెండవది : బిద్అతుల జన్మస్థలం 213
(2) కొత్తపోకడల పుట్టుకకు ప్రధాన కారణాలు 214
బిద్అతుల పుట్టుపూర్వోత్తరాలు : కారణాలు 215
(అ) ధర్మాదేశాల పట్ల తగు పరిజ్ఞానం కొరవడటం 215
(ఆ) మనోవాంఛలను అనుసరించటం 216
(ఇ) కొన్ని ప్రత్యేక అభిమతాల పట్ల, కొందరు వ్యక్తుల పట్ల దురభిమానం 216
(ఈ) అవిశ్వాసులను పోలిన పద్ధతులను పాటించటం 217
మూడవ ప్రకరణం : బిద్అతీల విషయంలో ఇస్లామీయ సమాజం వైఖరి, వారి పోకడలను ఖండించటంలో 'అహ్లెసున్నత్ వల్ జమాఅత్' విధానం 219
(1) బిద్అతీల విషయంలో అహ్లె సున్నత్ వల్ జమాఅత్ వైఖరి 219
(2) బిద్అతీల చర్యలను ఖండించటంలో 'అహ్లె సున్నత్ వల్ జమాఅత్' వారి పద్ధతి 221
నాల్గవ ప్రకరణం : వర్తమాన కాలంలోని బిద్అతులు : 222
కొన్ని మచ్చుతునకలు : 1. మిలాదున్నబి పేరిట ఉత్సవాలు 222
(2) కొన్ని స్థలాల, చిహ్నాల, మృతుల నుండి శుభం (బరకత్) పొందటం 224
(3) ఆరాధనలు, దైవసామీప్యం పొందటానికి సంబంధించిన బిద్అతులు 226
ముగింపు 227
బిద్అతీ పట్ల ఎలా వ్యవహరించాలి? 228




بسم الله الرحمن الرحيم

# పాఠకులకు మనవి

దేవుని ఏకత్వపు విశ్వాసం ఇస్లాంకు మూలస్తంభం. సన్మార్గ ప్రాప్తికి ముఖ్య సాధనం. అదే విజయ రహస్యం. ఇంకా, అది విభేదాల నుండి చీలికల నుండి సురక్షితంగా ఉంచే ప్రధాన మార్గం. అన్ని రకాల మేళ్లకు, అనుగ్రహ భాగ్యాలకు అది మూల సరోవరం. అందుకే దైవ ప్రవక్తలంతా తమ సందేశ పరిచయ కార్యక్రమాన్ని దేవుని ఏకత్వపు విశ్వాసం (అఖీదయె తౌహీద్)తోనే మొదలెట్టారు. ప్రభువైన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

﴿وَلَقَدْ بَعَثْنَا فِى كُلِّ أُمَّةٍ رَّسُولاً أَنِ اعْبُدُواْ اللَّهَ وَاجْتَنِبُواْ الطَّاغُوتَ﴾(نحل:٣٦)

**"మేము ప్రతి సముదాయంలోనూ ప్రవక్తను ప్రభవింపజేశాము. అతని ద్వారా '(ప్రజలారా!) అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించండి. ఆయన తప్ప ఇతరత్రా మిథ్యా దైవాలన్నింటికీ దూరంగా ఉండండి' అని బోధపరిచాము." (అన్ నహ్ల్ – 36)**

ప్రతి ప్రవక్తా తన జాతి వారిని అన్నింటికంటే ముందు ఈ విషయం వైపునకే పిలుపు ఇచ్చాడు : ﴿اعْبُدُواْ اللَّهَ مَا لَكُم مِّنْ إِلَـهٍ غَيْرُهُ﴾(هود:٥٠)

**"అల్లాహ్‌నే ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరో ఆరాధ్యుడు లేడు." (హూద్ : 50)**

మహనీయ ముహమ్మద్ (ﷺ) వారైతే మరింత అధికంగా ఈ విషయంపై దృష్టిని కేంద్రీకరించారు. ఆయన (ﷺ) మక్కాలో నిరంతరం 13 ఏండ్లపాటు ఏకదైవారాధన (తౌహీద్) వైపు ప్రజలను ఆహ్వానించారు. మక్కా విజయం సందర్భంగా ఆయన (ﷺ) కాబా గృహంలో ప్రతిష్ఠించబడివున్న ఒక్కో విగ్రహాన్ని బెత్తంతో కొడుతూ ఈ దైవాదేశాన్ని పఠింపసాగారు –

﴿وَقُلْ جَاءَ الْحَقُّ وَزَهَقَ الْبَاطِلُ إِنَّ الْبَاطِلَ كَانَ زَهُوقًا﴾(الاسراء:٨١)

**ఈ విధంగా ప్రకటించు : "సత్యం వచ్చేసింది. అసత్యం సమసిపోయింది. నిశ్చయంగా అసత్యం సమసిపోవలసినదే."**

**(బనీ ఇస్రాయీల్ : 81)**

దేవుని ఏకత్వం పట్ల దృఢ విశ్వాసం లేనిదే అల్లాహ్ మనిషి కర్మలకు ఆమోదముద్ర వేయడు. ఈ విశ్వాసమే ప్రళయదినాన దాసుణ్ణి దేవుని శిక్ష నుండి విముక్తిని ఇస్తుంది.

ఈ దేవుని ఏకత్వపు విశ్వాసాన్ని (అఖీదయె తౌహీద్‌ను) అవలంబించిన కారణంగానే ఏకేశ్వరోపాసకులు మలమల మాడే మండుటెండల్లో ఈడ్వబడ్డారు. రంపంతో కోయబడ్డారు. అగ్ని గుండాలకు ఆహుతి చేయబడ్డారు. ఆ భయంకరమయిన యాతనలను తలచుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది. అంతచేసినా ఏక దైవారాధకులయిన దాసులు తాము నమ్మిన సత్యాన్ని వీడలేదు.

కాని నేడు నలువైపులా సూఫీయిజం, నాస్తికత్వం, సన్యాసత్వం, సమాధి పూజ ప్రబలిపోయింది. జన సామాన్యం ఈ కొత్త పుంతలనే సిసలయిన ధర్మం (దీన్)గా తలపోసి, దీనిని అనుసరిస్తోంది. వాస్తవానికి ఇస్లాం ధర్మంతో వీటికి ఎలాంటి సంబంధం లేదు. నిజం చెప్పాలంటే ఇవన్నీ ధర్మానికి (దీన్‌కు) తూట్లు వేసే పోకడలే. ఒక వైపున నిరంతరం (యూదుల, క్రైస్తవుల) బయటి కుట్రలను ఎదుర్కొంటున్న ఇస్లాం మరోవైపున అంతర్గత ఉపద్రవాలకు, ఆటుపోట్లకు కూడా ఆలవాలమవుతూ ఉంది. మతం చాటున దురాచారాలను, దుష్టపోకడలను చాపక్రింద నీరులా ప్రవహింపజేసేవారు ఎందరో పుట్టుకొచ్చారు.

తత్ఫలితంగా సామాన్య జనులు తమ ప్రభువును మరచిపోయారు. ఉపాధి కోసం, వర్షాల కోసం, సంతానం కోసం, ఇంకా తదితర అవసరాల కోసం నిజ దైవమైన అల్లాహ్ వైపు మరలకుండా దైవేతరుల గడపల వద్దకు హాజరవుతున్నారు. కాగా;

﴿أدْعُونِي أَسْتَجِبْ لَكُمْ﴾ 'మీరు నన్ను మొరపెట్టుకోండి, నేను మీ మొరలను ఆలకించి, ఆమోదిస్తాన'ని అల్లాహ్ అంటున్నాడు. అంతటితో ఆగకుండా వీరు తమ సోకాల్డ్ ఔలియాల సమాధుల వద్దకు వెళ్ళి కాబా గృహ ప్రదక్షిణ చేసినట్లుగా చేస్తున్నారు. వారి గోరీలపై అర్జీలను వ్రేలాడదీస్తున్నారు. తీర్పుదినాన వారు తమ పాపాల మన్నింపునకు సిఫారసు చేస్తారని నమ్ముతున్నారు. ఈ విధంగా ఈ ఔలియాల ఆశ్రమాలు, ఆధ్యాత్మిక గురువుల పీఠాలు ఎనలేని ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ప్రజలు హజ్జ్ సంకల్పంతో ఈ ఆశ్రమాలను సందర్శించే దాకా పోయారు. దురాచారాలకు ఆలవాలమైన ఇటువంటి సముదాయాన్ని చూసి మనం నిర్లిప్తంగా ఉండిపోవటం సమంజసమేనా? ఎన్నటికీ సమంజసం కాదు. ఇస్లాం ధర్మం యొక్క నిజమయిన ఉపదేశాలను హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలకు విడమరచి చెప్పవలసిన ధార్మిక, నైతిక బాధ్యత మనపై ఉంది. వారు సృష్టించబడినది సృష్టికర్తను ఆరాధించటానికేనన్న సంగతిని సుబోధకం చేయవలసిన కర్తవ్యం మనది. సృష్టికర్త స్వయంగా ఇలా సెలవిచ్చాడు :

﴿وَمَا خَلَقْتُ الْجِنَّ وَالْإِنسَ إِلَّا لِيَعْبُدُونِ﴾(الذاريات:٥٦)

**"మేము జిన్నులను, మానవులను కేవలం మా ఆరాధన నిమిత్తమే సృష్టించాము." (అజ్జారియాత్ : 56)**

నేటి ఈ ఉపద్రవాల వెల్లువలో, ముఖ్యంగా భారత ముస్లిములలోని అత్యధికులు



సమకాలీన అధర్మ సిద్ధాంతాలకు ప్రభావితులై భ్రష్టుపట్టిన నమ్మకాల రొంపిలో కూరుకు పోయి ఉన్న తరుణంలో, అజ్ఞానం, అవిద్య కారణంగా ప్రజలు మంచిని చెడుగా, చెడును మంచిగా భావిస్తున్న గడ్డుదశలో, సున్నత్‌ను బిద్అత్‌గా, బిద్అత్‌ను సున్నత్‌గా తలపోస్తున్న నికృష్ట స్థితిలో, ఖుర్ఆన్ హదీసులకు బదులుగా పూర్వకాలపు సత్పురుషుల ప్రవచనాలకు పెద్ద పీట వేయబడుతున్న పరిస్థితిలో, ఏకేశ్వరోపాసనను బహుదైవోపాసనగా, బహుదైవోపాసనను ఏకేశ్వరోపాసనగా తలపోస్తున్న తరుణంలో జన సామాన్యానికి వివిధ రీతుల్లో ఇస్లాం ధర్మ మూలాలైన ఖుర్ఆన్ హదీసు ఉపదేశాలను అందజేయవలసిన బాధ్యత మనపై లేదా? ధర్మాధర్మాలను, మంచీచెడులను పరికించే విచక్షణా జ్ఞానాన్ని, ధార్మిక చైతన్యాన్ని ప్రజలలో జాగృతం చేయటం మన కర్తవ్యం కాదా??

నిశ్చయంగా దీని ఆవశ్యకత ఎంతైనా ఉంది. ముఖ్యంగా అనుదినం షిర్క్, బిద్అత్‌లకు సంబంధించిన ఏదో ఒక ద్వారం తెరుచుకుంటూ ఉండే మన ఉపఖండంలో ఈ దిద్దుబాటు నిరంతరం జరుగుతూ ఉండవలసిందే. ఎందుకంటే ఇస్లాం నిజస్వరూపాన్ని మార్చివేసే లేదా నిర్మూలించే కుయుక్తులు నిత్యం ఇక్కడ జరుగుతూనే ఉన్నాయి – ఇస్లాం శత్రువుల తరపునగానీ, కథాకథిత (సోకాల్డ్) ముస్లింల తరపునగాని!

కనుక మనమంతా సంఘటితమై, ఇంటాబయటా ఎదురయ్యే ఈ అన్ని రకాల సవాళ్ళను ఎదుర్కొనవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఖుర్ఆన్ హదీసులతో కూడుకున్న ఈ స్వచ్ఛమయిన దేవుని ఏకత్వపు విశ్వాసాన్ని బలోపేతం చేయటానికి, ముస్లిం సమాజం నుండి షిర్క్ బిద్అత్‌లను రూపుమాపటానికి హదీస్ పబ్లికేషన్స్, హైదరాబాద్ తన వంతు కృషి చేయాలని సంకల్పించుకుంది. ఇస్లాం ధర్మానికి సంబంధించిన ఏదేని విషయాన్ని కప్పిపుచ్చటం మహాపరాధం. ఇలా చేసే వారినుద్దేశించి విశ్వప్రభువు ఈ విధంగా హెచ్చరించాడు :

﴿إِنَّ الَّذِينَ يَكْتُمُونَ مَا أَنزَلْنَا مِنَ الْبَيِّنَاتِ وَالْهُدَىٰ مِن بَعْدِ مَا بَيَّنَّاهُ لِلنَّاسِ فِي الْكِتَابِ أُولَٰئِكَ يَلْعَنُهُمُ اللَّهُ وَيَلْعَنُهُمُ اللَّاعِنُونَ﴾(البقرة:١٥٩)

**"మేము అవతరింపజేసిన నిదర్శనాలను, సన్మార్గాన్ని ప్రజల కొరకు గ్రంథంలో విశదపరచిన తరువాత కూడా వాటిని దాచిపెట్టేవారిని అల్లాహ్ శపిస్తాడు. ఇంకా, వేరే శపించేవారు కూడా వారిని శపిస్తారు."**

**(అల్ బఖర : 159)**

'ఇస్లామీయ విశ్వాసాలు' అనే అంశంపై సలఫీ విద్వాంసులు రచించిన పుస్తకాలు ఎన్నో వచ్చాయి. అయితే మాననీయ షేఖ్ డా. సాలెహ్ బిన్ ఫౌజాన్ బిన్ అబ్దుల్లాహ్ ఫౌజాన్ చేసిన ఈ రచనను తెలుగు పాఠకలోకం కొరకు 'హదీస్ పబ్లికేషన్స్' ఎంపిక చేయటానికి పలు కారణాలున్నాయి. వాటిలో కొన్ని ఇవి –

1. ఈ పుస్తకంలో దేవుని ఏకత్వపు విశ్వాసానికి సంబంధించిన ఎన్నో అంశాలు మనోజ్ఞమైన శైలిలో వివరించబడ్డాయి.
2. ఏక దైవారాధన గురించి విశదీకరిస్తున్నప్పుడు ఖుర్ఆన్ హదీసుల ఆధారాలను ఇవ్వటంతో పాటు అవసరమనుకున్న చోట హేతుబద్ధంగా కూడా బోధపరచటం జరిగింది.
3. 'అఖీదా'పై చర్చించేటప్పుడు కొంగ్రొత్త పద ప్రయోగాలు చేయకుండా సాధ్యమైనంత వరకు ఖుర్ఆన్ హదీసుల పరిభాషపైనే ఆధారపడటం జరిగింది.
4. వాస్తవానికి ఈ పుస్తకం సలఫీ విద్వాంసులు వ్రాసిన గ్రంథాల 'సారం' వంటిది. డా. సాలెహ్ ఫౌజాన్ గారు స్వయంగా ఈ విషయాన్ని ఇలా వ్యక్తం చేశారు : "నేను ప్రఖ్యాత విద్వాంసుల గ్రంథాల నుండి అనేక అంశాలను సంగ్రహించాను. ముఖ్యంగా షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ, అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్, షేఖుల్ ఇస్లాం ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహాబ్, ఇంకా వారి శిష్యుల గ్రంథాల నుండి విషయాన్ని సేకరించాను."

డా. సాలెహ్ ఫౌజాన్ విశ్వవిఖ్యాత ఇస్లామీయ విద్వాంసులు. సవూదీ అరేబియాకు చెందిన అగ్రశ్రేణి విద్వాంసులలో ఒకరుగా పరిగణించబడతారు. గత కొన్నేండ్లుగా ఆయన సవూదీ అరేబియాలోని ఫత్వా కమిటీ శాశ్వత సభ్యులుగా ఉన్నారు. కారుణ్య ప్రభువు ఈయన సేవలను ఆమోదించుగాక!

ఈ పుస్తక ప్రచురణలో తోడ్పడిన శ్రేయోభిలాషులకు, పుస్తక తెలుగు అనువాద కులకు కారుణ్య ప్రభువు ఉత్తమ ప్రతిఫలం ప్రసాదించాలని, మా ఈ సేవలను విశ్వప్రభువు దయతో ఆమోదించి, ఇందులో శుభాన్ని, సమృద్ధిని పొందుపరచాలని కదు దీనంగా వేదుకుంటున్నాము.

اللهم ارزقنا علم التوحيد و عمل الاخلاص و حسن الخاتمة' آمين يارب العالمين

**అజీజుర్రహ్మాన్ యూనుస్**
– ప్రకాశకులు
**హదీస్ పబ్లికేషన్స్**
హైదరాబాద్



# తొలి పలుకులు

الحمدلله رب العالمين' والصلاة و السلام على نبيه الصادق الأمين'نبينامحمد وعلى آله و صحبه أجمعين' وبعد:

**అల్ హమ్దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్. వస్సలాతు వస్సలాము అలా నబియిస్సాదిఖ్ అల్ అమీన్. నబియ్యినా ముహమ్మద్ వ అలా ఆలిహీ వ సహ్బిహీ అజ్మయీన్ .... వ బాద్ :**

మీ ముందున్న ఈ పుస్తకం ఏకేశ్వరోపాసనా విజ్ఞానానికి సంబంధించినది. విషయాన్ని క్లుప్తంగా, సులభశైలిలో వివరించటానికి శాయశక్తులా ప్రయత్నించటం జరిగింది. ఈ అంశంపై సుప్రసిద్ధ ఇస్లామీయ విద్వాంసులు రచించిన గ్రంథాలలోని సారాంశాన్ని సంగ్రహించాను. ముఖ్యంగా షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ, అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్, షేఖుల్ ఇస్లాం ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహాబ్ (రహిమహుముల్లాహ్) వ్రాసిన పుస్తకాల ద్వారా వారి ప్రియశిష్యుల రచనల ద్వారా లబ్ధిపొందాను.

ఇస్లామీయ విశ్వాసానికి సంబంధించిన విద్య మౌలికమయినది. అది నేర్చుకోదగినది, నేర్పదగినది, ఆచరించదగినదనటంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే సదాచరణలు మాత్రమే దైవ సన్నిధిలో స్వీకార యోగ్యమవుతాయి. సదాచరణలే ప్రయోజనకరం అవుతాయి. ముఖ్యంగా నేటి మన యుగంలో ధర్మరాహిత్యం, నాస్తికత్వం, తసవ్వుఫ్, సన్యాసత్వం, సమాధుల పూజ వంటి పోకడలు ప్రబలిపోయి మానవతను సత్యానికి, ప్రవక్త (ﷺ) విధానానికి దూరం చేస్తున్నాయి. ఇలాంటి క్లిష్టతరుణంలో ఒక ముస్లిం దైవగ్రంథం, దైవప్రవక్త (ﷺ) విధానం, తొలికాలపు మహనీయులు (సలఫ్) అవలంబించిన బాటను అనుసరించకపోతే అతను మార్గవిహీనత, మార్గభ్రష్టతల ఆఖరి అంచుల వరకూ వెళ్ళిపోయే ప్రమాదం ఉంది. అందుకే ముస్లిం నవతరానికి ఇస్లాం మూలాలైన ఖుర్ఆన్ హదీసుల నుండి సంగ్రహించిన సిసలైన విశ్వాసాన్ని (సహీహ్ అఖీదా)ను నూరిపోయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

وصلى الله على نبينا محمد وآله وصحبه.

**వ సల్లల్లాహు వ సల్లమ అలా నబియ్యినా ముహమ్మద్ వ ఆలిహీ వ సహ్బిహీ.**

## మొదటి అధ్యాయం

# దేవుని ఏకత్వపు విశ్వాసం గురించి

ఈ అధ్యాయం క్రింద పేర్కొనబడిన మూడు ప్రకరణాలుగా విభజించబడింది :

**మొదటి ప్రకరణం :** దేవుని ఏకత్వపు విశ్వాసం అంటే ఏమిటి? దీని అర్థం, ప్రాముఖ్యం. ఇస్లాం ధర్మం అనే కట్టడం దేవుని ఏకత్వం అనే పునాదిపైనే నిలబడి ఉందని విశదీకరించటం.

**రెండవ ప్రకరణం :** సిసలైన విశ్వాసానికి మూలాలు. వాటిని సంగ్రహించటంలో తొలికాలపు మహనీయులు అవలంబించిన విధానం.

**మూడవ ప్రకరణం :** సిసలైన విశ్వాసం పట్ల వైముఖ్య ధోరణి. జాగ్రత్తపడే ఉపాయాలు.

## మొదటి ప్రకరణం

అఖీదా అంటే ఏమిటి? దాని ప్రాముఖ్యత ఎటువంటిది? 'ఇస్లాం' అనే కట్టడం దేవుని ఏకత్వపు విశ్వాసం పైనే నిలబడి ఉందని చెప్పటంలోని పరమార్థం?

**అఖీదా (విశ్వాసం, నమ్మకం) :** అరబీ భాషలోని 'అఖ్ద్' అనే పదం నుండి ఇది గ్రహించబడినది. దీనికి పెనవేయటం, ముడివేయటం, బంధించటం, కట్టివేయటం అనే అర్థాలు వస్తాయి. 'ఏతఖద్‌తు కజా' అని అరబీలో అంటారు. అంటే నేను ఫలానా వస్తువుపై నమ్మకముంచాను అని భావం. అంటే నేను దానియందు నా మనసును లగ్నం చేశాను అని అర్థం. మనిషి ఏదేని వస్తువును తన ధర్మం (విధానం)గా చేసుకుంటే, దానిని అఖీదా లేక నమ్మకం అంటారు. ఉదాహరణకు : అతని నమ్మకం లేక విశ్వాసం సరైనది అని అంటుంటాము' అంటే అతని నమ్మకం ఎలాంటి సంశయానికి, సందేహానికి ముడిపడి ఉన్న ఆచరణ. దీని అర్థం మనసుకు చెందిన ఏదేని విషయంపై దృఢ నమ్మకం కలిగి ఉండటం, దీనిని సత్యమని ధ్రువీకరించటం అన్నమాట!

## షరీయత్ దృష్టిలో 'అఖీదా' నిర్వచనం

దైవాన్ని, దైవదూతలను, దైవ గ్రంథాలను, దైవ ప్రవక్తలను, అంతిమ దినాన్ని, మేలు జరిగినా, కీడు జరిగినా అల్లాహ్ తరఫుననే జరుగుతుందన్న దానిపై గట్టి నమ్మకం కలిగి ఉండటాన్ని షరీయత్‌లో **అఖీదా** (విశ్వాసం) అంటారు. ఇవే అర్కానుల్ ఈమాన్ (విశ్వాసం యొక్క మౌలికాంశాలు) గా వ్యవహరించబడతాయి.



**షరీయత్ రెండు భాగాలుగా విభజించబడుతుంది. వాటిలో ఒకటి: విశ్వాసాలు. రెండవది : ఆచరణలు (కర్మలు).**

**విశ్వాసాలు :** అంటే ఆచరణలతో సంబంధంలేని అంశాలు. ఉదాహరణకు : అల్లాహ్ పోషకత్వంపై, ఆయన్ని తప్పనిసరిగా ఆరాధించాలన్న విషయంపై నమ్మకం కలిగి ఉండటం. అలాగే విశ్వాసానికి (ఈమాన్‌కు) సంబంధించిన మిగతా ముఖ్యాంశాలన్నింటిపై నమ్మకముంచటం. ఇవి ఇస్లాం ధర్మానికి మూలసూత్రాలు, మూలాధారాలు అనబడతాయి.

**ఆచరణలు (కర్మలు) :** అంటే ఆచరణలతో అవినాభావ సంబంధం కలిగి ఉన్న అంశాలు. ఉదాహరణకు : నమాజ్, ఉపవాసాలు, జకాత్, మిగిలిన క్రియాత్మక ఆదేశాలు. ఇవి ఇస్లాం ధర్మానికి శాఖల వంటివి. దీని బాగోగులైనా, చెడుగులైనా విశ్వాసం యొక్క బాగోగులతో, చెడుగులతో ముడిపడి ఉంటాయి. (షరహుల్ అఖీదా అస్సఫారీనీయ)

కనుక ఇస్లాం అనే సౌధానికి అసలైన ప్రాతిపదిక నిజ విశ్వాసమే. తద్వారానే మనిషి ఆచరణలు సరైనవిగా నిర్ధారించబడతాయి. అల్లాహ్ సెలవిచ్చినట్లుగా –

﴿فَمَنْ كَانَ يَرْجُو لِقَاءَ رَبِّهِ فَلْيَعْمَلْ عَمَلاً صَالِحاً وَلَا يُشْرِكْ بِعِبَادَةِ رَبِّهِ أَحَداً﴾ (الكهف:١١٠)

**"తన ప్రభువును కలుసుకోవాలన్న ఆకాంక్ష ఉన్నవాడు సదాచరణ చేయాలి. తన ప్రభువు ఆరాధన (దాస్యం)లో వేరొకరికి భాగస్వామ్యం కల్పించకుండా ఉండాలి." (అల్ కహఫ్ : 110)**

వేరొకచోట ఇలా ఆదేశించబడింది :

﴿وَلَقَدْ أُوحِيَ إِلَيْكَ وَإِلَى الَّذِينَ مِنْ قَبْلِكَ لَئِنْ أَشْرَكْتَ لَيَحْبَطَنَّ عَمَلُكَ وَلَتَكُونَنَّ مِنَ الْخَاسِرِينَ﴾ (الزمر:٦٥)

**నిశ్చయంగా నీ వద్దకు, నీ పూర్వీకులైన ప్రవక్తల వద్దకు పంపబడిన దివ్యవాణి ఇది : "ఒకవేళ నీవు గనక బహుదైవారాధనకు పాల్పడితే, నీవు చేసుకున్నదంతా వృథా అయిపోతుంది. మరి నిశ్చయంగా నీవు నష్టపోయిన వారిలో చేర్తావు." (అజ్ జుమర్ : 65)**

ఇంకా ఈ విధంగా ప్రబోధించబడింది :

﴿فَاعْبُدِ اللَّهَ مُخْلِصاً لَهُ الدِّينَ ☆ أَلَا لِلَّهِ الدِّينُ الْخَالِصُ﴾ (الزمر:٢،٣)

**"కనుక నీవు అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించు – ధర్మాన్ని ఆయనకు మాత్రమే ప్రత్యేకించుకుని. జాగ్రత్త! నిష్కల్మషమైన ఆరాధన మాత్రమే అల్లాహ్‌కు చెందుతుంది." (అజ్ జుమర్ : 2, 3)**

పైన పేర్కొనబడిన ఈ సూక్తులద్వారానూ, ఇలాంటివే మరెన్నో దివ్య వచనాల ద్వారానూ అవగతమయ్యేదేమిటంటే మనిషి కర్మలు షిర్క్ (బహుదైవారాధన) అనే కాలుష్యం నుండి స్వచ్ఛంగా, పరిశుద్ధంగా ఉన్నప్పుడే ఆమోదముద్రకు నోచుకుంటాయి. ఈ కారణంగానే దైవప్రవక్తలు అన్నిటికన్నా ముందు అఖీదా (విశ్వాసం) పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు. వారు తమ జాతి ప్రజలను అన్నింటికన్నా ముందు ఏకేశ్వరుడైన దేవుని ఆరాధించమని, దైవేతరుల దాస్యాన్ని త్యజించమని పిలుపు ఇచ్చారు. ఉదాహరణకు : విశ్వప్రభువు సెలవిచ్చినట్లుగా –

﴿وَلَقَدْ بَعَثْنَا فِي كُلِّ أُمَّةٍ رَّسُولاً أَنِ اعْبُدُواْ اللّهَ وَاجْتَنِبُواْ الطَّاغُوتَ﴾(النحل:٣٦)

**మేము ప్రతి సముదాయంలోనూ ప్రవక్తను ప్రభవింపజేశాము. అతని ద్వారా (ప్రజలారా!) "అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించండి. ఆయన తప్ప ఇతరత్రా మిథ్యా దైవాలకు దూరంగా ఉండండి" అని బోధపరిచాము. (అన్ నహ్ల్ : 36)**

అలాగే ప్రతి ప్రవక్తా తన జాతి వారిని మొట్టమొదట సంబోధించినపుడు ఇలా అనేవాడు –

﴿اعْبُدُواْ اللَّهَ مَا لَكُم مِّنْ إِلَـهٍ غَيْرُهُ﴾(الاعراف:٥٩،٦٥،٧٣،٨٥)

**"మీరు అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయన తప్ప మరొకరెవరూ మీకు ఆరాధ్యులు కారు." (అల్ ఆరాఫ్ : 59, 65, 73, 85)**

నూహ్, హూద్, సాలెహ్, షుఐబ్ తదితర ప్రవక్తలంతా (అలైహిముస్సలాం) తమ తమ జాతులకు ఇదే పిలుపు ఇచ్చారు.

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (ﷺ) స్వయంగా – తాను ప్రవక్తగా ఎంపికైనప్పటి నుండీ 13 ఏండ్ల వరకూ మక్కాలో ప్రజలను ఏకేశ్వరోపాసన వైపునకే పిలుపు ఇచ్చి, వారి విశ్వాసాల సంస్కరణపై ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరించారు. ఎందుకంటే ఈ పునాదిపైనే ఇస్లాం అనే కట్టడం నిలబడి ఉంది. అలాగే అన్ని కాలాలలో, అన్ని పరిస్థితులలో ధర్మబోధకులు, సంస్కర్తలు ప్రవక్తల పంథానే అనుసరిస్తూ ఆయా ప్రజలను ఏక దైవారాధన వైపు ఆహ్వానించారు. ఆ తరువాతే ఇతరత్రా ధర్మాదేశాల పట్ల శ్రద్ధ వహించారు.



## రెండవ ప్రకరణం

# విశ్వాసం (అఖీదా) మూలాధారాలు, వాటిని సంగ్రహించటంలో పూర్వకాలపు సజ్జనులు అవలంబించిన విధానం

అఖీదా (విశ్వాసం) అనేది దైవాదేశంతో కూడుకున్న విషయం. కనుక అది షరీయత్ యొక్క నిదర్శనం ద్వారానే రుజువవుతుంది. ఈ వ్యవహారంలో సొంత అభిప్రాయాలకు, అన్వయింపులకు ఎలాంటి తావు ఉండదు. దీని మూలాధారాలు ఖుర్‌ఆన్ హదీసులు. ఎందుకంటే దేవుని అస్థిత్వంతో పాటు, మరే వస్తువులు ఇందు నిమిత్తం అవసరమో, ఇంకా ఏ ఏ వస్తువుల ద్వారా ఆయనను పవిత్ర పరచవచ్చో వాటిని గురించి అల్లాహ్‌కే తెలుసు – వేరెవరికీ తెలీదు. అలాగే దేవుని తరువాత దేవుని గురించి దైవప్రవక్త (సఅసం)కు తెలిసినంతగా వేరెవరికీ తెలీదు. అందుకే **అఖీదా**ను సంగ్రహించే విషయంలో పూర్వీకులైన మహనీయులు (సల్ఫెసాలిహీన్) దైవగ్రంథం, దైవప్రవక్త (సఅసం) విధానం వరకే పరిమితం అయ్యారు.

అందుకే –

అల్లాహ్ విషయంలో ఖుర్‌ఆన్ హదీసులు తార్కాణంగా ఉన్న వాటినే వారు విశ్వసించారు. తదనుగుణంగానే ఆచరించారు. మరే విషయానికి ఖుర్‌ఆన్ హదీసులు తార్కాణంగా లేవో, వాటిని తృణీకరించారు. అందుకే అఖీదా (విశ్వాసం, నమ్మకం) విషయంలో వారి మధ్య ఎన్నడూ భేదాభిప్రాయం జనించలేదు. పైగా వారి అఖీదా ఒకటిగా ఉండేది. వారి సమూహం ఒకటిగా ఉండేది. వారంతా ఒకటిగా మసలుకునేవారు. ఎందుకంటే దైవగ్రంథాన్ని, దైవప్రవక్త (స) విధానాన్ని గట్టిగా పట్టుకుని నడిచే వారి మధ్య ఏకీభావం, సంగఠితత్వం, సమైక్యత ఉంటుందని, వారి విశ్వాసాలు సజావుగా ఉంటాయని ముందుగానే చెప్పబడింది. ఈ నేపథ్యంలో అల్లాహ్ సెలవిచ్చాడు :

﴿وَاعْتَصِمُواْ بِحَبْلِ اللّهِ جَمِيعاً وَلاَ تَفَرَّقُواْ﴾(آل عمران:١٠٣)

**"అందరూ కలసి అల్లాహ్ త్రాడును గట్టిగా పట్టుకోండి. విభేదించుకోకండి." (ఆలి ఇమ్రాన్ : 103)**

﴿وَاعْتَصِمُواْ بِحَبْلِ اللّهِ جَمِيعاً وَلاَ تَفَرَّقُواْ﴾(آل عمران:١٠٣)

**"ఇకమీదట మీ వద్దకు నా నుండి మార్గదర్శకత్వం గనక వస్తే, నా**

**మార్గాన్ని అవలంబించేవాడు దారి తప్పటంగానీ, ప్రయాసకు లోనవటంగానీ జరగదు." (తాహా : 123)**

అందుకే వారు మోక్షం పొందిన సముదాయం (ఫిర్ఖా నాజియా)గా పిలువబడ్డారు. ఎందుకంటే, వారు మోక్షం పొందుతారని మహనీయ ముహమ్మద్ (ﷺ) సాక్ష్యమిచ్చారు. తన అనుచర సమాజం 73 వర్గాలుగా చీలిపోతుందని, వాటిలో ఒక్క వర్గం తప్ప మిగతావన్నీ నరకానికి పోతాయని ఆయన (ﷺ) తెలియజేసినప్పుడు, 'ఆ ఒక్క వర్గం ఏది?' అని ఆయన్ని (ﷺ) ప్రశ్నించటం జరిగింది. దానికాయన (ﷺ), "ప్రస్తుతం నేను, నా సహచరులు అవలంబించే విధానంపై ఆ వర్గం స్థిరంగా ఉంటుంది" అని వివరించారు (ఇమామ్ అహ్మద్).

ఆయన (ﷺ) తెలియజేసిన విషయం అక్షర సత్యమని రుజువయింది. ఎవరయితే దైవగ్రంథాన్ని, దైవప్రవక్త (ﷺ) విధానాన్ని విడనాడి గ్రీకు తత్వశాస్త్రానుసారం హేతువును తమ విశ్వాసానికి ప్రాతిపదికగా చేసుకున్నారో వారి విశ్వాసాల్లో వైముఖ్య ధోరణి పొడసూపింది. భేదాభిప్రాయం ఏర్పడింది. తత్ఫలితంగా వారు ఎన్నో ముఠాలుగా, గ్రూపులుగా చీలిపోయారు. జమాఅత్ సమాహారం చెల్లాచెదరైపోయింది. ముస్లిం సమాజ సౌధం బీటలువారింది.



### మూడవ ప్రకరణం

## నిజ విశ్వాసం పట్ల వైముఖ్య ధోరణి : తీసుకోవలసిన జాగ్రత్తలు

నిజ విశ్వాసం పట్ల విముఖత లేక పలాయనం వినాశానికి హేతువు. ఎందుకంటే నిజ విశ్వాసమే ప్రయోజనకరమైన ఆచరణకు బలవత్తరమైన ప్రేరకం. నిజ విశ్వాసాన్ని వీడిన మనిషి సంశయాలకు, మూఢ నమ్మకాలకు లోనైపోతాడు. కొన్నిసార్లు ఈ మూఢ నమ్మకాల అంధకారం అతనిపై దట్టంగా అలుముకుని సుఖసౌఖ్యాలతో జీవించే అతని శక్తిసామర్థ్యాలను సయితం కబళించివేస్తుంది. కడకు అతని బ్రతుకు అతని కొరకు దుర్భరమైపోతుంది. చివరకు అతను తన జీవితాన్ని చాలించి ఈ దుర్భరస్థితి నుండి విముక్తి పొందాలనుకుంటాడు. ఆఖరికి ఆత్మహత్యకైనా వెనుకాడడు. నేడు నిజ విశ్వాసాల మార్గదర్శనానికి నోచుకోకుండా ఉన్న చాలామంది పరిస్థితి ఇదే. నిజ విశ్వాసాల ప్రాబల్యం లేని సమాజం పశుప్రాయమైన సమాజమే. అటువంటి సమాజంలో సౌభాగ్యవంతమైన జీవితానికి కావలసిన కారకాలన్నీ చచ్చుబడిపోయి ఉంటాయి. ఆ సమాజంలో భౌతిక జీవితానికి కావలసిన ఒనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ అవి చాలావరకు మనిషిని వినాశం వైపు నెట్టివేస్తూ ఉంటాయి. అవిశ్వాసుల సమాజంలో ఇలాంటి పెక్కు ఉదాహరణలు లభిస్తాయి. ఎందుకంటే సమాజంలోని భౌతిక కారకాలకు, ఒనరులకు సరైన దిశా నిర్దేశం చేసినపుడే వాటిద్వారా లబ్ధి చేకూరుతుంది. నిజ విశ్వాసం తప్ప మరే ఇతర వస్తువూ వాటికి సరిగ్గా దిశానిర్దేశం చేయజాలదు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

﴿يَا أَيُّهَا الرُّسُلُ كُلُوا مِنَ الطَّيِّبَاتِ وَاعْمَلُوا صَالِحاً﴾ (المؤمنون:٥١)

**"ఓ ప్రవక్తలారా! పరిశుద్ధ వస్తువులు తినండి. సదాచరణ చేయండి." (అల్ మోమినూన్ : 51)**

ఇంకా ఈ విధంగా ఉపదేశించాడు :

﴿وَلَقَدْ آتَيْنَا دَاوُودَ مِنَّا فَضْلاً يَا جِبَالُ أَوِّبِي مَعَهُ وَالطَّيْرَ وَأَلَنَّا لَهُ الْحَدِيدَ ☆ أَنِ اعْمَلْ سَابِغَاتٍ وَقَدِّرْ فِي السَّرْدِ وَاعْمَلُوا صَالِحاً إِنِّي بِمَا تَعْمَلُونَ بَصِيرٌ ☆ وَلِسُلَيْمَانَ الرِّيحَ غُدُوُّهَا شَهْرٌ وَرَوَاحُهَا شَهْرٌ وَأَسَلْنَا لَهُ عَيْنَ الْقِطْرِ وَمِنَ الْجِنِّ مَن يَعْمَلُ بَيْنَ يَدَيْهِ بِإِذْنِ رَبِّهِ وَمَن يَزِغْ مِنْهُمْ عَنْ أَمْرِنَا نُذِقْهُ مِنْ عَذَابِ السَّعِيرِ ☆ يَعْمَلُونَ لَهُ مَا يَشَاءُ مِن مَّحَارِيبَ وَتَمَاثِيلَ وَجِفَانٍ كَالْجَوَابِ وَقُدُورٍ رَّاسِيَاتٍ اعْمَلُوا آلَ دَاوُودَ شُكْراً وَقَلِيلٌ مِّنْ عِبَادِيَ الشَّكُورُ﴾ (سبا:١٠-١٣)

**ఇంకా మేము దావూదుకు మా తరపు నుండి గొప్ప అనుగ్రహాన్ని ప్రసాదించాము. "ఓ పర్వతాల్లారా! అతనితో కలసి స్తోత్రగానం చేయండి" (అని ఆజ్ఞాపించాము). పక్షులను కూడా (ఇదేవిధంగా ఆదేశించాము). ఇంకా అతని కొరకు మేము ఇనుమును మెత్తబరిచాము. "పరిపూర్ణమైన కవచాలను నిర్మించు. వాటి కడియాలను తగువిధంగా అమర్చు. ఇంకా మీరంతా సదాచరణ చేయండి. మీరు చేస్తున్నదంతా నేను గమనిస్తున్నాను" అని ఆదేశించాము. ఇంకా – మేము సులైమాను కోసం గాలిని అదుపులో ఉంచాము. దాని ప్రొద్దుటి (ప్రమాణ) గమ్యం ఒక మాసానికి, సాయంత్రపు గమ్యం కూడా ఒక మాసానికి సమానంగా ఉండేది. ఇంకా – మేము అతని కొరకు కరిగిన రాగి ఊటను ప్రవహింపజేశాము. ఇంకా – అతని ప్రభువు ఆజ్ఞపై జిన్నాతులు అతని చెప్పుచేతల్లో ఉండి, అతని ముందరే పనిచేసేవి. వారిలో ఎవరు మా ఆజ్ఞలను ఉల్లంఘించినా మేము వాడికి జ్వలించే అగ్ని శిక్షను చవిచూపిస్తాము. వారు (ఆ జిన్నులు) అతని కోసం అతను కోరినదల్లా చేసిపెట్టేవారు. ఎత్తయిన కట్టడాలు, ప్రతిమలు, కోనేరుల్లాంటి గంగాళాలు, పొయ్యిలపైనే స్థిరంగా ఉండే దేగిశాలు. "ఓ దావూదు కుటుంబీకులారా! ఇందుకు కృతజ్ఞతగా సదాచరణ చెయ్యండి." నా దాసులలో కృతజ్ఞతాపూర్వకంగా మసలుకునేవారు బహుకొద్దిమంది మాత్రమే. (సబా : 10 –13)**

అందుకే భౌతిక శక్తితో పాటు విశ్వాస శక్తి కూడా ఎంతో అవసరం. ఎందుకంటే వైముఖ్య ధోరణి మూలంగా ఈ శక్తి గనక అధర్మ విశ్వాసాల వైపు ఆకర్షించబడి, భౌతిక శక్తి నుండి వేరుపడిపోతే, ఆ భౌతిక శక్తి పతనానికి, వినాశానికి సాధనంగా పరిణమిస్తుంది. నేడు మనం ధర్మరాహిత్య, అవిశ్వాస దేశాలను చూస్తున్నాం. అవి భౌతికంగా కళ్లు చెదిరే ప్రగతిని సాధించాయి. కాని అవి నిజ విశ్వాస భాగ్యానికి నోచుకోలేకపోయాయి.

నిజ విశ్వాసం పట్ల విముఖతకు పలు కారణాలున్నాయి. వాటిని గురించి తెలుసుకోవటం ఎంతైనా అవసరం. వాటిలో కొన్నింటిని ఇక్కడ పొందుపరుస్తున్నాము–

### (1) నిజ విశ్వాసం గురించి తెలీక పోవటం :

నిజ విశ్వాసాలను గురించి తెలుసుకునే జిజ్ఞాస సన్నగిల్లటం, లేదా వాటిపట్ల తగు శ్రద్ధ కనబరచకపోవటంచేత నిజ విశ్వాసమంటే ఏమిటో తెలియని పరిస్థితి



ఏర్పడుతుంది. ఈ జ్ఞానలేమి విముఖతకు దారితీస్తుంది. కడకు ఒక నవతరం ఉనికిలోనికి వస్తుంది. దానికి నిజ విశ్వాసమంటే ఏమిటో, అది ఏ ఏ విషయాల నుండి వారిస్తుందో బొత్తిగా తెలిసి ఉండదు. తత్ఫలితంగా అది ధర్మాన్ని అధర్మంగా, అధర్మాన్ని ధర్మంగా భావిస్తుంది. హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (رضي الله عنه) చెప్పినట్లు –

**"ఇస్లాంలో అజ్ఞానం యొక్క చెడుగులను పసిగట్టలేని జనులు పుట్టుకు వచ్చినపుడు ఇస్లాం యొక్క ఒక్కొక్క శృంఖలం తెగిపోతుంది."**

### (2) తాతల తండ్రుల వైఖరి కోసం :

దీనికోసం దురభిమానంతో వ్యవహరించటం. తమ పూర్వీకుల వైఖరి అధర్మమైనదని తెలిసి కూడా దానిపైనే పాతుకుపోవటం. వారి వైఖరికి ప్రతికూలంగా ఉన్న ప్రతిదానినీ – అది సత్యబద్ధంగానే ఉన్నప్పటికీ – విడనాడటం! ఆ విషయాన్నే అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَإِذَا قِيلَ لَهُمُ اتَّبِعُوا مَا أَنزَلَ اللَّهُ قَالُوا بَلْ نَتَّبِعُ مَا أَلْفَيْنَا عَلَيْهِ آبَاءَنَا أَوَلَوْ كَانَ آبَاؤُهُمْ لَا يَعْقِلُونَ شَيْئًا وَلَا يَهْتَدُونَ﴾ (البقرة:١٧٠)

**"అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్ని అనుసరించండి" అని వారికి చెప్పినప్పుడల్లా, 'మా తాతలు తండ్రులు అవలంబిస్తూ ఉండగా చూసిన పద్ధతినే మేము పాటిస్తాము' అని వారు సమాధానమిస్తారు. వారి పూర్వీకులు ఒట్టి అవివేకులు, మార్గవిహీనులైనప్పటికీ (వీళ్లు వారినే అనుసరిస్తారన్నమాట!)." (అల్ బఖర : 170)**

### (3) అంధానుసరణ :

సరైన ఆధారాలు, నిదర్శనాలను గురించి తెలుసుకోకుండానే అఖీదా విషయంలో లోకుల మాటలను గుడ్డిగా నమ్మటం. వారు చెప్పినట్లుగా చేయటం! ఉదాహరణకు : ఖుర్ఆన్ హదీసులకు వ్యతిరేకంగా వ్యవహరించిన జహ్మియ, మోతజిల, అషాఅర, సూఫీ తదితర వర్గాలవారు. ఆ వర్గాల వారు తమ పూర్వీకుల్లోని మార్గవిహీన నాయకులను గుడ్డిగా అనుసరించారు. తత్ఫలితంగా వారు మార్గభ్రష్టులైనారు. నిజ విశ్వాసాలకు బహుదూరం వెళ్ళిపోయారు.

### (4) ఔలియాల, మహనీయుల ప్రేమలో అతిశయిల్లటం, వారిని వారి స్థాయి నుండి మరింత పైకి ఎత్తటం

అదెలాగంటే, అల్లాహ్ మాత్రమే చేయగల పనులను ఈ సత్పురుషులు కూడా

చేస్తారని నమ్మి నడుచుకోవటం. ఉదాహరణకు : లాభం చేకూర్చటం, నష్టం నుండి కాపాడటం, అవసరాలను తీర్చటం, దుఆ స్వీకరణ విషయంలో దైవానికి – ఇతర ప్రాణులకు మధ్య వారధిని ఏర్పరచటం, క్రమక్రమంగా ఈ 'వాస్తా' శ్రుతి మించుతుంది. నిజ దైవాన్ని వదలి దైవేతరులను పూజించేదాకా పోతుంది. మొక్కుబడులు తీర్చుకోవటం, ఖుర్బానీ ఇవ్వటం, వారి సమాధుల సాన్నిధ్యం పొందేందుకు యత్నించటం, చివరికి వారినే ప్రార్థించటం – ఇలా సాగుతుంది వ్యవహారం. పూర్వం నూహ్ జాతి ప్రజలు కూడా తమ పూర్వీకుల యెడల సరిగ్గా ఇలాగే వ్యవహరించారు. ఆఖరికి వారిలా అన్నారు:

﴿وَقَالُوا لَا تَذَرُنَّ آلِهَتَكُمْ وَلَا تَذَرُنَّ وَدًّا وَلَا سُوَاعاً وَلَا يَغُوثَ وَيَعُوقَ وَنَسْراً﴾(نوح:٢٣)

**"ఎట్టి పరిస్థితిలోనూ మీ పూజ్య దైవాలను వదలిపెట్టకండి. వద్దను, సువానుగానీ, యగూస్, యవూఖ్ నస్రలనుగానీ వదలకండి."**

**(నూహ్ : 23)**

అంటే నేడు అనేక దేశాలలో సమాధి పూజారులు చెబుతున్నట్లే వారూ చెప్పారన్న మాట!

## (5) దేవుని సూచనలపై యోచించకపోవటం :

ఈ సువిశాల జగతిలో సర్వవ్యాప్తమై ఉన్న అల్లాహ్ సూచనలపై, ఖుర్ఆన్ సూక్తులపై చింతన చేయకపోవటం, అధిభౌతికతత్వానికి, దాని ప్రగతికి ప్రభావితమై తదనుగుణంగానే ఆలోచించటం, ఇదంతా మానవ మేధవల్లనే సాధ్యమయిందని తలపోయటం మనిషిలో అహంభావాన్ని, ఆత్మస్తుతిని పెంచిపోషిస్తుంది. ఉదాహరణకు : పూర్వం ఖారూన్ అదే మాటన్నాడు :

﴿قَالَ إِنَّمَا أُوتِيتُهُ عَلَى عِلْمٍ عِندِيَ﴾(القصص:٧٨)

**"ఇదంతా నాకున్న ప్రజ్ఞాపాటవాల మూలంగానే నాకు వొసగబడింది" అని (ఖారూన్) చెప్పాడు. (అల్ ఖసస్ : 78)**

మనిషి స్వభావం ఎలా ఉంటుందంటే –

﴿هَذَا لِي﴾(حم السجدة:٥٠)

**"అది ఎలాగూ నాకు దక్కవలసిందే (ఆ యోగ్యత నాలో ఉంది గనక)" (హా మీమ్ అస్సజ్దహ్ : 50)**

﴿إِنَّمَا أُوتِيتُهُ عَلَى عِلْمٍ﴾(الزمر:٤٩)



**"ఇది నా ప్రతిభ మూలంగానే నాకు ప్రసాదించబడింది" అని బీరాలు పోతాడు. (అజ్ జుమర్ : 49)**

ఈ రకమయిన భావాలు గలవారు తనకిన్ని తెలివితేటల్ని ప్రసాదించిన ఆ గొప్ప సృష్టికర్త గురించి ఎన్నడూ యోచన చేయలేదు. ఆ పరమ ప్రభువు మానవుడికి అనేక రకాల ప్రత్యేకతలను వొసగటంతో పాటు వాటి ద్వారా లబ్ది పొందే ప్రజ్ఞను, దక్షతను కూడా అతనికి అనుగ్రహించాడు.

ఈ విధంగా సెలవీయబడింది :

﴿وَ اللَّهُ خَلَقَكُمْ وَمَا تَعْمَلُونَ﴾(الصافات:٩٦)

**"మరి (చూడబోతే) మిమ్మల్నీ, మీరు చేసిన వాటిని కూడా సృష్టించినవాడు అల్లాహ్‌యే కదా!" (అస్ సాఫ్ఫాత్ : 96)**

﴿أَوَلَمْ يَنظُرُوا فِي مَلَكُوتِ السَّمَاوَاتِ وَالْأَرْضِ وَمَا خَلَقَ اللَّهُ مِن شَيْءٍ﴾(الاعراف:١٨٥)

**"ఏమిటి, భూమ్యాకాశాల వ్యవస్థను, అల్లాహ్ సృష్టించిన ఇతర వస్తువులను వారు గమనించలేదా?" (అల్ ఆరాఫ్ : 185)**

﴿اللَّهُ الَّذِي خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ وَأَنزَلَ مِنَ السَّمَاءِ مَاءً فَأَخْرَجَ بِهِ مِنَ الثَّمَرَاتِ رِزْقاً لَّكُمْ وَسَخَّرَ لَكُمُ الْفُلْكَ لِتَجْرِيَ فِي الْبَحْرِ بِأَمْرِهِ وَسَخَّرَ لَكُمُ الْأَنْهَارَ☆ وَسَخَّرَ لَكُمُ الشَّمْسَ وَالْقَمَرَ دَائِبَيْنِ وَسَخَّرَ لَكُمُ اللَّيْلَ وَالنَّهَارَ☆ وَآتَاكُم مِّن كُلِّ مَا سَأَلْتُمُوهُ وَإِن تَعُدُّوا نِعْمَتَ اللَّهِ لَا تُحْصُوهَا إِنَّ الْإِنسَانَ لَظَلُومٌ كَفَّارٌ﴾(ابراهيم:٣٢،٣٤)

**"భూమ్యాకాశాలను సృష్టించి, ఆకాశాల నుండి వర్షాన్ని కురిపించి, తద్వారా మీ ఉపాధి (ఆహారం) కోసం పండ్లు ఫలాలను ఉత్పన్నం చేసినవాడే అల్లాహ్. ఆయనే తన ఆజ్ఞతో సముద్రంలో నౌకలు నడవటానికి వాటిని మీకు లోబరిచాడు. ఆయనే నదీనదాలను మీ అధీనంలో ఉంచాడు. ఆయనే నిరంతర ప్రయాణం చేస్తూ పోతున్న సూర్యచంద్రులను మీకు లోబరచాడు. రేయింబవళ్ళను కూడా ఆయన మీ సేవకై కట్టుబడి ఉండేలా చేశాడు. మరి ఆయనే మీరు అడిగిన దానినల్లా మీకు ఇచ్చి ఉన్నాడు. మీరు అల్లాహ్ చేసిన మేళ్ళను లెక్కించదలచినా లెక్కించలేరు. నిశ్చయంగా మానవుడు మహా అన్యాయపరుడు. మేలును మరిచేవాడు." (ఇబ్రాహీమ్: 32 – 34)**

## (6) ఎన్నో కుటుంబాలు సరైన మార్గదర్శకత్వానికి నోచుకోకపోవటం

ఇది కూడా ఒక ముఖ్య కారణమే. ఎందుకంటే నేడు ఎన్నో కుటుంబాలకు సరైన మార్గదర్శకత్వం లభించటం లేదు. ఈ నేపథ్యంలో ప్రవక్త మహాశయుల (ﷺ) వారి ప్రవచనం గమనించదగినది. ఆయన (ﷺ) ఇలా అన్నారు :

"كُلُّ مَوْلُودٍ يُولَدُ عَلَى الْفِطْرَةِ فَأَبَوَاهُ يُهَوِّدَانِهِ أَوْ يُنَصِّرَانِهِ أَوْ يُمَجِّسَانِهِ"
(بخاری:۱۳۵۸، مسلم:۲۶۵۸)

**"పుట్టే ప్రతి శిశువు సహజ ధర్మం (ఇస్లాం)పైనే పుడుతుంది. అయితే దాని తల్లిదండ్రులు దానిని యూదునిగానో, క్రైస్తవునిగానో, మజూసీ (అగ్నిపూజారి) గానో తయారుచేస్తారు." (బుఖారీ 1358, ముస్లిం)**

అందుకే – పిల్లవాని భావజాలాన్ని, ఆలోచనా సరళిని తీర్చిదిద్దటంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమైనది.

## (7) అనేక ముస్లిం రాజ్యాలలోని ప్రసార సాధనాలు, విద్యాశాఖలు తమ గురుతర బాధ్యతను గుర్తించకపోవటం

తత్కారణంగా పాఠ్యాంశాలలో వారు ధార్మిక విషయాలకు తగినంత ప్రాధాన్యత ఇవ్వటం లేదు. లేదా ఈ విషయాన్ని వారు బొత్తిగా ఉపేక్షిస్తున్నారు. చాలావరకు దూరవాణి, దూరదర్శన్ కేంద్రాలు వినాశ సాధనాలుగా, విశృంఖలత్వాన్ని పెంచిపోషించే విభాగాలుగా తయారయ్యాయి. లేదా అవి కేవలం వినోదాన్ని పంచిపెట్టే పరికరాలుగా మాత్రమే మిగిలిపోయాయి. నవతరంలో శీల నిర్మాణం చేసే, దిద్దుబాటు కార్యాన్ని చేపట్టే ధ్యాస ఏ కోశానా కనిపించదు. తత్కారణంగా సమాజంలో పొడసూపే వైముఖ్య ధోరణులను, విచ్చలవిడితనాన్ని అరికట్టే తరుణోపాయాలు కరువైపోతున్నాయి. దైవరాహిత్య, ధర్మరాహిత్య, నీతిరాహిత్య మూకలను నిలువరించే దక్షత గల నవతరం ఉనికిలోకి రాలేకపోతోంది.

## ఈ వైముఖ్య దశ నుండి కాపాడుకునే మార్గమేది?

(1) నిజ విశ్వాస ప్రాప్తికై దైవగ్రంథం, దైవప్రవక్త (ﷺ) సంప్రదాయం వైపునకు మరలాలి. తొలికాలపు సజ్జనులు (సలఫె సాలిహీన్) కూడా తమ నిజ విశ్వాసం కోసం ఈ రెండు మూలాధారాలపైనే ఆధారపడేవారు. పూర్వకాలపు జనుల విశ్వాసాలు ఏ ఏ పద్ధతుల ద్వారా సంస్కరించబడ్డాయో తరువాతి వర్గాల వారి విశ్వాసాలు కూడా ఆ పద్ధతుల ద్వారానే సంస్కరించబడతాయి. దాంతోపాటే మార్గవిహీన జాతుల విశ్వాసాలేమిటో కూడా తెలుసుకోవాలి. అలాగే వారి



సందేహాలు, సంశయాలేమిటో కూడా తెలుసుకోవాలి. తెలుసుకున్నప్పుడే వాటిని నివృత్తిచేయ టానికి, వాటిని గురించి ఇతరులను సావధానపరచటానికి అవకాశముంటుంది.

(2) విద్యార్జనకు సంబంధించిన వివిధ దశలలో తొలికాలపు సజ్జనుల అఖీదా గురించి అవగాహన చేసుకునే తరగతులను ఏర్పాటు చేయాలి. వీలైతే వాటిని పాఠ్యాంశాలలో ఒక భాగంగా చేర్చాలి. ఈ సబ్జెక్టుపై నిశిత దృష్టితో పరీక్షలు నిర్వహించాలి.

(3) పాఠ్యాంశాలలో కేవలం సన్మార్గగాములైన వారి పుస్తకాలనే ఉంచాలి. మార్గవిహీన తకు లోనైన సూఫీ, ముబ్తదియ్యాన్, జహ్మియ, మోతజల, అషాఅరా తదితర వర్గాల పుస్తకాలను  దూరంగా ఉంచాలి. కాకపోతే విషయాన్ని తెలుసుకునే ఉద్దేశంతో ఆ పుస్తకాలను చదవవచ్చు. ఆ పుస్తకాలలో ఉన్న సత్యవిరుద్ధమైన, అధర్మమైన విషయాలను ఖండించాలి. వాటిని గురించి ప్రజలను జాగృతపరచాలి.

(4) సత్యధర్మ బోధకులు సంస్కరణా సంకల్పంతో నడుం బిగించాలి. సలఫె సాలిహీన్ (తొలికాలపు మహనీయుల) అభిమతం గురించి క్షుణ్ణంగా ప్రజలకు విశదీక రించాలి. ఈ విధానం పట్ల విముఖత చూపేవారి మార్గవిహీనతను ఖండించాలి.

రెండవ అధ్యాయం

# తౌహీద్ (దేవుని ఏకత్వం) భావార్థం, దాని రకాలు

## తౌహీద్ నిర్వచనం :

విశ్వసృష్టిలో, దాని నిర్వహణలో అల్లాహ్‌ను విలక్షణమైనవానిగా ఖరారు చేయటం, అన్ని రకాల ఆరాధనలను ఉపాసనలను ఆయన కొరకు ప్రత్యేకించటం, ఆయన తప్ప ఇతరత్రా ఆరాధనలను పరిత్యజించటం, అల్లాహ్‌కు గల అత్యుత్తమమైన పేర్లను, అత్యున్నతమైన గుణాలను ఆయన సొంతమని రుజువు చేయటం, అన్ని రకాల లోపాల నుండి, దోషాల నుండి ఆయన్ని పవిత్రునిగా ఖరారు చేయటం తౌహీద్ (దేవుని ఏకత్వం) అనబడుతుంది. ఈ నిర్వచనంలో దేవుని ఏకత్వం యొక్క మూడు రకాలు అంతర్లీనమై ఉన్నాయి.

## 1. తౌహీదె రుబూబియత్

ఇందులో క్రింద పేర్కొనబడిన అయిదు ప్రకరణాలున్నాయి –

**మొదటి ప్రకరణం** : తౌహీదె రుబూబియత్ భావం : ఇదొక సహజ విషయమని, బహుదైవోపాసకులు సయితం దీనిని అంగీకరిస్తారని చెప్పటం.

**రెండవ ప్రకరణం** : ఖుర్‌ఆన్ హదీసులలో 'రబ్' అనే వచనానికి భావార్థం. రుబూబియత్ విషయంలో మార్గవిహీన జాతుల అభిమతం. దాని ఖండన.

**మూడవ ప్రకరణం** : సమస్త జగతి అల్లాహ్‌కు లోబడి ఉందని చెప్పటం.

**నాల్గవ ప్రకరణం** : సృష్టించటంలో, జీవనోపాధిని సమకూర్చటంలో దేవుని ఏకత్వాన్ని నిరూపించటం. ఈ విషయంలో ఖుర్‌ఆన్ విధానాన్ని వివరిం చటం.

**ఐదవ ప్రకరణం** : తౌహీదె రుబూబియత్ – తౌహీదె ఉలూహియత్‌లు రెండూ పరస్పరం విడదీయరాని అనివార్య అంశాలని విడమరచి చెప్పటం.



మొదటి ప్రకరణం

# తౌహీదె రుబూబియత్ భావం. బహుదైవారాధకులు సహితం దీనిని అంగీకరించారు

## తౌహీద్ (దేవుని ఏకత్వం) :

తౌహీద్ అంటే భావం అల్లాహ్‌ను ప్రభువుగా, పోషకునిగా, సూత్రధారిగా అంగీకరించాలి. ఈ వ్యవహారంలో ఆయన్ని అద్వితీయునిగా నమ్మాలి. ఆరాధనలను, ఉపాసనలను ఆయనకే ప్రత్యేకించుకోవాలి. ఆయన నామాలను, గుణగణాలను (లక్షణాలను) ఆయన కొరకు నిరూపించాలి. ఈ విధంగా తౌహీద్ మూడు రకాలుగా ఉంటుంది.

**ఎ) తౌహీద్ రుబూబియత్**

**బి) తౌహీదె ఉలూహియత్**

**సి) తౌహీదె అస్మా వ సిఫాత్**

వీటిలో ప్రతి ఒక్క దానికీ ఓ ప్రత్యేక భావార్థం ఉంది. వీటిని విడమరచి చెప్పటం చాలా అవసరం. అప్పుడే వీటి మధ్య గల స్పష్టమైన వ్యత్యాసం అవగతమవుతుంది.

## తౌహీదె రుబూబియత్ నిర్వచనం

విశ్వ సృష్టి, దాని నిర్వహణలో అల్లాహ్‌ను ఒకే ఒక్కడుగా, సాటిలేనివానిగా విశ్వసించటం. సమస్త సృష్టిరాశులను సృష్టించినవాడు ఆయన ఒక్కడేనని నిర్ద్వంద్వంగా నమ్మటం తౌహీదె రుబూబియత్ అనబడుతుంది.

ఉదాహరణకు : విశ్వప్రభువు ఇలా సెలవిచ్చాడు :

﴿اللَّهُ خَالِقُ كُلِّ شَيْءٍ﴾ (الزمر:٦٢)

**"అన్ని వస్తువులనూ సృష్టించినవాడు అల్లాహ్‌యే."(అజ్‌జుమర్: 62)**

మనుషులకూ, జంతుజాలానికి ఆహారాన్ని ప్రసాదించేవాడు అల్లాహ్‌యే.

﴿وَمَا مِن دَابَّةٍ فِي الْأَرْضِ إِلَّا عَلَى اللَّهِ رِزْقُهَا﴾ (هود:٦)

**"భూమిపై సంచరించే ప్రాణులన్నింటికీ ఆహారాన్ని (జీవనోపాధిని) సమకూర్చే బాధ్యత అల్లాహ్‌దే." (హూద్ : 6)**

దీంతోపాటు సమస్త లోకాలకు అధిపతి అల్లాహ్‌యేనని, యావత్‌ జగతిలోని వ్యవహారాలన్నింటికీ ఆయనే నిర్వహణకర్త అనీ, రాజ్యాధికారాన్ని ప్రసాదించేవాడు, అధికారాన్ని లాక్కొనేవాడు కూడా ఆయనేనని గౌరవాన్ని ప్రసాదించేవాడు, పరాభవం పాల్జేసేవాడు కూడా ఆయనేనని, ఆయన సర్వ సమర్థుడని, ఆయనే జీవన్మరణాల ప్రదాత అని కూడా మనం విశ్వసించాలి.

﴿قُلِ اللَّهُمَّ مَالِكَ الْمُلْكِ تُؤْتِي الْمُلْكَ مَن تَشَاءُ وَتَنزِعُ الْمُلْكَ مِمَّن تَشَاءُ وَتُعِزُّ مَن تَشَاءُ وَتُذِلُّ مَن تَشَاءُ بِيَدِكَ الْخَيْرُ إِنَّكَ عَلَىٰ كُلِّ شَيْءٍ قَدِيرٌ ☆ تُولِجُ اللَّيْلَ فِي النَّهَارِ وَتُولِجُ النَّهَارَ فِي اللَّيْلِ وَتُخْرِجُ الْحَيَّ مِنَ الْمَيِّتِ وَتُخْرِجُ الْمَيِّتَ مِنَ الْحَيِّ وَتَرْزُقُ مَن تَشَاءُ بِغَيْرِ حِسَابٍ﴾(آل عمران:٢٦،٢٧)

**(ఓ ముహమ్మద్‌!) ఈ విధంగా పలుకు: "ఓ అల్లాహ్‌! విశ్వ రాజ్యాధిపతీ! నీవు కోరిన వారికి రాజ్యాధికారం ఇస్తావు. నీవు కోరినవారి నుండి రాజ్యాన్ని లాక్కుంటావు. నీవు కోరిన వారికి గౌరవమొసగుతావు. నీవు కోరినవారిని పరాభవానికి గురిచేస్తావు. సమస్త మేళ్లూ నీ చేతిలోనే ఉన్నాయి. నిశ్చయంగా నీవు ప్రతి వస్తువుపైన అధికారం కలవాడవు. నువ్వే రాత్రిని పగటిలోనికి ప్రవేశింపజేస్తావు. నువ్వే పగటిని రాత్రిలోనికి జొప్పిస్తావు. నువ్వే నిర్జీవమైన వాటి నుండి జీవమున్న వాటిని తీస్తున్నావు. నువ్వే జీవమున్న వాటి నుండి నిర్జీవమైన వాటిని వెలికి తీస్తున్నావు. ఇంకా నీవు కోరినవారికి లెక్కలేనంత ఉపాధిని ఇస్తావు." (అలి ఇమ్రాన్‌ : 26, 27)**

విశ్వ సామ్రాజ్యాధికారంలో, ఆయన ప్రభుత్వ నిర్వహణలో వేరొకరిని భాగస్వామిగా, సహాయకునిగా కల్పించటాన్ని పరమ పవిత్రుడైన అల్లాహ్‌ త్రోసిపుచ్చాడు. సృష్టించటంలో, ఉపాధిని సమకూర్చటంలో తనకు సాటి కల్పించటాన్ని కూడా ఆయన ఖండించాడు. ఈ విధంగా సెలవీయబడింది :

﴿هَٰذَا خَلْقُ اللَّهِ فَأَرُونِي مَاذَا خَلَقَ الَّذِينَ مِن دُونِهِ﴾(لقمان:١١)

**"ఇదీ అల్లాహ్‌ సృష్టి! ఇప్పుడు ఆయన తప్ప వేరితరులు ఏం సృష్టించారో మీరు నాకు చూపించండి." (లుఖ్మాన్‌ : 11)**

ఈ విధంగా కూడా సెలవీయబడింది :

﴿أَمَّنْ هَٰذَا الَّذِي يَرْزُقُكُمْ إِنْ أَمْسَكَ رِزْقَهُ﴾(الملك:٢١)

**"ఒకవేళ ఆయన గనక తన ఉపాధిని నిలిపివేస్తే, మరి మీకు ఉపాధిని**



**ఇచ్చేవాడెవడో చెప్పండి!?" (అల్‌ ముల్క్‌ : 21)**

ఈ విధంగా అల్లాహ్‌ పోషకత్వంలో, నిర్వహణలో, పరిపాలనలో సమస్త జీవరాశులపై తనకు గల తిరుగులేని అధికారాన్ని చాటిచెబుతున్నాడు. అందుకే ఇలా సెలవిచ్చాడు:

﴿الْحَمْدُ لِلَّهِ رَبِّ الْعَالَمِينَ﴾(الفاتحة:١)

**"ప్రశంసలు, పొగడ్తలన్నీ అల్లాహ్‌కు మాత్రమే శోభిస్తాయి. ఆయన సమస్త లోకాలకు పోషకుడు." (అల్‌ ఫాతిహా : 1)**

వేరొకచోట ఈ విధంగా ఉపదేశించబడింది :

﴿إِنَّ رَبَّكُمُ اللَّهُ الَّذِي خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ فِي سِتَّةِ أَيَّامٍ ثُمَّ اسْتَوَىٰ عَلَى الْعَرْشِ يُغْشِي اللَّيْلَ النَّهَارَ يَطْلُبُهُ حَثِيثًا وَالشَّمْسَ وَالْقَمَرَ وَالنُّجُومَ مُسَخَّرَاتٍ بِأَمْرِهِ أَلَا لَهُ الْخَلْقُ وَالْأَمْرُ تَبَارَكَ اللَّهُ رَبُّ الْعَالَمِينَ﴾(الاعراف:٥٤)

**"నిస్సందేహంగా అల్లాహ్‌యే మీ ప్రభువు. ఆయన ఆకాశాలను, భూమిని ఆరు రోజులలో సృష్టించాడు. ఆ తరువాత సింహాసనం (అర్ష్‌)పై ఆసీనుడయ్యాడు. ఆయన రాత్రిని పగటిపై కప్పివేస్తాడు. అది దానిని వెంబడిస్తూ వేగంగా వస్తుంది. ఇంకా – ఆయన సూర్యచంద్రులను, నక్షత్రాలను తన ఆజ్ఞకు కట్టుబడి ఉండేవిధంగా సృష్టించాడు. వినండి! సృష్టి ప్రక్రియ ఆయన స్వంతం. ఆజ్ఞాపన ఆయన సొత్తు. సకల లోకాల ప్రభువైన అల్లాహ్‌ అపారమైన శుభాలు కలవాడు." (అల్‌ ఆరాఫ్‌ : 54)**

అల్లాహ్‌ సమస్త ప్రాణుల నైజంలో తమ ప్రభువు యొక్క పాలనను, పోషణను అంగీకరించే గుణాన్ని పొందుపరిచాడు. ఆఖరికి ఆరాధనలో అల్లాహ్‌కు భాగస్వాముల్ని కల్పించే ముష్రిక్కులు సయితం అల్లాహ్‌ పోషణాధికారాన్ని అంగీకరించేవారు. ఈ విషయంలో అల్లాహ్‌ అద్వితీయుడని ఒప్పుకునేవారు. ఉదాహరణకు : ఈ క్రింది సూక్తులలో అల్లాహ్‌ ఈ విధంగా సెలవిచ్చాడు :

﴿قُلْ مَن رَّبُّ السَّمَاوَاتِ السَّبْعِ وَرَبُّ الْعَرْشِ الْعَظِيمِ ☆ سَيَقُولُونَ لِلَّهِ قُلْ أَفَلَا تَتَّقُونَ ☆ قُلْ مَن بِيَدِهِ مَلَكُوتُ كُلِّ شَيْءٍ وَهُوَ يُجِيرُ وَلَا يُجَارُ عَلَيْهِ إِن كُنتُمْ تَعْلَمُونَ ☆ سَيَقُولُونَ لِلَّهِ قُلْ فَأَنَّىٰ تُسْحَرُونَ﴾(المؤمنون:٨٦،٨٩)

**సప్తాకాశాలకు, మహోన్నతమయిన పీఠము (అర్ష్‌)నకు అధిపతి ఎవరు?" అని వారిని అడుగు. 'అల్లాహ్‌యే' అని వారు సమాధానమిస్తారు. "మరలాంటప్పుడు మీరెందుకు భయపడరు?" అని వారిని**

**(నిలదీసి) అడుగు. సమస్త విషయాల సార్వభౌమత్వం ఎవరి చేతుల్లో ఉందో, శరణు ఇచ్చేవాడెవడో, ఎవరికి వ్యతిరేకంగా ఏ శరణూ లభించదో – ఆయనెవరో మీకు తెలిసి ఉంటే చెప్పండి? అని (ఓ ప్రవక్తా!) వారిని అడుగు. 'అల్లాహ్‌యే కదా!?' అని వారంటారు. "మరైతే మీరు ఎటువైపు నుండి మంత్రించబడుతున్నారు?" అని వారిని ప్రశ్నించు. (అల్ మోమినూన్ : 86 – 89)**

ఆదం సంతతిలోని ఏ ప్రముఖ వర్గం కూడా ఈ రకమయిన తౌహీద్‌ను (ఏకత్వాన్ని) కాదనలేదు. పైగా ఈ రకమయిన ఏకత్వాన్ని అంగీకరించే గుణం వారి అంతరాళాన్ని పెనవేసుకుని ఉంది. ఉదాహరణకు : ఈ సందర్భంగా దైవప్రవక్తలు చెప్పిన దానిని ఉదాహరిస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿قَالَتْ رُسُلُهُمْ أَفِي اللَّهِ شَكٌّ فَاطِرِ السَّمَاوَاتِ وَالْأَرْضِ﴾(ابراهيم:١٠)

**"ఏమిటి, భూమ్యాకాశాల నిర్మాత అయిన అల్లాహ్‌పైనే మీకు అనుమానం ఉందా?" అని వారి ప్రవక్తలు వారితో అన్నారు.**

**(ఇబ్రాహీమ్ : 10)**

ప్రపంచ చరిత్రలో విశ్వప్రభువు ఉనికిని తిరస్కరించిన సుప్రసిద్ధ వ్యక్తులలో అగ్రగణ్యుడు ఫిర్ఔన్. కాని వాడు సయితం తన హృదయాంతరాళాల్లో అల్లాహ్ యందు నమ్మకం కలిగి ఉండేవాడు. ఉదాహరణకు దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం) అతనితో చెప్పినట్లు –

﴿لَقَدْ عَلِمْتَ مَا أَنزَلَ هَـٰؤُلَاءِ إِلَّا رَبُّ السَّمَاوَاتِ وَالْأَرْضِ بَصَائِرَ﴾(الاسراء:١٠٢)

**"(ఓ ఫిర్ఔన్!) గుణపాఠంతో కూడుకున్న ఈ సూచనలను భూమ్యాకాశాల ప్రభువు తప్ప మరొకరెవరూ అవతరింపజేయలేదన్న విషయం నీకూ తెలుసు." (బనీ ఇస్రాయీల్ : 102)**

ఫిర్ఔన్ గురించీ, అతని జాతి వారి గురించి విశ్వ ప్రభువు ఏమన్నాడో చూడండి:

﴿وَجَحَدُوا بِهَا وَاسْتَيْقَنَتْهَا أَنفُسُهُمْ ظُلْمًا وَعُلُوًّا﴾(النمل:١٤)

**"నిజానికి వారి మనసులు (సత్యాన్ని) నమ్మినప్పటికీ అన్యాయం, అహంకారంతో వారు దానిని త్రోసిపుచ్చారు." (అన్ నమ్ల్ : 14)**

నేటి నాస్తికులు, కమ్యూనిస్టుల వ్యవహారమూ ఇలాంటిదే. తమ అహం కోసం వారు పైకి దేవుని ఉనికిని త్రోసిపుచ్చినప్పటికీ వారి అంతరంగంలో దైవభావన పాతుకుని ఉంది. కానవచ్చే ప్రతి వస్తువు వెనుక ఓ కర్త ఉన్నాడని, ప్రతి ప్రాణినీ సృష్టించిన సృష్టికర్త ఉన్నాడని, ప్రతి ప్రభావపూరితమైన దాని వెనుక ప్రభావం వేసే వాడొకడు



ఉండటం అనివార్యం అన్న సంగతిని వారూ ఒప్పుకుంటారు. ఈ నేపథ్యంలో దేవుడేమంటున్నాడో చూడండి –

﴿أَمْ خُلِقُوا مِنْ غَيْرِ شَيْءٍ أَمْ هُمُ الْخَالِقُونَ ☆أَمْ خَلَقُوا السَّمَاوَاتِ وَالْأَرْضَ بَل لَّا يُوقِنُونَ﴾ (الطور:٣٥،٣٦)

**"ఏమిటీ, వీరు (పుట్టించేవాడు) ఎవరూ లేకుండానే వారంతట వారే పుట్టుకువచ్చారా? లేక వారే స్వయంగా సృష్టికర్తలా? ఏమిటి, భూమ్యాకాశాలను వాళ్ళే సృష్టించారా? అసలు వాళ్ళు నమ్మేరకం కాదు." (అత్ తూర్ : 35, 36)**

ఊర్ధ్వలోకం, పాతాళ లోకంలోని ఒక్కొక్క భాగంపై పరిశీలన చేసినపుడు బోధపడేదేమిటంటే ఈ విశ్వమండలంలోని ఒక్కొక్క రేణువు తనను సృష్టించిన స్వామి ఉనికిని గురించి సాక్ష్యమిస్తోంది. కనుక హేతువు పరంగానూ, స్వాభావికంగానూ సృష్టికర్తను నిరాకరించటమంటే విజ్ఞానాన్ని నిరాకరించటమే. ఆ రెండింటి మధ్య ఎలాంటి వ్యత్యాసం లేదు (ఎందుకంటే నిజ జ్ఞానం సృష్టికర్త ఉనికిని సత్యమని ధ్రువీకరిస్తుంది). నేడు కమ్యూనిజం ప్రభువు ఉనికిని నిరాకరిస్తుందంటే అది కేవలం అహంకారంతో చేసే నిరాకరణే. తన ఇగో కోసం నిజమైన భావాలు భావనలపై తనంతట తానుగా విధించుకున్న ఆంక్షల ఫలితమే ఇది. ఎవరయినా సత్యాన్ని కాదనటంలో ఈ స్థితికి చేరాడంటే అతను తన బుద్ధిని విస్మరించాడన్నమాట! తనను ఆటపట్టించే అవకాశం జనులకు కల్పించాడన్న మాట!!

రెండవ ప్రకరణం

# ఖుర్‌ఆన్ హదీసులలో 'రబ్' (ప్రభువు, పోషకుడు) అనే పరిభాషకు గల భావార్థం. ఈ విషయంలో మార్గభ్రష్టతకు లోనైన జాతుల భావాలు, భావనలు.

## 1. ఖుర్‌ఆన్ సున్నతులలో 'రబ్' భావం

'రబ్' అనేది అసలు ''رَبَّ يَرُبُّ'' 'రబ్బ యరుబ్బు' అనే ధాతువు నుండి వచ్చింది. దీని అర్థం ఏదైనా దానిని పెంచి, పోషించి ఒక స్థితి నుండి పరిపక్వ స్థితికి చేర్చటం అన్నమాట! దీన్నుండే ''رَبَّهُ ، وَرَبًّا ، وَ رَبَّبَهُ'' రబ్బహు, వ రబ్బాహు, వ రబ్బబహు కూడా ఉన్నాయి. కాబట్టి 'రబ్' అనే పదం వాస్తవానికి మూలపదం. ఈ రకంగా 'అల్-రబ్' అనే పదం కేవలం అల్లాహ్‌కే వర్తిస్తుంది. ఎందుకంటే జగతిలో ఉన్న సమస్త వస్తువుల బాగోగులను ఆయన ఎరిగినవాడు. పరమార్థం తెలిసినవాడు. అల్లాహ్ యొక్క ఈ ఉపదేశంలో తెలుపబడినట్లు

''رَبِّ الْعَالَمِينَ''

**"ఆయన సమస్త లోకాలకు ప్రభువు, పోషకుడు."** (అల్ ఫాతిహా : 1)

﴿رَبُّكُمْ وَرَبُّ آبَائِكُمُ الْأَوَّلِينَ﴾ (الشعراء:٢٦)

**"ఆయన మీకూ ప్రభువే. మీ పూర్వీకులైన మీ తాతముత్తాతలకు కూడా ప్రభువే." (అష్ షుఅరా : 26)**

అల్లాహ్ తప్ప వేరితరుల కొరకు 'రబ్' అనే పదం ప్రయోగించబడితే, అది గౌరవసూచకంగా మాత్రమే ప్రయోగించబడుతుందని గ్రహించాలి. ఉదాహరణకు : రబ్బిద్దార్ (ఇంటి యజమాని), రబ్బిల్ ఫర్స్ (గుర్రపు యజమాని). దైవప్రవక్త యూసుఫ్ (عليه السلام) సంఘటనను వివరిస్తున్నప్పుడు ప్రయోగించబడిన 'రబ్' పదం కూడా ఈ కోవకు చెందినదే. ఉదాహరణకు :

﴿اذْكُرْنِي عِندَ رَبِّكَ فَأَنسَاهُ الشَّيْطَانُ ذِكْرَ رَبِّهِ﴾ (يوسف:٤٢)

**"నీ చక్రవర్తి (రబ్) ముందు నా గురించి కాస్త ప్రస్తావించు." కాని చక్రవర్తి (రబ్) ముందు ప్రస్తావన తీసుకురాకుండా షైతాన్ అతన్ని మరుపునకు లోను చేశాడు." (యూసుఫ్ : 42)**



ఈ సూరాలోనే వేరొకచోట ఇలా అనబడింది :

﴿قَالَ ارْجِعْ إِلَى رَبِّكَ﴾ (يوسف:٥٠)

**"నువ్వు నీ రాజు (రబ్) దగ్గరకు తిరిగివెళ్ళు" అని ఆయన (యూసుఫ్) అన్నారు. (యూసుఫ్ : 50)**

కారాగారంలోని తోటి ఖైదీలు కన్న కలల భావార్థాన్ని వివరిస్తూ దైవప్రవక్త యూసుఫ్ (అలైహిస్సలాం) ఇలా అంటారు :

﴿أَمَّا أَحَدُكُمَا فَيَسْقِي رَبَّهُ خَمْرًا﴾ (يوسف:٤١)

**"మీరిద్దరిలో ఒకడు తన రాజుగారికి (రబ్‌కు) సారాయి త్రాగించేందుకు నియమించబడతాడు." (యూసుఫ్ : 41)**

తప్పిపోయిన ఒంటె గురించి చెబుతూ అంతిమ దైవప్రవక్త (సఅసం) ఇలా అన్నారు:

''حَتَّىٰ يَجِدَهَا رَبُّهَا'' (بخاری ومسلم)

**"ఎట్టకేలకు దాని యజమాని (రబ్) దానిని కనుగొన్నప్పుడు .... "**

**(బుఖారీ, ముస్లిం)**

దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే అల్లాహ్ కొరకు 'రబ్' (ప్రభువు, పోషకుడు, స్వామి, అధిపతి, యజమాని, నిర్వాహకుడు) అనే పదం పర్యాయపదంగా, అదనపు పదంగా కూడా ప్రయోగించబడుతుంది. పరిజ్ఞానం కొరకు కూడా ప్రయోగించబడుతుంది. అందుకే అల్లాహ్ కొరకు ''الرب'' **'అల్ రబ్'** లేదా ''رَبِّ الْعَالَمِينَ'' **'రబ్బిల్ ఆలమీన్'** లేదా **'రబ్బిన్నాస్'** లాంటి పదాలన్నీ సరైనవే. కాని దైవేతరుల కొరకు **'రబ్'** అనే పదం కేవలం గౌరవార్థం మాత్రమే చెప్పబడుతుంది. ఉదాహరణకు : رب الدار **రబ్బిద్దార్** (ఇంటి యజమాని), رب المنزل **రబ్బిల్ మంజిల్** (గృహ యజమాని), رب الابل **రబ్బిల్ ఇబ్లి** (ఒంటె యజమాని).

ఇక ''رَبِّ الْعَالَمِينَ'' **'రబ్బిల్ ఆలమీన్'** (లోకేశ్వరుడు, సకల లోకాలకు ప్రభువు) అనే పదం యొక్క అర్థం బహు విస్తృతమైనది. దీని అర్థం ఇది : అల్లాహ్ తన దాసులందరి సృష్టికర్త, యజమాని. ఆయన వారిపై తన దయానుగ్రహాలను కురిపించాడు. తన ప్రవక్తలను పంపి, తన గ్రంథాలను అవతరింపజేసి వారి జీవితాలను తీర్చిదిద్దాడు. ఇంకా ఆయన వారి ఆచరణల ప్రకారం బహుమానం ఇస్తాడు, శిక్షిస్తాడు. అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) ఇలా అంటున్నారు : అల్లాహ్‌లోని ఈ **రుబూబియత్** (పోషించే, సంరక్షించే) గుణం వాంఛించేదేమిటంటే ఆయన ఫలానా పని చేయమని దాసులను ఆదేశించాలి. ఫలానా పని నుండి వారించాలి. సజ్జనులకు వారి సత్కర్మల బహుమానం

వొసగాలి. దుర్జనులను వారి దుష్కర్మల మూలంగా శిక్షించాలి. (మదారిజుస్సాలికీన్)

ఇదే 'రుబూబియత్' వాస్తవికత.

## 2. మార్గవిహీన జాతుల దృష్టిలో 'రబ్'

అల్లాహ్ ప్రాణులన్నింటినీ సహజత్వంపైనే సృష్టించాడు. అంటే వారి నైజంలో దేవుని ఏకత్వం (తౌహీద్) అంతర్లీనమై ఉంది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿فَأَقِمْ وَجْهَكَ لِلدِّينِ حَنِيفاً فِطْرَةَ اللَّهِ الَّتِي فَطَرَ النَّاسَ عَلَيْهَا لَا تَبْدِيلَ لِخَلْقِ اللَّهِ﴾ (الروم:٣٠)

**"కనుక నీవు ఏకాగ్రతతో నీ ముఖాన్ని (అల్లాహ్) ధర్మంపై నిలుపు. అల్లాహ్ మానవులను ఏ స్వభావంపై పుట్టించాడో దానిపైనే ఉండు. అల్లాహ్ సృష్టిలో ఎలాంటి మార్పు ఉండదు." (అర్ రూమ్ : 30)**

ఇంకా ఈ విధంగా సెలవిచ్చాడు :

﴿وَإِذْ أَخَذَ رَبُّكَ مِن بَنِي آدَمَ مِن ظُهُورِهِمْ ذُرِّيَّتَهُمْ وَأَشْهَدَهُمْ عَلَى أَنفُسِهِمْ أَلَسْتُ بِرَبِّكُمْ قَالُوا بَلَى شَهِدْنَا﴾ (الأعراف:١٧٢)

**"నీ ప్రభువు ఆదం సంతతి వీపుల నుండి వారి సంతానాన్ని తీసి, స్వయంగా వారినే వారికి సాక్షులుగా పెట్టి, 'నేను మీ ప్రభువును కానా?' అని అడిగినపుడు, 'ఎందుకు కావు? (నువ్వే మా ప్రభువువి). ఈ విషయానికి మేమంతా సాక్షులుగా ఉన్నాం' అని వారన్నారు.**

**(అల్ ఆరాఫ్ : 172)**

కనుక బోధపడేదేమంటే అల్లాహ్ తమ ప్రభువు అనే విషయాన్ని అంగీకరించటం, ఆయన వైపునకు మరలటం, ఆయన ధర్మం వైపు ఏకోన్ముఖులవటం సహజ విషయం. మానవ నైజం వాంఛించేది, మానవ సమాజం కాంక్షించేది ఇదే. కాగా; షిర్క్ (బహుదైవారాధన) ఓ కొత్త పోకడ. అసహజ విషయం. అది మానవ నైజంతో సమరసం చెందని వికృత చేష్ట. మహనీయ ముహమ్మద్ (ﷺ) వారేమన్నారో చూడండి :

"كُلُّ مَوْلُودٍ يُولَدُ عَلَى الْفِطْرَةِ فَأَبَوَاهُ يُهَوِّدَانِهِ أَوْ يُنَصِّرَانِهِ أَوْ يُمَجِّسَانِهِ" (بخاری:١٣٥٨، مسلم:٢٦٥٨)

**"పుట్టే ప్రతి పిల్లవాడు సహజత్వం (ఇస్లాం) పైనే పుడతాడు. తరువాత అతని తల్లిదండ్రులు అతన్ని యూదునిగానో, క్రైస్తవునిగానో, మజూసీ (అగ్ని పూజారి)గానో మార్చివేస్తారు." (బుఖారీ, ముస్లిమ్ 2658)**

మనిషిని అతని నైజంపైన గనక వదలిపెడితే, నిశ్చయంగా అతను ఏకదైవారాధన



వైపు మొగ్గుతాడు. దైవప్రవక్తల పిలుపుపై సకారాత్మకంగా స్పందిస్తాడు. తన మార్గదర్శనం కొరకు అవతరింపజేయబడిన గ్రంథాలను చిత్తశుద్ధితో అధ్యయనం చేస్తాడు. జగతిలో ఉన్న దైవసూచనలపై చింతన చేస్తాడు. కాని పసితనంలో అతనికి లభించిన పరిసరాలు, నాస్తిక భావాలతో కూడుకున్న శిక్షణ ఆ పిల్లవాని భావాలను పెడత్రోవ పట్టిస్తాయి. తత్ఫలితంగా మార్గభ్రష్టతకు లోనై అతను తన తల్లిదండ్రుల అడుగులకు మడుగులొత్తుతాడు.

హదీసె ఖుద్సీలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"خَلَقْتُ عِبَادِي حُنَفَاءَ، فَاجْتَالَتْهُمُ الشَّيَاطِينُ" (مسلم، مسند احمد)

**"నేను నా దాసులను ఏకేశ్వరోపాసకులుగానే పుట్టించాను. కాని పైశాచిక శక్తులు వారిని పెడత్రోవ పట్టించాయి."**

**(ముస్లిం, ముస్నదె అహ్మద్)**

అంటే అవి వారికి విగ్రహారాధనను నూరిపోశాయి. అల్లాహ్‌ను వదలి మిథ్యా దైవాలను ఆశ్రయించమని ప్రేరేపించాయి. తత్కారణంగా ప్రజలు మార్గభ్రష్టతకు గురిఅయ్యారు. విభేదాలలో పడిపోయారు. ప్రతి ఒక్కడూ తనకంటూ ఒక 'ప్రభువు'ను చేసుకుని అతని దాస్యబంధనంలో చిక్కుకుపోయాడు. ఎందుకంటే వారు నిజప్రభువుని విడనాడటం వల్ల మిథ్యా దైవాల పెత్తనం వారిపై విధించబడింది. అది వారి పాలిట ఒక పరీక్షగా పరిణమించింది. ప్రభువైన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿فَذَلِكُمُ اللَّهُ رَبُّكُمُ الْحَقُّ فَمَاذَا بَعْدَ الْحَقِّ إِلَّا الضَّلَالُ﴾ (يونس:٣٢)

**"ఆ అల్లాహ్‌యే మీ ప్రభువు. సత్యం తరువాత మార్గభ్రష్టత తప్ప మరేముంటుంది?" (యూనుస్ : 32)**

మార్గభ్రష్టతకు ఒక హద్దూ పద్దూ ఉండదు. నిజ ప్రభువును విడనాడిన ప్రతి వ్యక్తినీ అది ఆక్టోపస్‌లా అల్లుకుపోతుంది. ఆ విషయాన్నే అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿أَأَرْبَابٌ مُّتَفَرِّقُونَ خَيْرٌ أَمِ اللَّهُ الْوَاحِدُ الْقَهَّارُ☆مَا تَعْبُدُونَ مِن دُونِهِ إِلَّا أَسْمَاءً سَمَّيْتُمُوهَا أَنتُمْ وَآبَاؤُكُم مَّا أَنزَلَ اللَّهُ بِهَا مِن سُلْطَانٍ﴾ (يوسف:٣٩،٤٠)

**"అనేకమంది విభిన్న ప్రభువులు మేలా? లేక శక్తిశాలి అయిన ఒక్క అల్లాహ్ మేలా? ఆయనను వదలి మీరు పూజిస్తున్నవి మీరూ, మీ తాతముత్తాతలూ స్వయంగా కల్పించుకున్న కొన్ని పేర్లు తప్ప మరేమీ కావు. వాటికి సంబంధించి అల్లాహ్ ఏ ప్రమాణాన్నీ అవతరింప జేయలేదు." (యూసుఫ్ : 39, 40)**

జగతిలో తమ ఆరాధ్యదైవాలు కొన్ని అధికారాలు కలిగి ఉన్నాయని కొంతమంది ముష్రిక్కులు తలపోస్తున్నారు. ఆ మిథ్యా దైవాల దాస్యం చేయటంలో షైతాన్ వారితో

చెలగాటమాడాడు. వాస్తవానికి షైతాన్ ప్రతి వర్గం వారినీ వారి తెలివితేటలు, అభిరుచుల ప్రకారం ఆట ఆడిస్తాడు. ఒక వర్గాన్ని వాడు మృతుల పట్ల భక్తీ శ్రద్ధలతో పూజించటంలో కార్యనిమగ్నుల్ని చేశాడు. వారు తమ పూర్వీకులను పోలిన విగ్రహాలను, ప్రతిమలను చేసుకున్నారు – ఈ విషయంలో వారు నూహ్ జాతి వారిని అనుసరించారు. మరొక వర్గం వారు నక్షత్రాలను పోలిన విగ్రహాలను చేసుకున్నారు. ఈ విశ్వ వ్యవస్థను నడిపించటంలో తారాబలానికి ప్రముఖ పాత్ర ఉందనేది వారి విశ్వాసం. ఇందు నిమిత్తం వారు ప్రత్యేక ఆలయాలు నిర్మించారు. ధర్మకర్తలను నియమించారు.

నక్షత్ర పూజలో కూడా వారి మధ్య భేదాభిప్రాయాలున్నాయి. వారిలో కొందరు సూర్యుణ్ణి పూజిస్తారు. కొందరు చంద్రుణ్ణి సేవిస్తారు. మరికొందరు తారలను ఆరాధిస్తారు. వారు వాటికి కొన్ని ప్రత్యేకమైన పేర్లను కల్పించి, వాటి విగ్రహాలను నిర్మించుకున్నారు. ఇంకొందరు అగ్ని పూజారులుగా మారారు. కొందరు గోపూజ మొదలెట్టగా, కొందరేమో దేవతల పూజ చేయసాగారు. కొందరు చెట్టుపుట్టల పూజ ప్రారంభించగా, ఇంకొందరు రాళ్లు రప్పలను, సమాధులను పూజించ నారంభించారు. ఈ విధమైన పూజా పునస్కారాలు ఎందుకు ప్రబలిపోయాయంటే, ఆయా వస్తువులలో రుబూబియత్ (పాలించే, పోషించే, రక్షించే) ప్రత్యేకతలు ఉన్నాయని ప్రజలు నమ్మటమే.

అందుకే ఈ విగ్రహాలు కొన్ని అగోచర విషయాలకు ప్రాతినిధ్యం వహిస్తాయని కొందరు తలపోశారు. అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ ఇలా అంటున్నారు :

“నిజానికి ఈ విగ్రహాలు ఏవో అగోచర దేవతల రూపంలో నిర్మించబడ్డాయి. విగ్రహాలు ఆ దేవీదేవతల స్థానంలో ప్రతినిధులుగా, ప్రత్యామ్నాయంగా ఉంటాయన్న ఆలోచనతోనే వారు ఈ విగ్రహాలు రూపొందించారు. లేకపోతే విజ్ఞుడైన ఏ వ్యక్తి కూడా తన స్వహస్తాలతో చెక్కిన రాతి బొమ్మను, కొయ్య బొమ్మను తన ఆరాధ్య దైవంగా నమ్మి నడుచుకోడు.” (ఇఘాసతుల్ లహ్ఫాన్ : 2/220)

అలాగే ప్రాచీన కాలపు, ఆధునిక కాలపు సమాధి పూజారులు ఈ మృతులు తమ కొరకు సిఫారసు చేస్తాయని, తమ అవసరాలు తీర్చటంలో దైవ సన్నిధిలో వారధిగా ఉంటారని భావించారు. వారిలా అంటారు :

﴿مَا نَعْبُدُهُمْ إِلَّا لِيُقَرِّبُونَا إِلَى اللَّهِ زُلْفَى﴾ (الزمر:٣)

**“ఈ పెద్దలు మమ్మల్ని అల్లాహ్ సాన్నిధ్యానికి చేర్చటంలో తోడ్పడతారని భావించి మాత్రమే మేము వీళ్లను ఆరాధిస్తున్నాము.”**

**(అజ్ జుమర్ : 3)**

﴿وَيَعْبُدُونَ مِن دُونِ اللَّهِ مَا لَا يَضُرُّهُمْ وَلَا يَنفَعُهُمْ وَيَقُولُونَ هَٰؤُلَاءِ شُفَعَاؤُنَا عِندَ اللَّهِ﴾ (يونس:١٨)

**“వారు అల్లాహ్‌ను వదలి తమకు నష్టాన్నిగానీ, లాభాన్నిగానీ**



**చేకూర్చలేని వాటిని పూజిస్తున్నారు. పైగా, ‘అవి అల్లాహ్ సమక్షంలో మీకు సిఫారసు చేస్తాయ’ని అంటున్నారు.” (యూనుస్ : 18)**

ఇదేవిధంగా కొంతమంది అరేబియా ముష్రిక్కులు, క్రైస్తవులు కూడా తమ ఆరాధ్య దైవాలను అల్లాహ్ సంతానంగా తలపోశారు. అందుకే అరబ్బు ముష్రిక్కులు దైవదూతలను దేవుని కుమార్తెలుగా భావించి ఆరాధించారు. క్రైస్తవులు హజ్రత్ మసీహ్ – ఏసుక్రీస్తు (عليه السلام)ని దేవుని కుమారునిగా నమ్మి సేవించారు.

## 3. ఈ మిథ్యా భావాల ఖండన

విశ్వప్రభువు అయిన అల్లాహ్ ఈ క్రింది ఆధారాల ద్వారా ఇలాంటి మిథ్యా భావాలను, మూఢ నమ్మకాలను ఖండించాడు.

(అ) విగ్రహారాధకుల చర్యలను ఖండిస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿أَفَرَأَيْتُمُ اللَّاتَ وَالْعُزَّى ☆ وَمَنَاةَ الثَّالِثَةَ الْأُخْرَى﴾ (النجم:١٩،٢٠)

**“ఏమిటి, మీరు లాతు, ఉజ్జాలను గాని చూశారా? మూడవది, చివరిది అయిన మనాతును (కూడా చూశారా?)” (అన్ నజ్మ్ : 19, 20)**

ఈ సూక్తికి భావార్థంగా ఇమామ్ ఖుర్తుబీ (رحمه الله) ఇలా అన్నారు : ఏమిటి, ఆ దేవతలు ఏదన్నా లాభంగానీ, నష్టంగానీ కలిగిస్తుండగా మీరు చూశారా? ఆ కారణంగానే వారు అల్లాహ్‌కు భాగస్వాములై కూర్చున్నారా? దైవప్రవక్త (ﷺ), ఆయన ప్రియసహచరులు వాటిని (ఆ విగ్రహాలను) కూల్చివేస్తున్నప్పుడు అవిగాని ప్రతిఘటించగలిగాయా?

అల్లాహ్ ఇంకా ఈ విధంగా సెలవిచ్చాడు :

﴿وَاتْلُ عَلَيْهِمْ نَبَأَ إِبْرَاهِيمَ ☆ إِذْ قَالَ لِأَبِيهِ وَقَوْمِهِ مَا تَعْبُدُونَ ☆ قَالُوا نَعْبُدُ أَصْنَامًا فَنَظَلُّ لَهَا عَاكِفِينَ ☆ قَالَ هَلْ يَسْمَعُونَكُمْ إِذْ تَدْعُونَ ☆ أَوْ يَنفَعُونَكُمْ أَوْ يَضُرُّونَ ☆ قَالُوا بَلْ وَجَدْنَا آبَاءَنَا كَذَٰلِكَ يَفْعَلُونَ﴾ (الشعراء:٦٩-٧٤)

**“వారికి ఇబ్రాహీమ్ సమాచారాన్ని కూడా చదివి వినిపించు. ‘మీరెవరిని పూజిస్తున్నారు?’ అని అతను తన తండ్రిని, తన జాతి వారిని నిలదీసి అడిగినపుడు, ‘మేము విగ్రహాలను పూజిస్తున్నాము. సదా వారి సేవకే అంకితమై ఉన్నాము’ అని వారు సమాధానమిచ్చారు. ఆయన వారిని ఇలా అడిగాడు : ‘మీరు వాటిని పిలిచినప్పుడు అవి మీ పిలుపును వింటాయా? పోనీ మీకు లాభంగానీ, నష్టంగానీ కలిగిస్తాయా?’ దానికి వారిలా చెప్పారు : ‘(అదంతా మాకు అనవసరం)**

**మా తాతముత్తాతలు ఈ విధంగా చేస్తూ ఉండగా మేము చూశా మంతే." (అష్ షుఅరా : 69 – 74)**

అంటే, ఆ విగ్రహాలు తమ మొరలను ఆలకించటంగానీ, తమకు లాభనష్టాలు చేకూర్చటంగానీ చేయలేవని వారు పరోక్షంగా ఒప్పుకున్నారు. అయితే వారు తమ తాతముత్తాతల అడుగుజాడల్లో నడుస్తూ విగ్రహారాధన చేసేవారు. అంధానుసరణకు ఆధారం మిథ్య తప్ప మరొకటి కాదు.

(ఆ) సూర్యచంద్రులను, నక్షత్రాదులను పూజించే వారి చర్యను ఖండిస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَالشَّمْسَ وَالْقَمَرَ وَالنُّجُومَ مُسَخَّرَاتٍ بِأَمْرِهِ﴾(الأعراف:٥٤)

**"ఆయన సూర్యచంద్రులను, నక్షత్రాలను తన ఆజ్ఞకు కట్టుబడి ఉండే విధంగా సృష్టించాడు." (అల్ ఆరాఫ్ : 54)**

ఇంకా ఈ విధంగా సెలవీయబడింది :

﴿وَمِنْ آيَاتِهِ اللَّيْلُ وَالنَّهَارُ وَالشَّمْسُ وَالْقَمَرُ لَا تَسْجُدُوا لِلشَّمْسِ وَلَا لِلْقَمَرِ وَاسْجُدُوا لِلَّهِ الَّذِي خَلَقَهُنَّ إِن كُنتُمْ إِيَّاهُ تَعْبُدُونَ﴾(فصلت:٣٧)

**"రేయింబవళ్ళూ, సూర్యచంద్రులు కూడా ఆయన (శక్తి) సూచనల లోనివే. మీరు సూర్యునికి గానీ, చంద్రునికి గానీ సాష్టాంగ ప్రణామం (సజ్దా) చేయకండి. నిజంగా మీరు అల్లాహ్ దాస్యం చేసేవారే అయితే వీటన్నింటినీ సృష్టించిన అల్లాహ్ ముందు సాష్టాంగపడండి." (ఫుస్సిలత్ : 37)**

(ఇ) ఎవరయితే దైవదూతలను, ఏసుక్రీస్తు (عليه السلام)ను అల్లాహ్ సంతానంగా భావించారో, ఆరాధించారో, వారి చేష్టను ఖండిస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿مَا اتَّخَذَ اللَّهُ مِن وَلَدٍ﴾(المؤمنون:٩١)

**"అల్లాహ్ ఎవరినీ కొడుకు (సంతానం)గా చేసుకోలేదు."(మోమినూన్ :91)**

﴿أَنَّى يَكُونُ لَهُ وَلَدٌ وَلَمْ تَكُن لَّهُ صَاحِبَةٌ﴾(الأنعام:١٠١)

**"అల్లాహ్‌కు అసలు భార్యే లేనపుడు ఆయనకు సంతానం ఎలా కలుగుతుంది?" (అల్ అన్ ఆమ్ : 101)**

﴿لَمْ يَلِدْ وَلَمْ يُولَدْ☆وَلَمْ يَكُن لَّهُ كُفُوًا أَحَدٌ﴾(الاخلاص:٣،٤)

**"ఆయన ఎవరినీ కనలేదు. ఆయన కూడా ఎవరికీ పుట్టినవాడు కాదు. ఆయనకు సరిసమానుడు (పోల్చదగినవాడు) ఎవడూ లేడు." (అల్ ఇఖ్లాస్ : 3, 4)**



**మూడవ ప్రకరణం**

# లోకమంతా దైవాజ్ఞకు కట్టుబడి ఉంది

ఈ జగతి అంతా – భూమ్యాకాశాలు, నక్షత్రాలు, గ్రహాలు, వృక్షజాలం, జంతు జాలం, కొండలు, నదీనదాలు, సముద్రాలు, ఎడారి ప్రదేశాలు, దైవదూతలు, జిన్నాతులు, మనుషులు – సమస్తం అల్లాహ్ ఆజ్ఞకు లోబడి ఉన్నాయి. అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు:

﴿وَلَهُ أَسْلَمَ مَن فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ طَوْعًا وَكَرْهًا﴾(آل عمران:٨٣)

**"ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్నవారంతా – తమకు ఇష్టమున్నా లేకపోయినా – అల్లాహ్ విధేయతకు కట్టుబడి ఉన్నారు."**

**(ఆలి ఇమ్రాన్ : 83)**

﴿بَل لَّهُ مَا فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ كُلٌّ لَّهُ قَانِتُونَ﴾(البقرة:١١٦)

**'భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయనదే. అవన్నీ ఆయన ఆజ్ఞకు తలఒగ్గి ఉన్నాయి." (అల్ బఖర : 116)**

ఇంకా ఇలా సెలవిచ్చాడు :

﴿وَلِلَّهِ يَسْجُدُ مَا فِي السَّمَاوَاتِ وَمَا فِي الْأَرْضِ مِن دَابَّةٍ وَالْمَلَائِكَةُ وَهُمْ لَا يَسْتَكْبِرُونَ﴾(النحل:٤٩)

**"నిశ్చయంగా ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న సమస్త ప్రాణులు, దూతలు – అందరూ అల్లాహ్ సన్నిధిలో సాష్టాంగపడుతున్నారు – ఏమాత్రం అహంకారం చూపటం లేదు. (అన్ నహ్ల్ : 49)**

ఈ విధంగా కూడా సెలవీయబడింది :

﴿أَلَمْ تَرَ أَنَّ اللَّهَ يَسْجُدُ لَهُ مَن فِي السَّمَاوَاتِ وَمَن فِي الْأَرْضِ وَالشَّمْسُ وَالْقَمَرُ وَالنُّجُومُ وَالْجِبَالُ وَالشَّجَرُ وَالدَّوَابُّ وَكَثِيرٌ مِّنَ النَّاسِ﴾(الحج:١٨)

**"ఆకాశాలలో ఉన్నవారు, భూలోకవాసులు, సూర్యచంద్రులూ, నక్షత్రాలు, పర్వతాలు, వృక్షాలు, జంతువులు, చాలామంది మనుషులు కూడా అల్లాహ్ ముందు మోకరిల్లడాన్ని నువ్వు గమనించటం లేదా?"**

**(అల్ హజ్జ్ : 18)**

﴿وَلِلَّهِ يَسْجُدُ مَن فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ طَوْعًا وَكَرْهًا وَظِلَالُهُم بِالْغُدُوِّ وَالْآصَالِ﴾(الرعد:١٥)

**"ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న సృష్టితాలన్నీ–తమకు ఇష్టమున్నా, లేకపోయినా – అల్లాహ్‌కు సాష్టాంగపడుతున్నాయి. వాటి నీడలు సయితం ఉదయం, సాయంత్రం (ఆయనకు సజ్దా చేస్తున్నాయి)." (అర్రాద్ : 15)**

ఈ విధంగా ఈ సమస్త జగతి, అందులో ఉన్నవన్నీ అల్లాహ్‌కు విధేయత కనబరుస్తున్నాయి. అవన్నీ ఆయన సార్వభౌమత్వానికి లోబడి వ్యవహరిస్తున్నాయి. విశ్వవ్యవస్థ అంతా ఆయన తలచుకున్నట్లుగా, ఆయన ఆజ్ఞకు కట్టుబడి నడుస్తోంది. విశ్వ వ్యవస్థలోని ఏ వస్తువు కూడా దైవాజ్ఞను ఎదిరించడానికి సాహసించదు. ప్రతిదీ ఒక కట్టుదిట్టమయిన వ్యవస్థకు లోబడి తన బాధ్యతలను నిర్వర్తిస్తోంది. తన కర్తవ్యాన్ని నెరవేరుస్తోంది. వాటిలో ప్రతి ఒక్కటీ తన సృష్టికర్తను అన్ని రకాల లోపాలకు అతీతంగా – దౌర్బల్యం లేనివానిగా ఖరారు చేస్తోంది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

تُسَبِّحُ لَهُ السَّمَاوَاتُ السَّبْعُ وَالْأَرْضُ وَمَن فِيهِنَّ وَإِن مِّن شَيْءٍ إِلَّا يُسَبِّحُ بِحَمْدِهِ وَلَٰكِن لَّا تَفْقَهُونَ تَسْبِيحَهُمْ ﴾(الاسراء:٤٤)

**"సప్తాకాశాలు, భూమి, వాటిలో ఉన్నవన్నీ ఆయన పవిత్రతనే కొనియాడుతున్నాయి. ఆయన స్తోత్రంతో పాటు ఆయన పవిత్రతను కొనియాడని వస్తువంటూ ఏదీ లేదు. అయితే మీరు వాటి స్తుతిని గ్రహించలేరు." (అల్ ఇస్రా : 44)**

కాబట్టి ఈ సృష్టితాలన్నీ – అవి మౌనంగా ఉండేవయినా, మాట్లాడేవైనా, సజీవులైనా, నిర్జీవులైనా – అన్నీ అల్లాహ్‌కు విధేయులై ఉన్నాయి. తిరుగులేని ఆయన ఆజ్ఞను శిరసావహిస్తూ ఉన్నాయి. అవి మనసా, వాచా, కర్మణా అల్లాహ్ పవిత్రతను కొనియాడుతూ, ఆయన్ని దోషరహితునిగా ప్రకటిస్తున్నాయి. విజ్ఞుడైన వ్యక్తి ఈ సృష్టితాలపై చింతన చేసినపుడు అతనికి స్పష్టంగా అవగతమవుతుంది : ఇవన్నీ సత్యబద్ధంగా పుట్టించబడ్డాయి. సత్యం కోసమే పుట్టించబడ్డాయి. ఇవన్నీ తమ సృష్టికర్తకు లోబడి ఉన్నాయి. అవి తమ నిర్వాహణకర్త ఆజ్ఞను జవదాటలేవు. ఆయనకు వ్యతిరేకంగా వ్యూహాన్ని రచించటంగానీ, తిరుగుబాటు చేయటంగానీ చేయలేవు – ఈ విధంగా సృష్టితాలన్నీ సహజంగానే తమ సృష్టికర్తను అంగీకరిస్తున్నాయి.

షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (رحمه الله) ఇలా అంటున్నారు : "కొన్ని కారణాల దృష్ట్యా మనుషులు అల్లాహ్ ఆజ్ఞలకు తలఒగ్గి ఉన్నారు. ఆయన ఎదుట తల ఒగ్గటం, ఆత్మ సమర్పణ చేసుకోవటం తప్ప వారికి మార్గాంతరం లేదు."

- తాము అల్లాహ్‌పై ఆధారపడినవారమని, తమకు అల్లాహ్ అవసరం ఉందని వారికి తెలుసు.
- తమపై దేవుని ఏ ఇచ్ఛ, విధివ్రాత నెలకొని ఉన్నదో దాని ముందు ఎట్టి



పరిస్థితిలోనూ తలవంచక తప్పదని వారికి తెలుసు.
- కష్టాలు, విపత్కర పరిస్థితులలో అల్లాహ్‌ను మొరపెట్టుకోవటం తప్ప వారికి వేరే గత్యంతరం లేదు.

విశ్వాసి (మోమిన్) మనస్ఫూర్తిగా దైవాజ్ఞలకు తల ఒగ్గుతాడు. అలాగే అల్లాహ్ తన జాతకంలో ఏ కష్టాలు కడగండ్లను వ్రాసిపెట్టినా అతను దైవాజ్ఞానుసారం – సంతోషపూర్వకంగా – సహిస్తాడు. ఆత్మ పరిశీలన చేసుకుంటాడు. మొత్తానికి అతను సర్వకాల సర్వావస్థల్లో హృదయపూర్వకంగా అల్లాహ్ విధేయుడుగా రాణిస్తాడు. (మజ్మూఅ అల్ ఫతావా – 1/45). అలాగే ఒక అవిశ్వాసి (కాఫిర్) కూడా తన ప్రభువు యొక్క తిరుగులేని ఆజ్ఞ ముందు నిస్సహాయుడుగా ఉన్నాడు. ఈ జగతి అంతా సాష్టాంగ ప్రణామం చేస్తోంది అంటే భావం లోబడి ఉందనేదే. ప్రతి వస్తువు యొక్క సాష్టాంగ ప్రణామం (సజ్దా) దాని స్థితిని బట్టి ఉంటుంది. తన ప్రభువు పట్ల ఆత్మ సమర్పణా భావం అందులో అంతర్లీనమై ఉంటుంది. ఏ వస్తువు దేవుని పవిత్రతను కొనియాడినా అది వాస్తవికతతో కూడుకుని ఉంటుంది."

﴿أَفَغَيْرَ دِينِ اللَّهِ يَبْغُونَ وَلَهُ أَسْلَمَ مَن فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ طَوْعًا وَكَرْهًا وَإِلَيْهِ يُرْجَعُونَ﴾(آل عمران:٨٣)

**"ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న వారంతా – తమకు ఇష్టమున్నా లేకపోయినా అల్లాహ్ విధేయతకు కట్టుబడి ఉండగా, వీరు అల్లాహ్ ధర్మాన్ని కాకుండా మరో ధర్మాన్ని అన్వేషిస్తున్నారా? ఎట్టకేలకు వారంతా ఆయన వైపునకే మరలించబడతారు."**

**(ఆలి ఇమ్రాన్ : 83)**

ఈ దైవసూక్తి గురించి షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (رحمه الله) ఇలా వ్యాఖ్యానించారు:

నిఖిల జగతి ఇష్టమున్నా లేకున్నా – రెండు పరిస్థితుల్లోనూ తన ఆజ్ఞకు కట్టుబడి ఉందని పవిత్రుడగు అల్లాహ్ చెబుతున్నాడు. అందువల్ల సృష్టితాలన్నీ సంపూర్ణంగా ఆయనకు దాసులే. ఆయన సేవకులే. ఎవరు అవునన్నా కాదన్నా – వారంతా ఆయన ప్రణాళికకు కట్టుబడినవారే. ఏ ప్రాణీ ఆయన ఇచ్ఛను ఎదిరించి ఆయన విధించిన విధివ్రాత నుండి బయటపడటం సంభవం కాదు. ఆయన అనుజ్ఞ, ఆయన సద్బుద్ధి లేకుండా ఏదైనా నష్టం నుండి తప్పించుకునే శక్తిగాని, ఏదైనా లాభాన్ని పొందే శక్తిగానీ ఎవరికీ లేదు. ఆయన సకల లోకాలకు ప్రభువు. అధిపతి, యజమాని. వాటిపై ఆయన కోరిన విధంగా అధికారం చెలాయించగలడు. ఎందుకంటే వాటన్నింటినీ సృష్టించినవాడు ఆయనే గనక. వాటన్నింటి రూపకర్త కూడా ఆయనే. ఆయన తప్ప మిగిలినవన్నీ ఆయన పోషణలో ఉన్నవే. అవన్నీ సృష్టితాలే. అవన్నీ అవసరం గలవే. ఆధారపడి ఉన్నవే. నిస్సహాయమైనవే. అల్లాహ్ ఒక్కడే అక్కరలేనివాడు. సర్వశక్తుడు, తిరుగులేనివాడు. పుట్టించేవాడు, నిర్మాత, రూపకల్పన చేసేవాడు." (మజ్మూఅ అల్ ఫతావా : 10/20).

## నాల్గవ ప్రకరణం

# సృష్టికర్త ఉనికి, ఆయన ఏకత్వ నిరూపణలో దివ్య ఖుర్ఆన్ విధానం

సృష్టికర్త ఉనికిని, ఆయన ఏకత్వాన్ని రుజువు చేసే విషయంలో ఖుర్ఆన్ అనుసరించిన విధానం బుద్ధీ వివేకాల కనుగుణంగా ఉంది. ఈ విషయంలో ఖుర్ఆన్ ప్రమాణబద్ధమైన ఆధారాలను, నిదర్శనాలను సమర్పిస్తోంది. వాటిని చూసినపుడు మానవ బుద్ధికి సంతృప్తి కలుగుతుంది. వ్యతిరేకి సయితం వీటిని అంగీకరించక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. వాటిలో కొన్ని నిదర్శనాలు ఇవి :

## 1. ప్రతి నూతన ఆవిష్కరణ వెనుక ఒక ఆవిష్కర్త ఉంటాడనేది సుస్పష్టమే

ఇదెంతో స్వాభావికమైన విషయం. ఆఖరికి పసివాళ్లు సయితం దీనిని గ్రహిస్తారు. ఒక పసిపిల్లవాణ్ణి ఎవరయినా కొడితే, తనను కొట్టిన వారిని అతను చూడలేకపోయినప్పటికీ "నన్నెవరు కొట్టారు?" అని ప్రశ్నిస్తాడు. నిన్నెవరూ కొట్టలేదమ్మా! అని అంటే అతని బుద్ధి దాన్ని అంగీకరించదు. ఎవరూ కొట్టకుండానే దెబ్బ ఎలా తగులుతుంది? అని అతని బుద్ధి నిలదీస్తుంది. ఫలానా వ్యక్తి నిన్ను కొట్టాడని అంటే, ఆ వ్యక్తిని దండించేవరకూ అతను ఏడుపు మానడు. తనను కొట్టిన వారికి దెబ్బలు పడినపుడే అతనికి ఊరట లభిస్తుంది. ఈ విషయాన్ని నిరూపించటానికి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿أَمْ خُلِقُوا مِنْ غَيْرِ شَيْءٍ أَمْ هُمُ الْخَالِقُونَ﴾ (الطور:٣٥)

**"ఏమిటి, వీరు (పుట్టించేవాడు) ఎవడూ లేకుండానే వారంతట వారే పుట్టుకువచ్చారా? లేక స్వయంగా వారే సృష్టికర్తలా?"**

**(అత్ తూర్ : 35)**

ఇదొక చిన్న ఉదాహరణ. తీవ్రంగా ఆలోచించకుండానే అర్థమయ్యే విషయమిది! దీనిని నిరాకరించటం అసాధ్యం. 'పుట్టించేవాడెవడూ లేకుండానే వీరు తమంతట తామే పుట్టుకువచ్చారా?' లేక వారే సృష్టికర్తలా?' – ఇవి రెండూ అసత్యాలే. కాబట్టి దీనిద్వారా స్పష్టమయ్యేదేమిటంటే వారికంటూ ఒక సృష్టికర్త ఉన్నాడు. ఆయనే వారిని ఉనికిలోకి తీసుకువచ్చాడు. ఆయనే అల్లాహ్. ఆయన తప్ప వేరొక సృష్టికర్త లేడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿هَذَا خَلْقُ اللَّهِ فَأَرُونِي مَاذَا خَلَقَ الَّذِينَ مِن دُونِهِ﴾ (لقمان:١١)

**"ఇదీ అల్లాహ్ సృష్టి. ఇప్పుడు ఆయన తప్ప వేరితరులు ఏం సృష్టించారో మీరు నాకు చూపించండి." (లుఖ్మాన్ : 11)**

﴿أَرُونِي مَاذَا خَلَقُوا مِنَ الْأَرْضِ﴾ (الأحقاف:٤)



**"వారు భూమండలంలో ఏ భాగాన్ని సృష్టించారో కాస్త నాకు చూపుతారా?" (అల్ అహ్ఖాఫ్ : 4)**

﴿أَمْ جَعَلُوا لِلَّهِ شُرَكَاءَ خَلَقُوا كَخَلْقِهِ فَتَشَابَهَ الْخَلْقُ عَلَيْهِمْ قُلِ اللَّهُ خَالِقُ كُلِّ شَيْءٍ وَهُوَ الْوَاحِدُ الْقَهَّارُ﴾ (الرعد:١٦)

**పోనీ, వారి దృష్టిలో 'సృష్టి' అనేది సందేహాస్పదం కావటానికి, వారు అల్లాహ్‌కు భాగస్వాములుగా చేర్చినవారు గాని అల్లాహ్ మాదిరిగా దేన్నయినా సృష్టించారా? అని కూడా వారిని అడుగు. 'అల్లాహ్‌యే అన్నింటినీ సృష్టించినవాడు. ఆయన ఒక్కడే. ఆయన సర్వాధికుడు, తిరుగులేనివాడు' అని వారికి స్పష్టంగా చెప్పు. (అర్ రాద్ : 16)**

﴿إِنَّ الَّذِينَ تَدْعُونَ مِن دُونِ اللَّهِ لَن يَخْلُقُوا ذُبَاباً وَلَوِ اجْتَمَعُوا لَهُ﴾ (الحج:٧٣)

**"బాగా వినండి! అల్లాహ్‌ను వదలి మీరు ఎవరెవరినయితే మొరపెట్టు కుంటున్నారో, వారంతా ఏకమైనా – ఒక్క ఈగను కూడా సృష్టించ లేరు." (అల్ హజ్జ్ : 73)**

﴿وَالَّذِينَ يَدْعُونَ مِن دُونِ اللَّهِ لَا يَخْلُقُونَ شَيْئاً وَهُمْ يُخْلَقُونَ﴾ (النحل:٢٠)

**అల్లాహ్‌ను వదలి వాళ్లు పిలుస్తున్నవారు ఏ వస్తువునూ సృష్టించలేరు. పైగా వారు స్వయంగా సృష్టించబడినవారు." (అన్ నహ్ల్ : 20)**

﴿أَفَمَن يَخْلُقُ كَمَن لَّا يَخْلُقُ أَفَلَا تَذَكَّرُونَ﴾ (النحل:١٧)

**"ఏమిటి, (సర్వాన్నీ) సృష్టించేవాడూ – ఏమీ సృష్టించలేనివాడు ఇద్దరూ ఒకటేనా? మీరు బొత్తిగా ఆలోచించరా?" (అన్ నహ్ల్ : 17)**

ఇన్నిసార్లు సవాలు విసిరినప్పటికీ, 'ఇదిగో, నేను ఇది సృష్టించాన'ని ఎవరూ ముందుకు రాలేకపోయారు. కనుక దీనిని బట్టి నిర్ధారితమయిందేమిటంటే అల్లాహ్ ఒక్కడే సృష్టికర్త. ఆయనకు ఎవరూ సాటిలేరు.

## 2. విశ్వ వ్యవహారాల నిర్వహణ, పటిష్ఠత

ఈ విశ్వ వ్యవస్థ అంతా సాఫీగా సాగుతుందంటే, సుస్థిరంగా ఉందంటే దాని నిర్వహణకర్త, ప్రభువు, దైవం ఒక్కడవటం వల్లనే ఇది సుసాధ్యమవుతోంది. ఈ వ్యవహారంలో ఆయనకు భాగస్వాములు గానీ, ప్రత్యర్థులుగానీ ఉండివుంటే పరిస్థితి తద్భిన్నంగా ఉండేది.

విశ్వప్రభువు ఇలా సెలవిచ్చాడు :

﴿مَا اتَّخَذَ اللَّهُ مِن وَلَدٍ وَمَا كَانَ مَعَهُ مِنْ إِلَهٍ إِذاً لَّذَهَبَ كُلُّ إِلَهٍ بِمَا خَلَقَ وَلَعَلَا بَعْضُهُمْ عَلَى بَعْضٍ﴾ (المؤمنون:٩١)

**“అల్లాహ్ ఎవరినీ కొడుకుగా చేసుకోలేదు. ఆయనతో పాటు ఇంకొక ఆరాధ్య దేవుడు కూడా (భాగస్వామిగా) లేడు. ఒకవేళ అలాంటిదేదైనా ఉంటే ప్రతి దేవుడు తాను సృష్టించిన సృష్టితాలను తీసుకుని వేరై పోయేవాడు.” (అల్ మోమినూన్ : 91)**

నిజ దైవం అయినవాడు సృష్టికర్తతో పాటు, కార్యనిర్వాహకుడై ఉండాలి. ఒకవేళ విశ్వ సార్వభౌమత్వంలో అల్లాహ్‌తో పాటు వేరొక దేవుడు కూడా భాగస్వామిగా ఉండి ఉంటే సృష్టి ప్రక్రియలో, దాని నిర్వహణలో అతని ప్రమేయం కూడా ఉండేది. అట్టి పరిస్థితిలో అతను తనతో పాటు మరో దేవుని భాగస్వామ్యాన్ని ఇష్టపడేవాడు కాదు. పైగా అతనితో ఘర్షణ పడి, అతనిని ఓడించి సమస్త సార్వభౌమత్వంపై, దైవత్వంపై తన గుత్తాధిపత్యం చెలాయించేందుకు యత్నించేవాడు. ఒకవేళ ఇదంతా చేయగలిగే శక్తి తన వద్ద లేదనుకుంటే ప్రత్యర్థితో విభేదించి సామ్రాజ్యంలోని తన భాగాన్ని తీసుకుని వేరే కూటమి పెట్టేవాడు. (ప్రపంచ రాజ్యాలలో జరిగేది కూడా ఇదే కదా!) అట్టి పరిస్థితిలో విశ్వ వ్యవస్థలో విభజన అనివార్యమయ్యేది. కాబట్టి క్రింద పేర్కొనబడిన మూడు విషయాలలో ఏదో ఒకటి సంభవించటం తప్పనిసరి.

1. వారిలో ఒకడు మరొకడిని ఓడించి తానే సమస్త రాజ్యాధికారానికి అధిపతి అయిపోతాడు.
2. లేదా వారిలో ప్రతి ఒక్కడూ తన రాజ్యభాగాన్ని, తన సృష్టితాలను తీసుకుని వేరైపోయేవాడు. అదే గనక జరిగితే రాజరికం, సృష్టితాలు విభజితం అయిపోయేవి.
3. లేదా వారిరువురూ వేరొకరి అధికారానికి లోబడి వ్యవహరించేవారు. అట్టి పరిస్థితిలో అతనే వారిపై సిసలయిన దైవం అవుతాడు. మిగిలిన వారంతా ఆ దైవానికి దాసులుగా ఉంటారు.

ఈ మూడవ పరిస్థితే నిజమయింది. ఎందుకంటే విశ్వంలో ఎలాంటి విభజనగానీ, చిందరవందర స్థితిగానీ లేదు. దాని వ్యూహ రచయిత, నిర్వాహకుడు ఒకే ఒక్కడని ఈ విషయం రుజువు చేస్తోంది. ఆయనకు ప్రతిద్వంది అంటూ ఎవడూ లేదు. దాని యజమాని ఒక్కడే. ఆయనకు భాగస్వామిగానీ, సమ ఉజ్జీగాని ఎవడూ లేడు.

## 3. సృష్టితాలను వారి బాధ్యతల నెరవేర్పుకై కట్టుబడి ఉండేలా చేయటం

ఈ జగతిలో తన బాధ్యతా నిర్వహణను ఎదిరించే ప్రాణులేవీ లేవు. ఫిరౌన్ వేసిన ప్రశ్నకు సమాధానంగా దైవప్రవక్త మూసా (عليه السلام) ఇదే ఆధారాన్ని సమర్పించాడు :

﴿قَالَ فَمَن رَّبُّكُمَا يَا مُوسَى﴾ (طه:٤٩)

**“ఇంతకీ మీరిద్దరి ప్రభువు ఎవడయ్యా ఓ మూసా?” అని (ఫిరౌన్) అడిగాడు. (తాహా : 49)**



హజ్రత్ మూసా (అలైహిస్సలాం) అతని ప్రశ్నకు సమాధానమిస్తూ ఇలా అన్నారు:

﴿قَالَ رَبُّنَا الَّذِي أَعْطَى كُلَّ شَيْءٍ خَلْقَهُ ثُمَّ هَدَى﴾ (طه:٥٠)

**“ప్రతి వస్తువుకూ దాని ప్రత్యేక రూపురేఖలను ఇచ్చి, తర్వాత దానికి మార్గం చూపినవాడే మా ప్రభువు.” (తాహా : 50)**

అంటే, మా ప్రభువు ప్రాణులన్నింటినీ సృష్టించాడు. ప్రతి ప్రాణినీ సముచితమైన రీతిలో పుట్టించాడు. వాటిని తగువిధంగా తీర్చిదిద్దాడు. వాటికి అనువైన రూపురేఖలను ప్రసాదించాడు. వాటి అవసరాలను బట్టి పరిమాణాన్ని ఇచ్చాడు. పిదప అవి పుట్టించబడిన లక్ష్యం కొరకు మార్గదర్శకత్వం వహించాడు. ఈ మార్గదర్శకత్వం దైవం తరఫున జరిగినది. ఈ సంపూర్ణ మార్గదర్శకత్వాన్ని వివిధ రకాల ప్రాణులలో వీక్షించవచ్చు. కనుక ప్రతి జీవి తాను దేనికోసం పుట్టించబడిందో దాని ప్రాప్తికై సాధన చేయటాన్ని మనం గమనించవచ్చు – అది లాభార్జన విషయంలోగాని, నష్టాల నుండి బయటపడటంలో గాని. ఆఖరికి అల్లాహ్ జంతువులకు సయితం ఈ చైతన్యాన్ని ప్రసాదించాడు. అవి నిత్యం తమకు లాభం చేకూర్చే పనులు చేస్తాయి. నష్టాల నుండి తమను కాపాడుకుంటూ ఉంటాయి. ఇదేవిధంగా అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿الَّذِي أَحْسَنَ كُلَّ شَيْءٍ خَلَقَهُ﴾ (السجدة:٧)

**“ఆయన ఏ వస్తువును చేసినా చాలా చక్కగా చేశాడు.”**

**(అస్ సజ్‌దహ్ : 7)**

ఆయన సృష్టి అపురూపమైనది. ఆయన జీవులకు సుందర స్వరూపాన్ని ఇచ్చాడు. అంతకంటే అందమైన ఆకృతిని గురించి మనిషి మేధ ఊహించనయినా లేదు. అంతేకాదు, వారికి వారి పరమార్థాలను తెలుసుకునే మార్గదర్శనం చేశాడు. ఆయనే నిజ ప్రభువు. కాబట్టి ఆయన్ని తిరస్కరించటమంటే విశ్వంలోని అతి పెద్ద వస్తువును త్రోసిపుచ్చటమే. ఇది హఠం, మంకుతనం తప్ప మరేమీ కాదు. ఇంకా చెప్పాలంటే, అదొక పచ్చి అబద్ధం. నిజప్రభువు మనిషికి లోకంలో అవసరమైన ప్రతిదీ ఇచ్చాడు. వాటిద్వారా లబ్ది పొందే పద్ధతి కూడా నేర్పాడు. నిశ్చయంగా ఆ స్వామి ప్రతి కోవకు చెందిన వాటిని తగురీతిలో మలిచాడు. ప్రతి పెంటి–పోతుల కలయికకు, వాటి లైంగిక వాంఛల పరిపూర్తికి ప్రకృతిపరమైన ఏర్పాట్లు చేశాడు. వాటిమధ్య ప్రేమానురాగాలను సృజించాడు. ఆయా జీవరాసుల లైంగిక ఉద్రేకాలనుబట్టి, వాటి అవసరాలను బట్టి వాటి మధ్య సాంఘిక జీవనానికి, బాంధవ్యాలకు తగు రీతిలో ఏర్పాట్లు చేశాడు. శరీరంలోని ప్రతి అవయవాన్ని ఉపయోగకరమయిన విధంగా అమర్చాడు. ఇవన్నీ ఒక విషయానికి నిదర్శనంగా ఉన్నాయి – అదేమిటంటే వాటన్నింటి ప్రభువు అల్లాహ్‌యే. కనుక ఆయన మాత్రమే దాస్యానికి, ఆరాధనలకు అర్హుడు. వేరెవరూ దీనికి తగినవారు కారు.

وَفِي كُلِّ شَيْءٍ لَهُ آيَةٌ تَدُلُّ عَلَى أَنَّهُ وَاحِدٌ

వీటన్నింటి సృష్టికర్త ఒక్కడేనని కూడా ఈ వస్తువులన్నీ చాటి చెబుతున్నాయి.

అల్లాహ్ తన సృష్టితాల కొరకు – తన పోషకత్వంలోని విలక్షణమును నిరూపించటంలోని ప్రధాన ఉద్దేశం ఏమిటంటే, తద్వారా అద్వితీయుడైన అల్లాహ్ తన దాస్యం (ఆరాధన) తప్పనిసరి అని చెప్పదలిచాడు. దీన్నే తౌహీదె ఉలూహియత్ (దైవత్వంలో ఏకత్వం) అంటారు. ఒకవేళ ఎవరయినా తౌహీదె రుబూబియత్‌ను అంగీకరించి, తౌహీదె ఉలూహియత్‌ను అంగీకరించకపోతే లేదా దానిని సరైన రీతిలో పాటించకపోతే అలాంటి వ్యక్తి ముస్లింగాని, ఏకేశ్వరోపాసిగాని కాజాలడు. పైగా అతను తిరస్కారి అవుతాడు. దీని గురించి రానున్న ప్రకరణంలో చర్చించుకుందాం.



### ఐదవ ప్రకరణం

# తౌహీదె రుబూబియత్ – తౌహీదె ఉలూహియత్ పరస్పరం విడదీయరానివి

దీని భావం ఏమిటంటే అల్లాహ్‌ను సృష్టికర్తగా, ప్రభువుగా, పోషకునిగా, ప్రణాళికా రచయితగా, నిర్వహణకర్తగా అంగీకరించిన వ్యక్తి అన్ని రకాల ఆరాధనలకు అల్లాహ్ ఒక్కడే హక్కుదారుడన్న విషయాన్ని కూడా అంగీకరించి తీరాలి. ఇదే తౌహీదె ఉలూహియత్. ఎందుకంటే ఉలూహియతే ఆరాధనకు నామాంతరం. 'ఇలాహ్' అంటే దైవం అని అర్థం. కనుక కేవలం అల్లాహ్‌నే మొరపెట్టుకోవాలి. ఆయన్నే అభ్యర్థించుకోవాలి. ఆయనపైనే భరోసా చేయాలి. ఆయన్నే నమ్ముకోవాలి. ఆరాధనలు, ఉపాసనలు ఆయనకే ప్రత్యేకించుకోవాలి. ఆయన పేరునే మొక్కుకోవాలి. అన్ని రకాల ఆరాధనలు ఆయన కోసరమే నెరవేర్చాలి. ఆ విధంగా తౌహీదె రుబూబియత్ తౌహీదె ఉలూహియత్ అనివార్యతకు ప్రబల తార్కాణం. అందుకే అల్లాహ్ తౌహీదె ఉలూహియత్ (దైవత్వంలో ఏకత్వం) ను తిరస్కరించే వారిని, వారు తౌహీదె రుబూబియత్‌ను అంగీకరించిన సంగతి పదే పదే పునరావృతం చేస్తూ ప్రశ్నించాడు. ఉదాహరణకు : ఒకచోట అల్లాహ్ ఇలా ప్రశ్నిస్తున్నాడు–

﴿يَا أَيُّهَا النَّاسُ اعْبُدُواْ رَبَّكُمُ الَّذِي خَلَقَكُمْ وَالَّذِينَ مِن قَبْلِكُمْ لَعَلَّكُمْ تَتَّقُونَ ☆ الَّذِي جَعَلَ لَكُمُ الأَرْضَ فِرَاشاً وَالسَّمَاء بِنَاء وَأَنزَلَ مِنَ السَّمَاءِ مَاءً فَأَخْرَجَ بِهِ مِنَ الثَّمَرَاتِ رِزْقاً لَّكُمْ فَلاَ تَجْعَلُواْ لِلّهِ أَندَاداً وَأَنتُمْ تَعْلَمُونَ﴾ (البقرة:٢١،٢٢)

**"ప్రజలారా! మిమ్మల్నీ, మీకు పూర్వం వారినీ సృష్టించిన మీ ప్రభువునే ఆరాధించండి – తద్వారానే మీరు (పాపాల నుండి) సురక్షితంగా ఉంటారు. ఆయనే మీ కోసం భూమిని పాన్పుగానూ, ఆకాశాన్ని కప్పుగానూ చేశాడు. ఆకాశం నుండి వర్షాన్ని కురిపించి, తద్వారా పండ్లు ఫలాలను పండించి మీకు ఉపాధి నొసగాడు. ఇది తెలిసికూడా మీరు ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా నిలబెట్టకండి."**

**(అల్ బఖర : 21, 22)**

ఈ దివ్య సూక్తిలో అల్లాహ్ తౌహీదె ఉలూహియత్ గురించి, అంటే తనను ఆరాధించమని ఆజ్ఞాపించాడు. తౌహీదె రుబూబియత్ ద్వారా (తాను చేసిన మేళ్ళను జ్ఞాపకం చేసి) మరీ చెప్పాడు. అంటే పూర్వీకులను, తరువాయి వారిని సృష్టించటం, భూమ్యాకాశాల మధ్య ఉన్న వస్తువులను సృష్టించటం, గాలులను నియంత్రించటం, వర్షాలు కురిపించటం, మొక్కలను మొలకెత్తించటం, పండ్లు ఫలాలను పండించి దాసులకు జీవనోపాధిని సమకూర్చటం వంటి వాటన్నింటినీ ప్రస్తావించి తన పోషకత్వం ఎటువంటిదో విశదీకరించాడు. వారి జీవిక కోసం ఇన్ని ఏర్పాట్లు చేసిన అల్లాహ్ దైవత్వంలో

వేరొకరికి సహవర్తుల్ని కల్పించటం దాసులకు ఎంతమాత్రం శోభించదు. ఎవరెవరి గురించి వారికి తెలుసో, వారిలో ఏ ఒక్కరూ ఈ పనులు చేయలేరన్న విషయం వారికి తెలుసు. కనుక దైవత్వంలో ఏకత్వపు విషయాన్ని రుజువు చేయటానికి నిజ దైవం యొక్క నిర్వహణా సామర్థ్యాన్ని విశదీకరించి, దానిని నిదర్శనంగా చూపాలి. ఎందుకంటే మనిషి అన్నిటికన్నా ముందు సృష్టికి మూలాధారాన్ని, లాభనష్టాల సరోవరాన్ని పరికిస్తాడు. తరువాత తనకు చేరువ అయ్యే, తనను సంతోషపరిచే, తనతో సంబంధం ఏర్పరచుకునే సాధనాలపై దృష్టిని కేంద్రీకరిస్తాడు. కాబట్టి తౌహీదె రుబూబియత్ తౌహీదె ఉలూహియత్‌కు ద్వారం వంటిది. అందుకే అల్లాహ్ ముష్రిక్కుల మేధోమథనం కోసం ఈ పద్ధతినే అవలంబించాడు. ఈ పద్ధతి ద్వారానే విషయాన్ని విడమరచి చెప్పమని తన ప్రవక్తలను ఆదేశించాడు. ఈ విధంగా సెలవిస్తున్నాడు :

﴿قُل لِّمَنِ الْأَرْضُ وَمَن فِيهَا إِن كُنتُمْ تَعْلَمُونَ ☆سَيَقُولُونَ لِلَّهِ قُلْ أَفَلَا تَذَكَّرُونَ ☆قُلْ مَن رَّبُّ السَّمَاوَاتِ السَّبْعِ وَرَبُّ الْعَرْشِ الْعَظِيمِ ☆سَيَقُولُونَ لِلَّهِ قُلْ أَفَلَا تَتَّقُونَ ☆قُلْ مَن بِيَدِهِ مَلَكُوتُ كُلِّ شَيْءٍ وَهُوَ يُجِيرُ وَلَا يُجَارُ عَلَيْهِ إِن كُنتُمْ تَعْلَمُونَ ☆سَيَقُولُونَ لِلَّهِ قُلْ فَأَنَّىٰ تُسْحَرُونَ﴾(المؤمنون:٨٤-٨٩)

**“భూమి మరియు అందులో ఉన్న సమస్త వస్తువులు ఎవరివో మీకే గనక తెలిసి ఉంటే చెప్పండి?” అని (ఓ ప్రవక్తా!) వారిని అడుగు. “సప్తాకాశాలకు, మహోన్నతమయిన (అర్ష్) పీఠానికి అధిపతి ఎవరు?” అని వారిని ప్రశ్నించు. ‘అల్లాహ్‌యే’ అని వారు జవాబి స్తారు. “మరలాంటప్పుడు మీరెందుకు భయపడరు?” అని వారిని అడుగు. “సమస్త విషయాల సార్వభౌమత్వం ఎవరి చేతుల్లో ఉందో, శరణు ఇచ్చేవాడెవడో, ఎవరికి వ్యతిరేకంగా ఏ శరణూ లభించదో – ఆయనెవరో మీకు తెలిసి ఉంటే చెప్పండి?” అని (ఓ ప్రవక్తా!) వారిని అడుగు. ‘అల్లాహ్‌యే’ అని వారు చెబుతారు. “మరైతే మీరు ఎలా మోసపోతున్నారు?” అని వారిని అడుగు.** (అల్ మోమినూన్ :84- 89)

అల్లాహ్ ఇంకా ఈ విధంగా సెలవిచ్చాడు :

﴿ذَٰلِكُمُ اللَّهُ رَبُّكُمْ لَا إِلَٰهَ إِلَّا هُوَ خَالِقُ كُلِّ شَيْءٍ فَاعْبُدُوهُ﴾(الأنعام:١٠٢)

**“ఆయనే అల్లాహ్. మీ ప్రభువు. ఆయన తప్ప మరొకరెవరూ ఆరాధ్యులు కారు. సమస్త వస్తువులను సృష్టించినవాడు ఆయనే. కాబట్టి మీరు ఆయన్నే ఆరాధించండి.” (అల్ అన్ ఆమ్ : 102)**

పై సూక్తిలో అల్లాహ్ సృష్టిప్రక్రియలో, నిర్వహణలో తన విలక్షణతను, వైయక్తికతను చాటిచెబుతూ ఆరాధనకు తనే అర్హుణ్ణి అని స్పష్టం చేశాడు. మరోవిధంగా చెప్పాలంటే



అల్లాహ్ సమస్త ప్రాణులను సృష్టించటంలోని ప్రధాన ఉద్దేశం దైవారాధనే! దైవత్వంలో ఏకత్వాన్ని నమ్మి నడుచుకోవటమే! అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَمَا خَلَقْتُ الْجِنَّ وَالْإِنسَ إِلَّا لِيَعْبُدُونِ﴾(الذاريات:٥٦)

**“నేను జిన్నాతులను, మానవులను సృష్టించినది కేవలం నా దాస్యం (ఆరాధన) కొరకు తప్ప మరి దేనికొరకూ కాదు.”(అజ్జారియాత్– 56)**

“నా దాస్యం కొరకు” అంటే భావం, వారు నన్నొక్కడినే ఆరాధనకు తగినవానిగా భావించాలి.

కేవలం దేవుని పోషకత్వాన్ని, నిర్వహణా సామర్థ్యాన్ని అంగీకరించినంత మాత్రాన మనిషి ఏకేశ్వరోపాసి కాజాలడు. అతను తౌహీదె ఉలూహియత్ (దైవత్వంలో ఏకత్వాన్ని) కూడా ఒప్పుకుని, తదనుగుణంగా మసలుకున్నప్పుడే అతని ఏకేశ్వరోపాసనకు సార్థకత చేకూరుతుంది. ఎందుకంటే దేవుని పాలనా దక్షతను, పనితనాన్ని బహుదైవారాధకులు కూడా అంగీకరిస్తారు. వేనోళ్ళా కొనియాడతారు. కాని ఈ ఒప్పుకోలు, ఈ ప్రశంసలు వారిని ఇస్లాం పరిధిలో చేర్చలేదు. అలాంటి వారితో అంతిమ దైవప్రవక్త (ﷺ) పోరాటం చేయవలసి వచ్చింది. మరి చూడబోతే అల్లాహ్‌యే ఉపాధి ప్రదాత అని, జీవన్మరణాల ప్రదాత అని అరబ్బు ముష్రికులు అంగీకరించేవారు. అల్లాహ్ సెలవిచ్చినట్లు–

﴿وَلَئِن سَأَلْتَهُم مَّنْ خَلَقَهُمْ لَيَقُولُنَّ اللَّهُ﴾(الزخرف:٨٧)

**“మిమ్మల్ని పుట్టించినదెవరు?” అని నీవు గనక వారిని అడిగితే ‘అల్లాహ్’ అని వారు తప్పకుండా అంటారు. (అజ్ జుఖ్రుఫ్ : 87)**

﴿وَلَئِن سَأَلْتَهُم مَّنْ خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ لَيَقُولُنَّ خَلَقَهُنَّ الْعَزِيزُ الْعَلِيمُ﴾(الزخرف:٩)

**“భూమ్యాకాశాలను సృష్టించినదెవరు?” అని నీవు గనక వారిని ప్రశ్నిస్తే, ‘సర్వశక్తుడు, సర్వజ్ఞాని అయినవాడే (అల్లాహ్‌యే)’ అని వారు తప్పక సమాధానమిస్తారు. (అజ్ జుఖ్రుఫ్ : 9)**

﴿قُلْ مَن يَرْزُقُكُم مِّنَ السَّمَاءِ وَالْأَرْضِ أَمَّن يَمْلِكُ السَّمْعَ وَالْأَبْصَارَ وَمَن يُخْرِجُ الْحَيَّ مِنَ الْمَيِّتِ وَيُخْرِجُ الْمَيِّتَ مِنَ الْحَيِّ وَمَن يُدَبِّرُ الْأَمْرَ فَسَيَقُولُونَ اللَّهُ﴾(يونس:٣١)

**“ఆకాశం నుండి, భూమి నుండి మీకు ఉపాధిని సమకూర్చేవాడెవడు? చెవులపై, కళ్ళపై పూర్తి అధికారం కలవాడెవరు? ప్రాణమున్న దానిని ప్రాణము లేని దాని నుండి, ప్రాణములేని దానిని ప్రాణమున్న దాని నుండీ వెలికి తీసేవాడెవడు? సమస్త కార్యాల నిర్వహణ కర్త ఎవరు?” అని (ఓ ప్రవక్తా!) వారిని అడుగు. ‘అల్లాహ్‌యే’ అని వారు తప్పకుండా చెబుతారు. (యూనుస్ : 31)**

ఈ అంశానికి సంబంధించిన సూక్తులు దివ్య ఖుర్‌ఆన్‌లో ఇంకా ఎన్నో ఉన్నాయి. కనుక ఎవరయినా కేవలం అల్లాహ్ ఉనికిని అంగీకరిస్తే లేదా అల్లాహ్‌ను సృష్టికర్తగా, అధికారిగా ఒప్పుకుని అంతటితో సరిపెట్టుకుంటే అతనికి తౌహీద్ (దేవుని ఏకత్వం) యొక్క వాస్తవికత అర్థం కాలేదని అనుకోవాలి. దైవప్రవక్తలు దేని వైపునకు పిలుపు ఇచ్చారో, దానిని అతను గ్రహించలేదన్నమాట! అతను అవశ్యమైన దానిని వదలి అనుబంధమైన దానిని మాత్రమే ఆశ్రయించాడు. సూచించిన వానిని వదిలేసి సూచనతోనే సరిపెట్టుకున్నాడు.

దైవత్వంలోని విశిష్ఠత ఏమిటంటే అన్ని రకాల ఆరాధనలు, ఉపాసనలు కేవలం నిజ దైవానికే ప్రత్యేకించబడాలి. ఉదాహరణకు – భక్తిశ్రద్ధలు, అశక్తత, అణకువ, ప్రార్థన (దుఆ) ఆశ, రుజువర్తన, భరోసా (నమ్మకం, భారం మోపటం), ప్రేమ, దీనావస్థ, నిస్సహాయస్థితి మొదలగు వాటన్నింటిని షరీయతుపరంగానూ, హేతువుపరంగానూ, స్వాభావికంగానూ ఒక్కడైన అల్లాహ్‌కే తప్పనిసరిగా ప్రత్యేకం చేసుకోవాలి. ఈ ఆరాధనలు దైవేతరుల కొరకు నిషిద్ధమని నిర్ధారించుకోవాలి.



## 2. తౌహీదె ఉలూహియత్ (దైవత్వంలో ఏకత్వం, ఆరాధనలో ఏకత్వం)

ఈ అంశం క్రింద ఆరు ప్రకరణలున్నాయి :

**మొదటి ప్రకరణం :** తౌహీదె ఉలూహియత్ భావం – దైవప్రవక్తలందరి సందేశంలోని ప్రధానాంశం తౌహీదె ఉలూహియతే.

**రెండవ ప్రకరణం :** షహాదతైన్ అర్థం – అందలి మౌలికాంశాలు – షరతులు – అవి కోరేదేమిటి? –

**మూడవ ప్రకరణం :** షరీయత్ ఆదేశం, ఏదేని వస్తువును ధర్మం లేదా అధర్మంగా ఖరారు చేసే హక్కు అల్లాహ్‌దే.

**నాల్గవ ప్రకరణం :** ఇబాదత్ (ఆరాధన) అంటే ఏమిటి? దాని రకాలు, ఇందులో ఏ ఏ అంశాలు చేరి ఉన్నాయి?

**ఐదవ ప్రకరణం :** ఇబాదత్ నిర్ధారణలో కలిగే అపార్థాలు (అంటే ఆరాధన విషయంలో అతిశయిల్లటం, లోటు చేయటం)

**ఆరవ ప్రకరణం :** నిజమైన ఆరాధన : దాని ముఖ్య సూత్రాలు – అంటే ప్రేమ (భక్తి), భీతి, ఆత్మ సమర్పణాభావం, ఆశాభావం.

## మొదటి ప్రకరణం

# ఆరాధనలో ఏకత్వం (తౌహీదె ఉలూహియత్) అంటే ఏమిటి? దైవప్రవక్తల సందేశంలోని ప్రధానాంశం ఇదే.

### తౌహీదె ఉలూహియత్ : ఇది ఆరాధనకు మరో పేరు

దైవ సామీప్యం నిమిత్తం దాసులు షరీయత్‌బద్ధంగా నిర్వర్తించే క్రియలన్నీ తౌహీదె ఉలూహియత్ క్రిందికి వస్తాయి. ఉదాహరణకు : దుఆ (వేడుకోలు, ప్రార్థన), మొక్కుబడి, ఖుర్బానీ, భీతి, ఆశ, నమ్మకం, రుజువర్తన, మరలిరావటం (పశ్చాత్తాపం చెందటం) మొదలగునవి.

తౌహీద్ (ఏకేశ్వరోపాసన)కు సంబంధించిన ఈ రకం ఆద్యంతం దైవప్రవక్తల (عليهم السلام)సందేశంలో ప్రధానాంశంగా ఉండేది. ఉదాహరణకు విశ్వ ప్రభువు ఇలా సెలవిచ్చాడు:

﴿وَلَقَدْ بَعَثْنَا فِي كُلِّ أُمَّةٍ رَّسُولاً أَنِ اعْبُدُواْ اللَّهَ وَاجْتَنِبُواْ الطَّاغُوتَ﴾ (النحل:٣٦)

**“మేము ప్రతి సముదాయంలోనూ ప్రవక్తను ప్రభవింపజేశాము. అతని ద్వారా ‘(ప్రజలారా!) అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించండి. ఆయన తప్ప ఇతరత్రా మిధ్యా దైవాలకు దూరంగా ఉండండి’ అని బోధ పరిచాము. (అన్ నహ్ల్ : 36)**

ఇంకా ఇలా సెలవిచ్చాడు :

﴿وَمَا أَرْسَلْنَا مِن قَبْلِكَ مِن رَّسُولٍ إِلَّا نُوحِي إِلَيْهِ أَنَّهُ لَا إِلَهَ إِلَّا أَنَا فَاعْبُدُونِ﴾ (الأنبياء:٢٥)

**నీకు పూర్వం మేము ఏ ప్రవక్తను పంపినా, ‘నేను తప్ప మరో ఆరాధ్యుడు లేడు. కనుక మీరు నన్నే ఆరాధించండి’ అనే సందేశాన్ని అతనికి పంపాము. (అల్ అంబియా : 25)**

ఏ ప్రవక్త తన జాతి ప్రజల వద్దకు వెళ్ళినా తౌహీదె ఉలూహియత్ (దైవత్వంలో ఏకత్వం) తోనే తన సందేశ కార్యక్రమాన్ని మొదలెట్టాడు. ఉదాహరణకు : నూహ్, హూద్, సాలెహ్, షుఐబ్ తదితర ప్రవక్తలు (عليهم السلام). వారిలా అన్నారు :

﴿يَا قَوْمِ اعْبُدُواْ اللَّهَ مَا لَكُم مِّنْ إِلَهٍ غَيْرُهُ﴾ (الأعراف:٥٩،٦٥،٧٣،٨٥)

**“ఓ నా జాతి వారలారా! మీరు అల్లాహ్‌నే ఆరాధించండి. ఆయన తప్ప వేరెవరూ మీ ఆరాధనకు తగినవారు కారు.”**

**(అల్ ఆరాఫ్ : 59, 65, 73, 85)**



﴿وَإِبْرَاهِيمَ إِذْ قَالَ لِقَوْمِهِ اعْبُدُوا اللَّهَ وَاتَّقُوهُ﴾ (العنكبوت:١٦)

**ఇబ్రాహీమ్ కూడా తన జాతి వారినుద్దేశించి ఇలా అన్నాడు : ‘అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయనకు భయపడుతూ ఉండండి.’ (అల్ అన్ కబూత్ : 16)**

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (ﷺ)పై అవతరించిన సూక్తిని చూడండి :

﴿قُلْ إِنِّي أُمِرْتُ أَنْ أَعْبُدَ اللَّهَ مُخْلِصاً لَّهُ الدِّينَ﴾ (الزمر:١١)

**(ప్రవక్తా!) వారికి చెప్పు : “ఆరాధనను అల్లాహ్‌కే ప్రత్యేకించి ఆయన్ని మాత్రమే ఆరాధించాలని నేను ఆజ్ఞాపించబడ్డాను.” (అజ్ జుమర్ : 11)**

మహనీయ ముహమ్మద్ (ﷺ) ఇలా అన్నారు :

”أُمِرْتُ أَنْ أُقَاتِلَ النَّاسَ حَتَّى يَشْهَدُوا أَنْ لَا إِلَهَ إِلَّا اللَّهُ وَأَنَّ مُحَمَّدًا رَسُولُ اللَّهِ“ (بخاری ومسلم)

**“అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేదని, ముహమ్మద్ (ﷺ) అల్లాహ్ సందేశహరుడని సాక్ష్యమివ్వటానికి అంగీకరించనంత వరకూ నేను జనులతో పోరాడాల్సిందేనని నాకు ఆజ్ఞాపించబడింది.”**

**(బుఖారీ, ముస్లిం)**

ప్రాజ్ఞుడు, బుద్ధిమంతుడు (ముకల్లఫ్) అయిన ప్రతి వ్యక్తీ లా ఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప మరో దైవం లేదు) అని సాక్ష్యమివ్వాలి. తదనుగుణంగా ఆచరించాలి. ఇది అతని విద్యుక్త ధర్మం. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿فَاعْلَمْ أَنَّهُ لَا إِلَهَ إِلَّا اللَّهُ وَاسْتَغْفِرْ لِذَنبِكَ﴾ (محمد:١٩)

**“కనుక (ఓ ముహమ్మద్!) అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని నువ్వు బాగా తెలుసుకో. నీ పొరపాట్లకు గాను క్షమాపణ వేడుకుంటూ ఉండు.” (ముహమ్మద్ : 19)**

ఇస్లాంలో ప్రవేశించే ప్రతి ఒక్కరూ, అన్నిటికన్నా ముందు అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేదని, ముహమ్మద్ అల్లాహ్ సందేశహరుడని సాక్ష్యమివ్వవలసి ఉంటుంది. దీన్నిబట్టి స్పష్టమయ్యేదేమిటంటే ‘దైవత్వంలో ఏకత్వమే’ ప్రవక్తలందరి సందేశంలోని ప్రధానాంశం. ‘తౌహీదె ఉలూహియత్’ కూడా ‘ఇలాహ్’ నుండే వచ్చింది. ‘ఉలూహియత్’ అల్లాహ్‌కే స్వంతం. అది ఆయన గుణం. ఈ కారణంగానే ఆయన ‘అల్లాహ్’గా పిలువ బడ్డాడు. అందుకే అల్లాహ్ అంటేనే దైవత్వం. దైవత్వం కలవాడు, ఆరాధ్యుడు అని భావం.

అందుకే ‘తౌహీదె ఉలూహియత్’ను ‘తౌహీదె ఇబాదత్’ (ఆరాధనలో ఏకత్వం) గా కూడా వ్యవహరిస్తారు. ఆ విధంగా చూసినపుడు దాస్యం దాసుని గుణం. ఇంకా

సూటిగా చెప్పాలంటే దైవదాస్యం అతనికి తప్పనిసరి. నిష్కల్మష హృదయంతో అతను అల్లాహ్‌ను ఆరాధించాలి. ఎందుకంటే అతనికి అల్లాహ్ అవసరం ఉంది. అనుక్షణం అతను అల్లాహ్‌పై ఆధారపడి ఉన్నాడు.

షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (رحمه الله) ఏమన్నారో చూడండి :

"దాసుడు దేవునిపై ఆధారపడి ఉండే విషయాన్ని – అంటే అల్లాహ్‌ను సేవిస్తూ ఆయనకు సాటి కల్పించకుండా ఉండే విషయాన్ని – దేనితోనూ పోల్చలేము. అదొక అనుపమమైన విషయం. అది ఊహకు అందనిది. కాకపోతే – కొన్ని కారణాల దృష్ట్యా – ఇది మానవ శరీరానికి అవసరమయిన అన్న పానీయాలను పోలి ఉంది. అందులో కూడా చాలా వ్యత్యాసముంది. ఎందుకంటే దాసుని యదార్థస్థితికి అతని ఆంతర్యమే దర్పణం. దాని దిద్దుబాటు, బాగోగులు అతని ఆరాధ్య దైవం ద్వారానే సాధ్యం. ఆయన తప్ప మరో నిజ ఆరాధ్యుడు లేడు. కనుక లోకంలో ఆయన్ని స్మరించనంత వరకూ అతని మనసు నిమ్మళించదు. ఒకవేళ దాసునికి తన ఆరాధ్య దైవంగాక ఇతరత్రా వస్తువుల ద్వారా అతని అంతరంగానికి ఉపశమనం, ఊరట లభించినా అది శాశ్వతం కాదు. అది క్రమంగా క్షీణిస్తుంది లేదా వేరితర వ్యక్తులపైకి అతని ధ్యాస మళ్లుతుంది లేదా వేరితర వ్యాపకాల వైపు అతను మొగ్గుతాడు. ఇకపోతే దాసునికి దైవంతో గల సంబంధం : అది సర్వకాల సర్వావస్థల్లో అతనికి అవసరం. (అది వినా గత్యంతరం లేదు). అతనెక్కడ ఉన్నా అతని ఆరాధ్యుడు అతనికి తోడుగా ఉంటాడు."

(మజ్మూఅ అల్ ఫతావా : 1/24)

దేవుని ఏకత్వపు ఈ కోణమే దైవప్రవక్తల సందేశానికి కేంద్ర బిందువుగా ఉండేది. ఎందుకంటే ఆచరణలకు మూలం ఇదే. ఇది సంపూర్ణం కానంత వరకూ ఆచరణలు సజావుగా ఉండవు. ఎందుకంటే తౌహీదె ఉలూహియత్ (దైవత్వంలో ఏకత్వం) పరిపూర్ణం కాకపోతే దాని విరుద్ధాంశమైన బహు దైవోపాసన (షిర్క్) పొడసూపుతుంది. కాగా; బహు దైవోపాసన గురించి దేవుడేమన్నాడో చూడండి :

﴿إِنَّ اللَّهَ لَا يَغْفِرُ أَن يُشْرَكَ بِهِ﴾(النساء:٤٨،١١٦)

**"తనకు భాగస్వామిగా మరొకరిని కల్పించటాన్ని (షిర్క్ చేయటాన్ని) అల్లాహ్ సుతరామూ క్షమించదు." (అన్ నిసా : 48, 116)**

ఇంకా ఈ విదంగా సెలవీయబడింది :

﴿وَلَوْ أَشْرَكُواْ لَحَبِطَ عَنْهُم مَّا كَانُواْ يَعْمَلُونَ﴾(الأنعام:٨٨)

**"ఒకవేళ వీరు సయితం దైవత్వంలో భాగస్వామ్యానికి ఒడిగట్టి ఉంటే, వారు చేసుకున్న కర్మలన్నీ వృథా అయిపోయేవి." (అల్ అన్ ఆమ్:88)**



అల్లాహ్ ఈ విధంగా కూడా సెలవిచ్చాడు :

﴿لَئِنْ أَشْرَكْتَ لَيَحْبَطَنَّ عَمَلُكَ وَلَتَكُونَنَّ مِنَ الْخَاسِرِينَ﴾(الزمر:٦٥)

**"ఒకవేళ నువ్వు గనక బహుదైవారాధనకు పాల్పడితే నువ్వు చేసుకున్నదంతా వృథా అయిపోతుంది. మరి నిశ్చయంగా నీవు నష్టపోయినవారిలో చేరిపోతావు." (అజ్ జుమర్ : 65)**

దేవుని ఏకత్వం (తౌహీద్) లోని ఈ కోణం వల్ల దాసునిపై తప్పనిసరి అయ్యే బాధ్యతలలో ఇది మొట్టమొదటిది. ఉదాహరణకు అల్లాహ్ సెలవిచ్చినట్లు –

﴿وَاعْبُدُواْ اللَّهَ وَلاَ تُشْرِكُواْ بِهِ شَيْئاً وَبِالْوَالِدَيْنِ إِحْسَاناً﴾(النساء:٣٦)

**"అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయనకు సహవర్తులుగా ఎవరినీ కల్పించకండి. తల్లిదండ్రుల యెడల ఉత్తమంగా వ్యవహరించండి."**

**(అన్ నిసా : 36)**

﴿وَقَضَى رَبُّكَ أَلاَّ تَعْبُدُواْ إِلاَّ إِيَّاهُ وَبِالْوَالِدَيْنِ إِحْسَاناً﴾(الاسراء:٢٣)

**నీ ప్రభువు స్పష్టంగా ఆజ్ఞాపించాడు : 'మీరు ఆయనను తప్ప మరొకరు ఎవరినీ ఆరాధించకూడదు. తల్లిదండ్రుల యెడల ఉత్తమంగా వ్యవహరించాలి." (అల్ ఇస్రా : 23)**

ఇంకా ఈ విధంగానూ ఉపదేశించబడింది –

﴿قُلْ تَعَالَوْاْ أَتْلُ مَا حَرَّمَ رَبُّكُمْ عَلَيْكُمْ أَلاَّ تُشْرِكُواْ بِهِ شَيْئاً وَبِالْوَالِدَيْنِ إِحْسَاناً﴾(الأنعام:١٥١)

**(ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "రండి, మీ ప్రభువు మీపై నిషేధించిన వస్తువులు ఏవో మీకు చదివి వినిపిస్తాను. అవేమంటే; అల్లాహ్‌కు సహవర్తులుగా ఎవరినీ కల్పించకండి. తల్లిదండ్రుల యెడల ఉత్తమ రీతిలో మెలగండి." (అల్ అన్ ఆమ్ : 151)**

## రెండవ ప్రకరణం

# షహాదతైన్ (సాక్ష్యవచనాలు) అర్థం : వాటి విషయంలో జరిగే పొరపాట్లు, వాటికి సంబంధించిన మౌలికాంశాలు, షరతులు, దోషాలు

## మొదటిది : షహాదతైన్ అర్థం

(1) لاإله إلاالله **లా ఇలాహ ఇల్లల్లాహ్** గురించి సాక్ష్యమివ్వటం అంటే అర్థం – అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేడని అంగీకరించటం, దానికి కట్టుబడి ఉండటం, అది కోరే వాటిని నెరవేర్చటం. ఎందుకంటే لاإله **లా ఇలాహ** ద్వారా అల్లాహ్ తప్ప వేరొకరు దాస్యానికి అర్హులన్న విషయం త్రోసిపుచ్చబడుతుంది – అతనెవరయినా సరే! إلاالله **ఇల్లల్లాహ్** ద్వారా దాస్యానికి, ఆరాధనకు అర్హుడు కేవలం అల్లాహ్‌యేనన్న విషయం రూఢీ అవుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే ఈ కలిమా (వచనానికి) అర్థం لا معبود بحق إلاالله **అల్లాహ్ తప్ప నిజ ఆరాధ్యుడు ఎవడూ లేడు** అని వస్తుంది. **'లా'** (లేడు, లేనేలేడు) అనే దానిని శిరసావహించటంతో పాటు "بحق" **'నిజ'** ఆరాధ్యుడు అనే విషయాన్ని కూడా నొక్కి వక్కాణించటం, ధృవీకరించటం అవశ్యం. లేకుంటే లోకంలో అల్లాహ్ తప్ప ఎందరో దైవాలు ఉన్నారన్న భావం స్ఫురిస్తుంది. వారిని (వాటిని) పూజించటం అల్లాహ్‌ను పూజించటం క్రిందికే వస్తుంది అనే దానికి ద్వారం తెరచుకుంటుంది. ఇదే అన్నిటికన్నా పెద్ద అధర్మం, అసత్యం. ఇది వహ్‌దతుల్ వుజూద్ **(అన్నిటిలో దేవుడున్నాడు అని)** ఒప్పుకునే వారి నమ్మకం. భూమండలంపై ఉన్న అతి పెద్ద అవిశ్వాస పోకడ ఇదే.

ఈ ఏకత్వపు వచనానికి అనేక అధర్మ వ్యాఖ్యానాలు చేయబడ్డాయి. వాటిలో కొన్ని ఇవి :

**(అ)** **అల్లాహ్ తప్ప మరో దేవుడు లేడు** అనేది ఒక అర్థం. ఈ అర్థం ఒక మిథ్య. ఎందుకంటే దీనికి అర్థం – ప్రతి ఆరాధ్య దేవుడు – అతను సత్యమైనా, అసత్యమైనా – అతనే అల్లాహ్ అని వస్తుంది.

**(ఆ)** **అల్లాహ్ తప్ప మరో సృష్టికర్త లేడు** అనేది ఒకటి. ఇది ఈ కలిమాలో ఒక భాగమేగాని సంపూర్ణ భావం కాదు. ఎందుకంటే దీని ద్వారా 'తౌహీదె రుబూబియత్' మాత్రమే రుజువవుతుంది. దీంతో కలిమా అసలు ఉద్దేశ్యం నెరవేరదు. ఈ ఏకత్వాన్ని ముష్రిక్కులు సయితం ఒప్పుకుంటారు.

**(ఇ)** **అల్లాహ్ తప్ప వేరొక పాలకుడు ఎవడూ లేడు** అనేది ఇంకొక అర్థం. ఇది కూడా పాక్షికమైన భావమే. దీనివల్ల అసలు ధ్యేయం నెరవేరదు. కాబట్టి ఇది సరిపోదు. ఎందుకంటే ఏ వ్యక్తి అయినా అల్లాహ్‌ను కేవలం ఒక్క సార్వభౌమాధికారంలో మాత్రమే అద్వితీయుడుగా ఖరారుచేసి, మిగిలిన వ్యవహారాలన్నింటిలో అల్లాహ్‌ను గాకుండా వేరితరులను మొరపెట్టుకుంటే లేదా ఇందు నిమిత్తం వేరితర ఆరాధనా విధానాన్ని కల్పించుకుంటే అతను 'ఏకేశ్వరోపాసి' అనిపించుకోడు.



కాబట్టి పైన పేర్కొనబడిన మూడు రకాల వ్యాఖ్యానాలు కూడా అధర్మమైనవి లేదా లోపభూయిష్టమైనవి. కొన్ని పుస్తకాలలో ఇలాంటి కల్పిత విషయాలు కానవస్తూ ఉంటాయి. అందుకే దీని గురించి మేము సావధానపరుస్తున్నాము.

**తొలికాలపు సజ్జనుల, అగ్రశ్రేణి పరిశోధకుల దృష్టిలో ఈ కలిమాకు సరైన అర్థం ఇది : "అల్లాహ్ తప్ప నిజ ఆరాధ్యుడు ఎవడూ లేడు."**

**(2)** محمد رسول الله **ముహమ్మదుర్రసూలుల్లాహ్** గురించి సాక్ష్యమివ్వటం అంటే అర్థం ఇది : ముహమ్మద్ (ﷺ) అల్లాహ్ దాసులనీ, ఆయన తరఫున సమస్త మానవాళి కొరకు పంపబడిన సందేశహరులని మనసా వాచా అంగీకరించటం. దాంతోపాటు ఈ కలిమా (సాక్ష్య వచనం) వాంఛించే వాటిని నెరవేర్చాలి. మహనీయ ముహమ్మద్ (ﷺ) ఆదేశించిన వాటిని శిరసావహించాలి. ఆయన (స)కు విధేయత చూపాలి. ఆయన అందజేసిన విషయాన్ని సత్యమని ఒప్పుకోవాలి. ఆయన (ﷺ) వారించిన విషయాలకు దూరంగా ఉండాలి. ఆయన (ﷺ) తెచ్చిన షరీయత్ కనుగుణంగా అల్లాహ్‌ను ఆరాధించాలి.

## రెండవది : సాక్ష్యవచనాలలోని మౌలికాంశాలు :

**(అ) లా ఇలాహ ఇల్లల్లాహ్**లో రెండు ప్రధానాంశాలున్నాయి.

ఒకటి : నకారాత్మకమైనది (Negative) , రెండవది : సకారాత్మకమైనది (Positive)

**మొదటి అంశం నకారాత్మకమైనది : లా ఇలాహ :** ఇది షిర్క్‌కు సంబంధించిన అన్ని రకాలను మిథ్యగా, అసత్యంగా ఖరారు చేస్తుంది. అల్లాహ్ తప్ప పూజించబడే అన్ని వస్తువులనూ త్రోసిపుచ్చటం అవశ్యమని చెబుతోంది.

**రెండవ అంశం సకారాత్మకమైనది : ఇల్లల్లాహ్ :** ఆరాధనలకు, దాస్యానికి అర్హుడు ఒక్కడైన అల్లాహ్ మాత్రమేనని ఇది రుజువు చేస్తుంది. దీని ప్రకారం ఆచరించటం తప్పనిసరి అని ఖరారు చేస్తుంది.

ఈ రెండు ప్రధానాంశాల భావం దివ్య ఖుర్‌ఆన్‌లోని ఎన్నో సూక్తులలో అభివ్యక్త మవుతోంది. ఉదాహరణకు అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿فَمَنْ يَكْفُرْ بِالطَّاغُوتِ وَيُؤْمِن بِاللَّهِ فَقَدِ اسْتَمْسَكَ بِالْعُرْوَةِ الْوُثْقَىٰ﴾ (البقرة:٢٥٦)

**"కనుక ఎవరయితే అల్లాహ్ తప్ప వేరితర ఆరాధ్యులను (తాగూత్‌ను) తిరస్కరించి అల్లాహ్‌ను మాత్రమే విశ్వసిస్తారో వారు దృఢమయిన కడియాన్ని పట్టుకున్నారు." (అల్ బఖర : 256)**

(فَمَنْ يَكْفُرْ بِالطَّاغُوتِ) **'ఫమన్ య్యక్ఫుర్ బిత్తాగూత్'** (ఎవరయితే తాగూత్‌ని తిరస్కరించారో) అనే వాక్యం (لا اِلٰه) **'లా ఇలాహ'** అనే మొదటి అంశం క్రిందికి వస్తుంది. (وَيُؤْمِن بِاللّٰه) **'వ యూమిన్ బిల్లాహి'** (అల్లాహ్‌ను మాత్రమే విశ్వసిస్తారో) అనేది **'ఇల్లల్లాహ్'** అనే రెండవ అంశానికి సరిపోతుంది.

ఇదేవిధంగా దైవప్రవక్త ఇబ్రాహీమ్ (عليه السلام) తన తండ్రితో, తన జాతి వారితో ఏమన్నారో చూడండి –

﴿إِنَّنِي بَرَاء مِّمَّا تَعْبُدُونَ ☆إِلَّا الَّذِي فَطَرَنِي﴾(الزخرف:٢٦،٢٧)

**"మీరు పూజించేవాటితో నేను తెగత్రెంపులు చేసుకుంటున్నాను – నన్ను సృష్టించిన వానితో (అల్లాహ్‌తో) తప్ప!"**

**(అజ్ జుఖ్‌రుఫ్ : 26, 27)**

إِنَّنِي بَرَاء **'నేను తెగత్రెంపులు చేసుకుంటున్నాను'** అనే వాక్యంలో నకారాత్మక (Negative) భావం ఇమిడి ఉండగా, ﴿إِلَّا الَّذِي فَطَرَنِي﴾ **'నన్ను సృష్టించిన వానితో (అల్లాహ్‌తో) తప్ప!'** అన్న మాటలో సకారాత్మకత (Positive) వ్యక్తమవుతోంది.

**(ఆ)** محمد رسول الله **ముహమ్మదుర్రసూలుల్లాహ్** అని సాక్ష్యమివ్వటంలోని ప్రధానాంశాలు రెండు. వాటిలో ఆయన (ﷺ) దేవుని దాసుడు అనేది ఒకటి, దేవుని సందేశహరుడు అనేది రెండవది. ఈ రెండు ప్రధానాంశాలు దైవప్రవక్త (ﷺ) యెడల మనకు గల విశ్వాసాన్ని సమతూకంలో ఉంచుతాయి. హెచ్చుతగ్గుల నుండి, అతివాదం నుండి మనల్ని కాపాడుతాయి. నిశ్చయంగా ఆయన (ﷺ) దైవదాసుడు, దైవప్రవక్త. ఈ రెండు సద్గుణాల రీత్యా ఆయన మానవులందరిలోకీ సర్వశ్రేష్ఠులు. ఇక్కడ 'దాసుడు' అంటే భావం వినయ వినమ్రతలతో దైవారాధన, దైవదాస్యం చేసే భక్తుడన్నమాట. అంటే ఆయన (ﷺ) మానవమాత్రులు. మనుషులంతా సృష్టించబడినట్లే ఆయన (స) కూడా సృష్టించబడ్డారు. ఇతర మానవులకు ఎదురయ్యే సమస్యలే ఆయన (ﷺ)కూ ఎదురయ్యేవి. ఉదాహరణకు దివ్య ఖుర్‌ఆన్‌లో ఈ విధంగా సెలవీయబడింది –

﴿قُلْ إِنَّمَا أَنَا بَشَرٌ مِّثْلُكُمْ﴾(الكهف:١١٠)

**(ఓ ప్రవక్తా!) వారికి ఇలా చెప్పు: "నేనూ మీ లాంటి మానవ మాత్రుణ్ణే." (అల్ కహ్ఫ్ : 110)**

ఒక దాసునిగా ఆయన (సఅసం) తన కర్తవ్యాన్ని పూర్తిగా నిర్వర్తించారు. అల్లాహ్ 'దాసుడు' (అబ్ద్) అనే పదం ద్వారా ఆయన్ని అల్లాహ్ ఇలా సంబోధించాడు :

﴿أَلَيْسَ اللّٰهُ بِكَافٍ عَبْدَهُ﴾(الزمر:٣٦)

**"ఏమిటి, తన దాసునికి అల్లాహ్ సరిపోడా?" (అజ్ జుమర్ : 36)**



﴿الْحَمْدُ لِلّٰهِ الَّذِي أَنزَلَ عَلَى عَبْدِهِ الْكِتَابَ﴾(الكهف:١)

**"తన దాసునిపై ఈ (ఖుర్‌ఆన్) గ్రంథాన్ని అవతరింపజేసిన అల్లాహ్‌కే సకల ప్రశంసలు శోభిస్తాయి." (అల్ కహ్ఫ్ : 1)**

﴿سُبْحَانَ الَّذِي أَسْرَى بِعَبْدِهِ لَيْلاً مِّنَ الْمَسْجِدِ الْحَرَامِ إِلَى الْمَسْجِدِ الأَقْصَى﴾(الاسراء:١)

**"తన దాసుణ్ణి రాత్రికి రాత్రే మస్జిదె హరామ్ నుండి మస్జిదె అక్సాకు తీసుకుపోయిన అల్లాహ్ పరిశుద్ధుడు." (అల్ ఇస్రా : 1)**

దైవప్రవక్త లేక దైవ సందేశహరుడు : అంటే ఆయన (ﷺ) అల్లాహ్ తరఫున శుభవార్తను వినిపించేవానిగా, హెచ్చరించేవానిగా చేసి సమస్త మానవాళి వైపు పంపబడ్డారు.

ఆయన (ﷺ) గురించి ఈ రెండు విషయాల సాక్ష్యం ఇచ్చిన వారు (హెచ్చు తగ్గులనే) రెండు అతివాదాల నుండి సురక్షితంగా ఉంటారు. ఎందుకంటే ముహమ్మద్ ప్రవక్త (సఅసం) అనుయాయులమని చెప్పుకునే వారిలో చాలామంది ఆయన (ﷺ) విషయంలో అతిశయిల్లుతూ ఉంటారు. ఈ అతివాదం ఎంతవరకు వెళ్ళిందంటే ఆయన్ని (స) 'దాస్య' స్థానం నుండి ఏకంగా 'ఆరాధ్య దైవం' స్థానానికి ఎత్తేశారు. అల్లాహ్‌ను వదలిపెట్టి ఆయన్ని (ﷺ) విన్నవించుకోవటం మొదలెట్టారు. కేవలం అల్లాహ్ అదుపాజ్ఞలలో మాత్రమే ఉండే వస్తువులను ప్రవక్త (ﷺ) వద్ద అర్థించసాగారు. ఉదాహరణకు : తమ అవసరాలు తీర్చమని, తమ కష్టాలు దూరం చేయాలని అర్థించటం.

మరి కొంతమంది ఆయన (ﷺ) దైవదౌత్యాన్ని నిరాకరించారు. అంగీకరించినా పాక్షికంగా అంగీకరించారు. ఆయన విధానాన్ని అనుసరించే విషయంలో వెలితి చూపారు. ఆయన (ﷺ) తెచ్చిన షరీయత్‌లో విభేదించారు. ఆయన ప్రవచనాలకు, ఆదేశాలకు పెడర్థాలు తీశారు.

## మూడవది : షహాదతైన్ షరతులు

**'లా ఇలాహ ఇల్లల్లాహ్'** గురించిన సాక్ష్యం ఏడు షరతులతో ముడిపడి ఉంది. ఆ ఏడు షరతులకు కట్టుబడనంత వరకూ దీనికి సంబంధించిన 'అంగీకారం' వల్ల ఎలాంటి ప్రయోజనముండదు. అవి క్లుప్తంగా క్రింద పొందుపరచబడ్డాయి –

**మొదటి షరతు** : జ్ఞానం. ఈ జ్ఞానం అజ్ఞానానికి విరుద్ధంగా ఉండాలి.

**రెండవ షరతు** : నమ్మకం. ఇది సందిగ్ధానికి, అనుమానానికి తావులేనిదిగా ఉండాలి.

**మూడవ షరతు** : స్వీకృతి. అది నిరాకరణకు, ధిక్కారానికి పూర్తి వ్యతిరేకంగా ఉండాలి.

**నాల్గవ షరతు** : విధేయతా భావం. అది అవిధేయతకు తావు లేనిదై ఉండాలి.

**ఐదవ షరతు** : చిత్తశుద్ధి, నిష్కల్మషమైన భావన – ఇందులో ఎలాంటి కల్మషానికి, కల్తీకి తావు ఉండకూడదు.

**ఆరవ షరతు** : సత్యం. అందులో ఎలాంటి అసత్యానికి, ద్వంద్వ వైఖరికి ఆస్కారం ఉండరాదు.

**ఏడవ షరతు** : ప్రేమ. అందులో ఎలాంటి కల్లాకపటం ఉండరాదు. ఇంకా అది ద్వేషానికి, వైర వైఖరికి విరుద్ధంగా ఉండాలి.

**ఆ ఏడు షరతుల తఫ్సీళ్ళు ఇవి :**

## మొదటి షరతు - జ్ఞానం :

అంటే ఈ 'కలిమా' ఏమేమి కోరుతుందో తెలిసి ఉండాలి. అది వేటిని నిరాకరిస్తుందో, వేటిని అంగీకరిస్తుందో కూడా తెలిసి ఉండాలి. ఈ జ్ఞానం ద్వారా అజ్ఞానం పటాపంచలవ్వాలి. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿إِلَّا مَن شَهِدَ بِالْحَقِّ وَهُمْ يَعْلَمُونَ﴾ (الزخرف:٨٦)

**"అయితే సత్యం గురించి సాక్ష్యమిచ్చి, దానికి సంబంధించిన జ్ఞానమున్న వారు మాత్రం (సిఫారసుకు అర్హులు)." (అజ్ జుఖ్రుఫ్:86)**

అంటే لا إله الا الله **లా ఇలాహ ఇల్లల్లాహ్** గురించి సాక్ష్యమివ్వాలి. ఏ విషయం గురించి వారు తమ నోటితో అంగీకరిస్తున్నారో, అదేమిటో వారి ఆంతర్యానికి తెలిసి ఉండాలి. నోటితో ఏం ఖరారు చేస్తున్నారో అది అంతరంగానికి తెలీకపోతే, అట్టి కలిమావల్ల వారికి ఒరిగేదేమీ ఉండదు. ఎందుకంటే నోటితో చెప్పే విషయంపై అంతరాత్మకు నమ్మకం ఉండదు.

## రెండవ షరతు - నమ్మకం

ఇక్కడ 'నమ్మకం' అంటే అర్థం ఒక విషయాన్ని అంగీకరించే వ్యక్తికి ఆ విషయం యొక్క అర్థంపై, దానికి సంబంధించిన ఆధారాలపై పూర్తి విశ్వాసం ఉండాలి. ఎలాంటి సంశయం, తటపటాయింపు ఉండకూడదు. ఉంటే దానివల్ల లాభం ఏమీ ఉండదు. ఈ నేపథ్యంలో అల్లాహ్ ఏమంటున్నాడో చూడండి :

﴿إِنَّمَا الْمُؤْمِنُونَ الَّذِينَ آمَنُوا بِاللَّهِ وَرَسُولِهِ ثُمَّ لَمْ يَرْتَابُوا﴾ (الحجرات:١٥)

**"నిశ్చయంగా ఎవరయితే అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను (దృఢంగా) విశ్వసించి, తరువాత ఎలాంటి సందేహానికి తావీయకుండా ఉంటారో ...." (అల్ హుజురాత్ : 15)**

ఒకవేళ ఎవరయినా సందేహానికి, సందిగ్ధానికి తావిస్తే అలాంటివారు కపట విశ్వాసులవుతారు. మహనీయ ముహమ్మద్ (ﷺ) ఇలా ప్రవచించారు :



''مَنْ لَقِيتَ وَرَاءَ هٰذَا الْحَائِطِ يَشْهَدُ أَنْ لَا إِلٰهَ إِلَّا اللّٰهُ مُسْتَيْقِنًا قَلْبُهُ فَبَشِّرْهُ بِالْجَنَّةِ'' (بخاری)

**"ఈ గోడ వెనుక ఎవరిని కలుసుకున్నా - అతను గనక హృదయపూర్వకంగా లా ఇలాహ ఇల్లల్లాహ్ అని సాక్ష్యమిస్తే అతనికి స్వర్గ శుభవార్తను వినిపించండి." (సహీహ్ బుఖారీ)**

కనుక హృదయపూర్వకమైన 'నమ్మకం' లేనివాడు స్వర్గ ప్రవేశానికి అర్హుడు కాడు.

## మూడవ షరతు - స్వీకృతి (ఆమోదం)

ఈ కలిమాను అంగీకరించిన వ్యక్తి, కలిమా కోరేవాటిని కూడా అంగీకరించాలి. అంటే ఒక్కడయిన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలి. అల్లాహ్ తప్ప వేరితరుల దాస్యాన్ని విడనాడాలి. ఒకవేళ ఎవరయినా లాంఛనప్రాయంగా నోటితో ఈ కలిమాను ఆమోదించి, అది వాంఛించే నియమ నిబంధనలకు కట్టుబడి ఉండకపోతే, అలాంటివారు లెక్కలోనికే రారు. అలాంటివారి గురించి అల్లాహ్ ఇలా అంటున్నాడు :

﴿إِنَّهُمْ كَانُوا إِذَا قِيلَ لَهُمْ لَا إِلَٰهَ إِلَّا اللَّهُ يَسْتَكْبِرُونَ ☆ وَيَقُولُونَ أَئِنَّا لَتَارِكُوا آلِهَتِنَا لِشَاعِرٍ مَّجْنُونٍ﴾ (الصافات:٣٥،٣٦)

**"అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దేవుడు లేడని వారితో అన్నప్పుడు వారు అహంకారంతో విర్రవీగేవారు. పిచ్చిపట్టిన ఒక కవి చెప్పినంత మాత్రాన మేము మా పూజ్య దైవాలను వదులుకోవాలా?" అనేవారు. (అస్ సాఫ్ఫాత్ : 35, 36)**

నేటి సమాధి పూజారుల పరిస్థితీ ఇంతే. వారు لا إله الا الله **"లా ఇలాహ ఇల్లల్లాహ్"** అని అంగీకరించటానికైతే అంగీకరించారు. కాని సమాధి పూజను మాత్రం మానుకోవటం లేదు. ఆ విధంగా వారు لا إله الا الله **"లా ఇలాహ ఇల్లల్లాహ్"** అని నోటితో పలికినప్పటికీ, దాని అర్థాన్ని మాత్రం ఒప్పుకోవటం లేదు.

## నాల్గవ షరతు - విధేయత :

ఈ కలిమా (సద్వచనం) వేటికి ఆజ్ఞాబద్ధమై ఉండాలని, విధేయత చూపాలని అంటున్నదో వాటికి బద్ధమై ఉండాలి. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَمَن يُسْلِمْ وَجْهَهُ إِلَى اللَّهِ وَهُوَ مُحْسِنٌ فَقَدِ اسْتَمْسَكَ بِالْعُرْوَةِ الْوُثْقَىٰ﴾ (لقمان:٢٢)

**"ఎవరయితే సద్వర్తనుడై ఉండి, తనను తాను అల్లాహ్‌కు సమర్పించుకుంటాడో, అతను నిశ్చయంగా గట్టి కడియాన్ని పట్టుకున్నాడు." (లుఖ్మాన్ : 22)**

గట్టి కడియం లేక గట్టి ఆధారం "الْعُرْوَةِ الْوُثْقَىٰ" **(ఉర్వతిల్ ఉస్ఖా)** అంటే భావం لا إله الا الله **లా ఇలాహ ఇల్లల్లాహ్** అనే. "يُسْلِمْ وَجْهَهُ" **యుస్‌లిమ్ వజ్‌హహు**

అంటే నిష్కల్మషమైన హృదయంతో దేవుని ముందు ఆత్మ సమర్పణకు సంసిద్ధమవటం అన్నమాట!

## ఐదవ షరతు - సచ్ఛీలత

ఇక్కడ సచ్ఛీలత అంటే భావం మనస్ఫూర్తిగా కలిమాను స్వీకరించటం. ఒకవేళ అతను గనక నోటితో కలిమాను అంగీకరించి మనసులో దానిని సద్వచనంగా భావించకపోతే అతను కేవలం పలికి బొంకుతున్నాడన్నమాట! ఇది కాపట్యానికి, వంచనకు ఆనవాలు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَمِنَ النَّاسِ مَن يَقُولُ آمَنَّا بِاللَّهِ وَبِالْيَوْمِ الْآخِرِ وَمَا هُم بِمُؤْمِنِينَ ☆ يُخَادِعُونَ اللَّهَ وَالَّذِينَ آمَنُوا وَمَا يَخْدَعُونَ إِلَّا أَنفُسَهُمْ وَمَا يَشْعُرُونَ ☆ فِي قُلُوبِهِم مَّرَضٌ فَزَادَهُمُ اللَّهُ مَرَضًا وَلَهُمْ عَذَابٌ أَلِيمٌ بِمَا كَانُوا يَكْذِبُونَ﴾ (البقرة:٨-١٠)

**"మేము అల్లాహ్ పట్ల, అంతిమ దినం పట్ల విశ్వాసం కలిగి ఉన్నామ"ని జనులలో కొందరంటున్నారు. కాని యదార్థానికి వారు విశ్వసించినవారు కారు. వారు అల్లాహ్‌ను, విశ్వాసులను మోసపుచ్చుతున్నారు. అయితే వాస్తవానికి వారు స్వయంగా – తమను తామే మోసపుచ్చుకుంటున్నారు. కాని ఈ విషయాన్ని వారు గ్రహించటం లేదు. వారి హృదయాలలో రోగం ఉంది. ఆ రోగాన్ని అల్లాహ్ మరింతగా పెంచాడు. వారు చెప్పే అబద్ధం కారణంగా వారి కొరకు వ్యధాభరితమయిన శిక్ష ఉంది." (అల్ బఖర : 8 – 10)**

## ఆరవ షరతు - చిత్తశుద్ధి :

చిత్తశుద్ధి (ఇఖ్లాస్) అంటే అర్థం మనిషి తన ఆచరణను అన్ని రకాల షిర్క్ నుండి, కల్తీల నుండి స్వచ్ఛంగా, నికార్సుగా ఉంచటం. సూటిగా చెప్పాలంటే అతను పలికే 'కలిమా' (సద్వచనం) ద్వారా ఎలాంటి ప్రాపంచిక స్వప్రయోజనాలను ఆశించరాదు. ప్రదర్శనాబుద్ధికి తావీయరాదు. ఎందుకంటే ఉత్బాన్ (رضي الله عنه) ఉల్లేఖించిన ప్రామాణిక హదీసులో మహనీయ ముహమ్మద్ (ﷺ) ఇలా ప్రవచించారు :

"فَإِنَّ اللَّهَ حَرَّمَ عَلَى النَّارِ مَنْ قَالَ: لَا إِلَٰهَ إِلَّا اللَّهُ، يَبْتَغِي بِذَٰلِكَ وَجْهَ اللَّهِ" (بخاری ومسلم)

**"ఏ వ్యక్తి అల్లాహ్ ప్రసన్నత కోసం 'లా ఇలాహ ఇల్లల్లాహ్' పలుకుతాడో, అతనిపై అల్లాహ్ నరకాగ్నిని నిషేధిస్తాడు." (బుఖారీ, ముస్లిం)**

## ఏడవ షరతు - ప్రేమ

అంటే ఈ కలిమాను, ఈ కలిమా వాంఛించే అంశాలను ప్రేమించాలి. వాటి



కనుగుణంగా ఆచరించే ఏకేశ్వరోపాసకులను అభిమానించాలి. అల్లాహ్ సెలవిచ్చాడు :

﴿وَمِنَ النَّاسِ مَن يَتَّخِذُ مِن دُونِ اللَّهِ أَندَادًا يُحِبُّونَهُمْ كَحُبِّ اللَّهِ وَالَّذِينَ آمَنُوا أَشَدُّ حُبًّا لِّلَّهِ﴾ (البقرة:١٦٥)

**"అల్లాహ్‌ను కాదని ఆయనకు సహవర్తులుగా ఇతరులను నిలబెట్టి, అల్లాహ్‌ను ప్రేమించవలసిన విధంగా వారిని ప్రేమించేవారు కూడా ప్రజలలో కొందరున్నారు. అయితే విశ్వసించిన వారు అల్లాహ్‌ను అంతకంటే ప్రగాఢంగా (అధికంగా) ప్రేమిస్తారు." (అల్ బఖర:165)**

కాబట్టి బోధపడేదేమిటంటే لا إله إلا الله **'లా ఇలాహ ఇల్లల్లాహ్'**ను నమ్మేవారు అల్లాహ్ పట్ల నిష్కల్మషమైన ప్రేమాభిమానం కలిగి ఉంటారు. కాగా; బహుదైవోపాసకులు అల్లాహ్‌ను, దైవేతరులను కూడా ప్రేమిస్తారు. ఇది لا إله إلا الله **'లా ఇలాహ ఇల్లల్లాహ్'**కు విరుద్ధం.

**(ఆ) مُحَمَّدٌ رَّسُولُ اللَّهِ 'ముహమ్మదుర్రసూలుల్లాహ్' అని సాక్ష్యమివ్వటం : దానికి సంబంధించిన షరతులు :**

దీని షరతులు ఇవి –

1. మహాప్రవక్త (ﷺ) వారి దైవదౌత్యాన్ని స్వీకరించటం, హృదయపూర్వకంగా దానిపై విశ్వాసముంచటం.
2. ఈ కలిమాను మనస్ఫూర్తిగా అంగీకరించటమే గాక, నోటితో కూడా ప్రకటించటం.
3. మహనీయ ముహమ్మద్ (ﷺ) ఆజ్ఞలను శిరసావహించటం, ఆయనను అనుసరించటం. స్పష్టంగా చెప్పాలంటే ఆయన తెచ్చిన సత్యంపై త్రికరణ శుద్ధితో ఆచరించటం, ఆయన (ﷺ) వారించిన మిథ్యకు దూరంగా ఉండటం.
4. గతానికి – భవిష్యత్కాలానికి సంబంధించి ఆయన (ﷺ) తెలియజేసిన అగోచర విషయాలను సత్యమని ధ్రువపరచటం.
5. తన ధన ప్రాణాలకంటే అధికంగా, తన తల్లిదండ్రులకంటే, సమస్త మానవుల కంటే అధికంగా ఆయన (సఅసం) యెడల ప్రేమాభిమానాలు కలిగి ఉండటం.
6. ఆయన (ﷺ) మాటకు ఇతరులందరి మాటకన్నా అగ్రస్థానం ఇవ్వటం, ఆయన విధానాన్ని అవలంబించటం.

## నాల్గవది : షహాదతైన్ కోరేదేమిటి?

**(అ) لا إله الا الله 'లా ఇలాహ ఇల్లల్లాహ్' సాక్ష్యం కోరేదేమిటంటే –**

అల్లాహ్ తప్ప ఇతరత్రా దైవాలన్నింటి ఆరాధనను త్యజించాలి. కలిమా మొట్టమొదటి పదం لا إله **'లా ఇలాహ'** చెప్పేది ఇదే. కేవలం ఏకేశ్వరుడు, సాటిలేని వాడైన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలి. కలిమాలోని రెండవ పదం الا الله **'ఇల్లల్లాహ్'**

ఇచ్చే సందేశమిదే. సాధారణంగా ఈ కలిమాను అంగీకరించే వారిలో చాలామంది, అది కోరే వాటికి విరుద్ధంగా వ్యవహరిస్తూ ఉంటారు. ఏ దైవేతరుల పూజను ఖండించటం జరిగిందో దానికే పాల్పడుతూ ఉంటారు. అంటే; వారు మనుషులను, సమాధులను, మిథ్యా దైవాలను, చెట్టుపుట్టలను, రాళ్లు రప్పలను పూజిస్తూ ఉంటారు.

ఈ రకమయిన పనులు చేసేవారు ఏకేశ్వరోపాసన (తౌహీద్)నే బిద్అత్‌గా భావిస్తారు. ఏక దైవారాధన వైపు పిలిచేవారిపై తీవ్రమైన ఆక్షేపణలు లేవనెత్తుతారు. కేవలం అల్లాహ్‌ను ఆరాధించేవారిని పరిహసిస్తూ ఉంటారు. చులకనగా మాట్లాడతారు.

**(ఆ)** مُحَمَّدٌ رَّسُوْلُ اللهِ **ముహమ్మదుర్రసూలుల్లాహ్ సాక్ష్యం కోరేది :** ప్రవక్త ముహమ్మద్ (ﷺ) ఆజ్ఞలను శిరసావహించాలి. ఆయనకు విధేయత చూపాలి. ఆయన (ﷺ) చెప్పిన విషయాలను సత్యమని ధ్రువీకరించాలి. ఆయన (ﷺ) వారించిన విషయాలను విడనాడాలి. ఆయన (ﷺ) చూపిన మార్గమే అనుసరణీయంగా నమ్మాలి. ఆయన (ﷺ) చూపిన బాట తప్ప మిగిలినవన్నింటినీ బిద్అత్‌లు (దురాచారాలు, కొత్తపుంతలు) గా భావించాలి. ఆయన (ﷺ) ప్రవచనానికే ప్రాధాన్యత ఇవ్వాలి.

## ఐదవది : షహాదతైన్‌ను వృధా చేసే విషయాలు :

అంటే ఇస్లాంలో అనర్ధదాయకమైన అంశాలు. షహాదతైన్ (రెండు సాక్ష్యవచనాల) ద్వారా మనిషి ఇస్లాంలో ప్రవేశిస్తాడు. మనిషి సాక్ష్య వచనాలు పలికాడంటే దాని భావం ఏమిటి? అవి కోరే అంశాలను, ఇస్లాం చిహ్నాలను అంగీకరించి, వాటికి కట్టుబడి ఉంటానని మాటిచ్చాడన్నమాట! ఒకవేళ ఎవరయినా దీనికి కట్టుబడి ఉండకపోతే, అతను వాగ్దాన భంగానికి పాల్పడ్డాడు. కట్టుబాట్లను త్రెంచివేశాడు. ఈ విధంగా ఇస్లాం విధించిన కట్టుబాట్లను త్రెంచివేసే అంశాలు ఎన్నో ఉన్నాయి. వాటిని ధర్మవేత్తలు (ఫుకహా) తమ ఫికహ్ గ్రంథాలలో "ఇస్లాం నుండి ధర్మభ్రష్టం చేసే విషయాలు" అనే పేరుతో శాశ్వతంగా ఒక అధ్యాయాన్నే ఉంచారు. అలాంటి 10 అంశాలను షేఖుల్ ఇస్లాం ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్ అల్ తమీమీ (رحمه الله) ప్రస్తావించారు. అవేమంటే;

1. **అల్లాహ్ ఆరాధనలో భాగస్వాముల్ని కల్పించటం.** అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

﴿إِنَّ اللَّهَ لَا يَغْفِرُ أَن يُشْرَكَ بِهِ وَيَغْفِرُ مَا دُونَ ذَٰلِكَ لِمَن يَشَاءُ﴾ (النساء:٤٨)

**"తనకు భాగస్వామిగా మరొకరిని కల్పించటాన్ని (షిర్కు చేయటాన్ని) అల్లాహ్ సుతరామూ క్షమించడు. ఇది తప్ప ఆయన తాను కోరిన వారి ఇతర పాపాలను క్షమిస్తాడు." (అన్ నిసా : 48, 116)**

﴿إِنَّهُ مَن يُشْرِكْ بِاللَّهِ فَقَدْ حَرَّمَ اللَّهُ عَلَيْهِ الْجَنَّةَ وَمَأْوَاهُ النَّارُ وَمَا لِلظَّالِمِينَ مِنْ أَنصَارٍ﴾ (المائدة:٧٢)



**"ఎవడు అల్లాహ్‌కు సహవర్తులుగా ఇతరులను కల్పించాడో అలాంటి వాని కోసం అల్లాహ్ స్వర్గాన్ని నిషేధించాడని తెలుసుకోండి. అతని నివాసం నరకాగ్ని. దుర్మార్గులకు సహాయపడేవాడెవడూ ఉండడు." (అల్ మాయిదా : 72)**

దైవేతరుల కోసం జంతుబలి ఇవ్వటం కూడా షిర్క్ క్రిందికే వస్తుంది. సమాధుల పేర, జిన్నాతుల పేర జంతుబలి ఇవ్వటం లాంటిదే ఇది కూడా.

2. ఎవరయితే తనకూ – అల్లాహ్‌కు మధ్య మధ్యవర్తిత్వాన్ని కల్పించి వారిని మొరపెట్టుకుంటాడో, వారి సిఫారసు కోసం కోర్తాడో, వారిపై ఆశలు పెట్టుకుంటాడో అతను ముమ్మాటికీ అవిశ్వాసి (కాఫిర్).
3. ఎవడయితే ముష్రిక్కులను అవిశ్వాసులు (కాఫిర్లు)గా పరిగణించడో, లేదా వారు అవిశ్వాసులు అనే విషయంలో సందిగ్ధానికి లోనవుతాడో, లేదా వారి మతాన్ని సరైనదిగా ఖరారు చేస్తాడో అతను కూడా అవిశ్వాసే (సత్యతిరస్కారియే).
4. ఎవరయితే మహాప్రవక్త ముహమ్మద్ (ﷺ) విధానం కన్నా వేరితరుల విధానం పరిపూర్ణమైనదని నమ్ముతారో లేదా వేరితరుల తీర్పును ఆయన (ﷺ) తీర్పుకన్నా ఉత్తమమైనదని భావిస్తారో అలాంటివారు తమ స్వీయ కల్పిత శాసనాలకు ఇస్లాం శాసనాలపై ప్రాధాన్యత ఇచ్చినట్లే లెక్క. ఆ విధంగా వారు దైవప్రవక్త (ﷺ) నిర్ణయాలపై తాగూత్ (మిథ్యా దైవాల) నిర్ణయాలకు పెద్ద పీట వేశారన్నమాట!
5. ఎవరయితే మహాప్రవక్త ముహమ్మద్ (ﷺ) తెచ్చిన షరీయత్‌ను ద్వేషిస్తాడో అతను కాఫిర్ – ఒకవేళ అతను ఈ షరీయత్ ఆదేశాలను పాటించేవాడైనా సరే!
6. ఏ వ్యక్తి అయినాసరే దైవప్రవక్త (ﷺ) తెచ్చిన షరీయత్‌లోని ఏదేని విషయాన్ని పరిహసించినా లేదా అది పుణ్యప్రదం లేదా శిక్షార్హం అనే విషయాన్ని ఎద్దేవా చేసినా అతడు కాఫిర్‌గా పరిగణించబడతాడు. దీనికి ఆధారం ఇది :

﴿قُلْ أَبِاللَّهِ وَآيَاتِهِ وَرَسُولِهِ كُنتُمْ تَسْتَهْزِئُونَ ۞ لَا تَعْتَذِرُوا قَدْ كَفَرْتُم بَعْدَ إِيمَانِكُمْ﴾

**"ఏమిటి, మీరు అల్లాహ్‌తో, ఆయన సూక్తులతో, ఆయన ప్రవక్తతో పరిహాసమాడుతున్నారా? అని అడుగు. మీరింక సాకులు చెప్పకండి. మీరు విశ్వసించిన తరువాత అవిశ్వాసానికి ఒడిగట్టారు." (అత్ తౌబా : 65, 66)**

7. **చేతబడి, సర్ఫ్, ఇత్ఫ్** కూడా ఈ కోవకు చెందినవే. మనిషికి ఏదేని వస్తువు పట్ల గల మక్కువ నుండి అతని దృష్టిని మరల్చటం సర్ఫ్ అనబడుతుంది. ఉదాహరణకు: భర్తకు తన భార్యపై గల అపారమైన ప్రేమను పగ, ద్వేషంగా మార్చివేయటం.

ఇత్ఫ్ కూడా సర్ఫ్ లాగే ఒక క్షుద్రవిద్యే. దీని ప్రకారం ఒక మనిషికి ఒకానొక వస్తువు పట్ల కోరిక, ఆసక్తి ఏమాత్రం లేకపోయినప్పటికీ పైశాచిక పద్ధతుల ద్వారా అతనిలో కోర్కెను రగుల్గొల్పటం, ప్రేమను సృజించటం అన్నమాట. ఎవడయితే చేతబడి, బాణామతి లాంటి క్షుద్రవిద్యకు పాల్పడతాడో లేదా అలాంటి క్షుద్రపోకడల ద్వారా ఉపశమనం పొందుతాడో అతను కూడా అవిశ్వాసియే. దీనికి ఆధారం ఈ దైవసూక్తి.

﴿وَمَا يُعَلِّمَانِ مِنْ أَحَدٍ حَتَّى يَقُولَا إِنَّمَا نَحْنُ فِتْنَةٌ فَلَا تَكْفُرْ﴾ (البقرة:١٠٢)

**"మేము ఒక పరీక్ష వంటివారం. నువ్వు మాత్రం అవిశ్వాసానికి పాల్పడకు" అని చెప్పనంతవరకూ వారు (ఇద్దరూ) ఎవరికీ ఆ విద్యను నేర్పేవారు కారు. (అల్ బఖర : 102)**

8. **ముస్లిములకు వ్యతిరేకంగా ముష్రిక్కులను వెనకేసుకు రావటం :** ఈ విధంగా జరుగుతుందనే దానికి దివ్య ఖుర్ఆన్‌లోని ఈ సూక్తి నిదర్శనం :

﴿وَمَن يَتَوَلَّهُم مِّنكُمْ فَإِنَّهُ مِنْهُمْ إِنَّ اللَّهَ لَا يَهْدِي الْقَوْمَ الظَّالِمِينَ﴾ (المائدة:٥١)

**"మీలో ఎవరయినాసరే వారితో చెలిమిచేస్తే అతను కూడా వారిలో ఒకడు గానే భావించబడతాడు. నిశ్చయంగా అల్లాహ్ దుర్మార్గులకు సన్మార్గం చూపడు." (అల్ మాయిద : 51)**

9. కొంతమంది షరీయతె ముహమ్మదీ (ﷺ) అనుసరణకు బద్ధులు కానవసరం లేదని, వారు స్వేచ్ఛగా వ్యవహరించవచ్చునని ఉదాహరణకు : ఏ విధంగానయితే ఖిజర్, దైవప్రవక్త మూసా (عليه السلام) షరీయత్‌కు బద్ధులై ఉండలేదో – ఆ విధంగా ప్రవర్తించవచ్చునని నమ్మేవారు కూడా అవిశ్వాసులే.

ఉదాహరణకు : సూఫీలలో ఒక వర్గం వారున్నారు. వారు ఒకానొక స్థాయికి చేరుకున్న తరువాత మహాప్రవక్త ముహమ్మద్ (ﷺ) షరీయత్‌ను అనుసరించాల్సిన అవసరం లేదంటారు.

10. దైవధర్మం పట్ల విముఖతను, అనాసక్తతను చూపటం. దానిని గురించి తెలుసుకోకపోవటం. దాని ప్రకారం ఆచరించకపోవటం. దీనికి ఆధారం ఈ దైవసూక్తులు :

﴿وَالَّذِينَ كَفَرُوا عَمَّا أُنذِرُوا مُعْرِضُونَ﴾ (الأحقاف:٣)

**"కాని అవిశ్వాసులు తాము హెచ్చరించబడే విషయం నుండి ముఖం త్రిప్పుకుంటున్నారు." (అల్ అహ్ఖాఫ్ : 3)**

﴿وَمَنْ أَظْلَمُ مِمَّن ذُكِّرَ بِآيَاتِ رَبِّهِ ثُمَّ أَعْرَضَ عَنْهَا إِنَّا مِنَ الْمُجْرِمِينَ مُنتَقِمُونَ﴾ (السجدة:٢٢)



**"తన ప్రభువు ఆయతుల ఆధారంగా బోధపరచినప్పటికీ వాటి నుండి ముఖం త్రిప్పుకుపోయిన వానికంటే దుర్మార్గుడెవడుంటాడు? మేము కూడా (అలాంటి) పాపాత్ములపై తప్పకుండా ప్రతీకారం తీర్చుకుంటాము." (అస్ సజ్దహ్ : 22)**

షేఖ్ ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్ (رحمه الله) ఇలా అంటున్నారు : "ఇస్లాంను వృథా గావించే ఇలాంటి విషయాలకు ఒడిగట్టడం – అది వేళాకోళానికి జరిగినా, సీరియస్‌గా జరిగినా, భయాందోళన వల్ల జరిగినా – ఎలాంటి వ్యత్యాసం ఉండదు. ఎవరయినా బలవంతంగా అలాంటి పని చేయిస్తే అది వేరే విషయం. అది క్షంతవ్యమే. ఇలాంటి పోకడలన్నీ ప్రమాదకరమైనవి. సంక్లిష్టమైనవి. జనులు విరివిగా ఇలాంటి చేష్టలకు ఒడిగడుతున్నారు. కనుక ముస్లిములు ఇలాంటి వాటిపట్ల ఆక్షేపణను తెలియజేయాలి. నిత్యం ఇలాంటి వాటిపట్ల అతి జాగ్రత్తగా ఉండాలి. అల్లాహ్ ఆగ్రహానికి గురిచేసే విషయాల నుండి, ఆయన విధించే వ్యథాభరితమైన శిక్ష నుండి మేము శరణు వేడుకుంటున్నాము." (మజ్మూఅతుత్తౌహీద్ : 1, పేజీలు 37 – 39)

## మూడవ ప్రకరణం

# షరీయత్ రూపకల్పన గురించి

షరీయత్ రూపకల్పన కేవలం అల్లాహ్ హక్కు. షరీయత్ లేదా తష్రీ అంటే విశ్వప్రభువు అయిన అల్లాహ్ తరపున అవతరింపజేయబడిన జీవన సంవిధానం. విశ్వాసాలలోనూ, వ్యవహారాలలోనూ దైవదాసులు దాని కనుగుణంగా నడుచుకుంటారు. అల్లాహ్ ధర్మ సమ్మతం (హలాల్)గా చేసినది, నిషిద్ధం (హరామ్) గా ఖరారు చేసినది కూడా అందులో చేరి ఉంది. కాబట్టి ఏ వ్యక్తి అయినాసరే దేవుడు ధర్మసమ్మతంగా చేసిన దానినీ, అధర్మంగా ఖరారు చేసినదానిని శిరసావహించటం వినా మార్గాంతరం లేదు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَلَا تَقُولُوا لِمَا تَصِفُ أَلْسِنَتُكُمُ الْكَذِبَ هَٰذَا حَلَالٌ وَهَٰذَا حَرَامٌ لِّتَفْتَرُوا عَلَى اللَّهِ الْكَذِبَ﴾(النحل:١١٦)

**“ఏ వస్తువునయినా తమ నోటితో ‘ఇది ధర్మసమ్మతం’ అనీ, ‘ఇది నిషిద్ధం’ అనీ ఇష్టమొచ్చినట్లు అబద్ధం చెప్పేసి, అల్లాహ్‌కు అబద్ధాలు ఆపాదించకండి.” (అన్ నహ్ల్ : 116)**

ఇంకా ఈ విధంగా సెలవీయబడింది :

﴿قُلْ أَرَأَيْتُم مَّا أَنزَلَ اللَّهُ لَكُم مِّن رِّزْقٍ فَجَعَلْتُم مِّنْهُ حَرَامًا وَحَلَالًا قُلْ آللَّهُ أَذِنَ لَكُمْ أَمْ عَلَى اللَّهِ تَفْتَرُونَ﴾(يونس:٥٩)

**“అల్లాహ్ మీ కోసం ఆహారాన్ని అవతరింపజేయగా దానిలో కొంత భాగాన్ని మీరు మీ కోసం నిషేధించుకుని, మరికొంత భాగాన్ని ధర్మసమ్మతం చేసుకున్నారే, దీనికి మీ సమాధానం ఏమిటి?” అని వారిని అడుగు. “ఏమిటీ, ఈ మేరకు అల్లాహ్ మీకు ఆదేశించాడా? లేక మీరే అల్లాహ్‌కు అబద్ధాలను అంటగడుతున్నారా?” అని వారిని అడుగు. (యూనుస్ : 59)**

పైన పేర్కొనబడిన సూక్తులలో అల్లాహ్ ఖుర్ఆన్ హదీసుల ఆధారం లేకుండా ఏదేని వస్తువును హలాల్‌గానో, హరామ్‌గానో ఖరారు చేయటాన్ని వారించాడు. ఈ విధంగా చేసేవాడు అల్లాహ్‌కు అబద్ధాన్ని అంటగట్టిన వాడవుతాడని కూడా తెలిపాడు. అంతేకాదు, ఎవరయినా నిరాధారంగా ఏదేని వస్తువును తప్పనిసరి (వాజిబ్) గా లేదా నిషిద్ధం (హరామ్)గా ఖరారు చేసుకున్నట్లయితే, అలాంటి వ్యక్తి తనంతట తానుగా ఆ విషయంలో ‘అల్లాహ్ భాగస్వామి’గా నిలబెట్టుకున్నాడని సావధానపరచటం జరిగింది. కాగా; ఇది అల్లాహ్ స్వంతం. షరీయత్‌ను రూపొందించటం, షరీయత్ ఆదేశాలను జారీ చేయటం అల్లాహ్‌కే చెల్లుతుంది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :



﴿أَمْ لَهُمْ شُرَكَاءُ شَرَعُوا لَهُم مِّنَ الدِّينِ مَا لَمْ يَأْذَن بِهِ اللَّهُ﴾(الشورى:٢١)

**“ఏమిటీ, అల్లాహ్ అనుమతితో నిమిత్తం లేకుండానే తమ కోసం ఏవైనా ధర్మాదేశాలను నిర్ధారించే భాగస్వాములను గాని మీరు కలిగి ఉన్నారా?” (అష్ షూరా : 21)**

ఏ వ్యక్తి అయినా ధర్మజ్ఞానం పొందిన మీదట కూడా అల్లాహ్‌ను వదలి ఇతరత్రా షరీయత్ కర్తల వెనుక నడిస్తే, వారు చెప్పిందల్లా తుది వాక్కుగా భావించి ఆచరిస్తే, అట్టి వ్యక్తి అల్లాహ్‌తో పాటు అతన్ని భాగస్వామిగా నిలబెట్టినట్లే లెక్క. ఈ పూర్వ రంగంలో దేవుడేమంటున్నాడో చూడండి :

﴿وَإِنْ أَطَعْتُمُوهُمْ إِنَّكُمْ لَمُشْرِكُونَ﴾(الأنعام:١٢١)

**“ఒకవేళ మీరు గనక వారిని అనుసరించారంటే, మీరు కూడా అల్లాహ్‌కు సహవర్తుల్ని కల్పించినవారు అయిపోతారు (జాగ్రత్త!).” (అల్ అన్ ఆమ్ : 121)**

అంటే; అల్లాహ్ నిషేధించిన మృత జంతువులను హలాల్ (ధర్మసమ్మతం)గా చేసుకున్న వారు చెప్పినట్లుగా ఎవరయినా నడుచుకుంటే వారు ముష్రిక్కులుగా పరిగణించబడతాడు. అలాగే అల్లాహ్ నిషేధించిన (హరామ్ గావించిన) వాటిని ధర్మసమ్మతం (హలాల్)గా, అల్లాహ్ ధర్మసమ్మతం చేసిన వస్తువులను నిషిద్ధం (హరామ్)గా ఖరారు చేయటంలో పండితులను, సన్యాసులను అనుసరించేవారు కూడా అల్లాహ్‌ను వదలి వారిని తమ ప్రభువులుగా చేసుకున్నారు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿اتَّخَذُوا أَحْبَارَهُمْ وَرُهْبَانَهُمْ أَرْبَابًا مِّن دُونِ اللَّهِ وَالْمَسِيحَ ابْنَ مَرْيَمَ وَمَا أُمِرُوا إِلَّا لِيَعْبُدُوا إِلَٰهًا وَاحِدًا لَّا إِلَٰهَ إِلَّا هُوَ سُبْحَانَهُ عَمَّا يُشْرِكُونَ﴾(التوبة:٣١)

**“వారు అల్లాహ్‌ను వదలి తమ పండితులను, సన్యాసులను తమ ప్రభువులుగా చేసుకున్నారు – మర్యమ్ కుమారుడైన మసీహ్‌ను కూడా! నిజానికి వారికి, ఒక్కడైన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించవలసిందిగా ఆజ్ఞాపించబడింది. ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేదు. వారు నిర్ధారించుకుంటున్న భాగస్వామ్యాలకు ఆయన అతీతుడు, పవిత్రుడు.” (అత్ తౌబా : 31)**

అదీ బిన్ హాతిమ్ (رضي الله عنه) ఈ సూక్తిని విన్నప్పుడు, “దైవప్రవక్తా (స)! మేమైతే వారిని ఎన్నడూ ఆరాధించలేదు కదా!’ అని సందేహపడ్డారు. దానికి దైవప్రవక్త (صلى الله عليه وسلم), “వారు (ఆ పండితులు, క్రైస్తవ సన్యాసులు) అల్లాహ్ నిషేధించిన వాటిని ధర్మసమ్మతంగా ఖరారు చేయగా, మీరు వాటిని ధర్మసమ్మతం (హలాల్) అని భావించేవారు. అల్లాహ్

ధర్మసమ్మతం చేసిన వస్తువులను వారు నిషిద్ధం (హరామ్)గా ప్రకటిస్తే, మీరు వాటిని నిషిద్ధంగానే పరిగణించేవారు. ఇది నిజం కాదా!?" అని ప్రశ్నించారు. దానికాయన (رضي الله عنه) 'నిజమే. మేమలాగే భావించేవారం' అని సమాధానమిచ్చారు. "వారిని ఆరాధించటమంటే ఇదే" అని ఆయన (ﷺ) వివరించారు. (తిర్మిజీ-3095 హసన్)

షేఖ్ అబ్దుర్రహ్మాన్ బిన్ హసన్ (రహ్మ) ఇలా అంటున్నారు : అల్లాహ్‌కు అవిధేయత కనబరిచే విషయంలో పండితులను, సన్యాసులను అనుసరించటం అంటే అల్లాహ్‌ను వదలిపెట్టి, వాళ్లను ఆరాధించటం వంటిదేనని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఇది పెద్ద షిర్క్. దీనిని అల్లాహ్ క్షమించడు. యదార్థానికి ఆ సూక్తి చివర్లో దైవవాక్కు ద్వారా స్పష్టంగా ఇది బోధపడుతోంది –

﴿وَمَا أُمِرُوا إِلَّا لِيَعْبُدُوا إِلَـهاً وَاحِداً لَّا إِلَـهَ إِلَّا هُوَ سُبْحَانَهُ عَمَّا يُشْرِكُونَ﴾ (التوبة:٣١)

**"నిజానికి వారికి, ఒక్కడైన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించవలసిందిగా ఆజ్ఞాపించబడింది. ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేదు. వారు నిర్ధారించుకుంటున్న భాగస్వామ్యాలకు ఆయన అతీతుడు, పవిత్రుడు." (అత్ తౌబా : 31)**

అలాగే దేవుని ఈ ఉత్తర్వు కూడా గమనార్హమే.

﴿وَلَا تَأْكُلُوا مِمَّا لَمْ يُذْكَرِ اسْمُ اللّهِ عَلَيْهِ وَإِنَّهُ لَفِسْقٌ وَإِنَّ الشَّيَاطِينَ لَيُوحُونَ إِلَى أَوْلِيَآئِهِمْ لِيُجَادِلُوكُمْ وَإِنْ أَطَعْتُمُوهُمْ إِنَّكُمْ لَمُشْرِكُونَ﴾ (الأنعام:١٢١)

**"అల్లాహ్ పేరు స్మరించబడని జంతువులను తినకండి. ఎందుకంటే ఇది ఆజ్ఞోల్లంఘన క్రిందికి వస్తుంది. మీతో వాదులాడటానికి షైతానులు తమ మిత్రులను ఉసిగొల్పుతున్నారు. ఒకవేళ మీరు గనక వారిని అనుసరించారంటే మీరు కూడా అల్లాహ్‌కు సహవర్తుల్ని కల్పించిన వారవుతారు (తస్మాత్ జాగ్రత్త!)."(అల్ అన్ ఆమ్ : 121)**

నేడు తమ ఇమాములను, పెద్దలను అనుసరించేవారిలో చాలామంది పరిస్థితి కూడా ఇదే. ఏదేని ప్రామాణిక ఆధారం వారి ఇమాములకు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ వారు లెక్క చేయరు. ఇలాంటివారి ఆచరణ కూడా ఇలాంటి షిర్క్ పరిధిలోకే వస్తుంది.

కాబట్టి అల్లాహ్ షరీయతు ప్రకారం ఆచరించటం, ఇది మినహా ఇతరత్రా షరీయతును పరిత్యజించటం అవసరం. لا إله إلا الله '**లా ఇలాహ ఇల్లల్లాహ్**' కోరే వాటిలో అత్యంత ప్రధానమైన విషయమిది. అల్లాహ్ తోడ్పడుగాక! وَاللّٰهُ الْمُسْتَعَانُ



## నాల్గవ ప్రకరణం

# ఇబాదత్ అంటే ఏమిటి?

**(1) ఇబాదత్ అర్థం :** అశక్తత, అణకువ, వినయం, వినమ్రత, దీనావస్థలకు మరోపేరే ఆరాధన (ఇబాదత్).

**షరీయత్‌పరంగా :** షరీయత్‌లో దీనికి పలు నిర్వచనాలున్నప్పటికీ వాటన్నింటి భావార్థం మటుకు ఒకటే.

**ఒక నిర్వచనం :** అల్లాహ్ తన ప్రవక్తల ద్వారా పంపిన ఆజ్ఞను శిరసావహిస్తూ ఆయనకు విధేయత చూపటమే ఇబాదత్ (ఆరాధన, దాస్యం).

**మరో నిర్వచనం :** ఇబాదత్ (దాస్యం, ఆరాధన) అంటే అర్థం పరమపవిత్రుడైన అల్లాహ్ ముందు అణకువను, వినయ వినమ్రతలను వ్యక్తం చేయటం. అంటే అల్లాహ్ యెడల భక్తితో, ప్రేమాతిశయంతో తన నిస్సహాయ స్థితిని చాటి చెప్పటం.

**ఇబాదత్ సమగ్ర నిర్వచనం ఇది :** మనో వాక్కాయ కర్మల చేత మనిషి అల్లాహ్‌కు నచ్చిన, అల్లాహ్‌కు మెచ్చిన వాటిని చేయటమే ఇబాదత్ అనబడుతుంది.

ఈ ఆరాధనలు మనసుతోనూ, మాటలతోనూ, కర్మలతోనూ ముడిపడి ఉన్నాయి. వీటిలో భయము, ఆశ, ప్రేమ, నమ్మకం, అనుబంధం వంటివన్నీ మనసుతో సంబంధమున్న ఆరాధనలనబడతాయి. దైవస్తోత్రం, దేవుని పవిత్రతను కొనియాడటం, దేవుని గొప్పదనాన్ని చాటి చెప్పటం కృతజ్ఞతలు తెలుపటం – వీటన్నింటి సంబంధం మనసుతో, నోటితో ఉంటుంది.

నమాజ్ చేయటం, జకాత్ చెల్లించటం, హజ్జ్ చేయటం, జిహాద్ చేయటం వంటి ఆరాధనలన్నీ శారీరకమైనవి. అయితే వీటన్నింటి వెనుక కూడా అంతర్ప్రేరణ ఉంటుంది.

ఇవి గాకుండా ఆరాధనలో మరెన్నో రకాలున్నాయి. వాటన్నింటి సంబంధం మనసుతో, నోటితో, శరీరంతో ఉంటుంది.

దేవుడు ప్రాణులను సృష్టించటంలోని అసలు ఉద్దేశ్యం ఆరాధనే.

﴿وَمَا خَلَقْتُ الْجِنَّ وَالْإِنسَ إِلَّا لِيَعْبُدُونِ ☆ مَا أُرِيدُ مِنْهُم مِّن رِّزْقٍ وَمَا أُرِيدُ أَن يُطْعِمُونِ ☆ إِنَّ اللَّهَ هُوَ الرَّزَّاقُ ذُو الْقُوَّةِ الْمَتِينُ﴾ (الذاريات:٥٦،٥٨)

**"నేను జిన్నాతులను, మానవులను సృష్టించినది వారు నన్ను ఆరాధించటానికి మాత్రమే. నేను వారి నుండి జీవనోపాధిని కోరటం లేదు. వారు నాకు అన్నం పెట్టాలని కూడా నేను కోరటం లేదు. అల్లాహ్ స్వయంగా అందరికీ ఉపాధిని సమకూర్చేవాడు. ఆయన మహాశక్తిశాలి, మహాబలుడు." (అజ్ జారియాత్ : 56 – 58)**

మానవుల, జిన్నాతుల పుట్టుకలోని పరమార్థం దైవారాధన, దైవదాస్యమేనని పై

సూక్తుల ద్వారా విదితమవుతోంది. అల్లాహ్ అక్కరలేనివాడు. వారు ఆయన్ని ఆరాధించకపోయనంత మాత్రాన ఆయనకు కలిగే నష్టం ఏమీ లేదు. యదార్థానికి అది వారి అవసరం. ఎందుకంటే వారు అనుక్షణం అల్లాహ్‌పై ఆధారపడి ఉన్నారు. కనుక వారు ఆయన్ని, ఆయన చూపిన పద్ధతి (షరీయత్) ప్రకారం ఆరాధించాలి. దైవారాధనకు నిరాకరించినవాడు 'గర్విష్టి' అనబడతాడు. దైవారాధనలో ఇతరులకు భాగస్వామ్యం కల్పించినవాడు 'ముష్రిక్' (షిర్క్ చేసినవాడు) అవుతాడు. దేవుడు పంపిన షరీఅత్‌కు విరుద్ధంగా దైవారాధన చేసినవాడు 'బిద్అతీ' గా పరిగణించబడతాడు. కాగా; ఒక్కడైన అల్లాహ్‌ను ఆయన పంపిన షరీయత్ ప్రకారం ఆరాధించినవాడు విశ్వాసి (మోమిన్)గా, ఏకేశ్వరోపాసి (ముమహ్హిద్) గా భావించబడతాడు.

## (2) ఇబాదత్ (ఆరాధన) పలు రకాలు. అందులో చేరి ఉన్న అంశాలు:

ఆరాధన అనేది అనేక రకాలు. మనిషి నోటిద్వారా, శరీరావయవాల ద్వారా వ్యక్తమయ్యే, మనసు ద్వారా ప్రేరితమయ్యే ఎన్నో వినయ విధేయతలను, క్రియలను అది తనలో అంతర్లీనం చేసుకుని ఉంది. ఉదాహరణకు : దైవకీర్తన, దేవుని పవిత్రతను కొనియాడటం, ఖుర్‌ఆన్ పారాయణం, ఖుర్‌ఆన్ అనుసరణ, నమాజ్, ఉపవాసం, జకాత్, హజ్జ్, జిహాద్, మంచిని పెంపొందించటం, చెడుల నుండి ఆపటం, బంధువుల, అనాథల, బాటసారుల హక్కును నెరవేర్చటం, అల్లాహ్ పట్ల, ఆయన ప్రవక్త పట్ల ప్రేమ కలిగి ఉండటం, దైవభీతి, దేవుని వైపునకు పశ్చాత్తాపభావంతో మరలటం, ధర్మాన్ని కేవలం అల్లాహ్ కొరకు ప్రత్యేకించటం, దైవనిర్ణయాలపై ఓర్పు వహించటం, దేవుని విధి వ్రాతపై సంతృప్తిచెందటం, అల్లాహ్‌పైనే భారం మోపటం, ఆయన కారుణ్యాన్ని ఆశించటం, ఆయన శిక్షకు భయపడటం – ఇవన్నీ ఆరాధనలో అంతర్భాగమే. అంతేకాదు, ఒక విశ్వాసి చేసే ప్రతి పనీ – దాని వెనుక సత్సంకల్పం గనక ఉంటే – అది ఆరాధనా పరిధిలోనికే వస్తుంది. ఆఖరికి అతని దైనందిన అలవాట్లు సయితం ఆరాధనలోనికే వస్తాయి. కాకపోతే ఆ అలవాట్లలో అతను దైవ విధేయతకు కట్టుబడి ఉండాలి. దైవప్రసన్నతను చూరగొనటమే అతని నిజ ధ్యేయమై ఉండాలి. ఉదాహరణకు : తినటం, త్రాగటం, నిద్రించటం, క్రయవిక్రయాలు జరపటం, జీవనోపాధిని అన్వేషించటం, వివాహమాడటం – ఇవన్నీ సంకల్పశుద్ధి మూలంగా ఆరాధనలుగా మారిపోతాయి. వీటికి గాను పుణ్యఫలం ప్రాప్తిస్తుంది. ఇబాదత్ (ఆరాధన) అనేది కేవలం కొన్ని ప్రసిద్ధిచెందిన క్రియలకు, చిహ్నాలకు మాత్రమే ప్రతీక కాదు.



### ఐదవ ప్రకరణం

# ఇబాదత్ నిర్ధారణలో ఉన్న అపోహలు, అపార్థాలు

ఆరాధనలు దైవం తరఫున నిర్ధారితమైనవి – అంటే ఏ ఆరాధన అయినా దైవగ్రంథానికి, దైవప్రవక్త (ﷺ) విధానానికి విరుద్ధంగా, నిరాధారంగా చేస్తే అది సమ్మతం కాదు. షరీయత్‌లో లేని ఆరాధన స్వీకారయోగ్యమవదు. పైగా అదొక కొత్త పోకడ (బిద్అత్)గా పరిగణించబడుతుంది. మహనీయ ముహమ్మద్ (ﷺ) ప్రవచించినట్లు:

"مَنْ عَمِلَ عَمَلاً لَيْسَ عَلَيْهِ أَمْرُنَا فَهُوَ رَدٌّ" (متفق عليه)

**"మేము ఆజ్ఞాపించని పనిని ఎవరయినా చేస్తే అది కొట్టివేయబడు తుంది (త్రోసిపుచ్చబడుతుంది)." (ముత్తఫఖున్ అలై)**

అంటే; అతని ఆచరణ అతనికే త్రిప్పి పంపబడుతుంది – అది స్వీకరించబడదు. పైగా ఆ పనిచేసిన కారణంగా అతను పాపాత్ముడవుతాడు. ఎందుకంటే అతను అవిధేయతకు ఒడిగట్టాడు. విధేయుడుగా రాణించలేదు.

షరీయతు ద్వారా రూఢీ అయిన ఆరాధనలను నెరవేర్చేటప్పుడు మనిషి రెండు అతివాదాలకు నడుమ మధ్యేమార్గాన్ని అవలంబించాలి. ఇదే సరైన విధానం. దేవుడు తన ప్రవక్త (సఅసం) కు ఈ విధంగా ఉపదేశించాడు :

﴿فَاسْتَقِمْ كَمَا أُمِرْتَ وَمَن تَابَ مَعَكَ وَلَا تَطْغَوْا﴾ (هود:١١٢)

**"కనుక (ఓ ముహమ్మద్!) నీకు ఆజ్ఞాపించబడినట్లుగా నీవూ, నీతోపాటు (పశ్చాత్తాపభావంతో) మరలి వచ్చినవారూ గట్టిగా నిలబడి ఉండండి. హద్దు మీరకండి." (హూద్ : 112)**

ఆరాధనలను పాటించే విషయంలో ఈ సూక్తిలో సరైన విధానమేదో, దాని పరిమితులేవో స్పష్టంగా సూచించబడ్డాయి. అంటే హెచ్చుతగ్గులు చేయకుండా, కుడి ఎడమల అపవాదాలకు లోనుకాకుండా మధ్యేమార్గాన్ని అవలంబించాలి. దానిపై నిలకడ చూపాలి. దివ్య వచనంలో సూచించినట్లుగా షరీయత్ కనుగుణంగా ఆరాధన చేయాలి. ఆయత్‌లో ﴿كَمَا أُمِرْتَ﴾ **'ఆజ్ఞాపించబడినట్లుగా'** అనే పదం గమనించదగినది. ఆ తరువాత ﴿وَلَا تَطْغَوْا﴾ **'హద్దు మీరవద్దు'** అని చెప్పటం కూడా గమనార్హమే. తనకు చేయబడిన సూచనను లక్ష్యపెట్టకుండా, నిర్లక్ష్యంగా అవధులు మీరిపోవటాన్ని అరబీలో **'తుగ్‌యాన్'** అంటారు. అంటే ఇక్కడ భావం ఆరాధనలలో అతిశయిల్లటం అన్నమాట!

అలాగే – తన ప్రియ సహచరులలో ముగ్గురు వ్యక్తులు తమ దైనందిన ఆచరణలను తక్కువగా భావించి, అతివాదంతో కూడిన ఒక నిర్ణయానికి వచ్చారని మహాప్రవక్త (ﷺ) కు తెలిసింది. అంటే వారిలో ఒకరు అనుదినం ఉపవాసం ఉంటానని, ఉపవాస విరమణ

చేయనని నిర్ణయించుకోగా, నేను రాత్రంతా నమాజ్‌లో నిలబడతాను, అసలు నిద్రేపోనని రెండోవ్యక్తి సంకల్పించుకున్నాడు. నేనసలు స్త్రీలను వివాహమే చేసుకోనని మూడవ వ్యక్తి నిశ్చయించుకున్నాడు. ఆయన (ﷺ) ఆ ముగ్గురినీ ఉద్దేశ్యించి, "నేను (నఫిల్) ఉపవాసాలూ పాటిస్తాను, మధ్య మధ్యలో ఉపవాస విరమణ కూడా చేస్తుంటాను. నేను రాత్రిపూట జాగరణ కూడా చేస్తాను. నిద్రపోవటం కూడా చేస్తాను. నేను స్త్రీలను వివాహమాడుతాను కూడా. నా విధానం పట్ల విముఖత చూపినవాడు నా వాడు కాడు" అని ఉపదేశించారు. (ముత్తఫకున్ అలై)

నేడు ప్రజలు ఆరాధనల విషయంలో రెండు వర్గాలుగా చీలిపోయారు. ఒకరు తూర్పున ఉంటే మరొకరు పడమరన ఉన్నారు.

## మొదటి వర్గం :

ఆరాధనల భావార్థాన్ని గ్రహించటంలో వీరివల్ల లోటు జరిగింది. అందువల్ల వీరు దైవారాధన విషయంలో మరీ బద్ధకంగా వ్యవహరిస్తున్నారు. ఆరాధనల క్రిందవచ్చే ఎన్నో విషయాలను వీరు స్తంభింపజేశారు. పైగా వాటిని కొన్ని ప్రత్యేక ఆచారాలకు, చిహ్నాలకు పరిమితం చేసివేశారు. అవి కేవలం మస్జిద్‌లో మాత్రమే ఆచరించబడతాయి. గృహ వ్యవహారాలలో, కార్యాలయాలలో, దుకాణాలలో, వ్యవహారాలలో, రాజకీయాలలో, వివాదాలపై తీర్పు తదితర విషయాలలో ఆరాధనా భావానికి – వీరి దృష్టిలో – ఎలాంటి ప్రమేయమే లేదు.

మస్జిదులకు గల ప్రాశస్త్యాన్ని ఎవరూ కాదనటం లేదు. ఐదు పూటల నమాజులను మస్జిదులలో చేయటం తప్పనిసరే. కాని ఒక ముస్లిం జీవితపు సమస్త విభాగాలను ఆరాధన (ఇబాదత్) పరివేష్టించి ఉంది – అతను మస్జిదులో ఉన్నా, మస్జిద్ బయట ఉన్నా వాటి నుండి తప్పించుకోలేడు.

## రెండవ వర్గం :

ఆరాధనలు, ఉపాసనల నిర్వర్తనలో ఈ వర్గం వారి వ్యవహారం అతిశయిల్లి రాగాన పడింది. వీళ్లు అభిలషణీయం (ముస్తహబాత్) అయిన ఎన్నో ఆరాధనలను తప్పనిసరి (వాజిబ్)గా చేసుకున్నారు. అనుమతించబడిన కొన్ని ముబాహ్ వస్తువులను తమ కొరకు నిషిద్ధం (హరామ్) చేసేసుకున్నారు. తమ అభిమతానికి, దృక్పథానికి వ్యతిరేకంగా కనిపించే వారిని మార్గవిహీనులుగా, పాపాత్ములుగా ముద్రవేస్తున్నారు. తమ వెంట రాని వారిని అంటరానివారుగా చూస్తున్నారు. వారి అవగాహనను తప్పుడు అవగాహనగా ఖరారు చేస్తున్నారు. యదార్థానికి మహనీయ ముహమ్మద్ (ﷺ) వారి విధానమే అత్యుత్తమ విధానం. ధర్మంలో జరిగే కొంగ్రొత్త ఆవిష్కరణలు, సరికొత్త పోకడలన్నీ అధ్వాన్నమైనవే. పెడదారి పట్టించేవే.



### ఆరవ ప్రకరణం

# సిసలయిన ఆరాధనకు మూలసూత్రాలు

'ఆరాధన' అనేది మూడు మూలస్తంభాలపై నిలబడి ఉంది : (1) ప్రేమ (భక్తి), (2) భయము (3) ఆశ.

కనుక ఆరాధన (ఇబాదత్)లో అశక్తత, అణకువలతో పాటు ప్రేమ పరవశించాలి. భీతితో పాటు ఆశాభావం కూడా ఉట్టిపడాలి. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿فَسَوْفَ يَأْتِي اللَّهُ بِقَوْمٍ يُحِبُّهُمْ وَيُحِبُّونَهُ﴾ (المائدة:٥٤)

**"అలాగైతే అల్లాహ్ త్వరలోనే మరో జాతి వారిని తీసుకువస్తాడు. అల్లాహ్ వారిని ప్రేమిస్తాడు. వారు అల్లాహ్‌ను ప్రేమిస్తారు."**
**(అల్ మాయిద : 54)**

ఇంకా ఇలా సెలవిచ్చాడు :

﴿وَالَّذِينَ آمَنُوا أَشَدُّ حُبًّا لِّلَّهِ﴾ (البقرة:١٦٥)

**"విశ్వసించినవారు అల్లాహ్‌ను అంతకంటే ప్రగాఢంగా (అధికంగా) ప్రేమిస్తారు." (అల్ బఖర : 165)**

దేవుడు తన ప్రవక్తల సుగుణాలను వివరిస్తూ ఇలా సెలవిచ్చాడు :

﴿إِنَّهُمْ كَانُوا يُسَارِعُونَ فِي الْخَيْرَاتِ وَيَدْعُونَنَا رَغَبًا وَرَهَبًا وَكَانُوا لَنَا خَاشِعِينَ﴾ (الأنبياء:٩٠)

**"ఈ సజ్జనులు సత్కార్యాల కోసం త్వరపడేవారు. ఆశతోనూ, భయంతోనూ మమ్మల్ని వేడుకునేవారు." (అల్ అంబియా : 90)**

కొందరు సలఫ్‌లు ఇలా అభిప్రాయపడ్డారు : కేవలం ప్రేమాతిశయంతో దైవారాధన చేసినవాడు పాషండుడు, పారసీక మతస్థుడు (జిన్ దీఖ్). కేవలం ఆశతో దైవారాధన చేసేవాడు మర్జీ వర్గీయుడు. కేవలం భయం కొద్దీ దైవారాధన చేసేవాడు ఖవారిజ్ వర్గానికి చెందినవాడు. ప్రేమ, భయం, ఆశ – ఈ మూడు భావాలను రంగరించి దైవారాధన చేసేవాడు విశ్వాసి, ఏక దైవారాధకుడు. షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ రిసాల (అల్ అబూదియహ్)లో ఈ విషయం ప్రస్తావించారు. ఆయన ఇంకా ఇలా అన్నారు : దైవధర్మం అంటే ఏమిటి? దైవాన్ని ఆరాధించటం. ఆయనకు విధేయులై ఉండటం. ఆయన ముందు అశక్తతను, అణకువను వ్యక్తపరచటం. అశక్తత, అణకువలకు నామాంతరమే ఆరాధన. ఏదైనా దారి పదే పదే నడవటం వల్ల సుగమం అవుతే దానిని అరబీలో طريق متعبد **'తరీఖ్ ముతఅబ్బద్'** (దాసోహమన్న దారి) అంటారు. అయితే మనిషికి ఆజ్ఞాపించబడిన దాస్యం (ఆరాధన)లో దీనావస్థతో పాటు, ప్రేమ కూడా కలగలసి ఉంది. అంటే ఆరాధనకు పూనుకున్నప్పుడు అతనిలో అల్లాహ్ పట్ల అమితమైన ప్రేమ పొంగి

పొరలడంతో పాటు, అతనిలో వినయ వినమ్రతలు కూడా ఉట్టిపడాలి. ఎవరయినా వేరొకరి యెడల ద్వేషాన్ని అణచిపెట్టుకుని అతనికి లోబడి వ్యవహరిస్తే, అతన్ని ఆరాధించేవాడని అనరు. అలాగే అతను ఏదైనా వస్తువును అమితంగా ఇష్టపడుతూ కూడా దానికి లోబడకపోతే దానిపట్ల అతనికి గల ఆరాధనా భావం స్వీకారయోగ్య మవదు. ఉదాహరణకు: మనిషి తన ఆలుబిడ్డలను ప్రేమిస్తాడు. చెప్పవచ్చిందేమిటంటే; రెండింటిలో ఏదో ఒక్క వస్తువు ఉన్నంత మాత్రాన అది అల్లాహ్ ఆరాధనకు సరిపోదు. పైగా దాసుని దృష్టిలో అల్లాహ్ అన్ని వస్తువులకన్నా ఎక్కువ ప్రియతముడై ఉండాలి. అన్ని వస్తువులకన్నా గొప్పవాడై ఉండాలి. ఇంకా చెప్పాలంటే ప్రేమకు, సంపూర్ణ విధేయతకు హక్కుదారుడు కేవలం అల్లాహ్ మాత్రమే అయి ఉండాలి. (మజ్మూఅతు త్తౌహీద్ అన్ నజ్దియ : పేజీ – 549)

ఇవీ ఆరాధన యొక్క ప్రాథమిక సూత్రాలు. వీటిపైనే అది ఆధారభూతమై ఉంది. అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) **'ఖసీదహ్ నూనీయ'**లో ఇలా అంటున్నారు –

"కరుణామయుని దాస్యం (ఆరాధన) ఎలా ఉండాలంటే ఆరాధకుడు అత్యంత వినయ వినమ్రతతో పాటు అల్లాహ్ యెడల అంతులేని ప్రేమ కలిగి ఉండాలి. ఆరాధనకు ఇవి రెండూ (వినమ్రత, ప్రేమ) మూలాంశాలు (ధ్రువ నక్షత్రాలు). ఈ రెండింటిపైనే ఆరాధన అనే అంతరిక్ష గ్రహం పరిభ్రమిస్తూ ఉంది. ఈ రెండు ధ్రువ నక్షత్రాలు నెలకొననంత వరకూ గ్రహం తిరుగాడదు. ఈ పరిభ్రమణం కూడా దైవప్రవక్త (ﷺ) ఆదేశానుసారం జరుగుతోంది. మనో వాంఛలకు, పైశాచిక ప్రేరణలకు లోబడి ఎంత మాత్రం కాదు."

ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) ప్రియతముడు అయిన అల్లాహ్ కోసం అశక్తత, అణకువ, ప్రేమలతో కూడుకున్న ఆరాధనా పరిభ్రమణమును రెండు ధ్రువ నక్షత్రాలపై పరిభ్రమించే అంతరిక్ష గ్రహంతో పోల్చారు. ఈ ఆరాధన కూడా మహాప్రవక్త ముహమ్మద్ (ﷺ) ఆదేశానికి, ఆయన గారి షరీయత్‌కి అనుగుణంగా ఉంటుందని ప్రస్తావించారు. అంతేగాని మనోవాంఛలకు, పైశాచిక ప్రేరణలకు లోబడి కాదు. ఎందుకంటే ఇవి ఆరాధన (ఇబాదత్) కావు గనక. కాబట్టి దైవప్రవక్త ముహమ్మద్ (ﷺ) నిర్దేశించినది మాత్రమే ఆరాధన అనే అంతరిక్ష గ్రహాన్ని నడిపిస్తుంది. దురాచారాలు, కల్పిత విషయాలు, మనోవాంఛలు, తాతల తండ్రుల అనుసరణా పంథా దానిని నడిపించలేవు.

# 3. తౌహీదె అస్మా వ సిఫాత్

## (దైవ నామాలు, దైవగుణాలలో ఏకత్వం)

ఈ విషయం క్రింది అంశాలతో కూడుకుని ఉంది.

**మొదటిది** : దైవ నామాలు, గుణగణాలకు సంబంధించి ఖుర్ఆన్, హదీసుల వెలుగులో ఆధారాలు, బౌద్ధికమైన నిదర్శనాలు.

**రెండవది** : అల్లాహ్ పేర్లు, గుణగణాల గురించి అహ్లె సున్నత్ వల్ జమాఅత్ విధానం.

**మూడవది** : అల్లాహ్ నామాలను, గుణగణాలను లేదా వాటిలో కొన్నింటిని నిరాకరించే వారి ధోరణిని ఖండించటం.

**మొదటిది : దైవనామాలు, గుణాల గురించి ఖుర్ఆన్, హదీసుల ఆధారాలు, బౌద్ధికమైన ఆధారాలు.**

### (అ) ఖుర్ఆన్ హదీసుల ఆధారాలు :

ఇంతకుముందు మేము తౌహీదె ఉలూహియత్, తౌహీదె రుబూబియత్, తౌహీదె అస్మా వ సిఫాత్ అనే మూడు రకాలను గురించి ప్రస్తావించి ఉన్నాము. వాటిలో మొదటి రెండింటి ఆధారాలను, నిదర్శనాలను గురించి కూడా చర్చించాము. ఇప్పుడు తౌహీద్ మూడవ రకమయిన 'అస్మా వ సిఫాత్' (దైవనామాలు, గుణగణాల)ను రూఢీచేసే ఆధారాలను తెలుసుకుందాము.

### (1) దివ్య ఖుర్ఆన్ ద్వారా కొన్ని ఆధారాలు :

﴿وَلِلَّهِ الْأَسْمَاءُ الْحُسْنَى فَادْعُوهُ بِهَا وَذَرُوا الَّذِينَ يُلْحِدُونَ فِي أَسْمَائِهِ سَيُجْزَوْنَ مَا كَانُوا يَعْمَلُونَ﴾ (الأعراف:١٨٠)

**"అల్లాహ్‌కు మంచి పేర్లున్నాయి. కాబట్టి మీరు ఆయన్ని ఆ పేర్లతోనే పిలవండి. ఆయన పేర్ల విషయంలో వక్రంగా వాదించే వారిని వదలిపెట్టండి. వారు చేస్తూ ఉండిన దానికి వారు తప్పకుండా శిక్షించబడతారు." (అల్ ఆరాఫ్ : 180)**

ఈ సూక్తి ద్వారా అల్లాహ్ తనకు కొన్ని పేర్లున్నాయని, అవి అత్యుత్తమమయిన పేర్లని తెలియజేస్తున్నాడు. ఆ పేర్లతోనే తనను పిలవమని కూడా ఆదేశించాడు. ఉదాహరణకు : ఓ రహ్మాన్ (ఓ దయాకరా!), ఓ రహీమ్ (ఓ కృపాశీలుడా!), ఓ హై (ఓ సజీవుడా!), ఓ ఖయ్యూమ్ (ఓ ఆధారభూతుడా!), ఓ రబ్బిల్ ఆలమీన్ (ఓ లోకేశ్వరుడా!) మొదలగునవి. తన నామాల విషయంలో వక్రవైఖరి అవలంబించే వారిని, నిరాకరించేవారి గురించి హెచ్చరించాడు. ఎందుకంటే వారు అల్లాహ్ పేర్ల విషయంలో సత్యం నుండి

తొలగిపోతారు లేదా అల్లాహ్‌కు గల పేర్లను పూర్తిగా నిరాకరిస్తారు. లేదా వాటి అర్థాలను వక్రీకరిస్తారు లేదా నాస్తికతకు సంబంధించిన మరేదైనా దారి తెరుస్తారు. అలాంటి వారికి, తమ స్వయంకృతానికి తగిన శిక్ష లభిస్తుందని కూడా అల్లాహ్ హెచ్చరించాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿اللَّهُ لَا إِلَهَ إِلَّا هُوَ لَهُ الْأَسْمَاءُ الْحُسْنَىٰ﴾ (طه:٨)

**"ఆయనే అల్లాహ్. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. సుందరమైన పేర్లన్నీ ఆయనవే." (తాహా : 8)**

﴿هُوَ اللَّهُ الَّذِي لَا إِلَهَ إِلَّا هُوَ عَالِمُ الْغَيْبِ وَالشَّهَادَةِ هُوَ الرَّحْمَنُ الرَّحِيمُ☆هُوَ اللَّهُ الَّذِي لَا إِلَهَ إِلَّا هُوَ الْمَلِكُ الْقُدُّوسُ السَّلَامُ الْمُؤْمِنُ الْمُهَيْمِنُ الْعَزِيزُ الْجَبَّارُ الْمُتَكَبِّرُ سُبْحَانَ اللَّهِ عَمَّا يُشْرِكُونَ☆هُوَ اللَّهُ الْخَالِقُ الْبَارِئُ الْمُصَوِّرُ لَهُ الْأَسْمَاءُ الْحُسْنَى يُسَبِّحُ لَهُ مَا فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ وَهُوَ الْعَزِيزُ الْحَكِيمُ﴾ (الحشر:٢٢-٢٤)

**"ఆయనే అల్లాహ్. ఆయన తప్ప మరో ఆరాధ్య దేవుడు లేడు – గోప్యంగా ఉన్నవాటికి, బహిర్గతమై ఉన్నవాటిని ఎరిగినవాడు. ఆయన కరుణామయుడు, కృపాశీలుడు. ఆయనే అల్లాహ్ – ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయనే రాజాధిరాజు, పరమ పవిత్రుడు, లోపాలన్నింటికీ అతీతుడు, శాంతిప్రదాత, పర్యవేక్షకుడు, సర్వశక్తుడు, బలపరాక్రమాలు గలవాడు, పెద్దరికం గలవాడు. ప్రజలు (ఆయనకు) కల్పించే భాగస్వామ్యాల నుండి అల్లాహ్ పవిత్రంగా ఉన్నాడు. ఆయనే అల్లాహ్ – సృష్టికర్త, ఉనికిని ప్రసాదించేవాడు, రూపకల్పన చేసేవాడు. అత్యుత్తమమైన పేర్లన్నీ ఆయనకే ఉన్నాయి. భూమ్యాకాశాలలో ఉన్న ప్రతి వస్తువూ ఆయన పవిత్రతను కొనియాడుతోంది. ఆయనే సర్వాధికుడు, వివేకవంతుడు." (అల్ హష్ర్ : 22 – 24)**

## (2) మహాప్రవక్త (సఅసం) మహితోక్తుల వెలుగులో దైవ నామాలకు సంబంధించిన ఆధారాలు :

హ్రజత్ అబూ హురైరా (رضي الله عنه) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (ﷺ) ఇలా ప్రవచించారు :

"إِنَّ لِلَّهِ تِسْعَةً وَتِسْعِينَ اسْمًا، مِائَةً إِلَّا وَاحِدًا، مَنْ أَحْصَاهَا دَخَلَ الْجَنَّةَ" (متفق عليه)

**"అల్లాహ్‌కు 99 పేర్లున్నాయి – ఒకటి తక్కువ వంద పేర్లు. ఇవి ఎటువంటి నామాలంటే, వాటిని (జ్ఞానపరంగానూ, క్రియాత్మకంగానూ) గ్రహించినవాడు స్వర్గంలో ప్రవేశిస్తాడు." (ముత్తఫఖున్ అలై)**



అల్లాహ్ యొక్క అత్యుత్తమ నామాలు కేవలం ఈ సంఖ్య (99)కే పరిమితం కావు. దీనికి ఆధారం హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (رضي الله عنه) గారి ఈ ఉల్లేఖనం – మహనీయ ముహమ్మద్ (ﷺ) ఇలా వేడుకున్నారు –

"أَسْأَلُكَ بِكُلِّ اسْمٍ هُوَ لَكَ سَمَّيْتَ بِهِ نَفْسَكَ وَ أَنْزَلْتَهُ فِي كِتَابِكَ أَوْ عَلَّمْتَهُ أَحَدًا مِنْ خَلْقِكَ أَوِ اسْتَأْثَرْتَ بِهِ فِي عِلْمِ الْغَيْبِ عِنْدَكَ أَنْ تَجْعَلَ الْقُرْآنَ رَبِيعَ قَلْبِي وَ نُورَ صَدْرِي وَجَلَاءَ حُزْنِي وَ ذَهَابَ هَمِّي وَ غَمِّي" (مسند احمد:٣٥٢٨، صحيح الجامع:٢٦٢٢)

**"(ఓ అల్లాహ్!) నేను నీకు గల ప్రతి నామం ఆధారంగా నిన్ను అర్థిస్తున్నాను–దేని ద్వారానయితే నిన్ను నీవు పిలుచుకున్నావో! లేదా నీ గ్రంథంలో అవతరింపజేశావో! లేదా నీ సృష్టితాలలో ఎవరికయినా నేర్పావో! లేదా దానిని నీ వద్దనే – అగోచర జ్ఞానంలో భద్రపరచి ఉంచావో! అలాంటి ప్రతి నామం ఆధారంగా నిన్ను వేడుకుంటున్నాను (ప్రభూ!) మహత్తరమైన ఖుర్ఆన్‌ను నా హృదయ వసంతం గావించు!"**

*(ఈ హదీసును ఇమామ్ అహ్మద్ తన ముస్నద్–3528 లో పొందు పరిచారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైన హదీసుగా ఖరారు చేశారు. అల్లాహ్ పేర్లు కేవలం 99కే పరిమితమై లేవని ఈ హదీసు నిరూపిస్తోంది. కనుక ఈ హదీసు ద్వారా విదితమయ్యేదేమిటంటే – నిజము దేవుడెరుగు – ఈ 99 పేర్లను నేర్చుకున్నవాడు, వాటి ఆధారంగా అర్థించినవాడు, వాటి ఆధారంగా దైవారాధన చేసినవాడు స్వర్గంలో ప్రవేశిస్తాడు. ఈ విశిష్టత ఈ పేర్లకే స్వంతం–సహీహుల్ జామె–2622).*

అల్లాహ్ యొక్క ప్రతి నామం ఆయన గుణగణాలలోని ఒకానొక గుణాన్ని సూచిస్తోంది. ఉదాహరణకు : 'అలీమ్' అనే నామం ఆయనలోని ఇల్మ్ (జ్ఞాన) గుణానికి నిదర్శనంగా ఉంది. అలాగే 'హకీమ్' అనే పేరు ఆయనలోని హిక్మత్ (యుక్తి, వివేకం)ను సూచిస్తోంది. 'సమీ' అనే పేరు ఆయన 'సమ్అ' (వినే) గుణానికి తార్కాణంగా ఉంది. 'బసీర్' అనే ఆయన నామం ఆయనలోని 'బసర్' (చూసే, గమనించే) గుణానికి నిదర్శనంగా ఉంది. ఇదేవిధంగా ప్రతి పేరు అల్లాహ్ గుణ విశేషాలలో ఏదో ఒక గుణానికి ఆధారంగా ఉన్నది.

అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు :

﴿قُلْ هُوَ اللَّهُ أَحَدٌ☆اللَّهُ الصَّمَدُ☆لَمْ يَلِدْ وَلَمْ يُولَدْ☆وَلَمْ يَكُنْ لَهُ كُفُوًا أَحَدٌ﴾ (الاخلاص:١-٤)

**(ఓ ముహమ్మద్!) వారికి చెప్పు : "ఆయన అల్లాహ్ (నిజ ఆరాధ్యుడు) ఒకే ఒక్కడు. అల్లాహ్ నిరపేక్షాపరుడు (ఏ అక్కరా లేనివాడు). ఆయన (ఎవరినీ) కనలేదు. ఆయన (కూడా) ఎవరికీ పుట్టినవాడు కాదు. ఆయనకు సరిసమానుడు (సరితూగేవాడు, పోల్చదగినవాడు) ఎవడూ లేడు." (అల్ ఇఖ్లాస్ : 1 – 4)**

హజ్రత్ అనస్ (رضي الله عنه) కథనం : ఒక అన్సారీ వ్యక్తి మస్జిదె ఖుబాలో వారికి ఇమామత్ చేసేవాడు (వారి సామూహిక నమాజుకు సారథ్యం వహించేవాడు). అతనెప్పుడు నమాజ్ చేయించినా (ఫాతిహా సూరా అనంతరం) **'ఖుల్‌హు వల్లాహు అహద్'** సూరా పారాయణం మొదలెట్టేవాడు. ఆ తరువాత ఏదైనా మరో సూరా పఠించేవాడు. అతను ప్రతి రకాత్‌లో అలాగే చేసేవాడు. సహచరులలో ఇది చర్చనీయాంశం అయింది. వారంతా కలసి అతనితో మాట్లాడారు. "నీవు ఇదే సూరాతో ఖిరాత్ మొదలెడుతున్నావు. పోనీ దీంతో సరిపెట్టుకుంటావా అంటే అదీ లేదాయె. దీంతో పాటు మరో సూరా కూడా పఠిస్తున్నావు. నీవు పఠిస్తే ఈ ఒక్క సూరాయే పఠించు. లేదంటే దీనిని వదిలేసి వేరే సూరా ఏదన్నా పఠించు" అని అతన్ని కోరారు. దానికతను ఇలా జవాబిచ్చాడు : "నేను ఈ సూరాను వదలనుగాక వదలను. మీకిష్టముంటే నేనిలాగే ఇమామత్ చేస్తాను. ఇలా చేయటం ఇష్టం లేదనుకుంటే చెప్పండి, మీ సారథ్య బాధ్యతలు వదులుకుంటాను." కాని వారంతా ఆ వ్యక్తిని తామందరిలోకెల్లా ఉత్తమునిగా పరిగణించేవారు. కనుక అతను తప్ప వేరొక వ్యక్తి తమకు ఇమామత్ చేయటం వారికిష్టం లేదు. మహాప్రవక్త (ﷺ) తమ వద్దకు ఏతెంచినపుడు, పరిస్థితుల స్వరూపాన్ని క్షుణ్ణంగా వివరించారు. అప్పుడాయన (ﷺ) ఆ వ్యక్తినుద్దేశించి,

"ఓ ఫలానా వ్యక్తీ! నీ సహచరులు అడుగుతున్నట్లుగా మసలుకోవటంలో నీకు వచ్చిన చిక్కేమిటీ? అంటే ప్రతి రకతులో ఇదే సూరా పఠించటానికి నిన్ను ప్రేరేపిస్తున్నదేది?" అని ప్రశ్నించారు.

దానికా వ్యక్తి, "నేనీ సూరాను ప్రగాఢంగా ఇష్టపడుతున్నాను" అన్నాడు.

"ఈ సూరాపట్ల నీకు గల ప్రేమ నిన్ను స్వర్గానికి చేరుస్తుంది" అని మహాప్రవక్త (ﷺ) చెప్పారు. (సహీహ్ బుఖారీ)

హజ్రత్ ఆయిషా (رضي الله عنها) కథనం ఇలా ఉంది : దైవప్రవక్త (ﷺ) ఒక వ్యక్తిని ఓ చిన్న సైనిక బృందానికి అమీర్ (నాయకుని)గా నియమించి పంపారు. ఆ వ్యక్తి తన బృందానికి నమాజ్ చేయించేవాడు. ఈ సందర్భంగా ఖిరాత్ చివర్లో ఎలాగయినాసరే **"ఖుల్‌హు వల్లాహు అహద్"** సూరా చదివేవాడు. ఆ బృందంలోని సభ్యులు తిరిగి వచ్చాక, ఈ సంగతిని దైవప్రవక్త (ﷺ) ముందు ప్రస్తావించగా,

"అతనలా ఎందుకు చేసేవాడో అతన్నే అడగండి" అని ఆయన (ﷺ) సూచించారు.



జనులు ఈ విషయమై అతన్ని దర్యాప్తు చేయగా అతనిలా అన్నాడు : "ఈ సూరా పారాయణం అంటే నాకెంతో ఇష్టం." ఇది విని దైవప్రవక్త (ﷺ) ఇలా అన్నారు :

"అల్లాహ్ అతన్ని ఇష్టపడుతున్నాడని అతనికి తెలియజేయండి." (సహీహ్ బుఖారీ)

అంటే; ఈ సూరా కరుణామయుడైన అల్లాహ్ గుణగణాలతో కూడుకుని ఉంది.

తనకు ముఖం కూడా ఉందని అల్లాహ్ తెలియజేశాడు. దీనికి నిదర్శనం ఈ సూక్తి :

﴿وَيَبْقَى وَجْهُ رَبِّكَ ذُو الْجَلَالِ وَالْإِكْرَامِ﴾ (الرحمن:٢٧)

**"ఎప్పటికీ మిగిలి ఉండేది వైభవోపేతుడైన, గౌరవనీయుడైన నీ ప్రభువు ముఖారవిందమే." (అర్ రహ్మాన్ : 27)**

అలాగే – అల్లాహ్‌కు రెండు చేతులున్నాయి :

﴿لِمَا خَلَقْتُ بِيَدَيَّ﴾ (ص:٧٥)

**"నేనతన్ని (ఆదమును) నా రెండు చేతులతో సృష్టించాను." (సాద్ : 75)**

﴿بَلْ يَدَاهُ مَبْسُوطَتَانِ﴾ (المائدة:٦٤)

**"వాస్తవానికి అల్లాహ్ చేతులు రెండూ తెరచుకుని ఉన్నాయి." (అల్ మాయిద : 64)**

ఇంకా – అల్లాహ్ సంతోషిస్తాడు, ప్రేమిస్తాడు, కినుక వహిస్తాడు, ఆగ్రహిస్తాడు – ఇవన్నీ ఆయన లక్షణాలే. ఇవిగాక మరెన్నో లక్షణాలున్నాయి. వాటిని గురించి ఆయన స్వయంగా చెప్పుకున్నాడు. దైవప్రవక్త (ﷺ) ప్రవచనాల ద్వారా కూడా ఆయన లక్షణాలు తెలుస్తున్నాయి –

## (ఆ) అల్లాహ్ నామాలను, లక్షణాలను నిరూపించే బౌద్ధిక ఆధారాలు

దేవుని నామాలు, గుణగణాలకు సంబంధించి షరీయత్‌పరమయిన ఆధారాలున్నట్లే బుద్ధిపరమయిన ఆధారాలు, నిదర్శనాలు కూడా ఉన్నాయి :

1. రకరకాల సృష్టితాలు అసంఖ్యాకంగా ఉనికిలోనికి రావటం. తమ సృష్టికి వెనుక ఉన్న పరమార్థాలను నెరవేర్చటంలో అవి పకడ్బందీగా పనిచేయటం, తమ కొరకు నిర్ధారించబడిన కక్ష్యలో – పరిధిలో – ఉండి మరీ తమ కర్తవ్యాన్ని నిర్వర్తించటం, ఇవన్నీ దేవుని ఘనత్వానికి, శక్తికి, యుక్తికి, జ్ఞానానికి, ఆయన ఇచ్ఛకు నిలువు టద్దంగా ఉన్నాయి.
2. అనుగ్రహించటం, మేలు చేయటం, కష్టాలను, ఆపదలను తొలగించటం – ఇవన్నీ దైవకారుణ్యానికి, ఉదాత్త గుణానికి నిదర్శనంగా ఉన్నాయి.

3. అవిధేయులను శిక్షించటం, ధిక్కారులపై ప్రతీకారం తీర్చుకోవటం – ఇది దైవాగ్రహ గుణానికి తార్కాణం.

4. విధేయులను, విశ్వాసపాత్రులను సత్కరించటం, కటాక్షించటం, వారికి పుణ్యఫలం ప్రసాదించటం – ఇవి రెండూ దైవ ప్రసన్నతకు, ప్రేమైక గుణానికి దర్పణంగా ఉన్నాయి.

**రెండవది : దైవనామాలు, దైవగుణాల విషయంలో అహ్లె సున్నత్ వల్ జమాఅత్ విధానం :** అహ్లెసున్నత్ వల్ జమాఅత్ వారు, సలఫె సాలెహ్ కోవకు చెందినవారు, వారి అనుయాయులు – అల్లాహ్ నామాలు, గుణగణాల విషయంలో వీరందరి విధానం ఒక్కటే. దైవగ్రంథంలో, దైవప్రవక్త (ﷺ) సున్నత్‌లో తెలుపబడినట్లుగా వారు వాటిని యథాతథంగా విశ్వసిస్తారు. వారి పద్ధతి క్రింది నిబంధనలననుసరించి ఉంటుంది.

(1) వీరు దైవనామాలను, గుణగణాలను దైవగ్రంథానుసారం, ప్రవక్త విధానానుసారం నమ్ముతారు. తదనుగుణంగానే వాటిని రూఢీ చేస్తారు. వాటి బాహ్య స్వరూపానికి విరుద్ధంగా అర్థాలు తీయరు. వాటిని మార్చే ప్రయత్నం కూడా చేయరు.

(2) ఆయన నామాలను, లక్షణాలను సృష్టితాల లక్షణాలతో పోల్చి చెప్పటాన్ని వ్యతిరేకిస్తారు. ఉదాహరణకు : అల్లాహ్ సెలవిచ్చినట్లు –

﴿لَيْسَ كَمِثْلِهِ شَيْءٌ وَهُوَ السَّمِيعُ الْبَصِيرُ﴾ (الشورى:١١)

**"ఆయన్ని పోలిన వస్తువేదీ లేదు. ఆయన వినేవాడు, చూసేవాడు."**
**(అష్ షూరా : 11)**

(3) దైవనామాలను, దైవిక గుణాలను రుజువు చేయటానికి ఏ ఏ ఆధారాలు, నిదర్శనాలు ఖుర్‌ఆన్, హదీసులలో ఇవ్వబడ్డాయో, వాటిని సుతరామూ ఉల్లంఘించరు. దేవుడు, దైవప్రవక్త (ﷺ) ఏ ఏ ఆధారాలను, రుజువులను చూపారో, వాటిని ఖచ్చితంగా అంగీకరిస్తారు. దేవుడు, దైవప్రవక్త (ﷺ) త్రోసిపుచ్చిన వాటిని వీరు కూడా త్రోసిరాజంటారు. ఏ విషయాలపై దేవుడు, దైవప్రవక్త (ﷺ) మౌనం వహించారో వాటిపై వీరు కూడా మౌనం వహిస్తారు.

(4) దైవనామాలు, గుణగణాలకు సంబంధించిన దైవసూక్తులను వీరు తిరుగులేనివిగా, స్పష్టమైనవి (ముహ్కమాత్)గా విశ్వసిస్తారు. వాటి భావార్థాన్ని గ్రహించవచ్చునని, వాటిని గురించి కూలంకషంగా విడమరచి చెప్పటం సాధ్యమేనని భావిస్తారు. ఈ ఆయతులను వారు అస్పష్టమైనవిగా, నిగూఢమైనవి (ముతషాబిహాత్) గా పరిగణించరు. అందుకే వారు – అభినవ రచయితలు కొంతమంది లాగా తప్పుడు ప్రకటనలు ఇవ్వటంగానీ, విషయాన్ని దృష్టి మళ్లించే ప్రయత్నం చేయటం గానీ చేయరు. మొత్తానికి వీరి వ్యవహారం ఈ విషయంలో నిర్దిష్టంగా, నిర్ద్వంద్వంగా, సూటిగా ఉంటుంది.



(5) గుణగణాల వైనం ఎలా ఉంటుంది? అన్న ప్రశ్న జనించినపుడు ఆ జ్ఞానం అల్లాహ్‌కే ఉందని చెబుతారు. ఈ విషయంలో వితండ వాదనకు దిగరు. అనవసరంగా విషయాన్ని సాగదీయరు.

**మూడవది : మొత్తం పేర్లను, గుణగణాలను లేదా వాటిలో కొన్నింటిని నిరాకరించే వారి ధోరణిని ఖండించటం –**

దైవ నామాలను, గుణగణాలను నిరాకరించే వారిలో మూడు రకాల వారున్నారు–

1. **జహ్మియా వర్గం :** వీరు జహమ్ బిన్ సఫ్వాన్ అనుయాయులు. వీళ్లు దేవుని పేర్లన్నింటినీ, గుణగణాలన్నింటినీ నిరాకరిస్తారు.

2. **మోతజిలా వర్గం :** వీళ్లు వాసిల్ బిన్ అతా అనుయాయులు. వాసిల్ ఇమామ్ హసన్ బస్రీ సమావేశాల నుండి వేరైపోయాడు. వీరు కేవలం అల్లాహ్ నామాలను మాత్రమే రూఢీ చేస్తారు. అయితే ఆ నామాలు కేవలం పదాలేనని, వాటికి అర్థం అనేది ఏమీ లేదని వాదిస్తారు. ఇక దేవుని గుణగణాల విషయానికివస్తే, ఆసాంతం వాటిని నిరాకరిస్తారు.

3. **అషాఅరా[1], మాతరీదీయ[2] వర్గీయులు – వారి అనుయాయులు :**

వీరు దైవనామాలు, గుణగణాలలో కొన్నింటిని అంగీకరిస్తారు. కొన్ని గుణాలను మాత్రం నిరాకరిస్తారు.

వీరి అభిమతానికి పునాది ఇది :

అల్లాహ్‌ను ఆయన సృష్టితాలతో పోల్చే చేష్ట నుండి తాము సురక్షితంగా ఉండాలి. ఎందుకంటే ప్రాణులలో కొందరున్నారు. వారు తమను దైవనామాలతో పిలుచుకుంటున్నారు. దైవ గుణాలలో కొన్ని గుణాలను తమ కొరకు ప్రత్యేకించుకుంటున్నారు. ఇది సరైనది కాదు. ఎందుకంటే దీనివల్ల పేర్లు, గుణగణాల విషయంలో సృష్టికర్త – సృష్టితాలు కలగాపులగం అవుతున్నాయి. తత్కారణంగా ఆ రెండింటి వాస్తవికతలో కూడా 'భాగస్వామ్యానికి' తావు ఏర్పడుతున్నది. ఆ విధంగా సృష్టితాలను కూడా సృష్టికర్తతో పోల్చేందుకు ఆస్కారం కలుగుతోంది – ఇదీ వారి వాదన. అందువల్ల వారు క్రింద పేర్కొనబడిన రెండు విషయాలలో ఏదో ఒకదానిని మాత్రమే అవలంబిస్తారు.

**(అ)** వారు దైవనామాలు, దైవ గుణాలకు సంబంధించిన 'మూలాల'ను వాటి బాహ్యార్థాల ద్వారా గ్రహిస్తారు. ఉదాహరణకు : (దేవుని) 'ముఖము'ను దేవుని అస్తిత్వం అనే అర్థంలో తీసుకుంటారు. (దేవుని) 'చేతులు'ను దైవానుగ్రహం అన్న భావంలో తీసుకుంటారు.

**(ఆ)** లేదా ఈ 'మూలాల' భావార్థాన్ని అల్లాహ్‌కే వదలివేస్తారు. అదేమంటే, వాటి అర్థం అల్లాహ్‌కే తెలుసు అంటారు. ఈ నామాలు మరియు గుణాలు వాటి బాహ్యార్థంలో లేవని కూడా నమ్ముతారు.

అన్నిటికన్నా ముందు అల్లాహ్ నామాలను, గుణాలను త్రోసిపుచ్చిన వారు కొందరు అర[...]ు:

﴿كَذَٰلِكَ أَرْسَلْنَاكَ فِي أُمَّةٍ قَدْ خَلَتْ مِن قَبْلِهَا أُمَمٌ لِّتَتْلُوَ عَلَيْهِمُ الَّذِي أَوْحَيْنَا إِلَيْكَ وَهُمْ يَكْفُرُونَ بِالرَّحْمَٰنِ﴾ (الرعد:٣٠)

**“(ఓ ముహమ్మద్!) ఇదేవిధంగా మేము నిన్ను ఈ సమాజంలోకి పంపాము – ఇంతకు మునుపు ఎన్నో సమాజాలు గతించాయి –మా తరఫున నీపై అవతరించిన వాణిని వారికి వినిపించటానికి! వారు కరుణామయుని (అల్లాహ్‌ను) తిరస్కరిస్తున్నారు.” (అర్ రాద్ : 20)**

ఈ సూక్తి అవతరణ వెనుక గల నేపథ్యం ఇది :

దైవప్రవక్త (సఅసం) కరుణామయుని (రహ్మాన్) ప్రస్తావన తీసుకువచ్చినప్పుడు, వారు దానిని స్పష్టంగా త్రోసిపుచ్చారు. అప్పుడు అల్లాహ్ వారి గురించి ﴿وَهُمْ يَكْفُرُونَ بِالرَّحْمَٰنِ﴾ **“వారు కరుణామయుని (అల్లాహ్‌ను) తిరస్కరిస్తున్నారు”** అనే ఆయతును అవతరింపజేశాడు.

ఇది హుదైబియా ఒడంబడిక సందర్భంగా ఎదురయిన సంఘటన అని అల్లామా ఇబ్నె జరీర్ అభిప్రాయపడ్డారు. దైవప్రవక్త (ﷺ)కు – అరబ్బు ముష్రిక్కులకు మధ్య జరిగిన ఒడంబడికను లిఖించటానికి పూనుకున్నప్పుడు, దైవప్రవక్త (ﷺ) **‘బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్’** అని వ్రాయించారు. దానికి ఖురైషులు అభ్యంతరం తెలుపుతూ ‘రహ్మాన్ ఎవరో మాకు తెలీదు’ అన్నారు.

ఇబ్నె జరీర్ గారు హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (رضي الله عنه) ఉల్లేఖనాన్ని ఈ సందర్భంగా ఉదాహరించారు. దీని ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (ﷺ) సజ్దా స్థితిలో దుఆ చేస్తూ “యా రహ్మాన్! యా రహీమ్!” అనేవారు. అది విన్న ముష్రిక్కులు, ‘ఈయన గారు ఒక ఆరాధ్య దైవాన్ని మొరపెట్టుకుంటున్నట్టు భావిస్తున్నాడు. కాని ఆయన మొరపెట్టుకునేది ఇద్దరు ఆరాధ్యులను’ అని ఎద్దేవా చేశారు. అప్పుడు అల్లాహ్ ఈ సూక్తిని అవతరింపజేశాడు.

﴿قُلِ ادْعُوا اللَّهَ أَوِ ادْعُوا الرَّحْمَٰنَ أَيًّا مَّا تَدْعُوا فَلَهُ الْأَسْمَاءُ الْحُسْنَىٰ﴾ (الاسراء:١١٠)

**వారికి చెప్పు : “అల్లాహ్‌ను అల్లాహ్ అని పిలిచినా, రహ్మాన్ అని పిలిచినా – ఏ పేరుతో పిలిచినా–మంచి పేర్లన్నీ ఆయనవే.”**

**(అల్ ఇస్రా : 110)**

1. *వీరు అబుల్ హసన్ అష్అరీ అభిమతాన్ని అనుసరించేవారు. అయితే అబుల్ హసన్ తరువాతి కాలంలో తన విధానానికి స్వస్తిపలికి అహ్లె సున్నత్ అభిమతాన్ని అవలంబించారు. కాని అతని అనుయాయులు మరలి రాలేదు. కాబట్టి వీళ్లకు అషాఅరా వర్గీయులని అనటం సరికాదు.*
2. *వీరు అబూ మన్సూర్ మాతరీదీ అనుయాయులు.*



అల్ ఫుర్ఖాన్ సూరాలో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు :

﴿وَإِذَا قِيلَ لَهُمُ اسْجُدُوا لِلرَّحْمَٰنِ قَالُوا وَمَا الرَّحْمَٰنُ﴾ (الفرقان:٦٠)

**“కరుణామయునికి సాష్టాంగపడండి” అని వారితో అన్నప్పుడు, ‘కరుణామయుడంటే ఏమిటి? (ఇంతకీ ఆయనెవరు?)’ అని వారంటారు. (అల్ ఫుర్ఖాన్ : 60)**

కనుక దైవ నామాలను, దైవగుణాలను – ఏ విధంగానయినా నిరాకరించే ఈ ముష్రిక్కులు, జహ్మియా వర్గీయులు, మోతజిలా వర్గీయులు, అషాఅరా అనుంగు అనుచరులు, ఇంకా ఈ ధోరణిని అనుసరించే వారి పూర్వీకులు – వీరంతా నిరసించదగిన వారు.

దైవనామాలను, గుణగణాలను నిరాకరించేవారి ధోరణి క్రింది పద్ధతుల ద్వారా ఖండించబడుతుంది –

## మొదటి పద్ధతి :

మొదటి పద్ధతి ఏమిటంటే అల్లాహ్ తన కొరకు నామాలను, గుణాలను రూఢీ చేశాడు. ఆయన ప్రవక్త (ﷺ) కూడా ఆయనకు పేర్లు, గుణాలున్నాయని రుజువు చేశాడు. కనుక అల్లాహ్ నామాలను, గుణాలను పూర్తిగాగానీ, పాక్షికంగా గానీ నిరాకరించటమంటే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (ﷺ) నిరూపించిన వాటిని ఏకంగా త్రోసిపుచ్చటమే అవుతుంది. ఆ విధంగా ఇది దైవంతోనూ, దైవప్రవక్త (ﷺ)తోనూ వ్యతిరేకతను, శత్రుత్వాన్ని కొనితెచ్చుకునే చేష్టే.

## రెండవ పద్ధతి :

రెండవ పద్ధతి ఏమిటంటే; మనుషులలో దేవునిలోని సుగుణాలు కానవచ్చినంత మాత్రాన లేదా మనుషులలో కొందరికి అల్లాహ్ పేర్లున్నంతమాత్రాన సృష్టికర్తకు – సృష్టితాలకు (దేవుడికీ – మనుషులకు) మధ్య సామ్యం, పోలిక ఉండాల్సిన ఆవశ్యకత ఏమీ లేదు. ఎందుకంటే దేవుని నామాలు, గుణ విశేషాలు దైవానికే స్వంతం. దైవానికే పరిమితం, ప్రత్యేకం. మనుషులకు గల పేర్లు, గుణాలు మనుషులకే పరిమితం. ఏ విధంగానయితే అల్లాహ్ అస్థిత్వం ఇతర సృష్టితాల అస్థిత్వంతో పోలిక కలిగిలేదో, అదేవిధంగా అల్లాహ్ నామాలు, గుణగణాలు కూడా సృష్టితాల పేర్లతో, గుణాలతో పోలిక కలిగి లేవు. దేవుని పేరు – మనుషుల పేరు ఒకటై ఉన్నంత మాత్రాన వారికి భాగస్వామ్యం ఉన్నట్లు లెక్క కాదు. ఉదాహరణకు : అల్లాహ్‌కు అలీమ్, హకీమ్ అనే పేర్లున్నాయి. అయితే ఆయన తన దాసుల్లో కొందరికి ‘అలీమ్’ అనే పేరు పెట్టాడు.

﴿وَبَشَّرُوهُ بِغُلَامٍ عَلِيمٍ﴾ (الذاريات:٢٨)

**“వారు (దైవదూతలు) అతని (ఇబ్రాహీమ్)కి జ్ఞాన సంపన్నుడైన అబ్బాయి**

**పుడతాడని శుభవార్త వినిపించారు." (అజ్ జారియాత్ : 28)**

ఇక్కడ 'అలీమ్' అంటే ఇస్హాఖ్ (عليه السلام) అన్నమాట. మరొక దాసునికి 'హలీమ్' అనే నామకరణం చేశాదు :

﴿فَبَشَّرْنَاهُ بِغُلَامٍ حَلِيمٍ﴾ (الصافات:١٠١)

**"అందువల్ల మేమతనికి, సహనశీలుడైన ఒక అబ్బాయి గురించిన శుభవార్త వినిపించాము." (అస్ సాఫ్ఫాత్ : 101)**

ఇక్కడ 'హలీమ్' అంటే ఇస్మాయీల్ (عليه السلام) అని భావం. అయితే ఈ 'అలీమ్' గానీ, 'హలీమ్'గానీ అల్లాహ్‌కు గల పేర్ల (అలీమ్, హలీమ్) వంటివి కావు.

అలాగే అల్లాహ్ తనకు సమీ, బసీర్ అనే పేర్లు పెట్టుకున్నాడు. ఆయన తన గురించి ఇలా చెప్పుకున్నాడు :

﴿إِنَّ اللَّهَ كَانَ سَمِيعًا بَصِيرًا﴾ (النساء:٥٨)

**"నిశ్చయంగా అల్లాహ్ అంతా వింటున్నాడు, అంతా చూస్తున్నాడు." (అన్ నిసా : 58)**

అయితే ఆయన తన దాసుల్లో కూడా కొందరిని సమీగా, బసీర్‌గా అభివర్ణించాడు. ఉదాహరణకు ఒకచోట మనిషిని గురించి ఇలా సెలవిచ్చాడు :

﴿إِنَّا خَلَقْنَا الْإِنسَانَ مِن نُّطْفَةٍ أَمْشَاجٍ نَّبْتَلِيهِ فَجَعَلْنَاهُ سَمِيعًا بَصِيرًا﴾ (الانسان:٢)

**"నిశ్చయంగా మేము మానవుణ్ణి పరీక్షించటానికి ఒక మిశ్రమ వీర్య బిందువుతో పుట్టించాము. మరి మేము అతన్ని వినేవాడుగా, చూసే వాడుగా చేశాము." (అల్ ఇన్సాన్ : 2)**

అయితే ఒక వినేవాడు (సమీ) మరో వినేవాని (సమీ) వంటివాడు కాడు. ఒక చూసేవాడు (బసీర్) మరో చూసేవాని (బసీర్) వంటివాడు కాడు.

ఇంకా చెప్పాలంటే అల్లాహ్ తనకు రవూఫ్, రహీమ్ అనే పేర్లు పెట్టుకున్నాడు. ఉదాహరణకు : ఆయన ఒకచోట ఇలా సెలవిచ్చాడు :

﴿إِنَّ اللَّهَ بِالنَّاسِ لَرَءُوفٌ رَّحِيمٌ﴾ (الحج:٦٥)

**"నిశ్చయంగా అల్లాహ్ మనుషుల యెడల మృదుత్వం గలవాడు, జాలిచూపేవాడు." (అల్ హజ్జ్ : 65)**

అయితే అల్లాహ్ తన దాసుల్లో కూడా కొందరిని రవూఫ్‌గా, రహీమ్‌గా వ్యవహరించాడు. ఉదాహరణకు : ఒకచోట ఇలా సెలవిచ్చాడు :

﴿لَقَدْ جَاءَكُمْ رَسُولٌ مِّنْ أَنفُسِكُمْ عَزِيزٌ عَلَيْهِ مَا عَنِتُّمْ حَرِيصٌ عَلَيْكُم بِالْمُؤْمِنِينَ رَءُوفٌ رَّحِيمٌ﴾ (التوبة:١٢٨)



**"మీ దగ్గరకు స్వయంగా మీలో నుండే ఒక ప్రవక్త వచ్చాడు. మీకు కష్టం కలిగించే ప్రతిదీ అతనికి బాధ కలిగిస్తుంది. అతను మీ మేలును ఎంతగానో కోరుకుంటున్నాడు. విశ్వాసుల యెడల అతను మృదు స్వభావి (రవూఫ్), దయాశీలి (రహీమ్)." (అత్ తౌబా : 128)**

అయితే ఒక 'రవూఫ్' మరో 'రవూఫ్' వంటివాడు కాడు. ఒక 'రహీమ్' మరో 'రహీమ్' వంటివాడు కాడు.

అలాగే అల్లాహ్ తనకు ఎన్నో గుణ విశేషాలున్నాయని చెప్పుకున్నాడు. దాంతో తన దాసులలో కూడా అలాంటి గుణగణాలున్నాయని పేర్కొన్నాడు. ఉదాహరణకు : ఒకచోట ఈ విధంగా సెలవీయబడింది :

﴿وَلَا يُحِيطُونَ بِشَيْءٍ مِّنْ عِلْمِهِ﴾ (البقرة:٢٥٥)

**"ఆయనకున్న జ్ఞానంలోని ఏ విషయమూ వారి గ్రాహ్య పరిధిలోకి రాదు." (అల్ బఖర : 255)**

ఈ సూక్తిలో ఆయన తనలోని జ్ఞాన విశేషాన్ని గురించి చెప్పుకున్నాడు. దాంతో పాటే తన దాసుల జ్ఞాన విశేషాన్ని గురించి కూడా ప్రస్తావించాడు. ఈ విధంగా సెలవిచ్చాడు:

﴿وَمَا أُوتِيتُم مِّنَ الْعِلْمِ إِلَّا قَلِيلًا﴾ (الاسراء:٨٥)

**"మీకు ఒసగబడిన జ్ఞానం బహు స్వల్పం." (అల్ ఇస్రా : 85)**

మరోచోట ఇలా సెలవిచ్చాడు :

﴿وَفَوْقَ كُلِّ ذِي عِلْمٍ عَلِيمٌ﴾ (يوسف:٧٦)

**"ప్రతి జ్ఞానినీ మించిన జ్ఞాని ఒకడున్నాడు." (యూసుఫ్ : 76)**

వేరొకచోట ఇలా అనబడింది :

﴿وَقَالَ الَّذِينَ أُوتُوا الْعِلْمَ﴾ (القصص:٨٠)

**"అప్పుడు (ధర్మ) జ్ఞానం వొసగబడినవారు వారికి ఇలా బోధపరచ సాగారు ...." (అల్ ఖసస్ : 80)**

అలాగే అల్లాహ్ తనకు గల శక్తి గుణాన్ని గురించి చెప్పుకున్నాడు.

﴿إِنَّ اللَّهَ لَقَوِيٌّ عَزِيزٌ﴾ (الحج:٤٠)

**"నిశ్చయంగా అల్లాహ్ మహాబలుడు, సర్వాధిక్యుడు." (అల్ హజ్జ్ : 40)**

ఈ విధంగా కూడా చెప్పుకున్నాడు :

﴿إِنَّ اللَّهَ هُوَ الرَّزَّاقُ ذُو الْقُوَّةِ الْمَتِينُ﴾ (الذاريات:٥٨)

**"అల్లాహ్‌యే స్వయంగా అందరికీ ఉపాధిని సమకూర్చేవాడు. ఆయన మహాశక్తిశాలి, మహాబలుడు." (అజ్ జారియాత్ : 58)**

దాంతోపాటే తన దాసుల శక్తిని గురించి ఆయన ఇలా విశ్లేషించాడు :

﴿اللَّهُ الَّذِي خَلَقَكُم مِّن ضَعْفٍ ثُمَّ جَعَلَ مِن بَعْدِ ضَعْفٍ قُوَّةً ثُمَّ جَعَلَ مِن بَعْدِ قُوَّةٍ ضَعْفًا وَشَيْبَةً﴾(الروم:٥٤)

**"అల్లాహ్ – ఆయనే మిమ్మల్ని బలహీన స్థితిలో పుట్టించాడు. మరి ఈ బలహీనత తరువాత (మీకు) బలాన్ని ఇచ్చాడు. ఈ బలం తరువాత మళ్లీ మీకు బలహీనతను ఇచ్చాడు. (మిమ్మల్ని) వృద్ధాప్యానికి చేర్చాడు." (అర్ రూమ్ : 54)**

దీనిద్వారా తెలిసిందేమిటంటే అల్లాహ్ నామాలు, గుణాలు ఆయనకే స్వంతం. ఆయనకే శోభాయమానం. మనుషుల పేర్లు గుణాలు వారికే ప్రత్యేకం, వారికే అవి తగినవి. పేర్లు, గుణాలు ఒకేవిధంగా కనిపించినంతమాత్రాన వాస్తవంలో అవి ఒకటి కావు. రెండింటి మధ్య ఎలాంటి సామ్యంగానీ, పోలికగానీ లేదు. ఇది చాలా స్పష్టమయిన విషయం. సర్వస్తోత్రాలు అల్లాహ్‌కే శోభాయమానం.

## మూడవ పద్ధతి :

ఎవరయితే గుణగణాల రీత్యా పరిపూర్ణుడు కాడో అతనికి ఆరాధ్య దేవుడయ్యే అర్హత లేదు. అందుకే దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీమ్ (عليه السلام) తన తండ్రితో ఇలా అన్నారు–

﴿لِمَ تَعْبُدُ مَا لَا يَسْمَعُ وَلَا يُبْصِرُ﴾(مريم:٤٢)

**"(ఓ నాన్నా!) వినలేని, కనలేని వాటిని మీరు ఎందుకు పూజిస్తారు?"**

**(మర్యమ్ : 42)**

ఆవు దూడను పూజించే వారి చర్యను ఖండిస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿أَلَمْ يَرَوْا أَنَّهُ لَا يُكَلِّمُهُمْ وَلَا يَهْدِيهِمْ سَبِيلًا﴾(الأعراف:١٤٨)

**"అది తమతో మాట్లాడలేదనీ, తమకు ఏ దారీ చూపదన్న సంగతిని గురించి వారు ఆలోచించలేదా?" (అల్ ఆరాఫ్ : 148)**

## నాల్గవ పద్ధతి :

గుణాలను రూఢీ చేయటం పరిపూర్ణతకు చిహ్నం. నిరాకరించటం లోపానికి ఆనవాలు. ఎందుకంటే గుణములు లేనివాడు నశించినవానితో సమానం. లేదా లోపభూయిష్టతకు తార్కాణం. అల్లాహ్ ఈ రెండింటికీ అతీతుడు, పవిత్రుడు.



## ఐదవ పద్ధతి :

దైవగుణాలకు మనం మనవైన భాష్యాలు చెప్పటానికి ఎలాంటి ఆధారం లేదు. పైగా ఈ ధోరణి ఒక మిథ్య. వాటి అర్థాలను అల్లాహ్‌కే అప్పగించటం కూడా సరైనది కాదు. ఇలా చేస్తే, ఖుర్ఆన్‌లో మనకు ఏమీ తెలియని విషయాల గురించి అల్లాహ్ మనకు ఆజ్ఞలు జారీచేసినట్లవుతుంది. కాగా; తనను తన పేర్లతోనే పిలవమని అల్లాహ్ మనల్ని ఆదేశించాడు. మరి మనకు అర్థమే తెలియనపుడు ఎలా పిలిచేది? మరోవైపు అల్లాహ్ ఖుర్ఆన్‌లో అనేకచోట్ల ఆజ్ఞాపిస్తున్నాడు – ఖుర్ఆన్‌పై చింతన చేయమని! మనకు భావార్థాలే తెలియనపుడు వాటిపై మనం చింతన ఎలా చేయగలుగుతాము?

కనుక బోధపడేదేమిటంటే అల్లాహ్ యొక్క నామాలను, ఆయన గుణగణాలను మనుషులతో పోల్చకుండా యథాతథంగా అంగీకరించటం అనివార్యం. ఎందుకంటే ఆయన నామాలు, ఆయన గుణగణాలు ఆయన స్థాయికి, వైభవానికి తగినట్లుగానే ఉన్నాయి. ఉదాహరణకు : అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿لَيْسَ كَمِثْلِهِ شَيْءٌ وَهُوَ السَّمِيعُ الْبَصِيرُ﴾(الشورى:١١)

**"ఆయన్ని పోలిన వస్తువేదీ లేదు. ఆయన వినేవాడు, చూసేవాడు."**

**(అష్ షూరా : 11)**

ఈ ఆయతులో అల్లాహ్ తనను ఏ వస్తువుతోనయినా సరే పోల్చటాన్ని త్రోసిపుచ్చాడు. అలాగే తనలోని వినే, చూచే గుణాలను రుజువు చేశాడు. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే దైవగుణాలను అంగీకరించటం వల్ల వాటికి పోలికలను ఆపాదించినట్టు అర్థం కాదు. పోలికలను త్రోసిపుచ్చటంతో పాటు, గుణగణాలను అంగీకరించటం అవశ్యమని కూడా దీనిద్వారా అవగతమవుతోంది. దైవనామాల, గుణాల విషయంలో అహ్లె సున్నత్ వల్ జమాఅత్ చెప్పేదొక్కటే : "పోలికలతో నిమిత్తం లేకుండా వీటిని ఒప్పుకోవాలి. కాదు, కూడదు అని అనకుండా వాటిని స్వచ్ఛమైనవిగా ఖరారు చేయాలి."

### మూడవ అధ్యాయం

# మానవ జీవితంలో షిర్క్, చెడు విశ్వాసాలు సత్య తిరస్కారం, నాస్తికత్వం, షిర్క్ కాపట్యాల పూర్వాపరాలు

**ఈ అధ్యాయాన్ని ఐదు ప్రకరణములుగా విభజించటమైనది :**

**మొదటి ప్రకరణం :** మానవ జీవితంలో వైముఖ్య ధోరణి, చెడు విశ్వాసాలు

**రెండవ ప్రకరణం :** షిర్క్ నిర్వచనం, దాని రకాలు

**మూడవ ప్రకరణం :** కుఫ్ర్ (అవిశ్వాసం, సత్య తిరస్కారం) నిర్వచనం, దాని రకాలు

**నాల్గవ ప్రకరణం :** నిఫాఖ్ (కపటత్వం, వంచన) నిర్వచనం, దాని రకాలు

**ఐదవ ప్రకరణం :** అజ్ఞానం, పాపం, మార్గభ్రష్టత, ధర్మభ్రష్టతల వాస్తవికత. వాటి రకాలు, ఆదేశాలు.



### మొదటి ప్రకరణం

## మానవ జీవితంలో వైముఖ్య దశ, చెడు విశ్వాసాలు

అల్లాహ్ జీవులను తన ఆరాధన (దాస్యం) కోసమే సృష్టించాడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَمَا خَلَقْتُ الْجِنَّ وَالْإِنسَ إِلَّا لِيَعْبُدُونِ ☆مَا أُرِيدُ مِنْهُم مِّن رِّزْقٍ وَمَا أُرِيدُ أَن يُطْعِمُونِ ☆إِنَّ اللَّهَ هُوَ الرَّزَّاقُ ذُو الْقُوَّةِ الْمَتِينُ﴾(الذاريات:٥٦،٥٨)

**"నేను జిన్నాతులను, మానవులను సృష్టించినది వారు నన్ను ఆరాధించటానికి మాత్రమే. నేను వారి నుండి జీవనోపాధిని కోరటం లేదు. వారు నాకు తినిపించాలని కూడా నేను కోరటం లేదు. అల్లాహ్‌యే స్వయంగా అందరికీ ఉపాధిని సమకూర్చేవాడు. ఆయన మహాశక్తి శాలి, మహాబలుడు." (అజ్ జారియాత్ : 56 – 58)**

మానవాత్మను గనక దాని నైజంపైనే వదలిపెడితే అది తప్పక దేవుని ఏకత్వాన్ని అంగీకరిస్తుంది. మనిషి సహజంగానే దైవాన్ని ప్రేమిస్తాడు. ఆయన్ని ఆరాధిస్తాడు. ఆయనకు సహవర్తునిగా ఎవరినీ చేర్చడు. కాని పరిస్థితుల ప్రభావానికి అతను తలొగ్గుతాడు. షైతానుల, మనుషుల మాయాజాలానికి మోసపోయి, వారికి ఆకర్షితుడై రుజుమార్గం నుండి ప్రక్కకు వైదొలుగుతాడు. తత్కారణంగా అతని నైజంలో చెడుగు వచ్చేస్తుంది. అతను సత్యం పట్ల విముఖుడవుతాడు. కనుక అవగతమయ్యేదేమంటే మానవ నైజంతో దేవుని ఏకత్వం (తౌహీద్) పెనవేసుకుని ఉంది. షిర్క్ మనిషికి అపరిచితమైనది. అది అతనిపై కొత్తగా రుద్దబడిన అపచారం. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿فَأَقِمْ وَجْهَكَ لِلدِّينِ حَنِيفًا فِطْرَةَ اللَّهِ الَّتِي فَطَرَ النَّاسَ عَلَيْهَا لَا تَبْدِيلَ لِخَلْقِ اللَّهِ﴾ (الروم:٣٠)

**"కనుక నీవు ఏకాగ్రతతో నీ ముఖాన్ని (ఇస్లాం) ధర్మంపై కేంద్రీకరించు. ఇది అల్లాహ్ సహజధర్మం. అల్లాహ్ మానవులను ఏ స్వభావంపై పుట్టించాడో ఆ స్వభావంపైనే ఉండు. అల్లాహ్ సృష్టిని మార్చకూడదు సుమా!" (అర్ రూమ్ : 30)**

ఈ నేపథ్యంలో మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రబోధించారు :

''كُلُّ مَوْلُوْدٍ يُوْلَدُ عَلَى الْفِطْرَةِ فَأَبَوَاهُ يُهَوِّدَانِهِ أَوْ يُنَصِّرَانِهِ أَوْ يُمَجِّسَانِهِ'' (بخاری و مسلم)

**"పుట్టే ప్రతి పిల్లవాడు తన సహజ ధర్మం (ఇస్లాం)పైనే పుడతాడు. తరువాత అతని తల్లిదండ్రులు అతన్ని యూదునిగానో, క్రైస్తవునిగానో, మజూసీగానో మార్చివేస్తారు." (బుఖారీ, ముస్లిం)**

కాబట్టి ఆదం సంతతిలో అంతర్లీనమై ఉన్న అసలు విషయం దేవుని ఏకత్వమే (తౌహీద్).

ఆది మానవుడు ఆదం ( عليه السلام ) గానీ, ఆయన సంతతి వారు గానీ ఎన్నో ఏండ్ల వరకు ఇస్లాం ధర్మం పైనే నడిచారు. ఈ విషయాన్నే అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

﴿كَانَ النَّاسُ أُمَّةً وَاحِدَةً فَبَعَثَ اللَّهُ النَّبِيِّينَ مُبَشِّرِينَ وَمُنذِرِينَ﴾(البقرة:٢١٣)

**"మానవులంతా ఒకే సమాజంగా ఉండేవారు. అల్లాహ్ ప్రవక్తలను శుభవార్తనిచ్చే వారుగా, భయపెట్టేవారుగా చేసి పంపాడు." (అల్ బఖర:213)**

అన్నిటికన్నా ముందు నూహ్ జాతివారిలో షిర్క్ (బహుదైవోపాసన) జొరబడింది. సత్యంపట్లా వైముఖ్య దశ మొదలయింది వారి నుంచే. కాబట్టి షిర్క్ పొడసూపిన తరువాత మనుజ జాతి వైపు పంపబడిన మొట్టమొదటి దైవప్రవక్త హజ్రత్ నూహ్ ( عليه السلام ). అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿إِنَّا أَوْحَيْنَا إِلَيْكَ كَمَا أَوْحَيْنَا إِلَىٰ نُوحٍ وَالنَّبِيِّينَ مِن بَعْدِهِ﴾(النساء:١٦٣)

**"(ఓ ముహమ్మద్!) మేము నూహ్ వైపు, అతని తరువాత వచ్చిన ప్రవక్తల వైపు వహీ (దివ్య వాణి)ని పంపినట్లే, మేము నీ వైపునకు కూడా వహీని పంపాము." (అన్ నిసా : 163)**

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ ( رضي الله عنهما ) ఇలా అన్నారు: ఆదం ( عليه السلام ) కి – నూహ్ ( عليه السلام ) కి – మధ్య పది శతాబ్దాల అంతరం ఉంది. ఈ మధ్య కాలంలో ఆదం సంతతి వారంతా ఇస్లాంపైనే ఉన్నారు.

అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ ( رحمه الله ) ఇలా వ్యాఖ్యానించారు : "ఖచ్చితంగా ఈ మాటే సరైనది. ఎందుకంటే బఖరా సూరాలోని ఈ వచనం (ఆయత్) ఉబై బిన్ కాబ్ ( رضي الله عنه ) పారాయణంలో ఇలా వచ్చింది :

"فَاخْتَلَفُوا فَبَعَثَ اللَّهُ النَّبِيِّينَ"

**"తరువాత జనులు (దేవుని ఏకత్వం వ్యవహారంలో) విభేదించు కోవటం వల్ల అల్లాహ్ తన ప్రవక్తలను ప్రభవింపజేశాడు."**

ఈ క్రింది సూక్తి కూడా ఉబై బిన్ కాబ్ పారాయణాన్ని సమర్థిస్తూ ఉంది :

﴿وَمَا كَانَ النَّاسُ إِلَّا أُمَّةً وَاحِدَةً فَاخْتَلَفُوا﴾(يونس:١٩)

**"మొదట్లో జనులంతా ఒకే సముదాయంగా ఉండేవారు. తరువాత వారు విభేదించుకున్నారు." (యూనుస్ : 19)**

ఈ సూక్తి ఆధారంగా అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ ( رحمه الله ) రుజువు చెయ్యదలచిన విషయం ఇది :



నిజధర్మం విషయంలో మానవుల మధ్య ఏర్పడిన భేదాభిప్రాయమే ప్రవక్తల రాకకు ప్రధాన కారణమయింది. ఉదాహరణకు : ఒకప్పుడు అరబ్బులు కూడా ప్రవక్త ఇబ్రాహీం ( عليه السلام ) ధర్మంపై స్థిరంగా ఉండేవారు. చివరకు అమ్ర్ బిన్ లుహాయి అల్ ఖుజాయి అనే వ్యక్తి వచ్చి ఇబ్రాహీం ( عليه السلام ) మత ధర్మాన్ని మార్చివేశాడు. అరేబియా భూభాగంలో – ముఖ్యంగా హిజాజ్ ప్రదేశంలో బహుదైవారాధనా బీజం నాటుకుంది. ప్రజలు నిజదైవం అయిన అల్లాహ్‌ను వదలి విగ్రహాలను పూజించటం మొదలెట్టారు. పవిత్ర మక్కా నగరంలోనూ, దాని చుట్టుప్రక్కల పట్టణాలలోనూ షిర్క్ (బహుదైవోపాసన) ప్రబలిపోయింది. ఎట్టకేలకు దేవుని అంతిమ ప్రవక్త ముహమ్మద్ ( صلى الله عليه وسلم ) ప్రభవించారు. ఆయన ( صلى الله عليه وسلم ) ప్రజలను ఏకేశ్వరోపాసన (తౌహీద్) వైపునకు పిలిచారు. ఇబ్రాహీమ్ ( عليه السلام ) విధానాన్ని అవలంబించమని కోరారు. దైవమార్గంలో నిరంతర పోరాటం సాగించారు. ఆఖరికి ఏకేశ్వరోపాసనా సిద్ధాంతం స్థాపించబడింది. దీనె ఇబ్రాహీం పునరుద్ధరించబడింది. విగ్రహాలు కూల్చబడ్డాయి. ఆ విధంగా అల్లాహ్ ఆయన ( صلى الله عليه وسلم ) ద్వారా తన ధర్మాన్ని పరిపూర్ణం గావించాడు. లోకవాసులపై తన కరుణానుగ్రహాలను సంపూర్తి చేశాడు. ఆయన ( صلى الله عليه وسلم ) అనుచరవర్గంలోని ప్రథమ శ్రేణికి చెందిన వారంతా తొలి శతాబ్దాలలో ఇదే విధానానికి కట్టుబడి ఉన్నారు. కాని తరువాతి కాలంలో అజ్ఞానం ప్రబలిపోయింది. ఇతర మతాల ప్రభావం ముస్లిములపై పడసాగింది. ఆ తరువాత మార్గవిహీనత వైపు పిలుపు ఇచ్చేవారు పుట్టుకువచ్చారు. వారి మూలంగా సమాధులపై గుంబదులు, కట్టడాల నిర్మాణం మొదలయింది. ఔలియాల, సత్పురుషుల పట్ల ప్రేమ, భక్తి పేరుతో ముస్లిం సముదాయంలోని చాలామందిలో మళ్లీ షిర్క్ ప్రబలిపోయింది. వారు మృతుల సమాధులనే విగ్రహాలుగా చేసుకున్నారు. అల్లాహ్‌ను వదలి ఆ మృతులను పూజించటం మొదలెట్టారు. వారినే వేడుకోసాగారు. వారి దర్బారులో విన్నపాలు, ఫిర్యాదులు చేసుకోసాగారు. వారి పేర మొక్కుకోవటం, మొక్కుబడులు చెల్లించటం, పశుబలి చేయటం కూడా జరిగింది. ఈ విధమయిన షిర్క్ చేష్టలకు ఒడిగట్టేవారు, తమ చర్యలకు సమర్థనగా కొత్త భాష్యాలు చెప్పారు. తాము తమ పూర్వీకులను ఆరాధించటం లేదని, వారిని 'వసీలా' (సిఫార్సు సాధనం)గా చేసుకుంటున్నామని బుకాయించారు. ఇదంతా వారి ఊహాగానమే. ఇలాంటి పనులు చేసిన పూర్వీకులంతా ఇలాగే చెప్పేవారు. ఉదాహరణకు :

﴿مَا نَعْبُدُهُمْ إِلَّا لِيُقَرِّبُونَا إِلَى اللَّهِ زُلْفَىٰ﴾(الزمر:٣)

**"ఈ పెద్దలు మమ్మల్ని అల్లాహ్ సాన్నిధ్యంలో చేర్చటంలో తోడ్పడతారని భావించి మాత్రమే మేము వీళ్ళను ఆరాధిస్తున్నాము."(అజ్ జుమర్ : 3)**

తరతరాలుగా ఇది మానవ జాతి చరిత్రలో జరుగుతూ వస్తున్నదే. ఇంతచేసీ వారు 'తౌహీదె రుబూబియత్'ను ఒప్పుకునేవారు. దైవారాధనలో మాత్రమే వారు షిర్క్‌కి ఒడిగట్టేవారు. ఉదాహరణకు : ఒకచోట దేవుడిలా సెలవిచ్చాడు :

﴿وَمَا يُؤْمِنُ أَكْثَرُهُم بِاللَّهِ إِلَّا وَهُم مُّشْرِكُونَ﴾(يوسف:١٠٦)

**"వారిలో చాలామంది అల్లాహ్‌ను విశ్వసిస్తూ కూడా ఆయనతో పాటు ఇతరులను భాగస్వాములుగా నిలబెడుతున్నారు." (యూసుఫ్ : 106)**

మానవ జాతిలో బహుకొద్ది మంది మాత్రమే 'ప్రభువు' అస్తిత్వాన్ని నిరాకరించారు. ఉదాహరణకు : ఫిర్‌ఔన్, నాస్తికులు, పాషండులు, కలికాలపు కమ్యూనిస్టులు. వారి నిరాకరణ వెనుక కూడా మంకుతనం, హఠమే ప్రధాన కారణం. నిజానికి వారి మనస్సాక్షి కూడా 'ప్రభువు ఉనికి'ని అంగీకరించే ఉంటుంది. ఈ రకమయిన జనులను గురించి దైవోపదేశం ఇది :

﴿وَجَحَدُوا بِهَا وَاسْتَيْقَنَتْهَا أَنفُسُهُمْ ظُلْماً وَعُلُوّاً﴾(النمل:١٤)

**"నిజానికి వారి అంతర్యాలు (సత్యాన్ని) నమ్మినప్పటికీ అన్యాయం, అహంకారంతో వారు దాన్ని త్రోసిపుచ్చుతున్నారు."**

**(అన్ నమ్ల్ : 14)**



## రెండవ ప్రకరణం

# షిర్క్ నిర్వచనం, దాని రకాలు

### (అ) షిర్క్ నిర్వచనం :

అల్లాహ్ యొక్క పోషకత్వంలోనూ, ఆయన దైవత్వంలోనూ వేరొకరికి సాటి (సహవర్తులను) కల్పించటాన్ని 'షిర్క్' అంటారు.

ప్రజాబాహుళ్యంలో సాధారణంగా దేవుని దైవత్వం (ఆరాధన, దాస్యం) విషయంలో షిర్క్ ప్రబలి ఉంటుంది. స్పష్టంగా చెప్పాలంటే అల్లాహ్‌తో పాటు వారు ఇతరులను కూడా మొరపెట్టుకుంటారు. లేదా దైవేతరుల కొరకు కొన్ని ప్రత్యేక పూజలు చేస్తారు. ఉదాహరణకు : ఖుర్బానీ, మొక్కుబడులు, దైవేతరులకు భయపడటం, వారిపై ఆశలు పెట్టుకోవటం ఇత్యాదివి.

కొన్ని కారణాల దృష్ట్యా షిర్క్ మహాపరాధం. అవేమంటే –

(1) షిర్క్ చేయటమంటే సృష్టికర్త ప్రత్యేకతలలో, గుణాలలో సృష్టితాలకు సామ్యం కల్పించటమే. కాబట్టి అల్లాహ్‌తో పాటు వేరితరులకు భాగస్వామ్యం కల్పించినవాడు వాస్తవానికి ఆ భాగస్వాములను అల్లాహ్‌ను పోలిన వారుగా ఖరారు చేశాడన్నమాట! ఇది అతి పెద్ద జులుం. మహాపాతకం. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿إِنَّ الشِّرْكَ لَظُلْمٌ عَظِيمٌ﴾(لقمان:١٣)

**"నిశ్చయంగా అల్లాహ్‌కు భాగస్వాముల్ని కల్పించటం (షిర్క్ చేయటం) ఘోరమైన అన్యాయం." (లుఖ్మాన్ : 13)**

(2) షిర్క్ చేష్టకు ఒడిగట్టిన మీదట పశ్చాత్తాపం చెందనివానిని అల్లాహ్ క్షమించడు.

﴿إِنَّ اللَّهَ لَا يَغْفِرُ أَن يُشْرَكَ بِهِ وَيَغْفِرُ مَا دُونَ ذَٰلِكَ لِمَن يَشَاءُ﴾(النساء:٤٨)

**"తనకు భాగస్వామిగా మరొకరిని కల్పించటాన్ని (షిర్క్‌ను) అల్లాహ్ సుతరామూ క్షమించడు. ఇది తప్ప ఆయన తాను కోరిన వారి ఇతర పాపాలను క్షమిస్తాడు." (అన్ నిసా : 48)**

(3) షిర్క్‌కి పాల్పడేవాని కొరకు స్వర్గాన్ని నిషేధించానని, అలాంటి వ్యక్తి శాశ్వతంగా నరకాగ్నిలో కాలుతూ ఉంటాడని అల్లాహ్ తెలియపరిచాడు. ఉదాహరణకు :

﴿إِنَّهُ مَن يُشْرِكْ بِاللَّهِ فَقَدْ حَرَّمَ اللَّهُ عَلَيْهِ الْجَنَّةَ وَمَأْوَاهُ النَّارُ وَمَا لِلظَّالِمِينَ مِنْ أَنصَارٍ﴾ (المائدة:٧٢)

**"ఎవడు అల్లాహ్‌కు సహవర్తులుగా ఇతరులను కల్పించాడో అలాంటి వాని కోసం అల్లాహ్ స్వర్గాన్ని నిషేధించాడని తెలుసుకోండి. ఇక అతని నివాసం నరకాగ్ని. దుర్మార్గులకు సహాయపడే వాడెవడూ ఉండడు." (అల్ మాయిద : 72)**

(4) మనిషి చేసే షిర్క్, అతను గతంలో చేసిన సత్కార్యాలన్నింటినీ సర్వ నాశనం చేసివేస్తుంది. (18 మంది ప్రవక్తల (عليهم السلام) ప్రస్తావన తీసుకువచ్చిన మీదట) అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿ذَٰلِكَ هُدَى اللَّهِ يَهْدِي بِهِ مَن يَشَاءُ مِنْ عِبَادِهِ وَلَوْ أَشْرَكُوا لَحَبِطَ عَنْهُم مَّا كَانُوا يَعْمَلُونَ﴾(الأنعام:٨٨)

**"ఇదీ అల్లాహ్ మార్గదర్శకత్వం. ఆయన తన దాసులలో తాను కోరిన వారిని ఈ మార్గంపై నడిపింపజేస్తాడు. ఒకవేళ వీరు సయితం దైవత్వంలో భాగస్వామ్యానికి (షిర్కుకు) ఒడిగట్టి ఉంటే, వారు చేసిన కర్మలన్నీ వృథా అయిపోయేవి." (అల్ అన్ ఆమ్ : 88)**

వేరొకచోట దేవుడు తన అంతిమ ప్రవక్త (ﷺ) నుద్దేశించి ఇలా ఉపదేశించాడు–

﴿وَلَقَدْ أُوحِيَ إِلَيْكَ وَإِلَى الَّذِينَ مِن قَبْلِكَ لَئِنْ أَشْرَكْتَ لَيَحْبَطَنَّ عَمَلُكَ وَلَتَكُونَنَّ مِنَ الْخَاسِرِينَ﴾(الزمر:٦٥)

**నిశ్చయంగా నీ వద్దకు, నీ పూర్వీకులైన ప్రవక్తల వద్దకు పంపబడిన సందేశం (వహీ) ఇది : "ఒకవేళ నీవు గనక బహుదైవారాధనకు పాల్పడితే నువ్వు చేసుకున్నదంతా వృథా అయిపోతుంది. నిశ్చయంగా నీవు నష్టపోయిన వారిలో చేర్తావు." (అజ్ జుమర్ : 65)**

(5) ముష్రిక్కులు చంపదగినవారు. వారి ధనం తీసుకోవటం కూడా సమ్మతమే. అల్లాహ్ సెలవిచ్చాడు :

﴿فَاقْتُلُوا الْمُشْرِكِينَ حَيْثُ وَجَدتُّمُوهُمْ وَخُذُوهُمْ وَاحْصُرُوهُمْ وَاقْعُدُوا لَهُمْ كُلَّ مَرْصَدٍ﴾(التوبة:٥)

**"ముష్రిక్కులను ఎక్కడ కనబడితే అక్కడే చంపండి. వారిని నిర్బంధించండి. వారి ముట్టడించండి. ప్రతి మాటు వద్ద వారి కొరకు పొంచి ఉండండి." (అత్ తౌబా : 5)**

ఈ నేపథ్యంలో మహాప్రవక్త (ﷺ) ఇలా అన్నారు :

"أُمِرْتُ أَنْ أُقَاتِلَ النَّاسَ حَتَّىٰ يَقُولُوا لَا إِلَٰهَ إِلَّا اللَّهُ فَإِذَا قَالُوهَا عَصَمُوا مِنِّي دِمَاءَهُمْ وَأَمْوَالَهُمْ إِلَّا بِحَقِّهَا" (بخاری ومسلم)

**"జనులు 'లా ఇలాహ ఇల్లల్లాహ్'ను అంగీకరించనంత వరకూ వారితో పోరాడాలని నాకు ఆదేశించబడింది. వారు గనక ఈ కలిమాను అంగీకరిస్తే, వారు తమ ధన ప్రాణాలను కాపాడుకున్న వారవుతారు. అయితే ఈ కలిమా హక్కు మాత్రం మిగిలి ఉంటుంది." (బుఖారీ, ముస్లిం)**



(6) షిర్క్ పెద్ద పాపాలలోకెల్లా పెద్దది. దీని గురించి ప్రవక్త మహనీయులు (ﷺ) ఇలా ప్రవచించారు :

"أَلَا أُنَبِّئُكُمْ بِأَكْبَرِ الْكَبَائِرِ؟ قُلْنَا: بَلَىٰ يَا رَسُولَ اللَّهِ قَالَ: الْإِشْرَاكُ بِاللَّهِ وَعُقُوقُ الْوَالِدَيْنِ..." (بخاری ومسلم)

**"ఏమిటి, అన్నిటికన్నా పెద్ద పాపాలేవో నేను మీకు తెలుపనా?" అని ఆయన (ﷺ) ప్రశ్నించగా, 'తప్పకుండా తెలుపండి దైవ ప్రవక్తా!' అని మేమన్నాము. అప్పుడాయన (ﷺ) ఇలా అన్నారు: "అల్లాహ్‌కు భాగస్వామిగా వేరెవరినయినా నిలబెట్టడం, తల్లిదండ్రులను ఎదిరించటం." (బుఖారీ, ముస్లిం)**

అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) తన పుస్తకం (అల్ జవాబుల్ కాఫీ : పేజి : 109) లో ఇలా అభిప్రాయపడ్డారు – "అల్లాహ్ ఈ విషయం మనకు ఎరుకపరిచాడు. ఆయన సృష్టికర్త, పాలకుడు (ఆజ్ఞాపించేవాడు) అవటంలోని ముఖ్యోద్దేశం ఏమిటంటే; అల్లాహ్ ఆయన పేర్లు, గుణగణాల ఆధారంగా తెలుసుకోవాలి. కేవలం ఆయన్నే ఆరాధించాలి. ఆయనకు సాటి కల్పించరాదు. జనులు న్యాయానికి, సమత్వం, సమతూకాలకు కట్టుబడి ఉండాలి. సమత్వం, సమతూకాల మూలంగానే భూమ్యాకాశాల వ్యవస్థ నిలబడి ఉంది."

అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు :

﴿لَقَدْ أَرْسَلْنَا رُسُلَنَا بِالْبَيِّنَاتِ وَأَنزَلْنَا مَعَهُمُ الْكِتَابَ وَالْمِيزَانَ لِيَقُومَ النَّاسُ بِالْقِسْطِ﴾ (الحديد:٢٥)

**"నిశ్చయంగా మేము మా ప్రవక్తలకు స్పష్టమయిన నిదర్శనాలను ఇచ్చి పంపాము. వారితో పాటు గ్రంథాన్ని, ధర్మకాంటా (తరాజు)ను కూడా అవతరింపజేశాము–ప్రజలు న్యాయం (సమతూకం)పై నిలిచి ఉండటానికి!" (అల్ హదీద్ : 25)**

పై ఆయతులో దేవుడు తన ప్రవక్తలను పంపినట్లు, తన గ్రంథాలను అవతరింపజేసినట్లు తెలియజేశాడు. ప్రజలు నీతికి, న్యాయానికి కట్టుబడి ఉండాలన్నదే దీని ఉద్దేశం. అన్నిటికన్నా పెద్ద న్యాయం (సమత్వం, సమతూకం) తౌహీద్. తౌహీదే (దేవుని ఏకత్వమే) న్యాయానికి, ధర్మానికి ప్రాతిపదిక. షిర్క్ (బహుదైవోపాసన) అతి పెద్ద దుర్మార్గం, దుర్వర్తనం, దారుణం. అల్లాహ్ సెలవిచ్చినట్లు –

﴿إِنَّ الشِّرْكَ لَظُلْمٌ عَظِيمٌ﴾(لقمان:١٣)

**"నిశ్చయంగా షిర్క్ (బహుదైవోపాసన) చాలా పెద్ద జులుం." (లుఖ్మాన్ : 13)**

మొత్తానికి తెలిసిందేమంటే షిర్క్ (బహుదైవారాధన) అతి పెద్ద దారుణం (అన్యాయం). తౌహీద్ (ఏక దైవారాధన) అన్నిటికన్నా గొప్ప న్యాయం (ధర్మం). కనుక ఏ వస్తువు మహదాశయమైన తౌహీద్‌కు వ్యతిరేకంగా నిలుస్తుందో అది మహాపరాధంగా పరిగణించబడుతుంది.

ఈ నేపథ్యంలోనే అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) ఇంకా ఇలా అంటున్నారు:

"షిర్క్ (బహుదైవారాధన) ఈ సిసలయిన ఆశయానికి (తౌహీద్‌కి) వ్యతిరేకంగా ఉన్నప్పుడు అది ఖచ్చితంగా మహాపరాధమే. అల్లాహ్ ప్రతి ముష్రిక్కుకై స్వర్గాన్ని నిషిద్ధం (హరామ్) గావించాడు. అతని ధన ప్రాణాలను కూడా ఏక దైవారాధకుల కొరకు ధర్మసమ్మతం (హలాల్) చేశాడు. ఎందుకంటే వారు అల్లాహ్ దాస్యం యొక్క హక్కును నిర్వర్తించలేదు. కాబట్టి వారిని బానిసలుగా చేసుకునేందుకు ఏక దైవారాధకులకు అనుమతి ఇవ్వబడింది. అదలా ఉంచితే అల్లాహ్ ముష్రిక్కు చేసిన ఏ సత్కర్మనూ స్వీకరించడు. వారి కొరకు చేయబడిన సిఫారసు ఆమోదించటంగానీ, పరలోకంలో వారి మొరను ఆలకించటంగానీ, వారి కోర్కెను తీర్చటం గానీ చేయడు. ఎందుకంటే ముష్రిక్కు వ్యక్తి అల్లాహ్ వ్యవహారంలో అతి పెద్ద మూర్ఖుడు. ఎందుకంటే అతను సృష్టితాలను ఆయనకు సహవర్తులుగా నిలబెట్టాడు. ఇది పరమ ప్రభువు అయిన అల్లాహ్ విషయంలో అజ్ఞానానికి పరాకాష్ఠ. ఆయన విషయంలో ఇది చాలా పెద్ద అన్యాయం. వాస్తవానికి అతను షిర్క్ చేసి అల్లాహ్‌కు కాదు, తన ఆత్మకే అన్యాయం చేసుకున్నాడు."

(7) వాస్తవానికి షిర్క్ ఒక లోపం. దోషం. దాని నుండి అల్లాహ్ తన అస్తిత్వాన్ని పవిత్రంగా, పునీతంగా ఖరారు చేసుకున్నాడు. కాబట్టి అల్లాహ్‌కు సహవర్తుల్ని కల్పించే వాడు. ఆయనకు లేనిపోని దోషాన్ని, లోపాన్ని ఆపాదిస్తున్నడన్నమాట! ఆ విధంగా అతను అల్లాహ్‌పై తిరుగుబాటు చేశాడు. ఆయన ఆజ్ఞను ఎదిరించి ఆయనతో శత్రుత్వం కొనితెచ్చుకున్నాడు.

### (అ) షిర్క్ రకాలు :

షిర్క్ రెండు రకాలు

## మొదటి రకం : షిర్కె అక్బర్ (పెద్ద షిర్క్)

ఇది మనిషిని ముస్లిం సముదాయం నుండి బహిష్కృతం చేసేస్తుంది. అతను గనక పశ్చాత్తాపం చెందకుండానే మరణిస్తే కలకాలం నరకాగ్నిలో ఉంటాడు.

ఏ రకమయిన ఆరాధన అయినా సరే దైవేతరుల కొరకు చేస్తే అది షిర్కె అక్బర్ (పెద్ద తరహా షిర్క్) అవుతుంది : ఉదాహరణకు దైవేతరులను మొరపెట్టుకోవటం వారి పేర మొక్కుకోవటం, మొక్కుబడులు చెల్లించటం, బలిదానాలు చేసి సమాధులలో ఉన్న వారి మెప్పు పొందగోరటం, జిన్నాతుల, షైతానుల ప్రసన్నత బడయటం, అలాగే మృతులు షైతానులు, జిన్నాతులు తమకేదైనా హానికలిగిస్తాయేమోనని భయపడటం. అలాగే – కేవలం అల్లాహ్ మాత్రమే తీర్చగల అవసరాల కోసం దైవేతరులను ఆశించటం, ఆపదలను తొలగించమని దైవేతరులను అర్థించటం మొదలగునవి.



నేటి ఆధునిక యుగంలో ఇలాంటి షిర్క్ మరీ ఎక్కువైపోయింది. పుణ్య పురుషుల సమాధులపై నిర్మించబడిన కట్టడాల వద్ద సకల ఆర్భాటాలతో ఈ షిర్క్ పోకడలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అల్లాహ్ ఏమంటున్నాడో చూడండి –

﴿وَيَعْبُدُونَ مِن دُونِ اللَّهِ مَا لَا يَضُرُّهُمْ وَلَا يَنفَعُهُمْ وَيَقُولُونَ هَٰؤُلَاءِ شُفَعَاؤُنَا عِندَ اللَّهِ﴾ (يونس:١٨)

**"వారు అల్లాహ్‌ను వదలి తమకు లాభాన్నిగానీ, నష్టాన్నిగానీ చేకూర్చ లేని వాటిని పూజిస్తున్నారు. (అదేమంటే) 'అల్లాహ్ సమక్షంలో అవి మాకు సిఫారసు చేస్తాయి' అని అంటున్నారు. (యూనుస్ – 18)**

### రెండవ రకం :

## షిర్కె అస్గర్ : (చిన్నతరహా షిర్క్)

ఇది మనిషిని ముస్లిం సముదాయం నుండైతే వేరుపరచదు గాని దానివల్ల 'ఏకదైవారాధన' (తౌహీద్)లో దోషం ఏర్పడుతుంది. అంతేకాదు, అది అతన్ని క్రమక్రమంగా 'షిర్కె అక్బర్' వైపు తీసుకెళుతుంది. షిర్కె అస్గర్ కూడా రెండు రకాలు : (1) కనిపించే షిర్క్ (2) కనిపించని షిర్క్.

### (1) కనిపించే షిర్క్:

అంటే మనిషి మాటల ద్వారా, చేతల ద్వారా వ్యక్తమయ్యే షిర్క్ అన్నమాట. ఉదాహరణకు : దైవేతరులపై ఒట్టేసి చెప్పటం. దీని గురించి మహాప్రవక్త (ﷺ) ఇలా ప్రవచించారు :

"مَنْ حَلَفَ بِغَيْرِ اللهِ فَقَدْ كَفَرَ أَوْ أَشْرَكَ" (ترمذی:۱۵۳۵صحیح۔ابوداود:۳۲۵۱صحیح)

**"ఎవరయితే దైవేతరునిపై ప్రమాణం చేశాడో అతను తిరస్కారాని (కుఫ్ర్) కి పాల్పడ్డాడు" లేదా ఆయనిలా అన్నారు : "అతను షిర్క్‌కి ఒడిగట్టాడు." (ఈ హదీసును తిర్మిజీ – 1535 సహీగా పేర్కొన్నారు. హాకిమ్ దీనిని సహీహ్‌గా పేర్కొన్నారు).**

مَاشَاءَ اللهُ وَ شِئْتَ "అల్లాహ్ కోరినట్లుగా మరియు తమరు కోరుకున్నట్లుగా" అని చెప్పటం కూడా ఈ కోవకు చెందినదే. ఒకసారి ఒక సహచరుడు ఇలాగే అంటే, దైవప్రవక్త (ﷺ) అతనిని ఈ విధంగా మందలించారు :

"أَجَعَلْتَنِي لِلّٰهِ نِدًّا ؟ قُلْ : مَا شَاءَ اللهُ وَحْدَهُ" (نسائی:۳۷۷۳صحیحہ:۱۳۹) "ఏమిటి, నీవు నన్ను అల్లాహ్‌కు పోటీగా పరిగణిస్తున్నావా? (ఇది తప్పు. దీనికి బదులు) నీవు ఈ

విధంగా అను : ఒక్కడైన అల్లాహ్ కోరినట్లుగా." (అస్సహీహ – 139) అలాగే "لَوْلَا اللّٰهُ ثُمَّ وَ فُلَانٌ" "ఒకవేళ అల్లాహ్ లేకుంటే, ఫలానా వ్యక్తి లేకుంటే" అని చెప్పటం కూడా ఇలాంటిదే.

**ماشاء الله ثم شاء فلان** "అల్లాహ్ తలచినట్లుగానే జరిగింది. దానిమీదట ఫలానా వ్యక్తి అభిలషించినట్లుగా జరిగింది" అని అంటే అది సరైనదే. 'దానిమీదట' లేదా 'ఆపైన' అనే పదం చేరిస్తే అది ఒప్పే. ఎందుకంటే ఈ విధంగా అన్నప్పుడు దాసుని కోరిక దేవుని కోరికకు లోబడినట్లవుతుంది. ఉదాహరణకు : అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَمَا تَشَاؤُونَ إِلَّا أَن يَشَاءَ اللَّهُ رَبُّ الْعَالَمِينَ﴾(التكوير:٢٩)

**"సర్వలోక ప్రభువు అయిన అల్లాహ్ కోరనంత వరకు మీరేదీ కోరలేరు." (అత్ తక్వీర్ : 29)**

"مَالِي إِلَّا اللّٰهُ وَأَنْتَ" **"నా కొరకు అల్లాహ్ మరియు మీరు తప్ప ఎవరూ లేరు"** అని చెప్పటం కూడా ఒక విధంగా షిర్కుతో కూడిన పలుకే. "وَهٰذَا مِنْ بَرَكَاتِ اللّٰهِ وَبَرَكَاتِكَ" "ఇది అల్లాహ్ శుభాల వల్ల మరియు మీ శుభాల వల్లనే ప్రాప్తించింది" అని అనటం కూడా ఇలాంటిదే.

## షిర్క్‌తో కూడిన పనుల ఉదాహరణ :

ఏదైనా ఆపద నుండి బయటపడేందుకు లేదా ఏదైనా గండాన్ని తొలగించేందుకు కడియం ధరించటం, దారం కట్టడం, దిష్టి తగులుతుందనే భయంతో తాయెత్తు కట్టడం, వెంట్రుకల హారాలు తొడగటం మొదలగునవి.

ఇలాంటివన్నీ గండాల నుండి గట్టెక్కటంలో, కష్టాలను దూరం చేయటంలో తోడ్పడతాయని గనక మనిషి నమ్మితే ఇది షిర్కె అస్గర్ (చిన్న తరహా షిర్క్) క్రిందికి వస్తుంది. ఎందుకంటే అల్లాహ్ ఈ వస్తువులను ఇలాంటి ఉద్దేశాల ప్రాప్తి కొరకు సాధనంగా చేయలేదు. ఒకవేళ ఈ వస్తువులు తమంతట తాముగా ఆపదలను దూరం చేస్తాయని నమ్మితే మాత్రం అది 'షిర్కె అక్బర్' గానే పరిగణించబడుతుంది. ఎందుకంటే ఇది దైవేతరులపై ఆశ పెట్టుకోవటం వంటిదే.

## (2) కనిపించని షిర్క్ :

అంటే దాగి ఉన్న షిర్క్ అన్నమాట. ఇది మనిషి సంకల్పంలో మనోభావంలో ఉంటుంది. ఉదాహరణకు : ప్రదర్శనాబుద్ధి. అంటే ఒక వ్యక్తి దైవప్రసన్నతను చూరగొనే ఉద్దేశంతో ఒక సత్కార్యం చేసే బదులు జనుల మెప్పును కాంక్షించి చేస్తాడు. ఉదాహరణకు: ఎంతో ఏకాగ్రతతో నమాజ్ చేస్తాడు లేదా దానధర్మాలు చేస్తాడు. కాని అతని మనసులో లోకులు తనను ప్రశంసించాలన్న కోరిక ఉంటుంది.



ఏదైనా ఒక కార్యంలో ప్రదర్శనా మనస్తత్వం వచ్చిందంటే, అది అతని పనిని పాడు చేసేస్తుంది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿فَمَن كَانَ يَرْجُو لِقَاءَ رَبِّهِ فَلْيَعْمَلْ عَمَلاً صَالِحاً وَلَا يُشْرِكْ بِعِبَادَةِ رَبِّهِ أَحَداً﴾(الكهف:١١٠)

**"కనుక తన ప్రభువును కలుసుకోవాలన్న ఆకాంక్ష ఉన్నవాడు సత్కార్యాలు చేయాలి. తన ప్రభువు ఆరాధనలో వేరొకరికి భాగ స్వామ్యం కల్పించకూడదు." (అల్ కహఫ్ : 110)**

షిర్కె అస్గర్ (చిన్న తరహా షిర్క్) గురించి ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా ఉపదేశించారు :

"أَخْوَفُ مَا أَخَافُ عَلَيْكُمُ الشِّرْكُ الأَصْغَرُ، قَالُوا يَا رَسُولَ اللّٰهِ وَمَا الشِّرْكُ الأَصْغَرُ، قَالَ: الرِّيَاءُ" (احمد:٢٢٥٢٨،طبرانی،بغوی،بیهقی)

**"మీ విషయంలో నాకు అన్నిటికన్నా అధికంగా 'షిర్కె అస్గర్' గురించిన భయముంది. 'దైవప్రవక్తా! షిర్కె అస్గర్ అంటే ఏమిటి?' అని ప్రియ సహచరులు విన్నవించుకోగా, "ప్రదర్శనా బుద్ధి" అని ఆయన (ﷺ) చెప్పారు. (అహ్మద్–22528, తిబ్రానీ)**

అలాగే ఎవరయినా ప్రాపంచిక స్వలాభాలను ఆశించి ఏదైనా సత్కార్యం చేస్తే, అది కూడా 'కనిపించని షిర్క్'లోకి వస్తుంది. ఉదాహరణకు : ఎవరయినా కేవలం సిరిసంపదల కోసం హజ్జ్ చేయటం, లేదా అజాన్ ఇవ్వటం, లేదా సామూహిక నమాజ్‌కు సారధ్యం వహించటం, లేదా కేవలం సిరిసంపదలను ఆశించి ధర్మజ్ఞానాన్ని ఆర్జించటం, జిహాద్ చేయటం. మహనీయ ముహమ్మద్ (ﷺ) ఇలా ప్రవచించారు :

"تَعِسَ عَبْدُ الدِّينَارِ، وَ تَعِسَ عَبْدُ الدِّرْهَمِ، تَعِسَ عَبْدُ الْخَمِيصَةِ، تَعِسَ عَبْدُ الْخَمِيلَةِ إِنْ أُعْطِيَ رَضِيَ وَ اِنْ لَمْ يُعْطَ سَخِطَ" (بخاری)

**"దీనార్‌కు దాసోహం అన్నవాడు నాశనమయ్యాడు. దిర్హమ్‌కు దాసోహం అన్నవాడు నాశనమయ్యాడు. చారలు గల దుప్పటిని కలిగి ఉన్న దాసుడు నాశనమయ్యాడు. పనితనము (చిత్రీకరణ) గల దుప్పటి ఉన్న దాసుడు నాశనమయ్యాడు. అతనికేదైనా ఇవ్వబడితే సంతోషిస్తాడు. ఇవ్వకపోతే కినుక వహిస్తాడు." (బుఖారీ)**

ఈ విషయమై ఇమామ్ ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) ఇలా అంటున్నారు: "సంకల్పాలలో, ఉద్దేశాలలో షిర్క్ అనేది తీరంలేని సముద్రం వంటిది. అతి కొద్ది మంది మాత్రమే దాని నుండి బయటపడగలుగుతారు. కనుక ఎవరయినా తన ఆచరణ ద్వారా దైవప్రసన్నతతో పాటు వేరొక సంకల్పం చేసుకుంటే, అల్లాహ్ సామీప్యం పొందటంతో పాటు ఇతరత్రా ఉద్దేశ్యాలకు కూడా చోటిస్తే అతను తన సంకల్పంతో షిర్క్ చేసినట్లే."

ఈ సందర్భంగా 'సంకల్ప శుద్ధి' అంటే భావం దాసుడు తన మాటలను, చేతలను, సంకల్పాన్ని కేవలం అల్లాహ్ కొరకే ప్రత్యేకించాలి. (అంటే కేవలం అల్లాహ్ ప్రసన్నతను చూరగొనటమే అతని ధ్యేయమై ఉండాలి). ఇదే అసలుసిసలు ఏకోన్ముఖత. అంటే సిసలయిన ఇబ్రాహీమ్ విధానం. దీనిని అవలంబించమని దేవుడు తన దాసులందరికీ ఆజ్ఞాపించాడు. ఇది మినహా ఆయన ఎవరి నుండీ, ఎలాంటి దానినీ అంగీకరించడు. ఈ ఏకోన్ముఖతే ఇస్లాం వాస్తవికత. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَمَن يَبْتَغِ غَيْرَ الْإِسْلَامِ دِينًا فَلَن يُقْبَلَ مِنْهُ وَهُوَ فِي الْآخِرَةِ مِنَ الْخَاسِرِينَ﴾(آل عمران:٨٥)

**"ఎవరయినా ఇస్లాంను కాకుండా మరో ధర్మాన్ని అన్వేషిస్తే అతని ధర్మం స్వీకరించబడదు. అలాంటి వ్యక్తి పరలోకంలో నష్టపోయిన వారిలో చేర్తాడు." (ఆలి ఇమ్రాన్ : 85)**

"ఇదే సిసలయిన ఇబ్రాహీమ్ (عليه السلام) విధానం. దీని నుండి ముఖం త్రిప్పుకున్నవాడు, విసుగును ప్రదర్శించినవాడు అతి పెద్ద మూర్ఖుడు." (అల్ జవాబుల్ కాఫీ – పేజి : 115)

## షిర్కె అస్గర్ - షిర్కె అక్బర్‌కి మధ్యగల వ్యత్యాసాలు

వెనుకటి చర్చ ప్రకారం ఈ రెండు రకాల షిర్క్ మధ్య గల తేడాలు ఇవి :

1. షిర్కె అక్బర్ (పెద్ద తరహా షిర్క్) మనిషిని ముస్లిం సముదాయం నుండి బహిష్కరిస్తుంది. షిర్కె అస్గర్ (చిన్న తరహా షిర్క్) ముస్లిం సముదాయం నుండి మనిషిని బహిష్కరించదు గాని అతని ఏకదైవారాధనా విశ్వాసంలో లోపం ఏర్పరుస్తుంది.
2. షిర్కె అక్బర్‌కు పాల్పడినవాడు శాశ్వతంగా నరకయాతనను అనుభవిస్తాడు. షిర్కె అస్గర్‌కు ఒడిగట్టినవాడు నరకానికి ఆహుతి అయినా శాశ్వతంగా నరకంలోనే ఉండడు.
3. షిర్కె అక్బర్ మనిషి ఆచరణలన్నింటినీ నాశనం చేసేస్తుంది. కాగా, షిర్కె అస్గర్ ఆచరణలన్నింటినీ వృథా చేయదు. ఏ ఆచరణలో అది (ప్రదర్శనాబుద్ధి, ప్రాపంచిక స్వలాభాపేక్ష) జొరబడుతుందో దానిని మాత్రమే నాశనం చేస్తుంది.
4. షిర్కె అక్బర్ ముష్రిక్కుల ధన ప్రాణాలను ధర్మసమ్మతం చేసేస్తుంది. కాని షిర్కె అస్గర్ వల్ల అతని ధన ప్రాణాలు ధర్మసమ్మతం అవవు.



**మూడవ ప్రకరణం**

# కుఫ్ర్ (అవిశ్వాసం, తిరస్కార వైఖరి) నిర్వచనం, దాని రకాలు

## (అ) కుఫ్ర్ నిర్వచనం :

నిఘంటువు ప్రకారం కుఫ్ర్ అంటే కప్పి ఉంచటం, దాచి పెట్టడం అని అర్థం.

అయితే షరీయత్‌లో 'ఈమాన్' (విశ్వాసం)కు విరుద్ధమైన దానిని కుఫ్ర్ (అవిశ్వాసం లేక తిరస్కారం) అంటారు.

ఎందుకంటే – దైవం యెడల, దైవప్రవక్త యెడల విశ్వాసం లేకపోవటమనే దానికి మరో పేరే కుఫ్ర్ (అవిశ్వాసం). అందులో ధిక్కరణా వైఖరి ఉన్నా, లేకున్నా అది అవిశ్వాసమే. విశ్వాసం (ఈమాన్)లో సందేహం సంశయమున్నా లేదా విముఖత ఉన్నా, లేదా అసూయ ఉన్నా లేదా అహంకార భావమున్నా లేదా దైవప్రవక్త విధానాన్ని అనుసరించకుండా మనోవాంఛలు అడ్డుపడినా – ఇవన్నీ కుఫ్ర్ (అవిశ్వాసం)లో అంతర్భాగాలే. కాకపోతే దేవుడే లేడని, దైవప్రవక్త రాక అసత్యమని పూర్తిగా కొట్టివేసే వ్యక్తి అవిశ్వాసం చాలా తీవ్రమైనది, కరడుగట్టినది. అలాగే దైవప్రవక్తలు సత్యం అన్న విషయంపై విశ్వాసమున్నప్పటికీ కేవలం అసూయ వల్ల వారిని త్రోసిపుచ్చిన వ్యక్తి కూడా అవిశ్వాసియే (కాఫిరే). (మజ్మూఅ అల్ ఫతావా–షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ–12/335)

## (ఆ) కుఫ్ర్ రకాలు :

కుఫ్ర్ (అవిశ్వాసం) రెండు రకాలు : (1) కుఫ్రె అక్బర్ (పెద్ద తరహా అవిశ్వాసం) (2) కుఫ్రె అస్గర్ (చిన్న తరహా అవిశ్వాసం).

## మొదటి రకం - కుఫ్రె అక్బర్

ఇది మనిషిని ఇస్లామీయ సముదాయం నుండి బహిష్కృతం చేసేస్తుంది. ఇందులో కూడా ఐదు రకాలున్నాయి. అవేమంటే –

**(1) కుఫ్రె తక్‌జీబ్ :** (అబద్ధంతో కూడుకున్న కుఫ్ర్)

దీనికి ప్రమాణం ఈ దైవాదేశం :

﴿وَمَنْ أَظْلَمُ مِمَّنِ افْتَرَى عَلَى اللَّهِ كَذِبًا أَوْ كَذَّبَ بِالْحَقِّ لَمَّا جَاءَهُ أَلَيْسَ فِي جَهَنَّمَ مَثْوًى لِّلْكَافِرِينَ﴾(العنكبوت:٦٨)

**"అల్లాహ్‌కు అబద్ధాన్ని అంటగట్టేవానికన్నా లేదా తన వద్దకు సత్యం వచ్చినపుడు దానిని అసత్యమంటూ ధిక్కరించే వానికన్నా పరమ దుర్మార్గుడెవడుంటాడు? ఏమిటి, అటువంటి తిరస్కారుల నివాస స్థలం నరకంలో ఉండదా?" (అల్ అన్‌కబూత్ : 68)**

**(2) కుఫ్రె తకబ్బుర్ వ ఇన్కార్** (అహంకారం, నిరాకరణతో కూడుకున్న కుఫ్ర్):

ఒక విషయాన్ని సత్యమని ధ్రువీకరిస్తూనే అహంకారం కారణంగా త్రోసిపుచ్చటం. దీనికి ఆధారం ఈ దైవసూక్తి :

﴿وَإِذْ قُلْنَا لِلْمَلَائِكَةِ اسْجُدُوا لِآدَمَ فَسَجَدُوا إِلَّا إِبْلِيسَ أَبَىٰ وَاسْتَكْبَرَ وَكَانَ مِنَ الْكَافِرِينَ ﴾ (البقرة:٣٤)

**"మీరందరూ ఆదం ముందు సాష్టాంగపడండి అని మేము దూతలను ఆజ్ఞాపించినపుడు ఇబ్లీసు తప్ప అందరూ సాష్టాంగపడ్డారు. వాడు నిరాకరించాడు. అహంకారి అయి, అవిశ్వాసులలో చేరిపోయాడు."**

**(అల్ బఖర : 34)**

**(3) కుఫ్రె షక్ (అనుమానంతో కూడుకున్న కుఫ్ర్)**

దీనినే సంశయంతో, సందిగ్ధంతో కూడుకున్న కుఫ్ర్ అని కూడా అంటారు. దీనికి ప్రమాణం దేవుని ఈ సూక్తులు :

﴿وَدَخَلَ جَنَّتَهُ وَهُوَ ظَالِمٌ لِّنَفْسِهِ قَالَ مَا أَظُنُّ أَن تَبِيدَ هَٰذِهِ أَبَدًا☆ وَمَا أَظُنُّ السَّاعَةَ قَائِمَةً وَلَئِن رُّدِدتُّ إِلَىٰ رَبِّي لَأَجِدَنَّ خَيْرًا مِّنْهَا مُنقَلَبًا☆ قَالَ لَهُ صَاحِبُهُ وَهُوَ يُحَاوِرُهُ أَكَفَرْتَ بِالَّذِي خَلَقَكَ مِن تُرَابٍ ثُمَّ مِن نُّطْفَةٍ ثُمَّ سَوَّاكَ رَجُلًا ☆ لَّٰكِنَّا هُوَ اللَّهُ رَبِّي وَلَا أُشْرِكُ بِرَبِّي أَحَدًا﴾(الكهف:٣٥،٣٨)

**ఆ విధంగా అతను తన ఆత్మకు అన్యాయం చేసుకున్న స్థితిలో తన తోటలోకి వెళ్ళాడు. ఇలా అన్నాడు: "ఏనాటికైనా ఈ తోట నాశన మవుతుందని నేననుకోను. ప్రళయ ఘడియ ఆసన్నమవుతుందని కూడా నేను భావించటం లేదు. ఒకవేళ (అలాంటిదేదైనా జరిగి) నేను నా ప్రభువు వద్దకు మరలింపబడినా, నిస్సందేహంగా నేను (ఆ మళ్ళింపు స్థానంలో) ఇంతకన్నా మంచి స్థితిలోనే ఉంటాను." అప్పుడు అతని స్నేహితుడు అతనితో మాట్లాడుతూ ఇలా అన్నాడు: "ఏమిటి, నిన్ను మట్టితో చేసి, ఆ తరువాత వీర్య బిందువుతో సృష్టించి, ఆపైన నిన్ను నిండు మనిషిగా తీర్చిదిద్దిన ఆయననే (ఆరాధ్య దైవాన్నే) తిరస్కరిస్తున్నావా? నా మటుకు నేను ఆ అల్లాహ్‌యే నా ప్రభువు అని నమ్ముతున్నాను. నేను నా ప్రభువుకు సహవర్తునిగా ఎవరినీ కల్పించను." (అల్ కహఫ్ : 35 – 38)**

**(4) కుఫ్రె ఏరాజ్ (విముఖతతో కూడుకున్న కుఫ్ర్)**

దీనికి ప్రమాణ నికషం ఈ దైవసూక్తి :



﴿وَالَّذِينَ كَفَرُوا عَمَّا أُنذِرُوا مُعْرِضُونَ﴾(الاحقاف:٣)

**"అవిశ్వాసులు తాము హెచ్చరించబడే విషయం నుండి ముఖం త్రిప్పుకుంటున్నారు." (అల్ అహ్ఖాఫ్ : 3)**

**(5) కుఫ్రె నిఫాఖ్ (కాపట్యంతో కూడిన కుఫ్ర్) :**

దీనికి ఆధారం దివ్య ఖుర్ఆన్‌లోని ఈ సూక్తి.

﴿ذَٰلِكَ بِأَنَّهُمْ آمَنُوا ثُمَّ كَفَرُوا فَطُبِعَ عَلَىٰ قُلُوبِهِمْ فَهُمْ لَا يَفْقَهُونَ﴾(المنافقون:٣)

**"ఎందుకంటే వారు (మొదట) విశ్వసించి, ఆ తరువాత అవిశ్వాస వైఖరికి పాల్పడ్డారు. అందువల్ల వారి హృదయాలపై సీలు వేయ బడింది. ఇక వారు ఏమీ అర్థం చేసుకోరు."**

**(అల్ మునాఫిఖూన్ : 3)**

## రెండవ రకం - కుఫ్రె అస్గర్ (చిన్నతరహా కుఫ్ర్)

దీనివల్ల మనిషి తన సముదాయం నుండి వేర్పడడు. దీనినే 'క్రియాత్మక కుఫ్ర్'గా కూడా వ్యవహరిస్తారు. దైవగ్రంథంలో, దైవప్రవక్త సున్నత్‌లో ఇది కుఫ్ర్‌గా పేర్కొనబడి నప్పటికీ ఇది 'కుఫ్రె అక్బర్' (పెద్ద తరహా కుఫ్ర్) పరిధిలోనికి రాదు. ఉదాహరణకు దైవానుగ్రహాల పట్ల కృతఘ్నుతాభావం (కుఫ్రానె నీమత్). ఉదాహరణకు:

﴿وَضَرَبَ اللَّهُ مَثَلًا قَرْيَةً كَانَتْ آمِنَةً مُّطْمَئِنَّةً يَأْتِيهَا رِزْقُهَا رَغَدًا مِّن كُلِّ مَكَانٍ فَكَفَرَتْ بِأَنْعُمِ اللَّهِ﴾(النحل:١١٢)

**"అల్లాహ్ ఒక పట్నం ఉదాహరణ ఇస్తున్నాడు. ఆ పట్నం ఎంతో ప్రశాంతంగా, తృప్తిగా ఉండేది. దానికి అన్ని వైపుల నుండీ పుష్కలంగా జీవనోపాధి లభించేది. తరువాత ఆ పట్టణ వాసులు అల్లాహ్ అనుగ్ర హాలపై కృతఘ్నుత చూపారు (దేవుడు చేసిన మేళ్లను మరచి పొయ్యారు)." (అన్ నహ్ల్ : 112)**

ఒక ముస్లిం సాటి ముస్లింతో యుద్ధం చేయటం కూడా 'కుఫ్రె అస్గర్' ఉపమానం లోకే వస్తుంది. దీనిని గురించి మహనీయ ముహమ్మద్ (ﷺ) ఇలా ప్రవచించారు :

"سَبَابُ الْمُسْلِمِ فُسُوقٌ وَ قِتَالُهُ كُفْرٌ" (بخاری ومسلم)

**"ముస్లింను దూషించటం పాపం. అతనిపై కయ్యానికి కాలు దువ్వటం 'కుఫ్ర్". (బుఖారీ, ముస్లిం)**

ప్రవక్త మహనీయుల (సఅసం) వారి ఈ ప్రవచనం కూడా ఈ సందర్భంగా గమనార్హమే –

''لَاتَرْجِعُوا بَعْدِي كُفَّارًا يَضْرِبُ بَعْضُكُمْ رِقَابَ بَعْضٍ'' (بخاری ومسلم)

**"మీరు నా తదనంతరం ఒండొకరి మెడలు నరుక్కొని కాఫిర్లుగా మారకండి." (బుఖారీ, ముస్లిం)**

దైవేతరుల పేర ప్రమాణం చేయటం కూడా ఈ కోవకు చెందినదే. దైవప్రవక్త (ﷺ) ఇలా ప్రవచించారు :

''مَنْ حَلَفَ بِغَيْرِ اللّٰهِ فَقَدْ كَفَرَ أَوْ أَشْرَكَ'' (ترمذی:۱۵۳۵)

**"దైవేతరుని పేర ప్రమాణం చేసినవాడు కుఫ్ర్ (అవిశ్వాసాని)కి ఒడి గట్టాడు లేదా షిర్క్ (బహుదైవోపాసన)కి పాల్పడ్డాడు." (ఈ హదీసును తిర్మిజీ–1535 పొందుపరచి, హసన్‌గా ఖరారు చేశారు. హాకిమ్ మాత్రం దీనిని సహీహ్ – (ప్రామాణికం – గా పేర్కొన్నారు).**

వేరొక చోట అల్లాహ్ పెద్ద పాపానికి ఒడిగట్టిన వానిని విశ్వాసి (మోమిన్)గా పేర్కొన్నాడు. ఇలా సెలవిచ్చాడు :

﴿يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا كُتِبَ عَلَيْكُمُ الْقِصَاصُ فِي الْقَتْلَى﴾ (البقرة:۱۷۸)

**"ఓ విశ్వాసులారా! హతుల విషయంలో ప్రతీకార న్యాయం (ఖిసాస్) మీ కొరకు విధిగా నిర్ణయించబడింది." (అల్ బఖర : 178)**

పై సూక్తిలో అల్లాహ్ హంతకుణ్ణి 'విశ్వాసుల పరిధి' నుండి వేరుచేయలేదు. పైగా అతన్ని హతుని తరపు హక్కుదారునికి సోదరునిగా ఖరారు చేస్తూ అతనిపై ఖిసాస్ చెల్లింపు విధించాడు. తరువాత ఈ విధంగా ఆదేశించాడు :

﴿فَمَنْ عُفِيَ لَهُ مِنْ أَخِيهِ شَيْءٌ فَاتِّبَاعٌ بِالْمَعْرُوفِ وَأَدَاءٌ إِلَيْهِ بِإِحْسَانٍ﴾ (البقرة:۱۷۸)

**"ఒకవేళ హతుని సోదరుడు హంతకుణ్ణి కనికరించదలిస్తే అతను రక్తశుల్కాన్ని న్యాయసమ్మతంగా అడగాలి. హంతకుడు కూడా రక్త ధనాన్ని ఉత్తమ రీతిలో అతనికి చెల్లించాలి. (అల్ బఖర : 178)**

ఇక్కడ 'సోదరత్వం' అంటే భావం నిశ్చయంగా ధార్మిక సోదరబంధమే.

వేరొకచోట అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَإِنْ طَائِفَتَانِ مِنَ الْمُؤْمِنِينَ اقْتَتَلُوا فَأَصْلِحُوا بَيْنَهُمَا﴾ (الحجرات:۹)

**"ఒకవేళ ముస్లింలలోని రెండు పక్షాలు పరస్పరం గొడవపడితే వారి మధ్య సయోధ్య చేయండి." (అల్ హుజురాత్ : 9)**

చివరకు అల్లాహ్ ఈ విధంగా కూడా సెలవిచ్చాడు :

﴿إِنَّمَا الْمُؤْمِنُونَ إِخْوَةٌ فَأَصْلِحُوا بَيْنَ أَخَوَيْكُمْ﴾ (الحجرات:۱۰)



**"(గుర్తుంచుకోండి) విశ్వాసులంతా అన్నదమ్ములు. కనుక మీ సోదరు లిరువురి మధ్య రాజీ కుదుర్చండి." (అల్ హుజురాత్ : 10)**

**(పైన పొందుపరచబడిన విషయం 'షరహుత్తహావీయ' నుండి సంక్షిప్తంగా సంగ్రహించబడినది).**

## కుఫ్రె అక్బర్ - కుఫ్రె అస్గర్ మధ్య గల తేడాలు

(1) కుఫ్రె అక్బర్ (పెద్ద తరహా కుఫ్ర్) మనిషిని ఇస్లామీయ సముదాయం నుండి వేరుపరుస్తుంది. అతని ఆచరణలన్నీ దీని మూలంగా వృథా అయిపోతాయి. కుఫ్రె అస్గర్ (చిన్న తరహా కుఫ్ర్) వల్ల మనిషి ఇస్లామీయ సమాజం నుండి బహిష్కృతుడవటం గానీ, అతని ఆచరణలు వృధా అవటంగానీ జరగదు. అయితే అతనిలో 'కుఫ్ర్' మోతాదునుబట్టి అతని విశ్వాసం బలహీనమవుతుంది. దీనికి పాల్పడిన వ్యక్తిని అది శిక్షార్హునిగా నిలబెడుతుంది.

(2) కుఫ్రె అక్బర్ (పెద్ద తరహా కుఫ్ర్)కు పాల్పడిన వ్యక్తిని అది శాశ్వతంగా నరకానికి ఆహుతి చేస్తుంది. కుఫ్రె అస్గర్ (చిన్న తరహా కుఫ్ర్)కు పాల్పడిన వ్యక్తి ఒకవేళ నరకానికి ఆహుతి అయినప్పటికీ అందులో శాశ్వతంగా పడి ఉండడు. అల్లాహ్ అతని పశ్చాత్తాపాన్ని స్వీకరించి, అతన్ని క్షమించి, నరకంలో వేయకపోవటం కూడా సంభవమే.

(3) కుఫ్రె అక్బర్ – దానికి పాల్పడిన వ్యక్తి ధన ప్రాణాలను అది సమ్మతంగా చేసివేస్తుంది. కాగా; కుఫ్రె అస్గర్ – దానికి పాల్పడిన వ్యక్తి ధన ప్రాణాలను సమ్మతం చేయదు.

(5) కుఫ్రె అక్బర్‌కు ఒడిగట్టిన వ్యక్తికి – విశ్వాసులకు మధ్య వైమనస్యం, విరోధ భావం తప్పకుండా ఏర్పడుతుంది. కాబట్టి కుఫ్రె అక్బర్‌కి ఒడిగట్టే వారితో ముస్లింలు స్నేహం చేయటం ధర్మసమ్మతం కాదు – అతనెంత దగ్గరివాడయినాసరే! అయితే కుఫ్రె అస్గర్ ఎట్టి పరిస్థితిలోనూ స్నేహ బంధంలో అవరోధంగా ఉండదు. పైగా అలాంటి వ్యక్తితో – అతనిలో ఉన్న విశ్వాస (ఈమాన్) మోతాదును బట్టి స్నేహ పూర్వక సంబంధాలు పెంపొందించుకోవచ్చు. అతనిలో ఉన్న అవిధేయతా భావం, పాపం మోతాదునుబట్టి అతని పట్ల దూరంగా ఉండటం జరుగుతుంది.

## నాల్గవ ప్రకరణం

# నిఫాఖ్ (కపటత్వం) నిర్వచనం, దాని రకాలు

### (అ) నిఫాఖ్ (కపటత్వం, వంచన) నిర్వచనం :

**'నిఫాఖ్'** అనేది నిఘంటువు ప్రకారం "نَافَقَ" **'నాఫఖ'** అనే క్రియతో ముడిపడి ఉంది. "نَافَقَ يُنَافِقُ نِفَاقًا و مُنَافَقَةً" **నాఫఖ యునాఫిఖు నిఫాఖన్ వ మునాఫఖతన్** అని అనబడుతుంది – ఈ పదం "اَلنَّافِقَاء" **'అన్నాఫిఖాఅ'** నుండి గ్రహించబడినది. అంటే ఉడుము తన కన్నం నుండి బయటపడే రహస్యమార్గం అని భావం. కన్నంలో ఉన్న ఉడుమును ఒక మార్గం నుండి పట్టుకోటానికి ప్రయత్నించినపుడు అది రెండో వైపు నుండి పారిపోతుంది. మరో ఉవాచ ప్రకారం ఇది **'నఖఫ'** నుండి సంగ్రహించబడినది. ఉడుము దాక్కున్న కన్నాన్ని **నఫఖ** అంటారు. (అన్నిహాయతుల్ ఇబ్నుల్ అసీర్ – 5/98)

### షరీయత్ ప్రకారం 'నిఫాఖ్' అంటే ....

ఇస్లాం గురించి, మంచి గురించి ప్రకటించటం. దాంతోపాటే తిరస్కారభావాన్ని, కపటత్వాన్ని మనసులో దాచిపెట్టడం. దీనికి 'నిఫాఖ్' అనే నామకరణం ఎందుకు చేయబడిందంటే మునాఫిఖ్ (కపటవిశ్వాసి, వంచకుడు) షరీయతులో ఒక ద్వారం గుండా ప్రవేశించి, మరో ద్వారం గుండా షరీయత్ నుండి బయటికెళ్ళిపోతాడు. దీనిపై అల్లాహ్ ఈ విధంగా హెచ్చరించాడు –

﴿إِنَّ الْمُنَافِقِينَ هُمُ الْفَاسِقُونَ﴾(التوبة:٦٧)

**"నిశ్చయంగా కపటులు పాపాత్ములు (అవిధేయులు)."**

**(అత్ తౌబా : 67)**

అంటే వారు షరీయత్ కట్టుబాట్లను ఖాతరు చేయకుండా వెళ్ళిపోయేవారన్నమాట! అల్లాహ్ కపట విశ్వాసులను అవిశ్వాసులకన్నా చెడ్డవారుగా ఖరారు చేశాడు :

﴿إِنَّ الْمُنَافِقِينَ فِى الدَّرْكِ الْأَسْفَلِ مِنَ النَّارِ﴾(النساء:١٤٥)

**"నిశ్చయంగా కపటులు నరకంలోని అధమాతి అధమ శ్రేణిలోకి వెళతారు." (అన్ నిసా : 145)**

ఇంకా ఇలా సెలవిచ్చాడు :

﴿إِنَّ الْمُنَافِقِينَ يُخَادِعُونَ اللّٰهَ وَهُوَ خَادِعُهُمْ﴾(النساء:١٤٢)

**"నిశ్చయంగా కపటులు తమ జిత్తులతో అల్లాహ్‌నే మోసగించాలనుకుంటున్నారు. అయితే అల్లాహ్ వారి జిత్తులకు తగిన శిక్ష విధించనున్నాడు" (అన్ నిసా : 142).**

ఇంకా ఈ విధంగా కూడా సెలవిచ్చాడు:



﴿يُخَادِعُونَ اللّٰهَ وَالَّذِينَ آمَنُوا وَمَا يَخْدَعُونَ إِلَّا أَنْفُسَهُم وَمَا يَشْعُرُونَ☆فِى قُلُوبِهِم مَّرَضٌ فَزَادَهُمُ اللّٰهُ مَرَضاً وَلَهُم عَذَابٌ أَلِيْمٌ بِمَا كَانُوا يَكْذِبُونَ﴾(البقرة:٩،١٠)

**"వారు అల్లాహ్‌ను, విశ్వాసులనూ మోసపుచ్చుతున్నారు. అయితే వాస్తవానికి వారు స్వయంగా – తమను తామే – మోసపుచ్చుకుంటున్నారు. కాని ఈ విషయాన్ని వారు గ్రహించటం లేదు. వారి హృదయాలలో రోగం ఉంది. ఆ రోగాన్ని అల్లాహ్ మరింతగా పెంచాడు. వారు చెప్పే అబద్ధం మూలంగా వారి కొరకు వ్యధాభరిత మయిన శిక్ష ఉంది." (అల్ బఖర – 9, 10)**

### (ఆ) నిఫాఖ్ (కాపట్యం) రకాలు :

**నిఫాఖ్ (కపటత్వం) రెండు రకాలు : (1) విశ్వాసపరమైన కపటత్వం (2) క్రియాత్మకమైన కపటత్వం.**

**మొదటిది :** (విశ్వాసపరమైన కపటత్వం) ఇదే నిఫాఖె అక్బర్. అంటే పెద్ద తరహా కపటత్వం. దీనికి ఆలవాలమై ఉన్న వ్యక్తి పైకి ఇస్లాం స్వీకరించినట్లు ప్రకటిస్తాడు. లోపల కుఫ్ర్‌ని (అవిశ్వాసాన్ని) దాచిపెట్టుకుంటాడు. ఈ రకమయిన కపటత్వం కలవాడు ఇస్లాం నుండి పూర్తిగా బహిష్కృతుడైనట్లే. దీనికి పాల్పడినవాడు నరకంలోని అట్టడుగు వర్గీయుల్లో చేర్తాడు. అల్లాహ్ కపటులను అత్యంత చెడ్డవారుగా అభివర్ణించాడు. ఉదాహరణకు : అవిశ్వాసం, అవినీతి, ధర్మాన్ని, ధర్మావలంబీకులను పరిహసించటం, వారిని చూసి వెకిలి సైగలు చేయటం, ఇస్లాం విరోధులతో కుమ్మక్కు అవటం వారిలోని దుర్గుణాలు. కపట విశ్వాసులు శత్రుత్వంలో ఇస్లాం శత్రువులకు సమ ఉజ్జీలుగా ఉంటారు. ఈ కపటులు అన్ని కాలాల్లో ఉన్నారు, ఉంటారు. ముఖ్యంగా ఇస్లాం ప్రాబల్యం వహించినపుడు ఓర్చుకోలేకపోతారు. బహిరంగంగా ముస్లింలను ఎదిరించే శక్తి వారిలో ఉండదు. అందుకే ఇస్లాంకు, ముస్లిములకు వ్యతిరేకంగా కుట్రలు పన్నే ఉద్దేశంతో ఇస్లాం స్వీకరిస్తున్నట్లు ప్రకటిస్తారు. ఆ విధంగా ఇస్లాం ముసుగులో ఎసరుపెడతారు. అలా ఉండటం వల్ల తమ ధన ప్రాణాలకు రక్షణ ఉంటుందన్న స్వార్థం కూడా వారి అంతరంగంలో దాగి ఉంటుంది.

అందుకే కపట విశ్వాసి (మునాఫిఖ్) అల్లాహ్‌ను, ఆయన గ్రంథాలను, ఆయన ప్రవక్తలను, అంతిమ దినాన్ని విశ్వసించినట్లు పైకి ప్రకటిస్తాడు. కాని అతని అంతరంగంలో తిరస్కరణాభావం తిష్ఠవేసి ఉంటుంది. నిజానికి అతనికి అల్లాహ్‌పై విశ్వాసముండదు. ఖుర్ఆన్ దైవప్రోక్తమని, ఆయన దానిని ఒక మానవమాత్రుని (ముహమ్మద్ – ﷺ) పై అవతరింపజేశాడని, ఆయన్ని సమస్త మానవుల వైపు సందేశహరునిగా పంపాడనీ, ఆ ప్రవక్త (ﷺ) దైవాదేశానుసారం ప్రజలకు మార్గదర్శకత్వం వహిస్తారని, ఆయన

విధించే శిక్ష గురించి సావధానపరుస్తారని స్వయంగా దేవుడు తెలియజేశాడు. అయినప్పటికీ కపట విశ్వాసికి ఇదేమీ పట్టదు. అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో కపటుల బండారాన్ని బట్టబయలు చేశాడు. వారి లోగుట్టును రట్టు చేశాడు. వారి విషయంలో అప్రమత్తంగా ఉండమని తన దాసులను సావధానపరిచాడు.

అల్ బఖరా సూరాలోని తొలి వాక్యాలలోనే మానవుల్లోని మూడు వర్గాల ప్రస్తావన తేబడింది – (1) విశ్వాసులు (2) అవిశ్వాసులు (3) కపటులు. విశ్వాసుల ప్రస్తావన 4 సూక్తులలో, అవిశ్వాసుల ప్రస్తావన 2 సూక్తులలో వస్తే, కపటుల ప్రస్తావన 13 సూక్తులలో వచ్చింది. ఎందుకంటే కపటులు అధిక సంఖ్యలో ఉన్నారు – నివురు గప్పిన నిప్పులా ఉంటారు. వారెక్కడ ఉన్నా అక్కడి ప్రజల పాలిట ఒక పరీక్షగా, ఉపద్రవంగానే ఉంటారు. కాగా; ఇస్లాం మరియు ముస్లింల పాలిట వారి బెడద తీవ్రమైనది. ఎందుకంటే వారి మూలంగా సదా ఇస్లాంకు ఎన్నో కష్టాలు వచ్చిపడ్డాయి. వారు బాహ్యంలో ఇస్లాం అనుయాయులుగా కనిపిస్తారు. సమర్థకులుగా ముందుకు వస్తారు. యదార్థానికి వారు ఇస్లాం ధర్మానికి బద్ధశత్రువులుగా ఉంటారు. సర్వవిధాలా వారు ఇస్లాంకు తూట్లు పొడుస్తుంటారు. అమాయకులు, అవివేకులు వారిని చూసి మంచివారుగా తలపోస్తారు. వారి మాటల్ని సంస్కరణతో కూడిన మాటలుగా భావిస్తారు. కాని వారి మాటల్లో అజ్ఞానం, కల్లోలం కలగలసి ఉంటుంది.

('సిఫాతుల్ మునాఫిఖీన్ లి ఇబ్నుల్ ఖయ్యిమ్' నుండి సేకరించబడింది.)

**విశ్వాసపరమైన కపటత్వం ఆరు రకాలు :**

1. మహాప్రవక్త (ﷺ) ను ధిక్కరించటం.
2. మహాప్రవక్త (ﷺ) షరీయతులోని కొన్ని విషయాలను అసత్యమంటూ త్రోసిపుచ్చటం.
3. మహాప్రవక్త (ﷺ) పై అక్కసును వెళ్ళగ్రక్కటం, విరోధ భావం కలిగి ఉండటం.
4. మహాప్రవక్త (ﷺ) తెచ్చిన షరీయతులోని కొన్ని విషయాల పట్ల ఓర్వలేనితనాన్ని ప్రదర్శించటం.
5. మహాప్రవక్త (ﷺ) ధర్మం అధోగతిలో ఉన్నట్టు అనిపిస్తే సంతోషించటం.
6. మహాప్రవక్త (ﷺ) ధర్మానికి చేకూరిన ప్రాబల్యాన్ని చూసి సహించలేకపోవటం. (మజ్మూఅతుత్తౌహీద్ – పేజి : 9)

రెండవ రకం – క్రియాత్మకమైన కపటత్వం (నిఫాఖె అమలీ) :

అంటే మనిషి హృదయంలో విశ్వాస (ఈమాన్) మైతే ఉంటుంది గాని అతని ఆచరణల్లో కపటత్వం తొంగి చూస్తుంటుంది. ఇటువంటి ఆచరణ మనిషిని ఇస్లాం పరిధి నుండి బయటికి నెట్టదు. కాని కపటత్వం ముదిరే ప్రమాదం మాత్రం పొంచి



ఉంటుంది. ఇలాంటి వ్యక్తిలో విశ్వాసం, కాపట్యం – రెండూ ఉంటాయి. అయితే కాపట్యం మోతాదు పెరిగిపోయినపుడు అతను పక్కా కపటిగా తయారవుతాడు. దీనికి ప్రమాణం ప్రవక్త మహనీయుల (ﷺ) వారి ఈ ప్రవచనం.

"أَرْبَعٌ مَنْ كُنَّ فِيهِ كَانَ مُنَافِقًا خَالِصًا وَمَنْ كَانَتْ فِيهِ خَصْلَةٌ مِنْهُنَّ كَانَتْ فِيهِ خَصْلَةٌ مِنَ النِّفَاقِ حَتَّى يَدَعَهَا: إِذَا اؤْتُمِنَ خَانَ، وَإِذَا حَدَّثَ كَذَبَ، إِذَا عَاهَدَ غَدَرَ، وَإِذَا خَاصَمَ فَجَرَ" (بخاری ومسلم)

**"నాలుగు లక్షణాలున్నాయి. అవి గనక ఎవరిలోనయినా ఉంటే అతను పక్కా కపట విశ్వాసి అవుతాడు. ఎవరిలోనయినా వాటిలో ఏ ఒక్క లక్షణమైనా ఉంటే కాపట్యానికి సంబంధించిన ఒక లక్షణం అతనిలో ఉన్నట్లు లెక్క – దానిని అతను విడిచిపెట్టనంత వరకూ (ఆ అవగుణం కారణంగా అతను నిందార్హుడే). అవేమంటే; (1) అతనికేదన్నా అమానతు (సొత్తు)ను అప్పగిస్తే ద్రోహానికి పాల్పడతాడు. (2) మాట్లాడితే అబద్ధం చెబుతాడు. (3) నమ్మి ఒడంబడిక చేసుకున్నప్పుడు నమ్మక ద్రోహం చేస్తాడు. (4) పోట్లాట జరిగినపుడు దుర్భాషకు దిగుతాడు." (బుఖారీ, ముస్లిం)**

కనుక ఏ మనిషిలోనయినా ఈ నాలుగు అవ లక్షణాలు ఏకకాలంలో తిష్ఠవేస్తే, అతనిలో చెడుగు పూర్తిగా జొరబడినట్లే. అతనిలో కపట లక్షణాలన్నీ పొడసూపినట్లే. మరెవరిలోనయినా వీటిలో ఒక అవలక్షణం ఉంటే, అతనిలో కాపట్యానికి సంబంధించిన ఒక ఆనవాలు ఉందన్నమాట! ఒక్కోసారి ఒక దాసునిలో మంచి లక్షణాలు – చెడు లక్షణాలు, విశ్వాస లక్షణాలు – అవిశ్వాస, కాపట్య లక్షణాలు – రెండూ చోటు చేసుకుంటాయి. తత్కారణంగా అతను బహుమానంతో పాటు శిక్షకు కూడా అర్హుడవుతుంటాడు.

మస్జిదులో జరిగే సామూహిక నమాజ్ పట్ల అనాసక్తత, బద్ధకం కూడా ఈ కాపట్య లక్షణాలలో ఒకటి.

కపటత్వం (నిఫాఖ్) మహా చెడ్డ వస్తువు. అందుకే ప్రవక్త ప్రియసహచరులు (رضي الله عنهم) కాపట్యానికి లోనయ్యే విషయం పట్ల నిత్యం భయపడుతూ ఉండేవారు.

ఇబ్నె అబీ ములైకా ఇలా అంటున్నారు :

"నేను ముప్ఫయి మంది సహాబా (ప్రవక్త సహచరుల)ను కలుసుకున్నాను. వారంతా తమను కాపట్యం ఎక్కడ చుట్టుకుంటుందోనని భయపడుతూ ఉండేవారు."

## నిఫాఖె అక్బర్ - నిఫాఖె అస్గర్‌కి మధ్య గల తేడాలు :

(1) నిఫాఖె అక్బర్ (పెద్ద తరహా కాపట్యం) మనిషిని ఇస్లామీయ సమాజం నుండి బహిష్కరిస్తుంది. నిఫాఖె అస్గర్ (చిన్న తరహా కాపట్యం) సమాజం నుండి బహిష్కరించదు.

(2) విశ్వాసాలలోని అంతర్బాహ్యాలలో గల విభేదానికి మరో పేరే నిఫాఖె అక్బర్. కాగా; ఆచరణల్లోని అంతర్బాహ్యాలలో గల వైరుధ్యమే నిఫాఖె అస్గర్.

(3) ఒక విశ్వాసి వల్ల పెద్ద తరహా కపట చేష్ట జరగదు. చిన్న తరహా కపట చేష్టలే అతని వల్ల జరిగేందుకు ఆస్కారముంటుంది.

(4) పెద్ద తరహా కాపట్యానికి (నిఫాఖె అక్బర్‌కి) ఒడిగట్టిన వ్యక్తి చాలా వరకు పశ్చాత్తాపం ప్రకటించడు. ఒకవేళ అతను పరిపాలకుని సమక్షంలో పశ్చాత్తాపం చెందితే అతని పశ్చాత్తాపం స్వీకారయోగ్యమవుతుందా? లేదా? అనే విషయంలో విద్వాంసుల మధ్య భేదాభిప్రాయం ఉంది. తద్భిన్నంగా చిన్న తరహా కాపట్యానికి పాల్పడిన వ్యక్తి ఒక్కోసారి అల్లాహ్ సన్నిధిలో పశ్చాత్తాపపడుతుంటాడు. అల్లాహ్ అతని పశ్చాత్తాపాన్ని ఆమోదిస్తాడు.

షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (رحمه الله) ఇలా అంటున్నారు :

"తరచూ జరిగేదేమిటంటే ఒక విశ్వాసి కాపట్యానికి సంబంధించిన ఏదో ఒక విషయానికి లోనవుతాడు. తరువాత అల్లాహ్ అతని పశ్చాత్తాపాన్ని ఆమోదిస్తాడు. ఒక్కోసారి అతని ఆంతర్యంలో కొన్ని విషయాలు జనిస్తుంటాయి. అవి కాపట్యానికి ఆనవాలుగా ఉంటాయి. ఎట్టకేలకు అల్లాహ్ అతని ఆ స్థితిని కూడా రూపుమాపుతాడు. ఒక విశ్వాసి ఒక్కోసారి పైశాచిక ప్రేరణలకు, అవిశ్వాస శంకలకు లోనవుతుంటాడు. తత్కారణంగా అతని మనసు కుంచించుకుపోతూ ఉంటుంది. అతను తీవ్రంగా మనస్తాపానికి గురవుతాడు. ఆ విషయమే ఒకసారి ప్రియ సహచరులు దైవప్రవక్త (ﷺ)తో చెప్పుకున్నారు :

"దైవప్రవక్తా (ﷺ)! మాలో కొందరి హృదయాలలో కలిగే భావాలు ఎంత తీవ్రమైనవంటే, వాటిని గురించి నోటితో చెప్పటం కన్నా నింగి నుంచి నేలపై పడిపోవటమే మిన్న అని అనుకుంటున్నాము'. దానికి ఆయన (ﷺ) ఇలా అన్నారు : "ఈ భావనే అసలు విశ్వాసం (ఈమాన్)." (ముస్నదె అహ్మద్, ముస్లిం)

మరో ఉల్లేఖనంలోని పదాలు ఇలా ఉన్నాయి :

'వాటిని నోటితో చెప్పటం కష్టమని భావిస్తున్నాడు.'

దానికి ఆయన (ﷺ) ఇలా అన్నారు : "షైతాన్ ఎత్తుగడలను శంకలుగా మార్చివేసిన అల్లాహ్‌కే సకల స్తోత్రాలు." అంటే ఆంతర్యంలో జనించే ఇలాంటి దుష్ప్రేరణలపై అయిష్టతను వ్యక్తపరచటం, వాటిని మనసులో నుంచి తీసిపడవెయ్యటం విశ్వాసానికి చిహ్నం అన్నమాట!" (కితాబుల్ ఈమాన్, పేజీ – 238)

నిఫాఖె అక్బర్ (పెద్ద తరహా కాపట్యం) సంగతి వేరు. అలాంటి వారి గురించి అల్లాహ్ ఏమంటున్నాడో చూడండి –



﴿صُمٌّ بُكْمٌ عُمْيٌ فَهُمْ لَا يَرْجِعُونَ﴾ (البقرة:١٨)

**"వారు చెవిటివారు, మూగవారు, గ్రుడ్డివారు. వారిక మరలిరారు."**
**(అల్ బఖర : 18)**

అంటే వారు మనస్ఫూర్తిగా ఇస్లాం వైపునకు రుజువర్తనులవరు.

అలాంటి వారి గురించి అల్లాహ్ ఈ విధంగా కూడా సెలవిచ్చాడు :

﴿أَوَلَا يَرَوْنَ أَنَّهُمْ يُفْتَنُونَ فِي كُلِّ عَامٍ مَّرَّةً أَوْ مَرَّتَيْنِ ثُمَّ لَا يَتُوبُونَ وَلَا هُمْ يَذَّكَّرُونَ﴾ (التوبة:١٢٦)

**"ఏమిటీ, ప్రతి ఏటా ఒకసారో, రెండుసార్లో తాము ఏదో ఒక ఆపదలో చిక్కుకుపోవటాన్ని వారు గమనించటం లేదా? అయినాసరే, వారు పశ్చాత్తాపపడటంగానీ, గుణపాఠం నేర్చుకోవటంగానీ జరగటం లేదు." (అత్ తౌబా : 126)**

షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (رحمه الله) ఇలా అంటున్నారు :

"వారి పశ్చాత్తాపం స్వీకరించబడే విషయంలో విద్వాంసుల మధ్య భిన్నాభిప్రాయం ఉంది. ఎందుకంటే అందులోని వాస్తవికత ఏపాటిదో తెలీదు. ఎందుచేతనంటే వారు నిత్యం తమను ఇస్లాం అనుయాయులుగానే చెప్పుకుంటూ ఉంటారు." (మజ్మూఅ ఫతావా – 28/434, 435)

## ఐదవ ప్రకరణం

# అజ్ఞానం, పాపం, మార్గభ్రష్టత, ధర్మభ్రష్టతల వాస్తవికత : వాటి రకాలు, ఆదేశాలు

### 1. అజ్ఞానం :

అల్లాహ్ గురించి, ఆయన ప్రవక్త గురించి, ధర్మాదేశాల గురించి తెలియకపోవటం. వంశంపై, కులగోత్రాలపై గర్వపడటం. అహంభావంతో విర్రవీగటం – ఇత్యాదివి. ఇవన్నీ ఇస్లాంకు పూర్వం అరబ్బులలో ఉండేవి. అంటే అవిద్య, విషయ పరిజ్ఞానం లేకపోవటం, కుహనా ప్రతిష్ఠల కోసం ప్రాకులాడటం – దీన్నంతటినీ అజ్ఞానంగా పేర్కొనటం జరిగింది. (అన్నిహాయతుల్ ఇబ్నుల్ అసీర్ – 1/323)

షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (రహ్మ) ఇలా అంటున్నారు :

"ఒకవేళ ఎవరికయినా సత్యజ్ఞానం లేకుంటే అది అతని సర్వసాధారణ అజ్ఞానం. ఒకవేళ అతని విశ్వాసం సత్యానికి వ్యతిరేకంగా ఉంటే అతను చిక్కు ముడితో కూడిన అజ్ఞానంలో ఉన్నాడు. ఒకవేళ ఎవరయినా సత్యం గురించి తెలిసి లేదా తెలియకుండా సత్యవిరుద్ధమయిన మాటంటే అప్పటికీ అతను అజ్ఞానియే. కనుక ఇది స్పష్టమైన మీదట విదితం కావలసిన విషయమేమిటంటే దైవప్రవక్త (ﷺ) ప్రభవనానికి పూర్వం అజ్ఞానానికి లోనైవున్న వారంతా తెలీక పోవటం వల్లనే అలా ఉన్నారు. ఎందుకంటే అప్పటికి వారు ఏ మాటలకు, ఏ ఆచారాలకు కట్టుబడి ఉన్నారో అవన్నీ ఒక అజ్ఞాని చేత ఆవిష్కరించబడినవే. వాటిని పాటించే వారు కూడా అజ్ఞానులే."

అలాగే – దైవప్రవక్తలు (عليهم السلام) తెచ్చిన షరీయతులకు విరుద్ధంగా ఉన్న ప్రతి వస్తువు – ఉదాహరణకు (ప్రస్తుతమున్న) యూదత్వం, క్రైస్తవం – ఇవి సాధారణ అజ్ఞానంగా అభివర్ణించబడతాయి.

కాని అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (ﷺ) రాక తర్వాత ఈ అజ్ఞానం 'సర్వసాధారణం'గా లేదు. అది ఏ పట్టణంలోనో లేదా ఏ అవిశ్వాస వ్యవస్థలోనో ఉంటుంది. అలాగే ఒక వ్యక్తిలో ఉంటుంది, ఒక వ్యక్తిలో ఉండదు. ఉదాహరణకు : ఒక వ్యక్తి ఇస్లాం స్వీకరించక ముందు అజ్ఞానంలో ఉంటాడు – అతను ఇస్లామీయ వ్యవస్థలో నివసించే వాడైనా, అవతలివాడైనా! కాని అంతిమ ప్రవక్త (ﷺ) వచ్చిన తరువాత ఏ ఒక్క కాలంలోనయినా మానవతను పూర్తిగా అజ్ఞానం పెనవేసుకుని ఉండటం అనేది జరగదు. ఎందుకంటే ప్రళయకాలం వరకూ (సర్వకాల సర్వావస్థల్లో) ముహమ్మద్ అనుచర సమాజంలోని ఒక జమాఅత్ (సమూహం) సత్యంపై స్థిరంగా ఉంటుంది. కాకపోతే ఒక



ప్రత్యేకమైన అజ్ఞానం ఇప్పటికీ కొన్ని ముస్లిం దేశాలలోనూ, ఎందరో ముస్లిములలోనూ కానవస్తోంది – అది వేరే సంగతి. ఉదాహరణకు : ప్రవక్త మహనీయులు (ﷺ) ఇలా ప్రవచించారు :

"أَرْبَعٌ فِي مِنْ أَمْرِ الْجَاهِلِيَّةِ..." (صحيح مسلم)

**"నా అనుచర సమాజంలో నాలుగు విషయాలు అజ్ఞాన వ్యవహారాలుగా పరిగణించబడతాయి .... " (సహీహ్ ముస్లిం)**

ఆయన (ﷺ) అబూజర్ (رضي الله عنه) ని ఉద్దేశ్యించి ఇలా అన్నారు :

"إِنَّكَ أَمْرٌ فِيكَ جَاهِلِيَّةٌ" (بخاری و مسلم)

**"నీలో ఇప్పటికీ అజ్ఞానం మిగిలి ఉంది." (బుఖారీ, ముస్లిం)**

**సారాంశం :**

అజ్ఞానం అంటే అవిద్య, విషయం తెలియకపోవటం అని భావం. ఇది రెండు రకాలు. 1. సర్వసాధారణ అజ్ఞానం 2. ప్రత్యేకమైన అజ్ఞానం

**1. సర్వసాధారణ అజ్ఞానం :**

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (ﷺ) రాకపూర్వం ఈ అజ్ఞానం ఉండేది. ఆయన (ﷺ) రాక తరువాత ఇది సమసిపోయింది.

**2. ప్రత్యేకమైన అజ్ఞానం :**

ఈ రకమయిన అజ్ఞానం కొన్ని రాజ్యాలలో, కొన్ని పట్టణాలలో, కొందరు వ్యక్తులలో మాత్రమే ఉండేది. ఇప్పటికీ ఇది మిగిలి ఉంది. దీనివల్ల అజ్ఞానాన్ని ఈ కాలంలోనూ సర్వసామాన్యం చేయగోరేవారి తప్పు తెలిసివస్తుంది. వారిలా అంటారు : ఈ శతాబ్దపు అజ్ఞానం లేదా 21వ శతాబ్ది అజ్ఞానం. లేదా ఇవే రకమయిన మాటలు. ఇది సరైనది కాదు. ఈ శతాబ్దికి చెందిన కొందరి అజ్ఞానం లేక అధికుల అజ్ఞానం అనాలి. ఇదే సరైనది. అంతేగాని అందరిపై సర్వసామాన్యమయిన అజ్ఞానాన్ని రుద్దటం సమ్మతం కాదు. ఎందుకంటే అంతిమ దైవప్రవక్త (ﷺ) రాకతోనే సర్వసామాన్యమైన అజ్ఞానానికి చరమగీతం పాడబడింది.

### (2) పాపం (ఫిస్ఖ్) :

నిఘంటువు ప్రకారం 'ఫిస్ఖ్' అంటే బయటికి వెళ్ళటం అని అర్థం.

షరీయత్ పరిభాషలో : 'ఫిస్ఖ్' అంటే దైవ విధేయతా కట్టుబాటును త్రెంచుకుని పోవటం అని భావం. దైవవిధేయతను లక్ష్యపెట్టకుండా – పూర్తిగా – విచ్చలవిడిగా బయటకు పోయే వాడికి 'ఫిస్ఖ్' అనే పదం అతికినట్లే సరిపోతుంది. ఈ రకంగా కాఫిర్ (సత్య తిరస్కారి) కూడా ఫాసిఖ్ (అవిధేయుడు)గా వ్యవహరించబడతాడు. దైవవిధేయతా పరిధిని పాక్షికంగా ఉల్లంఘించిన వానికి కూడా ఇది వర్తిస్తుంది. ఈ దృష్టితో చూసినపుడు

పెద్ద పెద్ద పాపకార్యాలకు ఒడిగట్టిన విశ్వాసి (మోమిన్)ని కూడా 'ఫాసిఖ్' గా పేర్కొనబడవచ్చు.

## అందుకే ఫిస్ఖ్ రెండు రకాలు :

**మొదటి రకం :** ఇది మనిషిని ఇస్లాం పరిధి నుండి బయటికి నెట్టివేస్తుంది. దీనికి మరోపేరే కుఫ్ర్ (అవిశ్వాసం, తిరస్కారం). కాబట్టి కాఫిర్ అయినవాడు ఫాసిఖ్‌గా కూడా వ్యవహరించబడతాడు. అల్లాహ్ ఇబ్లీస్ గురించి ప్రస్తావిస్తూ ఇలా అన్నాడు :

﴿فَفَسَقَ عَنْ أَمْرِ رَبِّهِ﴾(الكهف:٥٠)

**"వాడు తన ప్రభువు ఆజ్ఞను జవదాటాడు." (అల్ కహఫ్ : 50)**

ఇబ్లీస్ ధిక్కారానికి కారణం 'కుఫ్ర్' మాత్రమే.

ఇంకా – అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَأَمَّا الَّذِينَ فَسَقُوا فَمَأْوَاهُمُ النَّارُ﴾(السجدة:٢٠)

**"మరెవరు అవిధేయతకు ఒడిగట్టారో వారి నివాస స్థలం నరకం అవుతుంది." (అస్ సజ్‌దహ్ : 20)**

అంటే – వారు అవిశ్వాసులన్నమాట! దీనికి ప్రమాణం ఈ దైవసూక్తి :

﴿كُلَّمَا أَرَادُوا أَن يَخْرُجُوا مِنْهَا أُعِيدُوا فِيهَا وَقِيلَ لَهُمْ ذُوقُوا عَذَابَ النَّارِ الَّذِي كُنتُم بِهِ تُكَذِّبُونَ﴾(السجدة:٢٠)

**దాన్నుండి బయటపడేందుకు వారు ప్రయత్నించినపుడల్లా అందులోనికే నెట్టివేయబడతారు. "మీరు తిరస్కరిస్తూ ఉండిన అగ్ని యాతన రుచి చూడండి" అని వారితో అనబడుతుంది. (అస్‌సజ్‌దహ్:20)**

## రెండవ రకం :

ఘోరమైన పాపాలకు పాల్పడేవారిని కూడా 'ఫాసిఖ్' (అవిధేయుడు) అంటారు. కాని వారి ఫిస్ఖ్ (అవిధేయత) వారిని ఇస్లాం నుండి ఉద్వాసన పలకదు. ఈ నేపథ్యంలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَالَّذِينَ يَرْمُونَ الْمُحْصَنَاتِ ثُمَّ لَمْ يَأْتُوا بِأَرْبَعَةِ شُهَدَاءَ فَاجْلِدُوهُمْ ثَمَانِينَ جَلْدَةً وَلَا تَقْبَلُوا لَهُمْ شَهَادَةً أَبَداً وَأُولَئِكَ هُمُ الْفَاسِقُونَ﴾(النور:٤)

**"శీలవతులైన స్త్రీలపై అపనిందను మోపి, దానికి సంబంధించిన నలుగురు సాక్షుల్ని తేలేకపోయిన వారికి ఎనభై కొరడా దెబ్బలు కొట్టండి. ఇక మీదట ఎన్నడూ వారి సాక్ష్యాన్ని ఆమోదించకండి. వారు అవిధేయులు." (అన్ నూర్ : 4)**

ఇంకా ఇలా అనబడింది :



﴿فَمَن فَرَضَ فِيهِنَّ الْحَجَّ فَلَا رَفَثَ وَلَا فُسُوقَ وَلَا جِدَالَ فِي الْحَجِّ﴾(البقرة:١٩٧)

**"కనుక ఈ నిర్ణీత కాలంలో హజ్జ్‌ను తన కొరకు విధించుకున్న వ్యక్తి– హజ్జ్ దినాలలో – కామక్రీడలకు, పాపకార్యాలకు, ఘర్షణలకు దూరంగా ఉండాలి." (అల్ బఖర : 197)**

పై సూక్తులలో 'ఫిస్ఖ్' అనే పదం వచ్చినప్పుడల్లా విద్వాంసులు దానిని అల్లాహ్ ఆజ్ఞలను ఎదిరించటం లేక ఉల్లంఘించటం అన్న భావంలో తీసుకున్నారు.

(కితాబుల్ ఈమాన్ : షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ – رحمه الله – పేజీ : 378)

**(3) మార్గభ్రష్టత :**

రుజుమార్గం నుండి వైదొలగటాన్ని మార్గభ్రష్టత, మార్గవిహీనత, అపమార్గం అనంటారు. ఇది సన్మార్గానికి వ్యతిరేక పదం. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿مَّنِ اهْتَدَى فَإِنَّمَا يَهْتَدِي لِنَفْسِهِ وَمَن ضَلَّ فَإِنَّمَا يَضِلُّ عَلَيْهَا﴾(الاسراء:١٥)

**"సన్మార్గాన్ని పొందేవాడు తన మేలు కోసమే సన్మార్గాన్ని పొందుతాడు. పెడదారి పట్టేవాడు తన కీడుకు తానే కారకుడు అవుతాడు."**

**(అల్ ఇస్రా : 15)**

'మార్గభ్రష్టత' (జలాలత్) అనే పదం కూడా ఎన్నో అర్థాలలో తీసుకోబడుతుంది.

(1) ఒక్కోసారి ఇది కుఫ్ర్ (సత్య తిరస్కారం)కు కూడా అన్వయింపజేయబడుతుంది. ఉదాహరణకు : ఈ క్రింది దైవసూక్తిని గమనించండి –

﴿وَمَن يَكْفُرْ بِاللَّهِ وَمَلَائِكَتِهِ وَكُتُبِهِ وَرُسُلِهِ وَالْيَوْمِ الْآخِرِ فَقَدْ ضَلَّ ضَلَالاً بَعِيداً﴾(النساء:١٣٦)

**"ఎవడు అల్లాహ్‌ను, ఆయన దూతలను, ఆయన గ్రంథాలను, ఆయన ప్రవక్తలను, అంతిమ దినాన్ని తిరస్కరించాడో వాడు మార్గభ్రష్టతలో బహుదూరం వెళ్ళిపోయాడు." (అన్ నిసా : 136)**

(2) ఒక్కోసారి దీని అన్వయింపు షిర్క్ (బహుదైవారాధన)కు కూడా జరుగుతుంది.

﴿وَمَن يُشْرِكْ بِاللَّهِ فَقَدْ ضَلَّ ضَلَالاً بَعِيداً﴾(النساء:١١٦)

**"అల్లాహ్‌కు సహవర్తులుగా ఇతరులను నిలబెట్టినవాడు మార్గభ్రష్టతలో చాలా దూరం వెళ్ళిపోయాడు." (అన్ నిసా : 116)**

(3) ఒక్కోసారి కుఫ్ర్ (అవిశ్వాసం) కన్నా తక్కువస్థాయి చేష్టకు ఒడిగట్టిన వారికి కూడా ఇది వర్తిస్తుంది. ఉదాహరణకు : మార్గవిహీనతకు గురైన వర్గాలు. దైవగ్రంథాన్ని, దైవప్రవక్త విధానాన్ని వ్యతిరేకించిన వారిని కూడా మార్గభ్రష్టులుగా వ్యవహరిస్తారు.

(4) తప్పుచేసిన వారికి కూడా ఇది వర్తించవచ్చు. దైవప్రవక్త మూసా ( عليه السلام ) గారి పలుకులు గమనారం :

﴿قَالَ فَعَلْتُهَا إِذاً وَأَنَا مِنَ الضَّالِّينَ﴾ (الشعراء:٢٠)

**“నేను దారితప్పి ఉన్న స్థితిలో ఆ పని చేశాను” అని మూసా (అలైహి) చెప్పాడు. (అష్ షుఅరా : 20)**

(5) మానవ సహజమయిన ‘మరుపు’కు కూడా ఇది వర్తిస్తుంది. ఉదాహరణకు: అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿أَن تَضِلَّ إْحْدَاهُمَا فَتُذَكِّرَ إِحْدَاهُمَا الأُخْرَى﴾ (البقرة:٢٨٢)

**“వారిలో ఒకామె మరచిపోతే, రెండవ ఆమె మరచిపోయిన ఆమెకు జ్ఞాపకం చేయవచ్చు.” (అల్ బఖర : 282)**

(6) తప్పిపోయిన లేదా పనికి రాకుండా పోయిన దానికి కూడా ఈ పదం వర్తిస్తుంది. ఉదాహరణకు : అరబ్బులు ‘తప్పిపోయిన ఒంటె’ ضالة الابل (జలాలత్ ఇబ్లి) అని అంటుంటారు. (అల్ ముఫ్రిదాతుర్రాగిబ్ : 297, 298)

**(4) ఇర్తెదాద్ (ధర్మభ్రష్టత) : దాని రకాలు, ఆదేశాలు**

అరబీ భాషలో ‘ఇర్తెదాద్’ అంటే మరలిపోవటం, వెనుతిరిగిపోవటం అని అర్థం వస్తుంది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَلاَ تَرْتَدُّوا عَلَى أَدْبَارِكُمْ﴾ (المائدة:٢١)

**(మూసా عليه السلام తన జాతి వారితో ఇలా అన్నాడు) “..... వెన్నుచూపి మరలిపోకండి.” (అల్ మాయిదా : 21)**

ధర్మవేత్తల పరిభాషలో ‘ఇర్తెదాద్’ అంటే ....

ధర్మవేత్తల పరిభాషలో ‘ఇర్తెదాద్’ అంటే అర్థం ఇస్లాం స్వీకరించిన మీదట మళ్లీ కుఫ్ర్ (అవిశ్వాసాని) కి ఒడిగట్టడం. ఇస్లాంను విడిచిపెట్టడం. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

﴿وَمَن يَرْتَدِدْ مِنكُمْ عَن دِينِهِ فَيَمُتْ وَهُوَ كَافِرٌ فَأُوْلَـئِكَ حَبِطَتْ أَعْمَالُهُمْ فِي الدُّنْيَا وَالآخِرَةِ وَأُوْلَـئِكَ أَصْحَابُ النَّارِ هُمْ فِيهَا خَالِدُونَ﴾ (البقرة:٢١٧)

**“మరి మీలో గనక ఎవరయినా తమ ధర్మం నుండి తిరిగిపోయి, అవిశ్వాస స్థితిలో మరణిస్తే వారి ఇహపర లోకాల్లోని కర్మలు సర్వ నాశనమైపోతాయి. అలాంటివారే నరకవాసులు. వారందులో కలకాలం పడి ఉంటారు.” (అల్ బఖర : 217)**

## ఇర్తెదాద్ (ధర్మభ్రష్టత) రకాలు :

ఇస్లాంను వృథా చేసే పనులలో ఏ పనికైనా పాల్పడిన వ్యక్తి ధర్మభ్రష్టుడవుతాడు.



ఈ రకమయిన పనులు అనేకం ఉన్నాయి. మౌలికంగా వాటిని 4 రకాలుగా విభజించ వచ్చు.

1. **వాక్పరమైన ధర్మభ్రష్టత :** ఉదాహరణకు దైవాన్ని, అంతిమ దైవప్రవక్త (ﷺ)ను, దైవదూతలను, దైవప్రవక్తలలో ఏ ఒక్కరినయినా దూషించటం లేదా తానే దైవప్రవక్తనని ప్రకటించుకోవటం లేదా బూటకపు దైవప్రవక్తలను సత్యవంతులుగా ధ్రువపరచటం లేదా దైవేతరులను మొరపెట్టుకోవటం, లేదా కేవలం అల్లాహ్‌యే తీర్చగల అవసరాల కొరకు దైవేతరులను అర్థించటం లేదా ఈ వ్యవహారంలో దైవేతరుల శరణు జొచ్చటం.

2. **క్రియాత్మకమైన ధర్మభ్రష్టత :** ఉదాహరణకు విగ్రహానికి, చెట్టుకు, పుట్టకు, సమాధికి సాష్టాంగపడటం. దైవేతరుల పేర జంతుబలి ఇవ్వటం, మాలిన్య స్థలాలలో దివ్య ఖుర్‌ఆన్‌ను ఉంచటం, క్షుద్రవిద్య (చేతబడి)ని ప్రయోగించటం, దానిని నేర్చుకోవటం, ఇతరులకు నేర్పటం, దేవుడు అవతరింపజేసిన షరీయత్‌కు పోటీగా ఇతర శాసనాంగాలను ప్రవేశపెట్టి వాటికనుగుణంగా తీర్పునివ్వటం.

3. **విశ్వాసపరమైన ధర్మభ్రష్టత :** ఉదాహరణకు, అల్లాహ్‌కు సహవర్తులుగా వేరితరులు కూడా ఉన్నారని భావించటం లేదా వ్యభిచారం, మద్యపానం, వడ్డీ ధర్మసమ్మతం (హలాల్) అని నమ్మటం, లేదా రొట్టె నిషిద్ధం (హరామ్) అని తలపోయటం లేదా నమాజ్ తప్పనిసరి కాదని అనుకోవటం, ఏ ఏ వస్తువులు హలాల్ లేదా హరామ్ లేదా వాజిబ్ అనే విషయంలో ముస్లిం సముదాయానికి చెందిన విద్వాంసుల మధ్య ఏకాభిప్రాయముందో వాటికి సంబంధించి తమ ఊహల ఆధారంగా ఇష్టానుసారం అన్వయింపజేసుకోవటం – ఇవన్నీ విశ్వాసపరమైన ధర్మభ్రష్టత క్రిందికే వస్తాయి.

4. **అనుమానాల ఆధారంగా ధర్మభ్రష్టత :** ధర్మభ్రష్టతకు సంబంధించిన వివిధ రకాల వస్తువులలో సంశయానికి, సందేహానికి లోనుకావటం వల్ల ధర్మభ్రష్టత వర్తించే ప్రమాదముంటుంది. ఉదాహరణకు – షిర్క్ నిషిద్ధం (హరామ్) అనే విషయంలో సందేహం కలగటం లేదా మద్యపానం హరామ్ అనటంలో సందేహం కలగటం లేదా రొట్టె హలాల్ (ధర్మసమ్మతం) అనే విషయంలో సంశయం ఏర్పడటం లేదా మహాప్రవక్త ముహమ్మద్ (ﷺ) దైవప్రవక్త అనే విషయంలో అనుమానం రావటం లేదా ఇతర దైవప్రవక్తల దైవదౌత్యంపై అనుమానించటం లేదా సత్యం విషయంలో అనుమానం రావటం లేదా ఇస్లాం ధర్మం విషయంలో సందేహించటం – ఇవన్నీ ధర్మభ్రష్టతకు దారితీస్తాయి.

**5. ఏదేని వస్తువును పరిత్యజించటం వల్ల ధర్మభ్రష్టత :**

ఉదాహరణకు – నమాజ్‌ను ఉద్దేశ్యపూర్వకంగా త్యజించటం, ఎందుకంటే దీని గురించి మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా వక్కాణించారు :

"بَيْنَ الْعَبْدِ وَ بَيْنَ الْكُفْرِ وَ الشِّرْكِ تَرْكُ الصَّلاَةِ" (مسلم)

**దాసుని (మనిషి)కి – కుఫ్ర్ షిర్క్‌లకు మధ్య (వ్యత్యాసానికి) నమాజ్‌ను విడిచిపెట్టడం ఒక్కటి చాలు." (ముస్లిం)**

నమాజ్‌ను విడిచిపెట్టటం కుఫ్ర్‌కి (అవిశ్వాసానికి) ఆనవాలు అని చెప్పే ఆధారాలు ఇంకా ఎన్నో ఉన్నాయి.

**ధర్మభ్రష్టుడని నిర్ధారణ అయిన మీదట అతనిపై విధించబడే ఆంక్షలు :**

(1) ధర్మభ్రష్టుని (ముర్తద్) చేత తౌబా (పశ్చాత్తాపప్రకటన) చేయించటం జరుగుతుంది. అతను గనక మూడు రోజుల్లోగా పశ్చాత్తాపం చెంది ఇస్లాంలోనికి మరలివస్తే అతని పశ్చాత్తాపం ఆమోదించబడుతుంది.

(2) ఒకవేళ అతను పశ్చాత్తాపం చెందటానికి నిరాకరిస్తే (ఇస్లామీయ వ్యవస్థలో) అతన్ని హతమార్చటం తప్పనిసరి (వాజిబ్). ఎందుకంటే మహనీయ ప్రవక్త (ﷺ) ఇలా ప్రవచించారు :

"مَنْ بَدَّلَ دِيْنَهُ فَاقْتُلُوْهُ" (بخاری:۳۰۱۷،ابوداؤد:۴۳۵۱)

**"తన ధర్మాన్ని భ్రష్టుపట్టించినవాణ్ణి హతమార్చండి."**
**(బుఖారీ–3017, అబూదావూద్–4351)**

(3) పశ్చాత్తాపం చెందమని నచ్చజెబుతున్న సమయంలో అతని ఆస్తులను జప్తు చేసుకోవాలి (లేదా అతని లావాదేవీలను, ఖాతాలను స్తంభింపజేయాలి). అతను తిరిగి ఇస్లాం స్వీకరిస్తే గనక ఆ ఆస్తులన్నీ అతనివి అవుతాయి. అన్యధా అతను హతమార్చబడిన సమయం నుండీ లేదా అతను ధర్మభ్రష్టుడైన స్థితిలో మరణించిన నాటి నుండీ అతని ఆస్తిపాస్తులు ముస్లింల బైతుల్ మాల్‌కు (ధనాగారానికి) చెందుతాయి. మరికొందరు ఏమంటారంటే; ధర్మభ్రష్టుడు అయిన క్షణం నుండే అతని ఆస్తిపాస్తులు ముస్లింల ప్రయోజనాల కొరకు వెచ్చించబడతాయి.

(4) ధర్మభ్రష్టునికి – అతని బంధువులకు మధ్య గల వారసత్వ పరంపర తెగిపోతుంది. అతను తన రక్త సంబంధీకులకు వారసుడవటం గానీ, వారు ఇతని వారసులు అవటంగానీ జరగదు.

(5) ధర్మభ్రష్టతకు లోనై ఉన్న స్థితిలో అతను మరణించినా లేక హత్య చేయబడినా – అట్టి స్థితిలో – అతని శవానికి స్నానం చేయించటంగానీ, అతని నమాజె జనాజా చదివించటంగానీ, అతన్ని ముస్లింల ఖనన వాటికలో ఖననం చేయటంగానీ, జరగదు. పైగా అతన్ని అవిశ్వాసుల శ్మశానవాటికలో ఖననం చేయటమో లేక వేరితర స్థలంలో గోతిలో పాతిపెట్టడమో జరుగుతుంది.



**నాల్గవ అధ్యాయం :**

# తౌహీద్‌కు వ్యతిరేకమైన పనులు లేదా అందులో లోపం సృష్టించే మాటలు, చేతలు

ఈ అధ్యాయంలో క్రింది ప్రకరణాలున్నాయి –

**మొదటి ప్రకరణం** : హస్తరేఖలు లేదా తారాబలాన్ని చూసి తనకు అగోచర జ్ఞానముందని చెప్పటం.

**రెండవ ప్రకరణం** : చేతబడి, సోది, జ్యోతిష్కం.

**మూడవ ప్రకరణం** : సమాధులపై, గుంబదులపై నజరానాలు సమర్పించటం, గిలాఫులు వంటివి తొడిగించి శ్రద్ధాంజలి ఘటించటం.

**నాల్గవ ప్రకరణం** : విగ్రహాలకు, స్మారక స్థలాలకు శ్రద్ధాభక్తుల నివాళి ఘటించటం.

**ఐదవ ప్రకరణం** : ధర్మాన్ని పరిహసించటం. ధార్మిక చిహ్నాలను, పవిత్ర స్థలాలను అగౌరవ పరచటం.

**ఆరవ ప్రకరణం** : అల్లాహ్ పంపిన షరీయత్‌ను కాదని ఇతరత్రా శాసనాల ప్రకారం తీర్పు ఇవ్వటం.

**ఏడవ ప్రకరణం** : తమవైన శాసనాల ప్రకారం ధర్మాధర్మాలను గురించి మాట్లాడటం.

**ఎనిమిదవ ప్రకరణం** : నాస్తిక ఉద్యమాలను, అజ్ఞానంతో కూడుకున్న వర్గాలను ఆశ్రయించి తమ సమస్యలను నివేదించుకోవటం.

**తొమ్మిదవ ప్రకరణం** : జీవితం విషయంలో ఎంతసేపటికీ భౌతిక తత్వాన్ని ఆశ్రయించటం.

**పదవ ప్రకరణం** : తాయెత్తులు వ్రేలాడదీయటం, రక్షరేకులు కట్టడం, మంత్రించి ఊదటం.

**పదకొండవ ప్రకరణం** : దైవేతరుల పేర ప్రమాణం చేయటం, అల్లాహ్‌ను వదలి సృష్టితాలను సిఫార్సు సాధనంగా చేసుకోవటం, సహాయం కొరకు వారిని అర్థించటం.

## మొదటి ప్రకరణం

# హస్తాన్ని పరిశీలించి లేదా తారాబలాన్ని చూసి అగోచర జ్ఞానం ఉందని చెప్పటం

**అగోచరం అంటే ....**

భూత భవిష్యత్కాలాలకు చెందిన ఏ విషయాలైతే జనుల దృష్టికి రావో – కంటికి కానరావో – వాటిని అగోచరాలని అంటారు.

అగోచర జ్ఞానాన్ని అల్లాహ్ తన కొరకు ప్రత్యేకించుకున్నాడు. ఆయన ఇలా సెలవిచ్చాడు :

﴿قُلْ لَّا يَعْلَمُ مَن فِى السَّمَاوَاتِ وَالْأَرْضِ الْغَيْبَ إِلَّا اللَّهُ﴾(النمل:٦٥)

**“అల్లాహ్ తప్ప ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న వారెవరికీ అగోచర జ్ఞానం లేదు.” (అన్ నమ్ల్ : 65)**

అయితే దేవుడు కొన్ని సందర్భాలలో దైవప్రవక్తలలో కొందరికి, కొన్ని పరమార్థాల దృష్ట్యా తన అగోచర జ్ఞానంలోని కొన్ని విషయాలను తెలియజేస్తాడు. ఆ విషయాన్నే ఇక్కడ ప్రస్తావించటం జరిగింది.

﴿عَالِمُ الْغَيْبِ فَلَا يُظْهِرُ عَلَى غَيْبِهِ أَحَداً ☆ إِلَّا مَنِ ارْتَضَى مِن رَّسُولٍ﴾(الجن:٢٦،٢٧)

**“ఆయన అగోచర జ్ఞానం కలవాడు. తన అగోచర విషయాలను ఆయన ఎవరికీ తెలుపడు – తాను ఇష్టపడిన ప్రవక్తకు తప్ప!” (అల్ జిన్న్ : 26, 27)**

అంటే, దేవుడు తనకు స్వంతమైన అగోచర జ్ఞానంలోని కొంత భాగాన్ని, తన ప్రవక్తలలో తాను కోరిన వారికి, కొన్ని పరమార్థాల దృష్ట్యా తెలియపరచటం సంభవమే. ఎందుకంటే అతను (ఆ ప్రవక్త) ఆ అద్భుతాలను తన దైవదౌత్యానికి నిదర్శనంగా చూపుతాడు. ఇలాంటి అద్భుతాలలో, అగోచర విషయాలను (భవిష్యవాణి) తెలుపటం కూడా ఒకటి. ఈ అగోచర జ్ఞానంలో మానవ సందేశహరునికి, దైవదూతల సందేశవాహకునికి మాత్రమే ప్రమేయం ఉంటుంది. మూడో వ్యక్తికి ఇందులో ఎలాంటి దఖలు ఉండదు. ఎందుకంటే దేవుడు అగోచర జ్ఞానాన్ని వారిరువురికే పరిమితం చేశాడు. కాబట్టి అల్లాహ్ దృష్టిలో వినాయింపుకు నోచుకున్న ఆ సందేశహరులు తప్ప వేరెవరయినా తనకు అగోచర జ్ఞానం ఉందని అంటే అతను అసత్యవాది, అవిశ్వాసానికి ఒడిగట్టిన వాడవుతాడు. అతను హస్త సాముద్రికం ఆధారంగా చెప్పినా, తారాబలం చూసి చెప్పినా, క్షుద్రవిద్యలను ఆశ్రయించినా, జ్యోతిష్కం ద్వారా చెప్పినా, మరే ఒనరుల ఆధారంగా చెప్పినా అతను అబద్ధీకుడే. ఈ యుగంలో కూడా ఇలాంటి నయవంచకులు, మోసగాళ్లకు కొదువలేదు. వారు తమ వాక్చాతుర్యంతో, మాయమాటలతో అమాయక జనులకు బుట్టలో వేసుకుని పోగొట్టుకున్న వస్తువుల ఆచూకీ తెలుపుతామని, రోగ కారణాలను తెలుపుతామని



అంటుంటారు. ఫలానా వ్యక్తి నీకేదో చేసేశాడని, అందుకే నీవు ఈ విధంగా మంచాన పడ్డావని చెబుతుంటారు. ఈ విషయాలను వారు జిన్నాతుల నుండి, షైతానుల నుండి సేకరిస్తారు. అందుకోసం వారు ఆ పైశాచిక శక్తులను ప్రసన్నుల్ని చేస్తుంటారు. ఎవరయినా మీ వద్దకు క్షుద్రవిద్యను పొందిన మాటలంటే ఖచ్చితంగా వారు మాయలమారులని, మోసగాళ్లని గ్రహించాలి.

షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (رحمه الله) ఇలా అంటున్నారు : “భవిష్యవాణి (సోదె) చెప్పేవారి పరిస్థితి ఎటువంటిదంటే, వారి వద్ద షైతాన్ సహచరుడు ఉంటాడు. ఆకాశాలలో దొంగచాటుగా విన్న విషయాలను వాడు వారికి తెలియజేస్తుంటాడు. వాటిలో వారు మరికొన్ని అబద్ధాలను (మిర్చిమసాలాను) జోడించి వివరిస్తారు.”

ఆయన ఇంకా ఇలా అంటున్నారు : “ఈ సోదె చెప్పటంలో కొందరు ఆరితేరిన వారుండేవారు. వారి దగ్గరకు షైతానులు తినే త్రాగే పదార్థాలను కూడా తెచ్చేవారు. ఆ ప్రదేశాలలో లభ్యంకాని పండ్లను, మిఠాయిలను కూడా తెచ్చేవారు. వాటిలో కొన్నింటిని జిన్నుు మక్కా లేదా బైతుల్ మఖ్దిస్ లేదా వేరితర స్థలాలకు తరలించేవాడు.” (మజ్మూఅతు త్తౌహీద్ – పేజీ : 797, 801)

అగోచరాలకు సంబంధించి వారు జ్యోతిశ్శాస్త్రం ద్వారా కొన్ని విషయాలు అందజేస్తుంటారు. నక్షత్రాలను, రాసులను చూసి వారు భూమండలంపై సంభవించబోయే దానిని సూచిస్తుంటారు. గాలులు ఎంతవేగంగా వీస్తాయి, వర్షం ఎప్పుడు ఎక్కడ కురుస్తుంది తదితర విషయాలను అంచనా వేస్తారు. నక్షత్రాలు తమ తమ కక్ష్యల్లో చేసే పరిభ్రమణం, వాటి కలయిక, విడిపోవటాలను బట్టి జరిగే సంఘటనలను నిర్ధారిస్తారు. వారిలా అంటారు : ఇతను గనక ఫలానా నక్షత్రం సంచరించే సమయంలో వివాహమాడితే అతనికి ఈ ఈ సమస్యలు ఎదురవుతాయి. అతను గనక ఫలానా నక్షత్రం పొడసూపినపుడు ప్రయాణం చేస్తే ఫలానా ఫలానా గండాలను ఎదుర్కోవలసి ఉంటుంది. అతను ఫలానా నక్షత్రం సమయంలో పుట్టాడు. కనుక ఫలానా భాగ్యం వరిస్తుంది లేదా ఫలానా దరిద్రం చుట్టుకుంటుంది. ప్రస్తుతం కొన్ని చవుకబారు పత్రికలు సయితం ఇలాంటి రాసిఫలాలను ముద్రించి మనుషుల జీవితాలలో సంభవించబోయే వాటిని గురించి విచ్చలవిడి రాతలు రాస్తున్నాయి.

కొంతమంది అజ్ఞానులు, బలహీన విశ్వాసులు జ్యోతిష్కుల వద్దకు వెళుతుంటారు. వారు తమ జీవితాలలో ఎదురుకానున్న సంఘటనలను గురించి, ముఖ్యంగా వివాహాది శుభకార్యాల గురించి దర్యాప్తు చేస్తుంటారు.

ఎవడయితే తనకు అగోచర జ్ఞానముందని అంటాడో, మరెవరయితే అలాంటి వారిని సత్యవంతులని ధృవీకరిస్తాడో అతను ముష్రిక్కు, కాఫిర్ అవుతాడు. ఎందుకంటే వాడు అల్లాహ్ యొక్క ప్రత్యేక గుణాలలో తనకు భాగస్వామ్యం ఉందని దావా చేస్తున్నాడు. నిజానికి నక్షత్రాలు దైవానికి సంపూర్ణ విధేయతను ప్రకటించే సృష్టితాలు. వాటి అధీనంలో ఏ శక్తీ లేదు. ఒకరి భాగ్యాన్నిగానీ, దరిద్రాన్ని గానీ శాసించే అధికారం వాటికి లేదు. జీవన్మరణాలతో కూడా వాటికి ఎలాంటి సంబంధం లేదు. ఇవన్నీ పైశాచిక చేష్టలు. ఆకాశాలలో దొంగచాటుగా విన్న విషయాలను అవి చేరవేస్తుంటాయి.

## రెండవ ప్రకరణం

# చేతబడి, సోదె, జ్యోతిష్కం

ఇవన్నీ అధర్మమైన పనులు, పైశాచిక చేష్టలు. ఇవి మనిషి విశ్వాసంలో కలత సృష్టిస్తాయి. లేదా విశ్వాసానికి (ఈమాన్‌కు) పూర్తి వ్యతిరేకంగా ఉంటాయి. ఎందుకంటే మనిషి షిర్క్‌కు ఒడిగట్టనంత వరకూ అతనికి క్షుద్రవిద్య అబ్బదు.

**1. చేతబడి (బాణామతి, క్షుద్రవిద్య) :** ఇదొక గోప్యమైన పని. దీని కారణం కూడా అతి సూక్ష్మంగా ఉంటుంది.

దీన్ని క్షుద్రవిద్య అని ఎందుకంటారంటే చేయరాని పనుల వల్లనే అది చేయబడుతుంది. అవి కంటికి కానరావు. ఈ విద్యలో మంత్రతంత్రాలు, మంత్రించి ఊదటం, నిర్ణీత వాక్కులు, వనమూలికలు, బొమికలు, వ్రతాలు ఉంటాయి. చేతబడి అనే క్షుద్రవిద్య వాస్తవం. ఈ చేతబడి వల్ల కొందరు మానసికంగా, శారీరకంగా కూడా తీవ్రంగా ప్రభావితులవుతారు. తత్కారణంగా వారు వ్యాధిగ్రస్తులవుతారు. ఒక్కోసారి మనిషి ప్రాణాల మీదికి కూడా వస్తుంది. ఈ విద్య ద్వారా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు సృష్టించి, వ్యవహారాన్ని విడాకుల వరకూ తీసుకుపోవడం జరుగుతుంది. అయితే ఈ చేతబడి ప్రభావం దేవుని ప్రాకృతిక ఆదేశంతో, విధిపరమైన అనుజ్ఞతోనే సంభవం అవుతుంది.

చేతబడి ఓ షైతానీ ప్రక్రియ. బహుదైవోపాసనా పనులకు ఒడిగట్టేవారికి, భూత ప్రేతాత్మలకు ఇష్టమయిన చేష్టల ద్వారా వాటి సామీప్యం పొందగలిగిన వారికి మాత్రమే ఈ విద్య అబ్బుతుంది. అందుకే మహనీయ ముహమ్మద్ (ﷺ) ఈ విద్యను షిర్క్‌తో పాటే ప్రస్తావించారు. ఆయన (ﷺ) ఇలా అన్నారు :

”اِجْتَنِبُوا السَّبْعَ الْمُوبِقَاتِ،قَالُوا : وَمَاهِيَ؟ قَالَ :اَلإِشْرَاكُ بِاللّٰهِ وَالسِّحْرُ...“(بخاری ومسلم)

**“వినాశకరమయిన ఏడు విషయాలకు దూరంగా ఉండండి.” ‘అవేమిటీ?’ అని సహచరులు (رضي الله عنهم) అడగ్గా, “అల్లాహ్‌తో పాటు వేరొకరిని భాగస్వాములుగా నిలబెట్టడం, చేతబడి ...... ” (చివరి వరకు) అని ఆయన (ﷺ) తెలిపారు. (బుఖారీ, ముస్లిం)**

చేతబడిలో రెండు రకాల షిర్క్ ఉంటుంది –

**ఒకటి :** ఇందులో భూతపిశాచాల సహాయం తీసుకోవటం జరుగుతుంది. వాటితో సంబంధాలు ఏర్పరచుకోవటం జరుగుతుంది. అవి కోరిన కోర్కెలను తీర్చి, ప్రసన్నుల్ని చేసుకోవటం కూడా జరుగుతుంది. అప్పుడే చేతబడి చేసేవాడి మంత్రం పనిచేస్తుంది. కాబట్టి ‘చేతబడి’ అనేది పైశాచిక, క్షుద్రవిద్యల్లోనిది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَلَـٰكِنَّ الشَّيَاطِينَ كَفَرُوا يُعَلِّمُونَ النَّاسَ السِّحْرَ﴾(البقرة:١٠٢)



**“కాని ఈ అవిశ్వాస పోకడ షైతానులదే. వారు ప్రజలకు చేతబడిన నేర్పేవారు.” (అల్ బఖర : 102)**

**రెండు :** ఈ క్షుద్రవిద్యకు పాల్పడే వారు తమకు అగోచర జ్ఞానం ఉందని బొంకుతారు. ఈ బొంకటంలో కూడా షిర్క్ ఉంటుంది. ఇది పూర్తిగా అవిశ్వాసానికి, మార్గభ్రష్టతకు ఆనవాలు. విశ్వప్రభువు తరపున ఈ విధంగా సెలవీయబడింది :

﴿وَلَقَدْ عَلِمُوا لَمَنِ اشْتَرَاهُ مَا لَهُ فِي الْآخِرَةِ مِنْ خَلَاقٍ﴾(البقرة:١٠٢)

**“ఆ విద్యను కొనుక్కున్న వారికి పరలోకంలో (అక్కడి సుఖసౌఖ్యాలలో) ఎలాంటి భాగం లేదన్న సంగతి వారికి సయితం తెలుసు.” (అల్ బఖర:102)**

యదార్థం ఇదైనపుడు అది షిర్క్ అనటంలో సందేహానికి తావేలేదు. అది విశ్వాసానికి పూర్తిగా విరుద్ధమైనది. ఇలాంటి పోకడకు ఒడిగట్టిన వారిని వధించటం తప్పనిసరి (వాజిబ్). ప్రవక్త సహచరులలో అగ్రశ్రేణికి చెందినవారు ఈ క్షుద్రవిద్యకు పాల్పడేవారిని వధించారు. కాని నేటి ప్రజలు మాంత్రికుల పట్ల ఉపేక్షాభావం కనబరుస్తున్నారు. ఒక్కోసారి కొందరు దీనిని గర్వించదగిన కళగా పరిగణిస్తున్నారు. ఇలాంటి కళాకారులను సన్మానిస్తున్నారు కూడా. అలాంటి వారిని ప్రోత్సహిస్తూ మ్యాజిక్ షో వంటి కార్యక్రమాలు కూడా నిర్వహించి వారిపై కనకవర్షం కురిపిస్తున్నారు. ఇదంతా ధర్మజ్ఞానం పట్ల అవగాహనాలేమికి నిదర్శనం. ధర్మం (దీన్) పట్ల చెలగాటమాడే వారికి అవకాశం కల్పించటం క్రిందికేవస్తుంది.

## 2. సోదె, జ్యోతిష్యం :

ఈ రెండు విద్యల్లో కూడా అగోచర జ్ఞానం ఉందని దావా చేసేవారున్నారు. ఉదాహరణకు : భూమండలంపై ఏం జరగబోతోంది, ఏ సంఘటన ఎదురుకానున్నది, పోయిన వస్తువు ఎక్కడుంది మొదలగునవి. భూత పిశాచాల సహాయంతో ఇవన్నీ తెలుసుకోబడతాయి. దీని నేపథ్యంలో ఇలా అనబడింది :

﴿هَلْ أُنَبِّئُكُمْ عَلَىٰ مَنْ تَنَزَّلُ الشَّيَاطِينُ ☆تَنَزَّلُ عَلَىٰ كُلِّ أَفَّاكٍ أَثِيمٍ ☆يُلْقُونَ السَّمْعَ وَأَكْثَرُهُمْ كَاذِبُونَ﴾(الشعراء:٢٢١،٢٢٣)

**“(ప్రజలారా!) షైతానులు ఎవడిపైన దిగుతారో నేను మీకు తెలుపనా? అబద్ధాలకోరు, పాపాత్ముడు అయిన ప్రతి ఒక్కరిపై వారు దిగుతారు. వినీవినని కొన్ని మాటల్ని చెవుల్లో వేస్తారు. వారిలో అనేకులు అబద్ధాలు చెప్పేవారే.” (అష్ షుఅరా : 221 – 223)**

అసలేం జరుగుతుందంటే, షైతానులు ఊర్ధ్వలోకాలలో దైవదూతలు చెప్పుకునే కొన్ని మాటల్ని చాటుమాటుగా విని, వాటిని జ్యోతిష్కుల, సోదె చెప్పేవారి చెవిలో వేస్తారు. ఈ జ్యోతిష్కులు వాటికి మరిన్ని అబద్ధాలను జోడించి అందమైన రీతిలో ప్రజలకు వినిపిస్తారు. ప్రజలు అవి సొంతం నిజాలని నమ్ముతారు. వాస్తవానికి అగోచర జ్ఞానం

అల్లాహ్‌కు మాత్రమే ఉంది. కాబట్టి ఎవరయితే జ్యోతిష్యం లేదా సోదె ఆధారంగా అగోచర విషయాలలో అల్లాహ్‌కు తాను సహవర్తుణ్ణి అని దావాచేస్తాడో, మరెవరయితే ఇలాంటి వారిని సత్యవంతులని ధృవీకరిస్తారో, అలాంటి వారంతా అల్లాహ్‌కే స్వంతమైన విషయంలో సాటి కల్పించినట్లే (షిర్క్‌కు పాల్పడినట్లే) లెక్క.

జ్యోతిష్యంలో షిర్క్ ఉంది. ఎందుకంటే ఈ విద్యలో షైతానుల గొంతెమ్మ కోర్కెల్ని తీర్చి, వారిని ప్రసన్నుల్ని చేసుకున్నమీదటే వారి లక్ష్యం సిద్ధిస్తుంది. కాబట్టి ఇది అల్లాహ్ యొక్క నిర్వహణాధికారంలో భాగస్వామ్యం (షిర్క్) క్రిందికి వస్తుంది. ఈ పనికి పాల్పడిన వాడు అల్లాహ్ యొక్క ఉలూహియత్ (దైవత్వం)లో కూడా షిర్క్ చేసినవాడవుతాడు. ఎందుకంటే ఈ వ్యవహారంలో దైవేతరులను ఆరాధించి, వారి మెప్పు పొందటం జరుగుతుంది.

హజ్రత్ అబూ హురైరా (رضی اللہ عنہ) గారి ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసం) ఈ విధంగా ప్రవచించారు :

”مَنْ أَتَى كَاهِنًا فَصَدَّقَهُ بِمَا يَقُولُ فَقَدْ كَفَرَ بِمَا أُنْزِلَ عَلَى مُحَمَّدٍ ﷺ“ (ابوداود:٣٩٠٤ صحیح)

**“ఎవడయితే ఒక జ్యోతిష్కుని వద్దకు వచ్చి, అతను చెప్పే విషయాలను నిజమని ధృవపరిచాడో, అతను నిశ్చయంగా ముహమ్మద్ (సఅసం)పై అవతరించిన షరీయత్‌ను నిరాకరించాడు.” (అబూదావూద్-3904)**

తమను తాము వైద్యులుగా చెప్పుకునే ఈ మాంత్రికుల, తాంత్రికుల, జ్యోతిష్కుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వీళ్లు ప్రజల నమ్మకాలతో చెలగాటమాడతారు. దైవేతరుల పేరున జంతుబలి ఇవ్వమని వారు రోగులను పురమాయిస్తారు. ఫలానా లక్షణాలు గల పొట్టేలునో, ఫలానా రంగులో ఉన్న కోడినో కోయాలని చెబుతారు. షిర్కుతో కూడిన తావీజులు వ్రాసి తమ మెడలో వ్రేలాడదీస్తారు. ఒళ్లు గగుర్పొడిచే కొన్ని వస్తువులను తమ పెట్టెల్లో, ఇళ్ళల్లో భద్రపరుస్తారు.

కొందరుంటారు. వారు పోగొట్టుకున్న వస్తువుల ఆచూకీ తెలుపుతామంటారు. అందువల్ల అమాయక జనులు వారి చుట్టూ చేరి తాము పోగొట్టుకున్న వస్తువులను గురించి అడుగుతారు. వారు ఆ వస్తువుల జాడ తెలియపరుస్తారు లేదా తమ పైశాచిక కార్యకర్తల ద్వారా ఆ వస్తువులను హాజరుపరుస్తారు.

ఇంకా కొందరుంటారు. తాము మహిమలు చూపిస్తామంటారు. లేదా కనికట్టు విన్యాసాలు చేస్తారు. ఉదాహరణకు : నిప్పుల్లో నడవటం, కొరడాలతో తమను కొట్టుకోవటం, కత్తులతో పొడుచుకోవటం, బండి చక్రం క్రింద పడుకోవటం, కొన్ని గంటలపాటు జీవసమాధి అయి ఉండటం మొదలగునవి. ఇలాంటి పైశాచిక చేష్టలన్నీ వారిచేత ఒక పరీక్షగా జరిపించబడతాయి. ఇవన్నీ ప్రజల కళ్లకు కనిపించేలా చేయబడే అవాస్తవిక చమత్కారాలు. పూర్వం ఫిర్‌ఔన్ చక్రవర్తి తరపు మాంత్రికులు కూడా కర్రల ద్వారా, త్రాళ్ల ద్వారా ఇలాంటివి ప్రదర్శించారు.

షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (رحمہ اللہ) బతాయిహి అహ్మదీ ప్రాంతానికి చెందిన మాంత్రికులతో జరిగిన ముఖాముఖీ (చర్చ) వివరాలను గురించి ఇలా తెలిపారు :



మాంత్రికుల సర్దారు ఎలుగెత్తి ఇలా ప్రకటించాడు : “మంత్రతంత్రాల ప్రదర్శనలో మేము సాటిలేని మేటి వారము.” ఆ తరువాత అతను ప్రకృతికి విరుద్ధమయిన పనులు చేసి చూపుతానన్నాడు. అంటే అగ్నిలో దూకటం.”

షేఖుల్ ఇస్లాం ఇలా అంటున్నారు, నేను కూడా బిగ్గరగా ఇలా ప్రకటించాను – “నేను ప్రాక్పశ్చిమాలలో ఉన్న ప్రతి అహ్మదీని ఉద్దేశించి చెబుతున్నాను. వారు అగ్ని ప్రవేశం చేసి ఏ ఏ పనులు చేస్తారో అవన్నీ నేనూ చేయగలను. ఎవడి శరీరం కాలుతుందో వాడు ఓడిపోయినట్లే లేదా వాడిపై దేవుని శాపం పడినట్లే. కాని ఒక షరతు. అగ్నిలో దూకేముందు వారు తమ శరీరమంతటినీ పులుసు పదార్థంతోనూ, వేడి నీళ్ళతోనూ కడుక్కోవాలి.”

‘అలా ఎందుకు?’ అని అక్కడున్న ప్రముఖులు నన్ను ప్రశ్నించారు. “ఎందుకంటే వీళ్లు ఈ పనులు చేసేముందు కొన్ని చిట్కాలు అమలుపరుస్తారు. అంటే కప్ప నూనెతో, నారింజ తొక్క తదితర వాటితో ఒక పదార్థం తయారుచేసి ఆ లేపనాన్ని ఉపయోగిస్తారు” అన్నాను. ఈ మాట వినగానే జనుల్లో సంచలనం మొదలయింది.

అప్పుడు మాంత్రికుల సర్దారు మితిమీరిన ధీమాతో సవాలు విసిరాడు : “మేము, మీరు శరీరాలకు గంధక లేపనం పూసుకుని చాపలో చుట్టుకుందాం.”

“అయితే రెడీ అవ్వు” అన్నాను. ఈ మాట పదే పదే అనసాగాను. అతను చేయి చాపాడు – తన చొక్కాను విడుస్తున్నట్లు. “ముందు నీవు సిర్కా (పులుపు పదార్థం)తో, వేడినీళ్ళతో స్నానం చేయాలి.” ఈ మాట వినగానే అతను తటపటాయించాడు. మళ్లీ తమాయించుకుని, “తమ నాయకుణ్ణి ప్రేమించేవారు కట్టెల్ని తీసుకురండి” అన్నాడు. “వద్దు. అవన్నీ కాలేవరకు ఆలస్యమవుతుంది. వీక్షకులంతా వెళ్ళిపోతారు. లక్ష్యం నెరవేరదు. ఒక చిన్న లాంతరు చాలు. నువ్వూ నేను చేతులు కడుక్కుని చేతివేళ్లను లాంతరు జ్యోతిలో పెడదాం. ఎవరి వ్రేలు కాలితే వారు ఓడిపోయినట్లే లేదా దేవుని చేత ధూత్కరించబడినట్లే” అని అన్నాను. ఈ మాట అనగానే తెల్లమొగం వేశాడు. పరాభవంతో కృంగిపోయాడు. (మజ్మూఅ ఫతావా – 1/465, 466)

ఈ సంఘటనను ఇక్కడ ప్రస్తావించటంలోని ఉద్దేశ్యమేమిటంటే, ఇలాంటి మోసగాళ్లు, వంచనా శిల్ప నిష్ణాతులు తమ కనికట్టు మాయాజాలంతో, చిట్కాలతో ప్రజల్ని మభ్యపెడుతూ ఉంటారు. ఉదాహరణకు : ఒక్క వెంట్రుకతో పెద్ద వాహనాన్ని లాగటం, బండి చక్రాల క్రింద పడుకోవటం, ఇనుప కడ్డీలను కళ్లల్లో పొడుచుకోవటం – ఇత్యాది పైశాచిక పనులు.

## మూడవ ప్రకరణం

# సమాధుల, దర్గాల వద్ద జంతుబలి ఇవ్వటం. కానుకలు, నజరానాలు సమర్పించుకోవటం, శ్రద్ధాంజలి ఘటించటం

బహుదైవారాధన వైపు తీసుకుపోయే మార్గాలన్నింటినీ మహాప్రవక్త (సఅసం) మూసివేశారు. ఆ మార్గాలకు దూరంగా ఉండవలసిందిగా సావధానపరిచారు. అలాంటి వాటిలో సమాధులు కూడా ఉన్నాయి. సమాధిపూజ, సమాధివారల పట్ల అతిశయిల్లటం మొదలగు విషయాలలో కట్టుదిట్టమయిన నిబంధనలను కూడా నిర్ధారించారు. వాటిలో కొన్ని ఇవి :

1. ఔలియాల, మహనీయుల, సత్పురుషుల యెడల అభిమానంలో మితిమీరి వ్యవహరించటాన్ని గురించి ఆయన హెచ్చరించారు. ఎందుకంటే ఈ మితిమీరటమే (అతివాదమే) క్రమక్రమంగా వారి ఆరాధన వైపు తీసుకుపోతుంది. ఆయన (ﷺ) ఇలా ఉపదేశించారు :

”اِيَّاكُمْ وَالْغُلُوَّ، فَإِنَّمَا أَهْلَكَ مَنْ كَانَ قَبْلَكُمُ الْغُلُوُّ “(نسائی:۳۰۵۷ صحیح۔احمد'ترمذی'ابن ماجہ:۳۰۲۹صحیح)

**“మీరు అభిమానంలో అతిశయిల్లకండి. ఎందుకంటే ఈ అతివాదమే (ఘులూ) మీ పూర్వీకులను అంతమొందించింది.” (అహ్మద్, తిర్మిజీ, ఇబ్నుమాజా-3029 సహీహ్)**

వేరొక హదీసులో ఆయన (ﷺ) ఇలా తాకీదు చేశారు.

”لَا تُطْرُوْنِی كَمَا أَطْرَتِ النَّصَارىٰ ابْنَ مَرْيَمَ إِنَّمَا أَنَا عَبْدٌ فَقُوْلُوْا عَبْدُ اللهِ وَرَسُوْلُهُ “(بخاری)

**“క్రైస్తవులు మర్యమ్ కుమారుడగు ఈసా (ఏసుక్రీస్తు) అభిమానంలో అతిశయిల్లి (ఆయన్ని అల్లాహ్ కుమారునిగా చేసి)నట్లుగా మీరు నా విషయంలో అతిశయిల్లకండి (నన్ను నా పరిమితులను దాటనివ్వ కండి). నేను అల్లాహ్ దాసుడను. కనుక మీరు నన్ను అల్లాహ్ దాసుడని, ప్రవక్త అనీ అనండి.” (సహీహ్ బుఖారీ)**

(2) సమాధులను పటిష్ఠపరచటాన్ని, వాటిపై కట్టడాలను కట్టడాన్ని దైవప్రవక్త (ﷺ) వారించారు. అబుల్ హయాజ్ అల్ అసదీ గారి కథనం ద్వారా మనకు తెలిసేది ఇదే. అలీ బిన్ అబీ తాలిబ్ (رضی اللہ عنہ) తనతో ఇలా చెప్పారని ఆయన తెలిపారు –

”أَلَا أَبْعَثُكَ عَلىٰ مَا بَعَثَنِي عَلَيْهِ رَسُوْلُ اللهِ ﷺ أَنْ لَا تَدَعَ تِمْثَالًا إِلَّا طَمَسْتَهُ وَلَا قَبْرًا مُشْرِفًا إِلَّا سَوَّيْتَهُ “(صحیح مسلم)



**“దైవప్రవక్త (ﷺ) నన్ను ఏ పనిపై పంపారో ఆ పనిపై నేను మిమ్మల్ని పంపనా? అదేమిటంటే ఏ విగ్రహం కనిపించినా మీరు దానిని పడగొట్టాలి. ఏ సమాధి ఎత్తుగా కనిపించినా మీరు దానిని సమం చేసివేయాలి.” (సహీహ్ ముస్లిం)**

(3) సమాధులను పటిష్ఠపరచటాన్ని, వాటిపై నిర్మాణాలు చేయటాన్ని కూడా ఆయన (ﷺ) వారించారు. జాబిర్ (رضی اللہ عنہ) ఇలా అంటున్నారు :

”نَهىٰ رَسُوْلُ اللهِ ﷺ عَنْ تَجْصِيصِ الْقَبْرِ، وَأَنْ يُقْعَدَ عَلَيْهِ، وَأَنْ يُبْنىٰ عَلَيْهِ “(مسلم)

**“సమాధిని పక్కాగా నిర్మించటాన్ని, దానిపై కూర్చోవటాన్ని, దానిపై కట్టడం కట్టడాన్ని దైవప్రవక్త (ﷺ) వారించారు.” (ముస్లిం)**

(4) సమాధుల వద్ద నమాజ్ చేయటాన్ని కూడా ప్రవక్త (ﷺ) వారించారు. హజ్రత్ ఆయిషా (رضی اللہ عنہا) కథనం :

దైవప్రవక్త (సఅసం)కు మరణ సూచనలు ప్రస్ఫుటం అయినపుడు ఆయన (ﷺ) తన ముఖంపై దుప్పటి కప్పుకోసాగారు. ఊపిరాడక పోవటంతో దుప్పటిని తొలగించారు. ఆ స్థితిలోనే ఆయన (ﷺ) ఇలా అన్నారు :

“యూదులపై, క్రైస్తవులపై అల్లాహ్ శాపం పడుగాక! వారు తమ ప్రవక్తల సమాధులనే సాష్టాంగ (సజ్దా) స్థలంగా చేసుకున్నారు.” వారి చర్య గురించి ఆయన (ﷺ) జనులను సావధానపరిచేవారు. ఈ వ్యవహారంలో ఆయన (ﷺ) ఇంత దృఢంగా ఉండకపోతే, ఆయన (ﷺ) సమాధిపట్ల కూడా అలాగే చేసేవారేమో!

ఆయన (ﷺ) ఇంకా ఇలా తాకీదు చేశారు :

”أَلَا وَإِنَّ مَنْ كَانَ قَبْلَكُمْ كَانُوْا يَتَّخِذُوْنَ قُبُوْرَ أَنْبِيَاءِ هِمْ مَسَاجِدَ، أَلَا فَلَا تَتَّخِذُوا الْقُبُوْرَ مَسَاجِدَ، فَإِنِّي أَنْهَاكُمْ عَنْ ذٰلِكَ “(مسلم)

**“వినండి. మీకు పూర్వం గతించినవారు తమ ప్రవక్తల సమాధులను ఆరాధనా (సజ్దా) స్థలాలుగా చేసుకునేవారు. జాగ్రత్త! మీరు మాత్రం సమాధులను ఆరాధనా స్థలాలుగా చేసుకోకండి. నేను దీని నుండి మిమ్మల్ని వారిస్తున్నాను.” (సహీహ్ ముస్లిం)**

సమాధులను ఆరాధనా స్థలాలుగా చేసుకోవటం అంటే భావం అక్కడ మస్జిద్ లేకపోయినప్పటికీ అక్కడ నమాజ్ చేయటం. నమాజ్ కోసం సంకల్పం చేసుకున్న ప్రతి స్థలం సాష్టాంగ ప్రణామ స్థలం – ఆరాధనా స్థలం – అవుతుంది. ఎందుకంటే మహనీయ ముహమ్మద్ (ﷺ) ఈ విధంగా ప్రవచించారు :

”جُعِلَتْ لِيَ الْأَرْضُ مَسْجِدًا وَّ طَهُوْرًا “(بخاری).

**"నా కొరకు భూమండలమంతా మస్జిద్ (సాష్టాంగ స్థలం)గా, పరిశుద్ధత పొందే స్థలంగా చేయబడింది." (సహీహ్ బుఖారీ)**

కాబట్టి సమాధిపై మస్జిద్‌ని నిర్మిస్తే, వ్యవహారం చాలా సంక్లిష్టమైపోతుంది.

కాని చాలామంది వారించబడిన ఈ విషయాలను ఉల్లంఘించారు. ఏ ఏ పనులు చేయరాదని దైవప్రవక్త (ﷺ) గట్టిగా తాకీదుచేశారో వాటికి ఒడిగట్టారు. తత్కారణంగా వారు పెద్ద తరహా షిర్క్‌కు పాల్పడిన వారయ్యారు. వారు సమాధులపై మస్జిదులను, విశ్రాంతి స్థలాలను నిర్మించారు. సమాధులను సందర్శనా క్షేత్రాలుగా తీర్చిదిద్దారు. పెద్ద తరహా షిర్క్ (షిర్కె అక్బర్) గా పరిగణించబడే పనులన్నీ అక్కడ యధేచ్ఛగా జరుగుతాయి. ఉదాహరణకు : జంతువులను బలి ఇవ్వటం, సమాధిలో ఉన్న మృతుల ముందు చేయిచాచి అర్థించటం, ఫిర్యాదులు చేసుకోవటం, మొక్కుకోవటం, మొక్కుబడులు చెల్లించటం, నజరానాలు సమర్పించటం ఇత్యాదివి.

అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) ఇలా అంటున్నారు : "ఏ వ్యక్తి అయినా సమాధుల గురించి దైవప్రవక్త (ﷺ) వారి విధానాన్ని, ఆయన (ﷺ) ఆదేశాలను, నిషేధాజ్ఞలను, వాటికి ప్రవక్త సహచరులు (رضي الله عنهم) కట్టుబడిన తీరును అధ్యయనం చేసి, అదే సమయంలో నేటి ప్రజలలో చాలామంది (అంటే ఇబ్నుల్ ఖయ్యిమ్ గారి సమకాలికులు) అవలంబిస్తున్న పోకడల్ని పోల్చిచూసుకుంటే ఆ రెండు వర్గాల మధ్య ఉన్న వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తుంది. వారి మధ్య అసలు పొంతనే కనిపించదు.

ఎందుకంటే మహాప్రవక్త (ﷺ) సమాధుల వద్ద నమాజ్ చేయరాదని తాకీదు చేశారు. కాని వీళ్ళు అక్కడ నమాజ్ చేస్తున్నారు. సమాధులను ఆరాధనా స్థలాలుగా చేసుకోవటాన్ని మహాప్రవక్త (ﷺ) వారించారు. కాని వీళ్ళు సమాధిపై ఆరాధనా కట్టడం నిర్మిస్తున్నారు. దేవుని ఆరాధనా స్థలాలను పోలిన కట్టడాలను నిర్మించి వాటికి 'దర్గాహ్' అని నామకరణం చేస్తున్నారు. సమాధులపై దీపాలంకరణ చేయటాన్ని ప్రవక్త (ﷺ) వారించగా, వీళ్ళేమో దీపాలు వెలిగిస్తూ ఉండటానికి ఆస్తులను వక్ఫ్ చేస్తున్నారు. సమాధులను ఉత్సవ స్థలాలుగా చేయరాదని మహాప్రవక్త (ﷺ) తాకీదు చేశారు. కాని ఈ మహానుభావులు సమాధులను ఉత్సవాలకు, ఉరుసులకు, మేళాలకు ప్రత్యేకించుకుని సంబరాలు జరుపుకుంటున్నారు.

సమాధులను (నేలకు) సమంగా చేయమని మహాప్రవక్త (ﷺ) ఆజ్ఞాపించినట్లుగా ఇమామ్ ముస్లిం తన ప్రామాణిక గ్రంథంలో పొందుపరిచారు. అబుల్ హయాజుల్ అసదీ కథనం : అలీ బిన్ అబీ తాలిబ్ (رضي الله عنه) తనతో ఇలా అన్నట్లు ఆయన తెలిపారు:

"أَلَا أَبْعَثُكَ عَلَىٰ مَا بَعَثَنِي عَلَيْهِ رَسُولُ اللّٰهِ ﷺ أَنْ تَدَعَ صُورَةً إِلَّا طَمَسْتَهَا وَلَا قَبْرًا مُشْرِفًا إِلَّا سَوَّيْتَهُ" (مسلم)

**"దైవప్రవక్త (ﷺ) నన్ను ఏ పనిపై పంపారో, ఆ పనిపై నేను మిమ్మల్ని పంపనా!? అదేమంటే ఏ విగ్రహం కనిపించినా దానిని**



**రూపుమాపాలి. ఏ సమాధి ఎత్తుగా ఉన్నట్లు కనిపించినా దానిని నేలమట్టం చేయాలి." (సహీహ్ ముస్లిం)**

సహీహ్ ముస్లింలోనే సుమామ బిన్ షుఫా కథనం ఇలా ఉంది : "మేము ఫుజాలా బిన్ ఉబైద్ (رضي الله عنه) వెంట రోము రాజ్యంలో 'రూడ్స్' అనే ప్రదేశంలో ఉండగా మా సహవాసుల్లో ఒక వ్యక్తి మరణించాడు. ఆ వ్యక్తి సమాధిని భూమికి సమంగా చేయమని ఫుజాలా (رضي الله عنه) ఆజ్ఞాపిస్తూ ఇలా అన్నారు : "సమాధులను నేలకు సమంగా ఉంచమని దైవప్రవక్త (ﷺ) ఆజ్ఞాపించటం నేను స్వయంగా విన్నాను."

కాని వీళ్లు ఈ రెండు హదీసులను వ్యతిరేకిస్తూ, అతిగా ప్రవర్తిస్తున్నారు. తమ నివాస గృహాల మాదిరిగా సమాధులను కూడా బాగా ఎత్తుగా నిర్మిస్తున్నారు. వాటిపై డోములు అమర్చుతున్నారు.

అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) ఇంకా ఇలా అంటున్నారు : సమాధులకు సంబంధించి దైవప్రవక్త (ﷺ) ఏ ఏ ఆదేశాలిచ్చారో, మరే నిషేధాజ్ఞలు జారీ చేశారో వాటి వెలుగులో చూస్తే, ఈ సమాధి పూజారులు కల్పించుకున్న విధానాలకు – ప్రవక్త విధానానికి చాలా వ్యత్యాసం ఉంది. వీళ్ల పోకడలో ఉన్న అరిష్టాలను లెక్కించటం మనిషి తరం కాదు.

తరువాత ఆయన ఈ అనర్థదాయక విషయాలను గురించి చెబుతూ ఇలా అన్నారు: సమాధుల సందర్శన సమయంలో దైవప్రవక్త (ﷺ) ఏ ఏ విషయాలను అనుమతించారో కాస్త చూడాలి. సమాధుల సందర్శనలోని ముఖ్య ఉద్దేశం పరలోకాన్ని స్మరించుకోవటం! సమాధిలో ఉన్న మృతుని మన్నింపునకై దైవాన్ని వేడుకోవటం!! అతనిపై కరుణించమని, అతని యెడల ఉదారంగా వ్యవహరించమని ప్రార్థించటం!!! ఈ విధంగా గనక చేస్తే అటు మృతునికీ మేలు చేసినట్లవుతుంది, ఇటు తన స్వయానికి కూడా మేలు చేకూర్చుకున్నట్లవుతుంది. కాని ఈ ముష్రిక్కులు వ్యవహారాన్నంతటినీ తలక్రిందులు చేసేశారు. ధర్మాన్ని తలక్రిందులు చేసివేశారు. వీళ్ళ సమాధి సందర్శన ఉద్దేశం మృతుణ్ణి దైవానికి భాగస్వామిగా నిలబెట్టడమై ఉంటుంది. మృతుని ముందు వేడుకోవటం, మృతుని ద్వారా దైవాన్ని వేడుకోవటం, మృతుని వాస్తాతో శుభాలు కురిపించమని ప్రార్థించటం, శత్రువులకు వ్యతిరేకంగా తోడ్పడమని మృతుల ద్వారా విజ్ఞాపన చేసుకోవటం అయి ఉంటుంది. ఈ విధంగా వారు తమ ఆత్మకు అన్యాయం చేసుకోవటమే గాక, మృతునికి కూడా హాని కలిగించేందుకు ప్రయత్నించారు. ఇలా చేయటం వల్ల వారికి అసలుకే నష్టం కలుగుతుంది. మృతుని మన్నింపుకోసం, కారుణ్యం కోసం దుఆ చేయమని దేవుడు సూచించాడు. ఈ సూచనను ఉల్లంఘించినందువల్ల కలగవలసిన శుభం కూడా కలగకుండా పోతుంది. (ఇఘ్ఆసతుల్ లహ్ఫాన్ : 1/414, 415, 417)

దీనిద్వారా స్పష్టమయ్యేదేమిటంటే దర్గాల వద్ద మొక్కుకోవటం, మొక్కుబడులు సమర్పించుకోవటం షిర్కె అక్బర్ (పెద్ద షిర్క్). ఎందుకంటే ఇది సమాధుల విషయంలో

మహాప్రవక్త (ﷺ) చేసిన ఆజ్ఞకు పూర్తిగా విరుద్ధం. మహాప్రవక్త (ﷺ) ఆదేశానుసారం సమాధుల వద్ద కట్టడం గానీ, మస్జిద్ గానీ నిర్మించకూడదు. నిర్మాణాలు గనక జరిగితే, అజ్ఞానులు దానికి పవిత్రతను ఆపాదించే అవకాశముంటుంది. సమాధులలో ఉన్న మృతులకు, లాభనష్టాలు చేకూర్చే శక్తి ఉందని వారు ఊహిస్తారు. అక్కరలు తీరుస్తారని నమ్ముతారు. అందుకే వారు సమాధులను అలంకరించటం, దుప్పట్లను కప్పటం, మొక్కుబడులు సమర్పించటం మొదలెడతారు. ఆ విధంగానే ఆ సమాధులు విగ్రహారాధనా కేంద్రాలైనాయి. జనులు నిజదైవాన్ని వదలి విగ్రహపూజ చేయసాగారు. నిజానికి అంతిమ దైవప్రవక్త ఈ విషయమై ఎంతో ఆర్ద్రంగా ఇలా వేడుకున్నారు :

’’اَللّٰهُمَّ لَا تَجْعَلْ قَبْرِيْ وَثَنًا يُعْبَدُ‘‘ (مسند احمد:۷۰۵۴،موطاءامام مالک:۳۷۶)

**“అల్లాహ్! నా సమాధిని ప్రజలు పూజించే విగ్రహంగా మార్చకు.”**

**(మాలిక్-376, అహ్మద్-7054)**

ముస్లిం సముదాయంలో సమాధుల పట్ల ఈ విధమైన వ్యవహారం జరగనున్నదని పసిగట్టి మహాప్రవక్త (ﷺ) ఇలా ప్రార్థించారు. అనేక ముస్లిం దేశాలలో ఈ పరిస్థితి ఎదురయింది కూడా. కాని ఆయన (ﷺ) గారి ప్రార్థనా శుభం వల్ల అల్లాహ్ ఆయన (ﷺ) సమాధిని ఇలాంటి అపచారాల నుండి సురక్షితంగా ఉంచాడు. కొంతమంది అజ్ఞానులు, అవివేకులు ఇప్పటికీ ఆయన మస్జిద్ (మస్జిదె నబవీ)లో ఆజ్ఞోల్లంఘనకు పాల్పడుతూ ఉంటారు. కాని వారు ఆయన (ﷺ) గారి సమాధి వరకూ చేరుకోలేరు. ఎందుకంటే ఆయన (ﷺ) సమాధి మస్జిద్‌లో లేదు, అది ఆయన (ﷺ) స్వగృహంలో ఉంది. దానికి నలువైపులా ఎత్తయిన గోడలు నిర్మితమై ఉన్నాయి. ఆ విషయమే అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) ఒక పద్యంలో ఇలా చెప్పారు :

فَاسْتَجَابَ رَبُّ الْعَالَمِيْنَ دُعَاءَهُ وَاَحَاطَهُ بِثَلَاثَةِ الْجُدْرَانِ

“లోకేశ్వరుడు మీ మొరను ఆలకించాడు. దానిని (మీ సమాధిని)
మూడు గోడలతో దిగ్బంధం చేశాడు.”



## నాల్గవ ప్రకరణం

# విగ్రహాల, స్మారక చిహ్నాల పట్ల భక్తి ప్రపత్తులు

అరబీలో ‘తమాసీల్’ అనబడుతుంది. అంటే విగ్రహాలు, స్థూపాలు అని అర్థం. అవి మానవ రూపంలోగానీ, జంతువుల రూపంలోగానీ, మరేదైనా సజీవ వస్తువు ఆకారంలోగానీ చెక్కబడి ఉంటాయి. నుసుబ్ అంటే ఒక చిహ్నం (జెండా) లేక ప్రత్యేక రాయి. అక్కడ బహుదైవారాధకులు బలి ఇస్తారు. ‘స్మారక చిహ్నాలు’ అంటే ప్రజలు బహిరంగ స్థలాలలో తమ నాయకుల గౌరవార్థం, వారి ఘనకార్యాల స్మారకార్థం నిర్మించుకుని ప్రతిష్ఠించే స్థూపాలు లేక విగ్రహాలు.

సజీవుల ఆకారం వే(చే)యటాన్ని మహాప్రవక్త (ﷺ) వారించారు. ముఖ్యంగా సమాజంలోని ప్రముఖుల, ఆదరణీయుల రూపాలను వేయరాదు. ఉదాహరణకు : రాజులు, విద్వాంసులు, సజ్జనులు, సన్యాసులు, నాయకుల రూపచిత్రాలు. ఈ చిత్రాలు పలకపై వేసినా, కాగితంపై గీసినా, గోడపై చిత్రీకరించినా, దుస్తులపై వేయబడినా, కెమెరాల ద్వారా తీయబడినవైనా, శిలలపై చెక్కబడినా - ఇవన్నీ ధార్మికంగా నిషిద్ధమే (హరామే).

అలాగే గోడలపై చిత్ర పటాలను వ్రేలాడదీయటం, విగ్రహాలను ప్రతిష్ఠించటం కూడా ఈ కోవకు చెందినవే. స్మారక చిహ్నాలు ఇందులోకే వస్తాయి. దేవుని ఈ భూమిపై మొట్టమొదటిసారి షిర్క్ ఈ రూపచిత్రాల, విగ్రహ ప్రతిష్ఠాపన ద్వారానే పొడసూపింది. దైవప్రవక్త హజ్రత్ నూహ్ (عليه السلام) జాతిలో కొంతమంది పుణ్య పురుషులుండేవారు. వారి మరణం పట్ల ఆ జాతివారు తీవ్రంగా దుఃఖించారు. ఆ సమయంలో షైతాన్ రంగప్రవేశం చేసి, ఆ పుణ్య పురుషులు కూర్చునే సభాస్థలిలో వారి విగ్రహాలను ప్రతిష్ఠించి, వాటిపై వారి పేర్లను వ్రాయమని ఆ ప్రజల ఆంతర్యాల్లో ప్రేరేపించాడు. వారు అలాగే చేశారు. ఆ సమయంలో వారు ఆ విగ్రహాలను పూజించలేదు. వారు మరణించిన తరువాత వారి తరువాతి తరాల వారు ఆ విగ్రహాలను పూజించటం మొదలెట్టారు. ఎందుకంటే ఆ విగ్రహాలను ప్రతిష్ఠించటం వెనుక వాస్తవికత వారికి తెలీదు. ఆ విధంగా నూహ్ జాతి వారిలో విగ్రహారాధన చోటు చేసుకుంది. (సహీహ్ బుఖారీ)

ఈ విగ్రహారాధన రూపంలో పొడసూపిన షిర్క్ నుండి నిరోధించేందుకు దేవుడు తన ప్రవక్త నూహ్ (عليه السلام)ను పంపాడు. కాని నూహ్ పిలుపును ఆ జాతి జనులు త్రోసిపుచ్చారు. విగ్రహ రూపంలో ఉన్న తమ పూర్వీకుల పూజపై స్థిరంగా ఉండిపోయారు. పైగా వారిలా అన్నారు :

﴿وَقَالُوا لَا تَذَرُنَّ آلِهَتَكُمْ وَلَا تَذَرُنَّ وَدًّا وَلَا سُوَاعًا وَلَا يَغُوثَ وَيَعُوقَ وَنَسْرًا﴾ (نوح:۲۳)

**“ఎట్టి పరిస్థితిలోనూ మీ పూజ్య దైవాలను వదలకండి. వద్దను, సువాను గానీ, యగూస్, యవూఖ్, నస్రలను గానీ వదలిపెట్టకండి.”(నూహ్:23)**

(1) వద్ద్ (2) సువా (3) యగూస్ (4) యవూఖ్ (5) నస్ర్ - ఇవి చనిపోయిన

పుణ్య పురుషుల పేర్లు. వారి స్మారకార్థం వారి పేర్లతో మొదట విగ్రహాలను ప్రతిష్ఠించారు. కాని అవే చివరకు పూజనీయం అయ్యాయి.

చూశారా! కేవలం స్మారక చిహ్నాలుగా ప్రతిష్ఠించబడిన విగ్రహాలు ఎలా షిర్క్‌కు దారితీశాయో! చివరకు ఈ పని దైవప్రవక్త పట్ల శత్రుత్వంగా పరిణమించింది. తత్కారణంగా వారు పెనుతుఫాను ద్వారా అంతమొందించబడ్డారు. వారు దేవుని దృష్టిలోనూ, ప్రజల దృష్టిలోనూ ఆగ్రహించబడినవారుగా నిలిచారు. రూపచిత్రాలు, విగ్రహ ప్రతిష్ఠాపన ఎంత తీవ్రమైన పనో దీని ద్వారా అవగతమవుతోంది. అందుకే మహాప్రవక్త (ﷺ) రూపాలను చిత్రించేవారిని ధూత్కరించారు. ప్రళయదినాన వారు చాలా తీవ్రమయిన శిక్షకు గురిచేయబడతారని చెప్పారు. రూప చిత్రాలను నిర్మూలించాలని ఆయన (ﷺ) ఆదేశించారు. ఫోటోలు ఉన్న ఇండ్లల్లో దైవదూతలు ప్రవేశించరని తెలిపారు. ఎందుకంటే వీటి పరిణామం తీవ్రంగా ఉంటుంది. వీటి మూలంగా భూమండలంలో ప్రప్రథమంగా షిర్క్ ప్రబలింది. ఈ రకమయిన విగ్రహాలు, చిత్రాలు సభాస్థలాలలో ప్రతిష్ఠించినా, బహిరంగ స్థలాలలో నిలబెట్టినా, పార్కులలో ప్రతిష్ఠించినా షరీయతు దృష్ట్యా అది హరామే (అధర్మమే). ఎందుకంటే ఇది షిర్క్! ఇది విశ్వాసాలలో చెడుగుకు తొలి మెట్టు!!

అన్యుల సంగతిని అలా ఉంచితే ముస్లిముల కొరకు మాత్రం ఇది ఎట్టి పరిస్థితిలోనూ సమ్మతం కాదు. ఈ విషయంలో వారు అన్యులకు ప్రభావితులై కాల ప్రవాహంలో కొట్టుకుపోరాదు. తమ ధార్మిక విశిష్టతకు మూల సరోవరమయిన 'విశ్వాసాన్ని' (అఖీదా) వారు కాపాడుకోవాలి. "మరీ అంత ఇదిగా చెబితే ఎలాగండీ! ధర్మాధర్మాల గురించి వారికి తెలియదా ఏమి!?" అని దాటవేయటం ఏ విధంగాను సరికాదు. ఎందుకంటారా!? షైతాన్ భావితరాల వారిపై దృష్టిని కేంద్రీకరిస్తాడు. భావితరాలలో విషయ పరిజ్ఞానం లోపించగానే ఆ ధూర్తుడు పాదరసంలా పారుతాడు. తన నక్కజిత్తులలో నవతరాలను బోల్తా కొట్టిస్తాడు. నూహ్ (عليه السلام) జాతి వారి విషయంలో జరిగింది కూడా ఇదే కదా! జ్ఞాన సంపన్నులైన వారి పూర్వీకులు మరణించిన పిదప, భావి తరాలలో అజ్ఞానం ప్రబలింది. మనిషి బ్రతికి ఉన్నన్నాళ్ళూ ఈ ఉపద్రవానికి (షిర్క్) లోనయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీమ్ (عليه السلام) దైవాన్ని ఇలా వేడుకున్నారు – ﴿وَاجْنُبْنِى وَبَنِىَّ أَن نَّعْبُدَ الْأَصْنَامَ﴾ (ابراهيم:٣٥)

**"(ప్రభూ!) నన్నూ, నా సంతానాన్ని విగ్రహ పూజ నుండి కాపాడు."**

**(ఇబ్రాహీమ్ – 23)**

అందుకే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (ﷺ) వారు తన స్వవిషయంలో దీని గురించి భయపడ్డారు. అందుకే పూర్వకాలపు సత్పురుషులు ఇలా వ్యాఖ్యానించారు:

"ఇబ్రాహీమ్ (عليه السلام) తరువాత ఈ విషయంలో ఎవరు మాత్రం నిర్భయంగా ఉండగలరు?"



**ఐదవ ప్రకరణం**

# ధర్మాన్ని పరిహసించటం, ధార్మిక చిహ్నాలను కించపరచటం

తాను విశ్వసించే మత ధర్మాన్ని పరిహసించిన మనిషి ధర్మభ్రష్టుడైపోతాడు. ఆ ధర్మం నుండి పూర్తిగా బహిష్కృతుడవుతాడు. విశ్వప్రభువు ఇలా సెలవిచ్చాడు :

﴿قُلْ أَبِاللَّهِ وَآيَاتِهِ وَرَسُولِهِ كُنتُمْ تَسْتَهْزِئُونَ ☆ لَا تَعْتَذِرُوا قَدْ كَفَرْتُم بَعْدَ إِيمَانِكُمْ﴾ (التوبة:٦٥، ٦٦)

**వారితో అను : "ఏమిటీ, మీరు అల్లాహ్‌తో, ఆయన ఆయతులతో, ఆయన ప్రవక్తతో పరిహాసమాడుతున్నారా? మీరింక సాకులు చెప్ప కండి. మీరు విశ్వసించిన తరువాత అవిశ్వాసానికి ఒడిగట్టారు."**

**(అత్ తౌబా – 65, 66)**

అల్లాహ్‌తో, ఆయన ప్రవక్తతో, ఆయన సూక్తులతో పరిహాసమాడటం అవిశ్వాసానికి (కుఫ్ర్‌కు) తార్కాణమని ఈ ఆయతుల ద్వారా రూఢీ అవుతోంది. కాబట్టి ఎవరు ఈ విషయాలలో ఏ ఒక్కదానినయినా పరిహసిస్తాడో అతను అన్నింటినీ పరిహసించిన వాడిగానే పరిగణించబడతాడు. అలనాడు (మదీనాలో) కపటుల విషయంలో జరిగింది కూడా ఇదే. వారు దైవప్రవక్త (ﷺ)ను, ప్రవక్త సహచరులను ఎగతాళి చేశారు. అందుచేత పై ఆయతులు అవతరించాయి.

ధార్మిక చిహ్నాలలో ఏ ఒక్క దానినయినా పరిహసించేవాడు ధార్మిక చిహ్నాలన్నింటినీ తప్పనిసరిగా కించపరుస్తాడు. అలాగే దేవుని ఏకత్వాన్ని (తౌహీద్‌ను) చిన్నచూపు చూసేవాడు, నిజ దైవాన్ని వదలి మృతులను వేడుకోవటాన్ని గౌరవ దృష్టితో చూస్తారు. వారిని ఏకేశ్వరోపాసన వైపు పిలిచినపుడు, షిర్క్ నుండి వారించినపుడు ఎగతాళి చేస్తారు. అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు :

﴿وَإِذَا رَأَوْكَ إِن يَتَّخِذُونَكَ إِلَّا هُزُوًا أَهَٰذَا الَّذِى بَعَثَ اللَّهُ رَسُولًا ☆ إِن كَادَ لَيُضِلُّنَا عَنْ آلِهَتِنَا لَوْلَا أَن صَبَرْنَا عَلَيْهَا﴾ (الفرقان:٤١، ٤٢)

**వారు నిన్ను చూచినప్పుడల్లా, నీతో వేళాకోళానికి దిగుతారు. "దేవుడు ప్రవక్తగా చేసి పంపినది ఈయన గారినేనా?! మేము మా దేవుళ్ళపై గట్టిగా నిలబడి ఉండకపోతే, ఇతను మమ్మల్ని మా దేవుళ్ల నుండి తప్పించేవాడే" అని ఎద్దేవా చేస్తారు. (అల్ ఫుర్ఖాన్ : 41, 42)**

మహాప్రవక్త (ﷺ) వారిని షిర్క్ నుండి వారించినపుడు, వారు ఆయన్ని పరిహసించారు. ఇది తరతరాలుగా జరుగుతూ వస్తున్నదే. దైవప్రవక్తలు తమ జాతి

ప్రజలను ఏకేశ్వరోపాసన వైపు ఆహ్వానించినప్పుడల్లా ముష్రిక్కులు వారిలో తప్పులెన్నే ప్రయత్నం చేశారు. ప్రవక్తలను అవివేకుల క్రింద జమకట్టారు. వారిని మార్గవిహీనులన్నారు. పిచ్చోళ్ళన్నారు. ఎందుకంటే వారి హృదయాలలో షిర్క్ (బహుదైవారాధన) పట్ల భక్తి భావం ఉండేది. అలాగే ముష్రిక్కులను పోలిన పనులు చేసే వారిలో కూడా ఇదే ఆలోచన ఉంటుంది. ఏక దైవారాధన వైపు పిలిచే వారిని చూసినపుడు వారు ఓర్చుకోలేరు. వారి గురించి చులకనగా మాట్లాడతారు. ఎందుకంటే వీళ్ళ హృదయాలలో కూడా షిర్క్ పట్ల ప్రేమ గూడు కట్టుకుంది. ఈ నేపథ్యంలో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు –

﴿وَمِنَ النَّاسِ مَن يَتَّخِذُ مِن دُونِ اللَّهِ أَندَاداً يُحِبُّونَهُمْ كَحُبِّ اللَّهِ﴾ (البقرة:١٦٥)

**“అల్లాహ్‌ను కాదని ఆయనకు సహవర్తులుగా ఇతరులను నిలబెట్టి, అల్లాహ్‌ను ప్రేమించవలసిన విధంగా వారిని ప్రేమించేవారు కూడా ప్రజలలో కొందరున్నారు.” (అల్ బఖర : 165)**

కాబట్టి అల్లాహ్ పట్ల భక్తి కలగవలసిన విధంగా సృష్టిలో వేరితరుల పట్ల భక్తి కలిగి ఉండేవాడు ఖచ్చితంగా ముష్రిక్కే. ఇంకా – కేవలం అల్లాహ్ కొరకు ప్రేమించటంలో – అల్లాహ్ ప్రేమతో పాటు ఇతరుల పట్ల ప్రేమ కలిగి ఉండటంలో గల వ్యత్యాసాన్ని చూడటం అవసరం. (అల్లాహ్ కొరకు ప్రేమించటం వాంఛనీయం. అల్లాహ్ పట్ల గల ప్రేమ మాదిరిగా ఇతరులను ప్రేమించటం అవాంఛనీయం). సమాధులను విగ్రహంగా మార్చుకున్న వారిని చూడండి – వారు దేవుని ఏకత్వాన్ని (తౌహీద్‌ని) పరిహసిస్తారు. దైవారాధనను గేలిచేస్తారు. అల్లాహ్‌ను వదలి తాము సిఫారసుదారులుగా ఆశ్రయించిన వారి పట్ల మాత్రం భక్తీ ప్రపత్తులు కలిగి ఉంటారు. వారిలోని ఒక వ్యక్తి అల్లాహ్ పేరు మీద అబద్ధ ప్రమాణం చేస్తాడు గాని తాను నమ్మినడుచుకునే ముర్షిద్ పేరు మీద మాత్రం అబద్ధ ప్రమాణం చేయడానికి ఎంతకీ సాహసించడు. ప్రజాబాహుళ్యంలో మీరు అనేకమందిని చూస్తుంటారు. వారి దృష్టిలో తమ ముర్షిద్‌కు విన్నపాలు చేసుకోవటం – అతని సమాధి వద్ద చేసినా, సమాధికి దూర స్థలంలో చేసినా – మస్జిద్‌లో తెల్లవారుజామున అల్లాహ్‌కు విజ్ఞప్తి చేసుకోవటం కన్నా ఎక్కువ లాభదాయకమయింది. తమ ముర్షిద్ బాటను వదలి ఏకదైవారాధనా మార్గాన్ని అవలంబించిన వారిని వారు వేళాకోళం చేస్తారు. అలాంటి వారిలో చాలామంది మస్జిదులకు రారు గాని దర్గాలకు మాత్రం వెళతారు. దర్గాలను దేదీప్యమానంగా ముస్తాబుచేస్తారు. ఇదంతా ఏమిటి? అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను, ఆయన సూక్తులను పరిహసించి షిర్క్‌కు స్వాగతం పలకటం కాదా!? (మజ్మూఅ అల్ ఫతావా : 15/48, 49)

నేటి సమాధి పూజారుల్లో ఈ ధోరణి అత్యధికంగా ఉంది.



## ఎగతాళి రెండు రకాలుగా ఉంటుంది

**1. బాహాటంగా ఎగతాళి చేయటం :** అంటే ఇంతకు ముందు ఖుర్ఆన్ సూక్తుల్లో చెప్పబడినట్లుగా అడ్డూ ఆపూ లేకుండా సత్యాన్ని, సత్య ప్రేమికుల్ని ఎగతాళి చేయటం. ఉదాహరణకు : మీ మతధర్మం ఐదవ మతం అని కొందరంటే, మీది బూటకపు మతం అని మరికొందరంటారు. అలాగే మంచిని పెంపొందించే వారిని, చెడుల నుండి ఆపేవారిని చూసి, ‘అబ్బో! బయలుదేరారు పేద్ద ధర్మోద్ధారకులు’ అంటూ వెటకారంగా ప్రేలుతారు. అంతకన్నా దారుణమైన వాక్యాలు – వ్రాయటానికి కూడా వీలులేని మాటలు చెప్పటం జరుగుతుంది.

**(2) ద్వంద్వార్థాలతో ఎగతాళి చేయటం :** ఈ ఎగతాళి కూడా తీరంలేని సముద్రం వంటిది. కన్నుగీటి సైగలు చేయటం, నాలుక వెళ్ళబెట్టడం, మూతి ముడుపులతో వెకిలి సైగలు చేయటం, ఖుర్ఆన్ పారాయణం చేస్తున్నప్పుడు, హదీసులు పఠిస్తున్నప్పుడు లేదా మంచి పనులు చేస్తున్నప్పుడు చేతులతో సైగలు చేయటం మొదలగునవి. (మజ్మూఅతు త్తౌహీద్ – నజ్‌దియ : పేజీ : 409).

మరి కొంతమంది చెప్పే కొన్ని మాటలు కూడా ఈ ‘పరిహాస’ పరిధిలోకే వస్తాయి. ఉదాహరణకు : “ఇస్లాం 21వ శతాబ్దికి సరిపోదు. ఇది మధ్య యుగాలకు తగినది.” “ఇస్లాం ఛాందసుల మతం”, “శిక్షల విషయంలో ఇస్లాం మరీ అమానుషంగా వ్యవహరిస్తుంది”, “విడాకులను, బహుభార్యాత్వాన్ని అనుమతించి ఇస్లాం మహిళా హక్కులను హరించింది”, “ఇస్లాం శాసనాల ప్రకారం తీర్పు ఇవ్వటం కన్నా స్వయం కల్పిత చట్టాల కనుగుణంగా తీర్పు ఇవ్వటం మిన్న” లాంటి మాటలను కొందరు యధేచ్ఛగా పలుకుతుంటారు. అలాగే ఏకేశ్వరోపాసనా సందేశం ఇచ్చేవారిని గురించి మాట్లాడుతూ, “వారు తీవ్రవాదులు. వారు ముస్లింలోని సంఘీభావాన్ని చిందరవందర చేస్తున్నారు” అంటారు. లేదంటే “వారు వహాబీలు” అంటారు. ఈ విధంగా వారు తమ మాటల తూటాలతో ఏక దైవారాధకులను, సత్యధర్మ ప్రేమికులను అనుదినం ఆటపట్టిస్తూ ఉంటారు.

### لَا حَوْلَ وَلَا قُوَّةَ إِلَّا بِاللَّهِ లా హౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్

దైవప్రవక్త (ﷺ) వారి సున్నతులలో ఏదైనా ఒక సున్నత్‌ను ఖచ్చితంగా అనుసరించే వారిని పట్టుకుని ఎగతాళి చేయటం కూడా ఈ కోవకు చెందినదే. ఉదాహరణకు – “గడ్డం పెంచినంత మాత్రాన ధర్మావలంబనలో పెరుగుదల రాదు” అని అనటం. అలాంటివే మరెన్నో తుచ్ఛమయిన పలుకులతో మనసులను గాయపరచటం.

**ఆరవ ప్రకరణం**

# దేవుని షరీయత్‌ను వదలి ఇతరత్రా చట్టాలను ఆశ్రయించటం

అల్లాహ్‌పై గల 'విశ్వాసం' కోరేదేమిటి? అంటే మనిషి ఆ నిజ దైవం ముందు బేషరతుగా లొంగిపోవాలి. పూర్తిగా ఆత్మ సమర్పణ చేసుకోవాలి. ఆయన విధించిన షరీయత్‌ను మనసారా శిరసావహించాలి. విశ్వాసాలలో, పరస్పర వ్యవహారాలలో ఎప్పుడు ఏ వివాదం తలెత్తినా, ఆస్తి తగాదాలు ఉన్నా, హత్య జరిగినా, హక్కులు కొల్లగొట్టబడినా, విభేదాలు పొడసూపినా – అల్లాహ్ గ్రంథం (ఖుర్ఆన్) మరియు ఆయన ప్రవక్త (ﷺ) విధానం వైపునకు మరలాలి. ఎందుకంటే అల్లాహ్‌యే అత్యుత్తమ న్యాయాధిపతి. కాబట్టి వివాదాల తీర్పు కొరకు ఆయన ధర్మాసనాన్నే ఆశ్రయించాలి. కాబట్టి ముస్లిం సముదాయానికి చెందిన అధికారులు, పెద్దలు న్యాయ నిర్ణయాలను దైవగ్రంథం, దైవప్రవక్త (ﷺ) విధానం ప్రకారం ప్రకటించాలి.

పరిపాలకుల నుద్దేశించి అల్లాహ్ ఇలా ఆజ్ఞాపిస్తున్నాడు :

﴿إِنَّ اللَّهَ يَأْمُرُكُمْ أَن تُؤَدُّوا الْأَمَانَاتِ إِلَىٰ أَهْلِهَا وَإِذَا حَكَمْتُم بَيْنَ النَّاسِ أَن تَحْكُمُوا بِالْعَدْلِ﴾(النساء:٥٨)

**"ఎవరి అమానతులను వారికి అప్పగించండి. ప్రజల మధ్య తీర్పులు చేసేటప్పుడు న్యాయంగా తీర్పు చేయండి" అని అల్లాహ్ మిమ్మల్ని గట్టిగా ఆదేశిస్తున్నాడు." (అన్ నిసా : 58)**

﴿يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا أَطِيعُوا اللَّهَ وَأَطِيعُوا الرَّسُولَ وَأُولِي الْأَمْرِ مِنكُمْ فَإِن تَنَازَعْتُمْ فِي شَيْءٍ فَرُدُّوهُ إِلَى اللَّهِ وَالرَّسُولِ إِن كُنتُمْ تُؤْمِنُونَ بِاللَّهِ وَالْيَوْمِ الْآخِرِ ذَٰلِكَ خَيْرٌ وَأَحْسَنُ تَأْوِيلًا﴾(النساء:٥٩)

**"ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు విధేయత చూపండి. ప్రవక్త (ﷺ)కు విధేయత చూపండి, ఇంకా మీలోని అధికారులకు కూడా. ఆపైన ఏ విషయంలోనయినా మీ మధ్య వివాదం తలెత్తితే దానిని అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త వైపు మరల్చండి – మీరు నిజంగా అల్లాహ్‌పై, అంతిమ దినంపై నమ్మకం ఉన్నవారైతే (మీరు ఇలా చేయటం అవశ్యం)! ఇదే మేలైన పద్ధతి. పరిణామం రీత్యా కూడా ఇదే అన్నిటి కంటే ఉత్తమమైనది." (అన్ నిసా : 59)**

అల్లాహ్ అవతరింపజేసిన షరీయత్ (శాసనాంగం)ను వదలిపెట్టి స్వీయ కల్పిత చట్టాల ప్రకారం తీర్పులు చేయిస్తే విశ్వాసం (ఈమాన్) మిగిలి ఉండదని దేవుడు చాలా స్పష్టంగా చెప్పాడు.



ఈ విధంగా సెలవీయబడింది :

﴿أَلَمْ تَرَ إِلَى الَّذِينَ يَزْعُمُونَ أَنَّهُمْ آمَنُوا بِمَا أُنزِلَ إِلَيْكَ وَمَا أُنزِلَ مِن قَبْلِكَ يُرِيدُونَ أَن يَتَحَاكَمُوا إِلَى الطَّاغُوتِ وَقَدْ أُمِرُوا أَن يَكْفُرُوا بِهِ وَيُرِيدُ الشَّيْطَانُ أَن يُضِلَّهُمْ ضَلَالًا بَعِيدًا﴾(النساء:٦٠)

**(ఓ ప్రవక్తా!) నీపై అవతరించిన దానినీ, నీకు పూర్వం వారిపై అవతరించిన దానినీ విశ్వసించామని అంటూనే తమ వ్యవహారాలను తీర్పు కొరకు దైవేతరుల (తాగూత్) వద్దకు తీసుకుపోగోరే వారిని నీవు చూడలేదా? మరి నిజానికి షైతాన్ (తాగూత్)ను తిరస్కరించమని వారికి (స్పష్టంగా) ఆదేశించటం జరిగింది. షైతానైతే వారిని మార్గం తప్పించి చాలా దూరంలో పడవేయాలని కోరుతున్నాడు. (అన్ నిసా : 60)**

ఇదే విషయం ఈ విధంగా కూడా హెచ్చరించటం జరిగింది :

﴿فَلَا وَرَبِّكَ لَا يُؤْمِنُونَ حَتَّىٰ يُحَكِّمُوكَ فِيمَا شَجَرَ بَيْنَهُمْ ثُمَّ لَا يَجِدُوا فِي أَنفُسِهِمْ حَرَجًا مِّمَّا قَضَيْتَ وَيُسَلِّمُوا تَسْلِيمًا﴾(النساء:٦٥)

**కనుక (ఓ ప్రవక్తా!) నీ ప్రభువు తోడు! వారు తమ పరస్పర వివాదాలన్నింటిలోనూ నిన్ను తీర్పరిగా చేసుకోనంత వరకూ, తర్వాత నీవు వారి మధ్య చెప్పిన తీర్పు పట్ల వారు తమ మనసులలో ఎలాంటి సంకోచానికి, అసంతృప్తికి ఆస్కారం ఇవ్వకుండా, మనస్ఫూర్తిగా శిరసావహించనంత వరకూ–వారు విశ్వాసులు కాలేరు. (అన్ నిసా: 65)**

పై సూక్తిలో అల్లాహ్ ప్రమాణం చేసి మరీ చెప్పటం గమనార్హం. తన వివాదాన్ని దైవప్రవక్త (ﷺ) వైపు తీసుకుపోని, ఆయన (ﷺ) తీర్పుపై సంతృప్తి చెందని, హృదయపూర్వకంగా అంగీకరించని వ్యక్తిని గురించి చెబుతూ, అలాంటి వ్యక్తి విశ్వాసిగా మిగిలి ఉండదని హెచ్చరించటం జరిగింది. అలాగే దైవాదేశానుసారం తీర్పు ఇవ్వని పరిపాలనాధికారులను అల్లాహ్ అవిశ్వాసులుగా, అన్యాయపరులుగా, అవిధేయులుగా ఖరారు చేశాడు :

﴿وَمَن لَّمْ يَحْكُم بِمَا أَنزَلَ اللَّهُ فَأُولَٰئِكَ هُمُ الْكَافِرُونَ﴾(المائدة:٤٤)

**"ఎవరు అల్లాహ్ అవతరింపజేసిన 'వహీ' ప్రకారం తీర్పు చేయరో వారే (కరడుగట్టిన) అవిశ్వాసులు." (అల్ మాయిద : 44)**

﴿وَمَن لَّمْ يَحْكُم بِمَا أَنزَلَ اللَّهُ فَأُولَٰئِكَ هُمُ الظَّالِمُونَ﴾(المائدة:٤٥)

**"అల్లాహ్ అవతరింపజేసిన దాని కనుగుణంగా తీర్పు ఇవ్వని వారే దుర్మార్గులు." (అల్ మాయిద : 45)**

﴿وَمَن لَّمْ يَحْكُم بِمَا أَنزَلَ اللَّهُ فَأُوْلَئِكَ هُمُ الْفَاسِقُونَ﴾(المائدة:۴۷)

**"అల్లాహ్ అవతరింపజేసిన దాని ప్రకారం తీర్పు చెయ్యని వారే పాపాత్ములు." (అల్ మాయిద : 47)**

షరీయత్ సూత్రాల అన్వయింపు (ఇజ్తెహాద్)కు సంబంధించిన పలుకుల్లో ధర్మవేత్తల మధ్య అభిప్రాయ భేదాలు వచ్చినప్పుడు, వివాదాలు తలెత్తినపుడు కూడా అల్లాహ్ అవతరింపజేసిన షరీయత్ ప్రకారమే తీర్పులు కోరవలసి ఉంటుంది. కాబట్టి ఇజ్తెహాదీ ప్రకటనలకు సంబంధించినంత వరకు దైవగ్రంథం, దైవప్రవక్త (ﷺ) విధానం ద్వారా ఆధారం ఉన్నవాటినే పరిగణనలోకి తీసుకోవాలి. అంతేగాని ఏదేని ఒక ప్రత్యేక అభిమతాన్నో, ఒక ప్రత్యేక ఇమామునో ఉదాహరించి పక్షపాతంగా వ్యవహరించరాదు. అలాగే అన్ని రకాల హక్కులకు సంబంధించిన వివాదాలను కూడా దైవసమ్మతమైన శాసనాంగం ప్రకారమే విచారణ జరిపి, తీర్పులు ఇవ్వాలి. కేవలం వ్యక్తిగత విషయాల (పర్సనల్ లా) కే పరిమితం చెయ్యరాదు. ఇస్లాం పేరు చెప్పుకునే కొన్ని ముస్లిం దేశాలలో కూడా ఈ విధంగా జరుగుతోంది. ఇది పూర్తిగా సరైనది కాదు. ఎందుకంటే ఇస్లాం ఓ సమగ్రమయిన, సంగఠితమయిన వ్యవస్థ. అది వివిధ విభాగాలుగా, ముక్కచెక్కలుగా విభజించనలవి కానిది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿يَا أَيُّهَا الَّذِينَ آمَنُواْ ادْخُلُواْ فِي السِّلْمِ كَآفَّةً﴾(البقرة:۲۰۸)

**"విశ్వాసులారా! ఇస్లాంలో పూర్తిగా ప్రవేశించండి." (అల్ బఖర : 208)**

ఇంకా ఈ విధంగా కూడా సెలవీయబడింది :

﴿أَفَتُؤْمِنُونَ بِبَعْضِ الْكِتَابِ وَتَكْفُرُونَ بِبَعْضٍ﴾(البقرة:۸۵)

**"ఏమిటి, మీరు కొన్ని ఆజ్ఞలను విశ్వసించి, మరి కొన్నింటిని తిరస్క రిస్తున్నారా?" (అల్ బఖర : 85)**

అలాగే ఫికహ్ (ధర్మశాస్త్ర) నియమ నిబంధనలను క్రోడీకరించేవారు, ఆధునిక యుగంలో ఎదురయ్యే కొంగ్రొత్త సవాళ్ళకు వాటిని అన్వయించేవారు, అనుసరించేవారు. ఈ సందర్భంగా గమనించాల్సిందేమంటే, వారు తమ ఇమాముల అభిప్రాయాలను, విశ్లేషణలను 'దైవగ్రంథం, దైవప్రవక్త (ﷺ) సంప్రదాయం' అనే గీటురాయిపై పరికించాలి. ఖుర్ఆన్ హదీసులకు అనుగుణంగా ఉన్నదానినే తీసుకోవాలి. వాటికి వ్యతిరేకంగా ఉన్న దానిని నిస్సంకోచంగా వదలిపెట్టాలి. ముఖ్యంగా అఖీదా (విశ్వాసం) విషయంలో చాలా నిర్దిష్టంగా వ్యవహరించాలి. ఎందుకంటే మన ఇమాములు (رحمهم الله) మనకు చేసిన తాకీదు కూడా ఇదే. ఈ విషయంలో వారందరి విధానం కూడా ఇదే. కాబట్టి వారి వసీయతుకు వ్యతిరేకంగా వ్యవహరించినవాడు వారి అనుయాయిననిలక్షసార్లు చెప్పినా వారి అనుయాయి కానేకాడు. పైగా అలాంటి వారి గురించి అల్లాహ్ ఏమన్నాడో చూడండి!



﴿اتَّخَذُواْ أَحْبَارَهُمْ وَرُهْبَانَهُمْ أَرْبَاباً مِّن دُونِ اللَّهِ وَالْمَسِيحَ ابْنَ مَرْيَمَ﴾(التوبة:۳۱)

**"వారు అల్లాహ్‌ను వదలి తమ పండితులను, సన్యాసులను తమ ప్రభువులుగా చేసుకున్నారు - మర్యమ్ కుమారుడైన మసీహ్‌ను కూడా." (అత్ తౌబా : 31)**

దివ్య ఖుర్ఆన్‌లోని ఈ సూక్తి ఒక్క క్రైస్తవులకే పరిమితం కాదు. వారి (క్రైస్తవుల) మాదిరిగా వ్యవహరించిన ప్రతి ఒక్కరికీ ఇది వర్తిస్తుంది. కాబట్టి ఎవరయితే దైవం మరియు దైవప్రవక్త (ﷺ) ఆజ్ఞలకు విరుద్ధంగా - దైవ సమ్మతమయిన షరీయతును వదలి - స్వయం కల్పిత శాసనాల ప్రకారం ప్రజల మధ్య తీర్పులు ఇస్తాడో లేదా తన మనోవాంఛలను అనుసరించి అలాంటి వాటి కోసం డిమాండు చేస్తాడో అతను ఇస్లాం విధించిన హద్దులను దాటిపోయాడు. ఆ తరువాత అతను తనను విశ్వాసి (మోమిన్) అని ఊహించుకున్నప్పటికీ, నిజానికి అతను విశ్వాసిగా మిగిలి ఉండడు. ఎందుకంటే ఇలాంటి ఉద్దేశం కలిగి ఉన్న వారిని అల్లాహ్ సుతరామూ ఇష్టపడడు. పైగా వారిని బూటకపు విశ్వాసిగా ఖరారు చేశాడు. ఈ విధంగా సెలవిచ్చాడు :

﴿أَلَمْ تَرَ إِلَى الَّذِينَ يَزْعُمُونَ أَنَّهُمْ آمَنُواْ بِمَا أُنزِلَ إِلَيْكَ وَمَا أُنزِلَ مِن قَبْلِكَ يُرِيدُونَ أَن يَتَحَاكَمُواْ إِلَى الطَّاغُوتِ وَقَدْ أُمِرُواْ أَن يَكْفُرُواْ بِهِ وَيُرِيدُ الشَّيْطَانُ أَن يُضِلَّهُمْ ضَلاَلاً بَعِيداً﴾(النساء:۶۰)

**"(ఓ ప్రవక్తా!) నీపై అవతరించిన దానినీ, నీకు పూర్వం వారిపై అవతరించిన దానినీ విశ్వసించాము అని అంటూనే తమ వ్యవహారాలను తీర్పు కోసం దైవేతరుల (తాగూత్) వద్దకు తీసుకుపోగోరే వారిని నీవు చూడలేదా? మరి నిజానికి షైతాన్ (తాగూత్)ని తిరస్కరించమని వారికి (స్పష్టంగా) ఆదేశించటం జరిగింది. షైతానైతే వారిని మార్గం తప్పించి చాలా దూరంలో పడవేయాలని కోరు తున్నాడు." (అన్ నిసా : 60)**

ఈ రకమయిన వారిలో ద్వంద్వ స్వభావం ఉంటుంది. వారు తమను తాము విశ్వాసులమని పైకి చెప్పుకుంటారు. కాని లోపలి నుంచి తద్భిన్నంగా ఉంటారు. ఎందుకంటే వారు 'విశ్వాసం' కోరే 'నడవడి'కి విరుద్ధంగా ప్రవర్తిస్తారు. మరోవిధంగా చెప్పాలంటే విశ్వాసానికి హాని కలిగించే పనులు చేస్తారు. క్రింది వచనం ద్వారా దీనికి సమర్థన లభిస్తుంది.

﴿وَقَدْ أُمِرُواْ أَن يَكْفُرُواْ بِهِ﴾(النساء:۶۰)

**"నిజానికి షైతాన్‌ను తిరస్కరించమని వారిని ఆజ్ఞాపించడం జరిగింది." (అన్ నిసా : 60)**

ఎందుకంటే షైతాన్ (తాగూత్)ని తిరస్కరించటమే ఏకేశ్వరోపాసన (తౌహీద్)కు మూలస్తంభం. అల్ బఖరా సూరాలోని క్రింది వచనం కూడా దీనికి ప్రబల తార్కాణమే.

﴿ فَمَن يَكْفُرْ بِالطَّاغُوتِ وَيُؤْمِن بِاللَّهِ فَقَدِ اسْتَمْسَكَ بِالْعُرْوَةِ الْوُثْقَىٰ لَا انفِصَامَ لَهَا ﴾ (البقرة:٢٥٦)

**“కనుక ఎవడయితే అల్లాహ్ తప్ప వేరితర ఆరాధ్యుల (తాగూత్)ను తిరస్కరించి, అల్లాహ్‌ను మాత్రమే విశ్వసిస్తాడో అతను దృఢమయిన ఆధారాన్ని పట్టుకున్నాడు.” (అల్ బఖర : 256)**

కనుక మనిషిలో ఈ 'మూలాంశం' లేనంతవరకు అతను సిసలయిన ఏకేశ్వరోపాసి కాజాలడు. ఏకేశ్వరోపాసనే విశ్వాసానికి (ఈమాన్‌కు) ఊపిరి. అది ఉంటేనే అతని సత్కర్మలకు సార్థకత చేకూరుతుంది. లేకుంటే చేసుకున్న కర్మలన్నీ వ్యర్థమైపోతాయి. ఉదాహరణకు : దేవుని ఈ ఉత్తర్వులో చాలా స్పష్టంగా చెప్పబడింది –

﴿ فَمَن يَكْفُرْ بِالطَّاغُوتِ وَيُؤْمِن بِاللَّهِ فَقَدِ اسْتَمْسَكَ بِالْعُرْوَةِ الْوُثْقَىٰ لَا انفِصَامَ لَهَا ﴾ (البقرة:٢٥٦)

**“కనుక ఎవడయితే అల్లాహ్ తప్ప వేరితర ఆరాధ్యుల (తాగూత్)ను తిరస్కరించి, అల్లాహ్‌ను మాత్రమే విశ్వసిస్తాడో అతను దృఢమయిన ఆధారాన్ని పట్టుకున్నాడు.” (అల్ బఖర : 256)**

ఎందుకంటే తీర్పుకోసం దైవేతరుల వద్దకు పోవటమంటే, ఒకవిధంగా వారిని విశ్వసించటమే. (ఫతహ్ అల్ మజీద్ : పేజీ 467, 468)

అల్లాహ్ అవతరింపజేసిన షరీయత్ (శాసనాంగం) ప్రకారం తీర్పు ఇవ్వని వారి విశ్వాసము (ఈమాన్) విశ్వాసమే కాదు. అలాంటివారి విశ్వాసాన్ని అభిశంసించటం ప్రతి ముస్లిం కర్తవ్యం. దైవసమ్మతమైన షరీయత్‌ను ప్రవేశపెట్టే సమయంలో కేవలం దానివల్ల ప్రజలకు మేలు కలుగుతుందని, శాంతి భద్రతలు నెలకొంటాయని ఆశిస్తే సరిపోదు. ఎందుకంటే కొంతమంది కేవలం ఈ ఒక్క కోణాన్నే చూస్తారు. ఇంతకన్నా ముఖ్యమైన మరో కోణముంది – అదే దైవారాధన. దానిని ప్రజలు విస్మరిస్తుంటారు. ఇలాంటి వారిని దేవుడు లోపమున్న వారుగా ఖరారు చేశాడు. ఎందుకంటే వారు కేవలం తమ స్వంత ప్రయోజనం దృష్ట్యా షరీయత్‌బద్ధమైన తీర్పును ఆశ్రయించారు. దైవారాధనా కోణంపై వారి దృష్టి కేంద్రీకృతమై ఉండదు. ఈ నేపథ్యంలో అల్లాహ్ ఏమంటున్నాడో గమనించండి :

﴿وَإِذَا دُعُوا إِلَى اللَّهِ وَرَسُولِهِ لِيَحْكُمَ بَيْنَهُمْ إِذَا فَرِيقٌ مِّنْهُم مُّعْرِضُونَ ☆ وَإِن يَكُن لَّهُمُ الْحَقُّ يَأْتُوا إِلَيْهِ مُذْعِنِينَ﴾ (النور:٤٨،٤٩)

**“వారి మధ్య గల వివాదాలను పరిష్కరించటానికి అల్లాహ్ వైపు,**



**ఆయన ప్రవక్త వైపునకు రమ్మని వారిని పిలిచినపుడు కూడా వారిలోని ఒక వర్గం విముఖత చూపుతుంది. అయితే హక్కు తమకే లభిస్తుందని భావించినపుడు మాత్రం వారు ఎంతో వినయంతో అతని వద్దకు వస్తారు.” (అన్ నూర్ : 48, 49)**

అంటే, వారు తమ మనసు మెచ్చిన పనులను మాత్రమే చేస్తారు. తమ మనోవాంఛలకు వ్యతిరేకంగా ఉన్నవాటి నుండి మెల్లగా తప్పుకుంటారు. ఆ కారణంగానే వారు తమ వివాదాలను దైవం మరియు దైవప్రవక్త (ﷺ) వైపు తీసుకురారు.

**దైవసమ్మతమైన షరీయత్‌ను కాదని ఇతరత్రా చట్టాల ప్రకారం తీర్పులు కోరటం:**

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَمَن لَّمْ يَحْكُم بِمَا أَنزَلَ اللَّهُ فَأُولَٰئِكَ هُمُ الْكَافِرُونَ﴾ (المائدة:٤٤)

**“ఎవరు అల్లాహ్ అవతరింపజేసిన 'వహీ' ప్రకారం తీర్పు చెయ్యరో వారే (కరడు గట్టిన) అవిశ్వాసులు.” (అల్ మాయిదా : 44)**

అల్లాహ్ అవతరింపజేసిన షరీయత్ ప్రకారం గాకుండా ఇతరత్రా స్వీయకల్పిత శాసనాల ప్రకారం తీర్పులు చేయడం అవిశ్వాసానికి (కుఫ్ర్‌కు) తార్కాణమని పై ఆయత్ ద్వారా విదితమవుతోంది. అదీ మామూలు అవిశ్వాసం కాదు, పెద్ద తరహా అవిశ్వాసం (కుఫ్రె అక్బర్). అది మనిషిని ముస్లిం సముదాయం నుండి బయటికి గెంటేస్తుంది. అయితే చిన్నపాటి అవిశ్వాసానికి (కుఫ్రె అస్గర్‌కి) పాల్పడినవారు ముస్లిం సముదాయం నుండి వెలివేయబడరు. ఇదంతా పరిపాలకుని (లేదా న్యాయాధీశుని) పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది.

ఒకవేళ పరిపాలకుడు (లేక న్యాయాధికారి) దేవుడు అవతరింపజేసిన షరీయత్ ప్రకారం తీర్పు ఇవ్వవలసిన అవసరం లేదని భావిస్తే, ఈ విషయంలో తాను సర్వ స్వతంత్రుణ్ణి అని అతను నమ్మితే, లేదా అతను దైవ శాసనాన్ని కించపరిస్తే లేదా దైవ సమ్మతమయిన శాసనాంగం కన్నా స్వయం కల్పిత చట్టాలు మంచివని అతను అనుకుంటే, లేదా షరీయత్ చట్టాలు ఈ కలికాలానికి సరిపోవు అని భావిస్తే లేదా స్వయంకల్పిత శాసనాలను అమలుపరచి అన్యుల మెప్పు పొందాలన్నది అతని మనోగతమై ఉంటే – వీటిలో ప్రతి ఒక్కటీ కుఫ్రె అక్బర్ (పెద్ద తరహా అవిశ్వాసం) క్రిందికి వస్తుంది.

ఒకవేళ అతను దైవశాసనానుసారం తీర్పు చేయటం తప్పనిసరి అన్న సంగతి తెలిసి ఉండి కూడా, దాని ప్రకారం తీర్పు ఇవ్వకపోతే, తానలా చేయటం తప్పేనని ఒప్పుకుంటే, అందుకుగాను దైవసన్నిధిలో శిక్షార్హుణ్ణి అని అతను భావిస్తున్నట్లయితే – అట్టి పాలనాధికారి పాపాత్ముడుగా, తేలికపాటి కుఫ్ర్‌కు పాల్పడినవాడుగా పరిగణించ బడతాడు.

ఒకవేళ అతను ఏదేని వివాదానికి సంబంధించి షరీయత్ ఆజ్ఞ ఏమిటో తెలుసుకోవటానికి శాయశక్తులా కృషి చేసినప్పటికీ దైవాదేశమేమిటో గ్రహించలేక తీర్పులో పొరపాటు చేసినట్లయితే పొరబడిన వాడుగా పరిగణించబడతాడు. అతని ఇజ్తెహాద్ (షరీయత్ సూత్రాన్వేషణా కృషి)కి గాను ఒకింత పుణ్యఫలం కూడా ప్రాప్తిస్తుంది. మరోవైపు అతని పొరపాటు కూడా మన్నింపుకు నోచుకుంటుంది. (షరహత్తుహావియ : పేజీ – 363, 364)

ఈ ఆజ్ఞ ఏదేని ప్రత్యేక వ్యవహారంలో ఇవ్వబడే తీర్పుకు సంబంధించినది.

అయితే సర్వసాధారణ కేసులకు సంబంధించిన తీర్పుల విషయం వేరు. ఈ నేపథ్యంలో షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (رحمه الله) ఇలా అంటున్నారు :

ఒకవేళ పాలకుడు ధార్మికుడు, షరీయత్‌కు బద్ధుడై ఉండి కూడా జ్ఞానంతో నిమిత్తం లేకుండా తీర్పు ఇస్తే అతను నరకవాసియే. ఒకవేళ పాలకుడు షరీయత్ పరిజ్ఞానం కలవాడై ఉండీ సత్యానికి వ్యతిరేకంగా తీర్పు ఇస్తే అతను కూడా నరకవాసియే. ఒకవేళ జ్ఞానంతో నిమిత్తం లేకుండా, న్యాయాన్యాయాలను కూడా చూడకుండా తీర్పు ఇస్తే అతను ప్రథమ శ్రేణి నరకవాసి అవుతాడు. ఇది ఒకరి వ్యక్తిగత విషయంలో అతను చేసిన న్యాయనిర్ణయానికి సంబంధించిన పరిస్థితి.

కాని అతను గనక ముస్లింల ధార్మిక వ్యవహారంలో సత్యాన్ని అసత్యంగా, అసత్యాన్ని సత్యంగా ఖరారు చేసే సర్వసామాన్యమయిన తీర్పు ఇస్తే, సున్నత్‌ను బిద్అత్‌గా బిద్అత్‌ను సున్నత్‌గా నిర్ధారిస్తే, మంచిని చెడుగా, చెడును మంచిగా ఖరారు చేసినట్లయితే, దైవం మరియు దైవప్రవక్త (ﷺ) చేయమని చెప్పినదానిని నిరోధిస్తే, దైవం మరియు దైవప్రవక్త (ﷺ) నిషేధించిన వాటిని చేయాలని ఆజ్ఞాపిస్తే – ఇక దాని గురించి చెప్పాల్సిందేముంటుంది? ఆ వ్యవహారం గురించి లోకేశ్వరుడు, ప్రవక్తలందరి ఆరాధ్యుడు, తీర్పుదినపు యజమాని అయిన అల్లాహ్‌యే సరైన నిర్ణయం గైకొనగలడు. ఇహపరాలలో సకల స్తోత్రాలు ఆయనకే శోభిస్తాయి.

﴿لَهُ الْحُكْمُ وَإِلَيْهِ تُرْجَعُونَ﴾ (القصص:٨٨)

**“ఆజ్ఞాపించే అధికారం ఆయనకే చెల్లు. మీరంతా ఆయన వైపునకే మరలించబడతారు.” (అల్ ఖసస్ : 88)**

﴿هُوَ الَّذِي أَرْسَلَ رَسُولَهُ بِالْهُدَى وَدِينِ الْحَقِّ لِيُظْهِرَهُ عَلَى الدِّينِ كُلِّهِ وَكَفَى بِاللَّهِ شَهِيدًا﴾ (الفتح:٢٨)

**తన ప్రవక్తకు మార్గదర్శకత్వాన్నీ, సత్యధర్మాన్ని ఇచ్చి దాన్ని ఇతర ధర్మాలన్నింటిపై పైచేయిగా ఉండేలా చేయటానికి పంపినవాడు ఆయనే. సాక్షిగా అల్లాహ్‌యే చాలు.” (అల్ ఫత్హ్ : 28)**

షేఖుల్ ఇస్లాం (رحمه الله) ఇంకా ఇలా అంటున్నారు : “అల్లాహ్ తన ప్రవక్తపై అవతరింపజేసిన షరీయత్‌కు అనుగుణంగా తీర్పు ఇవ్వటం అవశ్యం అన్న విషయంపై



ఎవరికి విశ్వాసం లేదో అతను ఖచ్చితంగా అవిశ్వాసే. కాబట్టి ఏ వ్యక్తయితే అల్లాహ్ అవతరింపజేసిన ఆదేశాన్ని అనుసరించకుండా తన స్వంత అభిప్రాయాన్నిబట్టి ఒకానొక విషయాన్ని న్యాయమని భావించి, తదనుగుణంగా తీర్పు ఇవ్వటం సమ్మతమని అనుకుంటాడో అతను విశ్వాసి కాడు. అతను కాఫిర్. ఎందుకంటే ప్రతి జాతిలో, ప్రతి సముదాయంలో న్యాయసమ్మతమైన తీర్పు ఇవ్వాలన్న ఆదేశమే ఇవ్వబడుతుంది. ఒక్కోసారి మతపెద్దలు, ప్రముఖులు న్యాయమని భావించినదే ఆ మత ధర్మంలో న్యాయంగా పరిగణించబడుతుంది. ఇంకా చెప్పాలంటే; చాలామంది తమ ఆచార సంప్రదాయాల కనుగుణంగా తీర్పు ఇచ్చి, దానిని ఇస్లాంకు ఆపాదిస్తూ ఉంటారు. చూడబోతే వాటికి సంబంధించి దేవుని తరఫున ఏ సూచనా వచ్చి ఉండదు. ఉదాహరణకు : పల్లెటూళ్ళలో ఉండే ప్రాచీన ఆచార సంప్రదాయాలు. అక్కడి పెద్దలు చెట్టుక్రిందనో, రచ్చబండపైనో కూర్చుని అనుశాసనపర్వం నడిపేవారు. వారి మాటలు చట్టంగా చెల్లుబాటవుతుండేవి. దైవగ్రంథాన్ని, దైవప్రవక్త (ﷺ) సంప్రదాయాన్ని కాదని తమ పద్ధతుల ప్రకారం తీర్పు ఇవ్వటమే సరైనదని వారు తలపోసేవారు. వాస్తవానికి ఇది పచ్చి అవిశ్వాసం (కుఫ్ర్). యదార్థమేమిటంటే చాలామంది (గ్రామీణులు) ఇస్లాంలో ప్రవేశించినప్పటికీ, వారు తమ పాలనాధికారుల చేత కల్పించబడిన ఆచారాల ప్రకారం తీర్పులు ఇచ్చేవారు. విచిత్రమేమిటంటే, దేవుడు పంపిన శాసనాంగం ప్రకారమే న్యాయ నిర్ణయాలు గైకొనాలని తెలిసిన మీదట కూడా వారు దీనికి కట్టుబడలేదు సరికదా, దైవ సమ్మతమయిన షరీయత్‌కు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వటమే సముచితమని ధీమా వ్యక్తం చేశారు. ఇలాంటి వారంతా అవిశ్వాసులే (కుఫ్ఫార్) అన్నది నిర్వివాదాంశం :” (మిన్‌హాజుల్ సున్నతున్నబవియ్య)

షేఖ్ ముహమ్మద్ బిన్ ఇబ్రాహీమ్ (رحمه الله) ఇలా అంటున్నారు : “తన వివాదాన్ని దైవేతరుని వద్దకు తీసుకుపోవటం పాపం అని, దైవాదేశం ప్రకారం జరిగే తీర్పే సరైన తీర్పు అని తెలిసి కూడా మనిషి ఆ పని చేస్తే అతను చిన్న తరహా కుఫ్ర్‌కు (అవిశ్వాసానికి) ఒడిగట్టిన వాడవుతాడు. అయితే జీవితంలో ఒకట్రొండుసార్లు ఇలా చేసిన వారికే ఈ సూత్రం వర్తిస్తుంది. కాని ఒక పద్ధతి ప్రకారం చట్టాలను తయారు చేసుకుని, వాటిని తమ స్వప్రయోజనాల కనుగుణంగా వాడుకుని, తమవల్ల పొరపాటు జరిగిపోయిందని అరిగిపోయిన రికార్డులా రిపీట్ చేసేవారికి ఇది ఎంతమాత్రం వర్తించదు. ఈ ధోరణి ముమ్మాటికీ కుఫ్ర్ (అవిశ్వాసం) క్రిందికే వస్తుంది. ఇది వారిని మిల్లత్ (ముస్లిం సమాజం) నుండి గెంటేస్తుంది.” (ఫతావా షేఖ్ ముహమ్మద్ బిన్ ఇబ్రాహీమ్ ఆలెషేఖ్ : 12/280)

ఎవరయినా ఇస్లామీయ షరీయత్ ప్రకారం నడుస్తూనే స్వయం కల్పిత చట్టాలను షరీయత్‌కు ప్రత్యామ్నాయంగా ఖరారుచేస్తే, ఆ వ్యక్తి స్వయం కల్పిత చట్టాలను షరీయత్ శాసనాలకన్నా మెరుగైనవిగా భావిస్తున్నాడనటానికి అది తార్కాణమన్నమాట! ఈ ధోరణి ‘కుఫ్రె అక్బర్’ అనటంలో సందేహానికి తావే లేదు. ఇది తౌహీద్‌కు విరుద్ధం. ఇది మిల్లత్ నుండి బహిష్కరించే పోకడ.

## ఏడవ ప్రకరణం

# షరీయత్ నిర్మాణం – ధర్మాధర్మాల నిర్ధారణ దేవుని హక్కు

ఏ ఆదేశాలు, చట్టాల ప్రకారం దాసులు తమ ఆరాధనా విధానాలకు కట్టుబడి ఉంటారో, తమ జీవన వ్యవహారాలన్నింటినీ చక్క దిద్దుకుంటారో, ఏ శాసనాల ప్రకారం వారు తమ వివాదాలను పరిష్కరించుకుంటారో – వాటిని క్రోడీకరించే హక్కు, అధికారం మానవులందరి ప్రభువుకు, సృష్టికర్తకు మాత్రమే ఉంది.

﴿أَلَا لَهُ الْخَلْقُ وَالْأَمْرُ تَبَارَكَ اللَّهُ رَبُّ الْعَالَمِينَ﴾ (الأعراف:٥٤)

**వినండి! సృష్టించటం, ఆజ్ఞాపించటం ఆయనకే ప్రత్యేకం. సకల లోకాల ప్రభువైన అల్లాహ్ అపారమైన శుభాలు కలవాడు. (అల్ ఆరాఫ్ : 54)**

తన దాసుల కొరకు ఏది ఉపయుక్తమో, ఏది లాభదాయకమో అల్లాహ్‌కే బాగా తెలుసు. అందుకే వాటికి కట్టుబడి ఉండవలసిందిగా ఆయన ఆజ్ఞాపిస్తాడు. ఆయన వారికి ప్రభువైనందువల్ల వారి కొరకు శాసనాలను చేస్తాడు. మనుషులు ఆయన దాసులైన కారణంగా ఆయన ఆదేశాలను శిరసావహిస్తారు. వాటికి సంబంధించిన లాభం కూడా వారికే ఇవ్వబడుతుంది. అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు :

﴿فَإِن تَنَازَعْتُمْ فِي شَيْءٍ فَرُدُّوهُ إِلَى اللَّهِ وَالرَّسُولِ إِن كُنتُمْ تُؤْمِنُونَ بِاللَّهِ وَالْيَوْمِ الْآخِرِ ذَٰلِكَ خَيْرٌ وَأَحْسَنُ تَأْوِيلًا﴾ (النساء:٥٩)

**"ఒకవేళ ఏ విషయంలోనయినా మీ మధ్య వివాదం తలెత్తితే దానిని అల్లాహ్ మరియు ప్రవక్త వైపునకు మరల్చండి – మీకు నిజంగానే అల్లాహ్‌పై, అంతిమదినంపై నమ్మకం ఉన్నట్లయితే (మీరిలా చేయటం అనివార్యం). ఇదే మేలైన పద్ధతి. పరిణామం రీత్యా కూడా ఇదే అన్నింటికంటే ఉత్తమమైనది." (అన్ నిసా : 59)**

ఇంకా ఈ విధంగా సెలవిచ్చాడు :

﴿وَمَا اخْتَلَفْتُمْ فِيهِ مِن شَيْءٍ فَحُكْمُهُ إِلَى اللَّهِ ذَٰلِكُمُ اللَّهُ رَبِّي﴾ (الشورىٰ:١٠)

**"ఏ ఏ విషయంలో మీరు విభేదించారో, దానికి సంబంధించిన తీర్పు అల్లాహ్‌కే అప్పగించబడుతుంది. ఈ అల్లాహ్‌యే నా ప్రభువు." (అష్ షూరా : 10)**

మనిషి అల్లాహ్‌ను కాదని వేరొకరిని శాసనకర్తగా చేసుకోవటాన్ని సృష్టికర్త చాలా తీవ్రంగా ఖండించాడు. అందుకే ఆయన ఇలా అంటున్నాడు :



﴿أَمْ لَهُمْ شُرَكَاءُ شَرَعُوا لَهُم مِّنَ الدِّينِ مَا لَمْ يَأْذَن بِهِ اللَّهُ﴾ (الشورىٰ:٢١)

**"ఏమిటీ, అల్లాహ్ ఆజ్ఞతో నిమిత్తం లేకుండానే తమ కోసం ఏవయినా ధర్మాదేశాలను నిర్ధారించే (అల్లాహ్) భాగస్థులను గాని వారు కలిగి ఉన్నారా?" (అష్ షూరా : 21)**

కాబట్టి – అల్లాహ్ శాసనాంగాన్ని గాకుండా ఇతరత్రా శాసనాంగాలను ఆశ్రయించినవాడు అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించాడు. దైవం మరియు దైవప్రవక్త (ﷺ) విధించని ఆరాధనలు బిద్అత్ (క్రొత్త పుంతలు) అవుతాయి. ప్రతి బిద్అత్ (కొంగ్రొత్త పోకడ) మార్గవిహీనతకు నిదర్శనం. ఈ పూర్వరంగంలో దైవప్రవక్త (ﷺ) ఏమన్నారో చూడండి –

"مَنْ أَحْدَثَ فِي أَمْرِنَا هٰذَا مَالَيْسَ مِنْهُ فَهُوَ رَدٌّ" (بخاری ومسلم)

**"ఎవడయినా మా ఈ ధర్మం విషయంలో దీనికి సంబంధించని కొత్త విషయమేదైనా ఆవిష్కరిస్తే అది త్రోసిపుచ్చబడుతుంది." (బుఖారీ, ముస్లిం)**

మరో ఉల్లేఖనంలో ఇలా ఉంది –

"مَنْ عَمِلَ عَمَلًا لَيْسَ عَلَيْهِ أَمْرُنَا فَهُوَ رَدٌّ" (مسلم)

**"ఎవడయినా మేము ఆజ్ఞాపించని దానిని ఆచరిస్తే అది రద్దు చేయదగినది." (ముస్లిం)**

రాజకీయ వ్యవహారంలోగానీ, ప్రజల వివాదాస్పద విషయాలలో గానీ, పరిపాలనకు సంబంధించిగానీ దైవం మరియు దైవప్రవక్త (ﷺ) ఆదేశాలను గాకుండా ఇతరత్రా చట్టాలను అనుసరిస్తే అది అజ్ఞానంతో కూడిన తీర్పు అవుతుంది :

﴿أَفَحُكْمَ الْجَاهِلِيَّةِ يَبْغُونَ وَمَنْ أَحْسَنُ مِنَ اللَّهِ حُكْمًا لِّقَوْمٍ يُوقِنُونَ﴾ (المائدة:٥٠)

**ఏమిటీ, వారు మళ్లీ అజ్ఞాన (కాల)పు తీర్పును కోరుతున్నారా? నమ్మకం గల వారి కోసం అల్లాహ్‌కన్నా ఉత్తమ తీర్పు ఇవ్వగల వాడెవడుంటాడు?" (అల్ మాయిదా : 50)**

అలాగే –

ఏదేని విషయాన్ని ధర్మం (హలాల్)గానో, అధర్మం (హరామ్) గానో నిర్ణయించే అధికారం అల్లాహ్‌కే ఉంది. ఈ వ్యవహారంలో అల్లాహ్‌కు భాగస్వామి అవటం ఎవరికీ ధర్మసమ్మతం కాదు. సెలవీయబడింది :

﴿وَلَا تَأْكُلُوا مِمَّا لَمْ يُذْكَرِ اسْمُ اللَّهِ عَلَيْهِ وَإِنَّهُ لَفِسْقٌ وَإِنَّ الشَّيَاطِينَ لَيُوحُونَ إِلَىٰ أَوْلِيَائِهِمْ لِيُجَادِلُوكُمْ وَإِنْ أَطَعْتُمُوهُمْ إِنَّكُمْ لَمُشْرِكُونَ﴾ (الانعام:١٢١)

**అల్లాహ్ పేరు స్మరించబడని జంతువులను తినకండి. ఎందుకంటే ఇది ఆజ్ఞోల్లంఘన క్రిందికి వస్తుంది. మీతో వాదులాడటానికి షైతానులు తమ మిత్రులను ఉసిగొల్పుతుంటారు. ఒకవేళ మీరు గనక వారిని అనుసరించారంటే మీరు కూడా అల్లాహ్‌కు సహవర్తుల్ని కల్పించినవారు (ముష్రిక్కులు) అయిపోతారు (జాగ్రత్త)!"**
**(అల్ అన్ ఆమ్ : 121)**

పైన పేర్కొనబడిన దివ్య సూక్తిలో అల్లాహ్ తాను అధర్మంగా నిర్ధారించిన విషయాలను ధర్మసమ్మతంగా చేసుకోవటంలో షైతానులను, వారి స్నేహితులను అనుసరించటాన్ని బహిరంగమైన షిర్క్‌గా ఖరారు చేశాడు. అలాగే దేవుడు హలాల్‌గా చేసిన వాటిని హరామ్‌గా, దేవుడు హరామ్‌గా పేర్కొన్నవాటిని హలాల్‌గా చేసుకునే విషయంలో తమ పండితులను, మతాచార్యులను, పరిపాలకులను అనుసరించేవారిని, వారినే తమ ప్రభువులుగా భావించేవారిని గురించి అల్లాహ్ ఏమన్నాడో గమనించండి :

﴿اتَّخَذُوا أَحْبَارَهُمْ وَرُهْبَانَهُمْ أَرْبَاباً مِّن دُونِ اللّهِ وَالْمَسِيحَ ابْنَ مَرْيَمَ وَمَا أُمِرُوا إِلاَّ لِيَعْبُدُوا إِلَـهاً وَاحِداً لاَّ إِلَـهَ إِلاَّ هُوَ سُبْحَانَهُ عَمَّا يُشْرِكُونَ﴾ (التوبة:٣١)

**"వారు అల్లాహ్‌ను వదలి తమ పండితు (అహ్‌బార్)లను, సన్యాసు (రుహ్‌బాన్)లను తమ ప్రభువులుగా చేసుకున్నారు.-మర్యమ్ కుమారుడైన మసీహ్‌గా కూడా. నిజానికి వారికి, ఒక్కడైన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించవలసిందిగా ఆజ్ఞాపించబడింది. ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేదు. వారు నిర్ధారించుకున్న భాగస్వామ్యాలకు ఆయన అతీతుడు, పవిత్రుడు." (అత్ తౌబా : 31)**

హదీసులో వచ్చిన దాని ప్రకారం దైవప్రవక్త (ﷺ) పూర్వాశ్రమంలో క్రైస్తవునిగా ఉన్న అదీ బిన్ హాతిమ్ (رضي الله عنه) ముందు ఈ సూక్తిని చదివి వినిపించినపుడు, 'దైవప్రవక్తా! మేము వారిని (పండితులను, సన్యాసులను) ఆరాధించలేదు కదా!' అని సందేహం వ్యక్తం చేశారు. దానికి దైవప్రవక్త (ﷺ), "అల్లాహ్ హరామ్‌గా చేసిన (నిషేధించిన) వాటిని, వారు హలాల్ (ధర్మసమ్మతం)గా ఖరారు చేస్తే, దానిని మీరు శిరసావహించారు. అల్లాహ్ హలాల్ (ధర్మసమ్మతం) గా చేసినవాటిని వారు హరామ్ (నిషిద్ధం)గా ఖరారు చేస్తే, మీరు దానిని శిరసావహించారు. అవునా!?" అని ప్రశ్నించగా, 'అవును. ఈ విషయం నిజమే' అని అదీ బిన్ హాతిమ్ ధ్రువీకరించారు. అప్పుడు దైవప్రవక్త (ﷺ), "వారిని ఆరాధించటం అంటే ఇదే" అన్నారు. (తిర్మిజీ, ఇబ్నె జరీర్ మొదలగునవి)

అంటే –

ధర్మాధర్మాల (హలాల్ – హరామ్‌ల) నిర్ధారణ విషయంలో అల్లాహ్‌ను వదలి వారిని (పండితులను, మతాచార్యులను) అనుసరించటం కూడా ఒక విధంగా వారి ఆరాధనగానే, షిర్క్‌గానే ఖరారు చేయబడింది. ఇది షిర్కె అక్బర్ (పెద్ద షిర్క్). ఇది దేవుని



ఏకత్వానికి పూర్తిగా వ్యతిరేకం. 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అనే సద్వచనానికి వ్యాఘాతంగా పరిణమించే చర్య. ఎందుకంటే ధర్మాధర్మాలను నిర్ణయించే హక్కు, అధికారం కేవలం అల్లాహ్‌కు మాత్రమే ఉందన్న భావం ఈ 'కలిమా'లో అంతర్లీనమై ఉంది.

ధర్మాధర్మాల నిర్ధారణ విషయంలో షరీయత్‌కు విరుద్ధంగా ప్రవర్తించిన పండితులను, మతాచార్యులను అనుసరించటమే షిర్క్‌కు తార్కాణంగా పరిణమించినపుడు, షరీయత్‌కు వ్యతిరేకంగా అవిశ్వాసులు, నాస్తికులు క్రోడీకరించిన చట్టాలను సంగ్రహించిన పరిపాలకుల అడుగులకు మడుగులొత్తటం, వాటిని ముస్లిం దేశాలలో ప్రవేశపెట్టడం ఇంకెంత తీవ్రమైన విషయమో ఆలోచించండి!

فَلَا حَوْلَ وَلَا قُوَّةَ إِلَّا بِاللّٰهِ

**ఫలా హవ్‌ల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్**

వారైతే అల్లాహ్‌కు బదులు అవిశ్వాసులనే తమ 'ప్రభువులు'గా చేసుకున్నారు. వారు వీరి కోసం ఆదేశాలను, శాసనాలను క్రోడీకరిస్తారు. వారి కోసం అధర్మాన్ని ధర్మంగా ఖరారు చేస్తారు. మనుషుల మధ్య తమవైన శాసనాల ప్రకారం తీర్పులు ఇస్తారు.

## ఎనిమిదవ ప్రకరణం

# అధర్మ శక్తులతో, మూర్ఖులతో చేరటం

(1) మత రాహిత్య ఉద్యమాలలో, ఉదాహరణకు : కమ్యూనిజం, సెక్యులరిజం, పెట్టుబడిదారీ వ్యవస్థ తదితర విధానాలతో జతకట్టడం కూడా ఇస్లాం ధర్మం నుండి తిరిగిపోవటం వంటిదే. ఈ రకమయిన ఉద్యమాలలో చేరిన వ్యక్తి, తాను ఇస్లాం అనుయాయినని అంటే అది కాపట్యంతో కూడిన మాటే. ఎందుకంటే కపటులు (మునాఫిక్‌లు) పైకి ఇస్లాంతో తమ సంబంధాన్ని ప్రకటించినప్పటికీ లోపలి నుండి అవిశ్వాసులతో కలిసి ఉంటారు. వారి ద్వంద్వ ప్రవృత్తిని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَإِذَا لَقُوا الَّذِينَ آمَنُوا قَالُوا آمَنَّا وَإِذَا خَلَوْا إِلَى شَيَاطِينِهِمْ قَالُوا إِنَّا مَعَكُمْ إِنَّمَا نَحْنُ مُسْتَهْزِءُونَ﴾ (البقرة:١٤)

**వారు విశ్వాసులను కలుసుకున్నప్పుడు, "మేమూ విశ్వసించామండీ" అనంటారు. కాని తమ పెద్దల వద్దకు పోయినప్పుడు, "మేము మీతోనే ఉన్నాము. కాకపోతే వాళ్ళతో పరిహాసమాడుతున్నామంతే" అని చెబుతారు. (అల్ బఖర : 14)**

వేరొకచోట ఇలా సెలవిచ్చాడు :

﴿الَّذِينَ يَتَرَبَّصُونَ بِكُمْ فَإِن كَانَ لَكُمْ فَتْحٌ مِّنَ اللَّهِ قَالُوا أَلَمْ نَكُن مَّعَكُمْ وَإِن كَانَ لِلْكَافِرِينَ نَصِيبٌ قَالُوا أَلَمْ نَسْتَحْوِذْ عَلَيْكُمْ وَنَمْنَعْكُم مِّنَ الْمُؤْمِنِينَ﴾ (النساء:١٤١)

**వారు (ఈ కపటులు) మీకు ఏ గతి పడుతుందోనని ఎదురు చూస్తూ ఉంటారు. ఒకవేళ అల్లాహ్ తరఫు నుండి మీకు విజయం చేకూరితే, "మేము మీతో లేమా?" అని అంటారు. ఒకవేళ అవిశ్వాసులకు కాస్తంత ఆధిక్యత లభిస్తే, "మీకు వ్యతిరేకంగా పోరాడే శక్తి మాకు లేదా? (అయినా సరే) మేము ముస్లింల బారి నుండి మిమ్మల్ని రక్షించ లేదా?" అని వారితో అంటారు. (అన్ నిసా : 141)**

మోసగాళ్ళయిన ఈ వంచకులు ద్వంద్వ స్వభావం కలవారై ఉంటారు. వారు ముస్లింల ముందు ఒక మాటంటే, తమ నాస్తిక సోదరుల ముందు మరో మాటంటారు. పైకి ఒక మాటంటే మనసులో ఒక మాట ఉంటుంది.

﴿وَإِذَا لَقُوا الَّذِينَ آمَنُوا قَالُوا آمَنَّا وَإِذَا خَلَوْا إِلَى شَيَاطِينِهِمْ قَالُوا إِنَّا مَعَكُمْ إِنَّمَا نَحْنُ مُسْتَهْزِءُونَ﴾ (البقرة:١٤)



**వారు విశ్వాసులను కలుసుకున్నప్పుడు, "మేమూ విశ్వసించిన వారమే" అంటారు. కాని తమ పెద్దల (నాయకుల) వద్దకు పోయినప్పుడు, "అసలు మేము మీతోనే ఉన్నామండీ. కాకపోతే వారిని ఆటపట్టిస్తున్నామంతే" అని అంటారు. (అల్ బఖర : 14)**

వీరు ఖుర్ఆన్ హదీసులు కలిగి ఉన్న వారిని పరిహసిస్తూ తమ వద్ద ఉన్న విద్యలపై సంతోషిస్తూ ఉంటారు. ఆ విద్యల ద్వారా వారిలో అహంకారం, చెడు పెరగటం తప్ప వారికి మరే ప్రయోజనం చేకూరదు. అందుకే వారు నిత్యం ధర్మావలంబీకుల్ని వేళాకోళం చేయటమే తమ కర్తవ్యంగా చేస్తుంటారు. అందుకే

﴿اللَّهُ يَسْتَهْزِئُ بِهِمْ وَيَمُدُّهُمْ فِي طُغْيَانِهِمْ يَعْمَهُونَ﴾ (البقرة:١٥)

**"అల్లాహ్ కూడా వారితో పరిహాసమాడుతున్నాడు. వారి తలబిరుసు తనాన్ని మరింత అధికం చేస్తున్నాడు. ఫలితంగా వారు అంధులై గమ్య రహితంగా తిరుగుతున్నారు." (అల్ బఖర : 15)**

సిఫాతుల్ మునాఫిఖీన్ లి ఇబ్నుల్ ఖయ్యిమ్ : పేజీ 19)

యదార్థానికి అల్లాహ్ విశ్వాసులతో కలిసి ఉండమని ఆజ్ఞాపించాడు :

﴿يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا اتَّقُوا اللَّهَ وَكُونُوا مَعَ الصَّادِقِينَ﴾ (التوبة:١١٩)

**"ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు భయపడండి. సత్యవంతుల వెంట ఉండండి." (అత్ తౌబా : 119)**

ఈ ధర్మరాహిత్య ఉద్యమాలన్నీ పరస్పరం చేదోడు వాదోడుగా ఉంటాయి. ఎందుకంటే వాటికి సత్యప్రాతిపదిక లేదు. కమ్యూనిజాన్నే తీసుకోండి. అది దేవుడూ గీవుడూ లేదు పొమ్మని అంటుంది. దైవగ్రంథాలున్న మతాలన్నింటిపై అది యుద్ధ ప్రకటన చేస్తుంది. అలాంటప్పుడు ఏ వ్యక్తయితే అవిశ్వాసంతో కూడిన జీవిత విధానాన్ని అవలంబించాలని నిశ్చయించుకుంటాడో అతను తన అంతరాత్మ ప్రబోధాన్ని తుంగలో తొక్కేశాడు. సెక్యులరిజం కూడా అంతే. అది కూడా మత ప్రమేయంలేని సిద్ధాంతమే. అది కేవలం భౌతికవాదంపై విశ్వాసం చూపుతుంది. దానికొక మార్గదర్శి అనేది ఉండదు. పశువుల్లా జీవించటం తప్ప దాని దృష్టిలో మానవ జీవితానికి ఒక అర్థంపర్థం లేదు. ఇక పెట్టుబడిదారీ వ్యవస్థ విషయానికివస్తే అది ఎంతసేపటికీ 'ధనమూల మిదం జగత్' అని అంటుంది. ధనం ఏ విధంగా సంపాదించాలనేది దాని దృష్టిలో ముఖ్యం కాదు, ధనం ప్రోగుచేయాలనేదే ప్రధానం. ఆ ఆర్థిక వ్యవస్థ అంతా 'వడ్డీ'పై ఆధారపడి ఉంటుంది. చూడబోతే అది దైవంపై, దైవప్రవక్త (ﷺ)పై తిరుగుబాటు చేయటం వంటిదే. పైగా అది వ్యక్తులను, జాతులను దివాలా తీయిస్తుంది. దాని (వడ్డీ) ద్వారా నిరుపేదల, శ్రామికుల రక్తం పీల్చబడుతుంది. అలాంటప్పుడు ఏ బుద్ధిమంతుడైనా ఈ ముదనష్టపు వ్యవస్థను

మనస్ఫూర్తిగా ఎలా తన జీవిత లక్ష్యంగా చేసుకోగలడు? ఆవగింజంత విశ్వాసం (ఈమాన్) ఉన్నవాడు కూడా ఈ పని చేయడు. ముస్లిం రాజ్యాలలో చాలామంది ప్రజలు సత్యధర్మానికి దూరమై, మార్గవిహీనత పొడసూపి, అన్యుల పెత్తనానికి లోబడిన కాలంలోనే ఈ నాస్తిక, మిథ్యా ఉద్యమాలు, ఆధిభౌతిక సిద్ధాంతాలు జొరబడ్డాయి.

(2) అజ్ఞాన సముదాయాలతో, వంశం ఆధారంగా పుట్టుకొచ్చిన జాతీయతలతో సంబంధ బాంధవ్యాలు పెంచుకోవటం కూడా ఇస్లాం ధర్మానికి చేటును కొనితెచ్చుకోవటమే. ఇది కూడా ఒకవిధంగా అవిశ్వాసంతో కూడిన పోకడే. ఎందుకంటే ఇస్లాం అన్ని రకాల దురభిమానాలను, వివక్షతో కూడిన నినాదాలను ఖండిస్తుంది. ఈ నేపథ్యంలో విశ్వప్రభువు ఇలా సెలవిచ్చాడు :

﴿يَا أَيُّهَا النَّاسُ إِنَّا خَلَقْنَاكُم مِّن ذَكَرٍ وَأُنثَى وَجَعَلْنَاكُمْ شُعُوباً وَقَبَائِلَ لِتَعَارَفُوا إِنَّ أَكْرَمَكُمْ عِندَ اللَّهِ أَتْقَاكُمْ﴾ (الحجرات:١٣)

**మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుడు, ఒకే స్త్రీ ద్వారా సృష్టించాము. మరి మీ (పరస్పర) పరిచయం కోసం మిమ్మల్ని వివిధ వర్గాలుగా, తెగలుగా చేశాము. యదార్థానికి మీలో అందరికన్నా ఎక్కువగా భయభక్తులు గలవాడే అల్లాహ్ సమక్షంలో ఎక్కువగా ఆదరణీయుడు. (అల్ హుజురాత్ : 13)**

మహనీయ ముహమ్మద్ (ﷺ) ఇలా ఉపదేశించారు :

”لَيْسَ مِنَّا مَنْ دَعَا إِلَىٰ عَصَبِيَّةٍ، وَلَيْسَ مِنَّا مَنْ قَاتَلَ عَلَىٰ عَصَبِيَّةٍ وَلَيْسَ مِنَّا مَنْ غَضِبَ لِعَصَبِيَّةٍ“ (مسلم)

**“దురభిమానం వైపు పిలిచేవాడు మా వాడు కాడు. దురభిమానం కోసం పోరాడేవాడు మా వాడు కాడు. దురభిమానం కోసం కోపగించుకునేవాడు మా వాడు కాడు.” (ముస్లిం)**

ఇంకా – ఆయన (సఅసం) ఇలా ఉపదేశించారు :

”إِنَّ اللَّهَ قَدْ أَذْهَبَ عَنْكُمْ عُبِّيَّةَ الْجَاهِلِيَّةِ وَفَخْرَهَا بِالآبَاءِ، إِنَّمَا هُوَ مُؤْمِنٌ تَقِيٌّ أَوْ فَاجِرٌ شَقِيٌّ، النَّاسُ بَنُو آدَمَ خُلِقَ مِنْ تُرَابٍ، وَلَا فَضْلَ لِعَرَبِيٍّ عَلَىٰ عَجَمِيٍّ إِلَّا بِالتَّقْوَىٰ“ (ترمذی:٣٢٧٠وغیره)

**“అల్లాహ్ మీలోని అజ్ఞాన కాలం నాటి అహంభావాలను, పూర్వీకుల గొప్పలు చెప్పుకుని గర్వాతిశయంతో విర్రవీగటాన్ని అంతమొందించాడు. ఇక ఇప్పుడు ధర్మపరాయణుడైన విశ్వాసి అన్నా ఉండాలి లేదా దౌర్భాగ్యుడైన అవిశ్వాసి అన్నా ఉండాలి. మనుషులంతా ఆదం**



**బిడ్డలే. ఆదం మట్టితో పుట్టించబడ్డారు. ఏ అరబ్బుకూ మరో అరబ్బేతర వ్యక్తిపై ఎలాంటి ప్రాధాన్యతా లేదు. ప్రాధాన్యతకు ఏదన్నా ప్రాతిపదిక అనేది ఉంటే అది దైవభీతి (తఖ్వా) మాత్రమే.” (తిర్మిజీ –3270 సహీహ్ మొదలగునవి)**

ఈ పార్టీలు, సైద్ధాంతిక వర్గాలు ముస్లిం సముదాయంలో అభిప్రాయ భేదాలను సృష్టించి, చీలికను తీసుకువస్తాయి. కాగా; కలసిమెలసి ఉండాలని, సత్కార్యాలలో, భక్తితో కూడిన పనులలో పరస్పరం సహకరించుకోవాలని అల్లాహ్ ఆజ్ఞాపిస్తున్నాడు. విభేదాలు సృష్టించి, అనైక్యతను పెంపొందించటాన్ని ఆయన వారిస్తున్నాడు.

﴿وَاعْتَصِمُواْ بِحَبْلِ اللّهِ جَمِيعاً وَلاَ تَفَرَّقُواْ وَاذْكُرُواْ نِعْمَتَ اللّهِ عَلَيْكُمْ إِذْ كُنتُمْ أَعْدَاء فَأَلَّفَ بَيْنَ قُلُوبِكُمْ فَأَصْبَحْتُم بِنِعْمَتِهِ إِخْوَاناً﴾ (آل عمران:١٠٣)

**“అందరూ కలిసి అల్లాహ్ త్రాడును గట్టిగా పట్టుకోండి. చీలిపోకండి. అల్లాహ్ మీపై కురిపించిన దయానుగ్రహాన్ని జ్ఞప్తికి తెచ్చుకోండి – అప్పుడు మీరు ఒండొకరికి శత్రువులుగా ఉండేవారు. ఆయన మీ హృదయాలలో పరస్పరం ప్రేమానురాగాలను సృజించాడు. దాంతో ఆయన అనుగ్రహం వల్ల మీరు పరస్పరం అన్నదమ్ములుగా మారారు.” (ఆలి ఇమ్రాన్ : 103)**

మనం ఒక ‘జమాఅత్’తో కలిసి ఉండాలని, అల్లాహ్ అభిలషిస్తున్నాడు. అది దేవుడు మెచ్చిన జమాఅత్ అయి ఉండాలి. కాని ముస్లిం జగతిపై ఐరోపా రాజకీయ, సాంస్కృతిక ఆధిపత్యం తరువాత అందులో (మళ్ళీ) వంశం, వర్ణం, జాతీయ పునాదులపై రాగద్వేషాలు, దురభిమానాలు పడగ విప్పాయి. దీనిని వారు ఒక అనివార్య అంశంగా అంగీకరించసాగారు. ఏ సంకుచిత, జాత్యహంకార భావాలను ఇస్లాం నిర్మూలించిందో పాశ్చాత్య సంస్కృతీ ప్రభావం వల్ల ముస్లింలు మళ్లీ వాటి వెనకే పరుగులు తీశారు. నిజానికి ఇస్లాం వాటిని అజ్ఞాన చేష్టలుగా అభివర్ణించింది. ఆ కాలాన్ని కూడా అజ్ఞానకాలంగా పేర్కొన్నది. వాస్తవానికి అల్లాహ్ ముస్లింలను ఆ అజ్ఞాన కుహరం నుండి వెలికి తీసి, వారికి మహోపకారం చేశాడు. ఈ మహోపకారానికి గాను కృతజ్ఞతలు తెలుపుకోమని కూడా ప్రోత్సహించాడు.

కాబట్టి మోమిన్ (విశ్వాసి) అయిన వ్యక్తి తన అజ్ఞాన కాలం నాటి పరిస్థితులను, సంఘటనలను ఇతరుల ముందు ప్రస్తావించినపుడు వాటిపట్ల తన అయిష్టతను, ఏవగింపును కూడా వ్యక్తపరచాలి. ఆ సంఘటనలను వింటున్నప్పుడు ఎదుటివారిలో రోమాలు నిక్కబొడుచుకునేట్లు చేయాలి. ఆలోచించండి! కారాగారంలో కఠిన శిక్షను అనుభవించిన ఒక వ్యక్తి జైలు నుండి విడుదల అయిన తరువాత, తన కారాగార వృత్తాంతాన్ని తెలుపుతున్నప్పుడు ఒళ్లు గగుర్పొడుస్తుందా? లేదా? తీవ్రమయిన వ్యాధికి

లోనై, మృత్యువుతో పోరాడిన మీదట ఆరోగ్యవంతుడైన ఒక వ్యక్తి తాను అనుభవించిన యాతనను తలచుకున్నప్పుడు శరీరం జలదరిస్తుందా? లేదా? ఇదీ అటువంటిదే. ఇస్లాం మాధుర్యాన్ని ఆస్వాదించిన వ్యక్తి పూర్వాశ్రమంలో తాను చేసిన అజ్ఞాన చేష్టలను తలచుకున్నప్పుడు అతని ఆంతర్యంలో నుండి దుఃఖం పెల్లుబకాలి. తద్వారా దైవం యెడల అతని మనసులో కృతజ్ఞతా భావం జనించాలి. ('రద్దతు వలా అబాబకర్ లహా' నుండి సంగ్రహణం – రచన : అబుల్ హసన్ అలి నద్వి)

ఈ ముఠాతత్వం దైవాగ్రహానికి ఆనవాలని గ్రహించాలి. తమ ధర్మం పట్ల వైముఖ్య ధోరణిని కనబరచి, ధర్మానికి దూరమయ్యే వారిపై దేవుడు ఆగ్రహిస్తాడు. ఉదాహరణకు ఈ సూక్తిని గమనించండి :

﴿قُلْ هُوَ الْقَادِرُ عَلَى أَن يَبْعَثَ عَلَيْكُمْ عَذَاباً مِّن فَوْقِكُمْ أَوْ مِن تَحْتِ أَرْجُلِكُمْ أَوْ يَلْبِسَكُمْ شِيَعاً وَيُذِيقَ بَعْضَكُم بَأْسَ بَعْضٍ﴾(الانعام:٦٥)

**(ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "మీపై నుండి గానీ, మీ పాదాల క్రింది నుండి గానీ మీపైకి శిక్షను తెచ్చే లేదా మిమ్మల్ని వర్గాలుగా విడగొట్టి ఒకరి తడాఖాను ఇంకొకరికి చూపించే శక్తి కూడా ఆయనే కలిగి ఉన్నాడు." (అల్ అన్ ఆమ్ : 65)**

ఈ నేపథ్యంలో మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు :

''وَمَا لَمْ تَحْكُمْ أَئِمَّتُهُمْ بِكِتَابِ اللهِ إِلَّا جَعَلَ اللهُ بَأْسَهُمْ بَيْنَهُمْ''(ابن ماجہ:٤٠١٩:حسن)

**"వారి నాయకులు దైవగ్రంథానుసారం తీర్పులు ఇవ్వటం మానుకున్నప్పుడు అల్లాహ్ వారిని పరస్పర ఘర్షణలకు లోను చేస్తాడు."**

**(ఇబ్నుమాజా–4019 హసన్)**

వర్గ దురభిమానం మూలంగా మనిషి ఇతరుల వద్ద ఉండే సత్యాన్ని స్వీకరించేందుకు నిరాకరిస్తాడు. యూదులు చేసింది కూడా అదే. వారి గురించి అల్లాహ్ ఏమన్నాడో చూడండి –

﴿وَإِذَا قِيلَ لَهُمْ آمِنُوا بِمَا أَنزَلَ اللَّهُ قَالُوا نُؤْمِنُ بِمَا أُنزِلَ عَلَيْنَا وَيَكْفُرُونَ بِمَا وَرَاءَهُ وَهُوَ الْحَقُّ مُصَدِّقاً لِّمَا مَعَهُمْ﴾(البقرة:٩١)

**"అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్ని విశ్వసించండి" అని వారితో అన్నప్పుడు, "మాపై అవతరింపజేయబడిన దానిని మేము విశ్వసిస్తున్నాం" అని వారు సమాధానమిస్తారు. దాని తరువాత వచ్చిన దానిని, అది సత్యమైనప్పటికీ, తమ వద్ద ఉన్న గ్రంథాన్ని అది ధ్రువీకరిస్తున్న ప్పటికీ వారు తిరస్కరిస్తారు." (అల్ బఖర : 91)**



అజ్ఞాన భూతం ఆవరించిన వారి పరిస్థితీ ఇంతే. వారు తమ తాతముత్తాతల ప్రేమలో పడి, దైవప్రవక్త (సఅసం) తెచ్చిన సత్యాన్ని తృణీకరించారు :

﴿وَإِذَا قِيلَ لَهُمُ اتَّبِعُوا مَا أَنزَلَ اللَّهُ قَالُوا بَلْ نَتَّبِعُ مَا أَلْفَيْنَا عَلَيْهِ آبَاءَنَا﴾(البقرة:١٧٠)

**"అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్ని అనుసరించండి" అని వారికి చెప్పినప్పుడల్లా, "మా తాతలు తండ్రులు అవలంబిస్తూ ఉండగా చూసిన పద్ధతినే మేము పాటిస్తాము" అని వారు సమాధానమిస్తారు.**

**(అల్ బఖర : 170)**

సమస్త మానవాళి కోసం ఇస్లాంను జీవన విధానంగా సమ్మతించి దేవుడు మహోపకారం చేశాడు. కాగా; అటువంటి ఇస్లాంను ఈ ముఠాల అనుంగు అనుచరులు తమ ముఠాలకు ప్రత్యామ్నాయంగా భావించుకుంటున్నారు.

## తొమ్మిదవ ప్రకరణం

# జీవితం యొక్క భౌతిక దృక్పథం, దాని చెడుగులు

జీవితానికి సంబంధించినంత వరకు రెండు దృక్పథాలున్నాయి. ఒకటి : భౌతిక దృక్పథం. రెండు : నిజమయిన దృక్పథం. ఈ రెండు దృక్పథాలలో ప్రతిదీ జీవితంపై తనదైన ముద్రవేస్తుంది.

### 1. భౌతిక దృక్పథం, దాని భావం :

భౌతిక దృక్పథం అంటే ఏమిటంటే మనిషి ఆలోచనలు, ప్రయత్నాలన్నీ ప్రాపంచిక లాభాలను, ఆనందాలను జుర్రుకోవటం వరకే పరిమితం అయి ఉంటాయి. కాబట్టి ఈ జీవితం తరువాత జరగబోయే దానిని గురించి మనిషి బొత్తిగా ఆలోచించడు. దానికోసం లేశమయినా కృషి చేయడు. అసలా విషయాన్నే పట్టించుకోడు. దేవుడు ఈ ప్రాపంచిక జీవితాన్ని పరలోక పంటగా ఖరారు చేశాడని, ఈ ప్రపంచం ఒక పరీక్షా స్థలమని, పరలోకంలో దీని ఫలితం వెలువడుతుందన్న సంగతి కూడా అతనికి తెలిసి ఉండదు. తన ప్రాపంచిక జీవితాన్ని సదాచరణకై వెచ్చించినవాడు రెండు లోకాలలో కూడా సఫలీకృతుడవుతాడని, తన ప్రాపంచిక జీవితాన్ని వృధా చేసినవాడు పారలౌకిక జీవితాన్ని కూడా నాశనం చేసుకున్నట్లేనని అతను గ్రహించడు :

﴿خَسِرَ الدُّنْيَا وَالْآخِرَةَ ذَٰلِكَ هُوَ الْخُسْرَانُ الْمُبِينُ﴾(الحج:١١)

**“అలాంటివారు ప్రాపంచికంగానూ, పారలౌకికంగానూ నష్టపో యారు. నిజానికి స్పష్టంగా నష్టపోవటం అంటే ఇదే.” (అల్ హజ్జ్ : 11)**

దేవుడు ఈ ప్రపంచాన్ని ఊరకే సృష్టించలేదు. దీని వెనుక ఓ గొప్ప లక్ష్యం ఉంది. ఆ మాటే ఇలా చెప్పబడింది :

﴿الَّذِي خَلَقَ الْمَوْتَ وَالْحَيَاةَ لِيَبْلُوَكُمْ أَيُّكُمْ أَحْسَنُ عَمَلًا﴾(الملك:٢)

**“మీలో మంచి పనులు చేసేవారెవరో పరీక్షించే నిమిత్తం ఆయన చావుబ్రతుకులను సృష్టించాడు.” (అల్ ముల్క్ : 2)**

ఇంకా ఇలా సెలవీయబడింది :

﴿إِنَّا جَعَلْنَا مَا عَلَى الْأَرْضِ زِينَةً لَّهَا لِنَبْلُوَهُمْ أَيُّهُمْ أَحْسَنُ عَمَلًا﴾(الكهف:٧)

**“జనులలో ఎవరు సదాచరణ చేస్తారో పరీక్షించే నిమిత్తం మేము భూమండలంలో ఉన్న దాన్నంతటినీ భూమికి శోభాయమానంగా చేశాము.” (అల్ కహఫ్ : 7)**

దేవుడు ఈ ప్రాపంచిక జీవితం కొరకు లెక్కకు మించిన సౌఖ్యసామగ్రిని



సమకూర్చాడు. ఉదాహరణకు – సిరిసంపదలు, సంతానం, అధికారం, హోదాలు, రాజరికం, మనసును రంజింపజేసే అందమైన వస్తువులు, మనకు తెలియని ఇంకా ఎన్నో వస్తువులు ఉన్నాయి.

అందువల్ల కొందరి దృష్టి – మెజారిటీ సంఖ్య ఇలాంటివారిదే – కేవలం వస్తువుల బాహ్య సౌందర్యంపై, ఆకర్షణలపైనే నిలిచిపోయింది. వాటిని వారు తనివితీరా ఆస్వాదించటంలో లీనమైపోయారు. వాటిలోని అగోచర పరమార్థాలను గురించి వారు ఆలోచించలేరు. అందుకే వారు ఆ వస్తువుల రసాస్వాదనలో మునిగిపోయి రాబోయే జీవితం గురించి అలసత్వం వహించారు. ఒక్కోసారి వారు మరణానంతర జీవితంపైనే సందేహం వ్యక్తం చేయసాగారు. కొందరైతే మరణానంతర జీవితాన్ని అసత్యమని కొట్టివేశారు. ఉదాహరణకు :

﴿وَقَالُوا إِنْ هِيَ إِلَّا حَيَاتُنَا الدُّنْيَا وَمَا نَحْنُ بِمَبْعُوثِينَ﴾(الانعام:٢٩)

**“ఈ ప్రాపంచిక జీవితమే అసలు జీవితం. మళ్లీ మనం బ్రతికించ బడటం అనేది కల్ల” అని వారు చెబుతున్నారు.**

**(అల్ అన్ ఆమ్ : 29)**

ఈ విధమయిన జీవన దృక్పథం కలిగి ఉన్న వారిని దేవుడు చాలా తీవ్రంగా హెచ్చరించాడు. ఆయన ఇలా సెలవిచ్చాడు :

﴿إِنَّ الَّذِينَ لَا يَرْجُونَ لِقَاءَنَا وَرَضُوا بِالْحَيَاةِ الدُّنْيَا وَاطْمَأَنُّوا بِهَا وَالَّذِينَ هُمْ عَنْ آيَاتِنَا غَافِلُونَ ☆ أُولَٰئِكَ مَأْوَاهُمُ النَّارُ بِمَا كَانُوا يَكْسِبُونَ﴾(يونس:٨،٧)

**మమ్మల్ని కలుసుకునే విషయంపై నమ్మకం లేనివారికీ, ప్రాపంచిక జీవితంతోనే సంతోషించిన వారికీ, దానితోనే సంతృప్తి చెందినవారికీ, మా ఆయతుల పట్ల నిర్లక్ష్యభావం ప్రదర్శించిన వారికీ – వారు ఆర్జించిన దాని ప్రతిఫలంగా వారి నివాసం నరకాగ్ని అవుతుంది.**

**(యూనుస్ : 7, 8)**

﴿مَن كَانَ يُرِيدُ الْحَيَاةَ الدُّنْيَا وَزِينَتَهَا نُوَفِّ إِلَيْهِمْ أَعْمَالَهُمْ فِيهَا وَهُمْ فِيهَا لَا يُبْخَسُونَ ☆ أُولَٰئِكَ الَّذِينَ لَيْسَ لَهُمْ فِي الْآخِرَةِ إِلَّا النَّارُ وَحَبِطَ مَا صَنَعُوا فِيهَا وَبَاطِلٌ مَّا كَانُوا يَعْمَلُونَ﴾(هود:١٦،١٥)

**“ఎవరయితే ఈ ప్రాపంచిక జీవితం పట్ల, దాని అందచందాల పట్ల వ్యామోహితులవుతున్నారో అలాంటి వారికి వారి కర్మలను (వాటి ఫలితాన్ని) మేము ఇక్కడే పూర్తిగా ఇచ్చేస్తాము. ఇక్కడ వారికి ఏ లోటూ జరగదు. అయితే అలాంటి వారికి పరలోకంలో అగ్ని తప్ప**

**మరేమీ లభించదు. ప్రపంచంలో వారు చేసుకున్నదంతా వృధా అయి పోతుంది. వారు చేసే పనులన్నీ మిథ్యగా మారిపోయాయి."**

**(హూద్ : 15, 16)**

ఈ రకమయిన జీవన దృక్పథం గల వారందరికీ ఈ హెచ్చరిక వర్తిస్తుంది. వారు కేవలం ప్రాపంచిక స్వప్రయోజనాల కోసం పారలౌకిక ఆచరణ చేసేవారు గానివ్వండి, ఉదాహరణకు : కపటులు (మునాఫిక్‌లు), ప్రదర్శనాబుద్ధితో సత్కార్యాలు చేసేవారు లేదా మరణానంతర జీవితాన్ని, లెక్కాచారాన్ని నమ్మని అవిశ్వాసులు గానివ్వండి, ఉదాహరణకు : ఇస్లాంకు పూర్వం అజ్ఞాన కాలపు జనుల పరిస్థితి కూడా ఇలాగే ఉండేది. నేటి పెట్టుబడిదారీ విధానాన్ని, కమ్యూనిజాన్ని, సెక్యులరిజాన్ని అవలంబించే వారి పరిస్థితి కూడా ఇంతే. వీళ్ళందరికీ జీవితం యొక్క విలువ, ఉద్దేశం తెలీదు. ఎందుకంటే వారు తమ బుద్ధిజ్ఞానాలను జీవిత లక్ష్యం తెలుసుకునేందుకు వెచ్చించలేదు. వారు తమ శక్తియుక్తులన్నింటినీ వారికోసం ఆగి ఉండని, వాటి కోసం వారు ఆగి ఉండని వాటికై ధారబోశారు. వాటి వెనుకే తమ సమయాన్నంతటినీ ఖర్చు చేశారు. తమ కోసం నిరీక్షిస్తూ ఉన్న ఫలితం కోసం వారు ఏమీ చేసుకోలేదు. కాగా; ఎట్టి పరిస్థితిలోనూ వారు ఆ పరిణామాన్ని ఎదుర్కొనవలసి ఉన్నది.

జీవితం విషయంలో వారి దృక్పథం పశువులకన్నా హీనం. అందుకే వారి గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿أَمْ تَحْسَبُ أَنَّ أَكْثَرَهُمْ يَسْمَعُونَ أَوْ يَعْقِلُونَ إِنْ هُمْ إِلَّا كَالْأَنْعَامِ بَلْ هُمْ أَضَلُّ سَبِيلًا﴾ (الفرقان:۴۴)

**ఏమిటీ, వారిలో అత్యధిక మంది వింటారనీ, అర్థం చేసుకుంటారని నువ్వు (ఇప్పటికీ) అనుకుంటున్నావా? వారు వట్టి పశువుల్లాంటివారు. పైగా వాటికన్నా ఎక్కువగా దారి తప్పారు. (అల్ ఫుర్ఖాన్ : 44)**

ఈ రకమయిన పదార్థ పూజారులను దేవుడు అజ్ఞానులుగా ఖరారు చేశాడు. అందుకే ఇలా అన్నాడు :

﴿وَعْدَ اللَّهِ لَا يُخْلِفُ اللَّهُ وَعْدَهُ وَلَكِنَّ أَكْثَرَ النَّاسِ لَا يَعْلَمُونَ ☆ يَعْلَمُونَ ظَاهِرًا مِّنَ الْحَيَاةِ الدُّنْيَا وَهُمْ عَنِ الْآخِرَةِ هُمْ غَافِلُونَ﴾ (الروم:٦،٧)

**కాని చాలామంది (ఈ సంగతిని) తెలుసుకోరు. వారికి ప్రాపంచిక జీవితపు పై పై విషయాలు (మాత్రమే) తెలుసు. పరలోకం గురించి వారికి బొత్తిగా తెలీదు. (అర్ రూమ్ : 6, 7)**

వారు ఎన్ని కొంగ్రొత్త ఆవిష్కరణలు చేసినా, వైజ్ఞానిక సాంకేతిక రంగాలలో వారెంత అనుభవజ్ఞులు, నిపుణులు అయినా – వాస్తవంలో వారు జ్ఞానులు, విజ్ఞులు



కారు. 'జ్ఞాని' అని పిలిపించుకునే అర్హత వారికి లేదు. ఎందుకంటే వారి జ్ఞానం ప్రాపంచిక జీవితపు బాహ్య వస్తువుల పరిధిని దాటి ముందుకుపోదు. వారి జ్ఞానం లోపభూయిష్టమైనది. అందుకే వారు ఆదరణీయులు, మానవీయులైన విజ్ఞుల సరసన నిలబడలేరు. దైవం గురించి, సిసలైన జీవిత లక్ష్యం గురించి అవగాహన ఉన్నవారు మాత్రమే జ్ఞాను లనదగినవారు. అలాంటి వారి గురించి అల్లాహ్ ఏమన్నాడో చూడండి :

﴿إِنَّمَا يَخْشَى اللَّهَ مِنْ عِبَادِهِ الْعُلَمَاءُ﴾ (فاطر:٢٨)

**అల్లాహ్ దాసులలో జ్ఞాన సంపన్నులు మాత్రమే ఆయనకు భయపడ తారు. (ఫాతిర్ : 28)**

దేవుడు ఖారూన్ గురించి, అతని ఖజానా గురించి ప్రస్తావించిన వృత్తాంతంలో కూడా ప్రాపంచిక జీవితపు భౌతిక దృక్పథమే ఉపమానంగా ఇవ్వబడింది :

﴿فَخَرَجَ عَلَى قَوْمِهِ فِي زِينَتِهِ قَالَ الَّذِينَ يُرِيدُونَ الْحَيَاةَ الدُّنْيَا يَا لَيْتَ لَنَا مِثْلَ مَا أُوتِيَ قَارُونُ إِنَّهُ لَذُو حَظٍّ عَظِيمٍ﴾ (القصص:٧٩)

**మరి ఖారూన్ అంగరంగ వైభవంతో తన జాతి జనులలోకి కదలి వచ్చినప్పుడు, ప్రాపంచిక జీవితాన్ని కోరుకునేవారు, "ఖారూనుకు ప్రసాదించబడినదే మాకూ లభిస్తే ఎంత బాగుండు! నిజంగా ఇతను పెట్టిపుట్టినవాడు" అన్నారు. (అల్ ఖసస్ : 79)**

పై సూక్తిలో చెప్పబడిన ముఖ్య విషయం ఏమిటంటే, ప్రాపంచిక జీవితమే సర్వస్వం అనుకున్నవారు, తమ ఆధిభౌతికతత్వం ప్రకారం ఖారూన్‌కు లభించిన సిరిసంపదలే తమకూ ప్రాప్తించాలని కాంక్షించారు. ఖారూన్‌ని చూసి అసూయ చెందారు. ఖారూన్‌ను గొప్ప భాగ్యవంతుడుగా పేర్కొన్నారు. నేటి అభివృద్ధి చెందిన దేశాలలో జనుల పరిస్థితి కూడా ఇదే. అక్కడి పారిశ్రామిక, ఆర్థిక ప్రగతిని బలహీన విశ్వాసం గల ముస్లిం లు మెచ్చుకోలు దృష్టితో చూస్తారు. కాని వారి అవిశ్వాసాన్ని, వారికి పట్టబోయే పర్యవసానాన్ని గురించి యోచన చేయరు. వారి ఈ తప్పుడు దృష్టి కోణం మూలంగా వారి హృదయాలలో పదార్థ పూజారుల యెడల గౌరవ భావం జనిస్తుంది. అందువల్ల ఎన్నో చెడు విషయాలలో వారిని అనుకరించటం మొదలెడతారు. దానికి బదులు వీరు ఈ భౌతికవాదుల కష్టపడే స్వభావాన్ని, ఆవిష్కరణల కోసం వారు చేసే కఠోర తపస్సును, క్రమశిక్షణను, పట్టుదలను పుణికి పుచ్చుకునేందుకు ప్రయత్నిస్తే బావుండేది. కాని వారలా చేయరు. అల్లాహ్ సెలవిచ్చినట్లు–

﴿وَأَعِدُّوا لَهُم مَّا اسْتَطَعْتُم مِّن قُوَّةٍ﴾ (الانفال:٦٠)

**"మీరు వాళ్లను ఎదుర్కోవటానికి శాయశక్తులా బలాన్ని కూడగట్టు కోండి." (అల్ అన్‌ఫాల్ : 60)**

### (2) జీవితానికి సంబంధించిన సరైన దృక్పథం :

జీవితానికి సంబంధించిన సరైన దృక్పథం ఏమిటంటే, జీవిత కాలంలో ప్రాప్తమైన సిరిసంపదలను, పదవులను, పేరు ప్రతిష్ఠలను మనిషి పరలోక కర్మల కొరకు సహాయ కారిగా మలచుకోవాలి.

కాబట్టి ప్రపంచం స్వతహాగా నిందార్హమైనది కాదు. నిందార్హమైనా, ప్రశంసార్హమైనా – అది దాసుల వైఖరినిబట్టి ఉంటుంది. ప్రపంచం వాస్తవానికి పరలోకానికి వారధి వంటిది. తద్వారా స్వర్గం కొరకు కావలసిన సామగ్రిని ఇక్కడ నుండి సమకూర్చుకోవటం జరుగుతుంది. అక్కడ స్వర్గవాసులకు లభించే అత్యుత్తమ జీవితం ప్రపంచంలో వారు చేసుకున్న సత్కర్మలపైనే ఆధారభూతమై ఉంటుంది.

ఈ విధంగా ప్రపంచం కర్మ భూమి. సాధనా స్థలం. ఆరాధనా విషయం. దైవమార్గంలో ఖర్చుచేసే, సత్కార్యాలలో ముందంజవేసే క్షేత్రం!

స్వర్గవాసులనుద్దేశించి అల్లాహ్ ఇలా అంటాడు :

﴿كُلُوا وَاشْرَبُوا هَنِيئًا بِمَا أَسْلَفْتُمْ فِي الْأَيَّامِ الْخَالِيَةِ﴾ (الحاقة:٢٤)

**“గత కాలంలో మీరు చేసుకున్న కర్మలకు ప్రతిఫలంగా హాయిగా తినండి, త్రాగండి.” (అల్ హాఖ్ఖహ్ : 24)**



## పదవ ప్రకరణం

# మంత్రించి ఊదటం, తావీజులు కట్టటం

### (1) మంత్రించి ఊదటం (రుఖ్‌య) :

అంటే బాధలో ఉన్న వ్యక్తిపై ఏదైనా పఠించి ఊదటం. ఉదాహరణకు : జ్వరం, మూర్ఛ రోగం, తదితర జబ్బులున్న వ్యక్తి. దీనిని మంత్రం అని కూడా అంటారు. ఇది రెండు రకాలు :

**మొదటి రకం :** షిర్క్ ప్రమేయం లేని మంత్రం. సూటిగా చెప్పాలంటే దివ్య ఖుర్ఆన్‌లోని సూక్తులనుగానీ, దైవనామాలను గానీ పఠించి అతన్ని దేవుని రక్షణలో ఇవ్వటం (రోగి స్వస్థత కోసం అల్లాహ్‌ను అర్థించటం). ఈ రకమయిన మంత్రం ధర్మసమ్మతమే. ఎందుకంటే దైవప్రవక్త (ﷺ) ఈ విధంగా మంత్రించటమే గాక, దీనిని సమ్మతంగా ఖరారు చేశారు. ఆ మేరకు ఆజ్ఞాపించారు కూడా.

ఔఫ్ బిన్ మాలిక్ (رضي الله عنه) ఇలా అంటున్నారు : మేము అజ్ఞాన కాలంలో మంత్రించి ఊదేవారం. అందుకే మేము, ‘ఓ దైవప్రవక్తా! దీని గురించి తమరి అభిప్రాయం ఏమిటి?’ అని ప్రశ్నించాం. దానికాయన (ﷺ),

”اِعْرِضُوا عَلَيَّ رُقَاكُمْ، لَا بَأْسَ بِالرُّقىٰ مَالَمْ تَكُنْ شِرْكًا“ (مسلم)

**“మీ మంత్రాలేమిటో నా ముందు సమర్పించండి. షిర్క్ ప్రమేయం లేకుండా ఉన్నంతవరకూ మంత్రించి ఊదటంలో అభ్యంతరం ఏమీ లేదు” అన్నారు. (సహీహ్ ముస్లిం)**

అల్లామా సుయూతీ (رحمه الله) ఇలా అంటున్నారు : మంత్రించి ఊదటం ధర్మసమ్మతమే అనే విషయంలో విద్వాంసుల మధ్య ఏకాభిప్రాయం ఉంది. కాకపోతే అది మూడు షరతులకు కట్టుబడి ఉండాలి.

**మొదటి షరతు** : దైవ వచనాల, దైవనామాల ఆధారంగా మంత్రించి ఊదాలి.
**రెండవ షరతు** : అది అరబీ భాషలో ఉండాలి. దాని భావం స్పష్టంగా ఉండాలి.
**మూడవ షరతు** : మంత్రం స్వతహాగా ప్రభావపూరితం (ప్రయోజనకరం) కాదని, దేవుని విధివ్రాత ప్రకారమే దాని ప్రభావం ఉంటుందని నమ్మకం కలిగి ఉండాలి. (ఫత్‌హుల్ మజీద్ : పేజీ – 135)

మంత్రించే పద్ధతి ఏమిటంటే, నిర్ణీత దైవవచనాలను పఠించి రోగిపై ఊదాలి. లేదా నీటిపై మంత్రించి దానిని రోగికి త్రాగించాలి. సాబిత్ బిన్ ఖైస్ (رضي الله عنه) హదీసు ద్వారా ఈ విషయం రూఢీ అవుతోంది : “దైవప్రవక్త (ﷺ) బత్‌హాన్ నుండి కొద్దిగా మట్టి తీసుకున్నారు. దానిని ఒక పాత్రలో వేశారు. ఆ నీటిపై ఏదో పఠించి ఊదారు. తరువాత ఆ నీటిని ఆయనపై కుమ్మరించారు.” (అబూదావూద్–3885 జయీఫుల్ అస్‌నాద్, కితాబుత్తిబ్, సహీహ్ ఇబ్నె హిబ్బాన్ – 1418)

**రెండవ రకం :** షిర్క్‌కు ప్రమేయం ఉన్నది. అంటే దైవేతరుల సహాయం అర్థించే మంత్రతంత్రాలు. ఇందు నిమిత్తం దైవేతరులను మొరపెట్టుకోవటం, వారి సహాయం కోరటం, వారి శరణుజొచ్చుటం, జిన్నాతుల పేర్లతో, ప్రవక్తల పేర్లతో, దైవదూతల పేర్లతో, పుణ్య పురుషులపేర్లతో మంత్రించి ఊదటం – ఇదంతా దైవేతరులను మొరపెట్టుకోవటం క్రిందికే వస్తుంది. ఇది షిర్కె అక్బర్. లేదా అరబీలో గాకుండా వేరితర భాషల్లో ఉండే మంత్రాలు. అర్థంకాని విధంగా – అస్పష్టంగా – ఉండే మంత్రాలు. వాటిలో అవిశ్వాసంతో, షిర్కుతో కూడిన వాక్యాలు ఉండవచ్చు. ఆ విషయం మనకు తెలీకనూ పోవచ్చు – ఈ విధమయిన మంత్రాలు కూడా సమ్మతం కావు.

## (2) తావీజులు

అంటే దిష్టి తగలకుండా ఉండేందుకు చిన్న పిల్లల మెడలో వ్రేలాడదీసే త్రాళ్లు. ఒక్కోసారి వృద్ధ స్త్రీ పురుషుల మెడలో కూడా ఇలాంటివి వ్రేలాడదీయబడతాయి.

### తాయెత్తులు రెండు రకాలు

**మొదటి రకం :**

ఖుర్‌ఆన్ ఆధారంగా కట్టే తావీజులు. అంటే ఖుర్‌ఆనీ సూక్తులను లేదా అల్లాహ్ నామాలను, గుణాలను లిఖించి, వ్యాధి నివారణ పొందే ఉద్దేశంతో వ్రేలాడదీయబడేవి. ఈ విధమయిన తావీజులకు సంబంధించి ఇస్లామీయ విద్వాంసులలో భిన్నాభిప్రాయం ఉంది. ఈ నేపథ్యంలో రెండు ఉద్ఘాటనలున్నాయి.

**మొదటిది :** ఈ విధమయిన తావీజు వ్రేలాడదీయటం సమ్మతమే. ఇది అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (رضي الله عنه) పలుకు. హజ్రత్ ఆయిషా (رضي الله عنها) ద్వారా ఈ విధంగానే ఉల్లేఖించబడినది. అబూ జాఫర్ అల్ బాఖర్ మరియు వేరొక ఉల్లేఖనంలో అహ్మద్ బిన్ హంబల్ (رحمه الله) ఉవాచ కూడా ఇదే. వీరంతా తావీజులు వ్రేలాడదీయరాదనే హదీసును గురించి వ్యాఖ్యానిస్తూ, "అది షిర్కుతో కూడిన తావీజులకు సంబంధించిన హదీసు" అని అభిప్రాయపడ్డారు.

రెండవది : ఈ రకమయిన తావీజులు వ్రేలాడదీయటం ధర్మసమ్మతం కాదు. ఇది అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్, ఇబ్నె అబ్బాస్ (رضي الله عنهم) ల ఉవాచ. హుజైఫా, ఉఖబా బిన్ ఆమిర్, ఇబ్నె ఉకైమ్ (رضي الله عنهم) ప్రభృతులు కూడా ఇలాగే అభిప్రాయపడ్డారు. తాబయీల ఒక జమాఅత్ కూడా ఇంచుమించు ఇలాగే అభిప్రాయపడింది. వీరిలో ఇబ్నె మస్‌ఊద్ (رضي الله عنه) శిష్యులు, వేరొక ఉల్లేఖనం ప్రకారం ఇమామ్ అహ్మద్ కూడా ఉన్నారు. వీరి శిష్యుల్లో కూడా చాలామంది ఇదే అభిప్రాయాన్ని అవలంబించారు. తరువాతి తరాల వారు కూడా దీనికి కట్టుబడ్డారు. ఇబ్నె మస్‌ఊద్ (رضي الله عنه) గారి ఈ క్రింది హదీసు వారి కట్టుబాటుకు నిదర్శనంగా ఉంది :

''إِنَّ الرُّقَىٰ وَ التَّمَائِمَ وَالتِّوَلَةَ شِرْكٌ'' (ابن ماجہ:۳۵۳۰صحیح)

**"నిశ్చయంగా మంత్రించి ఊదటం, తాయెత్తులు వేయటం, తివల షిర్క్‌తో కూడుకున్నవి."(అహ్మద్, అబూదావూద్, ఇబ్నుమాజ–3530 సహీహ్, హాకిమ్)**



తివల అనేది కూడా ఒక విధమయిన చేతబడి (క్షుద్రవిద్య). దీని మూలంగా భర్త దృష్టిలో భార్య, భార్య దృష్టిలో భర్త ప్రియాతిప్రియమైన వారైపోతారన్నది ఆ విద్య చేయించే వారి తలంపు.

క్రింద పేర్కొనబడిన మూడు కారణాల దృష్ట్యా ఈ రెండవ అభిప్రాయమే సరైనది:

(1) సర్వసాధారణంగా తాయెత్తులు కట్టడం పట్ల వారింపు ఉంది. ఈ సర్వసాధారణ మును 'ప్రత్యేకం' చేసే ఆధారం ఏదీ కనబడదు.

(2) షిర్క్ ద్వారాలను మూసివేయటంలో ఈ 'వారింపు' ఉపయుక్తంగా ఉన్నది. కాగా; తావీజులు వ్రేలాడదీయవచ్చన్న ఫత్వా (ధార్మిక తీర్పు) షిర్క్‌తో కూడుకున్న తావీజులను ప్రోత్సహించేందుకు ఆస్కారముంది. అది ఏ విధంగానూ సమ్మతం కాదు.

(3) ఖుర్‌ఆనీ ఆయతులను తావీజుగా చేసి వ్రేలాడదీసినపుడు, అలా వ్రేలాడదీసేవాడు తప్పకుండా వాటిపట్ల అమర్యాదకరంగా ప్రవర్తిస్తాడు. ఎందుకంటే ఆ తావీజు కాలకృత్యాలు తీర్చుకునే సమయంలో కూడా అతని మెడలో వ్రేలాడుతూనో, చేతికి కట్టబడో ఉంటుంది. (ఫత్‌హుల్ మజీద్ : పేజి : 136)

## రెండవ రకం :

ఈ కోవలో ఖుర్‌ఆన్ సూక్తుల ఆధారంగా చేయబడిన తావీజులతో పాటు వేరితర తాయెత్తులన్నీ చేరి ఉంటాయి. ఉదాహరణకు : గవ్వలు, బొమికలు, దారాలు, వెంట్రుకలు, చిప్పలు, చెప్పులు, భూత పిశాచాల పేర్లు ఇత్యాదివి. ఈ రకమయిన తావీజులు ముమ్మాటికీ నిషిద్ధం (హరామ్). అవి ఖచ్చితంగా షిర్క్ క్రిందికి వస్తాయి. ఎందుకంటే ఈ రకమయిన వస్తువులలో అల్లాహ్ నామాల, వాక్యాల బదులు వాటిని ఇతరత్రా వాటితో ముడిపెట్టడం జరుగుతుంది. దైవేతరులను ఆశ్రయించటం జరుగుతుంది. కాగా; హదీసులో ఇలా ఉంది :

''مَنْ تَعَلَّقَ شَيْئاً وُكِلَ إِلَيْهِ'' (ترمذی:۲۰۷۲حسن:احمد)

**"ఎవరయినా ఏదయినా వస్తువుతో సంబంధం ఏర్పరచుకుంటే అతను దాని పరమే చేయబడతాడు." (అహ్మద్, తిర్మిజీ–2072 హసన్)**

అంటే దేవుడు అతన్ని ఆ వస్తువుకే అప్పగిస్తాడు. కనుక ఎవరయితే అల్లాహ్‌తో దృఢ సంబంధం ఏర్పరచుకుంటాడో, అల్లాహ్‌నే నమ్ముకుంటాడో, తన వ్యవహారాలన్నింటినీ అల్లాహ్ పరం చేస్తాడో అలాంటి వ్యక్తి కొరకు స్వయంగా అల్లాహ్‌యే చాలు. ఆయన ప్రతి దూరాన్ని అతనిపై దగ్గర చేస్తాడు. ప్రతి కష్టాన్ని అతని కోసం సులువు చేస్తాడు. మరెవరయితే అల్లాహ్‌ను గాకుండా ఇతర సృష్టితాలను ఆశ్రయిస్తాడో, తాయెత్తుల,

అధర్మమయిన విద్యల, సమాధుల, దర్గాల సహాయం కోర్తాడో అతను వాటికే అప్పగించ బడతాడు. అవి అతనికి ఏ విధంగానూ ఉపయోగపడవు. అతనికి లాభనష్టాలు కలిగించే శక్తి వాటికి ఉండదు. ఆ విధంగా అతని విశ్వాసం (అఖీదా) కూడా వ్యర్థమై పోతుంది. అల్లాహ్‌తో అతనికి గల సంబంధం కూడా తెగిపోతుంది. అల్లాహ్ అతనికి తోడ్పడటం మానుకుంటాడు.

కాబట్టి ముసల్మాను తన విశ్వాసానికి విఘాతం కలిగించే విషయాల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలి. కాబట్టి అతను అధర్మమైన మందులను, చికిత్సలను త్యజించాలి. తన రోగుల చికిత్స కోసం మాయలమారుల వద్దకు, మోసగాళ్ల వద్దకు పోరాదు. ఎందుకంటే అలాంటి దగాకోరులు అన్నిటికన్నా ముందు ఇతని హృదయాన్ని, ఇతని నమ్మకాన్ని రోగగ్రస్తం చేసేస్తారు. అల్లాహ్‌పై భరోసా చేసిన వాడికి అల్లాహ్‌యే చాలు.

కొంతమంది అవసరం లేకపోయినా తావీజులు పెట్టుకుంటారు. నిజానికి వారికి ఏ జబ్బూ ఉండదు. కాని వారు అనుమానమనే అతి పెద్ద రోగానికి లోనై ఉంటాడు. తమకు దిష్టి తగులుతుందని, ఇతరులు తమను చూసి ఈర్ష్య చెందుతారేమోనని పొద్దస్తమానం అనుమానిస్తూ ఉంటారు. అలాగే మరి కొంతమంది తమ వాహనాలకు, పశువులకు, లేదా ఇంటి గుమ్మానికి 'విరుగుడు'ను కడుతుంటారు. ఇదంతా విశ్వాస బలహీనత వల్ల అలా చేస్తారు. విశ్వాస బలహీనతే అసలు రోగం. దానికి చికిత్స తౌహీద్ (దేవుని ఏకత్వం), సిసలయిన విశ్వాసం ఆధారంగా చేయటం చాలా అవసరం.



**పదకొండవ ప్రకరణం**

# దైవేతరుల పేర ప్రమాణం చేయటం, సృష్టితాల ఆశ్రయం పొందటం, వారిని మొరపెట్టుకోవటం, సహాయమర్థించటం

**(అ) దైవేతరులపై ప్రమాణం చేయటం :**

మాననీయుడయిన ఒక వ్యక్తి లేక ఒక వస్తువు గురించి ప్రస్తావించి విషయాన్ని నొక్కి చెప్పేందుకు ప్రమాణం చేయటం ప్రమాణం లేక ఒట్టు అనబడుతుంది. మన్నన, భక్తి, సత్కారం లాంటివి అల్లాహ్ హక్కు. కాబట్టి దైవేతరుల పేర ప్రమాణం చేయటం సమ్మతం కాదు. 'ప్రమాణం' అనేది కేవలం అల్లాహ్ పేర లేదా ఆయన నామాల గుణగణాలపై జరగాలన్న దానిపై విద్వాంసుల మధ్య ఏకాభిప్రాయం ఉంది. అలాగే దైవేతరుల పేర ప్రమాణం చేయటం నిషిద్ధం మరియు అధర్మం అనే విషయంలో కూడా విద్వాంసుల మధ్య ఏకాభిప్రాయం ఉంది (హాషియా ఇబ్నుల్ ఖాసిం అలీ కితాబుత్తౌహీద్ – పేజీ : 303)

దైవేతరులపై ప్రమాణం చేయటం షిర్క్. ఎందుకంటే ఇబ్నె ఉమర్ (رضي الله عنهما) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్ (صلى الله عليه وسلم) ఇలా ప్రవచించారు :

''مَنْ حَلَفَ بِغَيْرِاللّٰهِ فَقَدْ كَفَرَ أَوْ أَشْرَكَ''(ترمذی:۱۵۳۵صحیح،احمد،حاکم)

**"దైవేతరుని పేర ప్రమాణం చేసినవాడు అవిశ్వాసానికి లేదా బహుదైవా రాధనకు ఒడిగట్టాడు." (అహ్మద్, తిర్మిజీ–1535 సహీహ్, హాకిమ్)**

ఇది షిర్కె అస్గర్ (చిన్న తరహా షిర్క్). అయితే ప్రమాణం చేయబడిన వ్యక్తి గనక అతని దృష్టిలో ఆరాధనీయుడుగా ఉంటే గనక ఇది కూడా పెద్ద తరహా షిర్క్ (షిర్కె అక్బర్) గానే భావించబడుతుంది. నేటి సమాధి పూజారుల పరిస్థితి ఇలాంటిదే. వారు అల్లాహ్‌కన్నా ఎక్కువగా సమాధివారలకు భయపడతారు. అల్లాహ్ పట్ల చూపవలసిన భక్తికన్నా అధికంగా తమకు గురివున్న సమాధి వారిపట్ల చూపుతారు. తాము నమ్మే వలీ పేర ప్రమాణం చేయమని వారిలో ఎవరినయినా అనండి; వారు తమ ప్రమాణంలో సత్యవంతులై ఉంటేనే ప్రమాణం చేస్తారు. కాని అల్లాహ్ పేర ప్రమాణం చేయమని చెబితే, వెంటనే – తడబడకుండా – ప్రమాణం చేసేస్తారు. అతను చెప్పేది అబద్ధమైనాసరే.

ఎవరి పేరు మీద ప్రమాణం చేస్తారో అతని పట్ల భక్తీ ప్రపత్తులు ఉంటాయి. ఈ భక్తీ ప్రపత్తులు అల్లాహ్‌కే శోభాయమానం. అలాగే అల్లాహ్ పేర ప్రమాణం చేసినపుడు, ఆ ప్రమాణం పట్ల గౌరవ ప్రపత్తులను పాటించటం కూడా అవసరమే. అందుకే చీటికి మాటికీ ప్రమాణం చేయకూడదు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَلَا تُطِعْ كُلَّ حَلَّافٍ مَّهِينٍ﴾ (القلم:١٠)

**"నీవు అదేపనిగా ప్రమాణాలు చేసే తుచ్ఛుని మాట వినకు."**
**(అల్ ఖలమ్ : 10)**

ఇంకా ఇలా సెలవిచ్చాడు :

﴿وَاحْفَظُوا أَيْمَانَكُمْ﴾ (المائدة:٨٩)

**"మీరు ప్రమాణాల విషయంలో జాగ్రత్త పడండి." (అల్ మాయిద : 89)**

అంటే, మరీ అంతగా అవసరముంటేనే, సత్యం కొరకు, మంచి కొరకు ప్రమాణం చేయవలసిన అవసరం ఉందని భావిస్తేనే ప్రమాణం చేయండి. ఎందుకంటే చీటికీ మాటికీ ప్రమాణాలు చేయటం, అబద్ధపు ప్రమాణాలు చేయటం అంటే ఒక విధంగా అల్లాహ్‌ను కించపరచటం క్రిందికే వస్తుంది. ఇది తౌహీద్ పరిపూర్ణతకు విరుద్ధాంశం. మహాప్రవక్త ముహమ్మద్ (ﷺ) ఇలా ప్రబోధించారు :

"ముగ్గురు వ్యక్తులతో అల్లాహ్ మాట్లాడడు, వారిని పవిత్రపరచడు. వారి కొరకు వ్యధా భరితమయిన శిక్ష ఉంది" – ఈ హదీసులో తరువాత ఇలా అనబడింది :

"وَرَجُلٌ جَعَلَ اللّٰهُ بِضَاعَتَهُ، لَا يَشْتَرِي إِلَّا بِيَمِينِهِ وَلَا يَبِيعُ إِلَّا بِيَمِينِهِ" (صحيح الجامع :٥٣٨٣)

**"వారిలో ఒకడెవడంటే, అతను అల్లాహ్‌ను తన (వర్తక) సామగ్రిగా చేసుకున్నాడు. కనుక అతను ఏదయినా కొనుగోలు చేసినపుడు ఆయన పేరు మీద ప్రమాణం చేస్తాడు. అమ్మినపుడు కూడా ఆయనపై ఒట్టేస్తాడు." (ఈ హదీసును తిబ్రానీ ప్రామాణిక సనదుతో ఉల్లేఖించారు. సహీహుల్ జామె–5383).**

పై హదీసులో ఎక్కువగా ప్రమాణాలు చేయటంపై హెచ్చరిక చేయబడింది. పదే పదే ప్రమాణం చేయటం సమ్మతం కాదనటానికి ఇది నిదర్శనం. ఎందుకంటే అల్లాహ్ నామం పట్ల గౌరవ ప్రపత్తులు ఉండాలి.

అలాగే అల్లాహ్ పేరున అబద్ధ ప్రమాణాలు చేయటం నిషిద్ధం (హరామ్). దీనినే **'యమీనె గమూస్'** అంటారు. (ఇది ఎటువంటి ప్రమాణమంటే, అది ప్రమాణం చేసేవాణ్ణి పాపానికి లోనుచేస్తుంది. నరకానికి ఆహుతి చేస్తుంది. అంటే, తెలిసి కూడా జరిగిపోయిన దానిపై అబద్ధపు ప్రమాణం చేయటమన్నమాట). అల్లాహ్ కపట విశ్వాసుల ఈ లక్షణాన్ని విశదీకరిస్తూ, వారు తెలిసి కూడా అల్లాహ్ పేరుపై అసత్య ప్రమాణాలు చేస్తారని చెప్పాడు. పై విషయాల సారాంశమేమిటంటే –

(1) దైవేతరుల పేరు మీద ప్రమాణం చేయటం : ఉదాహరణకు – అమానతు, కాబా గృహం లేదా దైవప్రవక్త (ﷺ)పై ప్రమాణం చేయటం హరామ్, షిర్క్.



(2) తెలిసీ అల్లాహ్‌పై అసత్య ప్రమాణం చేయటం హరామ్ (నిషిద్ధం). ఇదే 'యమీనె గమూస్' అనబడుతుంది.

(3) అవసరం లేకపోయినప్పటికీ పదే పదే అల్లాహ్‌పై ఒట్టేసుకోవటం హరామ్ – ఒకవేళ అతను తన ప్రమాణంలో సత్యవంతుడైనప్పటికీ మాటిమాటికీ ప్రమాణం చేయరాదు. ఎందుకంటే ఇలా చేయటం వల్ల అల్లాహ్ గౌరవప్రపత్తులకు విఘాతం కలుగుతుంది.

(4) అవసరం వచ్చినపుడు – సత్యం కొరకు – అల్లాహ్‌పై ప్రమాణం చేయటం ధర్మసమ్మతం.

## (అ) దైవ సామీప్యం కొరకు సృష్టితాలను 'సాధనం' గా చేసుకోవటం:

'తౌసిల్' అంటే ఏదేని ఒక వస్తువు ద్వారా దగ్గర అవటం, లేదా దాని వరకు చేరటం అన్నమాట! సామీప్యాన్ని 'వసీలా' అంటారు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَابْتَغُوا إِلَيْهِ الْوَسِيلَةَ﴾ (المائدة:٣٥)

**"ఆయన సామీప్యాన్ని పొందే సాధనం వెతకండి." (అల్ మాయిద:35)**

అంటే; అల్లాహ్‌కు విధేయులై ఉంటూ, ఆయన ప్రసన్నతను చూరగొనే మార్గాన్ని అనుసరిస్తూ ఆయన సామీప్యం పొందండి అని భావం.

## తవస్సుల్ రెండు రకాలు

**మొదటి రకం :** ధర్మసమ్మతమైన అత్ తవస్సుల్. ఇది కూడా రెండు రకాలు.

**(1) అల్లాహ్ నామాలను, గుణగణాలను సాధనంగా చేసుకోవటం** – ఉదాహరణకు : అల్లాహ్ ఒక చోట ఈ విధంగా ఆదేశించాడు :

﴿وَلِلّٰهِ الْأَسْمَاءُ الْحُسْنَىٰ فَادْعُوهُ بِهَا وَذَرُوا الَّذِينَ يُلْحِدُونَ فِي أَسْمَائِهِ سَيُجْزَوْنَ مَا كَانُوا يَعْمَلُونَ﴾ (الاعراف:١٨٠)

**అల్లాహ్‌కు మంచి పేర్లు ఉన్నాయి. కాబట్టి మీరు ఆ పేర్లతో ఆయన్నే పిలవండి. ఆయన పేర్ల విషయంలో వక్రంగా వాదించే వారిని వదలిపెట్టండి. వారు చేస్తూ ఉండిన దానికి వారు తప్పకుండా శిక్షించబడతారు. (అల్ ఆరాఫ్ : 180)**

**(2) విశ్వాసం మరియు సత్కర్మలను అల్లాహ్ సన్నిధిలో సాధనంగా చేసుకోవటం:**

ఉదాహరణకు అల్లాహ్ విశ్వాసుల గురించి ఇలా సెలవిచ్చాడు :

﴿رَبَّنَا إِنَّنَا سَمِعْنَا مُنَادِيًا يُنَادِي لِلْإِيمَانِ أَنْ آمِنُوا بِرَبِّكُمْ فَآمَنَّا رَبَّنَا فَاغْفِرْ لَنَا ذُنُوبَنَا وَكَفِّرْ عَنَّا سَيِّئَاتِنَا وَتَوَفَّنَا مَعَ الْأَبْرَارِ﴾ (آل عمران:١٩٣)

**"మా ప్రభూ! పిలిచేవాడొకడు విశ్వాసం (ఈమాన్) వైపు పిలవటం, 'ప్రజలారా! మీ ప్రభువును విశ్వసించండి' అని పిలుపునివ్వటం మేము విన్నాము. కనుక మేము విశ్వసించాము. కనుక ఓ ప్రభూ! మా పాపాలను క్షమించు. మా చెడుగులను మా నుండి దూరం చెయ్యి. సజ్జనులతో పాటు మాకు మరణం వొసగు." (ఆలి ఇమ్రాన్ : 193)**

గుహ వారి హదీసు దీనికి ఒక ప్రబల తార్కాణం. ఆ ముగ్గురు వ్యక్తులు గుహలో తల దాచుకొని ఉండగా ఒక కొండరాయి విరిగి ఆ గుహ ముఖద్వారం వద్ద పడింది. దాంతో గుహ ముఖద్వారం మూసుకుపోయింది. అప్పుడు ఆ ముగ్గురు సజ్జనులు తాము తమ జీవితంలో చేసుకున్న సత్కర్మలను ఆధారంగా చేసుకుని దైవాన్ని ప్రార్థించారు. అల్లాహ్ వారి ప్రార్థనను ఆలకించాడు. ఆ కొండరాయి గుహ ముఖద్వారం నుండి జరిగిపోయింది. దాంతో వారు ఆ గుహ నుండి సురక్షితంగా బయటపడ్డారు.

**(3) దైవసన్నిధిలో ఆయన 'తౌహీద్'ను ఆశ్రయించటం :**

దైవప్రవక్త హజ్రత్ యూనుస్ (عليه السلام) ఇలా చేశారు :

﴿فَنَادَىٰ فِي الظُّلُمَاتِ أَن لَّا إِلَٰهَ إِلَّا أَنتَ سُبْحَانَكَ﴾ (الأنبياء:٨٧)

**ఆఖరికి అతను చీకట్లలో నుంచి ఇలా మొరపెట్టుకున్నాడు : "ఓ అల్లాహ్! నీవు తప్ప మరో ఆరాధ్య దైవం లేదు. నీవు పవిత్రుడవు." (అంబియా : 87)**

**(4) అల్లాహ్ వైపు మరలి తన అవసరాన్ని, నిస్సహాయ స్థితిని వ్యక్తపరచి దానిని సాధనంగా చేసుకోవటం :** ఉదాహరణకు :– దైవప్రవక్త హజ్రత్ అయ్యూబ్ (عليه السلام) ఈ విధంగా చేశారు :

﴿أَنِّي مَسَّنِيَ الضُّرُّ وَأَنتَ أَرْحَمُ الرَّاحِمِينَ﴾ (الأنبياء:٨٣)

**"(ప్రభూ!) నాకు ఈ వ్యాధి సోకింది. నీవు కరుణించే వారందరిలోకీ అపారంగా కరుణించేవాడవు." (అంబియా : 83)**

**(5) బ్రతికి ఉన్న సత్పురుషుల దుఆలను దైవసన్నిధిలో సాధనంగా చేయటం :** ఉదాహరణకు, ప్రవక్త సహచరులు (رضي الله عنهم) కరువు కాటకాల సమయంలో దైవసన్నిధిలో ప్రార్థించమని దైవప్రవక్త (ﷺ)ను అభ్యర్థించేవారు. ఆయన (ﷺ) పరమపదించిన తరువాత ఆయన పినతండ్రి అయిన అబ్బాస్ (رضي الله عنه) గారిని ప్రార్థించమని కోరేవారు. వారి కోరికపై ఆయన ప్రార్థించేవారు. (బుఖారీ)

**(6) తమ పాపాలను అంగీకరిస్తూ దైవసన్నిధిలో వాటిని సాధనంగా చేసుకోవటం :** ఉదాహరణకు, దైవప్రవక్త హజ్రత్ మూసా (عليه السلام) ఇలా ప్రార్థించారు :

﴿قَالَ رَبِّ إِنِّي ظَلَمْتُ نَفْسِي فَاغْفِرْ لِي﴾ (القصص:١٦)



**"నా ప్రభూ! నాకు నేనే అన్యాయం చేసుకున్నాను. కనుక నన్ను క్షమించు." (అల్ ఖసస్ : 16)**

## రెండవ రకం : అధర్మమైన వసీలా

ఇంతవరకూ వచ్చిన ధర్మసమ్మతమైన సాధనాలు తప్ప వేరితర పద్ధతుల ద్వారా ఆశ్రయం పొందినట్లయితే అది అధర్మమయిన వసీలా (ఆధారం)గా పరిగణించబడుతుంది. ఉదాహరణకు : మృతుల ప్రార్థన, సిఫారసులను సాధనంగా చేసుకోవటం. దైవప్రవక్త (ﷺ) ఔన్నత్యాన్ని, అంతస్తును వసీలాగా చేసుకోవటం. ప్రాణులలో ఏ ఒక్కరి వ్యక్తిత్వాన్నయినా, వారి హక్కునయినా వసీలాగా చేసుకోవటం. దీని వివరాలు క్రింద పేర్కొనబడ్డాయి –

**(1) మృతులను దుఆ చేయమని కోరటం హరామ్ (నిషిద్ధం) :**

ఎందుకంటే వారు జీవించి ఉండగా ప్రార్థించే శక్తి కలిగి ఉంటారు. మరణించిన తరువాత వారికి ఆ శక్తి ఉండదు. సిఫారసు కొరకు మృతులను కోరటం కూడా అధర్మమే. ఎందుకంటే ఉమర్ బిన్ ఖత్తాబ్, ముఆవియా బిన్ అబీ సుఫ్యాన్ (رضي الله عنهم) లు గానీ, వారి కాలం నాటి సహాబీలు తాబయీలుగానీ కరువు కాటకాలు వచ్చినపుడు వర్షం కొరకు దైవాన్ని ప్రార్థించవలసిందిగా బ్రతికి ఉన్నవారినే కోరేవారు. ఉదాహరణకు : హజ్రత్ అబ్బాస్ (رضي الله عنه), యజీద్ బిన్ అస్వద్‌లను అభ్యర్థించేవారు. అంతేగాని వారు దైవప్రవక్త (ﷺ) సమాధి వద్దకు వచ్చి లేదా వేరొక స్థానంలో కూర్చొని ప్రవక్త (ﷺ) గారిని 'వసీలా'గా చేసుకోలేదు. సిఫారసు కోసం కూడా ఆయన్ని వేడుకోలేదు. వర్షం కోసం కూడా ఆయన్ని మొరపెట్టుకోలేదు. పైగా వారు, ఆ కాలంలో సజీవులుగా ఉన్న అబ్బాస్ (رضي الله عنه), యజీద్ బిన్ అస్వద్ వంటి వారినే అభ్యర్థించారు. ఈ సందర్భంగా హజ్రత్ ఉమర్ (رضي الله عنه) ఇలా అంటున్నారు :

**"ఓ అల్లాహ్! గతంలో మేము మా ప్రవక్త ద్వారా నిన్ను అర్థించేవారము. నీవు వర్షం కురిపించి మా కరువు తీర్చేవాడివి. ఇప్పుడు మేము మా ప్రవక్త బాబాయి గారిని ఆశ్రయించి నిన్ను ప్రార్థిస్తున్నాము. కనుక మాపై వర్షం కురిపించు."**

షరీయత్ ప్రకారం దైవప్రవక్త (ﷺ) ను దుఆ కొరకు సాధనంగా చేసుకోవటానికి వీలు లేనపుడు వారు ఆయన (ﷺ) బదులు ఆయన బాబాయి గారిని 'సాధనం' గా చేసుకున్నారు.

ఒకవేళ సమాధి వద్దకు వచ్చి ప్రార్థనల కొరకు ఆయన్ని 'వసీలా'గా చేసుకోవటం ధర్మసమ్మతం అయివుంటే, ప్రవక్త ప్రియసహచరులు తప్పకుండా ఆ పని చేసి ఉండేవారు. (మజ్మూఅ ఫతావా : 1/318, 319)

కాని ప్రియ సహచరులు (رضي الله عنهم) దైవప్రవక్త (ﷺ)మరణించిన పిదప అలా

చేయలేదంటే, మృతులను ఆశ్రయించటం ధర్మసమ్మతం కాదని తేలిపోయింది. ప్రవక్త శిష్యులు ఆయన (ﷺ) సమాధి వద్దకు వచ్చి ఏదన్నా విజ్ఞప్తి చేసుకోవటంగానీ, సిఫారసు కొరకు అభ్యర్థించుకోవటం గానీ చేయలేదు. ఒకవేళ అందుకు అనుమతి ఉండి ఉంటే వారు ప్రవక్త సమాధిని విడిచిపెట్టి, ఆయన (ﷺ) కంటే తక్కువ స్థాయిగల సహచరుల వద్దకు వెళ్ళేవారే కాదు.

**(2) దైవప్రవక్త (ﷺ) అంతస్తును, వేరితరుల అంతస్తులను 'వసీలా' (ఆధారం)గా చేసుకోవటం సమ్మతం కాదు :**

దైవప్రవక్త (ﷺ) స్థాయిని, అంతస్తును 'వసీలా'గా చేసుకునే విషయమై ఈ క్రింది హదీసు ఉదాహరించబడుతోంది –

"إِذَا سَأَلْتُمُ اللّٰهَ فَاسْئَلُوهُ بِجَاهِي، فَإِنَّ جَاهِي عِنْدَاللّٰهِ عَظِيمٌ" (موضوع، باطل التوسل للالباني:١١٦)

**(మీరు అల్లాహ్‌ను ఏదైనా అడగదలచినపుడు నా హోదాను, అంతస్తును ఆసరాగా చేసుకుని అడగండి. ఎందుకంటే అల్లాహ్ దగ్గర నా స్థాయి చాలా గొప్పది. మౌజూ, బాతిల్, 'అత్తవస్సుల్ లిల్' – అల్ బాని–116).**

ఇదొక కాల్పనిక హదీసు. ఇందులో సత్యం లేశమైనా లేదు. ఎన్నదగ్గ పుస్తకాలలో గానీ, ప్రామాణిక హదీసు సంకలనాలలో గానీ దీని జాడ ఎక్కడా లేదు. హదీసువేత్తలు కూడా ఈ 'హదీసు'ను ఎక్కడా ప్రస్తావించలేదు. (మజ్మూఅ ఫతావా : 10/319)

**(3) సృష్టితాలలో ఏ ఒక్కరి అస్తిత్వాన్నయినా ఆధారంగా చేసుకోవటం ధర్మసమ్మతం కాదు :**

ఎందుకంటే సృష్టితాల అస్తిత్వాన్ని ఆధారంగా చేసుకుని అర్థించటాన్ని అల్లాహ్ దుఆ స్వీకృతికి కారణంగా చేయలేదు. ఆ విధంగా చేయటాన్ని తన దాసుల కొరకు సమ్మతించనూ లేదు.

**(4) సృష్టితాల హక్కును 'వసీలా'గా చేసుకోవటం రెండు కారణాల వల్ల అధర్మం :**

**మొదటిది :** అల్లాహ్‌పై ఏ ప్రాణికీ ఎటువంటి హక్కూ లేదు. పైగా అల్లాహ్‌యే తన సృష్టితాలపై దయదలుస్తున్నాడు. వారికి ఉపకారం చేస్తున్నాడు. ఉదాహరణకు : అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَكَانَ حَقًّا عَلَيْنَا نَصْرُ الْمُؤْمِنِينَ﴾ (الروم:٤٧)

**"విశ్వాసులకు సహాయపడటం మా బాధ్యత." (అర్ రూమ్ : 47)**

ఈ విధంగా విధేయుడైన దైవదాసుడు దేవుని దయానుగ్రహాలకు, బహుమానానికి



పాత్రుడవుతాడు. అంతేగాని సాటి మనుషులలో ఒకరి హక్కు ఇంకొకరిపై ఉన్నట్లుగా మనిషి హక్కు దైవంపై ఉండదు.

**రెండవది :** అల్లాహ్ ఏ దాసుణ్ణి అయినా ప్రత్యేకంగా కటాక్షించదలిస్తే అది అతనికే ప్రత్యేకం. వేరొకరికి దానితో ఎలాంటి సంబంధం లేదు. కనుక ఎవరయినా అర్హత లేని వ్యక్తి దానిని 'వసీలా'గా చేసుకుంటే, తనకు పరిచితం కాని వస్తువు ద్వారా వసీలా పొందినట్లవుతుంది. కాగా; దాంతో అతనికెలాంటి సంబంధం ఉండదు. అటువంటి పనివల్ల అతనికెలాంటి లాభం చేకూరదు. తత్సంబంధితమయిన హదీసు పదాలు ఇవి:

"أَسْأَلُكَ بِحَقِّ السَّائِلِينَ" (الضعيفة:٢٤، ابن ماجه:٧٧٨ ضعيف)

**"నేను నిన్ను అర్థించేవారి హక్కు ఆధారంగా అర్థిస్తున్నాను." (అజ్జయీఫ–24, ఇబ్నుమాజ–778 జయీఫ్)**

ఈ హదీసు సత్యమని నిరూపితం కాలేదు. ఎందుకంటే దీని సనదులో అతియ అల్ ఉఫా అనే ఉల్లేఖకుడు కొంతమంది హదీసువేత్తల ప్రకారం ఎన్నదగ్గవాడు కాదు. అందువల్ల ఈ రకమయిన హదీసును విశ్వాస వ్యవహారాలలో ఒకానొక ముఖ్యాంశం కొరకు ఆధారంగా చేసుకోవటం తగదు. అదలా ఉంచితే ఫలానా వ్యక్తి హక్కు ఆధారంగా అర్థిస్తున్నట్లు ఇదమిత్థంగా చెప్పబడలేదు. దానికి బదులు అర్థించే వారి హక్కు ఆధారంగా అర్థిస్తున్నట్లు ప్రస్తావించబడింది. అర్థించేవారి హక్కు ఏమిటంటే వారి దుఆలు స్వీకరించబడాలి – అల్లాహ్ వారికి ఆ మేరకు హామీ ఇచ్చినట్లుగా! ఆ హక్కును అల్లాహ్ స్వయంగా తనపై తప్పనిసరిగా చేసుకున్నాడు. వేరితరులు ఆయనపై దానిని తప్పనిసరిగా చేయలేదు. కాబట్టి యదార్థానికి అల్లాహ్ యొక్క నిజమయిన వాగ్దానాన్ని ఆధారంగా చేసుకుని అర్థించాలి గాని సృష్టితాల హక్కును ఆశ్రయించి కాదు.

**(ఇ) సహాయం చేయమని, కష్టం తొలగించమని సృష్టితాలను అర్థించటం :** ఇస్లామీయ పరిభాషలో దీని కొరకు రెండు ప్రత్యేక పదాలు ఉన్నాయి. (1) ఇస్తిఆనత్ (2) ఇస్తిగాసహ్

**1. ఇస్తిఆనత్ :** ఏదేని వ్యవహారంలో మద్దతును, సమర్థనను కోరటం.

**2. ఇస్తిగాసహ్ :** ఏదేని ఆపదను, కష్టాన్ని దూరం చేయమని విజ్ఞప్తి చేయటం.

సహాయపడమని, గండం నుండి గట్టెక్కించమని సృష్టితాలను కోరటం రెండు రకాలుగా ఉంటుంది.

మొదటి రకం : తనకు సహాయపడమని లేదా తనను ఆదుకోమని బ్రతికి ఉన్న వారిని అడగటం. అయితే వారిలో అట్టి స్తోమత, శక్తి ఉండి ఉండాలి. ఇలాంటి సహాయం కొరకు అర్థించటం ధర్మసమ్మతమే. ఈ నేపథ్యంలో అల్లాహ్ ఏమన్నాడో చూడండి :

﴿وَتَعَاوَنُوا عَلَى الْبِرِّ وَالتَّقْوَىٰ﴾ (المائدة:٢)

**సత్కార్యాలలో, దైవభీతితో కూడిన విషయాలలో పరస్పరం సహాయ**

**సహకారాలు అందించుకోండి. (అల్ మాయిద : 2)**

అల్లాహ్ ఇంకా ఈ విధంగా సెలవిచ్చాడు :

﴿فَاسْتَغَاثَهُ الَّذِي مِن شِيعَتِهِ عَلَى الَّذِي مِنْ عَدُوِّهِ﴾(القصص:١٥)

**అతని వర్గానికి చెందిన వ్యక్తి, శత్రు వర్గానికి చెందినవానికి వ్యతిరేకంగా సహాయపడమని మూసాను పిలిచాడు. (అల్ ఖసస్ : 15)**

## రెండవ రకం :

కేవలం అల్లాహ్ మాత్రమే చేయగల పనులకై సృష్టితాలను అర్థించటం. ఇది అధర్మం. ఉదాహరణకు : మృతులను సహాయం కొరకు మొరపెట్టుకోవటం లేదా ఆపదను తొలగించమని ఫిర్యాదు చేసుకోవటం లేదా కేవలం అల్లాహ్‌కు సాధ్యమైన విషయాల కొరకు బ్రతికి ఉన్న వారిని అర్థించటం, కష్టాన్ని దూరం చేయమని విన్నవించుకోవటం. ఉదాహరణకు : రోగులకు ఆరోగ్యాన్ని ప్రసాదించటం, ప్రకృతి వైపరీత్యాల వంటి గండాల నుండి గట్టెక్కించటం, వ్యాకులతను దూరం చేయటం మొదలగునవి. ఇలాంటి వాటి కోసం మనుషులను (సృష్టితాలను) వేడుకోవటం అధర్మం. పైగా ఇది షిర్కె అక్బర్ (పెద్ద తరహా షిర్క్) గా పరిగణించబడుతుంది. దైవప్రవక్త (ﷺ) హయాంలో ఒక కపట విశ్వాసి ముస్లిములను వేధించేవాడు. దానిపై కొంతమంది సహచరులు, "దైవప్రవక్త (ﷺ) వద్దకు వెళ్ళి అతని బెడదను తొలగించమని ఫిర్యాదు (ఇస్తెగాసహ్) చేద్దాం పదండి" అని కూడబలుక్కుని వెళ్ళారు. దైవప్రవక్త (ﷺ) వారితో ఇలా అన్నారు –

''إِنَّهُ لَا يُسْتَغَاثُ بِي وَ إِنَّمَا يُسْتَغَاثُ بِاللهِ''(طبرانی،مجمع الزوائد:۱۷۲۷۶،حسن،احمد)

**"ఫిర్యాదు చేసుకోవలసింది నాకు కాదు, అల్లాహ్‌కు ఫిర్యాదు చేసుకోవాలి." (తిబ్రానీ, మజ్మాఉ జవాయిద్–17276, అహ్మద్)**

తన కోసం 'ఇస్తెగాసహ్' (ఫిర్యాదు) పద ప్రయోగాన్ని ఆయన (ﷺ) ఇష్టపడలేదు. చూడబోతే ఆయన (ﷺ) తన జీవిత కాలంలో ఆ బెడదను తొలగించే స్థోమత కలిగి ఉన్నారు. అయితే తౌహీదు (దేవుని ఏకత్వపు) రక్షణ కోసం, షిర్క్ ద్వారాలను మూసివేయటం కోసం, తమ ప్రభువు పట్ల వినయ వినమ్రతలలో ఏ లోటూ రాకుండా జాగ్రత్తపడే నిమిత్తం, తన అనుయాయుల మనో వాక్కాయ కర్మలను సంస్కరించే నిమిత్తం ప్రవక్త మహనీయులు (ﷺ) అలా అన్నారు : తన జీవిత కాలంలోనే ఆయన (ﷺ) ఈ విషయంలో ఇంత సెన్సిటివ్‌గా ఉన్నప్పుడు, తన మరణానంతరం ఈ విధంగా ఫిర్యాదు (ఇస్తెగాసహ్) చేసుకోవటాన్ని ఎలా సహిస్తారు? కేవలం అల్లాహ్ మాత్రమే చేయగల పనుల కోసం ఆయన్ని (ﷺ) అర్థించటం ఎంత వరకు సబబు? (ఫత్‌హుల్ మజీద్, పేజీ : 196, 197).

ఇలాంటి విషయాలు ప్రవక్త మహనీయుల (ﷺ) పట్లనే ధర్మసమ్మతం కానపుడు ఇతరుల పట్ల మాత్రం ఎలా ధర్మసమ్మతం అవుతాయి? ముమ్మాటికీ కాలేవు.



**ఐదవ అధ్యాయం**

# దైవప్రవక్త (ﷺ) యెడల, ఆయన కుటుంబీకుల యెడల, ప్రియ సహచరుల (رضي الله عنهم) యెడల తప్పనిసరిగా ఉండవలసిన విశ్వాసం

ఈ విషయాన్ని ఆరు ప్రకరణములుగా విభజించటం జరిగింది.

**మొదటి ప్రకరణం:** దైవప్రవక్త (ﷺ) పట్ల ఆదరాభిమానాలు అవశ్యం. అభిమానంలో అతిశయిల్లరాదని తాకీదు. ఆయన (ﷺ) ఔన్నత్యం, అంతస్తు గురించి విశదీకరణ.

**రెండవ ప్రకరణం :** ఆయన (ﷺ)కు విధేయత చూపటం, ఆయన్ని (ﷺ) అనుసరించటం అనివార్యం.

**మూడవ ప్రకరణం:** ఆయన (ﷺ)పై దురూద్, సలాం పంపవలసిన ఆవశ్యకత.

**నాల్గవ ప్రకరణం :** ప్రవక్త ఇంటివారల ప్రాశస్త్యం. వారిపట్ల మర్యాదగా మెలగవలసిన ఆవశ్యకత – ఈ సందర్భంగా అతివాదానికి లోనుకారాదని ఉద్బోధ.

**ఐదవ ప్రకరణం :** ప్రవక్త ప్రియసహచరుల ప్రాశస్త్యం. వారి విషయంలో తప్పనిసరిగా ఉండవలసిన నమ్మకం. పరస్పర విభేదాల విషయంలో 'అహ్లె సున్నత్ వల్ జమాఅత్' వైఖరికి కట్టుబడటం గురించి.

**ఆరవ ప్రకరణం :** సహాబా మరియు ఇమాముల సూచనలను తూలనాడరాదని ఉద్బోధ.

## మొదటి ప్రకరణం

# మహనీయ ముహమ్మద్ (ﷺ) యెడల ప్రేమాభిమానాలు, గౌరవ ప్రపత్తులు తప్పనిసరి. అయితే అతివాదం అవాంఛనీయం. ఆయన (ﷺ) స్థాయి అత్యున్నతం

**(1) ఆయన (ﷺ) యెడల ప్రేమాభిమానాలు, గౌరవ ప్రపత్తులు అవశ్యం :**

అందరికన్నా ముందు అల్లాహ్ యెడల ప్రేమాతిశయంతో మెలగవలసిన బాధ్యత దాసునిపై ఉంది. ఇది ఆరాధనలో అత్యుత్తమ శ్రేణికి చెందిన అంశం. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَالَّذِينَ آمَنُوا أَشَدُّ حُبًّا لِّلَّهِ﴾ (البقرة:١٦٥)

**"విశ్వసించిన వారు అల్లాహ్‌ను ప్రగాఢంగా ప్రేమిస్తారు." (అల్ బఖర:165)**

ఎందుకంటే తన దాసులను అసంఖ్యాకమయిన అనుగ్రహాల ద్వారా దయదలిచే ప్రభువు ఆయనే.

అల్లాహ్ యెడల ప్రేమ తరువాత ఆయన సందేశహరులైన ముహమ్మద్ (ﷺ)పై అత్యధిక ప్రేమను కలిగి ఉండటం అవశ్యం. ఎందుకంటే ఆయనే (ﷺ) జనులను అల్లాహ్ వైపు పిలిచారు. ఆయన పట్ల మన బాధ్యతలేవో ఎరుకపరిచారు. ఆయన షరీయత్‌ను మనకు పరిచయం చేశారు. ఆయన ఆజ్ఞలను మనకు విడమరచి చెప్పారు. విశ్వాసులకు (ముస్లింలకు) ప్రాప్తమయిన ఇహపరాల సాఫల్యాలన్నీ ఆయన (ﷺ) ద్వారానే ప్రాప్తించాయి. ఏ వ్యక్తీ ఆయనకు విధేయత చూపకుండా, ఆయన విధానాన్ని అనుసరించకుండా స్వర్గంలో ప్రవేశించలేడు. హదీసులో ఉంది :

"ثَلَاثٌ مَنْ كُنَّ فِيهِ وَجَدَ حَلَاوَةَ الإِيمَانِ أَنْ يَكُونَ اللَّهُ وَرَسُولُهُ أَحَبَّ إِلَيْهِ مِمَّا سِوَاهُمَا، وَأَنْ يُحِبَّ الْمَرْءَ لَا يُحِبُّهُ إِلَّا لِلَّهِ، وَأَنْ يَكْرَهَ أَنْ يَعُودَ فِي الْكُفْرِ بَعْدَ أَنْ أَنْقَذَهُ اللَّهُ مِنْهُ، كَمَا يَكْرَهُ أَنْ يُقْذَفَ فِي النَّارِ" (متفق عليه)

**"మూడు విషయాలు ఎవరిలోనయితే ఉన్నాయో అతను విశ్వాస మాధుర్యాన్ని పొందాడు. (1) అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త అతని దృష్టిలో వేరితరులకన్నా ఎక్కువ ప్రియతములై ఉండాలి.**



**(2) అతను ఎవరిని ప్రేమించినా కేవలం అల్లాహ్ కొరకే ప్రేమించేవాడై ఉండాలి. (3) అల్లాహ్ తనకు మోక్షం ప్రసాదించిన మీదట, తాను అవిశ్వాసం (కుఫ్ర్) వైపునకు మళ్ళించబడటం అనేది అతని దృష్టిలో అగ్నిలో పడవెయ్యబడటం కన్నా ఎక్కువ అయిష్టకరం అయి ఉండాలి." (ముత్తఫఖున్ అలై – ఉభయేకీభవితం)**

దైవప్రవక్త (ﷺ) యెడల గల ప్రేమ దైవప్రేమకు లోబడి ఉండాలి. స్థాయి రీత్యా అది అల్లాహ్ ప్రేమ తర్వాతే.

ఒక్క అల్లాహ్ తప్ప – ఆయన (ﷺ) యెడల గల ప్రేమ మిగిలిన వారందరి ప్రేమకన్నా అత్యధికంగా ఉండాలి. ఈ విషయమై ఆయన (ﷺ) ఇలా అన్నారు :

"لَا يُؤْمِنُ أَحَدُكُمْ حَتَّى أَكُونَ أَحَبَّ إِلَيْهِ مِنْ وَلَدِهِ وَوَالِدِهِ وَالنَّاسِ أَجْمَعِينَ" (بخاری ومسلم)

**"మీలో ఏ వ్యక్తి కూడా, తన ఆలుబిడ్డలకన్నా, తన తల్లిదండ్రులకన్నా, సమస్త మానవులకన్నా ఎక్కువగా నన్ను ప్రేమించనంత వరకూ విశ్వాసి కాజాలడు." (ముత్తఫఖున్ అలై)**

విశ్వాసి కొరకు దైవప్రవక్త (ﷺ) అతని ప్రాణంకన్నా ఎక్కువ ప్రియతములై ఉండాలని హదీసులో అనబడింది. ఒక హదీసు ప్రకారం హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (رضي الله عنه), "ఓ దైవప్రవక్తా (ﷺ)! మీరు నా ప్రాణం తప్ప మిగతా వస్తువులన్నింటికన్నా నాకు ఎక్కువ ప్రియతములు" అని చెప్పగా, ఆయన (ﷺ) ఇలా అన్నారు :

"وَالَّذِي نَفْسِي بِيَدِهِ حَتَّى أَكُونَ أَحَبَّ إِلَيْكَ مِنْ نَفْسِكَ" (بخاری)

**"ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా! నీ దృష్టిలో నేను నీ ప్రాణం కన్నా ఎక్కువ ప్రియతముణ్ణి కానంత వరకూ (నీ విశ్వాసం పరిపూర్ణం కాజాలదు)."**

**ఇది విని ఉమర్ (రజి) "ఇప్పుడు మీరు నా దృష్టిలో నా ప్రాణం కన్నా ఎక్కువ ప్రియతములు" అన్నారు. అప్పుడు ఆయన (సఅసం), "ఉమర్! ఇప్పుడు నీ విశ్వాసం పరిపూర్ణం అయింది" అని చెప్పారు. (బుఖారీ)**

ఈ హదీసు ద్వారా ప్రస్ఫుటమయిన విషయం ఏమిటంటే, ఒక విశ్వాసి (మోమిన్) దైవప్రవక్త (ﷺ)ను ప్రగాఢంగా ప్రేమించటం తప్పనిసరి. అల్లాహ్ ప్రేమ తర్వాత

మిగతా వస్తువులన్నింటి కంటే అధికంగా అతను మహాప్రవక్త (ﷺ)ను ప్రేమించాలి. ఎందుకంటే దైవప్రవక్త (ﷺ) పట్ల గల ప్రేమ రెండవ స్థానంలో ఉంటే, దేవుని పట్ల గల ప్రేమ మొదటి స్థానంలో ఉండాలి. ఎవరు ఎవరిని ప్రేమించినా అది అల్లాహ్ ప్రీతి కొరకే అయి ఉండాలి.

దైవప్రవక్త (ﷺ) యెడల గల ప్రేమ మన నుండి కోరేది ఏమిటి? అంటే మనం ఆయన యెడల మర్యాదపూర్వకంగా మెలగాలి. ఆయనకు విధేయత చూపాలి. ఆయన విధానాన్ని ఖచ్చితంగా అనుసరించాలి. ఆయన (ﷺ) మాటకు వేరితరుల మాటకన్నా ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. ఆయన (ﷺ) నెలకొల్పిన సంప్రదాయం మనకు శిరోధార్యం కావాలి.

అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) ఇలా అంటున్నారు :

మనిషి ఎవరిని ఎంతగా ప్రేమించినా, ఎంతటి గౌరవ ప్రపత్తులతో మెలగినా అది అల్లాహ్ పట్ల గల ప్రేమకు, భక్తికి లోబడి ఉన్నప్పుడు మాత్రమే ఆమోదయోగ్యమవుతుంది. ఉదాహరణకు : దైవప్రవక్త (ﷺ) యెడల మనకు గల ఆదరాభిమానాలు, ఆయన్ని (ﷺ) ప్రవక్తగా పంపిన వాని యెడల (అల్లాహ్ యెడల) గల ప్రేమాభిమానాల పరిపూర్తికి తార్కాణం. ఎందుకంటే అల్లాహ్ ఆయన్ని ప్రేమిస్తున్నందువల్లనే ఆయన (ﷺ) అనుయాయులు ఆయన్ని ప్రేమిస్తున్నారు. అల్లాహ్ ఆయన్ని సత్కరించినందు వల్లనే ఉమ్మత్ సభ్యులు ఆయన పట్ల సత్కార భావంతో వ్యవహరిస్తున్నారు. ఈ విధంగా అల్లాహ్ కొరకే ఆయన (ﷺ) యెడల ప్రేమాభిమానం ప్రకటిస్తున్నారు.

మొత్తానికి అల్లాహ్ తన ప్రవక్త (ﷺ)ను అపూర్వంగా సత్కరించాడు. ఆయన వ్యక్తిత్వం పట్ల గౌరవభావంతో పాటు ప్రేమ, భయం కూడా కలిగేలా మలిచాడు. అందుకే ఆయన్ని చూచిన మనిషిలో ప్రేమ జనించటంతో పాటు గౌరవ భావం, భయం కూడా కలుగుతాయి. ప్రవక్త ప్రియ సహచరుల (رضي الله عنهم)కు ఆయన్ని చూసినపుడు ఈలాంటి భావనే కలిగేది. ఇతర మనుషులను చూసినపుడు వారికి ఇలాంటి వింతానుభూతి కలిగేది కాదు.

అమ్ర్ బిన్ ఆస్ (رضي الله عنه) ఇస్లాం స్వీకరించిన తరువాత ఆయన్ని (ﷺ) ఉద్దేశ్యించి ఇలా అన్నారు : "నా దృష్టిలో మీకన్నా ఎక్కువ ఆగ్రహించదగినవారు, ద్వేషించదగినవారు ఎవరూ ఉండేవారు కారు. కాని ఇస్లాం స్వీకరించిన మీదట నా దృష్టిలో మీకన్నా ఎక్కువ ప్రియతముడైన వ్యక్తి ఎవరూ లేరు. నా దృష్టిలో మీకన్నా ఎక్కువ ఆదరణీయుడైన వ్యక్తి ఎవరూ లేరు. మీ గుణగణాలను గురించి వివరించమని నాతో అంటే నేను వివరించలేను. ఎందుకంటే మీ పట్ల గల భయం, గౌరవభావం వల్ల నేను ఎన్నడూ మిమ్మల్ని తనివితీరా చూడలేకపోయాను."

ఉర్వహ్ బిన్ మస్ఊద్ ఖురైషులతో ఇలా అన్నాడు : "నా జాతి ప్రజలారా!



దైవసాక్షిగా చెబుతున్నాను. రోము, పారసీక చక్రవర్తుల దర్బారులోనూ, వేరితర రాజ్యాధినేతల దర్బారులోనూ వెళ్ళే అవకాశం నాకు లభించింది. కాని ముహమ్మద్ (ﷺ) అనుచరులు ముహమ్మద్ (ﷺ) యెడల చూపేంతటి గౌరవ ప్రపత్తులను నేను ఏ చక్రవర్తి పట్ల కూడా అతని పాలితులు చూపుతున్నట్లు కానలేదు. దైవసాక్షి! ఆయన పట్ల గల గౌరవం కొద్దీ వారు ఆయన కళ్ళల్లో కళ్ళు పెట్టి చూడటం లేదు. ఆయన ఎప్పుడయినా ఉమ్మి వేసినా అది ఎవరో ఒక సహచరుని అరచేతుల్లో పడుతోంది – దానిని అతను తన ముఖానికో, ఛాతీకో పూసుకుంటున్నాడు. ఆయన వుజూ చేస్తున్నప్పుడు, క్రిందపడే నీళ్లను తీసుకోవటానికి వారు పరస్పరం ఎగబడుతున్నారు." (జిలాయిల్ ఇఫ్హామ్ : 120, 121)

**(2) ఆయన (ﷺ)ను కొనియాడటంలో అతిశయిల్లకూడదు :**

ఒకరి ప్రేమలో, మన్ననలో మితిమీరి పోవటాన్ని అరబీలో 'ఘులూ' అంటారు. దీనినే తెలుగులో అతిశయిల్లటం, అతిగా ప్రవర్తించటం అనవచ్చు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿لَا تَغْلُوا فِي دِينِكُمْ﴾ (النساء:١٧١)

**"మీరు మీ ధర్మం విషయంలో అతిశయిల్లకండి."(అన్ నిసా : 171)**

ఒకరి పొగడ్తలో హద్దుమీరి పోవటాన్ని, అందులో అబద్ధాలను కూడా జొప్పించటాన్ని **'ఇత్రా'** అంటారు.

దైవప్రవక్త (ﷺ) యెడల అతిశయిల్లటం అంటే – ఆయన (ﷺ) గొప్పతనాన్ని వర్ణించేటప్పుడు మితిమీరిపోవటం, సూటిగా చెప్పాలంటే ఆయన్ని దైవదాస్యపు, దైవదౌత్యపు స్థానం నుండి మరింత పైకెత్తటం, దైవత్వపు కొన్ని గుణాలను ఆయన (ﷺ)కు ఆపాదించటం, అల్లాహ్‌ను వదలి సహాయం కొరకు ఆయన్ని (ﷺ) అర్థించటం, గండం నుండి గట్టెక్కించమని విజ్ఞప్తి చేసుకోవటం మొదలగునవి.

ఆయన్ని పొగడటంలో శృతి మించటం (ఇత్రా) అంటే : ఆయన (ﷺ) ను మెచ్చుకునేటప్పుడు అతిశయోక్తులతో కూడిన మాటలు చెప్పటం. ఇలా చేయరాదని ఆయన (ﷺ) స్వయంగా తాకీదు చేశారు –

"لَا تُطْرُونِي كَمَا أَطْرَتِ النَّصَارَى ابْنَ مَرْيَمَ إِنَّمَا أَنَا عَبْدٌ فَقُولُوا: عَبْدُ اللهِ وَرَسُولُهُ" (متفق عليه)

**"క్రైస్తవులు మర్యమ్ కుమారుడగు ఈసా (ఏసుక్రీస్తు)ను పొగడటంలో మితిమీరినట్లుగా మీరు నా ప్రశంసలో మితిమీరకండి. నేనొక దాసుణ్ణి**

**మాత్రమే. కనుక నన్ను దైవదాసుడనీ, ఆయన ప్రవక్త అనీ అనండి."**
**(ముత్తఫకున్ అలై)**

అంటే నన్ను పొగిడే విషయంలో అనుచితంగా ప్రవర్తించకండి. అవసరానికి మించి పొగడకండి. క్రైస్తవులు ఈసా (ﷺ)ను పొగడ్తల్లో ముంచెత్తుతూ, కడకు ఆయన్ని దైవత్వపు స్థానంలో ప్రతిష్ఠించారు. నా ప్రభువు నన్ను ఏ గుణాలతో సత్కరించాడో ఆ గుణాలతోనే నన్ను శ్లాఘించండి. నన్ను అల్లాహ్ దాసుడని అనండి. అల్లాహ్ సందేశ హరుడని అనండి.

"మీరు మా సయ్యిద్ (నాయకమన్యులు)" అని కొంతమంది సహచరులు (رضي الله عنهم) చెప్పినపుడు, "అల్లాహ్‌యే అసలు సయ్యిద్" అని ఆయన (ﷺ) పలికారు.

అప్పుడు వారు, "మీరు మా అందరిలోకెల్లా ఉత్తములు. బలపరాక్రమాల రీత్యా దావూద్ దహెష్ కన్నా గొప్పవారు" అని అభిప్రాయపడగా ఆయన (ﷺ) ఇలా అన్నారు : "నిశ్చయంగా మీరు ఈ మాటలనండి లేదా వాటిలో కొన్ని మాత్రమే అనండి (కాదనను). కాని చూడండి! షైతాన్ మిమ్మల్ని దారి తప్పించరాదు సుమా!" (అబూదావూద్) (అంటే అప్రయత్నంగా అంటే ఫరవాలేదు గాని, అందులో మొహమాటానికి తావుండరాదు. కృత్రిమంగా మాటలు కల్పించకూడదు. అవి షైతాన్ తరఫున వకాల్తా పుచ్చుకున్నట్లుగా ఉండకూడదు. ఎందుకంటే దీనివల్ల షైతాన్‌కు మిమ్మల్ని పెడదారి పట్టించే అవకాశం చిక్కుతుంది).

కొంతమంది ఆయన్ని (ﷺ) ఉద్దేశ్యించి, "ఓ దైవప్రవక్తా! మా అందరిలోకీ శ్రేష్ఠుడా! మా అందరిలోకీ ఉత్తముడైన వాని పుత్రుడా! మా నాయకుడా! మా నాయకుని కుమారుడా!" అని సంబోధించగా, ఆయన (ﷺ) ఇలా ఉపదేశించారు :

"يَا أَيُّهَا النَّاسُ قُولُوا بِقَوْلِكُمْ وَلَا تَسْتَهْوِيَنَّكُمُ الشَّيْطَانُ، أَنَا مُحَمَّدٌ عَبْدُ اللهِ وَرَسُولُهُ، مَا أُحِبُّ أَنْ تَرْفَعُونِي فَوْقَ مَنْزِلَتِي الَّتِي أَنْزَلَنِي اللهُ عَزَّوَجَلَّ" (نسائی فی عمل الیوم و اللیلة ۲۴۸/۲۴۹، صحیحہ ۱۰۹۷، احمد: ۳/۱۵۳، ۲۴۱، ابن حبان: ۲۴۰)

**"ప్రజలారా! మీరు నా గురించి ఈ విధమైన మాటలు అనగలరు. కాని చూడండి! షైతాన్ మిమ్మల్ని కవ్వించకూడదు సుమా! ముహమ్మద్ నైన నేను దైవదాసుడను, దైవప్రవక్తను. గౌరవోన్నతుడగు అల్లాహ్ నన్ను ఏ స్థానంలో ఉంచాడో, ఆ స్థానం నుండి నన్ను పైకెత్తడాన్ని నేను ఇష్టపడను."**
**(అహ్మద్-3/153, నసాయి, అస్సహీహహ్ -1097)**

మహాప్రవక్త (ﷺ) నిశ్చయంగా మానవోత్తములై ఉండి కూడా "మీరు మా నాయకులు ... మీరు మా అందరిలోకీ శ్రేష్ఠులు ... మీరు మా అందరికన్నా గొప్పవారు"



లాంటి బిరుదులను తన కొరకు ఇష్టపడలేదు. తన విషయంలో ప్రజలను అతివాదం నుండి దూరంగా ఉంచటానికి, తౌహీద్‌ను రక్షించటానికి ఆయన (ﷺ) ఈ విధంగా పలకరాదని తాకీదు చేశారు. తనను కేవలం రెండు గుణాలతో సత్కరించమని ఆయన (ﷺ) కోరారు. అవే (1) దైవదాసుడు (2) దైవప్రవక్త. ఒక దాసుని కొరకు ఇవే చాలా గొప్ప స్థానాలు. ఇలా పలకటం వల్ల మనిషి అతిశయిల్లడానికి గానీ, అతని విశ్వాసానికి ముప్పు వాటిల్లడానికి గానీ ఆస్కారం ఉండదు. దేవుడు ఆయన్ని ఏ స్థానంపై ప్రతిష్ఠించాడో, ఏ స్థాయిని ఆయన కొరకు సమ్మతించి ఆమోదించాడో ఆ స్థానం కన్నా పైకెత్తటాన్ని ఆయన సుతరామూ ఇష్టపడలేదు. అయినప్పటికీ చాలామంది ఆయన (ﷺ) వారింపును అతిక్రమించారు. ఏ విషయాల కొరకు కేవలం అల్లాహ్‌ను మాత్రమే అర్థించాలో వాటికై ప్రవక్త (ﷺ)ను అర్థించటం మొదలెట్టారు. కష్టాలను తొలగించమని దైవప్రవక్త (ﷺ)కు ఫిర్యాదు చేసుకోసాగారు. ఉదాహరణకు : మీలాదుల రూపంలో, ఖసీదాల, నాతుల రూపంలో అడ్డూ ఆపూ లేకుండా ప్రజలు ఆయన (స)ను అర్థించసాగారు. ఈ సందర్భంగా వారు అల్లాహ్ హక్కుకు – ప్రవక్త (ﷺ) హక్కుకు మధ్య గల వ్యత్యాసాన్ని కూడా మరచిపోయారు.

అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) తన 'ఖసీదా కనూనియా'లో ఇలా అన్నారు:

لله حق لا يكون لغيره ولعبده حق هما حقان
لاتجعلوا الحقين حقا واحدا من غير تميز ولا فرقان

**అల్లాహ్ యొక్క ఒక హక్కుంది. అది ఎవరికీ చెందదు. ఆయన దాసుని హక్కు ఒకటుంది. ఇవి రెండూ వేర్వేరు హక్కులు. కనుక ఆ రెండు హక్కులనూ విచక్షణా రహితంగా ఒకే హక్కుగా చేయకండి.**

**(3) ఆయన (ﷺ) స్థానం అత్యున్నతం**

దేవుడు ఆయన (ﷺ)కు ప్రసాదించిన స్థానం గురించి, ఆయన్ని ప్రశంసించిన తీరును గురించి అభివర్ణించటం ఏ విధంగానూ ఆక్షేపణీయం కాదు. అల్లాహ్ ఆయనకు ప్రశంసాత్మకమైన అత్యున్నత స్థానంపై ప్రతిష్ఠించాడు. ఆయన (ﷺ) అల్లాహ్ దాసులు. అల్లాహ్ సందేశహరులు. మానవులందరిలోనే ఉత్తములు, సర్వశ్రేష్ఠులు. ఆయన కేవలం మానవుల కొరకే కాదు, జిన్నుల వైపునకు కూడా ప్రవక్తగా చేసి పంపబడ్డారు. ఆయన ప్రవక్తలలో కెల్లా శ్రేష్ఠులు. ఆయన ప్రవక్తల పరంపరకు పరిసమాప్తిగా వచ్చిన అంతిమ దైవప్రవక్త. ఆయన తరువాత మరే ప్రవక్తా రారు. అల్లాహ్ ఆయన (ﷺ) హృదయాన్ని ఆయన కొరకు విప్పారజేశాడు. ఆయన నామ స్మరణను ఉన్నతికి చేర్చాడు. ఆయన

(ﷺ) ఆజ్ఞను ఎదిరించే వారిపై అవమానాన్ని, పరాభవాన్ని విధించాడు. ఆయన ప్రశంసాత్మకమయిన 'మఖామె మహ్మూద్'ను పొందారు. దాని గురించి పరమ ప్రభువు ఈ విధంగా ప్రస్తుతించాడు.

﴿عَسَى أَن يَبْعَثَكَ رَبُّكَ مَقَاماً مَّحْمُوداً﴾(الاسراء:٧٩)

**"త్వరలోనే నీ ప్రభువు నిన్ను 'మఖామె మహ్మూద్' (ప్రశంసాత్మక మయిన స్థానం)పై ప్రతిష్ఠిస్తాడు." (అల్ ఇస్రా : 79)**

ప్రళయదినాన దేవుడు తన ప్రవక్త (స)ను జనుల సిఫారసు కొరకు నిలిపే అత్యున్నత స్థానం అది! ఈ స్థానం ఒక్క ముహమ్మద్ ప్రవక్త (ﷺ) వారికే ప్రత్యేకం. ఆయన తప్ప మరే ప్రవక్తకూ ఈ స్థానం లభించదు.

ఆయన (ﷺ) దేవుని సృష్టితాలలో అందరికన్నా అధికంగా అల్లాహ్‌కు భయపడేవారు. అందరికన్నా ఎక్కువ భక్తిపరాయణులు. ఆయన (ﷺ) సమక్షంలో హెచ్చు స్వరంతో మాట్లాడటాన్ని సయితం అల్లాహ్ వారించాడు. ఆయన (ﷺ) ఎదుట మెల్లగా మాట్లాడేవారిని అల్లాహ్ ప్రశంసించాడు. ఇలా సెలవిచ్చాడు :

﴿يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا لَا تَرْفَعُوا أَصْوَاتَكُمْ فَوْقَ صَوْتِ النَّبِيِّ وَلَا تَجْهَرُوا لَهُ بِالْقَوْلِ كَجَهْرِ بَعْضِكُمْ لِبَعْضٍ أَن تَحْبَطَ أَعْمَالُكُمْ وَأَنتُمْ لَا تَشْعُرُونَ ☆إِنَّ الَّذِينَ يَغُضُّونَ أَصْوَاتَهُمْ عِندَ رَسُولِ اللَّهِ أُولَٰئِكَ الَّذِينَ امْتَحَنَ اللَّهُ قُلُوبَهُمْ لِلتَّقْوَىٰ لَهُم مَّغْفِرَةٌ وَأَجْرٌ عَظِيمٌ ☆إِنَّ الَّذِينَ يُنَادُونَكَ مِن وَرَاءِ الْحُجُرَاتِ أَكْثَرُهُمْ لَا يَعْقِلُونَ☆وَلَوْ أَنَّهُمْ صَبَرُوا حَتَّىٰ تَخْرُجَ إِلَيْهِمْ لَكَانَ خَيْراً لَّهُمْ وَاللَّهُ غَفُورٌ رَّحِيمٌ﴾(الحجرات:٢،٥)

**"ఓ విశ్వాసులారా! మీ కంఠ స్వరాలను ప్రవక్త కంఠస్వరం కంటే హెచ్చుగా ఉంచకండి. మీరు పరస్పరం బిగ్గరగా మాట్లాడుకునే విధంగా ఆయన (స)తో బిగ్గరగా మాట్లాడకండి. దీనివల్ల మీ కర్మలన్నీ వ్యర్థమైపోవచ్చు. దాని గురించి మీకు తెలియకనూపోవచ్చు. ఎవరయితే దైవప్రవక్త సమక్షంలో అణకువతో (తగ్గు స్వరంతో) మాట్లాడతారో వారి హృదయాలను అల్లాహ్ ధర్మపరాయణత (తఖ్వా) కోసం పరికించుకున్నాడు. వారికి మన్నింపుతో పాటు గొప్ప ప్రతిఫలం కూడా ఉంది. (ఓ ప్రవక్తా!) ఎవరయితే కుటీరాల వెనుక నుండి నిన్ను కేకవేసి పిలుస్తున్నారో వారిలో చాలామందికి (బొత్తిగా)**



**బుద్ధిలేదు. నీవంతట నీవుగా వారి దగ్గరకు వెడలి వచ్చేవరకూ వారు గనక ఓపిక పట్టి ఉంటే, అది వారి కొరకు మేలై ఉండేది. అల్లాహ్ క్షమాగుణం కలవాడు, దయాశీలుడు." (అల్ హుజురాత్:2 – 5)**

ఇమామ్ ఇబ్నె కసీర్ (رحمه الله) ఇలా అంటున్నారు : "ఈ సూక్తులలో అల్లాహ్ విశ్వాసులైన తన దాసులకు మర్యాదను, సంస్కారాన్ని నేర్పాడు. దైవప్రవక్త (ﷺ) యెడల ఎలా గౌరవభావంతో, మర్యాదపూర్వకంగా మసలుకోవాలో తెలియజేశాడు. దైవప్రవక్త (ﷺ) సమక్షంలో తమ కంఠస్వరాలను ప్రవక్త కంఠస్వరం కన్నా పెంచరాదని హితబోధ చేశాడు."

తన ప్రవక్త (ﷺ)ను పేరుతో పిలవటాన్ని కూడా అల్లాహ్ వారించాడు. అంటే 'ఓ ముహమ్మద్!' (ﷺ)అని అన్యులు పిలిచినట్లుగా పిలవరాదని, ఆయన ప్రవక్తా పదవి దృష్ట్యా 'ఓ దైవప్రవక్తా!', 'ఓ సందేశహరుడా!' అని మాత్రమే పిలవాలని ఉపదేశించాడు. ఈ విధంగా సెలవిచ్చాడు :

﴿لَا تَجْعَلُوا دُعَاءَ الرَّسُولِ بَيْنَكُمْ كَدُعَاءِ بَعْضِكُم بَعْضاً﴾(النور:٦٣)

**"మీరు దైవప్రవక్త పిలుపును, మీలో మీరు పిలుచుకునే మామూలు పిలుపులా భావించకండి." (అన్ నూర్ : 63)**

స్వయంగా అల్లాహ్ సయితం ఆయన్ని 'ఓ ప్రవక్తా!' అని సంబోధించాడు. అల్లాహ్ మరియు ఆయన దూతలు ఆయన (ﷺ)పై దురూద్, సలాం (కారుణ్యం) పంపుతున్నారు. తన దాసులు కూడా తన ప్రవక్త (ﷺ)పై సలాత్, సలాంలను పంపాలని అల్లాహ్ ఆజ్ఞాపించాడు. ఈ విధంగా సెలవీయబడింది :

﴿إِنَّ اللَّهَ وَمَلَائِكَتَهُ يُصَلُّونَ عَلَى النَّبِيِّ يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا صَلُّوا عَلَيْهِ وَسَلِّمُوا تَسْلِيماً﴾(الاحزاب:٥٦)

**నిశ్చయంగా అల్లాహ్, ఆయన దూతలు దైవప్రవక్తపై కారుణ్యాన్ని పంపిస్తున్నారు. ఓ విశ్వాసులారా! మీరు కూడా అతనిపై దురూద్ పంపండి. అత్యధికంగా అతనికి 'సలాములు' పంపుతూ ఉండండి. (అల్ అహ్జాబ్ : 56)**

అయితే ఖుర్ఆన్ హదీసుల ఆధారాలతో నిమిత్తం లేకుండా ఆయన్ని కొనియాడే ఉద్దేశంతో ఓ నిర్ధారిత సమయాన్ని, ఓ ప్రత్యేక దినాన్ని ప్రత్యేకించుకోవటం తగదు. ఈ మధ్య కొందరు ప్రబుద్ధులు ప్రవక్త (ﷺ) కీర్తన నిమిత్తం, ఆయన (ﷺ) పుట్టిన

తేదీగా భావించబడుతున్న దినాన్ని ప్రత్యేకించుకుంటున్నారు. ఇది ధర్మసమ్మతం కాదు. పైగా ఇదొక బిద్‌అత్ (కొత్త పోకడ).

ఆయన (ﷺ) నెలకొల్పిన సున్నత్ (సంప్రదాయం)ను గౌరవించటం, దానిని పాటించటం తప్పనిసరి అని నమ్మటం కూడా ఆయన (ﷺ) పట్ల గౌరవ మర్యాదల్లో అంతర్భాగమే. ఎందుకంటే ఖుర్‌ఆన్ తరువాత ఆయన (ﷺ) సున్నత్‌కు రెండవ స్థానం ఉంది. అది (సున్నత్) కూడా అల్లాహ్ తరఫున అందిన సంకేతమే. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿ وَمَا يَنطِقُ عَنِ الْهَوَى ☆ إِنْ هُوَ إِلَّا وَحْيٌ يُوحَى ﴾(النجم:٣-٤)

**అతను (ప్రవక్త) తన మనోవాంఛలకు లోబడి మాట్లాడటం లేదు. అది అతని వద్దకు పంపబడే 'వహీ' (దైవవాణి) తప్ప మరేమీ కాదు. (అన్ నజ్మ్ : 3, 4)**

కనుక దైవప్రవక్త (ﷺ) వారి సున్నత్ (విధానం, సంప్రదాయం)లో సందేహాలు రేకెత్తించటం, దాని ప్రాశస్త్యాన్ని తగ్గించటం ధర్మసమ్మతం కాదు. అలాగే దాని పరంపర, సనదులకు సంబంధించిన ప్రామాణికత లేక బలహీనతపై మిడిమిడి జ్ఞానంతో వ్యాఖ్యానించటం, జ్ఞానంతో నిమిత్తం లేకుండానే వాటికి తాత్పర్యం చెప్పటం సరైనది కాదు. ఈ మధ్య కాలంలో దైవప్రవక్త (ﷺ) సున్నత్‌పై నోరు పారేసుకునే అజ్ఞానులు చాలామంది పుట్టుకొచ్చారు. ముఖ్యంగా విద్యార్థి దశలో ఉన్న నవ యువకులు ఈ విషయంలో మరీను. వారు నిశిత జ్ఞానం లేకుండానే – కేవలం కొన్ని పుస్తకాలు చదివి, హదీసుల ప్రామాణికతపై, వాటి బలహీనతపై, హదీసు ఉల్లేఖకులపై 'అధిక ప్రసంగాలు' చేసేస్తున్నారు. ఈ ధోరణి స్వయంగా వారికీ, ఉమ్మత్‌కి కూడా ప్రమాదకరమే. వారు అల్లాహ్‌కు భయపడాలి. తమ అవధులను మీరకూడదు. ఇది చాలా అవసరం.



## రెండవ ప్రకరణం

# దైవప్రవక్త (ﷺ)కు విధేయత చూపటం అనివార్యం

మహాప్రవక్త ముహమ్మద్ (ﷺ) ఆదేశించిన వాటిని నెరవేరుస్తూ, ఆయన (ﷺ) వారించిన వాటికి దూరంగా ఉంటూ విధేయత చూపటం ప్రతి వ్యక్తికీ తప్పనిసరి. ఆయన (ﷺ) దైవప్రవక్త అని సాక్ష్యమిచ్చిన ప్రతి ఒక్కరి నుండీ ఈ విధంగా కోరబడింది. ఆయన (ﷺ)కు విధేయత చూపవలసిందిగా దేవుడు అనేక సూక్తులలో ఆజ్ఞాపించాడు. కొన్నిచోట్లయితే తనకు విధేయత చూపమని ఆజ్ఞాపించిన వెంటనే, తన ప్రవక్త (ﷺ)కు కూడా విధేయత కనబరచాలని ఆదేశించాడు. ఉదాహరణకు :

﴿يَا أَيُّهَا الَّذِينَ آمَنُواْ أَطِيعُواْ اللّهَ وَأَطِيعُواْ الرَّسُول﴾(النساء:٥٩)

**"ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు విధేయత చూపండి. ప్రవక్త (స)కు విధేయులై ఉండండి." (అన్ నిసా : 59)**

ఇలాంటి సూక్తులు ఇంకా ఉన్నాయి. ఒక్కోచోట కేవలం ఆయన (ﷺ)కు విధేయత చూపమని చెప్పబడింది. ఉదాహరణకు :

﴿ مَّنْ يُطِعِ الرَّسُولَ فَقَدْ أَطَاعَ اللّهَ ﴾(النساء:٨٠)

**ఈ ప్రవక్తకు విధేయత చూపినవాడు అల్లాహ్‌కు విధేయత చూపినట్లే. (అన్ నిసా : 80)**

వేరొక చోట ఈ విధంగా సెలవీయబడింది :

﴿وَأَطِيعُواْ الرَّسُولَ لَعَلَّكُمْ تُرْحَمُونَ﴾(النور:٥٦)

**దైవప్రవక్త విధేయులుగా మసలుకోండి – తద్వారానే మీరు కరుణించబడతారు. (అన్ నూర్ : 56)**

ఒక్కోచోట తన ప్రవక్త (ﷺ)కు అవిధేయత కనబరిచే వారిని దేవుడు హెచ్చరించాడు. ఉదాహరణకు :

﴿ فَلْيَحْذَرِ الَّذِينَ يُخَالِفُونَ عَنْ أَمْرِهِ أَن تُصِيبَهُمْ فِتْنَةٌ أَوْ يُصِيبَهُمْ عَذَابٌ أَلِيمٌ ﴾ (النور:٦٣)

**"వినండి! ఎవరు ప్రవక్త ఆజ్ఞను ఎదిరిస్తున్నారో వారు, తమపై ఏదయినా ఘోర విపత్తు వచ్చిపడుతుందేమోనని లేదా తమను ఏదయినా బాధాకరమయిన శిక్ష చుట్టుముడుతుందేమోనని భయపడాలి." (అన్ నూర్ : 63)**

అంటే వారి ఆంతర్యం ఏదైనా ఉపద్రవానికి – అంటే అవిశ్వాసానికిగానీ, కాపట్యానికి గానీ, బిద్అత్‌కు గానీ ఆలవాలం అవుతుందేమో! లేదా ప్రాపంచిక జీవితంలోనే ఏదయినా బాధాకరమైన విపత్తు వారిపై వచ్చి పడుతుందేమో! అంటే – హత్య గావించ బడటమో లేదా కఠిన కారాగార శిక్ష పడటమో లేదా మరేదయినా ఆకస్మిక ప్రమాదానికి గురవటమో జరగవచ్చు.

ఆయన (ﷺ) యెడల ప్రేమను అల్లాహ్ దైవప్రీతికి తార్కాణంగా, పాపాల మన్నింపునకు సాధనంగా ఖరారు చేశాడు :

﴿قُلْ إِن كُنتُمْ تُحِبُّونَ اللَّهَ فَاتَّبِعُونِي يُحْبِبْكُمُ اللَّهُ وَيَغْفِرْ لَكُمْ ذُنُوبَكُمْ﴾(آل عمران:٣١)

**(ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే మీరు నన్ను అనుసరించండి. (తత్ఫలితంగా) అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను క్షమిస్తాడు." (ఆలి ఇమ్రాన్ : 31)**

ఇంకా – ఆయన (ﷺ) యెడల చూపే విధేయతను మార్గదర్శకత్వంగా, అవిధేయతను మార్గవిహీనతగా అల్లాహ్ ఖరారు చేశాడు :

﴿وَإِن تُطِيعُوهُ تَهْتَدُوا﴾(النور:٥٤)

**మీరు దైవప్రవక్త మాటను విన్నప్పుడే మీకు సన్మార్గం లభిస్తుంది. (అన్ నూర్ : 54)**

ఆ తరువాత ఇలా అనబడింది :

﴿فَإِن لَّمْ يَسْتَجِيبُوا لَكَ فَاعْلَمْ أَنَّمَا يَتَّبِعُونَ أَهْوَاءَهُمْ وَمَنْ أَضَلُّ مِمَّنِ اتَّبَعَ هَوَاهُ بِغَيْرِ هُدًى مِّنَ اللَّهِ إِنَّ اللَّهَ لَا يَهْدِي الْقَوْمَ الظَّالِمِينَ﴾(القصص:٥٠)

**మరి వారు గనక నీ సవాలును స్వీకరించకపోతే, వారు తమ మనో వాంఛలను అనుసరించే జనులని తెలుసుకో! అల్లాహ్ మార్గదర్శ కత్వాన్ని కాకుండా తన మనోవాంఛల వెనుక నడిచే వానికన్నా ఎక్కువ మార్గభ్రష్టుడెవడుంటాడు? అల్లాహ్ దుర్మార్గులకు ఎట్టిపరిస్థితిలోనూ సన్మార్గం చూపడు. (అల్ ఖసస్ : 50)**

ఆయన (ﷺ) లో ఆయన అనుయాయుల కొరకు గొప్ప ఆదర్శం ఉందన్న శుభవార్తను కూడా దేవుడు వినిపించాడు. ఉదాహరణకు ఈ సూక్తిని చూడండి :

﴿لَقَدْ كَانَ لَكُمْ فِي رَسُولِ اللَّهِ أُسْوَةٌ حَسَنَةٌ لِّمَن كَانَ يَرْجُو اللَّهَ وَالْيَوْمَ الْآخِرَ وَذَكَرَ اللَّهَ كَثِيرًا﴾(الاحزاب:٢١)

**నిశ్చయంగా దైవప్రవక్తలో మీ కొరకు అత్యుత్తమ ఆదర్శం ఉంది –**



**అల్లాహ్ పట్ల, అంతిమ దినం పట్ల ఆశ కలిగి ఉండి, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే ప్రతి ఒక్కరి కొరకు. (అల్ అహ్‌జాబ్ : 21)**

ఇమామ్ ఇబ్నె కసీర్ (రహిమహుల్లాహ్) ఇలా అంటున్నారు : "దైవప్రవక్త (ﷺ) వారి సమస్త వాక్కాయ కర్మలలో, పరిస్థితులలో ఆయన్ని అనుసరించే విషయంలో ఈ సూక్తి ఒక ప్రాతిపదిక వంటిది. అందుకే కందక యుద్ధం జరిగిన రోజు దేవుడు సహన స్థయిర్యాలతో వ్యవహరించాలనీ, శత్రువుల ఎదుట ధైర్యంగా నిలబడాలనీ, పోరాటపటిమను కనబరచాలనీ లోకేశ్వరుని తరఫున అనుగ్రహించబడే సౌలభ్యాల కోసం నిరీక్షించాలని ఉపదేశించాడు. మీపై నిత్యం ప్రళయదినం వరకూ దైవకారుణ్యం, శాంతి కలుగుగాక!"

దేవుడు తన ప్రవక్త (ﷺ)కు విధేయత చూపవలసిందిగా, ఆయన (ﷺ) విధానాన్ని అనుసరించవలసిందిగా ఖుర్ఆన్‌లో దాదాపు 40 చోట్ల ఆదేశించాడు. కాబట్టి ఆయన (ﷺ) తెచ్చిన షరీయత్‌ను అధ్యయనం చేయటం, దానిని అనుసరించటం మనకు అన్నపానీయాల కన్నా ముఖ్యం. ఎందుకంటే మనిషికి అన్నపానీయాలు లభించకపోతే ప్రపంచంలో మరణం సంభవిస్తుంది. కాని దైవప్రవక్త (ﷺ)కు గనక విధేయత చూపకపోతే, ఆయన సంప్రదాయాన్ని అనుసరించకపోతే పరలోకంలో శాశ్వతమయిన శిక్షను చవిచూడవలసి ఉంటుంది. అలాగే ఆయన (ﷺ) సకల ఆరాధనలలో తన పద్ధతిని అనుసరించవలసిందిగా ఆజ్ఞాపించారు. కనుక మనం ఆరాధనలను ఆయన (ﷺ) చేసినట్లుగానే చేయాలి. ఈ నేపథ్యంలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿لَقَدْ كَانَ لَكُمْ فِي رَسُولِ اللَّهِ أُسْوَةٌ حَسَنَةٌ﴾(الاحزاب:٢١)

**నిశ్చయంగా మీ కొరకు దైవప్రవక్త (ﷺ)లో అత్యుత్తమ ఆదర్శం ఉంది. (అల్ అహ్‌జాబ్ : 21)**

మహనీయ ముహమ్మద్ (ﷺ) మనకిలా ఉపదేశించారు :

"صَلُّوا كَمَا رَأَيْتُمُونِي أُصَلِّي"(بخاری)

**"నేను నమాజ్ చేస్తుండగా నన్ను చూసిన విధంగానే మీరు నమాజ్ చేయండి." (బుఖారీ)**

ఇంకా ఇలా అన్నారు :

"خُذُوا عَنِّي مَنَاسِكَكُمْ"(مسلم)

**“మీరు నా నుండి హజ్జ్ క్రియలను నేర్చుకోండి.” (ముస్లిం)**

ఈ విధంగా హెచ్చరించారు :

”مَنْ عَمِلَ عَمَلاً لَيْسَ عَلَيْهِ أَمْرُنَا فَهُوَ رَدٌّ“( صحیح مسلم )

**“ఎవరయినా మేము ఆజ్ఞాపించని దానిని ఆచరిస్తే, అట్టి కర్మ త్రోసి పుచ్చబడుతుంది.” (సహీహ్ ముస్లిం)**

ఇంకా ఇలా చెప్పారు :

”مَنْ رَّغِبَ عَنْ سُنَّتِي فَلَيْسَ مِنِّي“( بخاری ومسلم )

**“ఎవడయితే నా విధానం పట్ల విముఖత చూపాడో వాడు నా వాడు కాడు.” (బుఖారీ, ముస్లిం)**

ఈ విధంగా ఖుర్ఆన్ హదీసులలో ఆయన (ﷺ) కు విధేయత చూపవలసిందిగా సూచించే ఆజ్ఞలు ఇంకా అనేకం ఉన్నాయి. ఆయన (ﷺ) కు అవిధేయత చూపరాదని కూడా చెప్పబడింది.



**మూడవ ప్రకరణం**

## దైవప్రవక్త (ﷺ) పై దురూద్, సలాం పంపే ఆదేశం షరీయత్ బద్ధమైనది

అల్లాహ్ తన షరీయత్‌లో తన ప్రవక్త (ﷺ) యెడల ముస్లింలు నెరవేర్చవలసిన బాధ్యతలను విశదీకరించాడు. వాటిలో ఒకటి ఆయన (ﷺ)పై దురూద్ సలాంలు పంపటం. అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఈ విధంగా ఆదేశించాడు :

﴿إِنَّ اللَّهَ وَمَلَائِكَتَهُ يُصَلُّونَ عَلَى النَّبِيِّ يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا صَلُّوا عَلَيْهِ وَسَلِّمُوا تَسْلِيمًا﴾(الاحزاب:٥٦)

**నిశ్చయంగా అల్లాహ్, ఆయన దూతలు కూడా దైవప్రవక్తపై కారుణ్యాన్ని పంపిస్తున్నారు. ఓ విశ్వాసులారా! మీరు కూడా అతనిపై దురూద్ పంపండి. అత్యధికంగా సలాములు (కూడా) పంపుతూ ఉండండి. (అల్ అహ్‌జాబ్ : 56)**

ఇమామ్ బుఖారీ గారు అబుల్ ఆలియాతో ఇలా అన్నారు :

“అల్లాహ్ దురూద్ పంపించటమంటే అర్థం, ఆయన తన దూతల ముందు తన ప్రవక్త (ﷺ)ను మెచ్చుకుంటాడు. దైవదూతలు దురూద్ పంపటమంటే భావం వారు ‘దుఆ’ చేస్తారు. మనుషులు ఆయన (ﷺ)కు దురూద్ పంపటమంటే ఆయన (ﷺ) మన్నింపు కొరకు, కారుణ్యం కొరకు అల్లాహ్‌ను అర్థించటం అన్నమాట.”

పై సూక్తి ద్వారా మహాప్రవక్త (ﷺ) స్థాయి, అంతస్తు ఎంత గొప్పదో అర్థమవుతోంది. ఊర్ధ్వ లోకాలలో దేవుడు తన సమీప దూతల ముందు ప్రవక్త (ﷺ)ను ప్రశంసించాడు. దైవదూతలు కూడా ఆయన (ﷺ) ఉన్నత స్థానాల కోసం ప్రార్థిస్తున్నారు. భూలోకవాసులు కూడా ఆయన (ﷺ) కారుణ్యం కొరకు ప్రార్థించవలసిందిగా దేవుడు ఆదేశించాడు – ఆ విధంగా ఊర్ధ్వలోకాల వారు, భూలోక వాసులు కూడా ప్రవక్త (ﷺ)ను శ్లాఘించటంలో ఏకమవ్వాలన్నది దేవుని అభిమతం. ఎంతటి ఉన్నత స్థానం!

‘సల్లిమూ తస్లీమా’ అంటే ఆయన (ﷺ)కు ఇస్లామీయ అభివాదం పంపమని అర్థం. కాబట్టి ఎవరయినా ప్రవక్త (ﷺ)కు దురూద్ పంపదలచినపుడు దురూద్‌తో పాటు సలామ్‌ని కూడా పంపాలి. కేవలం ఒక్క దానితో సరిపెట్టుకోకూడదు. కేవలం ‘సల్లల్లాహు అలైహి’ అని అనరాదు. కేవలం ‘అలైహిస్సలాం’ అని కూడా అనరాదు. ఎందుకంటే రెండింటినీ ఒకేసారి పలకాలన్నది దైవాజ్ఞ.

ప్రవక్త (ﷺ)పై దురూద్ పంపమని ఎన్నో చోట్ల నొక్కి చెప్పబడింది. కొన్ని చోట్ల తప్పనిసరి (వాజిబ్) అని అనబడితే, కొన్నిచోట్ల అలా చేయటం అభిలషణీయం (ముస్తహబ్) అనీ, సున్నతె ముఅక్కదా అని కూడా వక్కాణించబడింది.

అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) తన పుస్తకం "జలాఅల్ అఫ్హామ్" లో 41 చోట్ల, ఆయన (ﷺ)పై దురూద్, సలాంలను పంపటం మస్నూన్ (సున్నత్) అని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన ఇలా అన్నారు :

"మొదటి చోట : అన్నిటికన్నా ముఖ్యమైన, గట్టిగా నొక్కి వక్కాణించబడిన చోటు నమాజ్ – నమాజ్‌లోని చివరి తషహ్హుద్ (చివరి ఖాయిదా)లో దురూద్ పంపాలి. ఈ విషయంలో ముస్లిములందరి మధ్యా ఏకాభిప్రాయం ఉంది. కాని ఇక్కడ అది వాజిబ్ (తప్పనిసరి) అనే విషయంలో మటుకు భేదాభిప్రాయం ఉంది." (జలాయిల్ అఫ్హామ్ – పేజీ : 222, 223).

తరువాత ఆయన దురూద్ పంపవలసిన సందర్భాలేవో (ప్రసంగాల)లో జుమా ప్రసంగం, పండుగల ప్రసంగం, ఇస్తిస్ఖా ప్రసంగం, ముఅజ్జిన్ అజాన్ పలుకులకు సమాధానం పలికినప్పుడు, మస్జిద్‌లో ప్రవేశించినప్పుడు, మస్జిద్ నుండి వెడలినప్పుడు, ఆయన (ﷺ) ప్రస్తావన వచ్చినప్పుడు. ఆ తరువాత అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) ప్రవక్త (ﷺ)పై దురూద్ పంపటం వల్ల కలిగే సత్ఫలితాలను, ప్రయోజనాలను విశదీకరించారు. ఈ సందర్భంగా ఆయన 40 ప్రయోజనాలను ప్రస్తావించారు. (జిలాఉల్ అఫ్హామ్ – పేజీ : 302)

వాటిలో కొన్ని ప్రయోజనాలివి :

1. ప్రవక్త (ﷺ)పై దురూద్ పంపటమంటే అల్లాహ్ ఆదేశపాలన చేయటమే.
2. ఒకసారి దురూద్ పంపిన వానిపై అల్లాహ్ తరఫున పది కారుణ్యాలు అవతరిస్తాయి (ముస్లిం).
3. 'దుఆ' ప్రారంభంలో దురూద్ పంపటం వల్ల ఆ దుఆ స్వీకారయోగ్యమయ్యే అవకాశాలు పెరిగిపోతాయి.
4. దురూద్ పంపటంతో పాటు ఆయన (ﷺ)కు ప్రశంసాత్మకమయిన స్థానం కూడా ప్రసాదించమని వేడుకున్నట్లయితే, ఆ వ్యక్తి ఆయన (ﷺ) సిఫారసుకు హక్కుదారుడై పోతాడు.
5. దురూద్ (పంపటం) పాపాల మన్నింపునకు సాధనం.
6. దైవప్రవక్త (ﷺ)పై దురూద్, సలామ్‌లు పంపిన వ్యక్తి దానికి జవాబుగా ప్రవక్త (ﷺ) వారి 'ప్రతిసలాం'కు హక్కుదారుడై పోతాడు.

మహాప్రవక్త (ﷺ)పై దైవ కారుణ్యం మరియు శాంతి వర్షించుగాక!



## నాల్గవ ప్రకరణం

# ప్రవక్త ఇంటివారి ప్రాశస్త్యం, వారి హక్కులు

'అహ్లె బైత్' అంటే ప్రవక్త (ﷺ) ఇంటివారలు అని అర్థం. అంటే ఎవరెవరిపై దానధర్మాలు (సదఖా) పుచ్చుకోవటం నిషేధించబడిందో వారంతా ఇందులోకి వస్తారు. అంటే హజ్రత్ అలీ (رضي الله عنه) సంతానం, హజ్రత్ జాఫర్ (رضي الله عنه) సంతానం, అఖీల్ (رضي الله عنه) సంతానం, అబ్బాస్ (رضي الله عنه) సంతానం, బనూ హారిస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ మరియు మహాప్రవక్త (ﷺ) సతీమణులు, ఆయన కుమార్తెలు – వీరంతా 'అహ్లె బైత్' అనబడతారు. దీనికి ఆధారం దివ్య ఖుర్ఆన్‌లోని ఈ వచనం :

﴿إِنَّمَا يُرِيدُ اللَّهُ لِيُذْهِبَ عَنكُمُ الرِّجْسَ أَهْلَ الْبَيْتِ وَيُطَهِّرَكُمْ تَطْهِيرًا﴾ (الاحزاب:٣٣)

**ఓ ప్రవక్త ఇంటివారలారా! మీ నుండి (అన్ని రకాల) మాలిన్యాన్ని దూరం చేయాలన్నది, మిమ్మల్ని పూర్తిగా పరిశుద్ధ పరచాలన్నది అల్లాహ్ అభిలాష. (అల్ అహ్‌జాబ్ : 33)**

**ఇమామ్ ఇబ్నె కసీర్ (رحمه الله) ఇలా అంటున్నారు : దేవుని ఈ ఆదేశం ﴿إِنَّمَا يُرِيدُ اللَّهُ لِيُذْهِبَ عَنكُمُ الرِّجْسَ أَهْلَ الْبَيْتِ وَيُطَهِّرَكُمْ تَطْهِيرًا﴾ వచ్చిన తరువాత ఖుర్ఆన్‌పై యోచన చేసే ఏ వ్యక్తికయినా ప్రవక్త (ﷺ) గారి పవిత్ర సతీమణులు అహ్లెబైత్ (ప్రవక్త ఇంటివారలు) పరిధిలోకి వస్తారనే విషయంలో సందేహం కలుగదు. ఎందుకంటే అసలు ఈ ఆయత్ అవతరించింది ప్రవక్త సతీమణుల నేపథ్యంలోనే. అందుకే ఆ తరువాత ఇలా అనబడింది :**

﴿وَاذْكُرْنَ مَا يُتْلَىٰ فِي بُيُوتِكُنَّ مِنْ آيَاتِ اللَّهِ وَالْحِكْمَةِ﴾ (الاحزاب:٣٤)

**మీ ఇండ్లలో పారాయణం చేయబడే అల్లాహ్ ఆయతులను, ప్రవక్త ప్రవచనాలను స్మరించుకుంటూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ మృదు స్వభావి, అన్నీ తెలిసినవాడు. (అల్ అహ్‌జాబ్ : 34)**

అంటే దేవుడు తన ప్రవక్త(ﷺ)పై ఖుర్ఆన్ హదీసులలో ఏ ఏ విషయాలనయితే అవతరింపజేస్తున్నాడో వాటిని ఆచరణలో పెట్టండి అని భావం.

ఖతాదా తదితర ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు ఈ ఆయతుకు తాత్పర్యంగా ఇలా అన్నారు:

సమస్త జనుల మధ్య మీకు ప్రత్యేకంగా ఇవ్వబడిన అనుగ్రహాన్ని జ్ఞాపకం చేసుకోండి. అదేమంటే వహీ (దైవవాణి) కేవలం మీ ఇండ్లలోనే అవతరించేది.

అబూబకర్ పుత్రిక అయిన ఆయిషా సిద్దీఖా (رضي الله عنها) ఈ గొప్ప అనుగ్రహానికి వేరితరులకన్నా ఎక్కువ హక్కుదారు. ఈ విషయంలో ఆమెకు విశిష్ఠ స్థానం దక్కింది. ఎందుకంటే ఒక్క ఆయిషా (رضي الله عنها) తప్ప ప్రవక్త సతీమణులలో వేరితరుల పడకపై ఉండగా ఆయన (ﷺ)పై 'వహీ' రాలేదు. దైవప్రవక్త (ﷺ) స్వయంగా ఈ విషయం వివరించారు. ఈ పూర్వరంగంలో కొందరు విద్వాంసులు ఇలా అభిప్రాయపడ్డారు : ఎందుకంటే ఆయన (ﷺ) ఒక్క ఆయిషా (رضي الله عنها) గారికి తప్ప వేరెవరినీ కన్యగా ఉండగా వివాహమాడలేదు. అందుచేత ఈ విషయంలో ఆమెగారికి ప్రత్యేకత నొసంగటం సమంజసమని భావించబడింది. ఇక ఆయన (ﷺ) సతీమణులు ఆయన ఇంటివారలలో చేరి ఉన్నప్పుడు, ఆయన (ﷺ) సమీప బంధువులకు ఇంటివారల (అహ్లె బైత్)లో చేరే హక్కు ప్రప్రథమంగా ఉంటుంది. (తఫ్సీర్ ఇబ్నె కసీర్)

అహ్లె సున్నత్ వల్ జమాఅత్ వర్గీయులు దైవప్రవక్త (ﷺ) ఇంటివారల పట్ల అపారమైన గౌరవాభిమానాలు కలిగి ఉండేవారు. వారి విషయంలో 'ఘదీరెఖుమ్' దినాన దైవప్రవక్త (ﷺ) చేసిన వసీయతును వారు కాపాడుకునేవారు. దైవప్రవక్త (ﷺ) ఈ విధంగా తాకీదు చేశారు :

"أُذَكِّرُكُمُ اللهَ فِي أَهْلِ بَيْتِي"(مسلم)

**"నేను నా ఇంటివారల విషయంలో అల్లాహ్‌కు భయపడవలసినదిగా మిమ్మల్ని తాకీదు చేస్తున్నాను." (ముస్లిం)**

అందుచేత అహ్లె సున్నత్ వల్ జమాఅత్‌కి చెందినవారు అహ్లెబైత్ పట్ల గౌరవ మన్ననలు కలిగి ఉంటారు. ఎందుకంటే ఇలా చేయటం ప్రవక్త (ﷺ) యెడల గౌరవ ప్రపత్తులకు చిహ్నం. కాకపోతే వారు ప్రవక్త (ﷺ)ను నిజంగా అనుసరించేవారై ఉండాలి. మిల్లత్‌పై స్థిరంగా ఉండాలి. ఏ విధంగానయితే ప్రవక్త పినతండ్రి అయిన అబ్బాస్ (رضي الله عنه), వారి పిల్లలు, హజ్రత్ అలీ (رضي الله عنه) మరియు ఆయన పిల్లలు ఉండేవారో. కాని వారొకవేళ ప్రవక్త (ﷺ) విధానానికి వ్యతిరేకులుగా ఉంటే, ధర్మానికి కట్టుబడి ఉండకపోతే – అట్టి పరిస్థితిలో వారితో స్నేహబంధం ఏర్పరచుకోవటం సమ్మతం కాదు – వారు అహ్లెబైత్‌లోని వారైనప్పటికీ!

'అహ్లెబైత్'కు సంబంధించినంత వరకు అహ్లె సున్నత్ వల్ జమాఅత్ వారి విధానం సహేతుకమైనది, సమతూకంతో కూడుకున్నది. వారిలో ఎవరు ధర్మంపై స్థిరంగా ఉన్నారో వారిని ఆదరిస్తారు. మరెవరు సున్నత్‌కు విరుద్ధంగా, ధర్మం పట్ల విముఖంగా



ఉంటున్నారో వారితో తెగత్రెంపులు చేసుకుంటారు. ఎందుకంటే వారు ధర్మం (దీన్) పై స్థిరంగా ఉండనంత వరకూ – వారు అహ్లెబైత్‌లోని వారైనంత మాత్రాన, దైవప్రవక్త (ﷺ) బంధువులైనంత మాత్రాన – అది వారికెలాంటి ప్రయోజనం చేకూర్చదు.

హజ్రత్ అబూహురైరా (رضي الله عنه) కథనం : దైవప్రవక్త (ﷺ) పై

﴿وَأَنذِرْ عَشِيرَتَكَ الْأَقْرَبِينَ﴾ (الشعراء:٢١٤)

**"నీవు నీ సమీప బంధువులను హెచ్చరించు" (అష్ షుఅరా : 214)**

అనే దివ్య వచనం అవతరించినప్పుడు ఆయన (ﷺ) లేచి నిలబడి ఇలా అన్నారు :

"يَا مَعْشَرَ قُرَيْشٍ أَوْ كَلِمَةٍ نحوها-اِشْتَرُوْا أَنْفُسَكُمْ، لَا أُغْنِي عَنْكُمْ مِنَ اللهِ شَيْئًا ،يَا عَبَّاس ابْنَ عَبْدِ الْمُطَّلِبِ لَا أُغْنِي عَنْكَ مِنَ اللهِ شَيْئًا يَا صَفِيَّةُ عَمَّةَ رَسُوْلِ اللهِ لَا أُغْنِي عَنْكَ مِنَ اللهِ شَيْئًا وَيَا فَاطِمَةَ بِنْتَ مُحَمَّدٍ سَلِيْنِي مِنْ مَالِي مَا شِئْتِ ،لَا أُغْنِي عَنْكَ مِنَ اللهِ شَيْئًا " (بخاری)

**"ఓ ఖురైషు వర్గీయులారా! – లేదా అలాంటిదే మరో పదం వాడారు – మిమ్మల్ని మీరు రక్షించుకోండి. నేను అల్లాహ్ సన్నిధిలో మీకే విధంగానూ ఉపయోగపడలేను. అబ్దుల్ ముత్తలిబ్ కుమారుడైన ఓ అబ్బాస్! అల్లాహ్ సమక్షంలో నేను మీ కొరకు ఎలాంటి అధికారం కలిగిలేను. దైవ సందేశహరుని అత్త ఓ సఫియా! నేను అల్లాహ్ సన్నిధిలో నీకు ఏ విధంగానూ తోడ్పడలేను. ఓ ముహమ్మద్ పుత్రిక ఫాతిమా! నా సొమ్ములో నుండి నీకేం కావాలో తీసుకో. అల్లాహ్ సన్నిధిలో నేను నీకు ఏ విధంగానూ ఉపయోగపడలేను." (బుఖారీ)**

వేరొక హదీసులో ఆయన (ﷺ) ఇలా ప్రవచించారు :

"مَنْ بَطَّأَ بِهِ عَمَلُهُ لَمْ يُسْرِعْ بِهِ نَسَبُهُ"(مسلم)

**"ఎవరి ఆచరణ అతన్ని వెనక్కి వదిలేస్తుందో అతని వంశం అతన్ని ముందుకు పంపదు." (ముస్లిం)**

అహ్లెబైత్‌లోని కొందరి పట్ల అతిగా వ్యవహరించే రాఫ్జీల (షియావర్గీయుల)

పోకడతో 'అహ్లె సున్నత్ వల్ జమాఅత్' తెగత్రెంపులను ప్రకటిస్తుంది. ఎందుకంటే వారు అన్ని రకాల పాపాలకు దోషాలకు అతీతులు, పవిత్రులు అని రాఫ్జీలు దావాచేస్తారు. అలాగే రుజుమార్గగాములైన అహ్లెబైత్ పట్ల ద్వేషభావాన్ని, అక్కసును వెళ్లగ్రక్కే, వారిపై శాపనార్థాలు పెట్టే 'నవాసిబ్' వర్గీయులతో తమకు ఎట్టి సంబంధం లేదని అహ్లె సున్నత్ వల్ జమాఅత్ ప్రకటిస్తోంది. అహ్లెబైత్‌కు చెందిన వారి 'వసీలా'ను పొందే, వారితోపాటు ప్రభువులుగా పరిగణించే బిద్అతీలతో కూడా అహ్లెసున్నత్ వల్ జమాఅత్ తన తెగత్రెంపుల ప్రకటన చేస్తోంది.

ఈ విషయంలో గానీ, మరితర వ్యవహారాలలో గానీ 'అహ్లె సున్నత్ వల్ జమాఅత్' మధ్యేమార్గం అవలంబిస్తుంది. అది ఎల్లప్పుడూ రుజుమార్గంపై నిలకడ కలిగి ఉంటుంది. అహ్లెబైత్ వారి విషయంలోనూ, ఇతరుల విషయంలోనూ అది అతివాదానికి, కుడి ఎడమల అపవాదాలకు లోనవదు. ఆ మాటకొస్తే రుజుమార్గగాములైన ప్రవక్త కుటుంబీకులు సయితం తమ పట్ల అతిశయిల్లరాదని చెప్పారు. అతిశయిల్లేవారిని వారు సుతరామూ ఇష్టపడలేదు. అలాంటివారితో సంబంధం త్రెంచుకున్నారు. పైగా అమీరుల్ మోమినీన్ హజ్రత్ అలీ (رضي الله عنه) గారు తన అభిమానంలో అతిగా వ్యవహరించేవారిని అగ్నిలో కాల్చివేశారు. వారిని హతమార్చిన చర్యను ఇబ్నె అబ్బాస్ (رضي الله عنهما) కూడా సమర్థించారు. అయితే అగ్నితో కాల్చేబదులు ఖడ్గంతో హతమార్చాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే హజ్రత్ అలీ (رضي الله عنه) అతివాదుల నాయకుడైన అబ్దుల్లాహ్ బిన్ సబాను కడతీర్చే ఉద్దేశ్యంతో పిలిపించారు. కాని అతను పలాయనం చిత్తగించి, అజ్ఞాన వాసంలోకి వెళ్ళిపోయాడు.



## ఐదవ ప్రకరణం

# ప్రవక్త (ﷺ) సహచరుల (رضي الله عنهم) ఔన్నత్యం, వారి యెడల సద్భావన తప్పనిసరి. వారి మధ్యగల పరస్పర భేదాభిప్రాయాల విషయంలో అహ్లెసున్నత్ వల్ జమాఅత్ వైఖరి

**(1) సహాబా అంటే ఎవరు? వారి గురించి ఎటువంటి నమ్మకం కలిగి ఉండాలి?**

**సహాబా :** 'సహాబీ'కి బహువచనం 'సహాబా'. విశ్వాస (ఈమాన్) స్థితిలో దైవప్రవక్త (ﷺ)ను కలుసుకుని, విశ్వాసస్థితిలో తనువు చాలించిన వారంతా సహాబా (సహచరులు– رضي الله عنهم) అనబడతారు.

వారు ముస్లిం సమాజంలో అందరికన్నా శ్రేష్ఠులని, ఇస్లాం వైపు ముందంజవేసిన వారని, ప్రవక్త సహచర్య భాగ్యం పొందినవారని, ప్రవక్త (ﷺ)తో కలిసి జిహాద్ చేసినవారని, షరీయత్ బరువు బాధ్యతలను మోయటమే గాకుండా దానిని తమ తరువాతి తరాల వారికి అందించిన ధన్యజీవులని, ఈ కారణంగా వారు ప్రపంచంలోనే అత్యుత్తమ సమూహం అని మనం విశ్వసించటం తప్పనిసరి (వాజిబ్). అల్లాహ్ తన అంతిమ గ్రంథంలో వారిని కొనియాడుతూ ఇలా సెలవిచ్చాడు :

﴿وَالسَّابِقُونَ الْأَوَّلُونَ مِنَ الْمُهَاجِرِينَ وَالْأَنصَارِ وَالَّذِينَ اتَّبَعُوهُم بِإِحْسَانٍ رَّضِيَ اللَّهُ عَنْهُمْ وَرَضُوا عَنْهُ وَأَعَدَّ لَهُمْ جَنَّاتٍ تَجْرِي تَحْتَهَا الْأَنْهَارُ خَالِدِينَ فِيهَا أَبَدًا ذَٰلِكَ الْفَوْزُ الْعَظِيمُ﴾ (التوبة:١٠٠)

**ముహాజిర్లలో, అన్సార్లలో ప్రప్రథమంగా ముందంజవేసిన వారితోనూ, తరువాత చిత్తశుద్ధితో వారిని అనుసరించినవారితోనూ అల్లాహ్ ప్రసన్నుడయ్యాడు. వారు అల్లాహ్ పట్ల సంతుష్టులయ్యారు. క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలను అల్లాహ్ వారికోసం సిద్ధం చేసి ఉంచాడు. వాటిలో వారు కలకాలం ఉంటారు. గొప్ప సాఫల్యం అంటే ఇదే. (అత్ తౌబా : 100)**

ఇంకా ఈ విధంగా ప్రస్తుతించాడు :

﴿مُحَمَّدٌ رَّسُولُ اللَّهِ وَالَّذِينَ مَعَهُ أَشِدَّاءُ عَلَى الْكُفَّارِ رُحَمَاءُ بَيْنَهُمْ تَرَاهُمْ رُكَّعاً سُجَّداً يَبْتَغُونَ فَضْلاً مِّنَ اللَّهِ وَرِضْوَاناً سِيمَاهُمْ فِي وُجُوهِهِم مِّنْ أَثَرِ السُّجُودِ ذَلِكَ مَثَلُهُمْ فِي التَّوْرَاةِ وَمَثَلُهُمْ فِي الْإِنجِيلِ كَزَرْعٍ أَخْرَجَ شَطْأَهُ فَآزَرَهُ فَاسْتَغْلَظَ فَاسْتَوَى عَلَى سُوقِهِ يُعْجِبُ الزُّرَّاعَ لِيَغِيظَ بِهِمُ الْكُفَّارَ وَعَدَ اللَّهُ الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ مِنْهُم مَّغْفِرَةً وَأَجْراً عَظِيماً﴾ (الفتح:٢٩)

**ముహమ్మద్ (ﷺ) అల్లాహ్ ప్రవక్త. ఆయన వెంట ఉన్నవారు అవిశ్వాసులకు కొరుకుడు పడనివారు. ఒండొకరి పట్ల మాత్రం దయార్ద్ర హృదయులు. దైవ కృపను, దైవప్రసన్నతను చూరగొనే ప్రయత్నంలో వారు (దైవ సన్నిధిలో) వినమ్రులై వంగటాన్ని, సాష్టాంగ పడటాన్ని నీవు చూస్తావు. వారి సాష్టాంగ ప్రణామాల ప్రత్యేక ప్రభావం వారి ముఖారవిందాలపై తొణికిసలాడుతూ ఉంటుంది. వీరికి సంబంధించిన ఈ ఉపమానమే తౌరాతులో ఉంది. ఇన్‌జీలులో (కూడా) వారి ఉపమానం ఉంది. అది ఒక పంటపొలం వంటిది. అది తన మొలకను మొలకెత్తించింది. తరువాత దానిని బలపరిచింది. ఆ తరువాత అది లావు అయింది. ఆపైన అది తన కాండంపై నిటారుగా నిలబడింది. రైతులను అలరించసాగింది – వారి ద్వారా అవిశ్వాసులను మరింత ఉడికించాలని! వారిలో విశ్వసించి సత్కార్యాలు చేసిన వారికి మన్నింపును, గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదిస్తానని అల్లాహ్ వాగ్దానం చేసి ఉన్నాడు. (అల్ ఫత్హ్ : 29)**

ఇంకా అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿لِلْفُقَرَاءِ الْمُهَاجِرِينَ الَّذِينَ أُخْرِجُوا مِن دِيَارِهِمْ وَأَمْوَالِهِمْ يَبْتَغُونَ فَضْلاً مِّنَ اللَّهِ وَرِضْوَاناً وَيَنصُرُونَ اللَّهَ وَرَسُولَهُ أُوْلَئِكَ هُمُ الصَّادِقُونَ ☆ وَالَّذِينَ تَبَوَّؤُوا الدَّارَ وَالْإِيمَانَ مِن قَبْلِهِمْ يُحِبُّونَ مَنْ هَاجَرَ إِلَيْهِمْ وَلَا يَجِدُونَ فِي صُدُورِهِمْ حَاجَةً مِّمَّا أُوتُوا وَيُؤْثِرُونَ عَلَى أَنفُسِهِمْ وَلَوْ كَانَ بِهِمْ خَصَاصَةٌ وَمَن يُوقَ شُحَّ نَفْسِهِ فَأُوْلَئِكَ هُمُ الْمُفْلِحُونَ﴾ (الحشر:٨ـ٩)

**(ముఖ్యంగా ఈ 'ఫై' సొమ్ము) తమ ఇల్లూ వాకిలి నుండీ, తమ ఆస్తిపాస్తుల నుండీ గెంటివేయబడిన నిరుపేద ముహాజిర్లకు చెందుతుంది. (ఎందుకంటే) వారు దైవానుగ్రహాన్ని, దైవప్రసన్నతను ఆశిస్తూ**



**దైవానికీ, ఆయన ప్రవక్తకూ తోడ్పడుతున్నారు. వారే సిసలయిన సత్యసంధులు. ఇకపోతే; వీరికంటే ముందే ఈ ప్రదేశం (మదీనా) లోనూ, విశ్వాసంలోనూ స్థానికులుగా ఉన్నవారు (వారికి కూడా ఈ సొమ్ము వర్తిస్తుంది). వారు ఇల్లూ వాకిలిని వదలి తమ వైపునకు వలసవచ్చే ముహాజిర్లను ప్రేమిస్తారు. వారికి ఏమి ఇవ్వబడినా తమ ఆంతర్యాలలో ఏ కాస్త కూడా సంకోచాన్ని రానివ్వరు. తాము ఎంతో అవసరంలో ఉన్నప్పటికీ తమపైన వారికే ప్రాధాన్యతనిస్తారు. వాస్తవానికి తమ ఆంతర్యంలోని స్వార్థప్రియత్వం (పేరాశ) నుండి రక్షించబడినవారే కృతార్థులు. (అల్ హష్ర్ : 8, 9)**

ఈ సూక్తులలో దేవుడు ముహాజిర్లను, అన్సార్లను మెచ్చుకున్నాడు. వారిని సత్కార్యాల వైపు ముందంజవేసే వారుగా అభివర్ణించాడు. తాను వారి పట్ల ప్రసన్నుణ్ణి అయ్యానని, వారి కొరకు పిల్లకాలువలు ప్రవహించే ఉద్యాన వనాలను సిద్ధపరచి ఉంచానని తెలిపాడు. ఇంకా వారిలోని సుగుణాలను తెలుపుతూ వారు పరస్పరం దయాగుణం కలవారని, అవిశ్వాసులకు మాత్రం సింహస్వప్నమని చెప్పాడు. వారు అత్యధికంగా దైవసన్నిధిలో వంగేవారని, సాష్టాంగ ప్రణామాలు చేసేవారని, వారి ఆంతర్యాలు నిర్మలంగా ఉండేవని చెప్పాడు. వారిలోని మరో ప్రత్యేకత ఏమిటంటే; వారు దైవవిధేయతా చిహ్నంతో కనుగొనబడేవారు. అల్లాహ్ వారిని తన ప్రవక్త సహచర్యం కొరకు ఎంపిక చేశాడు – తద్వారా అవిశ్వాసులను మరింతగా ఉడికించాలని. వారిలో ముహాజిర్లు అనబడే వారి విశిష్టత ఏమిటంటే, వారు అల్లాహ్ ప్రీతి కొరకు, ధర్మసంస్థాపనార్థం తమ స్వదేశాన్ని, తమ ఆస్తిపాస్తులను వదలి ప్రస్థానం చేశారు. ఈ విషయంలో వారు నిజాయితీపరులని నిరూపించుకున్నారు. అన్సార్లు అనబడేవారి ప్రత్యేకత ఏమిటంటే వారు మదీనావాసులు. ముహాజిర్లను ఆదుకోవటంలో, దైవధర్మానికి తోడ్పడటంలో నికార్సయిన విశ్వాసులని నిరూపించుకున్నారు. వారిలోని ఓ గొప్ప సుగుణం ఏమిటంటే వారు తమ ముహాజిర్ సోదరులను అమితంగా ప్రేమించేవారు. వారి ప్రేమ నిష్కల్మషమయినది. వారి ఆంతర్యాలలో కల్లాకపటం ఉండేది కాదు. వారు ఎల్లప్పుడూ తమ ఆత్మలపై తమ ముహాజిర్ సోదరులకే ప్రాధాన్యత ఇచ్చారు. వారి క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకునేవారు. వారి మనసులలో పిసినారితనం, సంకుచిత స్వభావం ఏ కోశానా ఉండేవి కావు. అందుకే వారు విజయ భాగ్యానికి నోచుకున్నారు. ఇవి వారిలోని సర్వసామాన్యమయిన సుగుణాలు. అలాగే కొన్ని ప్రత్యేక సుగుణాల దృష్ట్యా వారిలో కొందరు మరికొందరి కంటే గొప్పవారుగా కీర్తించబడ్డారు – ముఖ్యంగా ఇస్లాం కొరకు, ధర్మయుద్ధం కొరకు, హిజ్రత్ కొరకు ముందంజవేసిన కారణంగా!

వారిలో అందరికన్నా గొప్ప సహాబీలు (رضي الله عنهم) నలుగురు ధర్మ ఖలీఫాలు. అంటే

హజ్రత్ అబూబకర్, హజ్రత్ ఉమర్, హజ్రత్ ఉస్మాన్, హజ్రత్ అలీ (رضي الله عنهم). ఆ తరువాత అష్రె ముబష్షిరహ్ – అంటే స్వర్గలోక శుభవార్త ప్రపంచంలోనే పొందిన ధన్యజీవులు. వారు (నలుగురు ధర్మఖలీఫాలతో పాటు) తల్హా, జుబైర్, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, అబూ ఉబైదా బిన్ జర్రాహ్, సాద్ బిన్ అబీ వఖ్ఖాస్, సయీద్ బిన్ జైద్ (رضي الله عنهم)లు. ముహాజిర్లకు అన్సార్లపై ఒకింత ప్రాధాన్యం ఉంది. బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారికి, అహ్లె బైఅతే రిజ్వాన్‌లో ఉన్నవారికి ప్రత్యేక ప్రాధాన్యత వొసగబడింది. అలాగే మక్కా విజయానికి పూర్వం ఇస్లాం స్వీకరించి జిహాద్ చేసినవారు, మక్కా విజయం తర్వాత ఇస్లాం స్వీకరించిన సహాబీల కన్నా గొప్పవారు.

**(2) ప్రవక్త సహచరుల మధ్య విభేదాల, అంతఃకలహాల విషయంలో అహ్లె సున్నత్ వల్ జమాఅత్ వైఖరి :**

**ఉపద్రవానికి మూలం :** ప్రవక్త ప్రియ సహచరుల మధ్య చీలిక రావటానికి ప్రధాన కారకులు యూదులు. వారు ఇస్లాంకు, ముస్లిములకు వ్యతిరేకంగా కుట్రపన్నారు. వారు వంచనా శిల్పనిష్ణాతుడైన, యమన్ దేశస్థుడైన అబ్దుల్లాహ్ బిన్ సబా అనే యూద వ్యక్తిని దీని కొరకు సిద్ధం చేశారు. వాడు ఇస్లాం స్వీకరిస్తున్నట్లు నాటకమాడి తన చుట్టూ ఓ సుందర వలయాన్ని అల్లుకున్నాడు. తరువాత అతను తృతీయ ఖలీఫా అయిన హజ్రత్ ఉస్మాన్ (رضي الله عنه)కు వ్యతిరేకంగా దుర్విమర్శలు చేయటం మొదలెట్టాడు. చివరకు ఆయనపై విషం కక్కాడు. ఆయనపై అపనిందలు కూడా మోపాడు. తత్ఫలితంగా సంకుచిత స్వభావులు, బలహీన విశ్వాసం గలవారు కొందరు అతని మాటల్లో పడి, అసమ్మతి వాదులుగా అతని చుట్టూ చేరారు. వారి కుట్ర మూలంగా హజ్రత్ ఉస్మాన్ (رضي الله عنه) నిర్దాక్షిణ్యంగా హత్యచేయబడ్డారు. ఆయన (رضي الله عنه) అమరగతినొందిన తరువాత ముస్లిములలో విభేదాలు పొడసూపాయి. దానికి తోడు యూదులు చాపక్రింద నీరులా ప్రవహించి ప్రజలను రెచ్చగొట్టడంతో ప్రవక్త సహచరుల మధ్య విభేదాలు మరింత తీవ్రరూపం దాల్చాయి. వారు తమ తమ ఇజ్తెహాద్ ప్రకారం (అంటే వారిలో ప్రతి ఒక్కరూ తాము ఎన్నుకునే విధానమే సరైనదని భావించటం వల్ల) కలహాలకు, యుద్ధాలకు తెరలేచింది.

'అఖీదయె తహావీయ' వ్యాఖ్యాత ఇలా అంటున్నారు : "రఫ్జ్ (షియాతత్వం) అనే ఉపద్రవాన్ని ఓ కపట విశ్వాసి సృష్టించాడు. ఇస్లాం ధర్మాన్ని రూపుమాపి, ఇస్లాం ప్రవక్త (صلى الله عليه وسلم) వ్యక్తిత్వాన్ని కళంకితం చేయాలన్నది వాడి ఉద్దేశ్యం. అందుకే అబ్దుల్లాహ్ బిన్ సబా ఇస్లాం స్వీకరించినట్లు ప్రకటించగానే తన వంచనాపూరిత, మోసపూరిత చేష్టల ద్వారా ఇస్లాం ధర్మానికి తూట్లు పొడవటం మొదలెట్టాడు. క్రైస్తవ మతం పట్ల బోల్స్ వ్యవహరించినట్లే ఇతనూ వ్యవహరించాడు. అంటే తనను ఒక మహా సాత్వికునిగా, దుష్ట శిక్షకు శిష్టరక్షణకు నడుం బిగించిన వానిగా చాటుకుని తనచుట్టూ ఓ సుందరవలయాన్ని అల్లుకున్నాడు. ఆ తరువాత హజ్రత్ ఉస్మాన్ (رضي الله عنه)కు వ్యతిరేకంగా అసంతృప్తవాదాన్ని వ్యాపింపజేసి, ఆయన్ని హతమార్చే ప్రయత్నం చేశాడు. దరిమిలా



'కూఫా' వచ్చి, హజ్రత్ అలీ (رضي الله عنه)కి వీరాభిమానిగా ప్రకటించుకుని, ఆయనను పొగడ టంలో అతిశయిల్లి రాగానపడ్డాడు. ఆ విధంగా ఆయన (رضي الله عنه) అభిమానం చూరగొని, తన తుచ్ఛమయిన ఉద్దేశ్యాన్ని నెరవేర్చుకుందామనుకున్నాడు. అతని కుత్సితబుద్ధి గురించి తెలియగానే హజ్రత్ అలీ (رضي الله عنه), అతన్ని హతమార్చమని ఆదేశించారు. దాంతో వాడు 'ఖర్ఖైస్'కు పలాయనం చిత్తగించాడు. అతని పూర్తి వృత్తాంతం చరిత్రపుటల్లో ఉంది."

షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (رحمه الله) ఇలా అంటున్నారు : హజ్రత్ ఉస్మాన్ (رضي الله عنه) అమరగతి నొందిన తరువాత ప్రజల గుండెలు శోకంతో అవిసిపోయాయి. వారి హృదయాలు భగ్న హృదయాలైపోయాయి. ముస్లింలపై దుఃఖ పర్వతం విరుచుకుపడింది. దుష్టశక్తులు చెలరేగిపోయాయి. సజ్జనుల ఆత్మ విశ్వాసం సన్నిగిల్లిపోయింది. అప్పటి వరకూ అణగిమణగి ఉండేవారు ఉపద్రవాన్ని వ్యాపింపజేయ టంలో కృతకృత్యులైపోయారు. సంస్కరణా సరణిని అవలంబించదలచిన వారు అశక్తులై పోయారు. అందువల్ల వారంతా ఖిలాఫత్‌కు అందరికన్నా ఎక్కువ అర్హులైన హజ్రత్ అలీ బిన్ అబీతాలిబ్ (رضي الله عنه) చేతులపై ప్రతిజ్ఞ (బైఅత్) చేశారు. కాని అప్పటికే ఉపద్రవాగ్ని రాజుకుని ఉండటం వల్ల, ప్రజల హృదయాలు భగ్నమై ఉండటం వల్ల సమాజంలో సమైక్యత, సంగఠితత్వం సాధ్యం కాలేకపోయింది. ముస్లింలలో సామూహికత వ్రేళ్లను కోలేక పోయింది. ఆనాటి ఖలీఫాగానీ, సమాజంలో మానవ నవనీతంగా పరిగణించబడే మంచివారుగాని ఎంతగా అభిలషించినప్పటికీ అనుకున్న మంచిని సాధించలేకపోయారు. విచ్ఛిన్నకరమైన ఆ వాతావరణంలో మరికొందరు స్వార్థపరులు కూడా జొరబడ్డారు. ఆ తరువాత జరగవలసినదంతా జరిగిపోయింది." (మజ్మూఅ అల్ ఫతావా : 25/304, 305)

ఇకపోతే హజ్రత్ అలీ, ముఆవియా (رضي الله عنهما)ల యుద్ధంలో పాల్గొన్న ప్రవక్త ప్రియ సహచరుల సంజాయిషీ (కారణం)ని వివరిస్తూ షేఖుల్ ఇస్లాం ఇలా అభిప్రాయపడ్డారు:

ముఆవియా (رضي الله عنه) అలీ (రజి)తో యుద్ధానికి సంసిద్ధమైనపుడు ఖిలాఫత్ తనకే చెందాలని ఆయన కోరలేదు. ఆయనకు ఖిలాఫత్ కట్టబెట్టే విషయమై బైఅత్ (ప్రతిజ్ఞ) కూడా చేయించలేదు. తానొక ఖలీఫా అనే భావనతో ఆయన యుద్ధానికి రాలేదు. ఈ విషయం గురించి ముఆవియా (رضي الله عنه)ను ఎవరు ప్రశ్నించినా వారి ముందు ఆయన ఇదంతా చెప్పేవారు. ఆయన అనుయాయులు కూడా అంతే. వారు అలీ (رضي الله عنه)తోనూ, అలీ సహచరులతోనూ యుద్ధానికి ముందంజ వేయలేదు. అదే సమయంలో హజ్రత్ అలీ (رضي الله عنه), మరియు ఆయన సహచరుల ఆలోచనలు మరోవిధంగా ఉన్నాయి – తానొక ఖలీఫా కావటం చేత ముఆవియ మరియు ముఆవియా సహచరులు వచ్చి తన చేతుల మీద ప్రమాణ స్వీకారం చేయాలన్నది అలీ (رضي الله عنه) అభిలాష. ఎందుకంటే ముస్లింలకు ఖలీఫాగా ఒకే వ్యక్తి ఉండాలి. కాని వారు తనకు విధేయత చూపటం లేదు. తన చేతిపై 'ప్రమాణం' చేయటం లేదు సరికదా, తమను స్వతంత్రులుగా ఊహించుకుం టున్నారు. తమ వద్ద శక్తి ఉంది. అధికార బలం ఉంది. అయినప్పటికీ వారు మాట వినటం లేదు. కాబట్టి వారితో యుద్ధం చేసి, వారిని దారికి రప్పించాలి. తద్వారా వారు

ఖలీఫాకు విధేయులవుతారు. ఆ విధంగా ముస్లింల సామూహిక వ్యవస్థ పటిష్టంగా ఉండగలుగుతుంది – ఇదీ హజ్రత్ అలీ (رضي الله عنه) మరియు ఆయన సహచరుల ఆలోచన.

కాగా; హజ్రత్ ముఆవియా (رضي الله عنه) మరియు ఆయన సహచరుల ఆలోచనా తీరు తద్భిన్నంగా ఉంది : తాము అలీ (رضي الله عنه) చేతులపై 'ప్రమాణం' చేయాల్సిన అవసరం లేదు. ఈ కారణంగా ఒకవేళ తమతో యుద్ధం చేయబడినా తాము బాధిత ప్రజల కోవకే చెందుతాము. ఎందుకంటే తృతీయ ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (رضي الله عنه) దారుణంగా హత్య చేయబడ్డారు. ఉస్మాన్ (رضي الله عنه)ను హత్య చేయటంలో కీలకపాత్ర పోషించినవారు ప్రస్తుతం హజ్రత్ అలీ (رضي الله عنه) సైన్యంలో ఉన్నారు. సైనిక విభాగంలో వారి ప్రాబల్యం కూడా ఎక్కువగానే ఉంది. మనం గనక ఈ సమయంలో నిర్లిప్తంగా ఉండిపోతే వారు మరింతగా విజృంభించి మనపై జులుంకు ఒడిగట్టవచ్చు. అదే గనక జరిగితే ఖలీఫా హజ్రత్ అలీ (رضي الله عنه) వారిని నిలువరించలేరు. హజ్రత్ ఉస్మాన్ (رضي الله عنه)ను ముట్టడించినపుడు అలీ (رضي الله عنه) ఎలా నిస్సహాయులుగా ఉండిపోయారో అలాగే ఉండిపోవచ్చు. కాబట్టి మనకు న్యాయం చేసే ప్రతిభావంతుడైన ఖలీఫా చేతుల మీద మాత్రమే మనం బైఅత్ (ప్రతిజ్ఞ) చేయాలి."

**సహాబా (رضي الله عنهم)మధ్య పొడసూపిన విభేదాలు, అంతఃకలహాల ఫలితంగా జరిగిన యుద్ధాలు – ఈ విషయంలో అహ్లె సున్నత్ వల్ జమాఅత్ వైఖరి రెండు విషయాలపై ఆధారపడి ఉంది.**

**ఒకటి :** ప్రవక్త (صلى الله عليه وسلم)ప్రియసహచరుల( رضي الله عنهم ) మధ్య తలెత్తిన వివాదాలపై, అవాంఛనీయ ఘటనలపై అహ్లెసున్నత్ వల్ జమాఅత్‌కి చెందిన వారు నోరెత్తకుండా మౌనం వహించటమే శ్రేయస్కరమని భావిస్తారు. ఈ రగడపై వారు తర్జనభర్జన చేయటంగానీ, తమవైన అభిప్రాయాలు వ్యక్తపరచటం గానీ చేయరు. పైగా వారిలా వేడుకుంటూ ఉంటారు:

﴿رَبَّنَا اغْفِرْ لَنَا وَلِإِخْوَانِنَا الَّذِينَ سَبَقُونَا بِالْإِيمَانِ وَلَا تَجْعَلْ فِي قُلُوبِنَا غِلًّا لِّلَّذِينَ آمَنُوا رَبَّنَا إِنَّكَ رَءُوفٌ رَّحِيمٌ﴾ (الحشر:١٠)

**"మా ప్రభూ! మమ్మల్ని క్షమించు. మాకన్నా ముందు విశ్వసించిన మా సోదరులను కూడా క్షమించు. విశ్వాసుల యెడల మా హృదయాలలో ఎలాంటి ద్వేషభావాన్నీ కలిగించకు. మా ప్రభూ! నిశ్చయంగా నీవు మృదుస్వభావుడవు. కనికరించేవాడవు." (అల్ హష్ర్ : 10)**

**రెండు :** సహాబా (ప్రవక్త సహచరులు – رضي الله عنهم ) గురించి ప్రాచుర్యంలో ఉన్న కథనాలకు సమాధానాలివ్వటం. దీనికి సంబంధించిన కొన్ని పద్ధతులు ఇవి :



## మొదటి పద్ధతి :

అలాంటి కథనాల (ఆసార్)లో కొన్ని పచ్చి అబద్ధాలు. ప్రవక్త సహచరులకు అపఖ్యాతి అంటగట్టడానికి ఇస్లాం విరోధులచే సృష్టించబడిన కట్టుకథలవి.

## రెండవ పద్ధతి :

సహాబాకు సంబంధించిన మరికొన్ని కథనాలున్నాయి. వాటిలో హెచ్చుతగ్గులు, మార్పులు చేర్పులు చేయబడ్డాయి. ఆ విధంగా వాటి రూపురేఖలనే మార్చివేయటం జరిగింది. అందులో అబద్ధం పాళ్ళు అధికం. కాబట్టి అలాంటి వాటిని కూడా పట్టించుకోకుండా ఉండటమే శ్రేయస్కరం.

## మూడవ పద్ధతి :

ఆ కథనాలలో ప్రామాణికం అనదగినవి, అలాంటివి చాలా తక్కువే. ఈ విషయంలో మటుకు ప్రవక్త సహచరులు అశక్తులు, క్షంతవ్యులు. ఎందుకంటే వారు ఆ విషయాలలో తమ 'ఇజ్తెహాద్' ప్రకారం పనిచేశారు. అందులో వారు సత్యం వరకూ చేరుకున్నారు లేదా వారివల్ల పొరపాటు కూడా జరిగి ఉండవచ్చు. ఎందుకంటే వారు 'ముజ్తహిద్‌లు' (సమకాలీన సవాళ్ళను షరీఅత్ బద్ధంగా అన్వయించటానికి శాయశక్తులా కృషిచేసిన విజ్ఞులు). ఈ అన్వయింపు ప్రయత్నంలో వారు సరైన ఆజ్ఞ వరకూ చేరగలిగితే వారికి రెట్టింపు పుణ్యఫలం లభిస్తుంది. ఒకవేళ వారు సరైన నిర్ణయానికి చేరుకోలేకపోయినప్పటికీ – వారివల్ల పొరపాటు జరిగినప్పటికీ – చిత్తశుద్ధితో కూడిన వారి కృషికి గాను ఒకింత పుణ్యఫలం లభిస్తుంది. మరోవైపు వారి తప్పు కూడా మన్నించబడుతుంది. ఎందుకంటే హదీసులో ఇలా అనబడింది :

"إِذَا اجْتَهَدَ الْحَاكِمُ فَأَصَابَ فَلَهُ أَجْرَانِ وَإِنِ اجْتَهَدَ فَأَخْطَأَ فَلَهُ أَجْرٌ وَاحِدٌ" (بخاری ومسلم)

**"న్యాయ నిర్ణయం గైకొనే వ్యక్తి 'ఇజ్తెహాద్' చేసినపుడు అతను సరైన నిర్ణయానికి చేరుకోగలిగితే అతనికి రెండింతల ప్రతిఫలం ప్రాప్తమవుతుంది. ఒకవేళ అతని వల్ల పొరపాటు జరిగినట్లయితే అతనికి ఒకింత ప్రతిఫలం లభిస్తుంది." (బుఖారీ, ముస్లిం)**

## నాల్గవ పద్ధతి :

ప్రవక్త సహచరులు (సహాబా– رضي الله عنهم ) కూడా మానవమాత్రులే. వారివల్ల కూడా తప్పులు జరగటం సహజం. వ్యక్తిగతంగా చూస్తే వారు దోషరహితులు కారు. అయితే వారివల్ల జరిగే పొరపాట్లను పరిహరించే మరెన్నో పనులు, అంశాలున్నాయి. అవి వారి పాపాలకు పరిహారంగా ఉపయోగపడతాయి. అలాంటి వాటిలో కొన్ని ఇవి –

1. బహుశా వారు పశ్చాత్తాపపడ్డారేమో! తప్పులు ఎన్ని జరిగి ఉన్నాసరే, పశ్చాత్తాపం (తౌబా) వాటిని రూపుమాపుతుంది.

2. ఒకవేళ వారివల్ల అలాంటిదేదైనా జరిగి ఉన్నా, మరెన్నో విషయాలలో వారు ముందంజవేసి ఉన్నారు. వారివల్ల జరిగిన తప్పుల మన్నింపునకు అవి సాధనం కావచ్చు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿إِنَّ الْحَسَنَاتِ يُذْهِبْنَ السَّيِّئَاتِ﴾(هود:١١٤)

**“నిశ్చయంగా పుణ్యకార్యాలు పాపకార్యాలను దూరం చేస్తాయి.” (హూద్ : 114)**

3. వారి పుణ్యకార్యాలు వేరితరుల కంటే ఎన్నో రెట్లు పెంచబడవచ్చు. గొప్పతనం విషయంలో ఇతర వ్యక్తులు వారితో సరితూగలేరు. వారు మంచి కాలానికి చెందినవారని ప్రవక్త (ﷺ) వారి ప్రవచనం ద్వారానే రూఢీ అయింది. వారిలో ఎవరయినా ఒక 'ముద్ద్'కు సమానంగా దానం చేస్తే అది ఇతరులు ఉహుద్ పర్వతానికి సమానంగా దానం చేసిన బంగారం కన్నా గొప్పది. అల్లాహ్ వారితో ప్రసన్నుడవుగాక! వారిని సంతోషంగా ఉంచుగాక!

షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (రహ్మ) ఇలా అంటున్నారు : “మొత్తం అహ్లె సున్నత్ వల్ జమాఅత్, ధర్మవేత్తల నమ్మకం (అఖీదా) ఏమిటంటే సహాబాలలో ఏ ఒక్కరూ దోష రహితులు, పవిత్రులు కారు. అలాగే ప్రవక్త బంధువులుగానీ, సహాబాలలో తొలికాలానికి చెందినవారు గానీ, ఇతరులు గానీ – వారెవరయినా వారివల్ల తప్పు జరగటం సహజం, సంభవం కూడా. అయితే అల్లాహ్ పశ్చాత్తాపం (తౌబా) ద్వారా వారి పాపాలను క్షమిస్తాడు. వారి అంతస్తులను ఉన్నతం చేస్తాడు. అలాగే పాపాలను రూపుమాపే సత్కార్యాల ద్వారా లేదా ఇతరత్రా కారణాల దృష్ట్యా వారిని క్షమిస్తాడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَالَّذِي جَاءَ بِالصِّدْقِ وَصَدَّقَ بِهِ أُولَٰئِكَ هُمُ الْمُتَّقُونَ ☆لَهُم مَّا يَشَاءُونَ عِندَ رَبِّهِمْ ذَٰلِكَ جَزَاءُ الْمُحْسِنِينَ ☆لِيُكَفِّرَ اللَّهُ عَنْهُمْ أَسْوَأَ الَّذِي عَمِلُوا وَيَجْزِيَهُمْ أَجْرَهُم بِأَحْسَنِ الَّذِي كَانُوا يَعْمَلُونَ﴾(الزمر:٣٣،٣٥)

**ఎవరయితే సత్యధర్మాన్ని తీసుకువచ్చారో, మరెవరయితే దానిని సత్యమని ధ్రువీకరించారో అటువంటివారే భయభక్తులు గలవారు.**



**వారికోసం వారి ప్రభువు దగ్గర వారు కోరినదల్లా ఉంది. సదాచార సంపన్నులకు లభించే ప్రతిఫలం ఇదే. అల్లాహ్ వారి దురాచరణలను వారి నుండి దూరం చేయటానికి, వారు చేసిన సదాచరణలకు గాను ఉత్తమ పుణ్యఫలం ఇవ్వటానికి (ఈ వ్యవస్థను నెలకొల్పుతాడు). (అజ్ జుమర్ : 33 – 35)**

ఇంకా ఈ విధంగా సెలవీయబడింది :

﴿حَتَّىٰ إِذَا بَلَغَ أَشُدَّهُ وَبَلَغَ أَرْبَعِينَ سَنَةً قَالَ رَبِّ أَوْزِعْنِي أَنْ أَشْكُرَ نِعْمَتَكَ الَّتِي أَنْعَمْتَ عَلَيَّ وَعَلَىٰ وَالِدَيَّ وَأَنْ أَعْمَلَ صَالِحًا تَرْضَاهُ وَأَصْلِحْ لِي فِي ذُرِّيَّتِي إِنِّي تُبْتُ إِلَيْكَ وَإِنِّي مِنَ الْمُسْلِمِينَ ☆أُولَٰئِكَ الَّذِينَ نَتَقَبَّلُ عَنْهُمْ أَحْسَنَ مَا عَمِلُوا وَنَتَجَاوَزُ عَن سَيِّئَاتِهِمْ فِي أَصْحَابِ الْجَنَّةِ﴾(الاحقاف:١٥،١٦)

**తుదకు అతను పూర్తి పరిపక్వతకు, అంటే నలభై ఏళ్ళ ప్రాయానికి చేరుకున్నప్పుడు ఇలా విన్నవించుకున్నాడు : “నా ప్రభూ! నీవు నా తల్లిదండ్రులపై కురిపించిన అనుగ్రహ భాగ్యాలకు గాను కృతజ్ఞతలు తెలుపుకునే, నీ ప్రసన్నతను చూరగొనే విధంగా సత్కార్యాలు చేసే సద్బుద్ధిని నాకు ప్రసాదించు. ఇంకా నా సంతానాన్ని కూడా సజ్జనులుగా తీర్చిదిద్దు. నేను నీ వైపునకే మరలుతున్నాను. నేను నీ విధేయులలో ఒకణ్ణి.” ఇలాంటి వారి సత్కార్యాలనే మేము స్వీకరిస్తాము. వారి తప్పులను క్షమిస్తాము. వారికి చేయబడిన సత్య వాగ్దానం ప్రకారం వారు స్వర్గవాసులలో ఉంటారు. (అల్ అహ్ఖాఫ్ : 15,16)**

(మజ్మూఅ ఫతావా : 35/69)

ప్రవక్త సహచరుల మధ్య తలెత్తిన విభేదాలను, పోరాటాలను ఇస్లాం శత్రువులు తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటూ సహాబా వ్యక్తిత్వాలపై బురదజల్లేందుకు ప్రయత్నించారు. వారి గౌరవ మర్యాదలను మంట గలిపేందుకు అవకాశంగా తీసుకున్నారు. అదే రకమయిన నీచ స్వభావంతో ఈనాటి కొందరు రచయితలు, సోకాల్డ్ మేధావులు కూడా తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు. వీరు అనాలోచితంగా సహాబాపై విమర్శలు గుప్పిస్తుంటారు. ఆ విధంగా వారు తమను తాము సహాబా వైఖరిపై తీర్పు చెప్పే న్యాయమూర్తులుగా ఊహించుకుంటున్నారు. తగు ఆధారాలు, నిదర్శనాలు లేకుండానే – కేవలం తమ మనోవాంఛలకు లోబడి – స్వార్థపరుల, కపట విమర్శకుల వ్యాఖ్య

లను ఉదాహరిస్తూ కొంతమంది సహాబీలను సత్యవాదులుగా, మరికొంతమంది సహాబీలను దోషులుగా నిర్ధారిస్తున్నారు. అంతేకాదు, ఇస్లామీయ సంస్కృతీ నాగరికతల పట్ల తగు అవగాహన లేని కొంతమంది ముస్లిం యువకులలో – ఇస్లాం యొక్క గొప్ప చరిత్రపట్ల, తొలికాలపు మహనీయుల పట్ల లేనిపోని దురనుమానాలను నూరిపోస్తున్నారు. ఆ విధంగా వారిలో ఇస్లాం పట్ల ఏవగింపును కలిగించి, ముస్లిం సముదాయంలో చీలికను తీసుకురావాలని, తొలికాలపు సజ్జనుల పట్ల చివరి కాలపు ప్రజలలో ద్వేషాన్ని, వైషమ్యాన్ని రగుల్గొల్పాలని చూస్తున్నారు. దీనికి బదులు వారు తొలికాలపు సత్పురుషుల అడుగుజాడలలో నడచి, వారి కొరకు దుఆ చేసినట్లయితే ఎంత బాగుండేది! అలాంటి సద్భావన కలిగి ఉండే వారిని దేవుడు సయితం శ్లాఘిస్తాడు. ఉదాహరణకు –

﴿وَالَّذِينَ جَاؤُوا مِن بَعْدِهِمْ يَقُولُونَ رَبَّنَا اغْفِرْ لَنَا وَلِإِخْوَانِنَا الَّذِينَ سَبَقُونَا بِالْإِيمَانِ وَلَا تَجْعَلْ فِي قُلُوبِنَا غِلًّا لِّلَّذِينَ آمَنُوا رَبَّنَا إِنَّكَ رَؤُوفٌ رَّحِيمٌ﴾ (الحشر:١٠)

**వారి తరువాత వచ్చిన వారు (తమ పూర్వీకులను గురించి) ఇలా వేడుకుంటారు : "మా ప్రభూ! మమ్మల్ని క్షమించు. మాకన్నా ముందు విశ్వసించిన మా సోదరులను కూడా క్షమించు. విశ్వాసుల యెడల మా హృదయాలలో ఎలాంటి ద్వేషభావాన్నీ కలిగించకు. మా ప్రభూ! నిశ్చయంగా నీవు మృదుస్వభావం కలిగినవాడవు. కనికరించేవాడవు." (అల్ హష్ర్ : 10)**



**ఆరవ ప్రకరణం**

# మహాప్రవక్త (ﷺ) సహచరుల(رضي الله عنهم)ను, మార్గదర్శక నాయకులను తూలనాడరాదు

**(1) సహాబాలను తూలనాడటం పట్ల వారింపు :**

అహ్లె సున్నత్ వల్ జమాఅత్ సంవిధానంలో ఉన్న నిబంధనలలో ఒకటేమిటంటే మహాప్రవక్త ప్రియ సహచరుల (رضي الله عنهم) విషయంలో వారి ఆంతర్యాలు నిర్మలంగా ఉండాలి. వారి గురించి నోరు జారకూడదు. అల్లాహ్ తన గ్రంథంలో తెలియజేసినట్లుగా ఉండాలి వారి వైఖరి.

﴿وَالَّذِينَ جَاؤُوا مِن بَعْدِهِمْ يَقُولُونَ رَبَّنَا اغْفِرْ لَنَا وَلِإِخْوَانِنَا الَّذِينَ سَبَقُونَا بِالْإِيمَانِ وَلَا تَجْعَلْ فِي قُلُوبِنَا غِلًّا لِّلَّذِينَ آمَنُوا رَبَّنَا إِنَّكَ رَؤُوفٌ رَّحِيمٌ﴾ (الحشر:١٠)

**వారి తరువాత వచ్చిన వారు (వారి గురించి) ఇలా వేడుకుంటారు: "మా ప్రభూ! మమ్మల్ని క్షమించు. మాకన్నా ముందు విశ్వసించిన మా సోదరులను కూడా క్షమించు. విశ్వాసుల యెడల మా హృదయాలలో ఎలాంటి ద్వేషభావాన్నీ కలిగించకు. మా ప్రభూ! నిశ్చయంగా నీవు మృదు స్వభావం కలవాడవు. కనికరించేవాడవు." (అల్ హష్ర్ : 10)**

ఇంకా వారు – దైవప్రవక్త (ﷺ) చేసిన ఈ హితవును ఖచ్చితంగా పాటిస్తారు–

"لَا تَسُبُّوا أَصْحَابِي فَهُوَ الَّذِي نَفْسِي بِيَدِهِ لَوْ أَنْفَقَ أَحَدُكُمْ مِّثْلَ أُحُدٍ ذَهَبًا مَا بَلَغَ مُدَّ أَحَدِهِمْ وَلَا نَصِيفَهُ" (بخاری ومسلم)

**"నా సహచరులను దూషించకండి. ఎవరి చేతిలో నా ప్రాణం ఉందో ఆ శక్తిమంతుని సాక్షిగా! మీలో ఏ వ్యక్తి అయినా ఉహుద్ పర్వతానికి సమానంగా బంగారం ఖర్చుచేసినా, వారిలో (అంటే నా ప్రత్యక్ష సహచరులలో)ని వారు దానం చేసిన ఒక 'ముద్ద్'కు, ఆఖరికి 'ముద్ద్'లో సగభాగానికి కూడా సమానం కాజాలదు." (బుఖారీ, ముస్లిం)**

అహ్లె సున్నత్ వల్ జమాఅత్ వారు సహాబాలను దూషించే రాఫిజీల (షియావారి)తో, ఖవారిజ్ వర్గీయులతో తెగత్రెంపులు చేసుకుంటారు. వారితో ఎలాంటి స్నేహం,

సుహృద్భావం కలిగి ఉండరు. తరచూ సహాబాలను కాఫిర్‌లు (అవిశ్వాసులు) గా ఖరారు చేసే వీరి ధోరణిని ఖండిస్తారు. వీరిలోని ఏ మంచితనాన్నీ అంగీకరించరు.

ప్రవక్త సహచరుల ఔన్నత్యం గురించి ఖుర్‌ఆన్ హదీసులలో చెప్పబడిన దానిని అహ్లె సున్నత్ వల్ జమాఅత్ వారు శిరసావహిస్తారు. సహాబా ముస్లిం ఉమ్మత్‌లో కెల్లా అత్యుత్తములని విశ్వసిస్తారు. ఉదాహరణకు మహాప్రవక్త (ﷺ) చెప్పినట్లుగా –

"خَيْرُكُمْ قَرْنِي...." (بخاری ومسلم)

**"మీ అందరిలోకెల్లా ఉత్తములు నా కాలానికి చెందినవారు." (బుఖారీ, ముస్లిం)**

తన ఉమ్మత్ (అనుచర సమాజం) 73 వర్గాలుగా చీలిపోతుందని, వారిలో ఒకే ఒక వర్గం తప్ప మిగిలిన వారంతా నరకానికి పోతారని దైవప్రవక్త (ﷺ) చెప్పినపుడు, ఆ ఒక్క వర్గం ఏదంటూ ప్రియ సహచరులు (رضي الله عنهم) అడిగారు. సమాధానంగా దైవప్రవక్త (ﷺ) ఇలా అన్నారు :

"هُمْ مَنْ كَانَ عَلَىٰ مِثْلِ مَا أَنَا عَلَيْهِ الْيَوْمَ وَأَصْحَابِي" (ترمذی:۲۶۴۱ حسن)

**"ఈ రోజు నేను, నా సహచరులు ఏ పద్ధతిపై ఉన్నామో ఆ పద్ధతిపై స్థిరంగా ఉండేవారు." (ముస్నదె అహ్మద్, తిర్మిజి 2641 హసన్)**

ఇమామ్ ముస్లిం గురువుల్లో ప్రముఖులైన ఇమామ్ అబూజుర్‌అ ఇలా అంటున్నారు: "ఏ వ్యక్తి అయినా మహాప్రవక్త ప్రియసహచరులలో ఎవరినయినా తూలనాడుతున్నట్లు మీరు గమనిస్తే అతణ్ణి ధర్మవిహీనునిగా పరిగణించండి. ఎందుకంటే ఖుర్‌ఆన్ సత్యం. దైవప్రవక్త (ﷺ) సత్యం. ఆయన (ﷺ) తెచ్చిన షరీయత్ సత్యబద్ధం. కాగా; వీటన్నింటినీ మన వరకూ చేర్చినవారు సహాబీలే (ప్రియ సహచరులే). కాబట్టి వారిని తూలనాడినవాడు ఖుర్‌ఆన్ హదీసులనే అసత్యంగా ఖరారు చేయదలుస్తున్నాడని అనుకోవాలి. కనుక అలాంటి వ్యక్తి స్వయంగా నిందార్హుడు. అతనిపై ధర్మవిహీనుడు, మార్గవిహీనుడన్న అభియోగం మోపటం చాలా వరకు సమంజసం, సత్యం."

అల్లామా ఇబ్నె హమదాన్ తన గ్రంథం 'నిహాయతున్ ముబ్తదీన్'లో ఇలా అంటున్నారు : "ఎవరయితే ప్రవక్త సహచరులను దూషించటం ధర్మసమ్మతం అని భావిస్తూ మరీ దూషిస్తున్నాడో అతను ఖచ్చితంగా కాఫిర్ (అవిశ్వాసి). మరెవరయితే ధర్మసమ్మతం కాదని భావిస్తూ కూడా దూషిస్తాడో అతడు పాపాత్ముడు (ఫాసిఖ్)." ఆయన గారి మరో పలుకు ఇలా ఉంది : "ఎవరయితే ప్రవక్త ప్రియ సహచరులను దూషిస్తాడో, అతను నిశ్చయంగా కాఫిరే (దాన్ని అతను ధర్మసమ్మతమని భావించినా, భావించక పోయినా). అదేవిధంగా – ఎవరయితే ప్రవక్త సహచరుల (رضي الله عنهم)ను అవిధేయులుగా ఖరారు చేస్తాడో లేదా వారి ధర్మావలంబనలో లోపం ఎత్తిచూపిస్తాడో లేదా వారిని కాఫిర్లుగా



ఖరారు చేస్తాడో, అతను ముమ్మాటికీ కాఫిర్ (అవిశ్వాసి). (షరహ్ అఖీదతుస్సిఫారీని – 2/388, 389)

**(2) ముస్లిం సమాజంలోని మార్గదర్శకులను దూషించటం పట్ల వారింపు :**

మహిమోన్నతల దృష్ట్యాగానీ, స్థాయి రీత్యాగానీ సహాబా తర్వాత స్థానం, ఉమ్మత్‌కు చెందిన మార్గదర్శక నాయకులది. వారే తాబయీన్, తబయె తాబయీన్, ఆ తర్వాత తరానికి చెందిన ఉలమా. వారంతా సహాబాను శాయశక్తులా అనుసరించారు. అల్లాహ్ సెలవిచ్చినట్లుగా

﴿وَالسَّابِقُونَ الْأَوَّلُونَ مِنَ الْمُهَاجِرِينَ وَالْأَنصَارِ وَالَّذِينَ اتَّبَعُوهُم بِإِحْسَانٍ رَّضِيَ اللَّهُ عَنْهُ﴾ (التوبة:١٠٠)

**ముహాజిర్లలో, అన్సార్లలో ప్రప్రథమంగా ముందంజవేసిన వారితోనూ, తరువాత చిత్తశుద్ధితో వారిని అనుసరించిన వారితోనూ అల్లాహ్ ప్రసన్నుడయ్యాడు. వారు అల్లాహ్ పట్ల సంతుష్టులయ్యారు.**

**(అత్ తౌబా : 100)**

కనుక వారిని దూషించటం, వారిలోని లోపాలను ఎత్తి చూపటం, వారిపై విమర్శనాస్త్రాలు సంధించటం ఎంతమాత్రం సమ్మతం కాదు. ఎందుకంటే వారంతా మార్గదర్శకులు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَمَن يُشَاقِقِ الرَّسُولَ مِن بَعْدِ مَا تَبَيَّنَ لَهُ الْهُدَىٰ وَيَتَّبِعْ غَيْرَ سَبِيلِ الْمُؤْمِنِينَ نُوَلِّهِ مَا تَوَلَّىٰ وَنُصْلِهِ جَهَنَّمَ وَسَاءَتْ مَصِيرًا﴾ (النساء:١١٥)

**ఎవరయినా సన్మార్గం ప్రస్ఫుటం అయిన మీదట కూడా ప్రవక్త (స)కు వ్యతిరేకంగా పోతే, విశ్వాసులందరి మార్గాన్ని వీడి, ఇతర మార్గాన్ని అనుసరిస్తే, మేమతన్ని అతను మరలదలచుకున్న వైపునకే మరలుస్తాము. కడకు అతన్ని నరకంలో పడవేస్తాము. అది అత్యంత చెడ్డ గమ్యస్థానం. (అన్ నిసా : 115)**

'కితాబుత్తహావియ' వ్యాఖ్యాత (ఇమామ్ ఇబ్నె అబీ అజల్ హనఫీ) ఇలా అన్నారు: "అల్లాహ్‌తో, ఆయన ప్రవక్త (ﷺ)తో స్నేహపూర్వక సంబంధాల తర్వాత తోటి విశ్వాసులతో కూడా స్నేహ సంబంధాలు ఏర్పరచుకోవటం ప్రతి ముస్లింకూ తప్పనిసరి. ఈ విషయంలో ఖుర్‌ఆన్ సర్వ సాధారణమయిన ఆజ్ఞ ఉండనే ఉంది. అయితే మరీ ముఖ్యంగా ప్రవక్తల వారసులతో మనకు స్నేహబంధం ఉండాలి. అల్లాహ్ వారిని

ధ్రువతారల మాదిరిగా చేశాడు. నేలలోని, సముద్రాలలోని చీకట్లలో వాటి ద్వారా మార్గం కనుగొనబడుతుంది. వారి మార్గదర్శకత్వంపై, వారి ధర్మావగాహనపై ముస్లింలందరికీ గురి ఉంది."

ఎందుకంటే వీరు దైవప్రవక్త (ﷺ) అనుచర సమాజంలో ఆయన (ﷺ) శిష్యుల, వారు వదలివెళ్ళిన మృత సంప్రదాయాలను పునరుజ్జీవింప జేసేవారు. వారి మూలంగానే దైవగ్రంథం నెలకొని ఉంది. దాని ఊపిరి మూలంగా వారు కూడా నిలబడి ఉన్నారు. వారి గురించి దైవగ్రంథంలో స్పష్టమయిన వివరణ వచ్చింది. వారు కూడా దానికి ప్రతినిధుల వంటివారు. దైవప్రవక్త (ﷺ)ను అనుసరించటం అనివార్యం (వాజిబ్) అన్న విషయంలో వారందరి మధ్య ఏకాభిప్రాయం ఉంది. కాని ఒకవేళ వారిలో ఎవరి ఉవాచ అయినా ప్రామాణిక హదీసుకు వ్యతిరేకంగా మన ముందుకువస్తే, ఆ హదీసును పరిత్యజించటంలో ఆయన వద్ద తప్పకుండా ఏదో కారణం ఉండి ఉంటుంది అని మనం భావించాలి.

**సాధారణంగా ఆ కారణం మూడు విధాలుగా ఉంటుంది.**

1. ప్రవక్త (ﷺ) ప్రవచనం అయి ఉండవచ్చున్న విషయంపై అతనికి నమ్మకం కుదరక పోవచ్చు.
2. ఆయన (ﷺ) ఆ ప్రవచనం ద్వారా చెప్పదలచిన విషయంపై ఇదమిత్థంగా ఒక నిర్ధారణకు రాకపోయి ఉండవచ్చు.
3. అది రద్దు అయిపోయిన ఆజ్ఞ కావచ్చు అన్నది అతని నమ్మకం అయి ఉండవచ్చు.

మొత్తానికి మనందరి మీద వారికి ఆధిక్యత ఉంది. మనకు వారు ఉపకారం చేసినవారు. వారు మనకన్నా ముందే విశ్వసించినవారు. దైవప్రవక్త (ﷺ) అందజేసిన ధర్మాన్ని వారు మన వరకూ చేర్చారు. మనకు అర్థం కాకుండా నిగూఢంగా ఉండిపోయే ఎన్నో విషయాలను వారు మనకు విడమరచి చెప్పారు. అల్లాహ్ వారితో ప్రసన్నుడవుగాక! వారిని సంతుష్టపరచుగాక!

﴿ رَبَّنَا اغْفِرْ لَنَا وَلِإِخْوَانِنَا الَّذِينَ سَبَقُونَا بِالْإِيمَانِ وَلَا تَجْعَلْ فِي قُلُوبِنَا غِلًّا لِّلَّذِينَ آمَنُوا رَبَّنَا إِنَّكَ رَءُوفٌ رَّحِيمٌ ﴾ (الحشر:١٠)

**"మా ప్రభూ! మమ్మల్ని క్షమించు. మాకన్నా ముందు విశ్వసించిన మా సోదరులను కూడా క్షమించు. విశ్వాసుల యెడల మా హృదయాలలో ఎలాంటి కల్మషాన్నీ ఉంచకు. నిశ్చయంగా నీవు మృదు స్వభావం కలవాడవు. కనికరించేవాడవు." (అల్ హష్ర్ : 10)**



కొంతమంది విద్వాంసుల (ఉలమా)చే ధర్మసూత్రాల అన్వయింపు (ఇజ్తెహాదీ) ప్రక్రియలో దొర్లిన తప్పుల మూలంగా వారి స్థాయిని దిగజార్చే ప్రయత్నం చేయటం బిద్అతీల విధానం. ఇలాంటి వాటి కోసం ఇస్లాం విరోధులు కాచుకుని ఉంటారు. తద్వారా ఇస్లాం గురించి లేనిపోని సందేహాలు సృష్టించటానికి, ముస్లిముల మధ్య వైరభావం పుట్టించటానికి శాయశక్తులా యత్నిస్తారు. భావి తరాలవారు తమ పూర్వీకుల (సలఫ్) పట్ల విముఖతను, విసుగును వ్యక్తం చేసేలా కుట్ర పన్నుతారు. విద్వాంసులకు – నవ యువకులకు మధ్య విభేదాలను సృష్టిస్తారు. వారి మధ్య పూడుకోని అంతరాల అగాధాలను కల్పిస్తారు. నేడు సర్వత్రా జరిగేది కూడా ఇదే. కాబట్టి విద్యార్థి దశలో ఉన్న నవయువకులు ఈ స్వార్థపరుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఎందుకంటే వారు ధర్మవేత్తల (ఫుకహా) యొక్క, ఇస్లామీయ ధర్మశాస్త్రం (ఫికహ్) యొక్క స్థాయిని దిగజారుస్తారు. దానిని చదవటం, చదివించటం పట్ల, దానిలో ఉన్న శ్రేయోదాయకమయిన విషయాలను, సత్యాన్ని సంగ్రహించటం పట్ల తమ అనాసక్తతను, విసుగును ప్రదర్శిస్తూ ఉంటారు. మొత్తానికి వారు తమ ఫికహ్ (ధర్మశాస్త్రం)ను గర్వకారణంగా భావించాలి. తమ విద్వాంసులను గౌరవించాలి. మార్గవిహీనుల, స్వార్థపరుల దుష్ప్రచార జాలంలో మాత్రం చిక్కుకోరాదు.

## ఆరవ అధ్యాయం

# బిద్‌అతులు (నవీన పోకడలు)

ఈ అధ్యాయంలో క్రింద పేర్కొనబడిన ప్రకరణములు ఉన్నాయి –

**మొదటి ప్రకరణం** : బిద్‌అత్ నిర్వచనం – దాని రకాలు, ఆదేశాలు.

**రెండవ ప్రకరణం** : ముస్లింలలో బిద్‌అతులు పొడసూపిన వైనం – కారణాలు.

**మూడవ ప్రకరణం** :బిద్‌అతీల గురించి ఇస్లామీయ సమాజం వైఖరి – వాటిని ఖండించటంలో 'అహ్లె సున్నత్ వల్ జమాఅత్' విధానం.

**నాల్గవ ప్రకరణం** : వర్తమాన కాలంలోని బిద్‌అతుల కొన్ని మచ్చుతునకలు.

1. మీలాదున్నబీ ఉత్సవం
2. కొన్ని నిర్ణీత స్థలాల నుండి, చిహ్నాల నుండి, మృతుల నుండీ శుభం పొందటం.
3. ఆరాధనలు, దైవసామీప్యానికి సంబంధించిన బిద్‌అతులు.



## మొదటి ప్రకరణం

# బిద్‌అత్ నిర్వచనం : దాని రకాలు, ఆదేశాలు

**(1) నిఘంటువు ప్రకారం బిద్‌అత్ అంటే :**

'బిద్‌అత్' అనేది 'బద్అ' అనే పదం నుండి సంగ్రహించబడినది. దీని అర్థం గతకాలపు ఉపమానం ఏదీ లేకుండానే ఏదేని ఒక వస్తువును అపూర్వంగా, ప్రప్రథమంగా ఆవిష్కరించటం. ఉదాహరణకు అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿بَدِيعُ السَّمَاوَاتِ وَالْأَرْضِ﴾ (البقرة:١١٧)

**భూమ్యాకాశాలను మొట్టమొదట సృష్టించినవాడు ఆయనే (అల్లాహ్‌యే). (అల్ బఖర : 117)**

అంటే, పూర్వపు ఉపమానమేదీ లేకుండానే భూమ్యాకాశాలకు ఉనికిని ప్రసాదించినవాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿قُلْ مَا كُنتُ بِدْعاً مِّنَ الرُّسُلِ﴾ (الأحقاف:٩)

**(ఓ ప్రవక్తా!) వారితో అను : "నేను కొత్తగా వచ్చిన ప్రవక్తనేమీ కాను." (అల్ అహ్‌ఖాఫ్ : 9)**

అంటే; దేవుని తరఫున ప్రజలకు దైవ సందేశం అందజేసే మొట్టమొదటి వ్యక్తిని కాను. నాకు ముందు ఎందరో ప్రవక్తలు వచ్చారు.

'ఇబ్తెదఅ ఫులానున్ బిద్‌అతన్' అని అరబీలో అంటారు. అంటే అతను అంతకుముందు లేని ఒక కొత్త పద్ధతిని సృష్టించాడు అని అర్థం.

ఆరంభం లేక ఆవిష్కారం రెండు విధాలుగా ఉంటుంది :

1. అలవాట్లలో ఆవిష్కారం : ఉదాహరణకు – దైనందిన జీవితం కొరకు అవసరమయిన వాటిని కొత్తగా కనుగొనటం లేదా ఆవిష్కరించటం. ఇది ధర్మసమ్మతమే (హలాల్). ఎందుకంటే ఇది అలవాట్లకు సంబంధించినది.
2. ధర్మం (దీన్)లో కొంగ్రొత్త ఆవిష్కరణ : అంటే ధర్మంలో నూతన విధానాలను, పనులను సృష్టించటం. ఇది నిషిద్ధం (హరామ్). ఎందుకంటే ధర్మావలంబన విషయంలో ఖుర్‌ఆన్ హదీసుల ద్వారా రూఢీఅయిన విషయాల వరకే సరిపెట్టుకోవాలి. అందులో ఎలాంటి హెచ్చుతగ్గులు చేయకూడదు. హెచ్చుతగ్గులు చేయటం ధర్మసమ్మతం కాదు. ఆయన (ﷺ) ఇలా సెలవిచ్చారు :

''مَنْ أَحْدَثَ فِي أَمْرِنَا هَذَا لَيْسَ مِنْهُ فَهُوَ رَدٌّ'' (بخاری ومسلم)

**"ఎవరయినా మా ఈ (షరీఅత్) విషయంలో లేని వస్తువును సృష్టిస్తే అది త్రోసిపుచ్చబడుతుంది (స్వీకారయోగ్యం కాజాలదు)." (బుఖారీ, ముస్లిం)**

వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది :

”مَنْ عَمِلَ عَمَلاً لَيْسَ عَلَيْهِ أَمْرُنَا فَهُوَ رَدٌّ“( صحيح مسلم )

**“ఎవడయినా మా షరీయతుకు అనుగుణంగా లేని ఆచరణ ఏదయినా చేస్తే అది త్రోసిపుచ్చదగినది.” (సహీహ్ ముస్లిం)**

**2. ధర్మం (దీన్)లో బిద్అత్ల రకాలు : ధర్మంలో బిద్అత్లు రెండు రకాలు :**

**మొదటి రకం :** వాక్పరమైన, విశ్వాసపరమైన బిద్అత్ – అంటే ఈ బిద్అత్ సంబంధం వ్యక్తుల, వర్గాల మాటలతో, విశ్వాసాలతో ఉంటుంది. ఉదాహరణకు : జహ్మియ, మూతజిలా, రాఫ్జ తదితర మార్గవిహీన వర్గాల పలుకులు, వారి సిద్ధాంతాలు.

**రెండవ రకం :** ఆరాధనలలో బిద్అత్ – అంటే ఆరాధనలో కొత్త విషయాలు కల్పించటం. ఉదాహరణకు : ఏదైనా సమ్మతం కాని పద్ధతిలో దైవారాధన చేయటం. ఆరాధనలకు సంబంధించిన బిద్అతులు కూడా అనేక రకాలు.

**మొదటి రకం :** ఇబాదత్ (ఆరాధన) గా చెల్లుబాటు అవుతున్న బిద్అత్. ఉదాహరణకు : షరీయత్లో ఏ ప్రాతిపదిక కూడా లేని ఆరాధనను ఎవరయినా సృష్టించుకుని, దానిని సమాజంలో ప్రవేశపెట్టడం. అంటే లేని నమాజ్, లేని ఉపవాసం, లేని పండుగలను కల్పించుకోవటం. ఉదాహరణకు : మీలాదున్నబీ ఉత్సవం.

**రెండవ రకం :** చేయవలసి ఉన్న ఆరాధన (ఇబాదత్)కు అదనంగా ఏదన్నా చేర్చటం. ఉదాహరణకు : జుహ్ర్ లేక అస్ర్లో నాలుగు రకాతుల ఫర్జ్ నమాజు చేయవలసి ఉండగా ఐదవ రకఅత్ను అదనంగా చేర్చటం.

**మూడవ రకం :** ఆరాధనను చేయవలసిన రీతిలో చేయకుండా సంప్రదాయేతర పద్ధతిలో చేయటం. ఉదాహరణకు : వ్యక్తిగతంగా చేసుకోవలసిన దుఆలను, దైవధ్యానము (జిక్ర్)ను సామూహికంగా చేయటం, దాని కోసం ప్రత్యేక సదనాలను ఏర్పాటు చేసుకోవటం. ఆరాధనలు చేసేందుకు దైవప్రవక్త (ﷺ) అవలంబించిన సులభమయిన విధానాన్ని కాదని, కష్టతరమయిన పద్ధతులను పాటించటం.

**నాల్గవ రకం :** ధర్మసమ్మతమయిన ఏదేని ఆరాధనను ఫలానా తేదీ లేక ఫలానా సమయం కొరకు కేటాయించుకోవటం కూడా బిద్అతే. ఎందుకంటే ఆ ఆరాధనను షరీయత్ ఆ మేరకు నిర్ధారించి ఉండదు. ఉదాహరణకు : షాబాన్ నెల 15వ తేదీ పగలు ఉపవాసం ఉండాలనీ, రాత్రిపూట జాగారం చేయాలని నిశ్చయించుకోవటం. ఉపవాసం ఉండటం, రాత్రి జాగారం చేయటం సమ్మతమే. కాని వాటిని ఒకానొక రాత్రి కోసమో, పగలు కోసమో ప్రత్యేకించుకునేందుకు ఆధారం ఏదీ లేదు.

**3. ధర్మంలో బిద్అత్ల రకాలు, వాటి ఆదేశం**

ధర్మం (దీన్)లో ప్రతి బిద్అత్ నిషిద్ధమే, మార్గవిహీనతే. ఎందుకంటే దీని గురించి మహాప్రవక్త (ﷺ) ఇలా ప్రబోధించారు :



”وَإِيَّاكُمْ وَمُحْدَثَاتِ الْأُمُورِ، فَإِنَّ كُلَّ مُحْدَثَةٍ بِدْعَةٍ ضَلَالَةٌ“(ابوداؤد:٤٦٠٧، صحيح)

**“ధర్మంలో కొత్తగా ఆవిష్కరించబడిన విషయాలకు దూరంగా ఉండండి. ఎందుకంటే ప్రతి కొత్త పోకడ ఒక బిద్అత్. ప్రతి బిద్అత్ మార్గవిహీనతకు నిదర్శనం.” (అబూదావూద్-4607 సహీహ్ అహ్మద్, తిర్మిజి-2676 సహీహ్)**

ఇంకా ఆయన (ﷺ) ఇలా వక్కాణించారు :

”مَنْ أَحْدَثَ فِي أَمْرِنَا هَذَا لَيْسَ مِنْهُ فَهُوَ رَدٌّ“(بخاری ومسلم)

**“ఎవరయినా మా ఈ విషయం (ధర్మం)లో లేని విషయాన్ని గనక ఆవిష్కరిస్తే, అది త్రోసిపుచ్చబడుతుంది.” (బుఖారీ, ముస్లిం)**

వేరొక ఉల్లేఖనంలోని పదాలు ఇవి :

”مَنْ عَمِلَ عَمَلاً لَيْسَ عَلَيْهِ أَمْرُنَا فَهُوَ رَدٌّ“( صحيح مسلم )

**“ఎవరయినా మేము ఆజ్ఞాపించని దానిని ఆచరణలో పెడితే అది త్రోసిపుచ్చబడుతుంది.” (ముస్లిం)**

ఈ రెండు హదీసుల ద్వారా రూఢీ అయ్యేదేమిటంటే ధర్మం (దీన్)లో ప్రతి నవీన పోకడ ‘బిద్అత్’గా పరిగణించబడుతుంది. ప్రతి బిద్అత్ మార్గభ్రష్టతకు దారి తీస్తుంది. అటువంటి ఆచరణ త్రిప్పి కొట్టబడుతుంది. దీన్నిబట్టి బోధపడిందేమిటంటే ఆరాధనల లోనూ, విశ్వాసాలలోనూ అన్ని రకాల బిద్అతులు నిషిద్ధం. కాని బిద్అత్ యొక్క రూపును, స్వభావాన్ని బట్టి నిషేధాజ్ఞ కూడా విభిన్నంగా ఉంటుంది.

కొన్ని రకాల బిద్అతులు కుఫ్ర్ (అవిశ్వాసం) గా కూడా పరిగణించబడతాయి. ఉదాహరణకు : సమాధులలో ఉన్నవారి సామీప్యం పొందటానికి సమాధుల చుట్టూ ప్రదక్షిణ చేయటం, జంతుబలి ఇవ్వటం, మొక్కుబడులు చెల్లించటం, మొక్కుకోవటం, విజ్ఞప్తులు చేసుకోవటం మొదలగువన్నీ చాలా తీవ్రమైన బిద్అత్ల కోవకు చెందుతాయి.

కొన్ని రకాల బిద్అతులు షిర్క్ (బహుదైవారాధన)కు సాధనంగా దోహదపడతాయి. ఉదాహరణకు : సమాధులపై కట్టడాలు నిర్మించటం, అక్కడ నమాజ్ చేయటం, దుఆ చేయటం.

కొన్ని బిద్అతులు భ్రష్టు పట్టిన విశ్వాసాలకు ప్రతీకగా ఉంటాయి. ఉదాహరణకు: షరీయత్ ఆధారాలకు విరుద్ధంగా ఉన్న ఖవారిజ్, ఖద్రియ, మర్జియ వర్గాల పలుకులు, సిద్ధాంతాలు.

కొన్ని రకాల బిద్అతులు పాపంగా, అవిధేయతగా భావించబడతాయి. ఉదాహ

రణకు : భవబంధాల పరిత్యాగం (సన్యాసులుగా, సాధువులుగా, బైరాగుల మాదిరిగా జీవించటం), ఎండలో నిలబడి ఉపవాస దీక్షబూనటం, లైంగిక వాంఛలను అంతమొందించే ఉద్దేశంతో శస్త్ర చికిత్స చేసుకోవటం ఇత్యాదివి. (అల్ ఏతెసాముల్ షాతిబీ–2/37)

**హెచ్చరిక :**

ఎవరయినా బిద్అతులను మంచి బిద్అత్ (బిద్అతె హసన), చెడు బిద్అత్ (బిద్అతె సయ్యిఅ) అని విభజించుకుంటే ఈ విభజన కూడా ముమ్మాటికీ తప్పే. ఇది «فَإِنَّ كُلَّ بِدْعَةٍ ضَلَالَةٌ» "నిశ్చయంగా ప్రతి బిద్అత్ మార్గభ్రష్టతే" అన్న మహాప్రవక్త (ﷺ) వారి ప్రవచనానికి విరుద్ధం. ఎందుకంటే మహాప్రవక్త (ﷺ) బిద్అతు లన్నింటినీ మార్గభ్రష్టత్వం పరిధిలోకే తీసుకున్నారు. అలాంటప్పుడు ఎవరయినా ప్రతి బిద్అత్ మార్గభ్రష్టత్వం కాదని, కొన్ని బిద్అతులు మంచివి కూడా అయి ఉంటాయని అంటే ఏమనుకోవాలి?

హాఫిజ్ ఇబ్నె రజబ్ (رحمه الله) తన పుస్తకం "షరహుల్ అర్బయీన్"లో ఇలా వ్రాశారు:

"నిశ్చయంగా ప్రతి బిద్అత్ మార్గభ్రష్టతే" అన్న మహాప్రవక్త (ﷺ) మాట అత్యంత సమగ్రమైన మాట. ఏ బిద్అత్ కూడా దాని పరిధికి అవతల లేదు. ఇది ధార్మిక సూత్రాలలో అత్యంత ముఖ్యమైన సూత్రం. ఇది ప్రవక్త (ﷺ) గారి ఈ ఉపదేశాన్ని పోలినది :

"مَنْ أَحْدَثَ فِي أَمْرِنَا هَذَا لَيْسَ مِنْهُ فَهُوَ رَدٌّ" (بخاری ومسلم)

**"ఎవరయినా మా ఈ విషయం (ధర్మం)లో లేని వస్తువు దేనినయినా సృష్టిస్తే, అది తిప్పికొట్టబడుతుంది." (బుఖారీ, ముస్లిం)**

కాబట్టి ఎవరయినా సరే ఏదైనా వినూత్న వస్తువును కల్పించి, దానిని ఇస్లాం ధర్మం వైపు ఆపాదిస్తే అది స్వీకారయోగ్యం కాజాలదు. ఎందుకంటే ధర్మంలో దానికెలాంటి మూలంగానీ, ప్రాతిపదికగానీ లేదు. కనుక అది ఖచ్చితంగా అపమార్గమే. దానితో ధర్మానికి (దీన్‌కు) ఎలాంటి సంబంధం లేదు – అది విశ్వాసపరమయిన అంశాలకు చెందినదైనా సరే, మనో వాక్కాయ కర్మలకు చెందినదైనా సరే! (జామెవుల్ ఉలూమ్ వల్ హుక్మ్ – పేజీ : 233)

'బిద్అతె హసన' అనే విభజన చేసిన వారు, తరావీహ్ నమాజ్‌కు సంబంధించి హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (رضي الله عنه) గారి పలుకును ఉదాహరిస్తారు. ఆయన (رضي الله عنه) ఇలా అన్నారు : "نِعْمَةِ الْبِدْعَةُ هٰذِهٖ" "ఇది ఎంత చక్కని బిద్అత్!"

'బిద్అతె హసన'ను వెనకేసుకువచ్చేవారు ఇలా అంటుంటారు : "కొన్ని కొత్త వస్తువులు ఆవిష్కరించబడినప్పటికీ తొలి కాలపు సజ్జనులు (రహ్మతుల్లా అలైహిమ్) నిరాకరించలేదు. ఉదాహరణకు : దివ్య ఖుర్ఆన్‌ను ఒక గ్రంథంగా కూర్పుచేయటం, హదీసులను లిఖించటం, హదీసుల క్రోడీకరణ.

వారి ఈ ఆక్షేపణకు సమాధానం ఏమిటంటే, షరీఅత్‌తో ఈ విషయాలకు



ప్రాతిపదిక (మూలం) ఉంది. కాబట్టి ఇవి కొంగ్రొత్త విషయాలేమీ కావు. ఇక ఉమర్ (رضي الله عنه) పలుకులంటారా, అది నిఘంటువు పరమైన బిద్అతే గాని, షరీయత్ పరమైనది కాదు.

కాబట్టి షరీయత్‌లో ఏ విషయానికి 'మూలం' ఉంటుందో, దానికి సంబంధించి బిద్అత్ అని అంటే అది నిఘంటుపరమైన బిద్అత్ అని అర్థం చేసుకోవాలి. దానిని షరీయత్ భావార్థంలో గ్రహించకూడదు. ఎందుకంటే షరీయత్ పరమైన 'ఆధారం' ఏదీ లేని దానినే షరీయత్‌లో 'బిద్అత్' అనంటారు. దివ్య ఖుర్ఆన్‌ను ఒక గ్రంథం రూపంలో సేకరించే పనికి షరీఅత్‌లో ఆధారం ఉంది. ఎందుకంటే మహాప్రవక్త (ﷺ) దివ్య ఖుర్ఆన్‌ను లిఖించమని ఆజ్ఞాపించి ఉన్నారు. అయితే అది వేర్వేరు పత్రాలలో వ్రాయబడి ఉండటం వల్ల ప్రవక్త ప్రియసహచరులు (رضي الله عنه) దానిని సురక్షితం చేసే సదుద్దేశంతో ఒకే గ్రంథంగా కూర్పు చేశారు.

ఇకపోతే తరావీహ్ నమాజ్ గురించి; దైవప్రవక్త (ﷺ) స్వయంగా కొన్ని రాత్రులు సామూహికంగా తరావీహ్ నమాజ్ చేయించారు. తరువాత తరావీహ్ నమాజ్ నిమిత్తం (మస్జిద్‌లోనికి) రాలేదు. బహుశా ఈ నమాజ్ తన అనుచరులపై 'విధిగా చేయబడుతుందేమోనన్న అనుమానం కొద్దీ ఆయన (ﷺ) రాలేదన్నమాట! అయితే ప్రవక్త సహచరులు (رضي الله عنهم) మాత్రం ప్రవక్త (ﷺ) గారి కాలంలోనూ ఆయన (ﷺ) తదనంతరం కూడా ఈ తరావీహ్ నమాజ్‌ను వ్యక్తిగతంగా చేసుకునేవారు. చివరకు ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ (رضي الله عنه) తన పరిపాలనా కాలంలో వారందరినీ ఒకే ఇమామ్ వెనుక నిలబెట్టి – మహాప్రవక్త (ﷺ) వెనుక నిలబడి తాము ఆ నమాజ్ చేసినట్లుగానే – చేయించారు. కనుక ఇది దీన్‌లో బిద్అత్‌గా భావించబడదు.

అలాగే హదీసుల క్రోడీకరణకు సంబంధించిన ఆధారం (మూలం) కూడా షరీయత్‌లో ఉంది. దైవప్రవక్త (ﷺ) స్వయంగా తన సహచరుల్లో కొంతమంది కోరిక మేరకు కొన్ని హదీసులను లిఖించుకోమని ఆదేశించారు. అందువల్ల అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (رضي الله عنه) దైవప్రవక్త (ﷺ) హయాంలో హదీసులను లిఖించేవారు. కాకపోతే ఆయన (ﷺ) జీవిత కాలంలో హదీసులను గ్రంథస్థం చేయరాదన్న సర్వసాధారణమైన ఆజ్ఞ ఉండేది నిజమే. ఎందుకంటే ఈ లేఖన ప్రక్రియలో సహచరులు ఖుర్ఆన్‌తో పాటు హదీసులను ఎక్కడ కలగాపులగం చేస్తారోనన్న భయం ఉండేది. అయితే ఆయన (ﷺ) పరమపదించాక ఈ భయం తొలగిపోయింది. ఎందుకంటే ప్రవక్త (ﷺ) తనువు చాలించక ముందే దివ్య ఖుర్ఆన్ అవతరణ సంపూర్ణమయింది. అందుచేత ప్రవక్త ప్రియ సహచరులు (رضي الله عنه) ఏకాగ్రచిత్తంతో హదీసులను క్రోడీకరించే పనిలో నిమగ్నులైపోయారు.

కనుక తమ ప్రభువు పంపిన గ్రంథాన్ని, తమ ప్రవక్త (ﷺ) సున్నత్‌ను (హదీసులను) వృధాకాకుండా, అవి వినాశకారుల పరం కాకుండా సురక్షితం చేసిన వారికి అల్లాహ్ అత్యుత్తమ ప్రతిఫలం ప్రసాదించుగాక!

## రెండవ ప్రకరణం

# ముస్లింలలో పొడసూపిన బిద్అతులు : కారణాలు, ప్రేరకాలు

**1. ముస్లింల జీవితాలలో పొడసూపిన బిద్అతులు ;**

దీని క్రింద రెండు ప్రధానాంశాలున్నాయి.

**మొదటిది : బిద్అతులు పుట్టిన సమయం**

షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (رحمه الله) 'మజ్మూఅ అల్ ఫతావా' (10/354)లో ఇలా అంటున్నారు :

శాస్త్రాలు, ఆరాధనలకు సంబంధించి కొంగ్రొత్త పోకడలు (బిద్అతులు) ధర్మ ఖలీఫాల చివరి కాలంలో తలెత్తాయని తెలుసుకోండి. మహాప్రవక్త (ﷺ) సయితం దీని గురించి తెలియజేసి ఉన్నారు. ఆయన (ﷺ) ఇలా అన్నారు :

"مَنْ يَعِشْ مِنْكُمْ فَسَيَرَى اخْتِلَافًا كَثِيرًا، فَعَلَيْكُمْ بِسُنَّتِي وَ سُنَّةِ الْخُلَفَاءِ الرَّاشِدِينَ الْمَهْدِيِّينَ" (ابوداود:٤٦٠٧ صحيح، ترمذي:٢٦٧٦ صحيح)

**"మీలో జీవించి ఉన్నవానికి ఎన్నో విభేదాలు కానవస్తాయి. కనుక మీరు నా విధానాన్ని (సున్నత్ను), నా తర్వాత సన్మార్గగాములైన మార్గదర్శక ఖలీఫాల విధానాన్ని ఖచ్చితంగా అనుసరించండి." (అబూదావూద్-4607, తిర్మిజీ-2676 హసన్)**

అన్నిటికన్నా ముందు విధివ్రాతను (అదృష్టాన్ని) నిరాకరించేవారు పుట్టుకొచ్చారు. తరువాత విశ్వాసం (ఈమాన్) నుండి ఆచరణ (అమల్)ను వేరుపరచే ఇర్జాఅ, తష్యీ, ఖవారిజ్ల బిద్అతులు పొడసూపాయి. ఆ తరువాత ఉస్మాన్ (رضي الله عنه) అమరగతి నొందినమీదట చీలిక వచ్చినపుడు హురూరియాల కొత్త పోకడలు తలెత్తాయి. దరిమిలా సహాబా చివరి కాలంలో– అబ్దుల్లా బిన్ ఉమర్, అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్, జాబిర్ ప్రభృతుల చివరి కాలంలో 'ఖద్రియ' వర్గం పుట్టుకొచ్చింది. దానికి సమీప కాలంలోనే 'మర్జియ' ముఠా పుట్టింది. జహ్మియ వర్గీయులు మాత్రం ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (رحمه الله) మరణించిన తరువాత తాబయీన్ల చివరి కాలంలో తలెత్తారు. ఈ వర్గీయుల గురించి ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ ప్రజలను హెచ్చరించారని కూడా అనబడుతోంది. జహమ్ బిన్ సఫ్వాన్ ఖురాసాన్లో జన్మించాడు. అది హెషామ్ బిన్ అబ్దుల్ మలిక్ ఖిలాఫత్ కాలం.

ఈ బిద్అతులు హిజ్రీ 2వ శతాబ్దిలో ప్రస్ఫుటం అయినాయి. అప్పటికి కొంతమంది సహాబా కూడా జీవించి ఉన్నారు. వారంతా ఈ బిద్అతులను ఖండించేవారు. ఆ తరువాత



'ఏతెజాల్' బిద్అతులు తలెత్తాయి. ముస్లింలలో ఉపద్రవాలు పుట్టుకొచ్చాయి. వివిధ అంశాలపై వారు విభేదించుకోసాగారు. బిద్అతుల మోజులో కొంతమంది మనోవాంఛల వెనుక పరుగెత్తటం మొదలెట్టారు. 'తసవ్వుఫ్' అనే బిద్అత్, సమాధులపై నిర్మాణాలు చేసే బిద్అత్ ముఫ్జల కాలం తర్వాత పుట్టుకొచ్చింది. ఈ విధంగా కాలక్రమేణా రంగురంగుల కొత్త పోకడలు పొడసూపాయి.

## రెండవది : బిద్అతుల జన్మస్థలం

ఇస్లాంలో బిద్అతుల (నవీన పోకడల) పుట్టుకకు సంబంధించి ఆయా రాజ్యాల పరిస్థితి విభిన్నంగా ఉంది. షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (رحمه الله) ఇలా అంటున్నారు : ప్రవక్త సహచరులు (رضي الله عنهم) విశ్రమిస్తున్న ప్రదేశాలు, విజ్ఞానం, విశ్వాస కాంతులు విరజిమ్మిన కేంద్రాలు ఐదు – మక్కా, మదీనా, కూఫా, బస్రా, సిరియా. ఈ ఐదు నగరాల నుండే ఖుర్ఆన్, హదీసు, ఫికహ్, ఆరాధనలు, తత్సంబంధితమయిన ఇస్లామీయ వ్యవహారాలు ఉచ్ఛస్థితికి చేరాయి. కాగా; ఒక్క మదీనా నగరం మినహా మిగిలిన ఈ నాలుగు నగరాల నుండి సూత్రప్రాయమైన (విశ్వాసపరమయిన) బిద్అతులు పొడసూపాయి.

కూఫా నగరంలో షియయియత్, ఇర్జాఅ ధోరణులు ప్రబలినాయి. దరిమిలా అవి ఇతర ప్రాంతాలకు సోకాయి. బస్రాలో ఖద్రియత్, ఏతెజాల్ తదితర భ్రష్టుపట్టిన ఆరాధనా పోకడలు పుట్టి, ఇతర పట్టణాలకు ప్రాకాయి. సిరియా నగరం నాసిబియత్, ఖద్రియత్ తత్వానికి కేంద్రస్థానంగా ఉండేది. జహ్మియత్ మాత్రం ఖురాసాన్ క్షేత్రంలోని నవాహిలో పొడసూపింది. ఇది అత్యంత జుగుప్సాకరమయిన పోకడ.

ఈ కొంగ్రొత్త పోకడలు (బిద్అతులు) మదీనా నగరానికి దూరంగానే ఉండేవి. హజ్రత్ ఉస్మాన్ (رضي الله عنه) దారుణంగా హత్య గావించబడిన తరువాత, మదీనా నగరంలోని ముస్లింల విభేదాలు తారస్థాయికి చేరిన సంగతి వాస్తవమేగాని, బిద్అతుల నుండి మాత్రం మదీనా పురి సురక్షితంగా ఉండింది. బిద్అతులను తమ ఆంతర్యాలలో దాచిపెట్టుకున్నవారు అక్కడా లేకపోలేదు. అయితే అలాంటివారు ప్రజాబాహళ్యం దృష్టిలో నిందార్హులుగా ఉండేవారు. అక్కడ ఖద్రియాల ఒక చిన్న ముఠా ఉండేది. కాని అది అణగిమణగి ఉండేది. అయితే కూఫాలో మాత్రం తష్యీ, ఇర్జా ముఠాల వారు చెలరేగిపోయేవారు. బస్రాలో ఏతెజాల్ ముఠాకు పట్టపగ్గాలుండేవి కావు. సిరియాలో నాజియత్ పోకడ పెల్లుబికింది. వారు ప్రవక్త కుటుంబీకుల (అహ్లె బైత్) పట్ల వైరభావం కలిగి ఉండేవారు. మహనీయ ముహమ్మద్ (ﷺ) వారి ఒక ప్రవచనం ప్రకారం దజ్జాల్ అనేవాడు మదీనా నగరంలో ప్రవేశించలేడు. ఇమామ్ మాలిక్ శిష్యుల కాలం వరకూ (హిజ్రీ 4వ శతాబ్ది వరకూ) మదీనాలో జ్ఞాన సుధా ఝురులు ప్రవహించాయి. విశ్వాస (ఈమాన్) సుగంధం గుబాళించింది. (మజ్మూఅ అల్ ఫతావా – 20/300–303)

ఇస్లాం యొక్క తొలి మూడు అత్యుత్తమ శతాబ్దులలో మదీనా మునవ్వరాలో ఏ రకమయిన బిద్అత్ కూడా వ్రేళ్లూనుకోలేకపోయింది. ధర్మ సూత్రాలకు సంబంధించిన బిద్అత్ కూడా అక్కడ జన్మించలేదు.

## (2) కొత్తపోకడల పుట్టుకకు ప్రధాన కారణాలు :

మార్గవిహీనత, మార్గభ్రష్టతల నుండి సురక్షితంగా ఉండే మార్గం ఒక్కటే – దైవగ్రంథాన్ని, దైవప్రవక్త (ﷺ) విధానాన్ని ఆశ్రయించటం. అల్లాహ్ సెలవిచ్చాడు :

﴿وَأَنَّ هَـٰذَا صِرَاطِي مُسْتَقِيمًا فَاتَّبِعُوهُ وَلَا تَتَّبِعُوا السُّبُلَ فَتَفَرَّقَ بِكُمْ عَن سَبِيلِهِ﴾(الانعام:١٥٣)

**“ఇదే నా రుజుమార్గం. కనుక మీరు దీనినే అనుసరించండి. ఇతరత్రా మార్గాలను అనుసరించకండి. అవి మిమ్మల్ని అల్లాహ్ మార్గం నుండి వేరుపరుస్తాయి.” (అల్ అన్ ఆమ్ : 153)**

ఈ విషయాన్ని దైవప్రవక్త (ﷺ) అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (رضي الله عنه) హదీసులో విడమరచి చెప్పారు. ఆయన (رضي الله عنه) ఇలా తెలిపారు :

”خَطَّ لَنَا رَسُولُ اللّٰهِ ﷺ خطاً فَقَالَ: هٰذَا سَبِيلُ اللّٰهِ ثُمَّ خَطَّ خُطُوطًا عَنْ يَمِينِهِ وَعَنْ شِمَالِهِ ثُمَّ قَالَ :وَهٰذِهِ سُبُلٌ عَلىٰ كُلِّ سَبِيلٍ مِّنْهَا شَيْطَانٌ يَدْعُو إِلَيْهِ))(احمد:٣٩٢٨،ابن حبان)

**దైవప్రవక్త (ﷺ) నేలపై ఒక గీతగీసి “ఇది అల్లాహ్ మార్గం” అని చెప్పారు. ఆ తరువాత దానికి కుడి ప్రక్కనా, ఎడమ ప్రక్కనా కొన్ని గీతలు గీసి “ఇవి (వంకర టింకర) దారులు. వీటిపై షైతాన్ పొంచి ఉన్నాడు. వాడు ఈ దారులపైకి మనుషుల్ని పిలుస్తూ ఉన్నాడ”ని సావధానపర్చారు.**

ఆ తరువాత ఆయన (ﷺ) ఈ సూక్తిని పఠించారు :

﴿وَأَنَّ هَـٰذَا صِرَاطِي مُسْتَقِيمًا فَاتَّبِعُوهُ وَلَا تَتَّبِعُوا السُّبُلَ فَتَفَرَّقَ بِكُمْ عَن سَبِيلِهِ ذَٰلِكُمْ وَصَّاكُم بِهِ لَعَلَّكُمْ تَتَّقُونَ﴾(الانعام:١٥٣)

**“ఇదే నా రుజుమార్గం. కనుక మీరు దీనినే అనుసరించండి. ఇతరత్రా మార్గాలను అనుసరించకండి. అవి మిమ్మల్ని అల్లాహ్ మార్గం నుండి వేరుపరుస్తాయి. మీరు భయభక్తుల వైఖరిని అవలంబించేటందుకు గాను అల్లాహ్ మీకు ఈ విధంగా తాకీదు చేస్తున్నాడు.” (అల్ అన్ ఆమ్ : 153)**

(ఈ హదీసును అహ్మద్–3928, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ తదితరులు ఉల్లేఖించారు).

ఈ హదీసు ద్వారా అవగతమయ్యే దేమిటంటే ఖుర్ఆన్ హదీసుల పట్ల విముఖత చూపేవారి కోసం కొత్త కొత్త అపమార్గాలు, కొత్త కొత్త బిద్అత్‌లు వేచి ఉంటాయి. అందమయిన మాటలతో, ఆకర్షణీయమైన చేష్టలతో అవి తమ వైపునకు లాక్కుంటాయి.



## బిద్అతుల పుట్టుపూర్వోత్తరాలు : కారణాలు

- ధర్మాదేశాల పరిజ్ఞానం లేకపోవటం.
- మనోవాంఛల వెనుక పోవటం.
- ఏదైనా ఒక ప్రత్యేక దృక్పథం లేదా కొందరు ప్రత్యేక వ్యక్తుల పట్ల దురభిమానం కలిగి ఉండటం.
- అవిశ్వాసుల అడుగులకు మడుగులొత్తటం.

ఈ కారణాలను మరి కాస్త వివరంగా తెలుసుకుందాం.

## (అ) ధర్మాదేశాల పట్ల తగు పరిజ్ఞానం కొరవడటం :

కాలక్రమేణా ప్రజలు దైవదౌత్య కాలం నాటి విశేష చిహ్నాలకు, ప్రభావాలకు దూరమవసాగారు. ధర్మజ్ఞానం తగ్గింది. ధర్మావగాహన లోపించసాగింది. అజ్ఞానం ప్రబలింది. మహాప్రవక్త (ﷺ) తన ఈ ప్రవచనం ద్వారా ఈ విషయం ముందే చెప్పారు :

”مَنْ يَعِشْ مِنْكُمْ فَسَيَرَى اخْتِلَافًا كَثِيرًا“(ابوداؤد:٤٦٠٧صحیح،ترمذی:٢٦٧٦صحیح)

**“మీలో జీవించి ఉన్న వ్యక్తి ఎన్నో భేదాభిప్రాయాలను గమనిస్తాడు.” (అబూదావూద్–4607, తిర్మిజీ–2676, తిర్మిజీ దీనిని ప్రామాణిక హదీసుగా పేర్కొన్నారు).**

ఇంకా ఈ విధంగా చెప్పారు :

”إِنَّ اللّٰهَ لَا يَقْبِضُ الْعِلْمَ انْتِزَاعًا يَنْتَزِعُهُ مِنَ الْعِبَادِ لٰكِنْ يَقْبِضُ الْعِلْمَ بِقَبْضِ الْعُلَمَاءِ حَتّٰى إِذَا لَمْ يُبْقِ عَالِمًا اتَّخَذَ النَّاسُ رُءُوسًا جُهَّالًا فَسُئِلُوا فَأَفْتَوْا بِغَيْرِ عِلْمٍ فَضَلُّوا وَأَضَلُّوا“(بخاری مسلم)

**“అల్లాహ్ జ్ఞానము (ఇల్మ్)ను ఒక్కసారిగా మనుషుల నుండి లాక్కుని సమాప్తం చేయడు. ఆయన జ్ఞానుల (ఉలమా)కు మరణ మొసగటం ద్వారా దానిని క్షీణింపజేస్తాడు. ఆఖరికి ఏ ఒక్క జ్ఞానినీ సజీవంగా వదలక పోయేసరికి ప్రజలు అజ్ఞానులను తమ నాయకులుగా చేసుకుంటారు. తరువాత ప్రజలు ధర్మాదేశాల గురించి వారిని ప్రశ్నిస్తారు. వారేమో జ్ఞానంతో నిమిత్తం లేకుండానే తీర్పు (ఫత్వా) ఇస్తారు. ఆ విధంగా వారు స్వయంగా దారి తప్పినది గాక ఇతరులను కూడా దారి తప్పిస్తారు.” (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)**

(జామె బయానుల్ ఇల్మ్ వ ఫజ్‌లిహీ లి ఇబ్నె అబ్దుల్ బర్ – 1/180)

దీనిద్వారా స్పష్టమయిందేమిటంటే; జ్ఞానం (ఇల్మ్) ద్వారా, జ్ఞానుల (ఉలమా) ద్వారా మాత్రమే ఈ కొత్త పుంతలను ఎదుర్కోవటం సాధ్యం. జ్ఞానం, జ్ఞానులు రంగంలో కరువైపోయిననాడు కొత్త పుంతలు తొక్కేవారు స్వైరవిహారం చేస్తారు. అడ్డూ ఆపూ లేకుండా బిద్అతులను వ్యాపింపజేస్తారు.

## (అ) మనోవాంఛలను అనుసరించటం :

ఖుర్ఆన్ హదీసులను విడనాడిన వాడు అవశ్యంగా తన మనోవాంఛల వెనుక పరుగులు తీస్తాడు. ఈ యదార్థాన్ని తెలుపుతూ పరమ ప్రభువు ఇలా సెలవిచ్చాడు :

﴿فَإِن لَّمْ يَسْتَجِيبُوا لَكَ فَاعْلَمْ أَنَّمَا يَتَّبِعُونَ أَهْوَاءَهُمْ وَمَنْ أَضَلُّ مِمَّنِ اتَّبَعَ هَوَاهُ بِغَيْرِ هُدًى مِّنَ اللَّهِ﴾ (القصص:٥٠)

**మరి వారు గనక నీ సవాలును స్వీకరించకపోతే, వారు తమ మనోవాంఛలను అనుసరించే జనులని తెలుసుకో. అల్లాహ్ మార్గదర్శకత్వాన్ని కాకుండా తన మనోవాంఛల వెనుక నడిచే వానికన్నా ఎక్కువ మార్గభ్రష్టుడెవడుంటాడు?" (అల్ ఖసస్ : 50)**

ఇంకా ఈ విధంగా సెలవిచ్చాడు:

﴿أَفَرَأَيْتَ مَنِ اتَّخَذَ إِلَٰهَهُ هَوَاهُ وَأَضَلَّهُ اللَّهُ عَلَىٰ عِلْمٍ وَخَتَمَ عَلَىٰ سَمْعِهِ وَقَلْبِهِ وَجَعَلَ عَلَىٰ بَصَرِهِ غِشَاوَةً فَمَن يَهْدِيهِ مِن بَعْدِ اللَّهِ﴾ (الجاثية:٢٣)

**తన మనోవాంఛలను ఆరాధ్య దైవంగా చేసుకున్నవాణ్ణి నీవు చూశావా? అంతా తెలిసినప్పటికీ – అల్లాహ్ అతన్ని అపమార్గానికి లోను చేశాడు. అతని చెవులకూ, అతని హృదయానికీ సీలు వేశాడు. అతని కళ్ళపై కూడా తెరను వేసేశాడు. ఇక ఇప్పుడు అలాంటి వ్యక్తిని – అల్లాహ్ తర్వాత – సన్మార్గానికి తెచ్చేవాడెవడుంటాడు? (అల్ జాసియహ్ : 23)**

## (ఇ) కొన్ని ప్రత్యేక అభిమతాల పట్ల, కొందరు వ్యక్తుల పట్ల దురభిమానం

ఏదైనా ఒక ప్రత్యేక దృక్పథాన్ని, సిద్ధాంతాన్ని గుడ్డిగా అనుసరించటం, లేదా కొందరు వ్యక్తుల పట్ల గల ప్రేమాతిశయంతో పక్షపాత వైఖరిని అవలంబించటం మనిషికి సత్యాన్వేషణా మార్గంలో ఎప్పటికీ ప్రతిబంధకంగానే ఉంటుంది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:



﴿وَإِذَا قِيلَ لَهُمُ اتَّبِعُوا مَا أَنزَلَ اللَّهُ قَالُوا بَلْ نَتَّبِعُ مَا أَلْفَيْنَا عَلَيْهِ آبَاءَنَا﴾ (البقرة:١٧٠)

**"అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్ని అనుసరించండి" అని వారికి చెప్పినప్పుడల్లా, 'మా తాతలు తండ్రులు అవలంబిస్తూ ఉండగా చూచిన పద్ధతినే మేము పాటిస్తాము' అని వారు సమాధానమిస్తారు." (అల్ బఖర : 170)**

నేడు సూఫీలను అనుసరించేవారి పరిస్థితి కూడా ఇదే. సమాధులను పూజించే కొందరు దురభిమానుల ధోరణి కూడా ఇదే. దైవగ్రంథాన్ని, దైవప్రవక్త (ﷺ) విధానాన్ని అనుసరించండి అని వారిని కోరినప్పుడల్లా వారు సిద్ధాంతకర్తలైన గురువులను, మషాయఖ్లను, తండ్రీతాతల పద్ధతులను ఉదాహరించి, వారినే తమ ఆదర్శమూర్తులుగా పేర్కొంటారు.

## (ఈ) అవిశ్వాసులను పోలిన పద్ధతులను పాటించటం :

అవిశ్వాసుల అడుగులకు మడుగులొత్తడం, దైనందిన జీవితంలో వారి శైలిని పుణికి పుచ్చుకోవటం ద్వారా మనిషి చాలా తొందరగా బిద్అతులకు అలవాటు పడతాడు. ఉదాహరణకు : హజ్రత్ అబూ వాఖిద్ లైసీ (رضي الله عنه) హదీసు – ఆయన ఇలా తెలిపారు: "మేము దైవప్రవక్త (ﷺ)తో కలిసి హునైన్ (యుద్ధం కొరకు) బయలుదేరాము. మేము అవిశ్వాసాన్ని వీడి ఎక్కువ కాలం గడవలేదు. ఆ కాలంలో అవిశ్వాసులు రేగు వృక్షం వద్ద నిలబడి, ఆ వృక్షానికి తమ ఖడ్గాలు (శుభం కొరకు) వ్రేలాడదీసేవారు. అది **'జాతుల్ అన్వాత్'** గా వ్యవహరించబడేది. మేము వెళుతున్న మార్గంలో కూడా ఒక రేగు వృక్షం ఎదురయ్యేసరికి, "ఓ దైవప్రవక్తా (ﷺ)! మా కోసం కూడా – ముష్రిక్కుల మాదిరిగా – ఒక **'జాతె అన్వాత్'**ను నిర్ధారించండి" అని విన్నవించుకున్నాము. ఇది వినగానే దైవప్రవక్త (ﷺ) ఆశ్చర్యచకితులై ఇలా అన్నారు :

"سُبْحَانَ اللّٰهِ هٰذَا كَمَا قَالَ قَوْمُ مُوسَى! إِنَّهَا السُّنَنُ، قُلْتُمْ وَالَّذِي نَفْسِي بِيَدِهِ كَمَا قَالَتْ بَنُو إِسْرَائِيلَ لِمُوسَى: ﴿اجْعَل لَّنَا إِلَٰهًا كَمَا لَهُمْ آلِهَةٌ قَالَ إِنَّكُمْ قَوْمٌ تَجْهَلُونَ﴾ لَتَرْكَبُنَّ سُنَّةَ مَنْ كَانَ قَبْلَكُمْ" (ترمذی:٢١٨٠صحیح، الاعراف:١٣٨)

**"సుబ్హానల్లాహ్! ఇవేకదా (అప) మార్గాలంటే! ఎవరి చేతిలో నా ప్రాణం ఉందో ఆ శక్తిమంతుని సాక్షి! ఇస్రాయీల్ వంశీయులు మూసా (عليه السلام)తో అన్నమాటే మీరన్నారు. వారు (ఇస్రాయీల్ సంతతివారు) ఇలా అని ఉన్నారు : "వీళ్ళకు ఈ ఆరాధ్య దైవాలు ఉన్నట్లు మాకూ్కడా ఒక దేవుణ్ణి చేసిపెట్టవా!' దానికి మూసా(عليه السلام), 'నిజంగానే మీరు మూర్ఖజనులు" అన్నాడు. (అల్ ఆరాఫ్ : 138)**

**“మీరు మీ పూర్వీకులయిన పెద్దలను అనుసరిస్తారు.” (దీనిని తిర్మిజీ – 2180 ఉల్లేఖించి, ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)**

ఈ హదీసు ద్వారా తేటతెల్లమైన విషయం ఏమిటంటే, అవిశ్వాసుల పంథాను అనుసరించాలన్న కుతూహలమే ఇస్రాయీల్ వంశీయులను బరితెగించేలా చేసింది. ఆఖరికి వారు ఎంతవరకు పోయారంటే, తమ కోసం ఓ కొత్త దేముణ్ణి చేసిపెట్టమని సాక్షాత్తూ దైవప్రవక్త మూసానే డిమాండు చేశారు. అవిశ్వాసుల పోకడలు రమణీయంగానే ఉండవచ్చు. దానికి ప్రభావితుడైన బలహీన విశ్వాసులు దారితప్పే అవకాశం ఉంటుంది. ఎవరో ఎందుకు? సాక్షాత్తూ మహాప్రవక్త (ﷺ) సహచరులే, తమ కోసం కూడా ముష్రిక్కుల మాదిరి ‘జాతె అన్వాత్’ నొక దానిని కల్పించమని అభ్యర్థించారు.

నేటి పరిస్థితిలో ఏమాత్రం మార్పులేదు. ఎందుకంటే ముస్లింలలో మెజారిటీ జనులు కొత్తపుంతలు తొక్కటంలో, షిర్కును అనుసరించటంలో అన్యులను అనుకరిస్తున్నారు. ఉదాహరణకు : పుట్టిన రోజు పండగ చేసుకోవటం, కొన్ని ప్రత్యేక పనుల కోసం సాప్తాహిక కార్యక్రమాలు నిర్వహించటం, కొన్ని ధార్మిక సంఘటనలను, కొందరు వ్యక్తులను స్మరించుకునేందుకు ఉత్సవాలు జరపటం, స్మారక స్థూపాలు ప్రతిష్ఠించటం, సంతాప సభలు కండక్ట్ చేయటం, సమాధులపై కట్టడాలు కట్టడం మొదలగునవి.



**మూడవ ప్రకరణం**

# బిద్‌అతీల విషయంలో ఇస్లామీయ సమాజం వైఖరి, వారి పోకడలను ఖండించటంలో ‘అహ్లెసున్నత్ వల్ జమాఅత్’ విధానం

## (1) బిద్‌అతీల విషయంలో అహ్లె సున్నత్ వల్ జమాఅత్ వైఖరి :

‘అహ్లె సున్నత్ వల్ జమాఅత్’ వారు నిత్యం బిద్‌అతీల పనులను ఖండిస్తూ వచ్చారు. దీనివల్ల పట్టబోయే దుర్గతి గురించి హెచ్చరించారు. తత్సంబంధితమయిన కొన్ని మచ్చుతునకలు ఇవి :

**(అ) ఉమ్మె దర్దా (رضي الله عنها) కథనం :** “ఒకసారి అబూదర్దా (رضي الله عنه) ఆగ్రహంతో ఊగిపోతూ నా వద్దకు వచ్చారు. ‘ఇంతకీ ఏం జరిగింది?’ అని నేనడిగాను. దానికి ఆయన ఇలా అన్నారు : ‘దైవసాక్షి! వారిలో ముహమ్మద్ (ﷺ) అందజేసిన ధర్మంలోని ఏ వస్తువూ నాకు కనిపించటం లేదు. చూడబోతే వారంతా నమాజు చేసేవారే.” (బుఖారీ)

**(ఆ) ఉమర్ బిన్ యహ్యా కథనం :** ఆయన ఇలా తెలిపారు – నేను నా తండ్రి చెప్పగా విన్నాను. ఆయన గారు తన తండ్రి ఆధారంగా ఈ విషయాన్ని వివరించారు : “మేము ఫజ్ర్ నమాజ్‌కు ముందు అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్ (رضي الله عنه) గుమ్మం వద్ద కూర్చునేవారం. ఆయన బయటకు రాగానే మేమందరం ఆయన గారితో కలిసి మస్జిద్‌కు వెళ్ళేవారం. ఒకనాటి మాట! మా వద్దకు అబూ మూసా అష్‌అరీ (رضي الله عنه) ఏతెంచారు. ‘ఏమిటీ, అబూ అబ్దుర్రహ్మాన్ ఇంకా బయలుదేరలేదా?’ అని ఆయన అడిగారు. ‘లేద’ని మేమన్నాము. ఆయనగారు కూడా ఆయన (అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్) కోసం మాతోపాటే నిరీక్షించారు. ఆయన బయటికి రాగానే, మేమంతా లేచి నిలబడ్డాము. ఆయన (అబూ మూసా) ఇలా అన్నారు : ‘ఓ అబూ అబ్దుర్రహ్మాన్! నేను ఇప్పుడిప్పుడే మస్జిద్‌లో ఒక దృశ్యం చూశాను. అది నాకు నచ్చలేదు. అల్ హమ్దులిల్లాహ్ నేను చూసిన వస్తువు మంచిదే.’ ‘ఇంతకీ ఏమిటదీ?’ అని ఆయన ప్రశ్నించగా, ఆయన ఇలా సమాధానమిచ్చారు: ‘తమరు గనక బ్రతికి ఉంటే, తమరే తమ కళ్లతో దానిని చూసుకుంటారు’ అని చెప్పి ఇలా వివరించారు : ‘నేను మస్జిద్‌లో కొంతమందిని నమాజు నిరీక్షణలో వలయాకారంలో కూర్చోవటం చూశాను. ప్రతి వలయం మధ్యలో ఒక వ్యక్తి ఉన్నాడు. అతని చేతిలో కంకరరాళ్ళు ఉన్నాయి. అతను జనులను ఉద్దేశ్యించి, వందసార్లు **“అల్లాహు అక్బర్”** అనండి అంటున్నాడు. వారంతా వందసార్లు **“అల్లాహు అక్బర్”** అంటున్నారు. తరువాత అతను వందసార్లు **“లా ఇలాహ ఇల్లల్లాహ్”** అనండి అని పురమాయిస్తున్నాడు. వారంతా వందసార్లు **“లా ఇలాహ ఇల్లల్లాహ్”** అంటున్నారు. తరువాత అతను వందసార్లు **“సుబ్‌హానల్లాహ్”** అనండి అని చెబుతున్నాడు. వారంతా వందసార్లు **“సుబ్‌హానల్లాహ్”**

అంటున్నారు.' 'మరయితే మీరు వారితో ఏమన్నారు?' అని ఆయన అడిగారు. 'నేను దీని గురించి మీ అభిప్రాయం, ఆజ్ఞ ఏమిటో తెలుసుకునేందుకు వేచి ఉన్నాను. వారిని ఏమీ అనలేదు' అని సమాధానమిచ్చారు. 'మీరు మీ పాపాలను లెక్కపెట్టుకోండి అని వారిని ఎందుకు ఆజ్ఞాపించలేదు? వారి పుణ్యకార్యమేదీ వృథా అవదని కూడా మీరు వారికి భరోసా ఇవ్వాల్సింది కదా!' అని అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (رضي الله عنه) అన్నారు.

తరువాత ఆయన బయలుదేరారు. మేము కూడా ఆయన వెనకే నడిచాము. చివరకు అక్కడ వృత్తాకారంలో కూర్చుని ఉన్నవారిలో ఒక బృందం వద్దకు వెళ్ళారు. అక్కడ వారినుద్దేశించి, "ఇంతకీ మీరిక్కడ ఏం చేస్తున్నారు?" అని ప్రశ్నించారు. దానికి వారు, "ఓ అబూ అబ్దుర్రహ్మాన్! ఇవి కంకర రాళ్లు. వీటి సహాయంతో మేము తక్బీర్, తహ్లీల్, తస్బీహ్, తహ్మీద్‌లను లెక్కించుకుంటున్నాము" అని బదులిచ్చారు.

అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (رضي الله عنه) వారందరినీ ఉద్దేశించి ఇలా ఉపదేశించారు : "(లెక్కించుకోవాలనే ఉంటే) మీరు మీ పాపాలను లెక్కపెట్టుకోండి. మీ పుణ్యకార్యమేదీ వృథా గావించబడదని నేను మీకు హామీ ఇస్తున్నాను. ఓ ముహమ్మద్ సమాజ సభ్యులారా! మీ పాడుగాను! మీరెంత తొందరగా వినాశకర మార్గాన పడిపోయారు కదా! ఆయన(ﷺ) సహచరులు ఇంకా బ్రతికే ఉన్నారు. ఆయన (ﷺ) దుస్తులు ఇంకా శిథిలమవనే లేదు. ఆయన (ﷺ) పాత్రలు ఇంకా పగిలిపోలేదు. ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా చెబుతున్నా! మీరు ఉంటే ముహమ్మద్ (ﷺ) పద్ధతికన్నా మంచి పద్ధతి మీద ఉన్నారు లేదా మీరు మార్గభ్రష్టత యొక్క ద్వారాన్నయినా తెరువబోతున్నారు!"

అలా చెప్పి ఆయన (رضي الله عنه) అక్కడి నుండి వెళ్ళిపోయారు. అమ్ర్ బిన్ సలమా ఇలా అంటున్నారు : మేము వారిలో అనేకులను చూశాము – వారు నహర్వాన్ యుద్ధం జరిగిన నాడు ఖవారిజ్ వర్గీయులతో చేరి మాపై కత్తులు దూయసాగారు. (సుననె దారిమీ పీఠిక : 210)

(ఇ) హజ్రత్ ఇమామ్ మాలిక్ బిన్ అనస్ (رحمه الله) వద్దకు ఒక వ్యక్తి వచ్చి, 'నేను ఎక్కడి నుండి ఇహ్రామ్ దీక్షబూనాలి?' అని అడిగాడు. "దైవప్రవక్త (ﷺ) ఎక్కడి నుండి 'మీఖాత్' ను నిర్ధారించారో అక్కడి నుండి! ఆయన (ﷺ) స్వయంగా ఎక్కడి నుండి ఇహ్రామ్ కట్టుకున్నారో అక్కడి నుండి!" అని ఆయన చెప్పారు. 'నేను మీఖాత్ రాకముందే ఇహ్రామ్ కట్టుకుంటే పోయిందేముందీ?' అని ఆ వ్యక్తి ప్రశ్నించాడు. "నా దృష్టిలో అది సరైంది కాదు"ని మాలిక్ బిన్ అనస్ (رحمه الله) బదులిచ్చారు. 'ఎందుకు సరైంది కాదు?' అని ఆ వ్యక్తి మళ్లీ అడగటంతో ఆయన (رحمه الله), "నీవు ఉపద్రవానికి గురవుతావేమోనని నాకు భయంగా ఉంది" అన్నారు. 'ఎక్కువ మేలును కాంక్షించటంలో ఉపద్రవం ఏముంది?' అని ఆ వ్యక్తి మళ్లీ రెట్టించి అడిగాడు. ఇమామ్ మాలిక్ (رحمه الله) ఇలా అన్నారు : ఎందుకంటే అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు :

﴿ فَلْيَحْذَرِ الَّذِينَ يُخَالِفُونَ عَنْ أَمْرِهِ أَن تُصِيبَهُمْ فِتْنَةٌ أَوْ يُصِيبَهُمْ عَذَابٌ أَلِيمٌ ﴾ (النور: ٦٣)



**వినండి! ప్రవక్త ఆజ్ఞను ఎదిరించేవారు తమపై ఏదయినా ఘోర విపత్తు వచ్చిపడుతుందేమోనని లేదా తమను ఏదయినా బాధాకర మయిన శిక్ష చుట్టుకుంటుందేమోనని భయపడాలి. (అన్ నూర్ : 63)**

ఇంతకన్నా పెద్ద ఉపద్రవం ఏముంటుంది చెప్పు? నీవు నీ కొత్త ఆచరణ ద్వారా దైవప్రవక్త (ﷺ)నే మించిపోవాలనుకుంటున్నావు. అవునా!?"

(ఈ సంఘటనను అబూ షమామా గారు తన పుస్తకం – "అల్ బాయిస్ అలా ఇన్‌కార్ అల్ బిద్అ వల్ హవాదిస్" (పేజీ : 14)లో అబూబకర్ ఖిలాల్ నుండి నకలు చేశారు).

ఇవి మచ్చుకు కొన్ని సంఘటనలు మాత్రమే. ఇస్లామీయ విద్వాంసులైతే సర్వకాల సర్వావస్థల్లో అల్ హమ్దులిల్లాహ్ కొత్త పోకడలు పోయే వారిని ఎండగడుతూనే వచ్చారు.

**(2) బిద్అతీల చర్యలను ఖండించటంలో 'అహ్లె సున్నత్ వల్ జమాఅత్' వారి పద్ధతి :**

ఖుర్ఆన్ హదీసుల ఆధారంగా ఎదుటి వ్యక్తిని సమాధానపర్చాలన్నదే వారి విధానం. వారు బిద్అతీల సందేహాలను కూలంకషంగా వివరించి, వాటికి విరుగుడును ప్రతిపాదిస్తారు. సున్నతులను ఖచ్చితంగా పాటించవలసిందిగా సూచిస్తారు. ధర్మంలో కొత్తగా కల్పించబడిన విషయాలకు దూరంగా ఉండవలసిన ఆవశ్యకతను ఖుర్ఆన్ హదీసుల ఆధారాలతో నొక్కి వక్కాణిస్తారు. ఈ నేపథ్యంలో వారు అనేక రచనలు చేశారు. ఉదాహరణకు వాటిలో కొన్ని పుస్తకాలివి :

1. ఇమామ్ షాతిబీచే విరచితమైన "అల్ ఏతెసామ్".
2. షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియచే విరచితమైన పుస్తకం, "ఇఖ్తెజా అస్సిరాతిల్ ముస్తఖీమ్" – ఈ పుస్తకంలోని ఓ పెద్ద భాగం బిద్అతీల చర్యలను ఖండిస్తోంది.
3. ఇబ్నె వజాహ్ చే విరచితమైన "ఇన్‌కారుల్ హవాదిస్ వల్ బిద్అ."
4. తిర్‌తోషీచే విరచితమైన "అల్ హవాదిస్ వల్ బిద్అ."
5. అబూ షామాగారి పుస్తకం–"అల్ బాయిస్ అలా ఇన్‌కారుల్ బిద్అ వల్ హవాదిస్."

**మరికొన్ని కొత్త పుస్తకాలు**

1. షేఖ్ అలీ మహ్‌ఫూజ్ గారి పుస్తకం "అల్ అబ్‌దాఅ ఫీ మజాద్దుల్ ఇబ్తెదా."

2. షేఖ్ ముహమ్మద్ బిన్ అహ్మద్ అల్ షఖీరీ అల్ హవామిదీ గారి పుస్తకం – "అల్ సునన్ వల్ ముబ్తదిఆత్ అల్ ముత్తాల్లుఖతు బిల్ అజ్‌కార్ వస్సలవాత్."

దైవకృపవల్ల ఇస్లామీయ విద్వాంసులు పత్రికలు, మ్యాగజైన్లు, రేడియోలు, టెలివిజన్, జుమా ప్రసంగాలు, సెమినార్లు, ప్రసంగాల ద్వారా బిద్అతీల పోకడలను నిరంతరం ఖండిస్తూ వచ్చారు. బిద్అతీలు ఏ విధంగా ముస్లిం సమాజంలో జొరబడి విశ్వాసాన్ని బలహీనపరుస్తున్నారో వివరించి, ప్రజలలో ధార్మిక చైతన్యాన్ని తీసుకువచ్చారు. ఈ విధంగా వారు ధర్మంలోని కొత్త పుంతలను నిర్మూలించటంలో, బిద్అతీల బండారాన్ని బయటపెట్టడంలో కీలకపాత్ర పోషించారు.

## నాల్గవ ప్రకరణం

# వర్తమాన కాలంలోని బిద్అతులు : కొన్ని మచ్చుతునకలు

ప్రస్తుత కాలంలోని బిద్అతుల కొన్ని నమూనాలు ఇవి :

1. మహాప్రవక్త (ﷺ) జన్మదినోత్సవం జరుపుకోవటం.

2. కొన్ని స్థలాలు, చిహ్నాలు, మృతులు మొదలగు వాటి ద్వారా శుభం (బరకత్) పొందటం.

3. ఆరాధనలు, దైవసామీప్యానికి సంబంధించిన బిద్అతులు.

ప్రస్తుత కాలంలో బిద్అతులు పెచ్చరిల్లిపోయాయి. దీనికి ప్రధాన కారణం నేటి కాలానికీ – దైవప్రవక్త (ﷺ) కాలానికీ మధ్య చాలా ఎక్కువ అంతరం ఉండటం, నిజ జ్ఞానం కొరవడటం, షరీయత్‌కు వ్యతిరేకమయిన విషయాల వైపు పిలుపు ఇచ్చేవారు అధికంగా ఉండటం. మహనీయ ముహమ్మద్ (ﷺ) వారు ఇలా చెప్పి ఉన్నారు :

﴿ لَتَتَّبِعَنَّ سُنَّةَ مَنْ كَانَ قَبْلَكُمْ ﴾ (رواه ابن ماجه: ٣٩٩٤ صحيح)

**"మీరు తప్పకుండా మీ పూర్వీకుల అడుగు జాడల్లో నడుస్తారు." (దీనిని ఇబ్నెమాజా–3994 ఉల్లేఖించి, ప్రామాణికంగా పేర్కొన్నారు)**

ఈ హదీసు ప్రకారం ముస్లిములు అన్యుల ఆచార వ్యవహారాలను ఎక్కువగా అనుకరించటం మొదలెట్టారు.

### 1. మీలాదున్నబీ (ﷺ) పేరిట ఉత్సవాలు :

మహాప్రవక్త (ﷺ) పుట్టిన రోజు పేరుతో పండుగ జరుపుకోవటం వాస్తవానికి క్రైస్తవుల అనుకరణ. క్రైస్తవులు ఏసుక్రీస్తు (ఈసా عليه السلام) పుట్టిన రోజు పండుగ జరుపుకుంటారు. విద్యాగంధం లేని ముస్లిములు, రుజుమార్గానికి కుడిఎడమ వైపుల్లో కాలిబాటలు తీసుకున్న విద్వాంసులు (ఉలమా) ఏటేటా రబీవుల్ అవ్వల్ మాసంలో మహాప్రవక్త (ﷺ) పుట్టిన రోజును పురస్కరించుకుని సంబరాలు జరుపుకుంటారు. కొంతమంది ఈ ఉత్సవాన్ని మస్జిదుల్లో జరుపుకుంటే, మరికొంతమంది తమ ఇండ్లలో చేసుకుంటారు. ఇంకా కొందరు కొన్ని నిర్ణీత బహిరంగ స్థలాలలో ఈ ఉత్సవం జరుపుకుంటారు. ఈ ఉత్సవంలో ముస్లిం సమాజానికి చెందినవారు చాలాపెద్ద సంఖ్యలోనే హాజరవుతారు. ఇంతకుముందు చెప్పినట్లు ఇది క్రైస్తవుల నుండి పుణికిపుచ్చుకున్న పోకడ. పూర్వం క్రైస్తవులు ఏసుక్రీస్తు పుట్టిన రోజు పండుగను తమంతట తామే కల్పించుకున్నారు. సాధారణంగా ఈ మీలాద్ ఉత్సవాలలో క్రైస్తవులను పోలిన ఎన్నో బిద్అతులు చేయబడతాయి. కొన్ని షిర్కుతో కూడిన పనులు కూడా జరుగుతుంటాయి. ఉదాహరణకు:



ఈ సందర్భంలో చదవబడే నాతులు, కవితలలో దైవప్రవక్త (ﷺ) విషయంలో అతిశయిల్లడం కద్దు. వారు ఆ నాతులలో అల్లాహ్ బదులు దైవప్రవక్త (ﷺ)ను మొరపెట్టుకోవటం మొదలెడతారు. సహాయం కొరకు ప్రవక్త (ﷺ)నే అర్థించసాగుతారు. కాగా; తనను పొగిడే విషయంలో అవధులు మీరరాదని దైవప్రవక్త (ﷺ) స్వయంగా తాకీదు చేసి ఉన్నారు. ఆయన (ﷺ) ఇలా ఉపదేశించారు :

"لَا تُطْرُونِي كَمَا أَطْرَتِ النَّصَارَى ابْنَ مَرْيَمَ إِنَّمَا أَنَا عَبْدٌ فَقُولُوا: عَبْدُ اللهِ وَرَسُولُهُ" (بخاری و مسلم)

**"క్రైస్తవులు మర్యమ్ కుమారుడగు ఈసాను పొగడటంలో మితిమీరిపోయినట్లుగా మీరు నన్ను పొగడటంలో మితిమీరకండి (కడకు వారు తమ ప్రవక్తను దేవుని కుమారునిగా చేసేశారు). చూడండి! నేనొక దాసుడను. కాబట్టి నన్ను అల్లాహ్ దాసుడు, అల్లాహ్ సందేశహరుడు అని అనండి." (బుఖారీ, ముస్లిం)**

ఒక్కోసారి 'మీలాద్' పేరిట జరిగే ఈ సదనాలలో స్త్రీలు పురుషులు కలిసిపోతారు. ఈ మిశ్రమ సమ్మేళనాలు నైతిక పతనానికి, భావ కాలుష్యానికి కూడా కారణం అవుతాయి.

ఒక్కోసారి వారు దైవప్రవక్త (ﷺ) తమ సమావేశాలకు హాజరవుతారని కూడా నమ్ముతుంటారు. ఈ సమావేశాలలో సామూహికంగా (కొన్నిచోట్ల స్త్రీలు – పురుషులు కూడా) నాతె షరీఫ్ పఠిస్తారు. కవి సమ్మేళనాలు నిర్వహిస్తారు. బృందగానాలు ఆలాపిస్తారు. సూఫీ మహాశయులు కల్పించుకున్న ప్రత్యేక ధ్యానాలు కూడా ఈ సందర్భంగా పాటించబడతాయి. అదలా ఉంచితే స్త్రీ, పురుషుల మిశ్రమ సమావేశాలు ఉపద్రవానికి కారణభూతం అయ్యే ప్రమాదం ఉంటుంది.

అలాంటిదేమీ లేదండీ! కేవలం మేమిక్కడ సమావేశమై భోజనాలు చేసి వెళ్ళిపోతామండీ అని కొంతమంది చెబుతుంటారు. వారు చెప్పిందే నిజమే అయినా అది కూడా ఇస్లాం ధర్మంలో ఓ కొత్తపోకడే. (ధర్మంలో ప్రతి కొత్త విషయావిష్కరణ బిద్అతే. ప్రతి బిద్అత్ మార్గభ్రష్టత వైపు గొనిపోతుంది). కాలక్రమేణా ఈ చిన్న విషయాలే చెడుల వైపునకు, నీతి బాహ్యత వైపునకు దారితెరుస్తాయి.

మేము దీనిని బిద్అత్ అని ఎందుకన్నామంటే ఖుర్ఆన్ హదీసులలో ఈ ఉత్సవానికి ఎలాంటి ఆధారం లేదు. సలఫె సాలిహీన్ ఆచరణ ద్వారా కూడా దీనికి సంబంధించిన ఉపమానం ఏదీ లభించటం లేదు. హిజ్రీ 4వ శతాబ్ది తరువాతనే ఇది ఉనికిలోనికి వచ్చింది. ఫాతిమీ షియాలు దీనిని మొదలెట్టారు.

ఇమామ్ అబూ హఫస్ తాజుద్దీన్ అల్ఫాఖానీ (رحمه الله) ఇలా అన్నారు :

ముబారికీన్‌కు చెందిన ఒక బృందం తరఫున – రబీవుల్ అవ్వల్ నెలలో మీలాద్ ఉత్సవం పేరిట నిర్వహించబడే ఈ సమావేశం గురించి, 'ధర్మం (దీన్)లో దీనికేదన్నా ఆధారం ఉందా?' అని ప్రశ్నించటం జరిగింది. దీనికి సంబంధించి వారు స్పష్టమయిన,

నిర్దిష్టమయిన సమాధానం కావాలని కోరారు. కాబట్టి దేవుడిచ్చిన సద్బుద్ధితో సమాధానం ఇవ్వబడుతోంది :

దైవగ్రంథంలోగానీ, దైవప్రవక్త (ﷺ) సంప్రదాయంలో గానీ నేడు చెలామణీలో ఉన్న మీలాద్‌కు ఎలాంటి 'మూలం' లేదు. ఎలాంటి నిదర్శనం కూడా నాకు కనిపించలేదు. ఉమ్మత్‌కు చెందిన ఎన్నదగ్గ ఉలమాలు, ఆదర్శప్రాయులైన వారు కూడా ఈ విధంగా ఆచరించినట్లు లేదు. పైగా ఇదొక బిద్‌అత్. దీనిని పనీ పాటా లేని వ్యక్తులు, నిరుద్యోగులు కనుగొన్నారు. ఇదొక మనోవాంఛ. పదార్థ పూజారులు దీనిని తమ పబ్బం గడుపుకునేందుకు వాడుకుంటున్నారు." (రిసాలతుల్ మోరిద్ ఫీ అమలుల్ మౌలిద్)

షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (رحمه الله) ఏమంటున్నారో చూడండి :

"ఇదేవిధంగా కొంతమంది ఏసుక్రీస్తు (ఈసా – عليه السلام) పుట్టిన రోజు విషయంలో క్రైస్తవులను అనుకరిస్తూ లేదా అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (ﷺ) ప్రేమలో, భక్తీతత్పరతలో ముహమ్మద్ (ﷺ) పుట్టిన రోజు పండుగను ఆవిష్కరించారు. వాస్తవానికి ఆయన (ﷺ) పుట్టినరోజు నిర్ధారణ విషయంలో ఇప్పటికీ ప్రజల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. తొలికాలపు సజ్జనులు సయితం ఈ 'ఉత్సవం' జరుపుకోలేదు. ఒకవేళ ఇలా చేయటంలో 'మంచి' అనేది ఏదయినా ఉంటే, లేదా మంచికి ఆస్కార ముంటుందని అయినా ఆశాభావం ఉండి ఉంటే ఆ సజ్జనులు (رضي الله عنهم) ఇలాంటి సంబరం తప్పకుండా జరుపుకునేవారే. ఎందుకంటే దైవప్రవక్త (ﷺ) యెడల ప్రేమాదరణల విషయంలో ఆ మహనీయులు మనకన్నా గొప్పవారే. వారు ఎల్లప్పుడూ మేలును, శుభాన్ని కాంక్షించేవారు. యదార్థానికి దైవప్రవక్త (ﷺ)ను అనుసరించటం ద్వారానే ఆయన (ﷺ) యెడల ప్రేమాదరణలకు సార్థకత లభిస్తుంది. ఆయన ఆజ్ఞలను శిరసావహించేవారు, ఆయన (ﷺ) నెలకొల్పిన సంప్రదాయాల పునరుద్ధరణకు చిత్తశుద్ధితో పాటుపడేవారు, ఆయన (ﷺ) రాకలోని లక్ష్యాన్ని నెరవేర్చటానికి మనోవాక్కాయ కర్మల చేత కృషిచేసేవారు మాత్రమే నిజంగా ఆయన (ﷺ) యెడల ప్రేమాదరణలు గలవారు. ఎందుకంటే అన్సార్ – ముహాజిర్లలోని ప్రథమశ్రేణి సహాబీలు గాని, వారిని అనుసరించే తరువాతి తరాల వారుగానీ ఇలాగే చేసేవారు." (ఇఖ్తెజా అస్సిరాతల్ ముస్తఖీమ్ – 2/615, డా. నాసిరుల్ అఖల్ పరిశోధన)

ఈ కొత్త పోకడను ఖండిస్తూ లెక్కలేనన్ని పుస్తకాలు (పాతవి, కొత్తవి) ప్రచురించ బడ్డాయి. ఈ మీలాద్ ఉత్సవం స్వతహాగా ఒక బిద్‌అత్ అవటంతో పాటు అది మరెన్నో మీలాదుల నిర్వహణకు ప్రేరకం అయ్యే అవకావం ఉంది. మరెందరో ఔలియాల, మషాయెఖ్‌ల, నాయకుల మీలాద్ (బర్త్‌డే) లకు శ్రీకారం చుట్టవచ్చు. ఈ విధంగా ముస్లిం సముదాయం కీడుకు, ఉపద్రవానికి ద్వారం తెరుచుకుంటుంది.

**(2) కొన్ని స్థలాల, చిహ్నాల, మృతుల నుండి శుభం (బరకత్) పొందటం :**

కొత్తగా కనిపెట్టిన బిద్‌అతులలో 'సృష్టితాల' నుండి 'శుభం' పొందగోరటం కూడా ఒకటి. ఇది కూడా విగ్రహారాధనలో ఒక భాగమే. ఈ వల పన్నటం ద్వారా ఎంతోమంది బ్రతకనేర్చిన స్వార్థపరులు అమాయక వ్యక్తుల జేబులు ఖాళీ చేస్తుంటారు.



'బరకత్' అంటే ఏదేని వస్తువులో శుభం, సమృద్ధి స్థిరంగా ఉండటం అని భావం.

ఇలాంటి శుభం లేక సమృద్ధి కొరకు ప్రార్థించాల్సింది దైవాన్నే. ఎందుకంటే ఆ వస్తువును ప్రసాదించిన వానికే 'బరకత్'ని పొందుపరిచే శక్తి ఉంటుంది. ఆ పని అల్లాహ్ మాత్రమే చేయగలడు. ఎందుకంటే శుభాన్ని అవతరింపజేసేవాడు, దానిని స్థిరపరిచేవాడు అల్లాహ్ మాత్రమే. మనుషులకు, వేరితర సృష్టితాలకు బరకత్‌ని ప్రసాదించే శక్తిగానీ, బరకత్ అనే దానికి ఉనికినిచ్చే శక్తిగానీ, దానిని నిలిపి ఉంచేశక్తిగానీ ఉండదు.

కాబట్టి స్థలాల నుండి, చిహ్నాల నుండి, చనిపోయిన వ్యక్తుల నుండి 'శుభం' (తబర్రుక్) పొందటం ధర్మసమ్మతం కాదు. ఎందుకంటే ఆ వస్తువుకు శుభం చేకూర్చే శక్తి స్వతస్సిద్ధంగా ఉందని మనిషి గనక నమ్మాడంటే అది 'షిర్క్' అవుతుంది. ఒకవేళ అతను ఫలానా వస్తువును సందర్శించటం, దానిని తాకటం, దానిని తన శరీరంపై స్పర్శించటం అల్లాహ్ తరఫున బరకత్ ప్రాప్తికి సాధనమని నమ్మితే అది షిర్క్ కాదుగానీ, షిర్క్‌కు దోహదపడే ఒక సాధనమవుతుంది.

ఇక ప్రవక్త ప్రియ సహచరుల విషయానికి వస్తే వారు దైవప్రవక్త (ﷺ) కేశముల ద్వారా, ఆయన (ﷺ) గారి లాలాజలం ద్వారా, ఆయన (ﷺ) వుజూ చేసిన నీళ్ల ద్వారా బరకత్ (శుభం) పొందేందుకు పోటీపడేవారు. అయితే ఇదంతా ఆయన (ﷺ) జీవించి ఉన్నంతవరకే జరిగింది. దీనికి ఆధారం ఏమిటంటే, ఆయన (ﷺ) పరమపదించిన తరువాత, సహచరులు ఆయన (ﷺ) సమాధి ఉన్న గదిలోకి వెళ్ళి శుభం పొందలేదు. ఆయన (ﷺ) నమాజ్ చేసిన వివిధ స్థలాలకు వెళ్ళి, లేదా ఆయన (ﷺ) విశ్రాంతి పొందిన స్థలాలకు వెళ్ళి అక్కడి నుండి 'శుభం' పొందలేదు. కాబట్టి ఔలియాల (అల్లాహ్ ప్రియతములైన వ్యక్తుల) స్థలాలకు వెళ్ళి అక్కడి నుండి శుభం పొందగోరటం ధర్మసమ్మతం కాదు.

అలాగే ప్రవక్త సహచరులు తమలోని గొప్ప వ్యక్తుల నుండి కూడా శుభం పొందేవారు కారు. ఉదాహరణకు : హజ్రత్ అబూబకర్, హజ్రత్ ఉమర్ (رضي الله عنهما), ఇంకా ఆ కోవకు చెందిన మరెందరో సహాబీల జీవిత కాలంలోగానీ, వారు మరణించిన తరువాత గానీ వారి నుండి శుభం పొందేందుకు యత్నించలేదు. వారు హిరా గుహ వద్దకు వెళ్ళి నమాజ్ చేయటంగానీ, దుఆ చేయటంగానీ చేయలేదు. దేవుడు మూసా (అలైహిస్సలాం)తో సంభాషించిన తూర్ పర్వత సందర్శన నిమిత్తం వెళ్ళటంగానీ, అక్కడ నమాజ్ చేయటం గానీ చేయలేదు. దైవప్రవక్తల సమాధులున్నాయని అనుమానించ బడుతున్న పర్వతాల వద్దకు, స్థలాల వద్దకు కూడా వారు వెళ్ళలేదు.

అలాగే మదీనా నగరంలో మహాప్రవక్త (ﷺ) నిత్యం నమాజ్ చేసే స్థలంలోనే నిలబడటంగానీ, మక్కాలో ఆయన (ﷺ) నమాజ్ చేసిన స్థలాలలో తొలికాలపు మహనీయులు నిలబడటం గానీ, ఆ స్థలాలను తాకటంగానీ, ముద్దాడటం గానీ చేసేవారు కారు.

కాస్త ఆలోచించండి! మహాప్రవక్త ముహమ్మద్ (ﷺ) గారి శుభప్రదమైన అడుగులు పడిన స్థలాలను, ఆయన నమాజ్ చేసిన స్థలాలనే తాకటం, ముద్దుపెట్టుకోవటం

ఆయన అనుయాయులకు ధర్మసమ్మతం కానపుడు వేరితరులు సంచరించిన, ఆరాధనలు చేసిన స్థలాలను, ప్రదేశాలను ముద్దాడటం ఎంత వరకు సమ్మతం? ఎంతవరకు సహేతుకం?

ఆ స్థలాలలో దేనినయినా తాకటం లేదా ముద్దుపెట్టుకోవటం మహాప్రవక్త (ﷺ) షరీయత్ ప్రకారం ధర్మసమ్మతం కాదన్న విషయం ఇస్లామీయ విద్వాంసులకు బాగా తెలుసు. (ఇఖ్తెజా అస్సిరాతల్ ముస్తఖీమ్ – 2/795–802. డా. నాసిరుల్ అఖల్ పరిశోధన).

**(3) ఆరాధనలు, దైవసామీప్యం పొందటానికి సంబంధించిన బిద్అతులు :**

ఈ రోజుల్లో 'ఆరాధనల' అధ్యాయంలో సృష్టించుకున్న బిద్అత్‌లకు లెక్కలేకుండా పోయింది. వాస్తవానికి ఏ ఆరాధన అయినా ఆధారం లేకుండా సమ్మతం కాదు. ఏదయినా వస్తువుకు ఆధారం లేనంత వరకూ అది బిద్అతే. ఎందుకంటే మహనీయ ముహమ్మద్ (ﷺ) ఇలా ప్రవచించారు :

"مَنْ عَمِلَ عَمَلاً لَيْسَ عَلَيْهِ أَمْرُنَا فَهُوَ رَدٌّ"(مسلم)

**"ఎవడయినా మేము ఆజ్ఞాపించని ఆచరణ చేస్తే అది స్వీకారయోగ్యం అవదు (త్రోసిపుచ్చబడుతుంది) (ముస్లిమ్)."**

ఈ మధ్య కాలంలో నిరాధారంగా, నిర్హేతుకంగా నెరవేర్చబడే ఆరాధనలు ఎన్నో ఉన్నాయి. వాటిలో కొన్ని ఇవి :

**(1) నమాజ్ కొరకు హెచ్చు స్వరంతో సంకల్పం (నియ్యత్) చేసుకోవటం–** ఉదాహరణకు : "నేను అల్లాహ్ కోసం ఇన్ని రకతుల ఫలానా నమాజు చేస్తున్నాన"ని పలకటం. ఇది బిద్అత్. ఎందుకంటే మహాప్రవక్త (ﷺ) ఆచరణ ద్వారా ఇది ఎక్కడా రూఢీ కాలేదు. ఈ నేపథ్యంలో ఉన్న దైవాదేశం గమనించదగినది –

﴿قُلْ أَتُعَلِّمُونَ اللَّهَ بِدِينِكُمْ وَاللَّهُ يَعْلَمُ مَا فِي السَّمَاوَاتِ وَمَا فِي الْأَرْضِ وَاللَّهُ بِكُلِّ شَيْءٍ عَلِيمٌ﴾(الحجرات :١٦)

**(ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "ఏమిటీ, మీ ధార్మికత గురించి మీరు అల్లాహ్‌కే తెలియపరచాలని అనుకుంటున్నారా? భూమ్యాకాశాలలో ఉన్న ప్రతిదీ అల్లాహ్‌కు తెలుసు. అల్లాహ్ సర్వం తెలిసినవాడు." (అల్‌హుజురాత్ : 16)**

**(2)** నమాజు అనంతరం సామూహికంగా ధ్యానించటం : దైవప్రవక్త (ﷺ) చే తెలియజేయబడిన 'జిక్ర్'ను వ్యక్తిగతంగా చేసుకోవటమే సరయిన, సమ్మతింపదగిన పద్ధతి.

**(3)** వివిధ సందర్భాలలో దుఆ అనంతరం ఫాతిహా చదవటం, అలాగే మృతుల కొరకు ఫాతిహా సదనాలు ఏర్పాటు చేయటం.



**(4)** మృతుల పేరిట సంతాప సభలు ఏర్పాటు చేయటం, సంతర్పణ చేయటం, ఖుర్ఆన్ పారాయణం కొరకు కిరాయి మనుషులను పిలవటం.

ఇదంతా మృతుల పట్ల తమకు గల గౌరవానికి, శ్రద్ధాంజలికి నిదర్శనమని వారు తలపోస్తారు. ఇదంతా మృతులకు చేరుతుందని అనుకుంటారు. వాస్తవానికి ఇది బిద్అత్. ధర్మంలో దీనికి ఎలాంటి ఆధారం లేదు. పైగా ఇవన్నీ మెడలో గుదిబండగా, చేతులకు బేడీలుగా పరిణమిస్తాయి.

**(5) ధార్మిక సందర్భాలను పురస్కరించుకుని ఉత్సవాలు జరుపుకోవటం :** ఉదా : ఇస్రా – మేరాజ్ సందర్భాన్ని, మహాప్రవక్త (ﷺ) మదీనాకు హిజ్రత్ చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేక సమావేశాలు పెట్టడం. చూడబోతే ఈ సందర్భాలలో 'ఉత్సవం' జరుపుకునే ఆధారమేదీ ఇస్లామీయ షరీయత్‌లో లేదు.

**(6) రజబ్ మాసంలో నెరవేర్చబడే ప్రత్యేక ఆరాధనలు :** ఉదాహరణకు : రజబ్ నెలలో ప్రత్యేకంగా నఫిల్ నమాజులు చేయటం, నఫిల్ ఉపవాసాలు పాటించటం. వాస్తవానికి ఈ మాసానికి ఇతర మాసాలపై ఎలాంటి ప్రాధాన్యతా, విశిష్ఠతా లేదు. నమాజ్ విషయంలోగానీ, ఉపవాసాల విషయంలోగానీ, ఖుర్బానీ విషయంలో గానీ, మరే ఇతర విషయంలోగానీ దీనికి ఎలాంటి ప్రత్యేకతా లేదు.

**(7) సూఫీల కాల్పనిక ధ్యానం :** సూఫీలు తమ తరఫున సృష్టించుకున్న దైవధ్యానాలు, వజీఫాలు, సాధనలు అన్నీ బిద్అత్‌లే. ఎందుకంటే అవి దీన్ (ధర్మం)లో కొత్తగా ఆవిష్కరించబడిన అంశాలు. అవి పద్ధతి ప్రకారం గానీ, వేళల దృష్ట్యాగానీ, పరిభాష రీత్యాగానీ షరీయత్‌కు విరుద్ధమైనవి.

**(8)** షాబాన్ నెల 15వ తేదీ పగలును ఉపవాసం కొరకు, రాత్రిని జాగారం కొరకు ప్రత్యేకించుకోవటం : ఇది కూడా ఓ కొత్త పోకడే. ఎందుకంటే దీని గురించి దైవప్రవక్త (ﷺ) ప్రత్యేకంగా తాకీదు చేసినట్లు ఆధారం ఏదీ లేదు.

**(9)** సమాధులపై కట్టడాలు నిర్మించటం : సమాధులను 'సజ్దా' స్థలాలుగా చేసుకోవటం, మృతుల నుండి 'శుభం' పొందగోరటం, మృతులను ఆధారంగా చేసుకుని సిఫార్సు కోరటం వంటి ఉద్దేశ్యాలతో సమాధులను సందర్శించటం. అలాగే స్త్రీలు సమాధులను సందర్శించటం – దైవప్రవక్త (ﷺ) సమాధులను సందర్శించే స్త్రీలను, సమాధులపై మస్జిదులను నిర్మించేవారిని, సమాధుల వద్ద దీపాలంకరణ చేసేవారిని ధూత్కరించారు.

## ముగింపు

నిశ్చయంగా బిద్అతులు అవిశ్వాసానికి (కుఫ్రకి) ఆనవాలు. ఇది ధర్మం (దీన్)లో అదనపు వస్తువులకు నిదర్శనం. ధర్మంలో హెచ్చుతగ్గులను దేవుడుగానీ, దైవప్రవక్త (ﷺ) గానీ సమ్మతించలేదు. పైగా అవి పెద్ద పాపాలకన్నా ఘోరమైనవి. జుగుప్సాకరమైనవి. షైతాన్ పాపకార్యం కన్నా బిద్అత్ చేష్టపై ఎక్కువగా సంతోషిస్తాడు. ఎందుకంటే పాపకార్యానికి ఒడిగట్టేవానికి, తాను దైవ అవిధేయతకు పాల్పడుతున్నానన్న విషయం

తెలిసి ఉంటుంది. అందుకే అతను ఎప్పుడయినా సిగ్గుతో పశ్చాత్తాపం చెందుతాడు. కాని బిద్అతీ పరిస్థితి తద్భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే తాను చేసే ప్రతి బిద్అత్‌ను ధర్మం (దీన్) అనుకుని చేస్తాడు. తద్వారా అల్లాహ్ సంతోషిస్తాడన్న ఆలోచన అతని మనసులో ఉంటుంది. కాబట్టి అతను పశ్చాత్తాపం ప్రకటించే ప్రశ్నే ఉండదు.

అంతేకాదు, బిద్అతులు సున్నతులను అంతమొందిస్తాయి. బిద్అతులకు పాల్పడే వారికి సున్నతులన్నా, సున్నతులను పాటించే వారన్నా గిట్టదు.

యదార్థమేమంటే బిద్అతులు మనిషిని అల్లాహ్‌కు దూరం చేస్తాయి. అల్లాహ్ ఆగ్రహానికి కారణం అవుతాయి. మనసులో వక్రభావాలను జనింపజేస్తాయి. ఆంతర్యంలో చెడుగు చోటు చేసుకుంటుంది.

## బిద్అతీ పట్ల ఎలా వ్యవహరించాలి?

బిద్అతీని తరచూ కలుసుకోవటం, అతనితో కలిసి ఎక్కువసేపు గడపటం నిషిద్ధం (హరామ్). అయితే అతని శ్రేయాన్ని అభిలషించి, నచ్చజెప్పే ఉద్దేశంతో కలుసుకుంటే తప్పు లేదు. ఇంత కఠినమైన ఆంక్ష ఎందుకంటే బిద్అతీ సహవాసంలో ఉండేవారు అతని పనులకు ప్రభావితం అయ్యే ప్రమాదముంది. అతని అంటువ్యాధి ఇతరులకు కూడా తగిలి వ్యాప్తి చెందవచ్చు.

ఒకవేళ బిద్అతీలను, వారి పోకడల నుండి నిరోధించటం సాధ్యపడకపోతే, వారి కీడు నుండి జనులను ఆపాలి. వారి సహచర్యం వల్ల కలిగే నష్టం ఏమిటో ప్రజలకు తెలియజేయాలి. పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటే విద్వాంసులు, పరిపాలకులు బిద్అతులకు ముకుతాడు బిగించాలి. బిద్అతీలను నిలదీసి అడగాలి. వారిని వారి పోకడ నుండి నిలువరించాలి. ఎందుకంటే వారి పోకడల వల్ల ఇస్లాంకు తీరని నష్టం వాటిల్లగలదు.

ఇస్లాం విరోధ దేశాలు బిద్అతీలకు వారి కార్యకలాపాలలో సహాయపడుతూ ఉంటాయి. వివిధ రకాలుగా వారిని వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ ఉంటాయి. ఎందుకంటే బిద్అతుల ద్వారానే ఇస్లాంను అరికట్టవచ్చని, అపఖ్యాతి పాల్జేయవచ్చని అవి ఆలోచిస్తుంటాయి. కాబట్టి అలాంటి విరోధుల పట్ల కూడా కడు అప్రమత్తంగా ఉండాలి.

అల్లాహ్ తన ధర్మానికి తోడ్పడవలసిందిగా, తన వాక్కును ఉన్నతికి చేర్చవలసిందిగా, తన విరోధులను పరాభవానికి లోను చేయవలసిందిగా ఈ సందర్భంగా మేము అర్థిస్తున్నాము.

మహాప్రవక్త ముహమ్మద్ ( )పై, ఆయన ఇంటివారలపై, ఆయన సంతానంపై, ఆయన సహచరులపై అల్లాహ్ కారుణ్యం, శాంతి కురియుగాక!

(والحمدلله الذي بنعمته تتم الصالحات- و صلى على نبينا محمد وعلى آله و صحبه وسلم)

**వ సల్లల్లాహు అలా నబియ్యాన ముహమ్మదిన్ వ ఆలా ఆలిహి వ సహబిహీ వ సల్లిమ్.**